

శ్రీవిష్ణవీయ

(శ్రీ విష్ణు సహస్రనామ భాష్యము)

సామవేదం షణ్ముఖ శర్మ



ప్రథమ ప్రతి స్వీకర్త

పురుషోత్తమక్షేత్ర ధైవం -

బలభద్రా సుభద్రా సమేత శ్రీ జగన్నాథస్వామి.

SRI SARADA PEETHAM

SRINGERI

श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्री शारदापीठम्, शृङ्गेरी
Sri Sri Jagadguru Shankaracharya Mahasamstanam
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.

Ref : Camp : SRINGERI Date :

Camp : మైసూరు

సర్వధారి సంవత్సర నృసింహ జయంతి
18-5-2008

వేదవ్యాసమహర్షి విరచిత మహాభారతసాగరంలోని అమోఘరత్నములలో విష్ణుసహస్రనామస్తోత్రంకూడా ఒకటి. సకలధర్మమర్మజ్ఞుడయిన భీష్మ పితామహుడు శరతల్పమునందుండి యుధిష్ఠిరునకువదిశించిన యమోఘ రత్నమిది. సర్వజనసులభము సర్వోత్కృష్టఫలదము అయిన దీనిని ప్రతియొక్కడూ పఠించి తరించవలయునన్న మహోన్నతాశయమే ఏతదుపదేశనిదానము. పరశివావతారులయిన శ్రీమదాదిశంకర భగవత్పాదులు దీనికి భాష్యము వ్రాసియుండుట దీని ఉత్కర్షను వేనోళ్ళ చాటుచున్నది. తదనుసారముగ దీనినవగతముచేసికొని మననము చేయుట సకల శిష్టజనకర్తవ్యము. దీనినపేకులు పలువిధములుగను పలుభాషలలోనూ అనువదించి ధన్యులయిరి.

శ్రీయుతులు సామవేదం షణ్ముఖశర్మగారు తమదే అయిన విశిష్టరీతిలో దీనిని వ్యాఖ్యానించి విష్ణువిద్యయను పేరున ప్రచురించుచుండుట ముదావహము. శ్రీశర్మగారు బహుగ్రంథ పరిశీలనపురస్సరముగ దీనిని రచించిరని ఏతద్గ్రంథావలోకనముచే ప్రస్ఫుటమగుచున్నది.

శ్రీశారదాచంద్రమౌళీశ్వరుల కృపవలన ఈ గ్రంథము బహుళ ప్రచారమునందుగాక, శ్రీశర్మగారు ఇదేవిధముగా పద్యగ్రంథములవాంఙ్మ ప్రజానీకమునకందించుచూ పితపక్ష శీతకిరణోపమయశోవిరాజితులగుదురుగాకయని శ్రీజగద్గురు చరణులాశీర్వదించిరి.

శుభమస్తు

T Dakshinamurthi

Phone : 08265-250123 / 250192 Fax : 08265-250792
E-mail : info@sringerisharadapeetham.org Visit us : www.sringerisharadapeetham.org

శ్రీ విష్ణువిద్య

(శ్రీవిష్ణుసహస్రనామ భాష్యము)

ప్రథమభాగము

సమన్వయ సరస్వతి
సామవేదం షణ్ముఖి శర్మ

ఋషిపీఠం ప్రచురణలు
హైదరాబాద్

సామవేదం షణ్ముఖ శర్మ

విష్ణువిద్య

(శ్రీవిష్ణు సహస్రనామ భాష్యం)

-సామవేదం షణ్ముఖ శర్మ

ప్రథమ ముద్రణ: జనవరి 2007

సర్వహక్కులు రచయితవి

వెల: రూ. 250/-

ముఖచిత్రం : రాము.పి, విజయవాడ

ప్రతులకు:
ఋషిపీఠం కమ్యూనికేషన్స్ ప్రై.లిమిటెడ్,
శివజ్యోతి, ప్లాట్ నెం-1, ఫస్ట్‌ఫ్లోర్,
10వ వీధి, హౌస్ నెం-1-8-105,
చిక్కడపల్లి, హైదరాబాద్-20
ఫోన్: 040-27655869

సుందరయ్య గ్రంథాలయ
AC No. 94588
హైదరాబాద్ 500 004.

వినతి

వేదవేదాంత ప్రతిపాద్యమైన విషయం, ఇతిహాస పురాణాలుగా విస్తృతి చెందింది. అపూర్వమైన భారతీయ తత్త్వజ్ఞాన భాండాగారాలుగా యుగాలనాడే ప్రసిద్ధి పొందిన ఆ గ్రంధాలలో సాధనకు అనుకూలమైన మార్గాలెన్నో ఋషులు మనకు ప్రసాదించారు.

నామస్మరణా దన్యోపాయం
న హి పశ్యామో భవ తరణే

అని ప్రసిద్ధం. నామాలను నిరంతరం స్మరించడమే ఉపాయంగా తేల్చిచెప్పారు. స్మరించడం అంటే మనసా భావన చేయడం. ఒక్కొక్క నామాన్ని మనసారా తలచుకోవాలి. ఆ తలంపులో ఆ నామం ద్వారా చెప్పబడుతున్న భగవత్తత్త్వం మనసులో ప్రగాఢంగా కదలాడాలి అటువంటి స్మరణ మోక్షసాధనం.

ులా స్మరించి, తరించడానికి అనువైన నామవిద్య శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమ్.

దీనికి ఆదిశంకరులు, పరాశరభట్టరు, ఆనందతీర్థ, రామానుజ, విద్యారణ్య తీర్థ ... . మొదలైన ప్రాచీనులు, తదుపరి ఎందరో అర్వాచీనులు వివిధ వ్యాఖ్యానాల నందించారు. నా జన్మను నేను తరింపచేసుకునేందుకు – అందుబాటులోకి వచ్చిన వ్యాఖ్యానాలను పఠించి, నా సాధనాపరిధికి స్ఫురించిన భావాలను జోడించి ఈటీవిలో ఎనిమిది నెలలపాటు ప్రసంగించాను.

ఇది ఒక భాగ్యం. నిరంతర నారాయణ స్మరణతో ఒక్కొక్క నామం ద్వారా ఆ పరాత్పరుని తత్త్వము, గుణ, మహిమా మాధుర్యాలను ఆస్వాదిస్తూ ఆ ఆనందాను భవంతో ధన్యుడనయ్యే మహదవకాశం, తద్వారా అనేక ప్రాంతాల నుండి ఆశీస్సులు, అభినందనలు అగణ్యంగా లభించాయి ఆ ప్రవచన ధారావాహికలో నాచే నారాయణుడు పలికించిన వ్యాఖ్యానానికి పుస్తకరూపం ఇవ్వవలసిందిగా ఎందరెందరో ఆశించారు.

ఈ పుస్తకాన్ని వెలువరించడానికి సంసిద్ధులై ముందుకు వచ్చారు శ్రీ వ్యాకరణం ఆంజనేయశాస్త్రి గారు అత్యంత ఆప్తులైన వీరు తమ షష్టిపూర్తి (2003) సందర్భంగా ఈ గ్రంధాన్ని ప్రకటించే సంకల్పాన్ని వెలువరించారు

ఈ సత్కార్యాచరణతో విష్ణుకైంకర్యభాగ్యం వారు పొందుతూ, రచన ద్వారా నాకు విష్ణుసేవా ప్రసాదాన్ని లభింపచేశారు.

సత్కృతిని సాక్షాత్కరింపజేసి సర్వేశ్వరుని అనుగ్రహాన్ని నిండుగా మెండుగా పొందిన వీరికి సర్వాభీష్టాలు సిద్ధించి, చిర ఆయురారోగ్య ఐశ్వర్యాలు లభించుతాయనడంలో సంశయానికి తావులేదు. ఈ సహృదయుని షష్టిపూర్తి సమయాన ఈ సత్సంకల్పం శ్రీశైలమల్లికార్జునుని సన్నిధిని శ్రీకారం చుట్టుకోవడమే శుభసూచకం.

అటుతరువాత శ్రీశైలక్షేత్రంలో ఒక దీక్షగా చాలాకాలం ఈ గ్రంథాన్ని వ్రాయడం జరిగింది ఎక్కువ భాగం ఆ మహాక్షేత్రంలో రచించి, మిగిలిన భాగాలను పలు ప్రాంతాలలో ఏకాగ్రంగా ఒక సాధనవలె రచించుకున్నాను ఒక్కొక్క నామాన్ని భావనాయోగంగా ధ్యానిస్తూ, ఏకైక నామవ్యాఖ్యాన పారాయణమే దివ్యఫలసంధాయకం కావాలనే సంకల్పంతో రచించిన గ్రంథమిది.

ప్రాచీన వ్యాఖ్యానాలకు తోడు, అర్వాచీన వ్యాఖ్యానాలలో పండిత శ్రీ సత్యదేవ వాసిష్ఠుల 'సత్యభాష్యమ్' వంటి ప్రామాణిక సంస్కృత భాష్యాలు నాకు ఉపకరించాయి.

శాస్త్రీయమైన క్రమపద్ధతిలో ఈ నామాలు కూర్చబడినట్లుగా స్ఫురించి, ఆ క్రమానుబంధాన్ని సంప్రదాయబద్ధంగా సాధించేందుకు ఈ గ్రంధంలో ప్రయత్నించాను. వేద – పురాణ – కావ్య వాఙ్మయాలను ఆధారం చేసుకొని సాగించిన ఈ కృషిలో విష్ణుపరమైన విజ్ఞానాన్ని నా శక్తిమేరకు అవిష్కరించాలని తపించాను. సాఫల్యం స్వామిప్రసాదమే.

బ్రహ్మోపదేశంతోపాటు ఆధ్యాత్మిక సంస్కారాన్నీ, అక్షరవిద్యనీ అనుగ్రహించిన గురువులు మా నాన్నగారు బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తిశర్మగారి దీవెనల కలిమి ఈ కృతికి బలిమి. శాశ్వత గౌరీధామానికి చేరుకున్న మా అమ్మ శ్రీమతి వేంకట రమణమ్మ గారి దివ్యస్మృతిగా ఈ గ్రంథాన్ని, శివాంకితం చేసుకుంటున్నాను.

ఉపాసనచే నా జన్మను పవిత్రం చేసిన గురువులు శ్రీ పినపాటి వీరభద్ర మహాదేవ్ (శ్రీ మహాదేవానందనాథ) గారు, తన అవ్యాజ వాత్సల్యంతో ఆర్షచైతన్య సంభరితంగా నన్ను నడిపిస్తున్న సద్గురు శ్రీ శివానందమూర్తిగారు తమ దివ్యాశీస్సుల ననుగ్రహించడం చేత ఈ సాధన సాగుతున్నది.

నా సాధనకు అనుకూలతను అందిస్తూ, ఈ గ్రంధరచనకు తొందరించి ప్రోత్సహించిన నా జీవిత సహచరి పుష్పలతకు ప్రత్యేక కృతజ్ఞతలు.

తన సృజనాత్మకతతో ఈ పుస్తకానికి ఇంత సుందరాకృతిని సంతరించిన, అవ్యాజ స్నేహశీలి శ్రీ ఉపద్రష్ట శివప్రసాద్ గారికి ధన్యవాదాలు. గ్రంథరూప సంతరణలో ఆకర్షణను అందించిన శ్రీ పి. రాముగారికి, అత్యంత శ్రద్ధగా ప్రూఫ్‌రీడింగ్ చేసి తన దీక్షాదక్షతలను కనబరచిన శ్రీ తుంబలి శివాజీగారికి ప్రత్యేకంగా అభినందనలు.

తన స్నేహ - వాత్సల్యాలతో, విశేషించి పుస్తక రచనలో నా జాప్యాన్ని ఎంతో సహనంతో భరిస్తూ, ప్రపంచానికి నా ద్వారా ఈ 'విష్ణువిద్య'ను ప్రకటింపజేసిన మనస్వి, మేధావి, సహృదయులు, రసజ్ఞులు డా॥ వ్యాకరణం ఆంజనేయ శాస్త్రిగారికి - మరోమారు ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు అందిస్తూ, విష్ణువుగా విశ్వవ్యాపకమైన శివచైతన్యం వారికి, వారి పరివారానికి ఆధ్యాత్మిక - ధర్మపథ నిర్దేశం చేయాలని ఆశిస్తున్నాను.

అన్నిటి వలెనే ఈ గ్రంథాన్ని కూడా నా ఆరాధ్యదైవమైన 'గజానన షడానన సమేత శ్రీ ఉమామహేశ్వరస్వామి' చరణాలకు సభక్తికంగా అంకితం చేసుకుంటున్నాను. ఈ గ్రంథం ప్రథమ భాగం (500 నామాలు - రెండు సంపుటాలు), బెంగళూరు 'గాయనిసమాజం'లో, 'శ్రీశైలం శ్రీదేవీ వేద విద్యాలయం'వారు నాచే ఏర్పాటుచేసిన 'శివలీలా విలాసమ్' ప్రవచన కార్యక్రమంలో (21.01.07) ఆవిష్కృతమవడం మరొక ఆశ్చర్యకర ఘటన. ఇదీ శివలీలా విలాసము.

ఈ గ్రంథ ప్రథమప్రతి స్వీకర్త - పురీక్షేత్రంలో భాసిస్తున్న
బలభద్రా సుభద్రా సమేత శ్రీ జగన్నాథ స్వామికి నమస్సహస్రాలు.
అపార కారుణ్యంతో ఆశీస్సులననుగ్రహించి, శ్రీముఖాన్ని ప్రాదించిన
శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీశృంగేరీ జగద్గురు
శ్రీదక్షిణామ్నాయ శారదాపీఠాధీశ్వర
శ్రీశ్రీశ్రీ భారతీతీర్థమహాస్వామివారి దివ్యచరణకమలాలకు
ప్రణామాంజలి.

-సామవేదం షణ్ముఖ శర్మ



అభినందన

వందే గురూణాం చరణారవింద
సందర్శిత స్వాత్మ సుఖావబోధే
నిఃశ్రేయసే మాంగలికాయ మానే
సంసార హాలాహల మోహశాంత్యై!

"శాశ్వతానంద ప్రదమైన మోక్షప్రాప్తికి, ఆత్మసాక్షాత్కారానికి మూలమై, విషయలోలత ద్వారా సంక్రమించే ఐహిక బంధాలనెడి విషాగ్ని జ్వాలలకు విరుగుడైన గురుదేవుల చరణారవిందాలను ఆరాధిస్తున్నాను". *(యోగతారావళి – ఆదిశంకరాచార్యులు.)*

· నిలకడ లేక క్షణక్షణానికి మారుతున్న ఆధునిక ప్రపంచంలో అంతటి గురుదేవులు దొరకడం అరుదే! లేరని కాదు. పురాకృత పుణ్యఫలంతోగాని లభ్యమవడం కష్టమని. అంతే. వ్రేళ్ళమీద లెక్కించగల ఆ కోవలోని గురుదేవులలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు ప్రథములు. ధర్మార్థకామ సాధనలకు అతీతమైన మోక్షసాధనకు అంకితమైన వారి జీవితం నిజంగా ధన్యము. లలితా సహస్రనామం, గణపతితత్త్వం, శివోపాసన, సౌందర్యలహరి, విష్ణుసహస్రనామం ఇలా మోక్షప్రాప్తికి రాచబాటలైన మరెన్నో పవిత్రాంశాల ప్రవచనాల ద్వారా మానవాళికి సత్యదర్శనం చేయించాలనే ఉన్నతాశయంతో వారు చేస్తున్న కృషి అద్వితీయం! అనితర సాధ్యం! ఏ విషయాన్ని తీసికున్నా దాని అంతరార్థాలను ఆకళింపు చేసికొని విపుల విషయావిష్కరణంతో శ్రోతలను తన్మయులను చేసే పాండితీప్రకర్ష వాక్కుఱి శర్మగారి సొమ్ము. ఎంతటి జటిలమైన వేదాంత విషయాన్నైనా అరటిపండు ఒలిచినట్లు పామరులకు కూడా అర్థమయ్యేలా విడమరచి చెప్పగల ఆయన ప్రతిభ శ్రోతల్ని ఆశ్చర్యచకితులను చేస్తుంది. మనమెందుకలా చెప్పలేకపోతున్నామని ముక్కున వేలేసుకోవాల్సివస్తుంది కూడా!

మోక్షసాధనలో ధ్యాన, ధారణ, సమాధులనే మార్గత్రయాలు మనకు శరణ్యమవుతున్నాయి. ప్రవచనార్థం వేదికనలంకరించినపుడు ఏదో అలౌకిక ప్రపంచంలో, హృదయాంతరాళాల నుండి పెల్లుబికి వస్తునట్టు, తన్మయత్వంతో కూడిన సమాధి స్థితిలో కర్తవ్య నిర్వహణ చేస్తున్నట్టు అనిపిస్తుంటుంది. ఎన్నోసార్లు ఆయన చెప్పగా విన్నాను.

అంతటి మహానుభావులు గురువుగా లభించడం నా పురాకృత పుణ్యఫలం! నేను ఎన్నో భాష్యాలు చదివాను. వాటిపై ఎన్నో ఉపన్యాసాలు విన్నాను. వింటున్నాను. విన్నపుడు అన్నీ అర్థమయినట్లే అనిపిస్తుంది. ఇంటికి వచ్చి జ్ఞాపకం చేసికుందామనుకుంటే ఏదీ జ్ఞాపకం రాదు. సరికదా అన్నీ అస్పష్టంగా పొంతనలేనట్టు అనిపిస్తుంటుంది. ఎందుకంటే సర్వసాధారణంగా ఉపన్యాసకులు అంతరార్థాల జోలికి పోక, పిట్టకథలతో, హాస్యోక్తులతో శ్రోతల నాకట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా సత్యాన్ని మరుగుపరుస్తూ ఉపన్యాసాలు కొనసాగించడమే.

శర్మగారు ప్రవచనానికి ఉపక్రమిస్తూ, ప్రతి పదాన్ని అర్థవంతంగా సునిశితంగా ప్రయోగిస్తూ ఆ పదానికుండే సాధారణార్థమేగాక నిగూఢంగా దాగియున్న విశేషార్థాలను విశ్లేషిస్తుంటే ఆశ్చర్యమేస్తుంది. లౌకిక అలౌకిక విషయాలను సమన్వయపరుస్తూ ఆయన చేసే ప్రసంగాలు మన నిత్య నైమిత్తిక జీవనంలో అనుభవానికి వచ్చి మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంటాయి. శర్మగారిలోని ఈ అనన్య ప్రతిభ వేలాది అభిమానులను ఆత్మీయులను ఆయనకు సంపాదించిపెట్టింది. వారిలో నేనొకణ్ణి. ధారావాహినిగా ఆయన నాల్క నుండి జాలువారే ప్రవచన ప్రవాహంలో మునిగి తేలుతూ వింతైన అనుభూతికి లోనవుతాం మనం. ఈ వేదాంతపరమైన అనుభూతి నన్ను అమితంగా ఆకర్షించింది. ఎంతో పరిశోధన, అంతర్మథనం విషయవివేచనా పరిజ్ఞానం అంతకు మించి పాండితీ ప్రకర్ష ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు. మంత్ర రహస్యాలను విడమరచి చెప్పేటప్పుడు భగవంతునికి భక్తునికి ఉండే అవినాభావ సంబంధం అలవోకగా ప్రస్ఫుటమవుతుంటుంది.

E.T.V లో విష్ణు సహస్రనామ భాష్యాన్ని సంవత్సరంపాటు శర్మగారు వినిపించడం మీకు తెలుసు. ప్రతిరోజూ ఉదయం ఆ పది పదిహేను నిమిషాల పాటు నేను T.V. కి అతుక్కుపోయేవాణ్ణి. విష్ణుసహస్రనామాల్లో ప్రతిపేరులోని విశేషార్థాలు వింటుంటే ఆ పదిహేను నిమిషాలే ఈ జన్మలో సార్థకమైన కాలమనిపించేది. ఆ భాష్యాన్ని గ్రంథరూపంలో తేవాలనే సత్సంకల్పం కలిగింది. ఆ పుణ్యకాలంలోనే! 2002 ఏప్రిల్ 14న శర్మగారిని వారింట్లో కలిసి ఆ భావనకు రూపకల్పన చేయడానికి అనుమతి వేడితే శుభాశీస్సులతో వారు తమ అంగీకారం తెల్పడం అదృష్టంగా భావిస్తున్నాను.

దేశం నలుమూలలా ప్రవచన కార్యక్రమాల నిర్వహణతో బాటు "ఋషిపీఠం" మాసపత్రిక సంపాదకత్వం ఒక వంక, నిరంతరం మ్రోగే దూరశ్రవణ యంత్రాల సంపర్కం మరో వంక ఇలా క్షణం తీరిక లేని సమయంలో ఈ గ్రంధ రచన కష్టసాధ్యమని నాకు తెలుసు.

"అసంఖ్యేయోఽప్రమేయాత్మా విశిష్టశిష్టకృచ్ఛుచిః
సిద్ధార్థ స్సిద్ధ సంకల్పః సిద్ధిదస్సిద్ధి సాధనః"

అని అనుకున్న కాలంలో గ్రంధరచన పూర్తిచేసి ఈ శ్లోకార్ధాన్ని సార్ధకం చేశారు శర్మగారు. 'విష్ణువిద్య' పేరున ఇన్ని పేజీల ఈ ఉద్గ్రంధాన్ని పూర్తిచేయగల్గడం హర్షించదగ్గ విషయం గ్రంధరచన కుంటుబడకూడదన్న భావంతో విదేశాలకు వెళ్ళే అవకాశాలను కూడా వదలుకున్నారంటే ఆయన గ్రంథ రచన దీక్షను అభినందించ కుండా ఉండలేము

ఈ సందర్భంలో మరో విషయం చెప్పాలనిపిస్తుంది మా తల్లిగారి ప్రోత్సాహ ప్రభావమే ఈ గ్రంథరాజం పుట్టుకకు మూల కారణం. ప్రతిరోజు విష్ణుసహస్రనామం పారాయణం చేయడమేగాక మాతో కూడా పారాయణం చేయించేదామె దాన్ని నిత్య విధిగా పాటిస్తున్నాము ఏ లోకంలో ఉన్నా ఆ మాతృమూర్తి ఇది గమనిస్తుంటుందన్న విశ్వాసంతో ఈ చిన్ని ప్రయత్న ఫలాన్ని ఆమెకు అంకితమిస్తున్నాను

"శివుని ఆజ్ఞ లేక చీమైనా కుట్ట"దన్నట్టు ఆ జగన్నాధుని ఆశీస్సులతోనే శర్మగారు ఈ బృహత్కార్యానికి నడుంకట్టి సాధించారు 2003 మే నెలలో శ్రీశైల మల్లికార్జున స్వామి సన్నిధిలో జరిగిన నా షష్టిపూర్తి మహోత్సవంలో ఓ సంచిక విడుదల చేశాము. క్షణం తీరికలేకున్నా బాహ్య ప్రపంచాన్ని మరచి ఏకాగ్రతతో రచనలో లీనమైన శర్మగారిని ఎన్నోసార్లు ప్రత్యక్షంగా చూసి ఆశ్చర్యపోయేవాణ్ణి. రచన ఒక వంకయితే పునః పరిశీలనతో మార్పులు కూర్పులు చేస్తూ గ్రంధాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం శ్రమతో కూడుకున్న పని. ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఈ పవిత్ర గ్రంధాన్ని మనకందించిన శర్మగారిని అభినందిస్తూ అంజలి ఘటిస్తున్నాను

ఇంతటి పవిత్రమైన, వేదాంతపరమైన, అమూల్యమైన బృహత్ప్రణాళికలో నన్ను కూడా భాగస్వామిని జేసిన శర్మగారి ఔదార్యానికి జోహార్లు. అన్నమయ్య కీర్తనలను

ప్రచారానికి తెచ్చి ధన్యుడనైనానని సాళ్వుడన్న మాటలు స్మరించుకుంటూ ఇటువంటి అవకాశం కలిగినందుకు జన్మసార్థకమైనదని సవినయంగా మనవి చేసికుంటున్నాను.

మా బాబాయి గోపాలశాస్త్రిగారి ప్రోత్సాహము నాకు సహకరించింది.

ఈ గ్రంథం వెలుగు చూడడానికి ఎంతోమంది తోడ్పడ్డారు. ఆకర్షణీయంగా కవరుపేజీ తీర్చిదిద్దినవారు, ముద్రణకు వలయు రీతి వ్రాత ప్రతిని తయారుచేసినవారు, ప్రూపులు దిద్దడంలాంటి ఎన్నో బాధ్యతలు సమర్థతతో నిర్వహించినవారు ఇంకా ఇంకా ఎందరో మహానుభావులు - అందరికీ వందనాలు -

"నారాయణ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం వందేగురు పరంపరామ్"...

శ్రీ గురవే శిరసా నమామి.

-వ్యాకరణం ఆంజనేయశాస్త్రి

॥ మంగళ శ్లోకములు ॥

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాన్తయే ॥

శుద్ధమైన ధవళవస్త్రాన్ని ధరించినవాడు, సర్వవ్యాపకుడు, చంద్రకాంతి వంటి ఛాయగలవాడు, చతుర్భుజుడు, ప్రసన్నముఖంతో ప్రకాశించే వినాయకుని (గణపతిని) సర్వవిఘ్ను నివారణార్థము ధ్యానించు చున్నాము.
విష్ణువునకు అభిన్నుడైన గణపతి స్తుతి ఇది. 'ప్రసన్నో కరటీముఖః' అని నిఘంటువు. ప్రసన్న శబ్దానికి – ఏనుగుముఖాన్నే చెప్పారు శబ్దార్థవేత్తలు.

వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥

వసిష్ఠుని మునిమనుమడు, శక్తి మహర్షికి మనుమడు, పరాశరుని పుత్రుడు, శుకుని తండ్రి, తపోనిధియైన వ్యాసునకు వందనం. ఇది వ్యాసుని వంశక్రమం.

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

వ్యాసుడు నారాయణుని అవతారం. విష్ణురూపుడైన వ్యాసునకు, వ్యాసరూపుడైన విష్ణువునకు నమస్సులు. వసిష్ఠ వంశోద్భవుడై బ్రహ్మనిధియైన ఆ వేదవ్యాస మహాత్మునకు నమస్సులు.

అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥

ఏ వికారములేని శుద్ధుడు, నిత్యుడు, పరమాత్మ, సదా ఏకరూపంతో విరాజిల్లే దివ్యరూపధారి, సమస్తమును జయించే స్వభావముగల విష్ణువునకు నమస్కారం.

యస్యస్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్ ।
విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ॥
ఓమ్ నమో విష్ణవే ప్రభవిష్ణవే

ఎవనిని స్మరించినంత మాత్రాన జన్మ మొదలైన సంసారబంధనాలన్నీ తొలగు

తాయో, సర్వసమర్థుడైన ఆ విష్ణువునకు నమస్కారం.

॥ భూమిక ॥

మన వాఙ్మయనిధిలో 'మహాభారతం' పంచమవేదంగా ప్రశస్తి పొందింది. అపారమైన వేదధర్మాలను, రహస్యాలను ఆఖ్యాన ఉపాఖ్యానాలతో, ఉపదేశాలతో అనితర సాధ్యంగా చతుర్విధ పురుషార్థ సాధనంగా అందజేసారు వేదవ్యాసమహర్షి.

యది హాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్ ॥

ఇక్కడ ఉన్నదే ఎక్కడైనా ఉంది. ఇక్కడ లేనిది ఎక్కడా లేదు. (మహాభారతంలో) – అని ప్రత్యయ భావంతో స్వయంగా వ్యాసులవారే సెలవిచ్చారంటే, ఈ గ్రంథ ప్రశస్తి ఎంతటిదో అవగాహన చేసుకోవచ్చు.

మహాభారత గ్రంథ కారణంగానే వ్యాసుని నారాయణత్వం ప్రకటింపబడిందని విష్ణుపురాణం వివరిస్తోంది.

కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం ప్రభుం ।
కోహ్యన్యో భువి మైత్రేయ మహాభారత కృత్ భవేత్ ॥

"కృష్ణద్వైపాయనుడనే వ్యాసుని నారాయణునిగా తెలుసుకో. ఓ మైత్రేయా! విష్ణువు తప్ప మరెవ్వడు భూలోకాన మహాభారతాన్ని రచింపగలడు!"

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంగా, అధ్యాత్మవేత్తలు వేదాంతశాస్త్రంగా, ఐతిహాసికులు ఇతిహాసంగా, లాక్షణికులు మహాకావ్యంగా, సర్వలక్ష్య సంగ్రహంగా కీర్తించే మహా భారతం పురాణ సంప్రదాయాన్ని అనుసరించి రచితమైనది.

పురాణవిద్య చరిత్రను తెలియజేస్తూనే అనేక యజ్ఞసంకేతాలను, ఉపాసనా మర్మాలను, ధర్మశాస్త్ర రహస్యాలను, ఆచార వ్యవహారాలను, వేదాంత ప్రతిపాదనలను కలబోసి వివరించే విలక్షణ ప్రక్రియ.

ఆ సరణిలో గ్రథితమైన మహాభారతాన్ని ఒక మహాసముద్రంగా సంభావించారు నన్నయాది మహాత్ములు.

"దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సముద్రము దరియంగ నీదను విధాతృనకైనను నేరబోలునే!" (అత్యంత రహస్యమైన గంభీర అర్థాల గౌరవంతో కూడిన భారత వాఙ్మయ సముద్రాన్ని పారం ముట్టేలా ఈదడం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు) అని

ఆదికవి అనడంలో ఆశ్చర్యం లేదు. ఇంతటి ఉద్గ్రంథం లభించడం భారతజాతి భాగ్యఫలం.

ఈ మహాభారత క్షీరసాగర మథనంలో అనేక రత్నాలు లభించాయి. సనత్సుజాతీయ సంహిత, యక్షప్రశ్నలు, విదురనీతి, భగవద్గీత, శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రమ్, శ్రీ శివసహస్రనామ స్తోత్రమ్ వంటి అంశాలు ఒక్కొక్కటీ ప్రత్యేక గ్రంథంగా ప్రసిద్ధి వహించాయి.

ప్రస్థానత్రయంలో ఒకటిగా ప్రస్తుతికెక్కిన భగవద్గీత చెప్తున్న పరమార్థమే 'శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమ్' ప్రతిపాదిస్తోంది.

ఈ వెయ్యి నామాల కూర్పు ఐహిక పారమార్థిక ప్రయోజనాలను సిద్ధింపజేసే మహామంత్ర గుచ్ఛం.

'మహాభారతం'లోని అనుశాసనిక పర్వాంతర్గతమైన ఈ రత్నమంజరి భీష్మాచార్యుని ద్వారా యుధిష్ఠిరునకు ఉపదేశింపబడింది.

అనుశాసనిక పర్వానికి మొదట ఉన్నది శాంతిపర్వం. ఈ శాంతి అనుశాసనికాలు మహాభారత సారాలుగా వ్యాఖ్యానించారు విజ్ఞులు.

ఈ రెండు పర్వాలు శ్రీకృష్ణపరమాత్మ అనతిపై, ఆ స్వామి ప్రసాదబలంతో లభించిన దర్శనశక్తితో, ధీపటిమతో శాంతనవుడు ధర్మరాజునకు సకల రాజన్య మహర్షి సమూహ సమక్షంలో అందించిన ప్రబోధం.

భగవద్గీత మహాభారతంలో 'భీష్మపర్వ' అంతర్గతమైతే శాంతి అనుశాసనికాలు సాక్షాత్తు భీష్ముడు చెప్పినవే. ఇలా రెండింటిలోనూ భీష్మసంబంధం ఉంది. అది భగవద్భాగవత బంధం. పరమ భాగవతోత్తముడైన భీష్ములవారి పలుకులలోని పరమార్థం ఇది.

మహాభారత యుద్ధానంతరం ధర్మరాజు పట్టాభిషిక్తుడయ్యాడు. ఒక శుభసమయాన శ్రీకృష్ణదర్శనార్థం ధర్మరాజు స్వామి సన్నిధికి చేరాడు. ఆ సమయంలో పరమాత్మ ధ్యాన ముద్రాంకితుడై గోచరించాడు. యుధిష్ఠిరుడు ఆ యోగీశ్వరేశ్వరునకు నమస్కరించాడు.

ధ్యానముద్ర వదలిన తరువాత ఆ జగద్గురువును కుతూహలంగా చూస్తూ, "స్వామీ!

యోగిహృద్ధ్యానగమ్యుడవైన నీవు ఇప్పుడు ఎవరిని తలంచుకుంటున్నావు?" అని కృతాంజలియై ప్రశ్నించాడు ధర్మరాజు.

అప్పుడు పాంచజన్యధరుడైన శ్రీకృష్ణుడు –

శరతల్పగతో భీష్మః శామ్యన్నివ హుతాశనః ।
మాం ధ్యాతి పురుషవ్యాఘ్రుః తతో మే తద్గతం మనః ॥

శరతల్పగతుడై (బాణములచే ఏర్పరచిన పడకపై) ఆరుచున్న (సన్నగిల్లుచున్న) అగ్నివలె ఉన్న భీష్మపితామహుడు నన్ను ధ్యానం చేస్తున్నాడు. కనుక నా మనస్సు భీష్ముని చేరిపోయింది. **తమస్మి మనసాగతః – తతో మే తద్గతం మనః** – నా మనస్సు ఆయనను పొందింది.

"కురుపితామహుడూ, సచ్చరిత్రుడూ అయిన ఆ మహాత్ముడు నాలుగు వేదాలకూ, కాలజ్ఞానానికీ నిధి. బ్రహ్మర్షులు సైతం ఆయన ఉపదేశాలను ఆదరిస్తారు. సకల ధర్మసూక్ష్మాలు ఆయనకు కరతలామలకాలు. అటువంటి జ్ఞానభాస్కరుడు అస్తంగతుడైతే సర్వమూ అంధకారబంధురమే. కనుక ఆ మహానుభావుని ద్వారా సకలధర్మాలను గ్రహించడం నీ కర్తవ్యం", అని ప్రబోధించి, ధర్మజాదులతో శ్రీకృష్ణుడు శరతల్పగతుడైన భీష్ముని వద్దకు చేరాడు.

భీష్ముడు మహర్షిగణ పరివేష్టితుడై అంపశయ్యపై ప్రకాశిస్తున్నాడు. జగద్గురువైన ముకుందుని గాంచిన వెంటనే గంగాతనయుడు సభక్తికంగా ప్రాంజలించాడు.

కుశలాదికాల అనంతరం "ధర్మవిషయములను ధర్మజునకు చెప్పడానికి సిద్ధమే, కానీ నాకొక్క సందేహం, సర్వవేదములకు జగద్గురుడవు, సకలధర్మ విగ్రహుడవైన నీవు ఉపదేశింపక నాకీ బాధ్యతను అందజేయడంలో అంతరార్థమేమిటి?" అని వినయంగా అడిగాడు భీష్మాచార్యుడు.

"మహాత్మా! ఇప్పుడు నేను ఉపదేశించడం వల్ల నాకు కొత్తగా లభించే కీర్తి ఏదీలేదు! చంద్రుని శీతకిరణుడని శ్లాఘించడంలో విశేషమేముంది? పరమేశ్వరుడనైన నేను ఉపదేశించడం కన్నా ఉత్తమ ధర్మమయ జీవనం గడిపిన నీవంటి మానవశ్రేష్ఠుడు ధర్మోపదేశం చేయడం శ్రేష్ఠం. అది నీకు కీర్తిదాయకం. అనేకమంది బ్రహ్మవేత్తలను సేవించి, జీవితకాల బ్రహ్మచర్యాన్ని పాటించి, తపోధ్యానాదులతో, అనుష్ఠానబలంతో

మహాప్రభావవంతుడవైన నీవు ఉపదేశించడమే సముచితం" అని పరమాత్మ సమాధానపరచాడు.

ఇందులో మరొక విషయం కూడా ఉంది. తరం నుండి తరానికి ధర్మమే పరంపరగా సంక్రమించాలి. భీష్ముడంతటి అనుష్ఠాన ధార్మికుడు తదనంతరం పాలన చేయనున్న శ్రద్ధాళువైన చక్రవర్తికి ధర్మవిజ్ఞాన సంపత్తిని అందజేయడం బాధ్యత. ఈ పరంపరను, సంప్రదాయాన్ని పరిరక్షణ చేయడమే జగద్గురువైన జనార్దనుని ప్రధానోద్దేశ్యం. స్వామి మాటలు విన్న పితామహుడు –

"పరమాత్ముడవైన నీ ఆజ్ఞ కన్నా మించినది లేదు. నీ అనుగ్రహబలంతో, నీ సన్నిధిలో బ్రహ్మర్షుల సమక్షాన ధర్మపరంపరను బోధించడం నా భాగ్యం" – అని వాసుదేవునకు వందనమాచరించి, ధర్మజునకు అనేక ధర్మాలను ఉపదేశించాడు.

లౌకికమైన, వ్యావహారికమైన రాజనీతులను, వర్ణాశ్రమ ధర్మాలను, మోక్షధర్మాలను పుంఖానుపుంఖాలుగా వివిధ ఉపాఖ్యానాలతో, వేదశాస్త్ర ప్రమాణాలతో బోధించాడు పితామహుడు.

అలా శాంతిపర్వం కొనసాగి, అనుశాసనికపర్వంలో 148 అధ్యాయాలు పూర్తయ్యాక, భీష్మాచార్యులు 149వ అధ్యాయంలో శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రాన్ని ఉపదేశించారు.

✦✦✦

శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్ – కేవల స్తుతి గ్రంథమో, నామాలక్రమమో కాదు. దీనిలో అనేక మర్మాలున్నాయి.

✦ ప్రధానంగా ఇది జ్ఞాన విషయం. 'సర్వం బ్రహ్మమయం జగత్' అనే విషయాన్ని అనుభవంలోకి తెచ్చుకొనడమే జ్ఞానం. అంతటా వ్యాపించినది ఒకే పరమాత్మ – అనే స్ఫురణ కలిగించే జ్ఞానం ఈ నామాలు మనకు అందజేస్తున్న ముఖ్యఫలం. సర్వవ్యాపకమైన పరమాత్మ – అనే భావనను ఒక్క మాటలో చెప్పాలంటే 'విష్ణు' అని చెప్పాలి. **వేష్టి వ్యాప్నోతీతి విష్ణుః** – సర్వమునందు వ్యాపించిన విష్ణుపరమాత్మను గ్రహించే జ్ఞానం ప్రతి నామంలో పల్లవించడం చేత, వేదాంత ప్రతిపాద్యమైన తత్త్వ గ్రంథమిది. 'విష్ణు' నామంతోనే ఈ సహస్రనామం

ప్రస్తావించబడడం దీని జ్ఞాన ప్రతిపాదనను స్పష్టపరుస్తోంది.

✦ మరొకవైపు నారాయణుని సగుణ లీలా వైభవాలను, అవతార విశేషాలను మాధుర్యభరిత నామాల ద్వారా స్ఫురింపజేసి భక్తిభావనలో పఠితను ముంచెత్తే భక్తి ప్రధాన స్తుతి ఇది. ఈ నామాలను పఠించడానికి భక్తియే ప్రధానార్హత. తన్మయీ భావంతో ప్రతినామంలో విష్ణువైభవాన్ని సందర్శించి ఆనందించవచ్చు. 'హరినామములే అన్ని మంత్రములు' అని అన్నమయ్య అన్నట్లుగా అపార మంత్రరాశి ఈ నామాలలో కూర్చబడింది. ఆ విధంగా ఇది మాలామంత్రం. వేదమంత్రాలలోని పరమాత్ముని నామాల కూర్పు ఇది.

పాపాలను తొలగించి, తద్వారా మనో మాలిన్యాన్ని నశింపజేసి, చిత్తశుద్ధిని చేకూర్చి జ్ఞానవైరాగ్యాలను కలిగించే శక్తి ఈ గ్రంథ పారాయణలోనే ఉంది.

ఒక్కొక్క నామంలో పూర్వాపర నామాలకున్న సంబంధాన్ని గ్రహించితే ప్రతినామంలో ఒక ప్రత్యేక రహస్యం గోచరిస్తుంది. అది విష్ణుతత్త్వాన్ని ప్రస్ఫుటీకరించడమేకాక, కైవల్య హేతువైన జ్ఞానసారాన్ని అందిస్తోంది.

ఈ గ్రంథాన్ని ప్రస్థానత్రయాలకు (గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు) భాష్యం వ్రాసిన ఆదిశంకరుల వంటివారే వ్యాఖ్యానించారంటే దీని ప్రశస్తి అవగతమౌతోంది.

మహాభారత సారత్వాత్ ఋషిభిః పరిగానతః,
వేదాచార్య సమాహారాత్ భీష్మోత్కృష్టమతత్వతః ॥
పరిగ్రహాతి శయతః గీతాద్వైకార్థతశ్చనః,
సహస్రనామ్నామధ్యాయః ఉపదేయతమోమతః ॥

అని పెద్దలమాట. మహాభారత సారమై, మంత్రద్రష్టలచే గానము చేయబడి, వేదాచార్యులచే (వ్యాసునిచే) కూర్చబడి భీష్మునిచే ఉత్కృష్ట మార్గమని ప్రతిపాదింపబడి అందరిచే మహోన్నతమని స్వీకరించబడి (ప్రస్తుతించబడి), భగవద్గీతార్థంతో ఏకం కాబడి, ...ఇన్ని లక్షణాలతో అలరారడం చేత ఇది సర్వశ్రేష్ఠమైనది.

✦ 'విష్ణు' అనే నామమే 'వ' కారంతో ప్రారంభమౌతోంది. ఈ సహస్రనామాల ఆదిలో మూడునామాలు 'వ' కారారంభాలే. అంతేకాక 'వ' కారాది నామాలు ఇంకా

చాలా ఉన్నాయి. వకారం అమృతబీజం. అమృతత్వమే పరమాత్మ తత్త్వం. అందుకే అమృత ప్రకాశాన్ని నింపుకొన్న ఈ నామ సముచ్చయం పారాయణకర్తకు అమృతమయ కైవల్యాన్ని ఘటింపజేస్తోంది.

- ✦ నిజానికి ఈ నామాలు అక్షరాల గుంపులుగావు. నారాయణుని శబ్దాకృతులు మొత్తంగా ఈ స్తోత్రమే విష్ణుని శబ్దమయ మూర్తి. సుజ్ఞానాన్ని ప్రతిపాదించే తత్త్వగ్రంథం కనుక ఇది నామవిద్యగా, అక్షరవిద్యగా ఆరాధింపబడుతోంది
- ✦ ఈ విష్ణుసహస్రనామాల కూర్పులో అపారమైన శబ్దశక్తి దాగి ఉంది. ఆ శబ్దశక్తిలో అనంతమైన దైవీయ చైతన్యం ఇమిడి ఉంది. అందుకే అనేక రోగాలకు, గ్రహ బాధలకు నివారణోపాయంగా శాస్త్రగ్రంథాలే ఈ సహస్రనామ విద్యను స్వీకరించ మని బోధించాయి. మణిమంత్రౌషధాలను ప్రస్తావించే అనేక ఆయుర్వేద గ్రంథాలలో రోగ నివారణోపాయాలను సూచిస్తూ; విష్ణుసహస్రనామాన్ని పారాయణ చేయమని బోధించారు.

శార్ఙ్గధర సంహితలో, చరకసంహితలో కూడా

విష్ణుం సహస్రమూర్ధానం చరాచరపతిం విభుం ।
స్తువన్నామ సహస్రేణ జ్వరాన్ సర్వాన్ వ్యపోహతి ॥

- అని పేర్కొన్నారు. "సర్వలోకేశ్వరుడైన విష్ణువును సహస్రనామాలతో కీర్తించడం చేత అన్ని జ్వరములు నశిస్తాయి".

మేహరోగ ప్రాయశ్చిత్తంగా విష్ణుసహస్రనామాన్ని ఇంకొన్ని గ్రంథాలు సూచించాయి. పురుషసూక్త జపమునకు ప్రత్యామ్నాయంగా ఈ సహస్రనామ స్తోత్రాన్ని పేర్కొన్నారు **"జప్యం పురుషసూక్తమ్"** అంటూ, **'తథైవ భగవన్నామ సహస్రం భారతోదితమ్'** - అని ఈ సహస్రనామాల స్తోత్రాన్ని ప్రస్తావించారు. 'సర్వజీవరక్ష'గా పేర్కొన్న ఈ స్తోత్రాన్ని పురిటి ఇంట్లో పరిస్తే అన్ని అరిష్టాలు పోతాయని భట్టబాణుని వచనం.

అనేక దుర్నిమిత్తాలను, అమంగళాలను తొలగించి, మహాపాపాదులను నశింపజేసి, ఇహపరాలలో క్షేమసౌఖ్యాలు కలిగించి, పరమపదాన్ని సిద్ధింపజేసే శక్తి కలిగిన మంత్రాక్షరాల మాల ఇది తత్వశాస్త్ర నిధి ఇది. నామాల కూర్పులోనే దివ్యమైన నాదాన్ని గర్భీకరించుకున్న సంగీతం ధ్వనించే అనుభవం చదువరి తప్పక అను

భవిస్తాడు. ఆ నాదగమనంలోనే అనిర్వచనీయానందం స్ఫురిస్తూనే ఉంటుంది.

- సర్వవ్యాపకమైన ఏక దైవతాన్ని ప్రతిపాదించే ఈ గ్రంథం – సర్వదేవతలు ఒకే పరబ్రహ్మ స్వరూపాలుగాను, అంతటా వ్యాపించిన కారణంగా ఆ పరబ్రహ్మ విష్ణుపదవాచ్యంగాను ప్రతిపాదించబడి సర్వదేవతాత్మక స్తుతిగా మహిమ గడించింది. వైదిక దేవతలందరూ ఇందులో స్మరించబడ్డారు. అన్ని విష్ణు అవతారాలు ప్రశస్తంగా పేర్కొనబడ్డాయి.
- మహర్షి ప్రోక్తమైన స్తోత్రాదులకు తాత్త్విక ప్రయోజనం, తాంత్రిక ప్రయోజనం – అని రెండు ప్రయోజనాలుంటాయి. ఒకటి – పారమార్థికం. రెండవది – ఐహికం. తాత్త్వికత – బుద్ధిని జ్ఞానసంపన్నం చేసి, తద్వారా పరబ్రహ్మప్రాప్తిని కలిగిస్తుంది. తాంత్రికత – లోకంలో ప్రతివ్యక్తి కోరుకొనే ఇష్టప్రాప్తి, అనిష్ట నివారణ అనే ఫలాలను ప్రసాదించేది. రహస్యమైన శబ్దశక్తి వల్ల నామానికి మంత్రత్వం సిద్ధిస్తుంది. అలా మంత్రమయమైన నామోచ్చారణ, జపం అభీష్టాలను సిద్ధింపజేసి, అనిష్టాలైన ఆపదలను, రోగాదులను పోగొట్టి, భోగాలను యోగక్షేమాలను కలిగిస్తాయి. ఇదే తాంత్రిక ప్రయోజనం. ఈ రెండూ మనకు కావలసినవే. ఈ రెండింటినీ ఇవ్వగలిగే శక్తి ఈ నామాలకు ఉంది.

అయితే, ఈ రెండూకాక మరొక ప్రయోజనం ఉంది. అది – ఆనందానుభవం. దీనిని 'సాత్త్విక ప్రయోజనం' అనవచ్చు. ఏ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పరమప్రేమతో నామస్తోత్రాన్ని జపిస్తూ, విష్ణు అనుభవాన్ని అందుకోవడం – ఆనందంలో లీనమవడం. ఇది భక్తి సంబంధి. నిష్కామం – ఇదే నిజానికి పరమోత్కృష్ట ప్రయోజనం.

"ప్రేమ ముప్పిరిగొను వేళ నామము పలికేవారు.... ఎందరో మహానుభావులు" అని త్యాగరాజన్నది ఈ విధంగా పారాయణ చేసేవారినే.

నిత్యపారాయణ, నిత్య అర్థభావన వలన సర్వమూ విష్ణుమయమనే పరమార్థ స్ఫురణను కలిగించే ఈ నామవిద్యలో ఇన్ని ప్రయోజనాలు, లక్షణాలు ఉండడం చేతనే ఇది అన్ని ధర్మాలకన్నా శ్రేష్ఠమని చెబుతున్నాడు భీష్మాచార్యుడు. ఆచార్యుడు భీష్ముడు, శిష్యుడు యుధిష్ఠిరుడు.

సుందరయ్య గ్రంథాలయం
A C. No.....

భీష్ముడు – అంటేనే పట్టుదల కలిగిన నైష్ఠికుడు. శత్రుభయంకరుడు. బహిఃప్రవృత్తి గల ఇంద్రియాల వేగాన్ని అరికట్టి అంతఃప్రవృత్తికి తెచ్చే యోగసాధనలో పటిష్టతను పొంది అరిషడ్వర్గాలను అరికట్టిన భీషణుడు. అది ఆచార్యునికి ఉండవలసిన లక్షణం. యుద్ధమునందు స్థిరంగా ఉండేవాడు యుధిష్ఠిరుడు. మరోపేరు 'ధర్మరాజు'. చెక్కుచెదరని ఏకాగ్రతకు, ధర్మాచరణకు సంకేతం ఈ నామం. ఇది శిష్యునకు ఆవశ్యకమైన లక్షణం. ఇక్కడ ఆచార్య శిష్యుల నామాలే వారి అర్హతలను ప్రకటిస్తున్నాయి.

అటువంటి ఆచార్యస్వామిని ప్రశ్నిస్తున్నాడు శిష్యుడు.

వైశంపాయన ఉవాచ –

శ్రుత్వా ధర్మానశేషేణ పావనాని చ సర్వశః ।
యుధిష్ఠిరః శాంతనవం పునరేవాభ్య భాషత ॥.... **1**

పాపక్షయము కలిగించే వాటిని, జీవుని దోషాలను తొలగించి చిత్తశుద్ధిని ప్రసాదించేవాటిని పావనములు అంటారు. అలాంటి పావనములైన, అన్ని విధములైన ధర్మాలను పూర్తిగా భీష్ముని ద్వారా విన్నాడు ధర్మజుడు. అన్నీ విన్న తరువాత తిరిగి ఆ శాంతనవుని (శంతను పుత్రుడైన భీష్ముని) యుధిష్ఠిరుడు మరల ఇలా ప్రశ్నించాడు, దేనికోసం? – అన్ని పురుషార్థాలను ప్రసాదించగలిగే సాధనం, సులభసాధ్యం అయిన ధర్మాన్ని గ్రహించడం కోసం. ఆ ప్రశ్న ఆరు ప్రశ్నలుగా విభక్తమై వచ్చింది.

యుధిష్ఠిర ఉవాచ –

కిమేకం దైవతం లోకే కిం వాప్యేకం పరాయణం ।
స్తువన్తః కం కమర్చన్తః ప్రాప్నుయుర్మానవా శ్శుభం ॥.... **2**

కోధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమోమతః ।
కిం జపన్ముచ్యతే జన్తుః జన్మ సంసారబంధనాత్ ॥.... **3**

ఇందులో ఆరు ప్రశ్నలున్నాయి.

1. కిమేకం దైవతంలోకే?

ఈ లోకమున ఏకమైన దైవతం ఏది?

'లోకం' అంటే భువనం అని మాత్రమే అర్థం కాదు. 'లోకన' ధర్మము గలది లోకం. అంటే జ్ఞానమును చూపించే దానిని 'లోకం' అంటారు. పరిశీలించి తెలుసుకోవలసినది లోకం. అదే 'విద్య' లేదా 'శాస్త్రము'. అన్ని శాస్త్రములలో విద్యలలో ఏక దైవముగా ప్రతిపాదింపబడినది ఎవరు? ఇదే బ్రహ్మజిజ్ఞాస. పరబ్రహ్మను గూర్చి తెలుసుకోవాలనే అచ్చమైన తపన. **అథాతో బ్రహ్మ జిజ్ఞాస.** అప్పటివరకు శాంతనవుని ద్వారా – **శ్రుత్వా ధర్మానశేషేణ** – పావనములైన ధర్మములన్నీ గ్రహించడం వలన కలిగిన అధికారముచే ధర్మజునిలో కలిగిన జిజ్ఞాస. వైశంపాయనుడు చెప్పిన శ్లోకం 'అథాతో' (అటుపిమ్మట అధికారము పొందిన పిదప) అనే మాటకు సరిపోతుంది. దేవతలు ఎందరో. దైవమొక్కడే. సర్వదేవతలుగా వ్యాపించిన ఏకదైవమైన పరబ్రహ్మను గురించిన జిజ్ఞాస ఈ ప్రశ్నలలో పల్లవించింది. ఎవరి ఆజ్ఞకు లోబడి ఈ సర్వమూ ప్రవర్తించుచున్నదో అటువంటి ఏకమైన దేవుడెవరు? ఈ ఏకత్వమే గమ్యం.

2. కిం వా ప్యేకం పరాయణమ్?

ఏకమైన పరాయణం ఏది?

పరం అయనం – పరాయణమ్. పరం –ఉత్కృష్టమైన. అయనం ప్రాప్తవ్యస్థానం – పొందవలసిన చోటు, ఆశ్రయం.

సర్వోత్కృష్టమైన ఆశ్రయమేది? దేనిని ఆశ్రయిస్తే మరియొక మార్గమవసరములేదో తెలియజేయవలసినదని ప్రశ్న.

భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః ।
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥

అని శ్రుతి వాక్యం. ఇదే ప్రతిపాదనలను శ్రుతి అనేకచోట్ల చేస్తోంది.

నబిభేతి కుతశ్చన ....
నాన్యః పన్థా విద్యతేయనాయ ....

దేనిని దర్శించడం చేత (అనుభవంలో గ్రహించడం చేత) హృదయగ్రంథి (అజ్ఞాన అలజడి) భిన్నమవుతుందో, దేనిని తెలుసుకోవడం చేత కర్మక్షయమై,

ఆనందలక్షణమైన మోక్షం ప్రాప్తిస్తుందో, అభయం లభిస్తుందో అదే పరబ్రహ్మమని వేదప్రతిపాదన. కనుక ఆ పరమగమ్యమేది? అని ప్రశ్నిస్తున్నాడు.

3. స్తువన్తః కం?

ఎవనిని స్తుతించడం చేత .....?

ఏ ఏకదైవమును గుణసంకీర్తన చేయడం చేత.

4. కమర్చన్తః ప్రాప్నుయుర్మానవా శుభమ్?

బాహ్యముగా అభ్యంతరాలుగా బహువిధముల ఎవరిని అర్చించడం చేత మనన శీలురైనవారు శుభమును పొందుతారు?

5. కో ధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః?

మీరు సెలవిచ్చిన అన్ని ధర్మాలలో ఏది ఉత్తమ ధర్మమని మీ అభిప్రాయం? విధ్యుక్తములైన అన్ని ధర్మాలను అనుష్ఠానపరులు ఆచరించడం సహజం. అటువంటి శ్రేష్ఠులైన జనులు దేనిని ఆచరిస్తారో అది తదితరులకు ప్రమాణం. కనుక శ్రేష్ఠజనుల అభిప్రాయమే శిరోధార్యం. **మహాజనో యేనగతః స పంథా** - మహాత్ములు పయనించినదే మనకు మార్గం. అందుకే మహాత్ముడైన భీష్ముడు అన్ని ధర్మములలోనూ పరమమైన (ప్రధానమైన) ధర్మముగా దేనిని భావిస్తాడు? అని ఆచార్య హృదయాన్ని అవగతం చేసుకొనడానికి శిష్యుని ప్రశ్న.

6. కిం జపన్ముచ్యతే జన్తుః జన్మ సంసార బన్ధనాత్ ॥

దేనిని జపించడం చేత జన్మించిన ప్రతివాడు జన్మ సంసార బంధముల నుండి ముక్తుడౌతాడు?

ఇది వ్యక్తికి అవసరమైన పరమపురుషార్థాన్ని సూచిస్తోంది.

జన్మ సంసారబంధనము నుండి మోక్షము అంతిమలక్ష్యం.

జన్తుః - అంటే జనన ధర్మం గల ప్రాణి. ఆ ప్రాణికోటి జపం, అర్చన, స్తుతి మొదలైనవాటి ద్వారా ఏ ఏకదైవాన్ని అనన్యబుద్ధితో ఆశ్రయించి మోక్షాన్ని పొందుతారో సెలవీయమని ధర్మజుని ప్రశ్న.

ఈ ఆరు ప్రశ్నలకు భీష్ములవారు సమాధానం చెప్పనున్నారు.

ఇక్కడ 'ఏకం' అనే మాట గమనార్హం.

'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అని వేదవచనం.

అద్వితీయమైన పరబ్రహ్మమే ఏకం. ఇదే కేవలత్వాన్ని సూచిస్తోంది. ఆ కేవలత్వమే కైవల్యం. ఆ కైవల్యాన్ని పొందడమే మానవజన్మ సాఫల్యం. ఆ సాఫల్యసిద్ధికి కావలసిన జ్ఞానాన్ని గ్రహించడమే ధర్మజుని జిజ్ఞాస.

ఇక్కడ 'ఒక్కడే' అని చెప్పడం వల్ల 'ఏదో ఒక' దేవతని ప్రతిపాదిస్తున్నట్లు భావించ రాదు. 'అన్నీ ఒక్కటి' అయిన దైవాన్ని గ్రహించాలి. పురాణాలలో ఏ దేవతను ప్రస్తావిస్తే ఆ దేవతనే సర్వోత్కృష్టునిగా, 'ఏక' దేవతగా (ప్రధాన దేవతగా) చెప్పడం కనిపిస్తుంది. కనుక ఒక్కొక్క చోట చెప్పిన ఒక్కొక్క మాటను ప్రమాణంగా తీసుకుంటే పరస్పర భేదాలే తప్ప ప్రయోజనముండదు.

ఇక్కడే జాగ్రత్తగా గమనించాలి. ఏ దైవాన్ని మనం ఉపాసించినా అది 'ఏకమై సర్వత్ర వ్యాపించిన' పరబ్రహ్మయే అనే స్పృహ ఉండాలి. ఆ ఏకత్వ స్పృహ వల్ల భేద దృష్టి నశిస్తుంది. అంతేగాని 'ఏక' శబ్దానికి 'తమ దైవ మొక్కడే' అని అర్థం చెప్పుకోరాదు. భిన్న దృష్టిని పెంచుకొనడం కాదు. సమన్వయదృష్టిని సాధించడమే 'ఏక' శబ్ద ప్రయోజనం. ఆ దృష్టిని ప్రసాదించే జ్ఞాన లక్షణం విష్ణుసహస్రనామ స్తోత్రం నిండా పరచుకొని ఉంది. (దీని వివరణ భీష్ముని సమాధానం తరువాత మరింతగా గ్రహిద్దాం).

సర్వమయుడై, సర్వవ్యాపకుడై ఉన్న పరబ్రహ్మతత్త్వాన్ని అర్చన, ధ్యానం, స్తోత్రం, జపం... వంటి సాధనల ద్వారా నిత్యం మనస్సుతో అనుసంధానం చేయడమే పారాయణం.

అదే సర్వధర్మాలలోకి శ్రేష్ఠమని తాను భావిస్తున్నానని తెలియజేస్తున్నాడు సకల ధర్మవేత్త అయిన భీష్మాచార్యులు.

శ్రీభీష్మ ఉవాచ :

జగత్ప్రభుం దేవదేవమనన్తం పురుషోత్తమమ్ ।
స్తువన్నామ సహస్రేణ పురుషస్సతతోత్థితః ॥.... 4

"జగత్ ప్రభువు, దేవదేవుడు, అనన్తుడు, పురుషోత్తముడు అయిన విష్ణువును

మానవుడు (నిరన్తరం ప్రయత్నశీలుడై) మెలకువతో వేయినామాల ద్వారా స్తుతించి – సర్వదుఃఖాతిగో భవేత్ (6వ శ్లోకం చివరి వాక్యంతో అన్వయం) అన్ని దుఃఖాల నుండి విముక్తుడౌతున్నాడు".

ఇక్కడ 'పురుషః' – అంటే 'దేహం అనే పురంలో వసించే జీవుడు' – **(పురి శరీరే శేతే తిష్ఠతి యస్మాత్ పురుషః – జీవః)** అని అర్థం.

జీవుడు (మానవుడు) 'సతతోత్థితః' – 'నిత్యమూ మెలకువతో' – ఈ సహస్ర నామాలతో స్తోత్రం చేయాలి. ఇక్కడ ఈ 'సతతోత్థితః' అనేది ముఖ్యమైన మాట ఈ స్తోత్రాన్ని "మెలకువ"తో చేయాలి. ఇదే మొదటి అర్హత. అంతేగానీ యధాలాపంగా యాంత్రికంగా చేయరాదు. ఏకాగ్రంగా ఆచరించాలి.

ఇది ధర్మరాజడిగిన అరవ ప్రశ్నకు – **(కింజపన్ముచ్యతే జన్తుః)** – భీష్ముని సమాధానం.

తమేవ చార్చయన్నిత్యం భక్త్యా పురుషమవ్యయమ్ ।
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమానస్తమేవ చ ।.... 5

" (పై శ్లోకంలో ప్రస్తావించిన) అవ్యయ పురుషుడైన విష్ణువును అర్చించి, ధ్యానం చేసి, స్తోత్రించి, నమస్కరించి, యజనము చేసి మానవుడు సకల దుఃఖాల నుండి ముక్తుడౌతాడు."

ఇక్కడ రెండవ అర్హతను ప్రస్తావిస్తున్నాడు. అదే – 'భక్త్యా'. భక్తితో మొదటి – 'సతతోత్థితః' మెలకువ, ఏకాగ్రత. ఇది శ్రద్ధ. రెండవది – 'భక్తి' ఇది 'భగవత్ప్రీతి', 'ఆశ్రయబుద్ధి', 'సమర్పణ' అని అర్థాలను సూచిస్తుంది **'ఇదం నమమేతి భావభావితం కర్మ భక్తిరిత్యుచ్యతే'** – 'ఇది నాది కాదు అనే అహంకారత్యాగ భావంతో భగవదర్పణంగా చేసే కర్మ భక్తి' అని తాత్పర్యం. భగవత్ప్రీతిగా ఆయననే ఆశ్రయించి సర్వ సమర్పణ చేసే ప్రేమభావనను 'భక్తి' అంటారు. ఆ ఏకాగ్రత, ఈ భక్తి – ఈ రెండే ఈ స్తోత్ర పఠనానికి అర్హతలు.

'అవ్యయః పురుషః' నాశనము లేని పురుషుడు. **పూర్ణత్వాత్ పురుషః** – పరిపూర్ణుడే పురుషుడు. ఇక్కడ 'పురుషశబ్దం' నారాయణ వాచకం

ఆయనను సహస్రనామాలతో అర్చించాలి ఈ నామస్తోత్రాన్ని ఎలా వినియో

గించాలో ఈ శ్లోకంలో చెప్పారు. అర్చన, ధ్యానం, స్తోత్రం, నమస్కారం, యజనం. ఈ నామాలతో అర్చించవచ్చు, ధ్యానించవచ్చు, స్తోత్రించవచ్చు, నమస్కరించవచ్చు, హోమం చేయవచ్చు.

ధ్యానం – మానసికం. స్తోత్రం – వాచికం. నమస్కారం – కాయికం. త్రికరణాలతో చేసే ఆత్మనివేదన భక్తియే యజ్ఞము. ఈ భావనయే అర్చన. అందుకు ఈ నామాలను వినియోగించాలి.

ఇది ధర్మజుని చతుర్థ ప్రశ్నకు (కమర్చన్తః) సమాధానం. 'అర్చన' బాహ్యము, అభ్యన్తరం... రెండింటితోనూ సాగాలి. 'భావములోనా బాహ్యమునందును, గోవింద గోవిందయని కొలువవో మనసా!' అనే అన్నమయ్య ప్రబోధమిదే.

అనాదినిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం ।
లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగోభవేత్ ॥.... 6

"ఆద్యంతాలు లేని విష్ణువును, సర్వలోకమునకు మహేశ్వరుని, లోకమును అధిష్ఠించి నియన్త్రించే వానిని నిత్యము స్తుతించినవాడు సర్వదుఃఖముల నుండి ముక్తుడౌతాడు". జీవుడు అజ్ఞానం చేత దుఃఖాన్ననుభవిస్తాడు. ఈ స్తోత్రం వల్ల కలిగే విష్ణుజ్ఞానంతో అజ్ఞానం నశించి ఆనందామృత సిద్ధి లభిస్తుంది. అంతేకాక–ఆధి దైవిక, ఆధి భౌతిక, ఆధ్యాత్మిక ఉపద్రవాల వల్ల, అరిష్టశక్తుల వల్ల, ఆధివ్యాధుల వల్ల కలిగే దుఃఖాలు నశిస్తాయి.

ఇది ధర్మజుని మూడవ ప్రశ్న (స్తువన్తః కం?)కు సమాధానం.

బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనమ్ ।
లోకనాథం మహద్భూతం సర్వభూతభవోద్భవమ్ ॥.... 7

స్తుతింపబడే విష్ణువు యొక్క విశేషణాలివి.

బ్రహ్మణ్యుడు, సర్వధర్మముల నెరిగినవాడు, లోకముల ప్రకాశాన్ని పెంపు చేయువాడు, లోకములకు నాథుడు, సర్వోత్కృష్టుడు, సర్వప్రాణి కోట్లతో నిండిన జగమునకు కారణమైనవాడు.

ఏషమే సర్వధర్మాణాం ధర్మోధికతమోమతః ।
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చేన్నరస్సదా ॥.... 8

అటువంటి పుండరీకాక్షుడైన విష్ణువును స్తోత్రములతో సదా నరుడు అర్చించడమే అన్ని ధర్మములలోనూ అధికతమము – శ్రేష్ఠము – అని నా అభిప్రాయం.

విశ్వవ్యాపకమైన మహావిష్ణువును నిత్యం మనస్సుతో అనుసంధానం చేయడమే ఉత్కృష్ట ధర్మంగా భీష్ముడు ప్రతిపాదిస్తున్నాడు. యుధిష్ఠిరుని ఐదవ ప్రశ్నకు (**కో ధర్మః సర్వధర్మాణాం భవతః పరమోమతః**) ఇది సమాధానం.

అన్ని ధర్మాలలోనూ విష్ణుకీర్తన, విష్ణుస్తుతి, విష్ణ్వర్చన గొప్ప ఫలప్రదమని శాస్త్రాలు నొక్కి వక్కాణిస్తున్నాయి. ఈ విధమైన ధర్మంలో హింసలేదు. ఇతరుల తోడు అవసరం లేదు. ద్రవ్యాలతో పనిలేదు. దేశమూ కాలమూ నియమాల అపేక్ష లేదు.

జపస్తు సర్వధర్మేభ్యః పరమోధర్మ ఉచ్యతే ।

అహింసయా చ భూతానాం జపయజ్ఞః ప్రవర్తతే ॥ (మహాభారతం)

యజ్ఞానాం జపయజ్ఞోస్మి ॥ (భగవద్గీత)

యజ్ఞములలో జపయజ్ఞమే శ్రేష్ఠమనీ, భగవద్విభూతి అనీ భారత, గీతాదులు స్పష్టం చేస్తున్నాయి.

'అర్చత ప్రార్చత ప్రియ మేధాసో అర్చత' – అని అథర్వణ వేదం కూడా జపాది స్తుతి రూపమైన అర్చనను సాగించమని ప్రబోధిస్తోంది.

'స్తుహి శ్రుతంగర్తసదం యువానం' హృదయంలో నున్న నిత్య చైతన్య స్ఫూర్తి అయిన పరమేశ్వరుని స్తోత్రించమని వేదమాత (రుద్రనమకం – యజుర్వేదం) వచనం. ఈ వేదశాస్త్ర సమ్మతమైన శ్రేష్ఠధర్మమే తనకు నచ్చినదని భీష్ముని అభిప్రాయం.

నమస్కార స్తధాశీశ్చ సిద్ధాంతోక్తిః పరాక్రమః ।

విభూతిః ప్రార్థనా చేతి షడ్విధం స్తోత్ర లక్షణమ్ ॥

నమస్కారం, ఆశీర్వచనం, సిద్ధాంత ప్రతిపాదన, పరాక్రమ శక్తి ప్రస్తావన, ఐశ్వర్య వివరణ, ప్రార్థన అనే ఆరు లక్షణాలున్న ప్రక్రియ స్తోత్రం. ఆ లక్షణాలున్న చక్కని స్తోత్ర మిది.

పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః ।

పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్ ॥.. **9**

సర్వమును ప్రకాశింపజేసే దివ్యచైతన్య స్వరూపమైన మహోన్నత తేజస్సు ఎవడో

– సర్వమునూ శాసించే జ్ఞాన స్వరూపుడు ఎవడో – ఎవడు సర్వోన్నతుడైన పరబ్రహ్మమో – ఎవడు పునరావృత్తి రహితమైన శాశ్వత పరంధామమో, అందరకూ పరమమైన గతియో...(ఇది ధర్మజుని రెండవ ప్రశ్న–(కిం వాప్యేకం పరాయణం?)కు సమాధానం.)

పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం ।
దైవతం దేవతానాం చ భూతానాం యోవ్యయః పితా ॥.. **10**

పవిత్రములైన వాటిలో పవిత్రత, మంగళములలో మంగళము, దేవతలలోనూ దైవత్వం (పవిత్రములైన వాటన్నిటిలోనూ పవిత్రుడు, మంగళములన్నిటి కంటె మంగళుడు, దేవతలకు సైతమూ దైవము) ఎవడో – సకల భూతములకు కారణమై, నాశరహితుడైన వాడెవడో...

యతస్సర్వాణి భూతాని భవంత్యాది యుగాగమే
యస్మింశ్చ ప్రళయం యాంతి పునరేవ యుగక్షయే ॥.. **11**

ఎవని నుండి ఈ భూతములన్నీ కలిగి, ఎవరిలో కల్పాంతమందు లీనమౌతున్నాయో...

అంటే సృష్టి స్థితి లయలకు ఎవరు హేతువో...

తస్యలోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే ।
విష్ణోర్నామ సహస్రం మే శ్రుణు పాపభయాపహమ్ ॥.. **12**

ఆ లోకప్రధానుడైన జగన్నాథుని యొక్క వేయినామాలను వినుము. ఓ భూపతీ! (ధర్మరాజా!) పాపాలను, భయాలను పోగొట్టే నామాలివి. ఈ శ్లోకాలు మూడూ ధర్మజుని మొదటి ప్రశ్నకు **(కిమేక దైవతం లోకే)** సమాధానం.

ఈ పదవ శ్లోకం నుండి పరిశీలిస్తే –

నారాయణుని ధ్యానం, నామస్మరణ పరమ పవిత్రము, మంగళము అని ప్రతిపాదించారు.

ధ్యాన, దర్శన, కీర్తన, స్తుతి, పూజా, స్మరణ, ప్రణామాల చేత సర్వపాపాలను తొలగించి, భయాలను పరిహరించే స్వామి పరమ పవిత్రుడు. బంధనకరమైన కర్మ పాపం – దానికి మూలమైన అజ్ఞానం భయం. ఈ రెండూ విష్ణు స్మరణ వలన తొలగుతాయి.

ఈ అభయాన్ని అనేక శాస్త్రాలు నొక్కి చెప్పాయి. మచ్చుకి కొన్ని ప్రమాణాలు :

ధ్యాయేన్నారాయణం దేవం స్నానాదిషు చ కర్మసు ।
ప్రాయశ్చిత్తం హి సర్వస్య దుష్కృతస్యేతి వై శ్రుతిః ॥

స్నానాది కర్మలలో నారాయణుని ధ్యానించితే, సర్వదుష్కృతాలకు అదే ప్రాయశ్చిత్తమని శ్రుతి అభిప్రాయం.

హరిర్హరతి పాపాని దుష్టచిత్తైరపి స్మృతః ।
అనిచ్ఛయాపి సంస్పృష్టో దహత్యేవ హి పావకః ॥
జ్ఞానతో జ్ఞానతో వాపి వాసుదేవస్య కీర్తనాత్ ।
తత్సర్వం విలయం యాతి తోయస్థం లవణం యథా ॥

దుష్టచిత్తులు స్మరించినా వారి పాపాలను హరి హరిస్తాడు. తెలియక ముట్టుకున్నా అగ్ని దహనం చేస్తాడు కదా.

నీరు ఉప్పును కరగించినట్లు తెలిసిగానీ, తెలియకగానీ, చేసిన పాపాలు వాసుదేవుని కీర్తనతో విలయమౌతాయి.

స్తుత్వా విష్ణుం వాసుదేవం విపాపోజాయతే నరః ।
విష్ణో స్సంపూజనాన్నిత్యం సర్వపాపం ప్రణశ్యతి ॥
సర్వదా సర్వకార్యేషు నాస్తి తేషా మమంగళమ్ ।
ఏషాం హృదిస్థో భగవాన్ మంగళాయతనం హరిః ॥

విష్ణు స్తుతి నరుని నిష్పాపిగా మార్చుతుంది. నిత్య విష్ణు పూజ సర్వపాపాలను సమూలంగా నశింపజేస్తుంది. ఎవరి హృదయంలో మంగళాలకు నిలయుడైన భగవానుడు శ్రీహరి ఉంటాడో వారికి అన్నివేళలా, అన్ని కార్యాలలోనూ ఎటువంటి అమంగళములూ కలుగవు.

గంగాస్నాన సహస్రేషు పుష్కరస్నాన కోటిషు ।
యత్పాపం విలయం యాతిస్మృతే నశ్యతి తద్ధరౌ ॥

వేలకొలది గంగా స్నానాల వల్ల, కోట్లాది పుష్కర స్నానాల వల్ల నశించే పాపరాశి హరిస్మృతి వల్ల సులభంగా నశిస్తుంది.

ప్రాయశ్చిత్తాన్యశేషాణి తపః కర్మాత్మకాని వై ।

యానితేషా మశేషాణాం కృష్ణానుస్మరణం పరమ్ ॥

తపస్సులు, కర్మరూపాలు అయిన అన్ని ప్రాయశ్చిత్తాలలో నిరంతర కృష్ణస్మరణ ప్రశస్తము.

గోవిందేతి సదాస్నానం..

మానసం స్నానం విష్ణుచిన్తనమ్..

– ఇలా బహుముఖాలుగా హరిస్మరణలోని పవిత్రతనీ, మంగళాన్నీ మనకు శాస్త్రాలు చాటి చెబుతున్నాయి.

వీటిని అనుసరించి భీష్ముడు **'పవిత్రాణాం పవిత్రంయః', 'మంగాలానాం చ మంగలం'** అని విష్ణుస్మరణ వైభవాన్ని ఉగ్గడించాడు. సుఖం, సుఖసాధనం, సుఖజ్ఞాపకం – ఇవి మంగళాలు. వీటితో కూడిన పరమానంద స్వరూపుడు కనుక నారాయణుడు పరమమంగళుడు.

హరిస్మరణలేనిదే ఏ కర్మకూడా పవిత్రం కాదు.

యస్యస్మృత్యా చ నామోక్త్యా తపః పూజాక్రియాదిషు ।

న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందే తమచ్యుతమ్ ॥

తపః పూజాక్రియాదులలో ఎవనిని స్మరించితే లోటుపాట్లు కూడా తొలగి, సంపూర్ణత సిద్ధిస్తుందో ఆ అచ్యుతునకు వందనము.

"హరి విరహితములు అవి కొన్నాళ్లకు

విరసమ్ములు మరి విఫలములు"... అని అన్నమాచార్యుని వచనం. స్వామి స్మరణ వల్లనే శుభప్రాప్తి, సిద్ధి చేకూరుతాయి.

'యతస్సర్వాణి భూతాని...' అనే 11వ శ్లోకంలో సృష్టి స్థితి లయకారకుడైన పరబ్రహ్మను ప్రస్తావించారు. భగవంతుని గురించి మన వేదశాస్త్రాలిచ్చిన గొప్ప నిర్వచనమిది. ఈ మూడు పనులు చేసేది ఒక్కడే. ఆయననే నారాయణ బ్రహ్మమని ఈ స్తుతి ప్రతిపాదిస్తోంది. శివునిగా, విష్ణువుగా, బ్రహ్మగా ఆరాధింపబడేది ఆయనే.

గజేన్ద్రుడు చేసిన స్తుతిలో తొలిశ్లోకం ఇదే భావాన్ని వ్యక్తీకరిస్తోంది.

యస్మిన్నిదం యతశ్చేదం యేనేదం చ ఇదం స్వయమ్ ।

యోస్మాత్ పరస్మాచ్చ పరస్తం ప్రపద్యే స్వయంభువమ్ ॥

ఈ శ్లోకాన్నే పోతన గారు – "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై ఎవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు... వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్" అని కీర్తించారు.

'పరాయణమ్' అనేది శరణాగతినే సూచిస్తోంది.

'ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే' అని ఉపనిషత్తు చెప్పినట్లుగా శరణు వేడదగిన పరబ్రహ్మ ఆతడే.

యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః ।

ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే ॥... **13**

"ఏ మహాత్ముని నామాలు గౌణములు, విఖ్యాతములు, ఋషులచే పరిగీతములో వాటిని శ్రేయస్సుకై చెబుతున్నాను."

ఈ విష్ణుసహస్రనామాలు 'గౌణములు'. అంటే నారాయణుని దివ్యలక్షణాలను, అనంత గుణములను చెబుతున్నాయి. అవి కూడా ప్రసిద్ధములైనవి. ఋషులచే సమగ్రముగా గానము చేయబడినవి.

విష్ణువు యొక్క తత్త్వ, మహిమ, కారుణ్యాదులను ప్రకటించే ఈ నామాలను తపశ్శక్తి ద్వారా దర్శించినవారు ఋషులు.

'ఋషిర్దర్శనాత్' – ఇంద్రియాతీతములైన సత్యాలను తపోమహిమతో దర్శించే వారిని 'ఋషులు' అంటారు. ఇంద్రియ ప్రజ్ఞతో, భావనా ప్రజ్ఞతో దర్శించేవారు మామూలు మానవులు. ఇంద్రియాతీతమైన సమాధి స్థితిలో మేల్కొనే ప్రజ్ఞ సృష్టికి హేతువులైన సత్యాలను (ఋతాలను) దర్శిస్తుంది. ఆ ప్రజ్ఞను **'ఋతంభర ప్రజ్ఞ'** అంటారు. ఆ ప్రజ్ఞతో దివ్యమైన అపౌరుషేయ శబ్దాలను గోచరింపజేసుకున్న వారు ఋషులు.

ఆ ఋషులు దర్శించిన మంత్రాలు కూడా ఋషులే.

మంత్రాలను ఋషులు దర్శిస్తే, ఆ మంత్రాలు పరమాత్ముని అనంత శక్తుల్ని దర్శిస్తాయి.

అందుకే **"ఋషిభిః పరిగీతాని"** – అంటే ఋషులచే, మంత్రరాశిచే బహువిధముల కీర్తింపబడిన నామాలు అని అర్థం. ఆనందానుభూతితో పలికే మాటను 'గీతం'

అంటారు. బ్రహ్మమును దర్శించిన ఆనందానుభవంతో ఆయనను వర్ణించిన నామాలు. భగవన్నామాన్ని 'ప్రేమ ముప్పిరిగొని' ఆనందంతో పలుకుతారు మహాత్ములు. **'కంఠావరోధ రోమాంచా శ్రుభిః పరస్పరం లపమానా'** (నారదభక్తిసూత్రం) పులకించిన ఒంటితో, గొంతు బొంగురుపోయి, ఆనందాశ్రువులతో భగవన్నామాన్ని పలికితే అదే గొప్ప 'పరిగీతం'.

ఋషిభిర్బహుధాగీతం ఛందోభిర్వివిధైః పృధక్ ॥

అని శా'స్త్రాలు చెబుతున్నాయి. ఋషులచే, ఛందములచే (వివిధ మంత్రాలచే) బహువిధములుగా గానం చేయబడిన నామాలు.

వేదమంత్రాలలోని నామాలు కనుక ఇవి మంత్రాలే. వాటి స్మరణ, పారాయణలు వేదపారాయణతో సమానం. సంస్కార, స్వరజ్ఞానాదులుంటేనే వేదాన్ని పారాయణ చేయాలి. వాటి అవసరం లేకుండానే ఈ విష్ణునామాలు చదివితే చాలు, వేద పఠన ఫలం లభిస్తుంది. అలాగే ఈ వైదిక శబ్దాలను నామాలుగా కీర్తిస్తే వేదయజ్ఞాలను ఆచరించినట్లే.

ఋషిర్వేదే వసిష్ఠాదౌ దీధితౌ చపుమానయమ్ ।

సాక్షాత్ కృత ధర్మాణి ఋషయః.... అని 'నిరుక్తం'.

వేదము, వసిష్ఠాదులు, ప్రకాశం, పురుషుడు, ధర్మాలను సాక్షాత్కరింప జేసుకున్నవాడు... ఇలా 'ఋషి' శబ్దానికి చాలా అర్థాలున్నాయి. వీరందరి చేత కీర్తించబడినవాడు పరమాత్మ. వేదమూలాలతోనున్న ఈ నామమంత్ర సమూహమంతా ఐశ్వర్యాన్ని (భూతిని) ప్రసాదిస్తుంది. అది శాశ్వతానందసిద్ధి. కైవల్యం-జ్ఞానం-భక్తి. అంతేకాదు - ధర్మార్థ కామ మోక్షాలే 'భూతి'. ఆ నాలుగింటినీ ప్రసాదించే మహిమాన్విత మన్త్రమాలిక ఈ నామాల మణిమాల.

దీని లక్ష్యం - 'ఏకత్వ' ప్రతిపాదన - ఇదే సనాతన మతం.

ఇక్కడ భీష్ముడు ఈ నామవిద్యలో ప్రతిపాద్యమయ్యే తత్త్వాన్ని వివరించాడు. భీష్ముడు పలికిన పది శ్లోకాలను గమనిస్తే - ఈ స్తోత్రం ఎవరిని నిర్దేశిస్తోందో స్పష్టమౌతుంది.

ఇందులో "ఏక" అనే శబ్దం "లోకప్రధాన" అనే శబ్దం రెండూ ఒక్కటే. ధర్మరాజు ప్రశ్న కూడా 'ఏకత్వ' సిద్ధికోసమైన జిజ్ఞాస. వేయినామాలున్నా అన్నీ ఒక్కనివే. అలాగే

వేయి రూపాలున్నా అవీ ఒక్కనివే. ఈ నామాలు, రూపాలు ఒకే పరతత్త్వానివి. ఆయన అనంత శక్తులు (విభూతులు), మహిమలు ఈ నామాల ద్వారా ప్రకటితాలు.

ఇందులో 'జగత్ప్రభువు' వంటి శబ్దాలు పుంలింగ వాచకాలు అయినా, ఆ శబ్దం ద్వారా ప్రకటితమయ్యే తత్త్వం లింగాతీతం. అది అవ్యయం. సమస్త విశ్వ వాప్తం – విశ్వకారకం – విశ్వాతీతం.

అది వైకుంఠ వాసమనో, కైలాస నివాసమనో, శివుడనో, విష్ణువనో, శక్తి అనో ప్రత్యేక నిర్దేశం కాదు. అలాగని కాదనీ చెప్పలేం. అది 'అనిర్దేశ్యమైన' తత్త్వమే అయినా సగుణంగా నామరూపాదులతో వ్యక్తమౌతుంది – ఉపాసకుల కోసం.

ఏ దేవతోపాసనకు ఆ దేవతయే పరతత్త్వం. ఈ ఇష్టదేవతానిష్ఠను కాదనరాదు. విష్ణూపాసకునకు విష్ణువే పరతత్త్వం. శివోపాసకునకు శివుడే. శక్తి భక్తునకు శక్తియే. అందులోనూ విష్ణూపాసనలో కూడా కృష్ణ, రామ, నృసింహాది భక్తులకు ఆయా నామరూపాలు అత్యంత ప్రీతికరాలు.

ఇంతకీ ఏది పరతత్త్వం. 'జగత్ప్రభుం' నుండి 'లోకప్రధానస్య' వరకు వర్ణితమైనదంతా కలిపితే స్పష్టమయ్యే భావనయే సత్యం. అదే పరతత్త్వం. ఇందులో ఒక స్వరూపంగానీ, ఒక లోకంగానీ, భౌతికమైన ఏ లక్షణమూ వర్ణితం కాలేదు. ఇది తత్త్వ ప్రతిపాదన. తత్త్వాన్ని విష్ణువుగా దర్శించి ఉపాసించి తరించవచ్చు. అందుకే ఈ సహస్రనామ స్తుతి.

ఇదే విధంగా – మన భారతీయ ఉపాసనా సంప్రదాయాలను సమస్తంగా దర్శిస్తే... ఒకే పరతత్త్వాన్ని ఆయా సంప్రదాయజ్ఞులు ఆయా పద్ధతుల్లో కొలుచుకుంటున్నారని అర్థమౌతుంది. ఈ తాత్త్విక స్పృహ కలిగిన జ్ఞానంతో ఎవరి ఇష్టదేవతను వారు ఆరాధిస్తే – మత భేదాలు, వైషమ్యాలు, ఒకరి పరంపరను విభిన్నం చేసి మార్చడాలు ఉండవు. క్రమంగా సర్వదేవతలూ తన ఇష్టదేవత యొక్క స్వరూపాలే నన్న అవగాహన ఏర్పడుతుంది. ఏ సహస్రనామ స్తోత్రమైనా ఇదే లక్ష్యాన్ని సిద్ధింపజేసే విధంగా కూర్చబడింది.

సూర్యుని కిరణాలన్నీ ఆయనకు భిన్నంకావు. దేవతలలో దేవత్వమంతా ఒకే పరతత్త్వానిది. 'ఏదో ఒకటి' కాదు – 'అన్నీ ఒకటి' అనే దర్శన సిద్ధికోసమే ఈ

సహస్రనామాది స్తోత్రాలు.

ఈ వివరణ కేవలం ఈ విష్ణుసహస్ర నామస్తుతిని గురించేకాదు. సమస్త వైదిక పరంపరలోని ఉపాసనా విధానాలన్నీ 'ఒకే తత్త్వం'తో సమన్వయిస్తాయనే సమగ్ర అవగాహన కోసం – ఈ ప్రస్తావన. ఈ స్పృహను విస్తృతంగా ప్రచారం చేస్తే సమన్వయం, సామరస్యం ఏర్పడి వ్యక్తికీ, సమాజానికీ కూడా శాంతి సిద్ధిస్తుంది.

నిరంతరం విష్ణుసహస్రనామ స్తోత్ర భావన క్రమంగా మన దృష్టిని విస్తరింపజేసి – 'సర్వం విష్ణుమయం' అనే సత్యానుభవంలో సుస్థిరం చేస్తుంది. ఆ అనుభవమే 'ఏకం'. ఆ స్థాయిలో 'నేను సాధకుడ్ని' అనే అహంకూడా కరిగి లీనమై – 'నేనే' మిగలని స్థితి లభిస్తుంది. అదే ఏకం – అద్వైతం. అది తన్మయ తదాకార స్థితి నుండి తాదాత్మ్య స్థితికి తీసుకువెళ్లే 'భక్తి' లేదా 'జ్ఞానము'.

భిన్న దృష్టిని పోగొట్టడమే ఈ స్తోత్రం యొక్క పరమ ప్రయోజనం. ముందు దేవతా భేదాలు నశించాలి. వస్తువును వస్తువుగా కాక తదంతర్గత చైతన్యం భగవత్ స్వరూపంగా దర్శనమయ్యే జ్ఞానాన్ని సంపాదించాలి.

'సగుణం' అనేది 'నిర్గుణా'నికి భిన్నంకాదు. నిర్గుణ తత్త్వావిష్కరణకు ఆలంబన సగుణం. అందుకే ఏ రూపమో, నామమో ఇష్ట దేవతగా మనస్సు ఆమోదించాక అందులో నిష్ఠ కుదుర్చుకొని సాధన చేయడం సమంజసమే. కానీ తత్త్వస్పృహను మాత్రం పెంపొందించుకోవాలి. లేని పక్షంలో ప్రమాదమే. భక్తి, జ్ఞానమూ అనుభవం లోకి వచ్చిన వాడు ఎప్పుడూ విభేదించడు.

అనేక రకాల స్తోత్రాలను, ఉపాసనా మార్గాలను మనం చూడడం తటస్థించినప్పుడు – బుద్ధి భ్రమ చెంది అయోమయంలో పడకూడదనే ఈ వివరణ. ఏ దేవతా స్తోత్రాలను చూసినా 'అదే పరమాత్మ' అని చెప్పబడుతుంది. అన్నిటికీ వైదిక ప్రమాణాలు ఉన్నాయి. అప్పుడు ఒకే పరమాత్మను వారు ఆ రూపంలో ఆరాధిస్తున్నారని గ్రహించాలి.

నామ, రూపాలతో ఆగిపోతే మతం. నామానికి ఉన్న అర్థాన్నీ, రూపం ద్వారా వ్యక్తమయ్యే శక్తినీ గ్రహిస్తే తత్త్వం – లేదా, ఆధ్యాత్మికం. మతం తత్త్వ స్పృహతో కూడుకొని ఉన్నప్పుడు ఏ ప్రమాదమూ రాదు.

అందుకే ఈ 'ఏకత్వ' (లోకప్రధాన) ప్రతిపాదన.

సమస్త వేదాల హృదయం ఇదే.

'యదా ప్రకాశయత్యేకః కృత్స్నం లోక మిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥'
'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ'
'సర్వభూతస్థితం మాం యోభజత్యేకత్వ మాస్థితః'

– ఇవి భగవద్గీతా వాక్యాలు.

హరిరేక స్సదాధ్యేయో భవద్భిఃః...
ఆశ్చర్యం ఖలు దేవానా మేకస్త్వం పురుషోత్తమ...

– అని 'హరివంశం'.

సృష్టిస్థిత్యంతకరణీం బ్రహ్మ విష్ణు శివాత్మికామ్ ।
ససంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవజనార్దనః

– అని విష్ణు పురాణం.

సృష్టి స్థితి లయలు చేసే పరమేశ్వరుడొక్కడే. ఆయన 'బ్రహ్మ విష్ణు శివాత్మకుడు'. ఆ 'ఒక్క' తత్త్వాన్నే ఎవరి ఇష్టదైవంగా వారు ఆరాధిస్తున్నారు. ఈ ఒక్క కనీస అవగాహన ఉంటే ఇతర దేవతా నిరసన ఉండదు. "ఇతర దేవతల నామాన్ని కూడా ఉచ్చరించం – నమస్కరించం" అనే మూర్ఖత్వమూ ఉండదు. ఆ భిన్న దృష్టి ఉంటే – తమ దైవాన్నే మరో రూపంలో నిరసిస్తున్నామనీ, కొరత పెట్టుకుంటున్నామనీ గ్రహించాలి. ఆరాధనకి ఎంత సత్ఫలితమో, నిరసనకీ అంత దుష్ఫలితం లభిస్తుంది.

దేవత మన కల్పనకాదు. పరమాత్మ సృష్టి స్థితి లయాది విశ్వరచన చేసేటప్పుడు 'ఈశ్వరుడు' (పరమేశ్వరుడు – మహేశ్వరుడు), అని వ్యవహరింపబడతాడు. ఈ జగద్రచనలో తన అనంతశక్తులను – విభూతులను వ్యక్తీకరిస్తాడు. ఆ వ్యక్తీకరింపబడ్డ ప్రతి శక్తీ దేవత. ఆ శక్తిని ప్రకటించేది ఆ దేవతాసంబంధ నామం–రూపం. ఆ నామరూపోపాసన ద్వారా ఆ శక్తిని మనం గ్రహిస్తూ – క్రమంగా ఆ శక్తి ఆ అఖండ పరిపూర్ణ పరబ్రహ్మయే అనే నిష్ఠలో నిలుస్తాం.

వేదపురాణాల్లో ఆయా దేవతల స్వరూపాన్ని దర్శించిన ఋషులు వివిధ స్తోత్రాదుల ద్వారా అందించారు. దేవతలు ఆ అఖండ పరమేశ్వర జ్యోతి యొక్క వెలుగులే.

దానిని తెలుసుకొనేందుకే ఈ దేవతా స్తోత్రాదులలో సకల దేవతల నామాలు నిక్షిప్తం చేయడం. తద్వారా సర్వదేవతాత్మకునిగా మన ఉపాస్యదైవాన్ని కొలుచుకుంటాం. ఏ దేవతా నామరూప ప్రస్తావన వచ్చినా తన దైవం యొక్క స్వరూపమేనని గౌరవిస్తాం.

✯ ఏక ఏవ రుద్రః నద్వితీయాయతస్థేః ॥

✯ నసన్న చాసత్ శివ ఏవ కేవలః ॥

✯ విశ్వాధికో రుద్రోమహర్షిః ॥

✯ శివ ఏకః ధ్యేయశ్శివం కరః ॥

✯ శివమద్వైతం చతుర్థం మన్యంతే ॥

– ఈ వేదవాక్యాలు, స్మృతి వాక్యాలు శివపరంగా కనిపిస్తాయి. కానీ ఇవన్నీ ఏకమైన పరతత్త్వ ప్రతిపాదకాలు, దానిని 'శివ' రూపభావనలో ఆరాధించినా అదే కేవలత్వం'! అందుకే విష్ణుసహస్రంలో అనేక శివపరమైన నామాలున్నాయి.

శక్తి భావనగా దర్శిస్తే – 'అహం రుద్రేభిర్వసుభిశ్చరామి' వంటి దేవీసూక్తాలు ఆ ఏకత్వాన్ని మాతృమూర్తిగా దేవిగా సాక్షాత్కరింపజేశాయి. 'అజామేకాం లోహితా శుక్ల కృష్ణాం' ... అన్న వేదవాక్యాన్ని దేవీభాగవతాదులు విస్తరించాయి.

లలితా సహస్రనామ స్తుతిలో 'అమ్మ'గా కీర్తించబడిన వైష్ణవీశక్తి విష్ణుతత్త్వానికి భిన్నంకాదు.

నారాయణియైన వైష్ణవి (లలిత) బ్రహ్మ రూపా – గోవిందరూపిణీ – రుద్రరూపా అని వర్ణితయైతే, నారాయణుడైన విష్ణువు – శివ, శర్వ, శంభు, రుద్ర, అజ, కేశవాది నామాలతో స్తుతించబడడంలోని పరమార్థమిదే.

ఇన్ని నామాలూ ఒకే తత్త్వంలో లీనం చేస్తాయి.

అదే అఖండ సచ్చిదానందమయ అమృత సముద్రం. స్త్రీ పుం భేదం ఆ అనుభవంలో లేదు.

'నైవస్త్రీ నపుమానేష నైవ చాయం నపుంసకః' – అన్న ఉపనిషద్వచనం ప్రమాణం.

ఇదే స్థితిలో – జగత్తు పట్ల కూడా భిన్న దృష్టి నశిస్తుంది.

భిన్నత్వమే 'మిథ్య'. జగద్భావన ఉన్నంతకాలం 'మిథ్య'. బ్రహ్మభావన సత్యం. ఆ సత్యంలో లీనమైతే 'బ్రహ్మసత్యం' అనే స్ఫురణ కలిగి ఈ భిన్నత్వమంతా 'మిథ్య'

అని తేలుతుంది..

"త్వయిమయిచాన్యత్రైకో విష్ణుః" అన్న భగవత్పాదుల దర్శన మిదే. ఏ సంప్రదాయం వారినైనా సమన్వయించే జగద్గురుత్వం ఈ సత్య ప్రతిపాదనలో ఉంది. 'ఏకం' అని వేదం, ఉపనిషత్తు ప్రతిపాదించినట్లే వేదసారమైన ఈ విష్ణుసహస్ర నామస్తుతి సైతం ప్రతిపాదిస్తోంది. 'ఏకం' అయితే, కనిపిస్తున్న భిన్నత్వం (రెండు) మాట ఏమిటి? 'రెండు'గా కనిపిస్తున్నా, తదంతర్గత చైతన్యం 'ఒక్కటే'. అందుకే 'ఏకం' అని మాత్రమేకాక, 'అద్వైతం' (రెండు కాదు) అన్నది వేదాంతం. 'నాయనా! నీకు రెండుగా కనిపిస్తున్నా – నీ జీవభావం, జ్ఞానం ద్వారా బ్రహ్మంలో లీనమైతే ఉన్నది ఒక్కటేనని అనుభవంతో గ్రహిస్తావు' అనేది దీని సారాంశం. మహావాక్యాల బోధ.

'విశ్వం' – అనే ప్రథమనామంతోనే ఈ దివ్యస్తోత్రం ఈ విషయాన్ని విస్పురితం చేసింది. 'ఏకత్వ' (అద్వైత) ప్రతిపాదన ప్రధానంగా సాగిన ఈ జ్ఞాన వాహినిని ఆదిశంకరులు వ్యాఖ్యానానికి ఎంచుకోవడం వేద హృదయాన్ని ఆవిష్కరించడానికే. సమన్వయం ద్వారా అన్ని సంప్రదాయాలనూ ఏకోన్ముఖం చేయడానికే.

విభేద జనకేఽజ్ఞానే నాశమాత్యన్తికం గతే ।
ఆత్మనో బ్రహ్మణో భేదమనన్తం కః కరిష్యతి ॥
పరాత్మనో ర్మనుష్యేన్ద్ర విభాగోఽజ్ఞాన కల్పితః
క్షయే తస్యాత్మపరయోర్వి భాగోభాగ ఏవహి ॥ (విష్ణు పురాణం)

"ఆత్మకు, బ్రహ్మకు విభేదాన్ని కలిగించే అజ్ఞానం 'అత్యన్తికనాశం' (సంపూర్ణంగా నశించడం) పొందినపుడు ఆత్మకూ, బ్రహ్మకూ లేని భేదాన్ని ఎవరు కల్పిస్తారు?

ఆత్మ – పరమాత్మలకు విభాగం అజ్ఞాన కల్పితం. ఆ అజ్ఞానం నశించినప్పుడు ఆత్మ – పరమాత్మలకు విభాగం అసంభవం" అని పై విష్ణుపురాణ వచనం. అంటే వేదోపనిషత్పురాణాదుల ద్వారా వ్యాసులవారు చాటినది పరమసత్యమైన అద్వైతసిద్ధిని 'ఏకత్వా'న్ని పొందమని. అజ్ఞానం యొక్క 'అత్యంతిక నాశం' అయ్యేవరకు ద్వైతభ్రాంతి ఉంటుంది.

'ద్వితీయాద్వై భయం భవతి' అన్నది వేదం. 'రెండవది' అన్న భిన్న దృష్టి ఏర్పడగానే భయమే. అందుకే 'అభయం' కోసం అద్వైత సిద్ధిని పొందేందుకు సాధనచేయాలి.

సాధన స్థితిలో ఆశ్రయించడం – సిద్ధిస్థితిలో ఏకమవడం. ఆ సిద్ధిని విచారణలో నుంచుకొని సాధన చేయడమే మనం చేయగలిగేది. 'మీరు మేమని భిన్నులై ప్రవర్తిల్లక, సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునందుల్లము చేర్చి' సాధన చేయగలం. ఈ రకమైన సాధన మాత్రమే ప్రపంచంలో భౌతికంగా కూడా శాంతిని నెలకొల్పగలదు. ఎవరూ తామున్న సంప్రదాయాన్నుండి మారకుండానే, మరొక సంప్రదాయాన్ని గౌరవిస్తూ సామరస్య భావనతో సాగగలరు. ఆది శంకరులు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, రమణమహర్షి...ఇలా వివేక విజ్ఞానాలున్న మహాత్ములంతా దీనినే బోధించారు. ప్రపంచంలోని అందరూ వీరిని శిరసా ధరించారు.

ఇటువంటి సార్వజనీన, 'విశ్వమయ, సనాతన దృష్టి' *(Universal & eternal)* మనకు కలిగించేందుకు విష్ణుసహస్రం చక్కని మార్గం. దీనిలో ప్రస్తావించిన నామాల అర్థాలను చూస్తే ప్రతి జీవికీ కావలసిన పరమార్థమిదే, ప్రయోజనమిదే అని స్పష్టమౌతుంది.

సర్వభూతేషు యేనైకం భావమవ్యయ మీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తద్ జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥ (భగవద్గీత.18 అ.)

'విడివిడిగా కనిపిస్తున్న దానిలో, 'విడి' కాకుండా ఉన్న ఏకత్వాన్ని దర్శించడమే సాత్త్వికజ్ఞానం'. ఆ సాత్త్విక జ్ఞానసిద్ధికి ఈ సహస్రనామ పారాయణ దోహదపడాలి.

సారాంశంగా :

"విశ్వవ్యాపకమైన పరబ్రహ్మ చైతన్యం వివిధ విధాలుగా నిండి ఉంది. ఆ వివిధాలన్నీ ఈ నామాలలో ఉన్నాయి. అవన్నీ ఒకే చైతన్యానివి" అని నిర్ధారించడానికి భీష్ములు ఈ దశశ్లోక రూప ఉపోద్ఘాతాన్నిచ్చారు.

జిజ్ఞాస కలిగిన వివేకవంతుల కోసం సాగిన ఈ విచారణను ఇలా ఉంచి, మరో వైభవాన్ని దర్శిద్దాం.

ఒక్కొక్క నామం ద్వారా ఆ విశ్వవ్యాపక చైతన్యపు శక్తి విశేషాలను మన ప్రాణశక్తి అనుసంధానం చేసుకొని మరింత అద్భుతంగా తేజోవంతంగా మనలో పని చేస్తుంది. ఒక బ్యాటరీని ప్రధాన విద్యుత్‌తో అనుసంధానం చేసి శక్తిని నింపినట్లుగా. అది రోగాది మలినాలను, వేదనలను పారద్రోలడమే కాక ఆత్మ యొక్క అనంత శక్తుల్ని

జాగృతం చేసి రాజస తామసాది వికారాలను తొలగించి, గీతాచార్యుడు చెప్పిన సాత్త్విక జ్ఞానాన్ని కలిగిస్తుంది. వ్యక్తి చైతన్యాన్ని విశ్వచైతన్యంతో అనుసంధానించటమే ఆధ్యాత్మికత.

భగవద్విభూతులు సూర్య చంద్రాదుల ద్వారా, పంచభూతాల ద్వారా వ్యక్తమై ఈ విశ్వనిర్వహణను సాగిస్తున్నాయి. వాటిలోనూ ఆ విష్ణుబ్రహ్మమునే దర్శించాలి. విశ్వమంతా విష్ణువును దర్శించిన వానిని విశ్వంలో ప్రతి అణువులోనూ ఉన్న విష్ణువు రక్షిస్తాడు, పాలిస్తాడు.

ఉదాహరణకు విష్ణుసహస్రంలో ఆదిత్యాది దేవతల స్మరణ ఉంది.

ఒకవైపునుండి చూస్తే – ఇదంతా సౌరోపాసనగా కనిపిస్తుంది. 'యదాదిత్యగతం తేజో...' అని గీతలో చెప్పినట్లుగా ఆదిత్య మండలంలోని పరమాత్మ (విష్ణు) చైతన్యమే మనకి పోషకమూ, కారకము, సర్వదేవతాత్మకము. 'ఆదిత్యానా మహం విష్ణుః' అని శ్రీకృష్ణ పరమాత్మ వచనం. అలాగే అగ్ని, వాయు, వరుణ మొదలైన దేవతాశక్తుల వైభవాలున్నాయి. ఇవన్నీ విష్ణువిలాసాలు.

వీటిని పరిశీలిస్తే విశ్వగమన విజ్ఞానమంతా ఈ స్తోత్రంలో సాక్షాత్కరిస్తుంది. అందుకే ఇది విశ్వజనీన ప్రార్థన. విశ్వ విజ్ఞాన దర్శనం.

ఈ స్తోత్ర పారాయణ కర్తకు అగ్ని వాయ్వాదులన్నీ అనుకూలిస్తాయి. దేవతలందరూ సహాయకారులౌతారు.

వేదాలలోని సౌరారుణ మంత్రాలలో, అగ్ని వాయు ఇంద్ర వరుణ మంత్రాలలో, ఇతరత్రా ఉన్న మంత్ర రాశిలో ప్రస్తావించిన నామాలన్నీ విష్ణు పరమాత్మవే.

ఆ నామాలే ఈ స్తోత్ర మణిమాలలోని అనర్ఘ మణులు.

ఈ నామస్తుతిలో కొన్ని పుంలింగ శబ్దాలున్నాయి. కొన్ని స్త్రీలింగ వాచకాలు. కొన్ని నపుంసకలింగ వాచకాలు. మొదటివి నారాయణ దేవుని విశేష్యాలుగానూ, రెండవరకం నామాలు 'దేవతా' శక్తి విశేష్యాలుగానూ, మూడవ విధమైన నామాలు పరబ్రహ్మ వాచకాలుగానూ గ్రహించాలని వ్యాఖ్యానకర్తలు వివరించారు. దీనిని గమనిస్తే ఇన్ని విధాలుగా వ్యక్తమయ్యే ఏకనారాయణ బ్రహ్మము స్పష్టమౌతుంది.

ఇంత తత్త్వజ్ఞానంతో పాటు మనస్సును మాధుర్యభరితం చేసే స్వామి అవతార

విశేషాలు, లీలా వైభవాలు, రూపమాధుర్యాలు, మహిమాతిశయాలు, అనంత కల్యాణ గుణ మాధుర్యాలు ఈ నామాలలో పొంగిపొరలుతాయి. భక్తిభావనతో తన్మయపరచే ఈ నామాలన్నీ రామాయణ భారత భాగవతాదుల్లో విస్తారితమైన నారాయణ గాథలన్నిటినీ స్మరణకు తెస్తాయి. ఈ స్మరణ చాలు కదా – బ్రతుకును ధన్యం చేయడానికి!

ఈ సహస్రనామాల ద్వారా స్తుతింపబడిన విష్ణువు, బ్రహ్మ విష్ణు రుద్రాత్మకుడు – సగుణ నిర్గుణ సమన్వయ చైతన్యం – సర్వకారణ కారణ పరమాత్మ.

లోకంలో నామ రూపాలకు, భగవన్నామ రూపాలకు తేడా ఉంది. భగవన్నామ రూపాలలో అనంత శక్తి నిబిడీకృతమై ఉంటుంది.

"నామ్నామకారి బహుధా నిజసర్వశక్తిః తత్రార్పితా"

"సామీ! అనేక నామాలను ఏర్పరచి, నీ సర్వశక్తులనూ అందులో నింపావు" అని చైతన్య మహాప్రభువులు కీర్తించారు.

నామోచ్చారణ వల్ల ఆ శబ్దశక్తి మన ప్రాణశక్తిలో దేవతాచైతన్యాన్ని జాగృతి చేస్తుంది. ఆ నామాల కూర్పు అలాంటిది. అలా జాగృతి చేయగలిగే శక్తి ఉన్న శబ్దాన్నే 'మంత్రం' అంటారు. ఒకే పంచదార అనేక భాగాలుగా, ఒకే నీరు చల్లబడి అనేక మంచు ఆకారాలుగా మారినట్లే శబ్ద (మంత్ర) ఉచ్చారణ వల్ల ఏర్పడిన శక్తి తరంగాలు – అనంతమైన పరబ్రహ్మశక్తిని వివిధ రూపాలలో ఆవిష్కరిస్తాయి.

ఒక్కొక్క మంత్రానికి ఒక్కొక్క ధ్యాన శ్లోకం ఉండడంలో ఆంతర్యమిదే. ఆ మంత్ర (నామ) ఉచ్చారణ ద్వారా సూక్ష్మశక్తి ప్రపంచంలో ఏర్పడే ఇంద్రియాతీతమైన దివ్యాకృతి ఎలా ఉంటుందో ఆ ధ్యాన శ్లోకం వివరిస్తుంది.

అలాగే విష్ణుసహస్రనామ మాలా మంత్రం పరమాత్మ యొక్క విరాడ్విష్ణు రూపాన్ని మన హృదయంలో ప్రతిష్ఠ చేస్తుంది. అలా ధ్యానిస్తూ వెళితే – ఈ మంత్ర గుచ్ఛం ద్వారా వ్యక్తమయ్యే స్వామి దివ్యరూప వైభవాలను ధ్యాన శ్లోకాలలో దర్శించవచ్చు.

మొదటిగా : మంత్రం దేవతను ఆవిష్కరించే శబ్దరాశి కనుక – దానిని తపశ్శక్తి ద్వారా గ్రహించి అందించిన ఋషి ఉంటారు. దేవత ఉంటుంది. శరీరాకృతికి అంగాలున్నట్లే, మంత్రానికి ప్రధానాంగాలు : ఋషి, దేవతలతో పాటు – ఛందస్సు,

బీజం, శక్తి, కీలకం, అస్త్రం, నేత్రం, హృదయం, కవచం ఉంటాయి. వాటిని ఆదిగా నమస్కరించాలి.

ఋషులెందరో దర్శించిన వేదమంత్ర రాశిలోంచి దివ్యనామాలను ఏ పద్ధతిలో సమకూర్చితే సర్వదేవమయుడైన నారాయణ తత్త్వం ఆవిష్కృతమౌతుందో దర్శించిన మహర్షి- వ్యాసదేవుడు ఈ మంత్రానికి ఋషి. ఛందస్సు-అనుష్టుప్.

"శ్రీ మహావిష్ణుః పరమాత్మా శ్రీమన్నారాయణో దేవతా" అని ప్రతిపాదించారు. వ్యాసులవారు "దేవోభగవాన్ దేవకీసుతః" అని శ్లోకరూపంలో చెప్పారు. అయితే - రామభక్తులుగానీ, కృష్ణభక్తులుగానీ, నృసింహభక్తులుగానీ ఈ సహస్రనామాలతో తమ దైవాన్ని అర్చించవచ్చు. ఈ కారణం చేతనే కొన్ని పాఠాంతరాలలో "కృష్ణదేవతా" వంటివి ప్రస్తావించారు. ఆ దృష్టితో చూస్తే ఈ నామాలన్నీ శ్రీకృష్ణునివిగా గోచరిస్తాయి. అలాగే మొత్తం రాముడు సైతం దర్శనమిస్తాడు. నృసింహుడు మొత్తంగా గోచరిస్తాడు. ఇలా ఏ నారాయణ రూపంపై నైనా ధ్యాననిష్ఠను ఏర్పరచుకోవచ్చు.

మంత్ర స్వరూపాన్ని వివరించాక కొందరు న్యాసాలను వివరించారు. నిత్యపారాయణలో ఈ న్యాసాదులు తరువాతివారు సమకూర్చినవి. వాటిని కాదనవలసిన పనిలేదు గానీ - వాటి ప్రస్తావన లేకుండా కూడా ఈ స్తోత్రాలను పారాయణ చేసుకోవచ్చు. ఈ న్యాసాలు కూడా ఒక్కొక్కచోట ఒక్కొక్క మాదిరిగా ఉన్నాయి. ఈ మహామంత్రాల రాశిలో కొన్నిటినే ఏది ఎలా న్యసించవచ్చో, వారివారి దృష్టికి తోచిన అభిప్రాయాలననుసరించి ఏర్పరచారు. కనుక వాటిని ఇక్కడ పేర్కొనడం లేదు.

ఈ నామశాస్త్రంలో గొప్పతనమేమిటంటే - సన్నివేశబలం. ఆచార్యుడు కృష్ణ మనస్కుడు, పరమ భాగవతుడు. ఈ మంత్ర ఋషి వ్యాసుడు, దేవతయైన కృష్ణ నారాయణుడు అక్కడే సన్నిహితులై ఉన్నారు. అంతేకాక మహర్షి సమూహమంతా పరివేష్టించి ఉన్నారు. ఇటువంటి చోట ఆవిష్కరింపబడిందీ సహస్రనామవిద్య.

"భూరినామ వన్దమానో దధాతి పితావసో యది తజ్జోషయాసే"

"కీర్తేన్మం నామమఘ వా బిభ్రత్"

"శ్రవసే నామదధే"

"... ధర్మాహవిరస్మినామ"
"సదాతే నామ స్వయశో వివిచ్మి"
"దేవిశ్రియో దధిషే నామ వీరః"
"భర్గోహ నామోత యస్యదేవాః"
"దేవత్వం నా మబుతం సపన్తః"
"మనామహే చారుదేవస్య నామ"
"అస్య జానన్తో నామచిద్ వివిక్తన మహస్తే విష్ణో సుమతిం భజామహే"
"దధానా నామ యజ్ఞియం"
"మర్తా అమర్త్యస్యతే భూరినామ మనామహే" – *ఈ ఋగ్వేద మంత్రాలు,*
"యస్య నామమహద్యశః" – *వంటి యజుర్వేద మంత్రాలు నామవైభవం వేదాలలోనే విస్తృతంగా చెప్పబడిందని ఋజువు చేస్తున్నాయి. "నామస్మరణాదన్యో పాయం నపిపశ్యామో భవతరణే" అనే నామస్మరణ సంప్రదాయానికి మూలం వేదమే అనడానికి ఇవి ప్రమాణాలు. నామస్మరణలోనున్న మహిమ, ప్రభావాలను పై వేదవాక్యాల ద్వారా గ్రహించవచ్చు.*

వెయ్యి నామాలే ఎందుకు?

'సహస్రనామం' అనే అంశంలో మరో విశేషముంది.

పరమాత్ముడు అనంతుడు. ఆయన శక్తి, తత్త్వం అనంతం. కానీ ఆయనను అనుసంధానించి ఉపాసించే మనకు అంతం ఉంది. మరి అనంతాన్ని ఉపాసించిన ఫలం లభించేదెలా! అనంతత్వాన్ని తెలియజేసే సంఖ్యలు – శతం, సహస్రం. **"శతమనంతం భవతి"** అని వేదం. "సహస్రాక్షః, సహస్రపాత్, సహస్రబాహూ, సహస్రమూర్ధా" – ఈ శబ్దాలు పరమాత్ముని అనంత దర్శనశక్తి, అనంత గమనశక్తి, అనంత వ్యాపక శక్తిని తెలియజేస్తాయి. ఆ అనంతత్వానికి సంకేతం సహస్రం. అనంతనాముడు, అనంతరూపుడు అయిన నారాయణుని అనంతత్వాన్ని కీర్తించిన ఫలం 'సహస్రం' తోనే సాధ్యం.

'విశ్వం'తో మొదలై **'సర్వప్రహరణాయుధః'** నామంతో పూర్తయ్యే వెయ్యినామాలు మూలగ్రంథంలో ఉన్నాయి. తరువాత వాటికి మరో ఎనిమిది నామాలను కలిపి

'అభిరక్షతు' అని అనుసంధానించారు మహాత్ములు. దీనితో ఒక అద్భుతమైన కూర్పు ఏర్పడింది. 'విశ్వం' నుండి ప్రతినామం ఈ 'అభిరక్షతు'తో అన్వయించి 'వేయిపేర్ల విష్ణువు మనల్ని అన్ని విధముల రక్షించుగాక' అనే దివ్యభావన ఏర్పడుతోంది. 1008 సంఖ్యాశాస్త్రం ప్రకారం '9'గా మారుతుంది. ఇది పూర్ణసంఖ్య. పూర్ణమైన బ్రహ్మమును, ప్రణవాన్ని (ఓం కారాన్ని) సూచించే సంఖ్య ఇది.

అష్టోత్తర శతం (108), అష్టోత్తర సహస్రం (1008) కూడా పూర్ణత్వ సంకేతాలు, 'వనమాలీ...' శ్లోకంతో కలిపి '108' శ్లోకాలుగా ఈ సహస్రనామ స్తుతి నిర్మాణం జరిగింది.

ఇది 'భ' చక్రంతో సరిపోతుంది. 27 నక్షత్రాలకు - ఒక్కొక్క నక్షత్రపు 4 పాదాల సంఖ్యతో సరిపెట్టి చూస్తే - నక్షత్ర సంఖ్యతో (27×4=108) సరిపోతుంది. ఖగోళం నుండి విస్తరించి మనల్ని ప్రభావితం చేసే నక్షత్ర గ్రహశక్తుల వైశ్విక చైతన్య ప్రవాహం (Cosmic energy) మనకు అనుకూలంగా మార్చేలా ఈ శక్తిమంతమైన శబ్దవిద్య 108 శ్లోక సంఖ్యలో కూర్చబడింది. జ్యోతిషపరమైన ఈ రహస్యమే అష్టోత్తర శతనామ, శ్లోకాది సంఖ్యగా మన నిత్యానుష్ఠానంలో నిబద్ధించారు పెద్దలు. చూశారా - వ్యక్తి జీవితాన్ని నడిపే నక్షత్రశక్తుల్ని దేవతా శక్తితో ప్రభావితం చేసి మనకు శుభకరంగా మలచేందుకు పెద్దలు ఎంతటి విజ్ఞానాన్ని మన నిత్యకృత్యాలలో కలిపివేశారో!

భానాం విక్రమతాం భేషు
రూపాణ్యష్టోత్తరం శతం ।
వేద్మి వచ్మి తతశ్చార్థాన్
తతోస్మ్యష్టోత్తరం శతం ॥

'నాడీ తత్త్వదర్శనం' (సత్యదేవవాసిష్ఠ) లోని ఈ శ్లోకం మరో అద్భుతాన్ని చెబుతోంది. 'భ' చక్రంలో (రాశిచక్రంలో) కాంతి సంచారం 108 విధాలుగా ఉంటుందని జ్యోతిషశాస్త్రం.

సూర్యమండలంలో దీపించే నారాయణ తేజస్సును మనం ఉపాసిస్తాం. భూమిపై సర్వజీవకోటికీ ఆధారమదే. అనాదిగా ఈ వేదభూమిలో ఉపాసించే అగ్నిహోత్రం

సూర్యతేజస్వరూపమే. సర్వదేవతాత్మకమైన ఆ సౌరాగ్ని ద్వారా దేవతాతృప్తికరమైన యజ్ఞాలను నిర్వహిస్తారు. పూర్తి భ చక్రంలో సంచరించే సంపూర్ణ సూర్య తేజశ్శక్తికి సంకేతంగా '108' సంఖ్య. ఈ సంఖ్యతో ఉపాసించే నామాలు, శ్లోకాలు యజ్ఞం చేసిన ఫలితాన్నిచ్చి దేవతాతృప్తిని కలిగిస్తాయి. ఇదొక రహస్యం.

'విశ్వం శతం సహస్రం సర్వమక్షయ వాచకం' అని మహాభారతం చెబుతోంది. విశ్వం, శతం, సహస్రం, సర్వం... ఇవి అనంత వాచకాలు. అందుకే సహస్ర నామోచ్చారణ అనంతశక్తిమంతుని ఆరాధనకు ఉపయోగిస్తున్నాం. 108 శ్లోకాలతో, 1008 నామాలతో ఆ పూర్ణపురుషుని ఉపాసిస్తున్నాం.

విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరమ్ ।
అనేక రూపదైత్యాన్తం నమామి పురుషోత్తమమ్ ॥ **15**

విశ్వవ్యాపకుడు, జయశీలుడు, మహావిష్ణువు, ప్రకాశశీలుడు, సర్వశాసకుడు, అనేక రూపములతో నున్న దైత్యులను (మనలోని రాక్షస ప్రవృత్తులను) నశింపజేసే బహు అవతార స్వరూపుడైన పురుషోత్తముని నమస్కరించుచున్నాను.

ధ్యానమ్ :

ప్రధానంగా ఇక్కడ 5 ధ్యానశ్లోకాలను పేర్కొన్నారు. మరికొంత మంది ఇంకొన్ని కలిపారు. ధ్యానానికి విష్ణుని ఏ రూపాన్నైనా ఆధారంగా గ్రహించవచ్చు.

ప్రథమంగా –

క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణి విలసత్ సైకతే మౌక్తికానాం –
మాలాకప్తాసనస్థః స్ఫటిక మణినిభై ర్మౌక్తికైర్మండితాంగః ।
శుభ్రైరభ్రై రదభ్రై రుపరి విరచితైః ముక్తపీయూష వర్షైః
ఆనందీ నః పునీయాదరినలినగదా శంఖపాణిర్ముకుందః ॥

ఇది అరుదైన అద్భుతమూర్తి. శ్వేతద్వీప వైకుంఠంలో భాసించే నారాయణమూర్తిని ఇందులో దర్శించవచ్చు.

"క్షీరసాగర తీరాన, స్వచ్ఛమైన వివిధ మణి సమూహాల దివ్యకాంతులతో ప్రకాశిస్తున్న ఇసుకతిన్నెపై, ముత్యాల మాలలతో అలంకృతమైన సింహాసనంపై ఆసీనుడై – స్ఫటికమణుల వలె ప్రకాశించు ముత్యాలతో అలంకరింపబడిన దివ్యాంగములతో ఉన్నవాడు.

శుభ్రమైన ఆకాశం నుండి అమృత మేఘాలు అమృతవర్షాన్ని కురిపిస్తుండగా ఆ దివ్యధారలతో తడిసి ఆనందించే సచ్చిదానంద మూర్తి – శంఖచక్ర గదాపద్మ ధారియైన ముకుందుడు మనలను పవిత్రులను చేయుగాక" !

ధ్యానంలో దీపించే మూర్తి, వర్ణం, ఆయుధాలు, అలంకారాలు అన్నీ సాధకుని వివిధ ప్రయోజనాలను సమకూర్చుతాయి.

ఇది 'ముకుందమూర్తి'. అంటే ముక్తినిచ్చే అమృత స్వరూపం.

పాలసముద్ర తీరం శుద్ధసత్త్వ భూమిక. ముత్యాలమాలల సింహాసనం కూడా నిర్మల సత్త్వ గుణాన్నే సూచిస్తుంది. స్ఫటికము వంటి ముత్యాలను ధరించాడు స్వామి. ఇది త్రిగుణాతీతమైన శుద్ధనిర్వికార తత్త్వానికి సంకేతం. పైనుండి కురిసే అమృతపు జల్లులకు తడిసిన తనువు స్వామిది. అమృతమయమైన ఆర్ద్రత – అపార కారుణ్యానికీ, శాశ్వతానంద తత్త్వాలకు సంకేతం. దివ్యాయుధాలను ధరించిన ఈ ముకుందుని ధ్యానించితే చాలు మనలోని రజోగుణ, తమోగుణ మాలిన్యాలు మాయమై సత్త్వగుణముద్దీపించి మనస్సు శుద్ధమై క్రమంగా నిర్వికారస్థితిని చేరుకుంటుంది. ఈ మణులకాంతులు జ్ఞానానికీ, అమృతత్వం ఆనందానికీ – వెరసి జ్ఞానానందస్థితికి సంకేతం.

రెండవ ధ్యానశ్లోకం :

భూః పాదౌ యస్యనాభిర్వియ దసురనిలశ్చంద్ర సూర్యౌచ నేత్రే
కర్ణావాశాశ్శిరోద్యౌర్ముఖమపి దహనోయస్య వా సోయమబ్ధిః।
అంతస్థం యస్యవిశ్వం సుర నర ఖగ గో భోగి గంధర్వ దైత్యైః
చిత్రం రం రమ్యతే తం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి ॥

"భూమి పాదాలుగా, ఆకాశం నాభిగా, వాయువే ప్రాణంగా, చంద్రసూర్యులే నేత్రాలుగా, దిక్కులే చెవులుగా, స్వర్గమే శిరస్సుగా, అగ్నియే ముఖంగా, సముద్రమే వస్త్రంగా, దేవతలు నరులు పక్షులు గోవులు సర్పములు గంధర్వులు దైత్యులు మొదలైనవారు లోపల ఉండగా చిత్రమై (వివిధ వర్ణములతో) ప్రకాశించే ముల్లోకాలే శరీరంగా ఉన్న సర్వవ్యాపకుడైన విష్ణువును నమస్కరిస్తున్నాను". ప్రపంచాన్ని భౌతిక దృష్టితో కాకుండా భగవన్మయంగా చూడాలి. ముకుందుడు ఎక్కడో వైకుంఠంలో

కూర్చోలేదు. విశ్వమంతా తానై ఉన్నాడు.

తొలుత ముకుందుని హృదయమారా దర్శించి నిర్మలుడైన వాని చిత్తనేత్రానికి విశ్వమంతా విష్ణురూపంగా గోచరిస్తుంది.

పురుషసూక్తం, మహానారాయణోపనిషత్తు వర్ణించిన విరాట్పురుషుని స్వరూపమిది. **"విశ్వరూప ఇతి ధ్యానం"** జగత్తును జగత్తుగా చూస్తే మిథ్య, జగత్తును విష్ణుమయంగా దర్శించడం సత్యదర్శనం. ఇదే ఆదిశంకర హృదయం. మోహం ద్వైతభ్రాంతి - ఆ భ్రాంతితో పరిణామశీలమైన జగము సత్యమని భ్రమ కలుగుతుంది. అలా కాక ఈ జగమున ప్రవేశించి దీపించే మహాచైతన్యం విష్ణువని దర్శిస్తే అది ఏకత్వ దర్శనం. **"పద్భ్యాం భూమిర్దిశఃశ్రోత్రాత్"**,

"స భూమిం విశ్వతోవృత్వా" వంటి పురుష సూక్త మంత్రాలే ఇందులో భావాలు. **మూడవ ధ్యాన శ్లోకం :**

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగమ్ ।
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యాన గమ్యం
వన్దే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్ ॥

"శాంతమే ఆకారముగా గలవాడు, సర్పరాజు (ఆదిశేషువు)పై శయనించినవాడు, పద్మనాభుడు, దేవతలకు ప్రభువు, విశ్వాకారుడు, గగనము (ఆకాశం) వంటివాడు, మబ్బువలె నున్న ఛాయవాడు (మేఘశ్యాముడు), శుభమైన అంగములతో ఉన్నవాడు, లక్ష్మీప్రియుడు, పద్మముల వంటి విశాల నయనములు గలవాడు, యోగుల హృదయాలలో ధ్యానమునకు లక్ష్యమైనవాడు, భవభయములను హరించే సర్వలోకైక నాథుడైన విష్ణువునకు నమస్కారం."

విష్ణు సహస్రనామ స్తుతికి పరమప్రయోజనం శాంతి. తాపత్రయాలు హరించిన తరువాత లభించే శాంతి. **"శాంత్యర్థే వినియుజ్యతే"** -ఆ శాంతమే కైవల్యం. అందుకే ఈ సహస్రనామ పారాయణ.

ఆ నిర్మల శాంతమే ఒక రూపుకడితే అది నారాయణ రూపం. 'శాంతం' సృష్టికి ముందు ఉన్న పరమాత్మ స్థితి. నిర్గుణ వాచకం. ఆ స్వామి సగుణమైనా ఆ అఖండ

నిర్గుణత్వానికి భిన్నంకాదది. ఆ సగుణాకారం శాంతమే. అయితే భుజగశయనమది. సర్పముపై ఎవరూ శాంతంగా శయనించలేరు. శాంతమే రూపమైన నారాయణుడొక్కడే సర్పముపై సైతం శాంతుడు.

అనంత విశ్వవ్యాపక నారాయణ శక్తియే భుజగ సంకేతం. వ్యాపించిన అనంతత్వాన్ని అధిష్ఠించినదీ ఆయనే. విశ్వమూ ఆయనే – విశ్వాతీతుడూ ఆయనే. అందుకే అనంత (భుజగ) శయనుడు.

నిర్గుణం సృష్టికై సగుణమైనప్పుడు భుజగశయనం.

సృష్ట్యారంభానికి అదే మూలం. అందుకే 'పద్మనాభం'. పద్మము వలె వికసనాత్మకమైన సృష్టిని రచించేందుకు సిద్ధమైన హరియాజ్ఞావర్తి బ్రహ్మకు (సృష్టికర్తకు) మూలమైన పద్మము స్వామి నాభి నుండి (**నాభ్యా ఆసీదంతరిక్షం** – అంతరిక్షము నుండి) ఉద్భవించింది.

సృష్టి ప్రారంభమై అనేక దేవతా శక్తులు ఈ విశ్వనిర్వహణకు ఆవిర్భవించారు. అలా ఆవిర్భవించిన సురలందరికీ శాసకుడు నారాయణుడు. తయారైన విశ్వమంతా తన శక్తిని నింపి నిండిపోయాడతడు. అందుకే విశ్వము ఆయన ఆకారమయ్యింది. కొందరు 'విశ్వాధారం' అంటారు. అలా అన్నా సరిపోతుంది.

అతడు గగన సదృశుడు – మేఘవర్ణుడు. నింగి వలె నీలంగా ఉన్నాడని చెప్పి మళ్ళీ ఈ 'మేఘవర్ణుడు' ఏంటి? గగనం వ్యాపకశీలం. ఆకాశము వలె అంతటా వ్యాపించినవాడు. ఆకాశం నిరాకారం. అలాగే స్వామి నిరాకారుడు. కానీ ఉపాసకులను అనుగ్రహించడానికి దివ్యరూపాన్ని ధరించాడు. అది 'మేఘవర్ణం' చల్లని మబ్బు వంటి దేహం. మబ్బులోని నల్లదనమే కాదు – చల్లదనం కూడా స్వామిలో ఉంది. ఆ చల్లదనం కారుణ్యం. ఆ కారుణ్యంతోనే స్వామి రూపం ధరించాడు. రసస్వరూపమది.

"గారవించి దప్పి దీర్చు కాలమేఘమా!" – మనలోని జన్మజన్మల తాపత్రయాల వల్ల కలిగే దాహార్తిని తీర్చే దట్టమైన చలువ మబ్బు స్వామి. ఆ మబ్బు మనసుకి పడితే శాంతం – శుభం. అందుకే ఆ తనువులో ప్రతిభాగమూ శుభాన్నే ప్రసరిస్తోంది. ఆ తనువును వలచినది శ్రీలక్ష్మి.

విశ్వాన్ని నిర్వహించే పోషక విభూతులన్నీ ఆయననే కొలుచుకుంటున్నాయి. ఆ

ఐశ్వర్యశక్తి లక్ష్మి. ఆ లక్ష్మికి ప్రియుడతడు. ఐశ్వర్యం నారాయణార్పణం కావాలని సూచించడమే, శ్రీదేవి విష్ణువును సేవించడంలోని ఆంతర్యం. ఇంత ఐశ్వర్యాన్నీ, దయనీ ప్రపంచానికందించే స్వామి ప్రతి అణువునూ పరిశీలించే వికసనాత్మకమైన విశాలదృష్టితో ఉన్నాడు. అదిగో అవే కమలనయనాలు. యోగుల హృదయాలు ధ్యానించే దివ్యమంగళ విగ్రహమిదే.

ఈ విష్ణుమూర్తి సర్వలోకైక నాథుడు. ఆయనను మనవానిగా చేసుకోగలిగితే ఇంక సంసారజనిత భయాలు ఉంటాయా! అన్నీ పటాపంచలవుతాయి. అందుకే భవభయహరుడు విష్ణువు.

ఇలా భావించి ఈ ధ్యాన శ్లోకాలలోనున్న నారాయణునితో తన్మయులమై సహస్రనామ పారాయణ చేస్తే అది నిజమైన యోగం!

మనసుకి పట్టిన మాధవమూర్తిని మరింత బలంగా హత్తించే ధ్యానశ్లోకాలు :

మేఘశ్యామం పీతకౌశేయవాసం
శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం ।
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం
విష్ణుం వన్దే సర్వలోకైక నాథమ్ ॥

"మేఘము వంటి శ్యామల వర్ణంతో భాసిల్లువాడు, పీతాంబరధారి, శ్రీవత్సలాంఛనాన్ని దాల్చినవాడు, కౌస్తుభము నలంకరించుకున్న తనువుగలవాడు, పావన స్వరూపుడు, తామరల వంటి విశాల ప్రసన్న నేత్రాలతో నున్న సర్వలోక ములకు ఏకనాథుడైన విష్ణువునకు వన్దనము."

సశంఖచక్రం సకిరీట కుండలం
సపీతవస్త్రం సరసీరుహేక్షణం ।
సహారవక్షస్స్థల శోభికౌస్తుభం
నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్ ॥

"శంఖ చక్రములతో, కిరీట కుండలాలతో, పీతవస్త్రంతో, పద్మనేత్రాలతో, కౌస్తుభాలంకృతమైన వక్షఃస్థలంతో, చతుర్భుజాలతో అలరారుతున్న శ్రీమహావిష్ణువు నకు శిరస్సు వంచి వినయ పూర్వకంగా నమస్కరించుచున్నాను."

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః।
భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః॥... 1

1. విశ్వం *2. విష్ణుః* *3. వషట్కారః*
4. భూతభవ్యభవత్ప్రభుః *5. భూతకృత్* *6. భూతభృత్*
7. భావః *8. భూతాత్మా* *9. భూతభావనః*

విశ్వమ్.. 1

1. విశ్వము – జగము (ప్రపంచము) – గోచరాగోచరాత్మకమైన అనంత విశ్వము నారాయణుడే.

   మొదటి నామం – విశ్వం.

   ప్రతివ్యక్తికీ మొదట గోచరించేది విశ్వమే. తొలుత కనబడే ఈ విశ్వమే విష్ణుని రూపమని గ్రహించాలని ఈ ప్రథమ నామం బోధిస్తోంది.

2. విశ్వమునకు కారణమైనవాడు, కార్యమైనవాడు – అని మరొక అర్థం. పరబ్రహ్మకు భిన్నమైనది ఏదీలేదు. అందుకే విశ్వమే నారాయణుడు.

   "బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠం" (ముండకోపనిషత్తు)

   "పురుష ఏవేదం విశ్వం" (ముండకోపనిషత్తు)

   "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః" లోపలా బయటా అంతటా వ్యాపించి నారాయణుడున్నాడు – అని 'నారాయణ సూక్తం'.

3. 'విశతి' – అంటే 'ప్రవేశించెను' అని అర్థం. నారాయణుడు దేనియందు ప్రవేశించి ఉన్నాడో అది 'విశ్వం'.

   కనుక 'విశ్వం' అన్నమాటే 'నారాయణుడు ఇందులో ఉన్నాడు' అని ఎరుక పరుస్తోంది.

"తత్ సృష్ట్వా తదేవాను ప్రావిశత్" "దీనిని సృష్టించి తానే దీనియందు ప్రవేశించాడు" అని తైత్తిరీయ ఉపనిషద్వాక్యం.

"మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ" అని శ్రీకృష్ణ పరమాత్మ "నాకంటె భిన్నమైనది ఏ ఒక్కటీలేదు" అన్నాడు. కనుక విశ్వమంతా భగవంతుడే.

ఈ ఒక్కనామాన్ని తెలిస్తే చాలు. భగవానుడు ఎక్కడోలేడు. కనిపించేదంతా ఆయనే. కనిపించని అనంతమూ ఆయనే – అనే స్పృహ కలుగుతుంది.

'ఈశావాస్య మిదం సర్వం' – ఇదంతా ఆ ఈశ్వరునిచే నిండినది.

4. "విశ్వం అనంత వాచకం" అని మహాభారత వచనం. అంతుపట్టనివాడు.

"విశ్వమశేషం కృత్స్నం సమస్తం నిఖిలాఖిలాని నిశ్శేషమ్ ।
సమగ్రం సకలం పూర్ణమ ఖండం స్యాదనూనకే ॥" అని 'అమరం'.

'వాసు దేవస్సర్వమితి సమహాత్మా సుదుర్లభః' – అంతా 'వాసుదేవుడే' అనే జ్ఞానం కలిగినవాడు (బ్రహ్మజ్ఞాని) మహోన్నతుడు – సుదుర్లభుడు. ఆ గొప్పజ్ఞానమే పరమావధి. ఆ జ్ఞానాన్ని స్ఫురింపజేసే నామం 'విశ్వం'. 'అంతా', 'పూర్ణత్వం', 'అఖండం' అయిన పరబ్రహ్మమే విశ్వం.

'హరినీ మయమే అంతాను
అరసి నిన్ను శరణనినాను' అని అన్నమాచార్య పలుకు.

"హరి మయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయింపబని లేదు
హరి మయముగాని వస్తువు
పరమాణువులేదు ... " అని పోతన గారి భాగవత వాక్యం

5. జగములో తాను ప్రవేశించడమే కాదు – చివరకు జగము కూడా తనలోనే ప్రవేశిస్తున్నది. **"యత్ర్పయన్త్యభి సంవిశన్తి"** అని వేదవచనం. ఎవరిలో ఈ

A C. No. 94588

జగము ప్రవేశిస్తున్నదో అతడు 'విశ్వం'.

విశనాద్విశ్వమిత్యాహుః లోకానాం కాశి సత్తమ ।

లోకాంశ్చ విశ్వమేవేతి ప్రవదంతి నరాధిప ॥

సమస్త ప్రాణులలోనూ ప్రవేశించి ఉండడం చేత భగవంతుని 'విశ్వం' అని వ్యవహరించుతున్నాం.

ఈ శబ్దం నపుంసక లింగ శబ్దం. అంటే ఇది నిర్గుణ పరబ్రహ్మ వాచకం. ఓంకారంతో మంత్రం ప్రారంభమైనట్లే, ఈ 'విశ్వం' నామంతో విష్ణునామ మంత్రాలు ప్రారంభమయ్యాయి. పంచాక్షరి, అష్టాక్షరి, ద్వాదశాక్షరి – ఇలా వైదిక దేవతా మంత్రాలన్నీ 'ఓం'తో ప్రారంభమౌతాయి. మంత్రాలు మారుతున్నా 'ఓం'కారం మారదు, మారనిది 'ఓం'. మారినవి 'మంత్రాలు'. పైగా మంత్రంలో ఒక స్పష్టమైన అర్థం కనిపిస్తుంది. ఉదా ॥ నమశ్శివాయ – శివునకు నమస్కారం. నమో నారాయణాయ – నారాయణునకు నమస్కారం. కానీ 'ఓం' కారానికి ఇలాంటి స్పష్టమైన అర్థం లేదు.

సర్వమూలమైన నిర్గుణతత్త్వం 'ఓం' కారం. ఆ ప్రణవంలోని శక్తియే పంచాక్షరిగా, అష్టాక్షరిగా, వివిధ మంత్రాలుగా వచ్చినదని గ్రహించడానికే – నిర్గుణతత్త్వమే వివిధ నామరూపాలతో సగుణమైందని తెలుసుకోడానికే ఈ విధంగా మంత్రాలను జపిస్తాం. ప్రణవమే అన్ని మంత్రాలకు సమన్వయం.

అలాగే 'విశ్వం' సర్వమయమైన పరతత్త్వానికి సంకేతం. అదే తరువాతి నామాలలో విస్తరించింది. వృక్షానికి మూలం వలె వెయ్యి నామాలకు మూలనామమిది.

6. 'విశ్వం' అనే మాట – 'సర్వము'నూ బోధించే 'ఓం' కారమే. అందుకే ఈ నామానికి 'ఓంకారం' అని అర్థం.

'ఓమితి బ్రహ్మ. ఓమితీదం సర్వమ్' – యజుర్వేద ఆరణ్యకం.

'ఓంకార ఏ వేదం సర్వమ్' -ఛాన్దోగ్యం.

'సర్వవ్యాపిన మోంకారం'

'ఓమిత్యేతదక్షరమిదగ్సర్వం' - ఈ శ్రుతి వాక్యాలు 'సర్వము' ఓంకారమేనని చెబుతున్నాయి. ప్రణవమే ప్రథమాక్షరం. **'ఓమిత్యేకాక్షరం'** అని వేదం చెప్పినది. ఆ మాటనే **"గిరామస్మ్యేకాక్షరమ్" "ప్రణవస్సర్వవేదేషు"** అని గీతాచార్యుడు "పలుకులలో ఏకాక్షరమైన ప్రణవాన్ని నేను" అని ఉద్ఘాటించాడు.

"విశ్వశబ్దేన ఓంకారోభిధీయతే.
వాచ్యవాచక యోరత్యన్తభేదాభావాత్.
విశ్వమిత్యోంకార ఏవ బ్రహ్మేత్యర్థః"

అని ఆదిశంకరుల వచనం. "విశ్వశబ్దం ద్వారా ఓంకారం చెప్పబడుతున్నది".

ఈ నామమే సుజ్ఞానం : విశ్వమును భగవద్రూపంగా దర్శించడమే జ్ఞానము. అది కలిగినవాడు భక్తుడు. ఈ జ్ఞానభక్తుడు 'ఇందుగలడందులేడని సందేహమువలదు చక్రి సర్వోపగతుడు' అనీ 'సర్వమున్నతని దివ్యకళామయమ'ని నిత్యం పరబ్రహ్మ యందే నిష్ఠుడై ఉంటాడు. విశ్వమంతా నారాయణుడే కనుక ఆ నిష్ఠ కలిగిన వానికి భిన్నదృష్టి ఉండదు - శత్రు మిత్ర భావాలుండవు. సర్వభూతముల ఎడ ప్రేమ ఉంటుంది.

"ద్రష్టవ్యమాత్మవద్విష్ణుర్మతోయం విశ్వరూపధృక్" (విష్ణుపురాణం)

'నారాయణుడు విశ్వరూపుడు కనుక అందరినీ తన వలెనె చూడాలి' అని పరమభాగవతుడైన ప్రహ్లాదుని వచనం. ఇది భాగవత ధర్మం. భాగవత హృదయం. యోగముల సారం. ఈ జ్ఞానమంతా ఒక్క 'విశ్వం' అనే నామంలో దాగిఉంది.

మొత్తంగా - నారాయణుడెవరు? అనే ప్రశ్నకు 'విశ్వం' అని సమాధానం. మన కంటికి కనిపించేదీ, కనిపించనిదీ అంతుపట్టని ఏ జగత్తు ఉందో అందులో **'ప్రవేశించి ఉన్న చైతన్యము'** దీనికి **'కారణము'** కూడా. మరి ఎలా ప్రవేశించాడు స్వామి? విష్ణువై ప్రవేశించాడు.

విష్ణుః.. 2

1. **'వేష్టివ్యాప్నోతీతి విష్ణుః'** - వ్యాపించి ఉన్నవాడు.

తాను సృష్టించిన జగములో తాను ప్రవేశించిన కారణంగా 'విశ్వం' అని పేరువచ్చిందని మొదటి నామానికి అర్థం చెప్పుకున్నాం. అయితే ప్రవేశించి ఓ మూల ఒదిగి కూర్చోలేదు ఆ బ్రహ్మము. మొత్తం వ్యాపించాడు. నిజానికి రెండు నామాలు ఒకే అర్థాన్ని చెప్పినట్టున్నా కించిత్ భేదం ఉంది. మొదటిది 'పూర్ణత్వాన్ని' తెలియజేస్తోంది. రెండవది 'వ్యాపకత్వాన్ని' చెబుతోంది.

'వ్యాప్య నారాయణ స్థితః'

'తమున్తోతారః పూర్వ్యం యథావిద
ఋతస్యగర్భం జనుషాపిపర్తన ।
అస్య జానన్తో నామ చిద్ వివక్తన మహస్తే
విష్ణో సుమతిం భజామహే ॥ - ఋగ్వేదం.

ఈ నామం సహస్రనామాలన్నిటి 'సారం'. అందుకే ఈ నామాల పేరే ఈ నామమయ్యింది. ('విష్ణు' సహస్రనామం)

"ఓ స్తోతలారా! (స్తుతించువారు) సమ్యక్ జ్ఞానసిద్ధి కోసం విష్ణునామ సంకీర్తనం విధింపబడింది. సత్యసారమైన ఆ పురాణపురుషుని యథార్థ జ్ఞానంతో స్తుతించి జన్మ పరమార్థాన్ని (కైవల్యాన్ని) పొందండి. ఈ విష్ణు నామాలను తెలుసుకొని కీర్తించండి... ఓ విష్ణుదేవా! ఇతరులు కీర్తించినా లేకున్నా మేము నీ శుభావహ తేజస్సును కీర్తిస్తున్నాము" అని ఈ వేదవచన భావం.

2. **వ్యాప్తే మే రోదసీ పార్థ క్రాంతిశ్చా భ్యధికాస్థితా ।**
క్రమణా చ్చాప్యహం పార్థ! విష్ణురిత్యభి సంజ్ఞితః ॥ (మహాభారతం)

ఈ సమస్త రోదసినీ దాటి, దానికంటె అధికుడై నిండినవాడు విష్ణువు.

యస్మాద్విష్టమిదం సర్వం తస్యశక్త్యా మహాత్మనః ।
తస్మాదేవోచ్యతే విష్ణుః విశేర్ధాతోః ప్రవేశనాత్ ॥ (విష్ణు పురాణం)

ఈ సకల ప్రపంచంలో ఆ పరమాత్మ శక్తి ప్రవేశించి యున్నందున ప్రవేశార్థక మైన 'విశ' ధాతువును బట్టి "విష్ణువు" అని చెప్పబడినాడు.

3. **విషిశ్చ వ్యాప్తివచనో ణుశ్చ సర్వత్రవాచకః ।**
సర్వవ్యాపీ చ సర్వాత్మా తేన విష్ణుః ప్రకీర్తితః ॥

'విష్' వ్యాప్తినీ, 'ణు' సర్వత్ర (అన్ని చోట్ల) అనే అర్థాన్నీ చెబుతుంది. సర్వవ్యాపీ, సర్వాత్ముడు కనుక 'విష్ణువు' (బ్రహ్మ వైవర్త పురాణం)

విశ్వంలో స్వామి వ్యాపకశీలుడై ప్రవేశించాడు – అని రెండు నామాలను కలిపి భావించాలి. వ్యాపించినవాడు ఎలా వ్యాపించి ఉన్నాడు?

యజ్ఞస్వరూపుడై.

వషట్కారః.. 3

1. యజ్ఞస్వరూపుడు అని ఈ నామానికి అర్థం.

'యజ్ఞోవై విష్ణుః', 'యజ్ఞోవషట్కారః', 'ప్రజాపతిశ్చ వషట్కారశ్చ' యజ్ఞమే విష్ణువు. యజ్ఞము వషట్కారము. ప్రజాపతి (పరబ్రహ్మ) వషట్కారము– ఇవి వేద వాక్యములు.

సరుద్రో వసువనిర్వసుదేయే నమోవాకే వషట్కారోను సంహితః ।

– అని అథర్వ వాక్యం.

యజ్ఞమంటే 'చైతన్యం' – కదలిక. ఒకదాని నుండి ఒకటిగా సాగే ప్రవాహ శీలత. విశ్వమంతా నిండిన పరమేశ్వరుడు చైతన్యమై ఉన్నాడు. ప్రతి అణువులో కలిగే కదలికే 'యజ్ఞం'. ఇదే విశ్వమంతా జరుగుతున్న నిత్యయజ్ఞం. ఇదే విశ్వానికి 'చక్ర' లక్షణాన్ని చెబుతుంది.

యజ్ఞము గురించి చెబుతూ – భగవద్గీతలో

'ఏవం ప్రవర్తితం చక్రం' – అని వివరించారు.

'అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః'.

'కర్మ'ను తెలియజేస్తుంది యజ్ఞం. విశ్వమంతా వ్యాపించిన విష్ణువు నిత్యం చైతన్య రూపమైన నిర్వహణను చేస్తున్నాడు. విష్ణువు యొక్క కర్మ జగన్నిర్వహణ. అదే 'యజ్ఞం'. లోకహితార్థం చేసే కర్మను యజ్ఞం అంటారు. స్వామి లోక క్షేమానికై సృష్టిస్థితిలయాది చైతన్యక్రియలను నిర్వహించడమే యజ్ఞం.

ఆ యజ్ఞమే ఆయన స్వరూపము.

'వషట్కారః' అన్నంత మాత్రాన 'యజ్ఞం' అనే అర్థం ఎలా చెప్పగలం? యజ్ఞ ప్రక్రియలో – కర్మారంభానికి ముందు '5' పదాలు వాడుతారు. ఆఖరి పదం 'వషట్'. యజ్ఞమునకు అనుమతిని అడగడం, పొందడం జరిగిన తరువాత ఆహుతులను సమర్పించడమనే యజ్ఞక్రియ జరుగుతుంది. ఆ క్రియను సూచిస్తుంది 'వషట్'. దీనికి వెనుకనున్న అనుమతులు మొదలైనవి మనం చేసే యజ్ఞాలలోనే. కానీ విశ్వయజ్ఞ నిర్వాహకునికి అనుమతినిచ్చే దెవరు? ఆయన అడిగేదెవర్ని? అది నేరుగా జరిగే క్రియ. అందుకే 'వషట్'కి వెనుకనున్న నాలుగు శబ్దాలను చెప్పకుండా ఏకంగా 'వషట్కారా'న్నే ఇక్కడ చెప్పారు.

దీనికి వెనుకనున్న **'ఆశ్రావయ', 'అస్తుశ్రౌషట్', 'యజ', 'యే యజామహే'**– శబ్దాల తరువాత **'వషట్'**. హోత అధ్వర్యుల నడుమ జరిగే ప్రేరక, అనుమోదక శబ్దాలు పైనాలుగు. అంతేకాక చివరిదైన 'వషట్' చెప్పడంతో మిగలిన నాలుగు చెప్పబడినట్లే. పది అనే సంఖ్య చెబితే మిగిలిన తొమ్మిదీ దానిలో ఉన్నట్లేకదా! అలా 'ఆశ్రావయ'తో ఆరంభించి 'వషట్'తో ఆహుతులను సమర్పించే యజ్ఞము నారాయణ స్వరూపము.

సత్య ఫలాన్ని ఇచ్చేది యజ్ఞం కనుక

సూనృతా వాగ్ధేనువే యజ్ఞం – అని వర్ణించింది వేదం.

ధేనువు వద్దకు వెళ్లి పాలు పిదకడం వంటిది యజ్ఞప్రకియ. మొదటి శబ్దం 'ఆశ్రావయ' యజ్ఞరూపంలో ఉన్న ధేనువును పిలవడం వంటిది. రెండవది

'అస్తుశ్రౌషట్' పాలు చేపడానికి వత్సను (దూడను) ధేనువు వద్దకు తీసుకువెళ్లడం వంటిది.

మూడవదైన 'యజ' – పాలు పిదికే పాత్రను సిద్ధం చేసుకోవడం వంటిది. నాలుగవ శబ్దం 'యే యజామహే' దోగ్ధ (పాలు పిదికేవాడు) ధేనువును సమీపించడం వంటిది. చివరిదైన శబ్దం 'వషట్' పాలు పితకటం వంటిది. అంటే యజ్ఞక్రియకు లక్ష్యమైన 'అభిమత ఫల రూప క్షీరాన్ని' పొందడం 'వషట్'కారం వల్లనే. కనుక వషట్కారం యజ్ఞఫల స్వరూపం. యజ్ఞ ఫలస్వరూపుడే వషట్కారుడు.

యజ్ఞేశ్వరుడైన వషట్కార స్వరూపునిగా నారాయణుని ఇక్కడ స్మరించడంలో ఉద్దేశం – ఈ సహస్రనామ స్తుతి పారాయణ యజ్ఞము చేయడం వంటిదే.

2. **స్వేచ్ఛయాసర్వం వషట్ (వశ్యం) కరోతీతి వషట్కారః.** సమస్తమును తన వశం చేసుకొనేవాడు.

సర్వస్యవశీ సర్వస్యేశానః (బృహదారణ్యకం)

జగద్వశే వర్తతేదమ్ (భారత. అరణ్యపర్వం)

3. **'వషట్'** శక్తి కలవాడు.

జగమంతా (విశ్వం) నిండినవాడు (విష్ణువు) 'వషట్' శక్తితో నిండి ఉన్నాడు. మొదటి ఈ మూడు నామాలకున్న సంబంధమిది.

'ఓజస్సహశ్శక్తి సంపన్నః వషట్కారః' – అని నిరుక్తం (వేద శబ్దాలకు అర్థం చెప్పే శాస్త్రం). 'వషట్కారుడు' పరమేశ్వరుడే. ఓజస్సహశక్తులను కలిపి 'వషట్' అంటారు.

'ఓజస్సు' అంటే – నిర్వికారమైన మహాబలం. అదే చైతన్యం.

'గామావిశ్యచ భూతాని ధారయామ్యహ మోజసా'

"ఓజస్సుతో ఈ ప్రాణికోట్లను ధరించినది నేనే" – అని భగవద్గీత. ఈ 'ధరించడమే' సహస్సు.

"యద్బలం కామరాగవివర్జితం జగద్విధారణ సామర్థ్యం... ఓజస్" – కామ (కోరిక) రాగ (మోహజనితమైన ప్రేమ) రహితమైన బలము, జగమునంతటినీ భరించే సమర్థత కలిగిన బలము – ఓజస్సు. ఈ ఓజస్సు కేవలం నారాయణునిదే. ఈ ఓజస్సుతో ఈ జగమును 'సహిస్తున్న'ది (ధరిస్తున్నది) ఆతడే. అందుకే 'వషట్కారుడు'.

ఈ శక్తితో ఆయన ధరించి ఉన్నాడు కనుకనే ఈ పృథివి చీలిపోకుండా, విడిపోకుండా ఉంది. గ్రహనక్షత్రాలన్నీ వాటి పరిధుల్లో అవి ఉన్నాయి. అన్నిటినీ ఆయా స్థానాలలో 'పట్టి' ఉంచే 'మహాబల'మే వషట్కారం. అదే ఈశ్వర చైతన్యం. అదే విశ్వమంతా ఉంది.

విశ్వాన్ని పరిశీలిస్తే ఒక అద్భుతమైన నియమమూ, క్రమశిక్షణ, పరాక్రమం కనిపిస్తాయి. ఏ కోరిక కోసం, ఏ మోహంతో ఆయన ఈ బలాన్ని ప్రయోగిస్తున్నాడు? పరిపూర్ణుడైన ఆయనకు ఏ కోరికాలేదు. మోహమూ లేదు. మాయలో ఉన్న మన బలాలు ఒక కోరిక వల్లనో, మోహం వల్లనో ప్రయోగిస్తాం. మాయను దాటితే – 'అట్టి విభుడు బలము' అని గ్రహిస్తే – ఈ మొదటి మూడు నామాలు మనలోని ఆత్మ చైతన్యాన్ని పట్టి చూపిస్తాయి.

◆ ◆ ◆

'అధిక ప్రసంగం'గా కాక – ఒక చిన్న 'అవగాహన'గా పరిశీలిద్దాం:

'ఈ దేహమే విశ్వం. దీనితో సాగే నిర్వహణ అంతా యజ్ఞం. ప్రతి ఇంద్రియం లోనూ ఆత్మచైతన్యం వ్యాపించి ఉంది. కంటికి చూపు, చెవికి వినికిడి, గొంతుకి పలుకు, నాలుకకు రుచి, చర్మానికి స్పర్శ, కాళ్లకు కదలిక, చేతులకు పట్టు... ఇలా 'వ్యాపించిన' చైతన్యం వల్ల (చైతన్యం 'ప్రవేశించి' ఉన్న కారణంగా) ఈ దేహమే (మనోబుద్ధులతో సహా) విశ్వం. ఇందులో ఏ ఇంద్రియానికి ఆ ఇంద్రియం విడివిడిగా 'ఉనికి'ని కలిగిలేవు. అంతా 'కలిపి పట్టి ఉంచిన చైతన్యం' ఒక్కటే. పటిష్టమైన ఆ చైతన్యమే 'ఓజస్సహశ్శక్తి సంపన్నుడు' ఆత్మయే. హృదయములో

నున్న ఆత్మ యొక్క చైతన్యమే దేహమంతా వ్యాపించి, ఓజస్సహశ్శక్తులతో పట్టి ఉంచింది.

బయటి విశ్వంలో ఎలాగో మన విశ్వంలోనూ అలాగే నిర్వహింపబడుతున్నది ఈ చైతన్యం.

ఈశ్వరస్సర్వభూతేషు హృద్దేశేర్జున తిష్ఠతి ।

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥ – అనే గీతా వాక్యంలోని భావమూ ఇదే.

ఇలా మొదటి మూడు నామాలతో అంతర్ముఖ దర్శనం చేస్తే, మనలో కదిలే విశ్వ (విష్ణు) స్వరూపాన్ని చూడగలం.

భాగవతంలో ధ్రువుని విష్ణుస్తుతిని పరిశీలించండి :

యోఽన్తఃప్రవిశ్య మమ వాచమిమాం ప్రసుప్తాం
సంజీవయత్యఖిల శక్తి ధరః స్వధామ్నా ।
అన్యాంశ్చ హస్తచరణ శ్రవణ స్త్వగాదీన్
ప్రాణాన్, నమో భగవతే పురుషాయ తుభ్యమ్॥

విశ్వంలోనే కాదు, మనలోనూ వర్తించే విష్ణుచైతన్య విలసనాన్ని పరిశీలించేందుకు ఉపకరించే గొప్ప సాధన ఈ సహస్రనామ స్తోత్రం. మనలోని 'జీవ' భావాన్ని పారద్రోలి, విష్ణుభావాన్ని విస్ఫురితం చేసే ప్రక్రియ ఇది.

ఈ భావనలో లీనమైతే, ఇంతవరకూ దేహంతో తాదాత్మ్యమై ఉన్న 'నేను' అనే భావం 'బ్రహ్మ'మైన విష్ణువుతో తాదాత్మ్యం చెంది – 'ఉన్నది ఆయన చైతన్యమే' అని ఎరుక కలిగి అదే తానై కరగి కలిసిపోతుంది. అదే 'అహం బ్రహ్మాస్మి' అనే అద్వైతసిద్ధి.

అందుకే విష్ణుసహస్రనామ స్తోత్రాన్ని అనుసంధానించుకోవాలి.

శరీరంలో ప్రసరించే విష్ణు చైతన్యమే వివిధ దేవతలుగా వివిధ ఇంద్రియాలలో, బుద్ధి కేంద్రాలలో పనిచేస్తున్నది. ఇదంతా ఆయనే అని తెలిపే ఏకత్వ దర్శనం కావాలి. అదే **'కిమేకం దైవతంలోకే'** అనే అన్వేషణ.

ఈ దృక్కోణంతో పరిశీలిస్తే ఈ నామాలన్నీ ఆత్మవిద్యగా (బ్రహ్మవిద్యగా) సాక్షాత్కరిస్తాయి. తత్త్వదర్శనంతో పరిశీలిస్తే ఆత్మజ్ఞానమిది. ఉపాసనగా చూస్తే అనంత విశ్వశక్తి చాలకమైన నారాయణుని అనుగ్రహాన్ని పొందే సాధన. వ్యక్తి లోనూ, విశ్వంలోనూ నిండిన ఏక చైతన్యాన్ని దర్శించడమనే ఆధ్యాత్మిక దృష్టిని విస్తరింపజేస్తుంది ఈ నామవిద్య.

ఈ సుదీర్ఘ వివరణను విషయాంతరం క్రింద భావించకుండా, అంతర్ముఖ సాధనగా, వేదాంత విద్యగా ఈ నామాలను వినియోగించుకొనే ఒక ఆలోచనగా గ్రహించ ప్రార్థన. అస్తు.

◆ ◆ ◆

'విశ్వం' అంటే దేశం, కాలం, క్రియ. పరమాత్ముని విశ్వమంతటా దర్శించే విజ్ఞానంతో పై మూడు నామాలు (విశ్వం, విష్ణుః, వషట్కారః) దేశాన్నీ, క్రియనీ చెప్తున్నాయి. తరువాత కాలస్వరూపం. దేశం - కాలం ఈ రెండూ అంతుపట్టనివి. ఎంత దూరం? ఎంత కాలం? - ఈ ప్రశ్నలే మనిషిని నిత్యాన్వేషకుని చేస్తున్నాయి. ఆ అనంత చైతన్యమే 'విశ్వం' శబ్దం ద్వారా 'దేశాన్ని' (Space) చెప్తున్నది. తరువాతి నామాలు (Time) కాలాన్ని చెప్పేవి.

భూతభవ్యభవత్ప్రభుః.. 4

అనంత వ్యాపకతని మొదటి మూడు నామాలు చెబితే, ఆ వ్యాపకత్వం కాల విషయంలో కూడా అనంతమేనని ఈ నామం చెబుతోంది. దేశపరిమితి, కాల పరిమితి లేని పూర్ణచైతన్యమే విష్ణువు. అనంతతత్త్వాన్ని అర్థం చేసుకోవడమే బ్రహ్మజ్ఞానం.

భూతం-గతం, భవ్యం-భవిష్యత్, భవత్ - వర్తమానం. మూడు కాలాలను, ఆ కాలాలలోని విశ్వాన్ని శాసించే పాలకుడు.

ఈ మూడు విడివిడిగా చూడడం పరిమిత దృష్టి. గతం అపారం. భవిత

వ్యమూ అనంతమే. ఈ రెండింటి నడుమ బిందువు వర్తమానం. నిజానికి ఈ విభజన సాపేక్షం (Relative). ఈ మూడింటా విస్తరించిన కాలాత్మకుడు పరమాత్మ. ఆ చైతన్యానికి కాలపరిమితి లేదు.

స్వామిపాలన ఒక కాలంలో ఉండి ఒక కాలంలో పోయేదికాదు.

సర్వకాలాలలోనూ ఏకైక పాలకుడు ఆయనే.

పురుష ఏ వేదం సర్వం యద్‌భూతం యచ్చ భవ్యమ్ ।
ఉతామృతత్వస్యేశానః యదన్నేనాతిరోహతి ॥

– అనే యజుర్వేదమన్త్రం కాలాన్ని శాసించే, కాలాతీతుడైన పరమాత్మునే సూచిస్తోంది.

యోభూతం చ భవ్యం చ సర్వం యశ్చాధితిష్ఠతి ।
సర్వస్య చ కేవలం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణేనమః. – అథర్వవేదం.

"అహమేవ అక్షయః కాలః" "కాలోస్మి లోకక్షయకృత్" "కాలః కలయతామహం" – అని భగవద్గీత. "అక్షయ (అనంత)మైన కాలాన్ని నేనే" "లోకమును కబళించే కాలాన్ని నేనే" "గణన చేసి, విభాగించే కాలస్వరూపుడను నేనే" అని పరమాత్మ వచనం. వ్యాపక లక్షణం కలిగి, కాలస్వరూపుడైన విష్ణువు సమస్త ప్రాణికోట్ల సృష్టి స్థితి లయలను చేస్తున్నాడని చెబుతూ, ఇప్పుడు 'వస్తు పరిమితి'ని దాటినవాడని వస్తుజాతాన్ని (భూతాలను) ప్రస్తావిస్తున్నాడు.

భూతకృత్ .. 5

1. భూతములను (ప్రాణికోట్లను, పంచభూతాలను, స్థావరజంగమాలను) కలిగించేవాడు. 'సృష్టికర్త' అని భావం. **'తపసస్తన్మహినా జాయతైకమ్'** – అని 'ఋగ్వేదం'. తన మహిమతో జగత్ సృష్టికి హేతువైనవాడని మంత్రార్థం. **'యతోవా ఇమాని భూతాని జాయన్తే'** (తైత్తిరీయం),
2. ఈ శబ్దానికి మరో అర్థం. 'భూత నాశకుడు'. **'భూతాని కృన్తతి, కృణోతి'**

భూతకోటిని లయం చేయువాడు.

ఇలా ఒకే నామం స్వామి యొక్క రెండు కృత్యాలను చెప్తుంది. భూతకారకుడు, భూతలయకర్త - నారాయణుడే. రజోగుణంతో సృష్టించి, తమోగుణంతో లయం చేసే స్వామి. సృష్టికీ, లయకీ నడుమన ఉన్న స్థితి కూడా అయన కృత్యమేనని తరువాతి నామం.

భూతభృత్ 6

భూతాని బిభర్తీతి భూతభృత్ - భూతములను భరించువాడు .- పోషించువాడు. సత్త్వగుణంతో స్థితిని కలిగించువాడు.

'విశ్వం బిభర్తి భువనస్య నాభిః' లోకమునకంతటికీ (కేంద్ర) నాభి స్థానమై ఉండి సమస్తమును భరించువాడని శ్రుతివాక్యం.

బండిచక్రానికి ఇరుసువలె విశ్వచక్రపు సృష్టిస్థితిలయల క్రమానికి ఆధారమైనవాడు.

'బిభర్త్యవ్యయ ఈశ్వరః' అని గీతావచనం. శాశ్వతుడైన ఈశ్వరుడే భరించువాడు.

ఇలా అయిదు, ఆరు నామాలు సృష్టిస్థితిలయ కారకుడైన నారాయణుని చెబుతున్నాయి. 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై, ఎవ్వనియందు డిందు....' అనే గజేన్ద్రుని ప్రార్థనలోని తొలివాక్యం ఇదే. ప్రాణికోట్లు కలిగి, పెరిగి, కరిగిపోతున్నా - వాటికి ఆధారమైన భగవచ్చైతన్యం మాత్రం మారదు. అది కేవలం 'ఉనికి'గా ఉన్నది. దీనినే 'సత్తా' మాత్రం అంటారు. అదే తరువాతి నామం.

భావః.. 7

1. **భవతీతి భావం.** ఉన్నవాడు – అని అర్థం.
   'ఉనికిగా ఉన్నవాడు', అస్తిత్వమూ, సత్తా నారాయణుడే. సముద్రములో అలలు కలిగి పెరిగి విరిగి తరిగి పోతున్నా, వాటికి హేతువైన 'ఉనికి' మాత్రమూ నిర్వికారంగానే ఉంటుంది. దీనినే 'కేవలత్వం' అంటారు.
2. కాలమే భావము. **భవంత్యస్మిన్నితి భావః.** దేనియందు అన్నీ కలుగుతున్నాయో అది. కాలంలోనే కలిగేది జగత్తు కనుక – కాలాన్ని కూడా 'భావం' అన్నారు. అందుకే కాల చక్రాన్ని ఆధారం చేసుకున్న జ్యోతిషవిద్య 'భావాల' గురించి చెప్పింది. ద్వాదశ భావాలు జ్యోతిషశాస్త్రంలో ఉన్నాయి. తనుః, ధనం, భ్రాతృ, సుఖం, పుత్రః, శత్రుః, కళత్రమ్, మరణమ్, ధర్మః, కర్మ, ఆయః, వ్యయః. వీటికి రాశులు – వాటికి గ్రహములు అధిపతులు.
   తమీశానం జగతస్తస్థుషస్పతిం ధియం
   జిన్వమవసే హూమహే వయమ్। **(యజుర్వేదం)**
   జగత్తులోనున్న గ్రహాదిస్థానాలకు కూడా పతియైన నారాయణుడు ఈ భావస్వరూపుడై ప్రాణికోట్ల మనుగడకు హేతువౌతున్నాడు. అందుకే 'భావః'. పురివిప్పిన నెమలి వలె జగత్తును కలిగించి క్రీడించే తాను, పురిని వదిలినా ఉండే నెమలిలా నిత్యము ఉండేవాడు.
3. కాలమునకు కూడా ఉనికియైన వాడు పరమాత్మ. మనలో కాలంతో పాటు ఎన్నో అవస్థలు, అనుభవాలు కలిగి కరిగిపోతున్నా ఉనికిగా ఉన్న (సత్తామాత్ర) చైతన్యం అలాగే ఉంది. బాల్య యౌవన వార్ధక్యాలు, జాగ్రత్ స్వప్న సుషుప్తులూ ఇవన్నీ భూతములే (కలిగెడివే). అవి కలగడానికీ తొలగడానికీ ఆధారమైన 'నేను' అనే చైతన్యం మాత్రం మారడం లేదు. అవస్థలలో భాగంగా తుది అవస్థ (మరణం) తరువాత దేహం మారినా ఆ చైతన్యం మారదు. అదే 'భావం'! ఈ 'ఉనికి' (భావం) భూతాలలో వ్యాపించిన ఆత్మయే. అదే తరువాతి నామం.

భూతాత్మా .. 8

1. సకల భూతములకు ఆత్మయై ఉన్నవాడు. ప్రతివాని యందు ఉన్న ఆ ఆత్మయొక్క చైతన్యమే మనుగడకు మూలం. **ఆతనోతి – వ్యాప్నోతీతి – ఆత్మా**, ప్రాణికోట్ల యందంతటా వ్యాపించిన చైతన్యమే ఆత్మ.

'ఏషత ఆత్మాన్తర్యామ్యమృతః' – 'ఇతడే యాత్మ, అంతర్యామి, అమృతుడు'. నశించే దేహాలలో నశించని ఉనికియే ఆత్మ.

యస్స సర్వేషు భూతేషు నశ్యత్సున వినశ్యతి – (భగవద్గీత)
భూతజాలములు నశించినా తాను నశించనిది.

2. **'పంచభూతాత్మ భూతాయ'** అని స్తుతించారు స్వామిని. భూతమయమైన జగత్తు శరీరమైతే, సర్వజగన్నియామకమైన చైతన్యం 'భూతాత్మా'.

'జగత్ సర్వం శరీరంతే' – అని రామాయణంలో శ్రీరాముని స్తోత్రించారు. **'తత్సర్వం వై హరేస్తనుః'.**

ఈ ఆత్మ చైతన్యము వలనే ప్రాణికోట్ల – భూతముల సృష్టి, పోషక, ధారకత్వములు కలుగుతున్నాయి. అదే తరువాతి నామం.

భూతభావనః.. 9

భూతములు పుట్టి పెరగడానికి కారణమైన వాడు. వృద్ధిచేయువాడు. 'భవం' అంటే పుట్టుట, కలుగుట. 'భావన' అంటే 'పుట్టించుట', 'కలిగించుట'. అలాగే ఈ శబ్దానికి 'రక్షించుట' అని కూడా అర్థం. ఈ మూడు పనులు చేసేవాడు భూతభావనుడు. **'భూతభావన! భూతేశ! దేవదేవ జగత్పతే"** అని గీతలో అర్జునుడు పరమాత్మను స్తుతించాడు.

ఈ మొదటి శ్లోకం ద్వారా దేశ-కాల-వస్తు పరిమితులను దాటిన చైతన్యమే విష్ణువని స్పష్టమయింది. **'భూతస్యజాతః పతిరేక ఆసీత్'** (ఋగ్వేదం) భూతములకు కారణమైన పతి ఒకడే. ఇలా అనేక ప్రాణికోట్లను కలిగించి నడిపిస్తున్నా, వాటి వికారాలేవీ అంటనివాడు అతడే. గుణాధీనుడు కాడు కనుక అతడు 'పూతాత్మా'.

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః।
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ॥ 2

10. పూతాత్మా, 11. పరమాత్మా, చ, 12. ముక్తానాం పరమాగతిః,
13. అవ్యయః, 14. పురుషః, 15. సాక్షీ,
16. క్షేత్రజ్ఞః, 17. అక్షరః, ఏవ, చ॥

పూతాత్మా ..10

ప్రాణుల ఉత్పత్తి మొదలైన వాటికి అతడే ఆధారమైనా, వారి జీవ గుణాలతో సంబంధంలేని పరిశుద్ధుడు కనుక 'పూతాత్మా'. అనేక వస్తువులలో విద్యుత్తు వ్యాపించినా వస్తు వికారాలేవీ విద్యుత్తుకి అంటవు. విద్యుత్తులేనిదీ ఆ వస్తువులు పనిచేయనూలేవు. ఆ అంటని లక్షణమే పూతత్వం – పవిత్రత, నిర్మలత. సూర్యోదయ సూర్యాస్తమయాలను ఆధారం చేసుకొని ప్రతివారు పనులు చేస్తున్నా ఆ పనుల వికారాలు సూర్యునకు అంటనట్లే – కేవలుడై సాక్షియై ఉన్న పరమాత్మ నిత్యశుద్ధుడు. **'సాక్షీ చేతో కేవలో నిర్గుణశ్చ'** అని వేదం ఆయనను వర్ణించింది.

"సం భోగ ప్రాప్తిరితి చేత్ న" – పరమాత్మకు భోగముతో సంబంధం లేదని 'బ్రహ్మసూత్రం'.

'ఏ ష సర్వ భూతాంతరాత్మా అపహత పాప్మా' – అని ఉపనిషత్తు. సర్వ భూతములకు అంతరాత్మ, ఏ దోషమూ లేనివాడు. ఆకాశంలో అన్నీ కలుగుతున్నా, ఆకాశానికి ఏవీ అంటనట్లుగా అన్నిటికీ ఆధారమైన ఈతడు నిత్య శుద్ధుడు.

నమాం కర్మాణి లింపన్తి – అని గీతలో, "నన్ను ఏ కర్మలూ అంటవు" అని పరమాత్ముని వచనం.

పశ్యదేవస్య మాహాత్మ్యం మహిమానం చ నారద।

శుభాశుభైః కర్మభిర్యః నలిప్యతి కదాచన ॥ (మహాభారతం)

'శుభాశుభ కర్మలు అంటనివాడు ఈతడు. ఇదే ఈతని మహిమ'.

'యత్తే పవిత్ర మర్చిష్యగ్నే వితతమన్తరా' - పవిత్రమైన ఈతడే అన్తరములో వ్యాపకుడు.

సర్వ భూతములకు నియామకుడైన ఆత్మ ఇతడైతే, ఈతనిని నియమించేవారెవరు? ఎవ్వరూ లేరు. ఆ కారణం చేతనే, ఈతడు...

పరమాత్మా .. 11

1. ఈ ఆత్మయే అన్నిటికీ పరమమైనది. అతీతమైనది. నిర్మలత్వము అతీతస్థితిలోనిది. అందుకే పూతాత్మయే పరమాత్మ.

హృదయాలలో సాక్షిగా ఉన్న ఆత్మ యొక్క ఉనికి చేతనే దేహేంద్రియ మనో వ్యాపారాలన్నీ సాగుతున్నాయి. ఆ ఆత్మ నిర్మలము (పూతాత్మా). మనస్సు ఇంద్రియాల నుండి మరలి, క్రమంగా ఆత్మలో లయమైపోతే అదే మోక్షం **(మనోలయో మోక్షః)**. ఆ ఆత్మకు ఏవీ అంటవు. అది ఇంద్రియాలకు, మనోబుద్ధులకు కూడా పరమైనది. అందుకే అది పరమాత్మ. భూతాలలో (ప్రాణికోట్లలో) ఉన్నంతసేపు 'భూతాత్మ'. అయినా వాటికి అంటకుండా ఉంది కనుక 'పూతాత్మ'. అంతేకాదు వాటికి అతీతంగా, శాశ్వతంగా ఉంది కనుక 'పరమాత్మ'. ఇంతకు మించినది లేదు - ఇదే పరమం.

ఇంద్రియేభ్యః పరాహ్యర్థా, అర్థేభ్యశ్చపరం మనః ।
మనసస్తు పరాబుద్ధి ర్బుర్ధేరాత్మా మహాన్పరః ॥

- అన్న ఉపనిషత్సూక్తి, గీతోక్తి ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. ఇంద్రియాల కన్నా వాటి ప్రయోజనాలైన శబ్ద స్పర్శ రూపాదులు పరములు, వాటికన్నా పరము మనస్సు. దానికన్నా పరము బుద్ధి. దాని కంటే పరము ఆత్మ. మనో బుద్ధులను దాటిన ఆత్మయే పరమాత్మ.

కార్యానికీ కారణానికీ కూడా విలక్షణమైన 'నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావుడు'.

2. తాను సర్వులకు ఆత్మ. తనకు మరొక ఆత్మలేదు.

'తదేతద్బ్రహ్మ ఽపూర్వమ్' (బృహదారణ్యకం) – కారణరహితుడు ఈ బ్రహ్మమే.

'ఋచో అక్షరే పరమే వ్యోమన్' – వ్యాపక శీలమైన శాశ్వతమైన ఈ పరతత్త్వము నందే అన్నీ అధివసించినవి.

విశ్వం వ్యాప్యతియోదేవః ఏతస్మాత్ పరతఃస్థితః ।
పరస్మై శ్రీమతే తస్మై విష్ణవేస్తు నమోనమః ॥

విశ్వమంతా వ్యాపించినప్పటికీ దీనికి అతీతంగా ఉండే పరముడైన విష్ణునకు నమస్కారం.

'ఆత్మేశ్వరమ్ శాశ్వతం' (తైత్తిరీయ నారాయణం) – తనకు తానే ఈశ్వరుడైన శాశ్వతుడు.

న తత్సమ శ్చాభ్యధి కశ్చ దృశ్యతే – (శ్వేతాశ్వతరోపనిషత్తు).
ఆ బ్రహ్మమునకు సమమూ, అధికము లేదు.

మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ॥ – అని గీతాచార్యుని వచనం.

పరఃపరాణామ్ పరమః పరమాత్మా (విష్ణుపురాణం)
అన్ని బంధములను విడిచిన వారు – దేహేంద్రియ మనోబుద్ధ్యాదులతో తాదాత్మ్యాన్ని వదలిన వారు ఈ పరమాత్మనే పొందుచున్నారు కనుకనే–

ముక్తానాం పరమాగతిః.. 12

బంధరహితులకు పరమమైన గతి. అంటే– బంధరహితులు తుదకు చేరు చోటు. దేహేంద్రియ మనో బుద్ధులతో ఆవృతమైన జీవభావం వాటిని వదిలితే పొందే స్థితి 'పరమాత్మస్థితి'. ఆ వదలడాన్నే 'ముక్త' అంటారు. అలా వదిలిన వారు ముక్తులు. ఆ స్థితిని చేరితే తిరిగి బంధనముండదు. **'యద్గత్వాననివర్తన్తే తద్ధామ పరమం మమ'** దేనిని చేరితే పునరావృత్తి ఉండదో అదే పరమగతి – పరంధామం. ముక్తులు చేరుకొనే ఆ పరంధామము నారాయణ బ్రహ్మము.

ముక్తులైన యోగీశ్వరులు (సంసార బంధనము నుండి విడివడి, పరమాత్మతో కలయిక కలిగినవారు) ఆయననే ఆశ్రయించుకొని ఉంటారు. వారికి మరి రెండవ విషయం లేదు. బ్రహ్మముతో తాదాత్మ్యం చెంది ఉంటారు.
ముక్త పురుషులు జ్ఞానులు. వారు పూర్ణంగా పరమాత్మను తెలిసినవారు. అందుకే వారు ఏ కారణమూ, ప్రయోజనమూ లేక ఆయననే ఆశ్రయించి ఉంటారు.

ఆత్మారామాశ్చమానయో నిర్గంథా అప్యురుక్రమే ।
కుర్వంత్యహైతుకీం భక్తిం ఇత్థం భూత గుణోహరిః ॥ భాగవతం॥

"ఆత్మారాములు (తమయందు తాము ఆనందించువారు), మననశీలురు, కర్మబంధములు విడివడినవారు నారాయణుని యందు ఏ నెపమూలేని (అహైతుకీ) భక్తిని కలిగి ఉంటారు – పరమాత్మ అయిన నారాయణుని గురించి తెలిసినవారు కనుక."

ధీరులు నిరపేక్షులు ఆ–
త్మారాములునైన మునులు హరిభజనము, ని–
ష్కారణమున జేతురు ఆ
నారాయణుడట్టివాడు నవ్యచరిత్రా ॥ *(పోతన – భాగవతం)*

అంతేకాక –

ముక్తసంగులైన మునులు దిగ్వస్త్రులు
సర్వభూతహితులు సాధుచిత్తులు
అసదృశవ్రతాఢ్యులై కొల్తురెవ్వని
దివ్యపదము, వాడు దిక్కు నాకు

– అని గజేంద్రుని మొర. ముక్తులకే దిక్కైనవాడు, ఇంక మిగిలిన వారికి దిక్కు – అని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ముక్తులు పొందే తుది గమ్యం–
"తద్విష్ణోః పరమపదం సదాపశ్యంతి సూరయః" – శ్రుతి.
ఆ విష్ణుడే పరమపదం – అదే పరమాగతి. దానిని ముక్తులు అందుకుంటున్నారు. వారే సూరులు.

'మాముపేత్యతు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే' – నన్ను పొందిన ఎడల పునర్జన్మ సంభవించదని భగవానుని వచనం.

తదా విద్వాన్ పుణ్య పాపాద్విముక్తః
జ్ఞాత్వాదేవం ముచ్యతే సర్వపాశైః ॥ ***(శ్వేతాశ్వతరోపనిషత్తు)***

'విద్వాంసుడు (జ్ఞాని) పుణ్యపాపముల నుండి విడివడి, ఆత్మను ఎరిగి సమస్త పాశముల నుండి ముక్తుడౌతాడు'

శుకాదులు ముక్తులు. వారున్న 'పరమగతి' నారాయణ తత్త్వమే. ఆ తత్త్వం నాశనరహితం. అందుకే అక్కడ చేరిన వారు తిరిగి వెనకకు రారు.

అవ్యయః .. 13

1. తరుగుదల (నాశనము) లేనివాడు. వినాశనం, మార్పులేక కాలముతోపాటు మారని తత్త్వమది.
   'అజరః అమరః అవ్యయః' – (బృహదారణ్యకోపనిషత్తు).
2. **న వీయతే నవ్యపగమ్యతే అస్మాదితి అవ్యయః**
   దీనిని పొందినవాడు తిరిగి సంసారమునకు మరలడు. 'పరమాగతిః' యొక్క స్థితే ఇది.
   'న చ పునరావర్తతే న చ పునరావర్తతే' అని ఛాందోగ్యం చాటి చెప్పింది. బ్రహ్మసూత్రాలు సైతం **'అనావృత్తిః శబ్దాత్. అనావృత్తిః శబ్దాత్'** అని ఘోషించాయి.
3. వ్యాకరణ శాస్త్ర రీత్యా చూసినా –
   సదృశం త్రిషులింగేషు సర్వాసు చ విభక్తిషు ।
   వచనేషు చ సర్వేషు యన్నవ్యేతి తదవ్యయమ్ ॥ (మహాభారతం)
   త్రిలింగాలు (స్త్రీ పుం నపుంసకాలు), విభక్తులు (ప్రథమాది విభక్తులు), ఏక, బహువచనాదులు వేనికి లేవో – ఆ నిర్గుణతత్త్వమే **'అవ్యయః'**. తరుగుదల లేనివాడు గనుకనే,

పురుషః .. 14

1. **'పూర్ణత్వాత్ పురుషః'** - పూర్ణత్వము కలవాడు.
2. **ఆసీత్ పురాపూర్వమేవ** - తొలుత (పురా) ఉన్నవాడు పురుషుడు.
   పురము(దేహం) ఏర్పడక ముందే (పూర్వమే) ఉన్న ఆత్మ-పురుషుడు.
3. **నవద్వారం పురం పుణ్యమేతైర్భావైస్సమన్వితం ।**
   వ్యాప్యశేతే మహాత్మా యస్తస్మాత్పురుష ఉచ్యతే ॥ (మహాభారతం)
   ఆ అవ్యయ పరమాగతి ఎక్కడో విశ్వానికి ఆవల లేదు. మనలోనే ఉన్నది. నవద్వార పురమే దేహం. దీనికి వెలుగూ, చైతన్యమూ లోపలున్న పరమాత్ముని వల్లనే. ఈ పురంలో వ్యాపించి ఉన్నవాడు (శేతే) పురుషుడు.
4. **పురుషు భూరిషు ఉత్కర్ష శాలిషు సత్త్వేషు సీదతి**
   ఉత్కృష్టులైన మహాత్ములలో, గొప్ప వస్తువులలో 'విభూతి'గా దీపించేవాడు నారాయణుడే. **'మయి తే తేషుచాప్యహం'** - సర్వత్ర నారాయణునే అనుభవిస్తున్న మహాత్ముల యందు ఆయన స్పష్టంగా గోచరిస్తాడు. వారిలో ప్రకాశమానుడు కనుక 'పురుషుడు' - ఉత్కృష్టుల యందుండువాడు. గీత విభూతి యోగము స్మరణీయం.
5. **"పూరణాత్ సదనాచ్చైవ తతోసౌ పురుషోమతః"** - మహాభారతం.
   పూర్ణత్వాత్ పూరణాద్వా సదనాద్వా పురుషః-
   పూర్ణత్వం వలన, పూరణ (నిండుట, నింపుట) వలన- తన చైతన్యంతో విశ్వాన్ని నింపుట వలన, తానే నిండుట, వలన ఉండుట (ఆధారము) వలన పురుషుడు.
6. **పురు బహు సనోతీతి పురుషః-**
   ముక్తులకు పరమగతి అయిన స్వామి వారికి అత్యధికమైన ఆనందమునిచ్చు వాడు.
   ఏషహ్యే వానందయతి
   సోశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా - అని శ్రుతి.

'ఆనందింపజేయువాడు ఇతడే. ఈ బ్రహ్మమును చేరినవాడు అన్ని కోరికలు తీరిన (దాటిన)వాడై, పూర్ణానందము నొందుచున్నాడు'.

7. **"పురూణి ఫలాని సనోతి – పురుషః"** ఉత్కృష్టమైన ఫలముల నిచ్చువాడు.
8. **"సహస్ర శీర్షాపురుషః" – "అథ పురుషోహవై నారాయణః"** అని శ్రుతి విరాట్ స్వరూపుడైన నారాయణుని 'పురుషుడు' అన్నది.
9. **పురూణి భువనాని స్యతి**
   ప్రళయకాలంలో సకల భువనాలను అంతమొందించేవాడు.
   "అసంగోహ్యయం పురుషః" ఈ పురుషునకు ఏ సంగమూ లేదని బృహదారణ్యకోపనిషద్వచనం. ఇంత ప్రపంచాన్ని నడుపుతూ ఏ సంగమూ లేనివాడెలా అయ్యాడు? ఇన్ని పనులను చేసే ఆ పురుషుడు కేవల సాక్షీమాత్రుడై ఉన్నాడు కనుక.

సాక్షీ .. 15

1. సర్వమును చూచువాడు, గమనించువాడు. ప్రాణికోట్ల హృదయాన అధివసించి వారిని గమనించువాడు. అదే విధంగా సర్వజగత్తును దర్శించువాడు. అంతర్బహిః వ్యాపకుడైన పరమ పురుషుడు సర్వజగత్ కర్మలను చూస్తున్న సాక్షి. కర్మలు ఆయన ఉనికి వల్లనే జరుగుతున్నప్పటికీ ఆయనకారణం కాడు. కానీ అన్నిటినీ దర్శించేది ఆయనే. ఒక దీపపు వెలుగులో ఒకరుచదువుకోవచ్చు. ఒకరు ఆడుకోవచ్చు. ఈ చదువుకీ, ఆటకీ దీపంకారణం కాదు. అలాగని దీపం లేనిదే ఈ రెండు కార్యాలు జరగవు. ఇది సాక్షీరూపం.

   ఈ మాట – మన పనులను నిత్యం గమనించే నారాయణుడున్నాడని హెచ్చరిస్తుంది. స్వామి నేత్రాలను ఎవ్వరూ కప్పలేరు. అవి సమగ్ర దర్శనం కలిగినవి.

2. సమ్యక్ దర్శనము గలవాడు సాక్షి. చక్కగా స్పష్టంగా చూసేవాడు ఆయన. మన చూపులకు పరిమితులున్నాయి. ఇంద్రియాల పరిధిలో ఇమిడే చూపు మనది. కొంతమేర మాత్రమే చూడగలదు. అంతేకాదు – పరిమితి గల మనస్సుతో, దాని వికారాలతో జగత్తును చూస్తాం. కానీ విష్ణుని దృష్టి అపరిమితం. ఇంద్రియాపేక్ష లేని సత్యదర్శనం. పరాధీనమైన దృష్టి కాదది. అనంత నేత్రుడు. **"సహస్రాక్షః" "సర్వతోముఖః"**
"విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో... జనయన్ దేవఏకః" – యజుర్వేదం.
"ధామాని వేద భువనాని విశ్వా"
సర్వలోకములను సమగ్రంగా వీక్షించువాడు – సాక్షి.

3. **స్వయంసాక్షాత్కరోతీతి సాక్షీ...** ముక్తులైన మహాత్ములను ప్రీతితో కటాక్షించువాడు.
'చూడడే నా పాటు
చూపుల చూడక చూచు వారల కృపజూచువాడు'
– అని గజేంద్రునిచే ప్రార్థింపబడినవాడు.
సర్వమును దర్శించే ఈ సాక్షీరూప చైతన్య స్వరూపుడు సర్వదేహములను తెలిసి అందు వసించువాడు – కనుకనే.

క్షేత్రజ్ఞః.. 16

1. క్షేత్రమంటే శరీరం. క్షయ లక్షణం కలది క్షేత్రం. దానిలో జరిగే క్రియాకలాపాలన్నీ ఎరిగిన ఆత్మచైతన్యమే క్షేత్రజ్ఞుడు.
ఇదం శరీరం కౌన్తేయ! క్షేత్రమిత్యభిధీయతే ॥
ఏతత్ యో వేత్తి తంప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ (భారతం)
నిజానికి శరీరాన్ని క్షేత్రమని కాక, శరీరమే నేనని భ్రమించడమే అజ్ఞానం. శరీరమే మనమైతే శరీరంలో జరిగే క్రియాకలాపమేదీ మనకు తెలియడం లేదే! 'ఇంద్రియ-మనోబుద్ధులు' కలిపి శరీరం. ఇది క్షేత్రం. దీనిలో ప్రసరించే

చైతన్యం దీని క్రియాకలాపానికి సాక్షి. అందుకే 'సాక్షి' అయిన నారాయణ స్వరూపమే సర్వక్షేత్రములలోని చైతన్యం-క్షేత్రములలోని సర్వ వ్యవహారాలను తెలుసుకొనేది అదే.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత!

"సర్వక్షేత్రములలో నున్న క్షేత్రజ్ఞుడను నేనేనని తెలుసుకో" అని గీతాచార్యుని వచనం.

సర్వమును గమనించే 'సాక్షీ' రూపచైతన్యం ఎక్కడో ఉండి చూడడం లేదు. మన దేహం కన్నా మనకి దగ్గరైనవాడు విష్ణువు. ఈ క్షేత్రంలో దీపించే చైతన్యరూపుడై గమనిస్తున్నాడు.

2. ఈ అనంత జగమే క్షేత్రము. ఈ జగత్తులో సర్వవిషయం ఎరిగిన విశ్వవ్యాపకుడైన నారాయణుడే క్షేత్రజ్ఞుడు.

యస్యభూమిః ప్రమాంతరిక్ష అథోదరమ్ ।
దివం యశ్చక్రే మూర్ధానం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥
యస్య సూర్యశ్చక్షుశ్చంద్రమాశ్చ పునర్నవః ।
అగ్నిం యశ్చక్ర ఆస్యం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥
యస్య వాతః ప్రాణాపానౌ చక్షురంగిరసోభవన్ ।
దిశోయశ్చక్రే ప్రజ్ఞానీస్తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః" (అథర్వవేదం)

బ్రహ్మాండ శరీరంలో ఉన్న శక్తులే మన శరీరంలోనూ ఉన్నవి. పృథివ్యాది పంచభూతాలు, సూర్యచంద్రులూ - వీటి శక్తులతోనే శరీర చక్రం నిర్విర్తింపబడుతోంది.

ఈ బ్రహ్మాండమంతా తన శక్తుల్ని నింపి నిర్వహిస్తున్న బ్రహ్మాండ శరీర వ్యాపకుడైన పరమాత్మ 'క్షేత్రజ్ఞుడు'.

3. **క్షేత్రాణి హి శరీరాణి బీజం చాపి శుభాశుభం ।**
తానివేత్తి స యోగాత్మా తతః క్షేత్రజ్ఞ ఉచ్యతే ॥ (మహాభారతం)

ఈ శరీర క్షేత్రంలో అనుభవాలే పంటలు. ఈ పంటలకి బీజాలు శుభా

శుభకర్మలు. మన కర్మఫలాలను ఈ క్షేత్రంలో పండించేలా చేసే క్షేత్రజ్ఞుడు - పెద్ద వ్యవసాయదారుడు. 'రుద్రనమకం'లో **"క్షేత్రాణాం పతయే నమః"** అని నమస్కరింపబడిన పరమాత్మ ఇతడే.

క్షేత్రంతో తాదాత్మ్యం చెందక ఆ క్షేత్రజ్ఞ చైతన్యాన్ని గుర్తించే యోగి కర్మబంధం నుండి విముక్తుడౌతాడు.

పంటలు పూర్తయి (అనుభవాలు నశించి) క్షేత్రం నశించినా, నశించనిది పరమాత్మయే-

అక్షరః : 17

క్షరము అంటే నాశనం. అక్షరము అంటే నాశనము లేనిది. నశింపనివాడు - పరమాత్మ.

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
నచైనం క్లేదయన్త్యాపో నశోషయతి మారుతః॥ *(భగవద్గీత)*

శస్త్రములు ఛేదించలేనిది, అగ్ని కాల్చలేనిది, నీరు తడపలేనిది, వాయువు శోషింపజేయలేనిదీ ఆత్మయే. కనుక అది అక్షరము.

క్షేత్రజ్ఞుడనబడే శరీరాంతర్గత జీవచైతన్యం ఈశ్వరుడే. అందుకే ఇదే ఆయన. తత్త్వతః ఉన్న ఈ అభేదాన్ని నొక్కి చెబుతూ 'ఏవ' 'చ' - అనే పూర్ణ పదాలు వాడారు. 'ఏవ' - కేవలత్వాన్ని చెప్పే శబ్దం. చ- మరియు (సంబంధ సూచకం).

ఈ ఏకత్వాన్ని గ్రహించడమే యోగం. ఈ 'అక్షర'మైన తత్త్వాన్ని గ్రహిస్తే, ఇదే విడివిడిగా ఉన్న వాటిని కలిపే 'ఏకతత్త్వ'మని తెలుసుకోగలుగుతాం. ఆ కలిపి ఉంచిన ఏకత్వాన్నే 'యోగం' అంటారు.

ఆయనతో విశ్వానికి ఉన్న 'నిత్య సంబంధం' 'యోగం'. దానిని గ్రహించే 'ఉపాయం' కూడా యోగమే. అందుకే ఆయన

యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః॥ 3

18. యోగః, **19.** యోగవిదాంనేతా,
20. ప్రధాన పురుషేశ్వరః। **21.** నారసింహవపుః,
22. శ్రీమాన్, **23.** కేశవః, **24.** పురుషోత్తమః

యోగః .. 18

1. విశ్వమునంతటినీ కలిపి ఉంచిన ఏకత్వమే పరతత్త్వం. 'యుజ్' అనే ధాతువుకు 'కలయిక' అని అర్థం. ఆ ధాతువు నుండి పుట్టిన శబ్దమిది. విశ్వమంతా విష్ణుయోగం. ఈ 'యోగశక్తి' ప్రత్యణువులోనూ గోచరిస్తుంది. ప్రపంచంలో ఒకదానికొకటి నిత్య సంబంధం కలిగి ఉంటాయి.
   మయిసర్వమిదం ప్రోతం సూత్రేమణిగణా ఇవ।
   "ఈ సర్వజగమూ హారమున మణులవలె భిన్నభిన్నాలుగా ఉన్నా, వాటిలో సూత్రము వలె ఉన్నది నేనే" – అని పరమాత్ముని గీతాబోధ. అన్నిటినీ కలిపే సూత్రమే యోగం. భిన్నములలో ఉన్న ఏకత్వమే యోగం. దీనిని గ్రహించే 'జ్ఞానం' కావాలి.
2. **యోగః కర్మసుకౌశలమ్** – కర్మలో నైపుణ్యమే యోగం. విశ్వనిర్వహణను అత్యంత నైపుణ్యంతో నిర్వహించే నారాయణుడు 'యోగః'.
   మనల్ని మనం పరిశీలించినా 'విడివిడిగా ఉన్న ఇంద్రియాలు, అణువులూ అన్నీ పరస్పర సంబంధం కలిగిఉన్నాయి కనుకనే 'నేను' అనే చైతన్యం ఉంది. ఈ చైతన్యం వల్లనే ఈ కలయిక సాధ్యమయ్యింది.
3. ఈ యోగశక్తి వల్లనే మనస్సు ఇంద్రియాలతో, బుద్ధి మనస్సుతో సంబంధం కలిగి పని చేస్తున్నాయి.

యుంజతే మన ఉతయుంజతేధియో

విప్రా విప్రస్య బృహతో విపశ్చితః ॥ – అని 'యజుర్వేదం' యోగం గురించి ప్రస్తావించింది. ఈ యోగం వల్లనే కర్మలయందు నేర్పరితనం లభిస్తుంది. అదే జ్ఞానం. దాని చేతనే బుద్ధి ఇంద్రియాల నుండి మరలి, పరమాత్మతో కలిసి జీవునికి ఆతనితో ఉన్న నిత్య సంబంధాన్ని (యోగాన్ని) గుర్తిస్తుంది. ఆ గుర్తింపు జరిగాక బుద్ధి కూడా ఆతనిలో లీనమై, జీవభావం పరమాత్మలో కరిగిపోతుంది. అదే తానైపోతుంది. అదే అసలైన యోగం, అదే మోక్షం. ఆ స్థితిలో మిగిలేది ఒక్క నారాయణుడే. ఏకో నారాయణః. అందుకే ఆయనే 'యోగః'.

4. సాధ్యమూ ఆయనే – సాధనా ఆయనే. ఆయనకానిది ఆయనను చేరలేదు. జ్యోతిని గుర్తించేలా చేసేది ఆ జ్యోతి యొక్క వెలుగే. వెలుగే జ్యోతిని చేర్చే ఉపాయం.

   "యుజ్యతే ప్రాప్యతే అనే నేతి యోగః" – దేని ద్వారా మోక్షము పొందబడునో ఆ ఉపాయమే యోగం.

   జ్ఞానేంద్రియాణి సర్వాణి నిరుధ్య మనసా సహ ।
   ఏకత్వ భావనా యోగః – క్షేత్రజ్ఞ పరమాత్మనోః ॥

   సర్వజ్ఞానేంద్రియాలను మనసుతో సహా నిగ్రహించి క్షేత్రజ్ఞుని (జీవాత్మను) పరమాత్మతో ఏకం చేయడమే 'యోగం' అని గీతాచార్యుని నిర్వచనం. ఈ 'నిరుధ్య' (నిగ్రహణ) అనే భావమే **"యోగశ్చిత్తవృత్తి నిరోధః"** అని పతంజలి నిర్వచనం.

   ఈ యోగాన్ని అవలంబించే వారిని నడిపించే ప్రభువు ఆ పరమాత్మయే–

యోగవిదాం నేతా.. 19

1. యోగము నెరిగిన వారికి నేత (నడిపించే నాయకుడు).

   యోగమును విచారించేవారు, తెలిసినవారు, పొందినవారు –

యోగవిదులు. వారికి నేత – అనగా వారి యోగక్షేమములను నిర్వహించువాడు.

అనన్యాశ్చింతయన్తోమాం యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

అని గీతలో భగవానుని అభయ వాక్యం.

ఇతర చింతలు విడిచి, సమగ్రంగా ఉపాసించే 'నిత్యాభియుక్తులు' – యోగవిదులు. 'నిత్యమూ అన్ని విధముల (పరిపూర్ణంగా) కలిసినవారు' నిత్యాభియుక్తులు. మనోబుద్ధీంద్రియాలన్నీ పరమాత్మకు సంపూర్ణంగా అర్పించినవారు అని అర్థం. ఇది జ్ఞానభక్తి యోగ మార్గాలలో ఏ ఉపాయంతోనైనా కావచ్చు. కావలసినది తదేక చింతన – సమగ్రోపాసన. కరములు కంజాక్షుని సేవలో, వాక్కు శ్రీనాథుని స్తుతిలో, చూపు సురరక్షకుని దర్శనంలో, శిరస్సు శేషశాయికి మ్రొక్కడంలో, వీనులు విష్ణుకథాకర్ణనంలో, మనసు మధువైరి భావనలో, బుద్ధి పురుషోత్తమునకు అర్పణలో – ఇలా సర్వమూ విష్ణుమయం కావడమే 'యోగవిదత్వం'.

అటువంటి వానికి ఈ జగమంతా నారాయణమయంగా (యోగంగా) కనబడుతుంది. **'కలడంభోధి కలండుగాలి కలదాకాశంబునన్ కుంభినిన్ కలదగ్నిన్ దిశలన్ పగళ్ల నిశలన్'** అంటూ, **'ఇందుగలడందులేదని సందేహము లేక'** నిరంతరం నారాయణానుభూతిలో నున్న వానికి రక్షకుడు, నిర్వాహకుడు ఆయనే.

ఇంద్రియాలు, విషయాలే ప్రపంచమనుకొనే వాని కర్మలో స్వామి జోక్యం చేసుకోడు. 'సర్వమున్నతని దివ్యకళామయమంచు' అన్న యోగంలో ఉన్న వాని విషయంలో ఎక్కడైనా సరే తానే నిర్వహిస్తాడు.

నీటిలో తోసినా, నేలపై ఉంచినా, నిప్పులో పడవేసినా – అక్కడ విష్ణువే ఉన్నాడన్న యోగవేత్తకు, ఆ అనుభవశాలికి నీటిలో, నేలపై, నిప్పులో విష్ణువే రక్షకుడు. ఇదే విష్ణుజ్ఞానియైన భాగవతయోగి ప్రహ్లాదుని కథలో మనకు

గోచరించే 'యోగవిదాంనేత' యొక్క లక్షణం.

ప్రహ్లాదాదులు నిత్యాభియుక్తులు. వారి యోగాన్ని క్షేమంగా కాపాడి కైవల్యాన్ని ఘటింపజేసే బాధ్యత ఆయనే నిర్వహిస్తాడు. తండ్రి చేయి పట్టుకొన్న పిల్లవాడ్ని తండ్రి నడిపించినట్లు ఆయన నడిపిస్తాడు.

యోగేయోగే తదస్తరం వాజేవాజే హవామహే ॥
స ఘనో యోగ అభువత్ సరాయే స పురన్ధ్యామ్ ॥

-మొదలైన ఋగ్వేద మంత్రాలు కూడా యోగస్వరూపుడైన, యోగక్షేమ నిర్వాహకుడైన పరమాత్మను స్తుతించాయి.

2. దేనిని ఏ శక్తితో కలపాలో తెలిసి ప్రకృతి శక్తులను పాలించే దేవతలు యోగవేత్తలు. నిజానికి ఆ దేవతలకు దేవత్వ శక్తి నిచ్చిన నేత కనుక -యోగవేత్తలకు పాలకుడు.

యోగవేత్తలకు మాత్రమేనా స్వామి నాయకుడు? నిజానికి అందరికీ ఆయనే ప్రభువు. యోగులు ఆ ప్రభుత్వాన్ని గుర్తిస్తారు. తదితరులు గుర్తించరు. గుర్తించకున్నా గుర్తించినా ప్రభుత్వం ఆగదు. ఈ ప్రకృతికీ, జీవులకీ ఈశ్వరుడు ఆయనే.

ప్రధాన పురుషేశ్వరః.. 20

1. **ప్రకర్షేణ ధీయతేస్మిన్నస్యాం వా 'ప్రధానం' ప్రధానా వా।**
త్రిగుణాత్మిక విశ్వశక్తులు దేనియందు సమృద్ధిగా (ప్రకర్షంగా) ఉన్నాయో (ధీయతే) అది ప్రధానం. అది ప్రకృతి. పురుషః - అంటే జీవుడు. ఈ ప్రకృతికీ జీవులకీ కూడా నియామకుడైన వాడు ప్రధాన పురుషేశ్వరుడు. **ప్రధాన క్షేత్రజ్ఞ పతిర్గుణేశః** - ప్రధానమైన ప్రకృతికీ, క్షేత్రజ్ఞుడైన జీవునకు, పతియయినవాడే, గుణములకు ఈశుడు.

2. పరమార్థ దృష్టిలో ఈ మూడు తత్త్వాలు ఒక్కటే.
త్రిగుణాత్మిక అయిన మాయ-ప్రధానం. మాయాబద్ధుడైన వాడు జీవుడు.

అతడు మాయను దాటి పరిశుద్ధుడై ఈశ్వర తాదాత్మ్యాన్ని పొందుతున్నాడు. అలా పొందే యోగం ఆ ఈశ్వరుడే కల్పిస్తాడు.

ఆ యోగాన్నివ్వడానికి తన యోగ స్వరూపాన్ని వ్యక్తపరుస్తాడు. ఆ వ్యక్తపరచిన రూపమే

నారసింహవపుః .. 21

నరసింహ శరీరం దాల్చినవాడు.

'విశ్వం' నుండి 'ప్రధాన పురుషేశ్వరః' వరకు నిరాకార పరబ్రహ్మ మాత్రమే చెప్పబడింది. ఆకార రహితమైన పూర్ణతత్త్వం గురించి వివరించిన నామాలు. విశ్వమంతా వ్యాపించి వివిధ విధాలుగా నిర్వహించే ఆ పరమ చైతన్యం ఇక్కడ తొలుత సాకారంగా వ్యక్తమయ్యింది. ఆ ఆకారం నరసింహాకారం.

స్వామి ఎన్నో రూపాలుంటూ ఉండగా ఈ నామమే ఎందుకు చెప్పారు? అంటే పై చెప్పిన 20 లక్షణాలూ కలబోసిన యోగరహస్యమేదో ఈ రూపంలో ఉందని స్పష్టమౌతోంది.

1. ఆకారం కలవారు నరులు - జీవులు. అయితే స్వామి ఆకారం ఇతర నరుల వలె జడాకారం కాదు. అది నిరాకార నిర్గుణతత్త్వానికి అభిన్నం. ఆ ఆకారం సింహవిశిష్టం. 'సింహం' శ్రేష్ఠత్వ వాచకం. అది సచ్చిదానందమయమైన శ్రేష్ఠాకృతి. అందుకే అది ఒఠ్ఠి 'నర' కాదు. 'నరసింహం'. శ్రేష్ఠమైన దివ్యాకారం. శాశ్వత మంగళ విగ్రహం. సత్యమూ ఆనందమూ, కలిసిన చైతన్య విగ్రహం. స్వామి ఏ రూపు ధరించినా అది నారసింహమే.
2. 'నారం' అంటే (నర) జీవ సమూహం. జీవుల (నార) హృదయ గుహలో ఉండే మహా చైతన్యమే 'సింహం' అదే 'నారసింహం'.

స్తుహి శ్రుతం గర్తసదం యువానం
మృగన్నభీమముపహత్నుముగ్రమ్ ॥ అని యజుర్వేద రుద్ర మంత్రం.

3. యోగవిదాం నేత అయిన యోగస్వరూపుడు తన లక్షణాన్ని వ్యక్తీకరించిన దివ్యాకారం నరసింహాకారం.

యోగవేత్త అయిన ప్రహ్లాదుని కాపాడిన భక్తవాత్సల్యమూర్తి కనుక ఈ మూర్తిని తొలుత తలచారు. ధర్మరక్షణ మాత్రమే కాక భక్తవాత్సల్యాన్ని ప్రకటించిన అవతారం.

'విశ్వమంతా ఉన్నది విష్ణువే' అని ఎలుగెత్తి చాటుతున్న ప్రహ్లాదుని మాట నిజమని నిరూపించిన ఆవిర్భావమిది. తొలి ఇరవై నామాలలో చెప్పిన విష్ణుత్వాన్ని ప్రకటించిన స్వరూపం ఇదే.

నారసింహం వపుః కృత్వా యస్త్రైలోక్య భయంకరం ।
హిరణ్యకశిపుం జఘ్నే తస్మై సింహాత్మనే నమః ॥ *(మహాభారతం)*

పరస్పర విరుద్ధంగా, భిన్నంగా కనిపించే సృష్టిలో 'ఏకత్వం నేనే'నని నిరూపించిన 'యోగస్వరూప'మది. ప్రధానమునకు, పురుషునకు కూడా ఈశ్వరుడతడే కనుక ప్రకృతిరీత్యా సంభవం కాని దానిని, సంభవం చేసిన మహిమ కూడా అదే.

సింహం-నరం పరస్పర విరుద్ధం. కానీ ఏకచైతన్యం ఆ రెండిటినీ కలిపింది. పైగా సంధ్యాతత్త్వానికి సంకేతమది. పగలూ కాదు రాత్రీ కాదు. ఇంటా కాదు - బయటాకాదు. ప్రాణసహితమూ కాదు- ప్రాణరహితమూ కాదు. మన స్థూల దృష్టికి అటూ ఇటూ ఉన్న ద్వంద్వాలే తెలుస్తాయి. కానీ అటుకీ ఇటుకీ నడుమ, అటూ యిటూ కాని, రెండింటికీ కారణమైన చైతన్యం ఉంది. దానిని చూడాలంటే సూక్ష్మదృష్టి ఉండాలి. రెండింటి నడుమనున్న సంధ్య రెంటికీ అంటని ద్వంద్వాతీత స్థితి. ఈ స్థితిని తెలుసుకుంటే ద్వంద్వాలకు అంటకుండా సమన్వయించగలిగే యోగరహస్యం అవగతమవుతుంది. ఈ సంధ్యను దర్శించే సూక్ష్మదృష్టి 'సమ్యక్‌ధ్యానం' (సంధ్య) వల్లనే సాధ్యం. ఆ సంధ్యోపాసనకు గమ్యమైన వేదవేద్య పరతత్త్వం నిర్వికారం.

సంధ్యలో పగలూ రాత్రీ రెండూ కలిసి ఉంటాయి. కలియవు. అన్నీతానై, ఏదీ తాను కాని పరబ్రహ్మ స్థితి సంధ్యలో గోచరిస్తుంది. మనలో ప్రతి రెండు ఆలోచనల నడుమ ఏ ఆలోచనల అల్లకల్లోలమూ లేని సూక్ష్మకాలం ఉంటుందని వేదశాస్త్రం చెబుతోంది. **'సంధయోరఖిల వృత్తిషు'.**

ఆ సూక్ష్మకాలంలో దృష్టిని నిలపగలిగినవాడు ద్వంద్వాతీతుడైన యోగి. ఆ స్థితి యోగం. ఆ యోగం స్వరూపమైతే 'నారసింహవపుః'. అందుకే 'యోగ నారసింహుడు' అంటారు. ఇది నారాయణుని పూర్ణావతారంగా చెప్పబడుతున్నది. విశ్వమయతను ఋజువు చేసిన విష్ణుస్వరూపం కదా!

సత్యం విధాతుం నిజభృత్య భాషితం
వ్యాప్తిం చ లోకేష్వఖిలేషు చాత్మనః ।
అదృశ్యతాత్యద్భుత రూపముద్వహన్
స్తంభేసభాయాం 'నమృగం నమానుషమ్' ॥

తన భక్తుని మాట నిజమని చాటుతూ, అఖిల లోకాలలోనూ వ్యాపించిన విష్ణువును తానేనని నిరూపిస్తూ అప్పటి వరకూ కానరాని అద్భుతమైన రూపాన్ని స్తంభము నుండి దాల్చి వచ్చాడు. ఇక్కడ వ్యాసదేవుడు అద్భుతమైన ఒక మాటను పలికారు - **'న మృగం న మానుషమ్'.**

'ఇది మృగమూ కాదు - మనిషీ కాదు'. ఇదేమిటి? 'మృగమూ ఇదే - మనిషీ ఇదే' అనవచ్చు కదా!

'నేతి నేతి' అని నిగమములు వర్ణించిన తత్త్వమిది అని చెప్పడం వ్యాసుని ఉద్దేశం. 'ఇదికాదు - ఇదికాదు' అని తేల్చిన తత్త్వం. దేనికీ అంటక, అన్నిటినీ కలిపే యోగలక్షణమది.

1. యోగావతారం, 2. సంధ్యావతారం,

3. సద్యోజాతావతారం : అప్పటికప్పుడు ఆవిర్భవించిన ఈ అవతారం శీఘ్రానుగ్రహానికి నిదర్శనం.

4. **అభయావతారం :** భిన్న దృష్టిలో ఉన్న దైత్యభావాన్ని అంతమొందించిన ఈ అవతారం – సంసార లక్షణమైన ద్వైత భ్రాంతినీ, అజ్ఞానాన్నీ నశింపజేస్తూ భయాలను భయపెట్టే అభయస్వరూపం.

ఈ 'అద్వయావతారపు అభయ హస్తమే సకలభయ నాశనం. సంసార బాధానివారకం. ఆ చేయూత లభిస్తే సంసార కూపం నుండి బయట పడగలం.

సంసారకూపమతి ఘోరమగాధమూలం
సంప్రాప్య దుఃఖశతసర్ప సమాకులస్య
దీనస్య దేవ కృపయా శరణాగతస్య
లక్ష్మీనృసింహ! మమదేహి కరావలంబమ్ ॥

అని ఆదిశంకర భగవత్పాదులు ఈ స్వామిని కీర్తించడంలో ఆంతర్యమిదే.

5. **ఉగ్రావతారం :** ఉత్ గ్రసతి – అట్టడుగున ఉన్న మనలను (పైకిలేపి) ఉద్ధరించే ఉత్కృష్ట స్థితికి తీసుకువచ్చే యోగస్వరూపం కనుక ఇది ఉగ్రావతారం.

6. **జ్వాలా నరసింహం :** ఇలా విష్ణుత్వాన్ని సమగ్రంగా ప్రకటించే ఈ స్వరూపాన్ని ధ్యానించి ఉపాసించితే, జ్ఞానకాంతులను సర్వతోముఖంగా ప్రసరించే ఈ స్వామి దయవల్ల అజ్ఞానం పటాపంచలవుతుంది. **"జ్వలంతం సర్వతో ముఖం".**

సమగ్ర జ్ఞాన యోగి, 'విశ్వం విష్ణుః' తత్త్వాన్ని ఎరిగిన భాగవతోత్తమునకు సాక్షాత్కరించిన స్వరూపమిది. ఈ ప్రభువు కృపలేనిదే భాగవతధర్మం ఒంట పట్టదని సంప్రదాయజ్ఞులు చెబుతారు.

4. నరదేహం విచార పూర్వకమైన కార్య కారణ శక్తికి సంకేతం. సింహవదనం పరాక్రమ శక్తి లక్షణం. కార్యకారణాలకు కావలసిన సమర్థత. ఈ రెండింటి కలయిక నరసింహం.

5. 'నార'ం – జీవభావం, సింహం – ఈశ్వరతత్త్వం. ఈ రెండింటి ఏకత్వానికి సంకేతంగా అభివర్ణిస్తారు కూడా. 'నార' భావాన్ని (జీవభావాన్ని) హింసించి (హింస – నుండే సింహం అనే పదం పుట్టింది) నశింపజేసి పరమాత్మ స్థితిని చేకూర్చే ఈశ్వరానుగ్రహమే 'నారసింహం'.

మొత్తం మీద – స్వామి సాకారమే అనుగ్రహం.

ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా ॥

భక్తానుగ్రహ విగ్రహమ్ ॥

భక్తులను అనుగ్రహించడానికే నిరాకారుడు సాకారుడయ్యాడు. ఆ ఆకారం ఎల్లప్పుడూ–

శ్రీమాన్.. 22

1. శ్రీమంతుడు, శ్రీ కలవాడు.

శ్రీ శబ్దానికి శోభ, కాంతి, లక్ష్మి, వైభవం, ఐశ్వర్యం అని అర్థం. స్వామి నిత్యమూ పై లక్షణాలతో దీపిస్తుంటాడు. ఏ 'వపువు' (రూపం) ధరించినా ఆ శ్రీ ప్రకాశిస్తూనే ఉంటుంది. లోకంలో ఇతరుల వద్ద వారి సుకృతఫలంగా సంపద లభించినా అది శాశ్వతం కాదు. ఒక్క నారాయణుని వద్దనే వైభవాలు శాశ్వతం. కారణం – ఆ వైభవాలన్నీ ఆయన విభూతులే. ఆయన ప్రసాదం చేతనే లోకాలకు ప్రకాశమూ, సంపదలూ, పోషణ లభిస్తున్నాయి. తరగని ఐశ్వర్య నిధి ఆయన. ఎంత నరసింహ రూపమైనా సౌందర్య లావణ్యాది 'శ్రీ' లకు లోటులేని మనోహర రూపమే.

2. అందుకే ఆయననే అందరూ ఆశ్రయిస్తారు. ఆశ్రయవాచకం 'శ్రీ'. ఆయనను ఆశ్రయించుకొని ఐశ్వర్యాలన్నీ ఉన్నాయి. అందుకే శ్రీమంతుడు.అంతేకాదు జగమంతా ఆయననే ఆశ్రయించుకుని ఉంది.
3. ఏ రూపం ధరించినా ఆయనకు 'అనపగామిని' 'అనపాయినీ' (వీడకుండా అనుసరించే శక్తి) అయిన లక్ష్మి వెంటనే ఉంటుంది.

ఆయన వక్షంపై కొలువుతీరి ఉన్నది ఆ తల్లి. 'లక్ష్మీ నృసింహ' అని కీర్తించుతాం కదా!

ఈ దివ్యనామం ఈ స్తుతిలో నాలుగు పర్యాయాలు ఆవృతమయ్యింది. స్వామి విభూతులు (వైభవాలు) 'శ్రీ' శబ్దం ద్వారా వ్యక్తమవుతాయి. సూర్యుడు కిరణాలను ప్రసరించినట్లుగా, ఈ విభూతులను ప్రపంచానికి పంచేవాడు-

కేశవః .. 23

1. **కేశాः రశ్మయः.** 'కేశములు' అంటే కాంతి కిరణాలు. అవే 'శ్రీ'లు. శ్రీమంతుడైన నారాయణ పరంజ్యోతి తన శ్రీలను కిరణముల వలె ప్రపంచమంతా ప్రసరిస్తున్నాడు. అందుకే దివ్యకాంతులను వెదజల్లే జ్యోతిర్మయుడు కేశవుడు.
2. ఆ పరంజ్యోతి మూడు క్రియలను చేసే ఒకే వెలుగు.

'కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయः కేశాः,
తేయద్వశే వర్తంతే సకేశవः'.

క = బ్రహ్మ, అ = విష్ణువు, ఈశ = రుద్రుడు.

ఈ ముగ్గురూ ఎవరి వశవర్తులో - ఎవరి స్వరూపాలో ఆ పరమాత్మ 'కేశవుడు'. సృష్టి స్థితి లయకారకుడు.

శ్రీమంతమైన నారసింహ వపువులు (సాకారాలు) అన్నీ బ్రహ్మవిష్ణు రుద్రాత్మకమైన పరమేశ్వర స్వరూపాలే.

ఉదాహరణకు - నరసింహాకృతిని వర్ణించే స్తుతిని చూడండి.

ఆనాభేర్బ్రహ్మణోరూపం ఆగళాద్వైష్ణవం వపుः
ఆశీర్షాద్రుద్రరూపం తం తదగ్రస్సర్వత శ్శివమ్ ॥

"నాభివరకు బ్రహ్మ స్వరూపం. అటుపై కంఠం వరకు విష్ణురూపం. కంఠం నుండి మిగిలిన శిరస్సు రుద్ర రూపం. అటుపై ప్రసరించే వెలుగంతా త్రిగుణాతీత శివంకర తేజస్సు" అని నృసింహోపాసనలో ప్రసిద్ధి.

నృసింహునిలోని ఫాలనేత్రం కూడా ఈ విషయాన్ని సృష్టం చేస్తుంది.

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా
కేళీ విహార లక్ష్మీనారసింహా! – అని అన్నమయ్య కీర్తన.

3. 'కం' జలం. జలములు ద్వి విధములు.
ఒకటి– భౌమం, భూమిపై వాపీకూపనదీతటాకసముద్రాలుగాలభించేది.
రెండవది – ఆంతరిక్షం.ఆకాశంలో పలువిధాల జరిగే జలవ్యవస్థ.
వేడితో జలాన్ని గ్రహించి,మేఘాలుగా మారే పద్ధతి. ప్రధానంగా వర్షరూపం.
ఈ రెండు రూపాల జలములను పాలించే ఈశుడై వర్తించువాడు కేశవుడు.
"శన్న ఆపో ధన్వన్యాః ... శివానః సంతు వార్షికీ" అన్నది అథర్వవేదం.

4. 'కం' – సుఖం అని కూడా అర్థం. ఈ సుఖం ద్వివిధం.
ఇహలోక సుఖం, పారలౌకిక సుఖం.
నిజానికి ఈ రెండు సుఖాలు అశాశ్వతమే, ఒకదాని కంటే ఇంకొకదానికి కాలపరిమితి ఎక్కువకావచ్చు. కానీ రెండు పరిమితి కలవే. కనుక రెండింటిని కలిపి ఒకటిగా 'లౌకిక సుఖం' అనవచ్చు.రెండవ సుఖం – శాశ్వతమైన బ్రహ్మానందం. ఈ రెండు సుఖాలను జీవుల అధికారాలను, సాధనలను అనుసరించి ఇచ్చేవాడు. ఆ సుఖాలపై ఆధిపత్యం కలిగిన ఆనంద స్వరూపుడు– 'కేశవుడు'. 'వ' అనే ప్రత్యయం ప్రశస్తిని తెలియజేస్తుంది.

5. **యస్మాత్తయైష దుష్టాత్మా హతఃకేశీ జనార్దన ।**
తస్మాత్కేశవనామాత్వం లోకే ఖ్యాతో భవిష్యసి ॥ (విష్ణు పురాణం)
దుష్టాత్ముడైన కేశియను రాక్షసుని, శ్రీకృష్ణావతారంలో సంహరించిన విష్ణువు 'కేశవుడు' (కేశి సంహారకుడు).

6. అందమైన ఆకారం ధరించిన నారాయణుడు సుందర కేశాలతో ప్రకాశిస్తున్నాడు.
అభిరూపాః (రామాః) కేశాః యస్య స కేశవః.
అందమైన కేశములతో అలరారే సుందరాకారుడు.

ఈ లక్షణాలన్నీ గమనిస్తే ఇంతకు మించిన పురుషుడు లేడని తెలుస్తుంది కనుకనే-

పురుషోత్తమః.. 24

ఉత్కృష్టమైన పరమపురుషుడతడే - పురుషోత్తముడు.

1. విరాట్పురుషుడు, పరమ పురుషుడు అని వేదాలు పలుచోట్ల కీర్తించాయి.
   "అథ పురుషోహవై నారాయణో కామయత",
2. పురుషుల యందు - జీవులయందు ఉన్న 'ఉత్తముడు' - అతీతుడు -పురుషోత్తముడు.

   యస్మాత్ క్షర మతీతోహం అక్షరాదపి చోత్తమః ।
   అతోస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః ॥ (గీత)

   'క్షరమైన శరీరానికి, అక్షరుడైన జీవునకు కూడా అతీతమైనవాడు పురుషోత్తముడు'. లోకమునందు (విద్యలలో), వేదమునందు ఈ పేరు ప్రసిద్ధి. దేహానికీ జీవునికీ మూలమైన అసలు చైతన్యం పురుషోత్తముడే. ఈయనను మించినది లేదు. 'ఉత్ - తమః'.

   "పురుషాన్నపరంకించిత్"

   అందుకే సర్వమూ ఈయనే.

సర్వః శర్వః శివః స్థాణుః భూతాదిర్నిధిరవ్యయః ।
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః ॥ 4

25. సర్వః,	**26.** శర్వః,	**27.** శివః,	**28.** స్థాణుః,
29. భూతాదిః,	**30.** నిధిరవ్యయః	**31.** సంభవః,	**32.** భావనః,
33. భర్తా,	**34.** ప్రభవః,	**35.** ప్రభుః,	**36.** ఈశ్వరః

సర్వః.. 25

1. అంతా తానై యున్నవాడు 'సర్వుడు'. సమస్తము ఆయనలోనే, ఆయన వలన కలిగి ఆయనలోనే లీనమవుతున్నాయి.

అసతశ్చ సతశ్చైవ సర్వస్య ప్రభవాప్యయాత్ ।
సర్వస్య సర్వదా జ్ఞానాత్ సర్వమేనం ప్రచక్షతే ॥ (మహాభారతం)

సదసద్రూపమైన సమస్తమునకు ఉత్పత్తి, లయస్థానమైన వాడు – అన్ని వేళలా అన్నిటినీ తెలిసినవాడు కనుక 'సర్వః'.

నమః పురస్తాదథ పృష్ఠతస్తే
నమోస్తు తే సర్వత ఏవ సర్వ ।
అనన్త వీర్యామిత విక్రమస్త్వం
సర్వం సమాప్నోషి తతోసి సర్వమ్ ॥

అని గీతలో అర్జునుడు పరమాత్మను స్తుతించాడు.

"సర్వరూపుడవైన శ్రీకృష్ణా! నీకు ఎదుట వందనం. వెనుక వందనం. అన్నివైపుల వందనం. అనన్తవీర్యుడవు, అమిత విక్రముడవైన నీవు సర్వమును వ్యాపించుట చేత 'సర్వుడ'వు" అని ఈ స్తోత్రం నిర్వచిస్తోంది. సర్వము తానే కనుక ఆశ్రయించిన వారి పాపాలను సంహరించువాడు, ప్రళయ కాలమున సర్వమును నశింపజేసి తనలో లయింప జేసుకొనువాడు ఈతడే –

శర్వః.. 26

1. సకల జీవులను కాలమెరిగి 'శృణాతి' – హరింపజేయువాడు శర్వుడు.
2. **"అశుభం శృణాతి హింసతీతి శర్వః** – ఆశ్రితుల అనిష్టాలను అరిష్టాలను హరించువాడు.

   ఈ హరణ కార్యం చేసి తన అఖండ మంగళత్వాన్ని చాటే పరమాత్మయే – **'నమశ్శర్వాయ చ పశుపతయే చ'** అని యజుర్వేద మంత్రం. ఇలా మంగళకారకుడు కనుకనే –

శివః.. 27

1. 'శివ' శబ్దానికి అనంతార్థాలున్నాయి. ఇది మోక్షకారక పంచాక్షరీ మహామంత్రానికి మూలమైన నామం.

   'శివ' అంటే కల్యాణ స్వరూపుడు. మంగళము, క్షేమము, శుద్ధత, శాంతము, మోక్షము... ఇలా శుభవాచకాలైన అర్థాలన్నీ దాచుకున్న మహాశబ్దం 'శివ' నామం.
2. **'శాంతం శివ అద్వైతం చతుర్థం మన్యంతే'** – త్రిగుణాలను దాటిన గుణాతీత నిర్వికార పరమాత్మయే 'శివ' అని వేదవచనం.

   "ప్రమహసిపదే నిస్త్రైగుణ్యే శివాయ నమోనమః" (పుష్పదన్తకృత శివమహిమ్న స్తుతి). **"నిస్త్రైగుణ్యతయా శుద్ధత్వాత్ శివః"** – త్రిగుణాతీతమైన శుద్ధ పరతత్త్వం 'శివుడు'.

   'న సన్న చాసత్ శివ ఏవ కేవలః' – అని శ్వేతాశ్వతరోపనిషత్తు. "సృష్టికి పూర్వము సదసత్తులు కూడా లేని స్థితిలో కేవలము పరంజ్యోతి అయిన శివుడే ఉన్నాడు" అని భావం.
3. **'శేరతే ప్రాణినో అస్మిన్ ఇతిశివః'**

   సర్వజీవకోటికీ విశాంత్రి స్థానం. ప్రశాంతత నిచ్చే శాశ్వత పదం శివపదం.

4. **శాశ్వతమ్ శివమ్ అచ్యుతమ్.** (తైత్తిరీయ నారాయణం)
   స్మృతే సకల కల్యాణ భాజనమ్. (విష్ణు ధర్మోత్తర పురాణం)
   హరిని తలచినంతనే అన్ని మంగళములు కలుగుతాయి.
   మంగళాయతనం హరిః – మంగళముల నివాసము హరి.
   కనుక హరి యొక్క మంగళ స్వభావాన్ని చెప్పే నామం 'శివ' నామం.
5. **వశ కాన్తౌ శివఃస్మృతః** – 'సర్వప్రకాశక పరంజ్యోతి' అనే అర్థం 'శివ' శబ్దానికి ఉంది.
   'నమశ్శంభవేచ మయోభవేచ
   నమశ్శంకరాయచ మయస్కరాయచ
   నమశ్శివాయ చ శివ తరాయచ' అని యజుర్వేదం చెబుతోంది.
6. మహాభారతంలో అనుశాసనిక పర్వంలోనే విష్ణుసహస్ర నామాల తర్వాత, ధర్మరాజుకి శ్రీకృష్ణుడు శివనామ నిరుక్తాన్ని చెప్పాడు. అంటే శివనామానికి అర్థాలు. "సర్వదా జగమునకు శుభమును కోరేవాడు కనుక శ్రీరుద్రదేవుని 'శివ' అన్నారు".
   శివమిచ్ఛన్మనుష్యాణాం తతశ్శివ ఇవి స్మృతః.

✦ ✦ ✦

వీటిని గమనిస్తే 'శివ' నామం, 'విష్ణు' నామం రెండూ ఒకే పరమాత్మకు చెందినవని స్పష్టమౌతుంది. ఒకే పరమాత్మకు శివ, విష్ణు నామాలు ఎలా ఉన్నాయో, శివ విష్ణు రూపాలూ అలాగే ఉన్నాయి.

శివ పరమైన నామాలెన్నో ఈ విష్ణుసహస్ర నామాలలో కనిపిస్తాయి. అలాగే విష్ణునామాలెన్నో శివసహస్రనామాలలో గోచరిస్తాయి.

'విష్ణు పారమ్యాన్ని చెప్పడానికి ఎన్ని వైదిక శాస్త్ర ప్రమాణాలున్నాయో, శివ పారమ్యాన్ని ప్రతిష్ఠించే వేదాగమాది ప్రమాణాలూ అన్ని ఉన్నాయి. వీటిని గమనిస్తే పరమమైన తత్త్వం ఒకటేనని, దానినే 'శివ', 'కేశవ' అన్నారని బోధపడుతుంది.

"సబ్రహ్మ సశివఃసహరిః ఇతి అభేదోపదేశాత్ శివాది నామభిః హరిరేవస్తు

వతే" అని ఆదిశంకరులు స్పష్టపరచారిక్కడ.

"సబ్రహ్మా సశివః సహరిః" అని వేదము చెప్పిన అభేదోపదేశం వలన శివాది నామాలద్వారా హరియే స్తుతింపబడుతున్నాడు.

నిజమైన హరిభక్తుడు శివుని హరిస్వరూపంగా చూస్తాడు. నిజమైన శివభక్తుడు హరిని శివస్వరూపంగా నమస్కరిస్తాడు.

అందుకే పురాణాలు శివకేశవ భేదం చూపేవారు నరకానికి పోతారని స్పష్టంగా చెప్పాయి.

మద్భక్తో శివవిద్వేషీ మద్వేషీ శంకరప్రియః ।
తావుభౌ నరకం యాన్తి యావచ్చన్ద్ర దివాకరౌ ॥

"నా భక్తుడై శివుని ద్వేషించేవాడు, శివభక్తుడై నన్ను ద్వేషించేవాడు, ఇరువురూ సూర్యచన్ద్రులున్నంత కాలం నరకంలో ఉంటారని" నారాయణ వచనం.

శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే ।
శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః ॥
యథాశివమయో విష్ణుః ఏవం విష్ణుమయశ్శివః ॥
యథాన్తరం నపశ్యామి తథామే స్వస్తి రాయుషి ॥

"శివరూపుడు విష్ణువు. విష్ణురూపుడు శివుడు. శివ హృదయం విష్ణువు. విష్ణు హృదయం శివుడు. శివుడు ఎలా విష్ణుమయుడో, విష్ణువు అలా శివమయుడు. ఇరువురి నడుమ ఎంతవరకు భేదం చూపించమో, అంతవరకు శుభము, ఆయువు ఉంటాయి" అని యజుర్వేదాంతర్గతమైన స్కందోపనిషత్ వాక్యం.

శివ ప్రస్తావన లేకుండా యజ్ఞం చేసిన రుద్రద్వేషి దక్షుడు దుర్గతి చెందాడు. విష్ణుద్వేషి అయిన హిరణ్యకశిపుడు ఘోరశిక్షను పొందాడు. ఇలా వేదపురాణాలన్నీ ఘోషించాయి.

'విష్ణు సహస్రనామం' ఉద్భవించిన మహాభారత అనుశాసనిక పర్వంలోనే 'శివసహస్ర నామస్తుతి' ఉంది. విష్ణు సహస్రం భీష్ముడు ఉపదేశిస్తే, శివసహస్రం

సాక్షాత్తు శ్రీ కృష్ణపరమాత్మయే ఉపదేశించారు. పుత్రార్థియై కృష్ణుడు హరుని ఆరాధించిన వైనం భారతం వర్ణించింది. అర్జునుడు యుద్ధంలో విజయం కోసం శివుని ఉపాసించాడు. హరిని పెండ్లాడేందుకు రుక్మిణీదేవి "నమ్మితి నా మనమ్మున సనాతనులైన ఉమా మహేశులన్" అని ప్రార్థించింది.

అదే విధంగా 'శ్రీరామ' నామ జపాన్ని చేసి, గౌరికి ఉపదేశించిన గురువు శివుడు. హరినామ రసికుడు.

"భవానహంచ విశ్వాత్మన్నేక ఏవహి కారణం ।
జగతోస్య జగత్యర్థే భేదేనావాం వ్యవస్థితౌ ॥"
"త్వయా యదభయం దత్తం తద్దత్తమఖిలం మయా।
మత్తో విభిన్నమాత్మానం ద్రష్టుం నార్హసిశంకర ॥
యోహం సత్వం జగచ్చేదం సదేవాసురమానుషం ।
అవిద్యా మోహితాత్మానః పురుషా భిన్న దర్శినః ॥ (విష్ణుపురాణం)

విష్ణు పురాణంలో శివుడు విష్ణువుతో అన్న మాటలు.

"విశ్వరూపా! నీవు, నేను జగత్తునకు ఏక కారణమే అయి ఉండి, జగత్తు నిర్వహణ కొరకు మనము భిన్నము వలె రెండు రూపాలతో ఉన్నాము". అలాగే విష్ణువు శివునితో అన్న వచనాలు :

"నీచే ఇవ్వబడిన అభయం, నాచే ఇవ్వబడినట్లే. నిన్ను నాకంటే భిన్నముగా నీవు భావింపదగదు. నేను, దేవాసుర మనుష్యాది సహితమైన ఈ జగత్తు నీ స్వరూపమే. అవిద్యా మోహితులు భిన్నభిన్నముగా భావించుచుందురు".

ఇలాగే 'హరివంశం' (మహాభారతాంతర్గతం)లో

అహం త్వం సర్వగోదేవ త్వమేవాహం జనార్దన ।
ఆవయో రన్తనం నాస్తి శబ్దైరర్థైర్జగత్రయే ॥
నామాని తవ గోవిన్ద యానిలోకే మహాన్తిచ ।
తాన్యేవ మమనామాని నాత్రకార్యా విచారణా ॥
త్వదుపాసా జగన్నాథ సైవాస్తు మమగోపతే ।

యశ్చత్వాం ద్వేష్టి భోదేవ సమాంద్వేష్టి న సంశయః ॥

– ఇవి శివవచనాలు.

"నేను సర్వగతుడవైన నీవే. జనార్దనా! నీవు నేనే. శబ్దములచే గానీ, అర్థము లచే గానీ మనకు ఉభయులకు భేదము లేనే లేదు. గోవిన్దా! లోకములో నీ నామాలు ఏవి కలవో అవి నా నామాలు. సందేహం లేదు. జగన్నాథా! నీ ఉపాసనయే నా ఉపాసన. నిన్ను ద్వేషించువాడు నన్ను ద్వేషించువాడే"

విష్ణోరన్యంతు పశ్యన్తి యే మాం బ్రహ్మాణ మేవవా ।
కుతర్కమతయో మూఢాః పచ్యన్తే నరకేష్వథః ॥
యే చ మూఢా దురాత్మానో భిన్నం పశ్యన్తి మాంహరేః ।
బ్రహ్మాణం చ తతస్తస్మాద్బ్రహ్మహత్యాసమం త్వఘమ్ ॥

"నన్ను, బ్రహ్మను విష్ణువు కంటె భిన్నులని భావించు కుతర్కమతులకు నరకం ప్రాప్తిస్తుంది. అట్టివారికి బ్రహ్మహత్యా సమపాతకం లభిస్తుంది" అని భవిష్యోత్తర పురాణంలోని మహేశ్వర వచనం.

అతి విస్తరభీతి చేత స్థాలీపులాక న్యాయంగా కొన్ని శాస్త్ర ప్రమాణాలనే ఉటంకించడం జరిగింది.

అవిద్యా మోహితులైన వారు భిన్నదృష్టితో, శివద్వేష సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రస్తుతం చాలామందిని తప్పుదారికి మళ్లిస్తున్న కారణంగా ఇంతవివరణ అవసరమౌతోంది. పైగా – ఇప్పటికీ విష్ణుసహస్ర నామాదులకు వారు భాష్యాలను వ్రాస్తూ ఇలాంటి నామాల దగ్గర ప్రత్యేకించి శివుని, ఇతర దేవతలను "అత్యల్పులైన దేవతాంతరములు" అని వ్రాస్తున్నారు. ఆ దేవతలు విష్ణుస్వరూపులేనని వ్యాసదేవుడు స్పష్టంగా చెప్తున్నా, ఇలా ఇతర దేవతా నింద చేయడం తగునా! శివకేశవులనే కాదు – ఇంద్రాది దేవతలను కూడా పొరపాటున నిందించరాదు. పరమాత్మ స్వరూపాలే వీరంతా! కేవలం భక్తి పారవశ్యం చేత ఒక దైవాన్ని ఎక్కువగా ఆరాధించడం జరుగుతుంది. అది భావనాపరమైన విషయం. అంతేగానీ జ్ఞానపరమైన సిద్ధాంతం కాదు. అంత పారవశ్యంలోనూ

ఇతర దేవతను నిందించితే ఆ పాపాన్ని అనుభవించక తప్పదు.

వేదమంతా ఒకే పరమాత్మ తత్త్వాన్ని పేర్కొన్నది.

'సర్వేశ్వర, పరమేశ్వర, మహేశ్వర, శంకర, ఆదిదేవ, మహాదేవ, రుద్ర, జ్యేష్ఠ, శ్రేష్ఠ, ఈశాన, ఈశ్వర, భూతేశ, ప్రాణేశ్వరః' ఇలా అసంఖ్యాక నామాలు శివ నామాలుగాను, విష్ణు నామాలుగాను వ్యవహరింప బడుతున్నాయి. శివ పారమ్యాన్ని చెప్పే రుద్ర మంత్రాలు, శ్వేతాశ్వతరోపనిషత్తు 'జగతాం పతయే నమః' వంటి ఆధిక్య సూచక నామాలను చెప్పాయి.

వీటన్నిటినీ సమన్వయించి, పురాణాదులు – అభేదమే వేదమతమని ఉద్ఘోషించాయి. శాఖలుగా ఉన్న శైవ వైష్ణవాదులు ఒకే పరతత్త్వమనే వృక్షానికి చెందినవనే స్పృహతో ఉన్నప్పుడు – ఏ తగాదా రాదు. వీటిని ఉపేక్షిస్తే అఖండమైన భారతీయ ఆత్మ దెబ్బతింటుంది.

నామరూపాల ద్వారా తత్త్వాన్ని గ్రహించి, అపారమైన అనంత విష్ణుతత్వంలోకి ఎదగడానికి వ్యాసభగవానుడు ఈ సహస్రనామ
స్తోత్రాన్ని అనుగ్రహించాడు. అంతేగానీ ఇంకా నామరూప పరిధులలో కుంచించుకుపోయి అఖండ విష్ణుతత్త్వానికి కొరతపెట్టే సంకుచిత సంప్రదాయాలలోకి దిగజారడానికి కాదు. సమన్వయమే సనాతనం. సామరస్యమే భారతీయం.

శివకేశవులు ఏక హృదయులు. ఏకతత్త్వం.

వివేకవంతులెవరూ భేదాన్ని చూడలేదు. భేదం చూడనివారే ప్రపంచం చేత ఆదరింపబడ్డారు.

చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగనేటికి తల్లుల కడుపు చేటు – అన్న భాగవతోత్తములు పోతనాదుల మార్గాన్ని మనం అనుసరించినప్పుడే విష్ణుప్రీతి.

మనల్ని పతనం చేయడానికి ప్రయత్నించే కలి పురుషుడు ఈ శివకేశవ

భేదాన్ని మనలో ప్రవేశింపజేస్తాడని పురాణాలు స్పష్టంగా చెప్తున్నాయి. కలిదోష నాశకులైన హరిని, హరుని స్మరించి – 'ఏకత్వా'న్ని భజించి తరించుదాం.

ఉదాత్తమైన భారతీయ తాత్త్విక చింతనతో విశ్వాన్నంతటినీ విష్ణుమయంగా దర్శించే స్థాయికి ఎదిగేలా చేయమని పరమాత్మను ప్రార్థిద్దాం. అస్తు.

ఈ త్రిగుణాతీత స్థితియే చెక్కుచెదరనిది కనుక –

స్థాణుః.. 28

1. స్థిరమైనవాడు. చలించనివాడు.
   జగత్తు అనే చక్రం 'పరమాత్మ' అనే ఇరుసును ఆధారం చేసుకుని భ్రమిస్తుంది. కానీ ఆ ఇరుసు 'స్థిరం'గా పరిణామ రహితంగా ఉంటుంది. స్థిరత్వమే పరమాత్మ యొక్క అసలు తత్త్వం. ఆధారం ఎప్పుడూ స్థాణువే. జగదాధారుడైన విష్ణువు స్థాణువు.
2. **తిష్ఠతీతి స్థాణుః** భక్తులను అనుగ్రహించే విషయంలో దృఢంగా నిలిచేవాడు – అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు. స్వామి కృప, సంకల్పం స్థిరమైనవి.
3. **వృక్ష ఇవస్తబ్ధో దివి తిష్ఠత్యేకః ।**
   తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్ ॥ అని వేదం వివరించింది.
   వృక్షపు కొమ్మలు రెమ్మలు పువ్వులు ఆకాశం వైపు ఎదుగుతూ, గాలికి కదులుతూ, చిగురిస్తూ, రాలుతూ, పండుతూ ఉన్నా దానిని నియంత్రించి చైతన్యాన్నిచ్చే స్కంధము (కాండము), వేళ్ళు నిశ్చలంగా, స్తబ్ధంగా ఉంటాయి. అలాగే సృష్టి స్థితి లయాది పరిణామాలతో నున్న విశ్వవృక్షంలో వీటన్నిటినీ నిర్వహించే అసలు చైతన్యం ఏ మార్పూ లేని శాంతమంగళ స్థిరత్వంతో ఉంటుంది. అందుకే పూర్ణ పురుషుడు 'శివః స్థాణుః' అని కీర్తించబడ్డాడు.
4. స్థిరమైనవాడు – అంటే చలించని వాడు.
   'చలించడం' అంటే ఇంతకు ముందు తానులేని చోటుకి వెళ్లడం. ఇక్కడ

ఉన్న ఒక వస్తువు అక్కడికి కదిలింది– అంటే, ఇంతకు ముందు అక్కడ లేదు అని అర్థం. అక్కడికి వెళితే ఇక్కడ ఉండదు అని కూడా భావం. సర్వవ్యాపి అయిన పరమాత్మ ఎక్కడికని కదులుతాడు? ఎక్కడలేడని – లేని చోటుకి వెళ్లేది? అందుకే ఆయన ఎప్పటికీ స్థాణువే.

5. 'స్థాణు' అంటే 'మోడు' అని అర్థం కూడా ఉంది.
కామాది వికారాలేవీ లేని నిస్సంగస్థితిలో, 'కేవలత్వం'గా మిగిలే నిర్వికార పరతత్వమది.

6. 'స్థాణు' శబ్దానికి 'లింగరూపి' అని కూడా అర్థం.
సర్వమునకు ఆధారము – అవ్యక్త, వ్యక్త తత్త్వానికీ సంకేతము 'లింగం'. నిర్గుణమూ కాక సగుణమూ కాక – నిర్గుణ సగుణాల సమన్వయ తత్త్వమే లింగం. సగుణ బ్రహ్మను, నిర్గుణ బ్రహ్మను ఆరాధించిన ప్రభావం లింగారాధన వలన సిద్ధిస్తుందని – 'అరూపరూప' తత్త్వాన్ని 'స్థాణు' అన్నారు. ఇదే అఖండజ్యోతిః స్వరూపం. **'నారాయణ పరోజ్యోతిరాత్మా నారాయణః పరః'.**
నిర్గుణతత్వం సగుణమైన జగత్తుగా పరిణమించడానికి ముందున్న సగుణ నిర్గుణ సమన్వయస్థితియే 'స్థాణు' తత్త్వం.
ఈ సుస్థిర తత్త్వమే సకల జగత్తుకంటే ముందున్నది – జగత్తుని కలిగించినది. కనుకనే ఆతడు

భూతాదిః.. 29

1. సర్వభూతములకు ఆదికారణమైన వాడు. మహాశక్తిమంతాలైన పంచ భూతాలకు కూడా కారణమైన అత్యంత సూక్ష్మతత్వం విష్ణువు. కనిపించే ప్రతి కార్యానికి ముందు కర్త యొక్క ఉనికి ఉంటుంది. అలాగే సర్వలోక నియన్త, ఈ లోకాల నిర్మాణానికి పూర్వమే ఉన్నవాడు అని 'భూతాది' శబ్దం చెబుతోంది. ఈ పరమ పురుషుని నుండి కాలాది భూతాలు

ఏర్పడ్డాయని వేదమంత్రాలు చెబుతున్నాయి.

సర్వేనిమేషా జజ్ఞిరే విద్యుతః పురుషాదధి (యజుర్వేదం)

2. **భూతైః అదీయతే ఉపాదీయతే ఇతి భూతాదిః**

భూతములందరి చేత (ప్రాణులందరిచే) కోరబడే ఆనంద స్వరూపుడు. అందరికీ దిక్కు ఈతడే. ఏది కావాలన్న ఈయనే అందివ్వాలి.

సమస్తమస్యాశ్రయణేన సిద్ధ్యతి – అని శ్రుతి.

'అన్నీ ఈయనను ఆశ్రయించడం చేతనే లభిస్తున్నాయి'.

ఏతేవయం సర్వసమృద్ధకామాః
ఏషామయంనో భవితా ప్రశాస్తా ॥

'మాకు ఈతడే స్వామి ఐనాడు కనుక, మేము సమస్త సమృద్ధులను సకలాభీష్టాలను పొందిన వారమైతిమి'.

అందరికీ ఇచ్చేవాడు ఆయనే. ఒక్క జీవులకే కాదు – పంచభూతాలకు కూడా వాటి మహిమలు ఈ స్వామి వల్లనే లభిస్తున్నాయి. అలా ఇస్తూ పోతుంటే ఆ సంపద తరిగిపోదా! తరిగిపోని మహాసంపద అయనే కనుక ఏ సమస్యాలేదు – అంతేకాదు అతడు మహిమల నిధి. అది తరుగనిది.

నిధిరవ్యయః .. 30

1. **అవినశ్వరో నిధి రిత్యర్థః.** వినాశనము, తరుగుదల లేని గొప్ప నిధి.

'నిధి' అంటేనే ఏనాటి నుండో ఉన్న గొప్ప అక్షయ సంపద. సృష్టికి పూర్వం నుండీ ఉన్న గొప్పసంపద విష్ణువు. దేవతలు, పంచభూతాలు, జీవకోటి...

ఇలా ప్రపంచమంతా ఆ గని నుండే వాటివాటి లక్షణ సంపదలను పొందుతున్నాయి. ఎన్ని యుగాలు సాగుతున్నా, ఎన్ని సృష్టి చక్రాలు ఆవృతాలౌతున్నా ఆ నిధి తన సంపదలను ప్రసరిస్తూనే ఉంది– తరుగుదల లేనిది కనుక.

'తద్యథా హిరణ్య నిధిమ్ నిహితమ్' అని పరమాత్మ తత్త్వాన్ని ఛాందోగ్యం

చక్కగా నిర్వచించింది. సువర్ణమయమైన నిధిని గుహలో పెట్టినట్లుగా, ప్రతివారి హృదయ గుహలో ఉన్న పరమాత్మ శాశ్వత అక్షయనిధి. గుప్తనిధి. నిజానికి ఈ నిధిని గ్రహించాలి. ఇంత ఈశ్వర సంపదను మనలోనే దాచుకొని ఎటో వెతుకుతూ, దరిద్ర భావంతో బ్రతుకుతున్నాం.

పంచభూతాత్మకమైన దేహాలకు ముందే, కారణమై ఉన్న 'భూతాది' ఇది. శరీర కోశాలకు కావలసిన చైతన్యమంతా ఈ చిన్మయనిధి నుండే లభిస్తోంది.

ఈ విషయాన్ని గ్రహిస్తే ఈ నిధియే ప్రపంచమంతా నిండి ఉన్నదని గ్రహిస్తాం. ముందు మనలో స్వామిని (నిధిని) పట్టుకుంటే, బయట కూడా అతడే గోచరిస్తాడు.

ముందు గుప్తనిధిగా అనిపించినా, బట్ట బయట పట్టపగటి వెలుగులా ఉన్నసంపద అనంత నిధి – ఈయనేనని గుర్తిస్తాం.

"పట్టపగటి వెలుగు పరమాత్ముడు
బట్టబయటి ధనము పరమాత్ముడు" అని అన్నమయ్య సృష్టపరచినది ఈ నారాయణ నిధి గురించే.

ఈ అవ్యయ నిధిని చూసినవాడు ఆనందసంపన్నుడు – **"నళినాక్షుడను నిధానము కంటి నేనని ఉబ్బిగంతులు వైచునొక్కచోట"** అని ప్రహ్లాదుని వర్ణించారు పోతనగారు.

"నిధి చాల సుఖమా – రాముని సన్నిధి సేవ సుఖమా
నిజముగ పల్కు మనసా" – అంటూ త్యాగయ ఈ 'విష్ణునిధి' అనే అక్షయ సంపదే ఆనందమని గమనించి, ఆశ్రయించారు. తెలివైన వారంతా ఈ నిధిని వదలరు. మన పూర్వ మహర్షులు ఎంతో శోధించి, తపస్సాధనలతో సాధించి మనకు చూపించిన సత్యనిధి నారాయణ తత్త్వం.

"చాలా నేరిచి పెద్దలిచ్చిన నిధానమా!
.... పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా"–అన్నమయ్య ఆలాపన ఇది.

2. అసలు మనము కూడా ఈ నిధిలోని వారమే. నిధికి దూరమై లేము. దూరమైతే మనమే లేము. ఆ మమైకాన్ని గుర్తించడమే నిధిని తెలుసుకొనడం. **'సర్వం అస్మిన్ నిధీయన్తే - ఇతి నిధిః'**. అన్నీ ఇందులోనే నిక్షిప్తమౌతున్నాయి.

ఒకపరి జగముల వెలినిడి
ఒకపరి లోపలకి గొనుచు...

'భూతాది' అయిన ఈ పరమేశ్వరుని నుండే జగములు వెలికి వస్తున్నాయి. తిరిగి ఆయనలోనే 'నిధింప' (నిక్షిప్తం) బడుతున్నాయి. అవ్యయమైన ఈ తత్త్వమే అన్నిటినీ నిక్షిప్తం (లయం) చేసుకుంటున్నది.

ఇంత తరగని నిధి కనుక - చరాచర భూతాలు ఇందునుండి చక్కగాకలుగుతున్నాయి. అంతేకాదు - ఈ నిధి కూడా చక్కగా మనకోసం మనముందు అవతరిస్తుంది.

సంభవః .. 31

1. 'భవం' అంటే కలుగుట, ఉండుట. ఎల్లవేళలా అక్షయమైన నిధిలా ఉండేవాడు. ఈ 'ఉండడం' ఇతర భూతకోటి వలె ఉండడం కాదు. సంపూర్ణమైన ఉనికి. ఆ సంపూర్ణతనీ, సమ్యక్ స్థితినీ తెలియజేసేదే 'సం'. **'స్వేచ్ఛయా సమీచీనం భవనం అస్యేతి - సంభవః'**. స్వేచ్ఛగా చక్కగా కలిగినవాడు.
2. ఇన్ని భూతములను సర్గం (సృష్టి) మొదలు కల్పాంతాల వరకు కలిగిస్తున్నప్పటికీ తన ఏకత్వస్థితిలో తానుండువాడు - సంభవుడు. **సం - ఏకీ భావేవ్యయమ్.** ఏకీభావనతో ఉన్నఅస్తిత్వమే - సంభవః..
3. స్వామి అవతారములను దాల్చినప్పుడు వివిధ రూపాలతో కలిగాడు. ఈ కలగడం ఇతర భూతాల పుట్టుక వంటిది కాదు - అని ఈ 'సంభవ' శబ్దం చెబుతుంది. మన పురాకృత కర్మను అనుసరించి ఉంటాయి మన 'భవాలు' (జన్మలు). కానీ విష్ణువు యొక్క భవాలు (అవతారాలు) కర్మ

జన్యాలు కావు. ఈ విషయం పరమాత్మయే గీతలో స్పష్టపరచాడు.

"జన్మ కర్మ చ మే దివ్యం",

– నా జన్మలు (అవతారాలు), నా చేష్టలు దివ్యములు.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥
అజోపిసన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా॥

స్వామి అవతార విషయంలో 'సంభవామి' అనే మాట మాత్రమే ప్రయోగింపబడింది. పుట్టుక పొందినా అది ఇతర జీవుల వంటి పుట్టుక కాదు. అది లీలా జన్మ. మనది కర్మజన్మ. ఆ లీలయే తన మాయను తన అధీనంలో ఉంచుకొని స్వామి దాల్చిన అవతారం.

ఆ అవతారాలలో స్వామి నామము, రూపము, ఔదార్యాది గుణాలు అన్నీ సమగ్ర సంపూర్ణ దివ్య లక్షణాలతో శోభిస్తాయి. అందుకే ప్రతి అవతారంలోను స్వామి 'సం'భవుడే. జన్మరహితుడైనప్పటికీ, సకల ప్రాణి కోట్లకు ఈశ్వరుడైనప్పటికీ సృష్టిలో సాధుత్వాన్ని రక్షించి, దుష్టత్వాన్ని తొలగించి ధర్మసంస్థాపన కోసం 'సంభవించే వాడు' అని గీతాశ్లోకాలలో చెప్పిన విషయమే ఈ నామానికి అర్థం.

'సం' అనే ఉపసర్గ ద్వారా స్వామి అవతారాలలోని వైభవమంతా చెప్పబడినట్లే.

న పర్యగాచ్ఛుక్రమ కాయమవ్రణమస్నా విరగ్ం శుద్ధమపాప విద్ధమ్ ॥

– అని యజుర్వేదం వర్ణించినట్లుగా, అది ప్రకృతి బద్ధమైన స్వరూపం కాదు. ప్రకృతికి అతీతమై, ఏ వికారమూ దోషమూలేని పావన భవము సంభవము. **'నతస్యప్రాకృతా మూర్తిః'** – ప్రాకృతికమైన దేహం కాదది. **'రూపం వా అతీంద్రియం'** – ఇంద్రియాలకు అతీతమైన రూపం.

అథ దుష్ట వినాశాయ సాధూనాం రక్షణాయ చ ।

స్వేచ్ఛయా సంభవామ్యేవం గర్భదుఃఖ వివర్జితః ॥

గొప్ప ప్రయోజనం కోసం తనను తాను సృష్టించుకుంటాడు. మన జన్మలు మన కర్మల కొద్దీ సృష్టింపబడినవి. స్వామి అవతారాలు ఆయనకు ఆయనయే – స్వేచ్ఛయా – లోక క్షేమం కోసం, మనల్ని ఉద్ధరించడానికి సంభవించినవి. అందులో గర్భ దుఃఖాదులుండవు. తాను గర్భదుఃఖ రహితుడు కనుకనే, ఆయనను కన్న దేవకీ, కౌసల్యలకు ప్రసవ వేదన లేదు.

అందుకే అన్నమయ్య కృష్ణజననాన్ని వర్ణిస్తూ

'నవ్వుచు దేవకి నందను గనియె' అన్నారు.

'అజాయమానో బహుధావిజాయతే'

– జన్మ రహితుడైనప్పటికీ అనేక విధములుగా కలిగినవాడు – సంభవుడు. స్వేచ్ఛతో, సంపూర్ణ తత్త్వానికి లోటులేకుండా దాల్చిన అవతారమే సంభవం.

యందేవం దేవకీ దేవీ వసుదేవాదజీజనత్ ।

భౌమస్య బ్రహ్మణో గుప్త్యై దీప్తమగ్ని మివారణిః ॥

విష్ణు సహస్రానికి దేవతగా 'భగవాన్ దేవకీసుతః' అని భీష్ముడు సెలవిచ్చాడు. ఆ పూర్ణావతారం – అరణి యందు అగ్నివలె (యజ్ఞం కోసం అరణిని మధించి తీసే అగ్ని – అత్యంత పవిత్రం) లోకరక్షణ అనే యజ్ఞానికై, వేద, సాధు రక్షణకై కలిగినది. కనుక అతడు సంభవుడు.

ఆ సంభవత్వం లోకమునకు ఎన్నిటినో ఇచ్చేందుకు (ప్రసాదించేందుకు) గైకొన్నదే.

భావనః .. 32

1. **భావయతి ఇతి భావనః.** 'ఇచ్చువాడు'.

'ఫలమత ఉపపత్తేః' –అని బ్రహ్మ సూత్రాలలోని సూత్రం.

'సకల జీవులకు కర్మఫలాలు ఈయన నుండే లభిస్తున్నాయి'.

కర్మలు చేయడం వరకే జీవుల అధికారం. కర్మానుగుణ ఫలం భగవానుని

శక్తి నుండే లభిస్తుంది. అతడే ఫలప్రదాత. దుష్టులకు శిక్షణ రూపంలోను, శిష్టులకు రక్షణ రూపంలోను ఫలాల నిచ్చువాడు ఈయనే.

2. **భావయతి ఉజ్జీవయతీతి భావనః.** వివిధ అవతారాలుగా సంభవించి, అనిష్టాలను పోగొట్టి సత్పురుషులను ఉజ్జీవింప జేసేవాడు కనుక 'భావనుడు'. ఈ మహాదాత అనుగ్రహం వలన అన్నీ సిద్ధిస్తాయి. అంతేకాదు, ఈ కరుణానిధికి ఇవ్వడమే స్వభావం. సమర్పణ బుద్ధి కల భక్తునికి "తన్నుతానైన ఇచ్చు" అని భాగవతం చెబుతోంది. తన అవతారంతో మంత్రాలుగా తన నామాలను, ధ్యానానికి తన రూపాలను, స్మరణకు తన లీలలను - తరించడానికి తన తత్త్వాన్ని మనకు ప్రసాదించేవాడు ఆతడే కదా!

   'యాదృశీ భావనా తత్ర సిద్ధిర్భవతి తాదృశీ' భావనకు తగ్గ సిద్ధినిచ్చే భావనుడు.

3. తన ఉనికిచే జగతికి ఉనికి నిచ్చువాడు 'భావనుడు' అని కూడా అర్థం.

4. జీవకోటిలో భావనారూప చైతన్యం విష్ణువే. 'భావన' అనే బలమైన శక్తి సంసారానికీ, కైవల్యానికీ కారణం. 'భావనారాయణ' అని కూడా స్వామిని ఆరాధిస్తాం కదా! భక్తుల ధ్యానంలో భావనారూపంలో ఉండేవాడు. సంభవం ద్వారా భావనుడైన ఆయనను మించిన పోషకుడెవడు? ఆ సంభవమూ భావనమూ మనలను భరించుట కోసమే-

భర్తా .. 33

1. ప్రతి అణువునూ గమనిస్తూ, పోషించే భగవానుడు 'భర్తా'. **'గతిర్భర్తా ప్రభుస్సాక్షీ'** అని గీతలో కీర్తించబడినాడు.

   'బిభర్తి పుష్ణాతీతి భర్తా'. భరణమూ, పోషణమూ కలిగించే వాడిని 'భర్త' అంటారు.

   ప్రపంచానికి ఆధారమై భరిస్తూ పోషిస్తున్న స్వామి. తన అవతారాది కార్య

సందర్శన గ్రంథాలయం
94588
A C. No.....

ముల ద్వారా ఈ భర్తృ లక్షణాన్నే ప్రదర్శించే స్వామి, వాటి ద్వారా తన అవతారములు మహోత్కృష్టములని చాటుతున్నాడు. కనుక అతడు -

ప్రభవః.. 34

1. ఉత్కర్ష - ఆధిక్యత కలిగిన పుట్టుక కలవాడు. పుడుతూ పోతూ సాగే మన పుట్టుకల చక్రాన్ని పోగొట్టుకోవాలంటే స్వామి పుట్టుక (అవతారం)ను స్మరించి కీర్తించితే చాలు. మనకు జన్మబంధాలను నివర్తింపజేయడానికి తాను లీలగా, అత్యంత ఉత్కృష్టమైన విభూతులతో జన్మించాడు.
   జన్మకర్మ చ మే దివ్యమేవం యోవేత్తి తత్త్వతః ।
   త్యక్త్వాదేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జున ॥
   - అని గీతలో తన అవతార ప్రయోజనాన్ని చాటి చెప్పాడు స్వయంగా. "అర్జునా! నా దివ్యమైన జన్మమును, కర్మమును చక్కగా తెలుసుకొనేవాడు. దేహమును విడచినా పునర్జన్మను పొందడు. నన్నే పొందుతాడు". ఎంత చక్కని అభయం! ఎంత అద్భుతమైన అనుగ్రహం! మన జన్మను పోగొట్టడానికి తాను జన్మించే కృప అది! ఆ 'కృప'యే 'ప్రకృష్టం'. దయను వెదజల్లే అద్భుతావతారుడు కనుక - ప్రభవుడు.
   అప్రమేయ మనాద్యన్తం కామాజ్ఞాత మజం నృషు ।
   పాణ్డవస్తర్కయామాస కర్మభిః దేవ సమ్మతైః ॥ (మహాభారతం)
   కొలతకందని వాడై, ఆద్యంత రహితుడై యున్నా తన ఇచ్ఛచే మానవునిగా పుట్టి ఉన్నాడని కృష్ణుని దివ్య చేష్టలను బట్టి అర్జునుడు గ్రహించాడు. సంపూర్ణత, ప్రకృష్టత కల దివ్యచేష్టల అవతారములు దాల్చినవాడు - సంభవుడు, ప్రభవుడు.
2. విశేషంగా మహాభూతాలన్నీ ఈయన నుండి కలుగుతున్నాయి. కనుక - ప్రభవుడు.
3. సృష్టి కర్త అయిన బ్రహ్మకు సృష్టిని చేసే శక్తి నిచ్చిన పరమాత్ముడు, ఆ

బ్రహ్మను కూడా సృష్టించినవాడు. కనుక ప్రకృష్టమైన సృష్టికి హేతువైన ప్రభవుడు.

సర్వసృష్టికి హేతువు మాత్రమే కాక పాలకుడూ, సమర్థుడూ కూడా ఆయనే. ఆ కారణం చేతనే –

ప్రభుః .. 35

సర్వసమర్థుడు, సర్వాధికారి. జగన్నిర్వహణలోనే కాక, అవతారకార్యాలలో కూడా దీనినే వ్యక్తం చేశాడు. రాముడై వచ్చినా, కృష్ణుడై నడయాడినా సర్వదేవతలకు తానే ప్రభువునని ఋజువు చేసిన దేవాదిదేవుడు.

సాగరం, భూమి అన్నీ రామునికి దాసోహమన్నాయి. దేవతలు స్తుతిస్తూ వచ్చారు. ఆశ్రితులకు ముక్తినిచ్చి, బ్రహ్మేంద్ర వరుణాదులకు కూడా తన సర్వసమర్థతను చాటిన విశ్వరూపునిగా శ్రీకృష్ణుడు విరాజిల్లాడు.

ప్రతి చేష్టను సర్వసమర్థంగా, పూర్ణ అధికారంతో నిర్వహించే ఈ స్వేచ్ఛాశాలిని – **'సమూర్ధా ప్రభుః'** అని వేదం కీర్తించింది. ఈ సమర్థత, అధికారాలనే సమగ్ర ఐశ్వర్యములు కలవాడు కనుక –

ఈశ్వరః 36

1. ఒకరి ఆధారం అవసరంలేని అనంత సహజ ఐశ్వర్యం కలవాడు ఈశ్వరుడు. జగన్నిర్వహణకు అవసరమైన ఐశ్వర్యమంతా స్వామి స్వరూపము.
2. పరమాత్మ సృష్టి స్థితి లయాది కృత్యాలు నిర్వహించేటప్పుడు 'ఈశ్వర' అని పిలువబడతాడు.

   జగమంతా నిండినవాడే ఈశ్వరుడు.

   'ఈశావాస్య మిదం సర్వం' అని శ్రుతి వచనం.

   'ఏష సర్వేశ్వరః' అని కూడా శ్రుతి మాత కీర్తిస్తూ

'తమీశానం జగతస్త స్థుషస్పతిం ధియం జిన్వమవసే హూమహేవయమ్' అని శరణు వేడింది.

3. 'ఈష్టే ఇతి ఈశ్వరః' - సమస్త కార్యములు నెరవేర్చి పాలించే పాలకుడు. మహాశక్తి సంపన్నుడని అర్థం. ఈ ఈశ్వరుడే సృష్టిలో అన్నిటికీ 'ఆది' అంటూ ఆయనను వర్ణించాం. మరి ఆయనకు ఆది ఉన్నదా? లేదు - తనకు తానే ఆది. తన ఉనికికీ, అవతారానికీ తానే కర్త. అందుకే -

స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః ।
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః ॥ 5

37. స్వయంభూః, 38. శంభుః, 39. ఆదిత్యః,
40. పుష్కరాక్షః, 41. మహాస్వనః । 42. అనాదినిధనః,
43. ధాతా, 44. విధాతా, 45. ధాతురుత్తమః ॥

స్వయంభూః.. 37

1. **కవిర్మనీషీ పరిభూః స్వయంభూః** - అని యజుర్వేదం పేర్కొంది.
   స ఏవ స్వయముద్భభౌ- అని మనుస్మృతి.
   తనకు తానుగా ఉన్నవాడు, కలిగిన వాడు. స్వయంసత్తా స్వరూపుడు.
   సృష్టిలో దేనికైనా ఒక కారణముండాలన్నది ప్రకృతి నియమం. ప్రకృతికంటె అతీతుడైన పురుషోత్తమునకు ఈ కార్యకారణ నియమం వర్తించదు.
   సర్వమునకు తాను కారణమై తనకు కారణములేని వాడు స్వయంభువు.
   అంతటనూ ఉన్నది ఆ స్వయంభువే. **'స్వయంభూః బ్రహ్మ పరమం కవీనామ్'** -అని వేదోక్తి.
2. అవతారాది కృత్యములను కూడా తన దయతో తానే దాల్చినవాడు.
3. సృష్టిలో స్వయంచాలక శక్తిని కలిగించినవాడు స్వయంభువు. నదులు

తమంత తాము కదులుతున్నవి. గాలి తనంత తానే వీస్తున్నది. సూర్యాదులు తమంత తామే వర్తిస్తున్నారు. సముద్రాదులు స్వయంగా ఉత్తుంగ తరంగాలతో వర్ధిల్లుతున్నాయి. జీవకోటిలో స్త్రీ పురుషాదుల్లో సహజంగా, స్వయంగా వర్తిల్లే చైతన్యం స్వామి స్వరూపమే. ఆ స్వయం చైతన్య స్వరూపుడు – స్వయంభువు.

స్వతంత్రతా లక్షణమైన తన చైతన్యంతో సర్వమునకు శుభమును, సుఖమును కలిగించువాడు కనుక –

శంభుః .. 38

1. శం – సుఖం, శుభం, శాంతి. వీటిని కలిగించడమే పరమాత్ముని స్వభావం. అందుకే శంభుడు. శివనామంగా వేదాదుల్లో ప్రసిద్ధమైన ఈ నామం ద్వారా శివకేశవాత్మకమైన తత్త్వం ఒకటేనని మరోమారు ప్రతిపాదింపబడింది.

'నమశ్శంభవే చ' అని రుద్రనమక మంత్రం **'నమశ్శివాయ చ శివతరాయచ'** అని ముగించింది. విష్ణు సహస్రనామంలో పంచాక్షరి లాంటి వేదమంత్రాలు నిబద్ధింపబడి ఉన్నాయని గమనిస్తే, సర్వదేవమయ వేదమంత్ర రాశిగా, తద్వారా వేదస్వరూపంగా ఈ నామ సముచ్చయం సాక్షాత్కరిస్తుంది. రామాద్యవతారాలలో విష్ణువు దర్శన మాత్రం చేత సుఖాన్నీ, శాంతినీ ప్రసాదించినవాడు.

రూపౌదార్యగుణైః పుంసాం దృష్టి చిత్తాపహారిణమ్ ।
చంద్రకాన్తాననం రామం అతీవ ప్రియదర్శనమ్ ॥

"రూపంతో ఔదార్యాది కల్యాణ గుణాలతో సకల జీవుల దృష్టినీ, చిత్తాన్నీ అపహరించేవాడు. చంద్రునివలె అత్యంత ప్రియదర్శనుడైనవాడు రాముడు" అని వర్ణించాడు వాల్మీకి.

'విశ్వాక్షం విశ్వశంభువమ్' అని నారాయణుని శ్రుతి కీర్తించింది.
విశ్వానికి శుభాలను ఉత్పత్తి చేయడం ఆయన లక్షణం.
తనకుతాను కలిగినవాడు (స్వయంభూః) జగత్తునకు శుభము కలిగించుటకై సర్వకార్యములను నిర్వర్తింపజేస్తున్నాడని గ్రహిస్తే చాలు – సర్వమూ శుభంగా కనిపిస్తుంది.
శన్నః క్షేత్రస్య పతిరస్తు శంభుః ॥ అథర్వవేదం.
'ఈ క్షేత్రానికి (జగమునకు, దేహానికి కూడా) శంభుడే పతి యగుగాక! శుభము లిడుగాక!' అని అథర్వవేదం.
శుభ, ఆనంద, శాంత స్వభావుడు కనుక లోకానికి మంగళములను ప్రసాదించేందుకు ఆదిత్య రూపుడై ప్రకాశిస్తున్నాడు.

ఆదిత్యః .. 39

1. సూర్యస్వరూపుడు. పరమాత్మ తేజమే సూర్యునిలో ఉన్నది.
'అసావాదిత్యో బహ్మ' అని వేదం 'ఈ ఆదిత్యుడే బ్రహ్మము' అని స్పష్టం చేసింది.
అఖండ తేజోమయుడైన నారాయణుడు అనంత విశ్వంలో బహుసూర్య స్వరూపాలతో ఉన్నాడని మన శాస్త్రాలు చెబుతున్నాయి. విజ్ఞానశాస్త్రమూ దీనినే ప్రవచిస్తోంది. సూర్యుని పరదైవంగా ఆరాధించే వైదిక 'సౌర'మతం మనకు ఉన్నది. ఉత్కృష్టమైన ఈ ఆరాధనా సంప్రదాయం శ్రీమద్రామాయణంలో, మహాభారతంలో కూడా గోచరిస్తుంది.
వేదం సూర్యునికి సంబంధించి అనేక రహస్యాలను వెల్లడించింది. పరమాత్మ తన పరమేశ్వర స్వరూపాన్ని సూర్య రూపంతోనే వ్యక్తీకరిస్తున్నాడు. అందుకే వేదమంతా సౌరచైతన్యోపాసనగా కనిపిస్తుంది. ఈ దృష్టితో చూస్తే – **విష్ణు సహస్రనామ విద్య** గొప్ప **సూర్యోపాసన.** సూర్యుని నామాలు తామరతంపరగా

ఇందులో కనిపిస్తాయి. పరిశీలిస్తే – ప్రతినామమూ సూర్యనామమే.
భారతీయులు జ్యోతిరుపాసకులు. జ్యోతి సూర్యుడే.
యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఖిలం ।
యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్ ॥ (భగవద్గీత)
"ఆదిత్యునిలో, అగ్నిలో, చన్ద్రునిలో ఉన్నది నా తేజస్సు అని తెలుసుకో"
–శ్రీకృష్ణ పరమాత్ముని వచనం.
అగ్నిలో చన్ద్రునిలో ఆదిత్య తేజమే ఉందన్నది స్పష్టం. ఆదిత్యునిలో ఉన్నది నారాయణ తేజం.
ఊరంతా దీపాలున్నా మన ఇంటి దీపం మనకి వెలుగునిస్తోంది. వెలుగును ఆరాధించాలంటే మనింటి దీపాన్నే ఆరాధించాలి. అదే పరమకాంతిగా ఉపాసించాలి.
అలాగే ఈ పృథివికీ, మనపై ప్రభావం చూపే గ్రహాలకు మూలకారణమైన సూర్యమండలమంతా నారాయణమయం అని తెలుసుకొని ఆరాధించాలి. మనమూ, ఈ జగమూ అంతా సౌరశక్తిమయం. సూర్యమండలం నుండి ఉద్భవించిన గ్రహసమూహాన్ని ఆయా కక్ష్యలలో తన ఆకర్షణ ద్వారా నియమించి, శక్తిని ప్రదానం చేస్తూ, ప్రతిజీవి కోటి ఉత్పత్తి స్థితిలయలకు హేతువౌతున్నది – ఆ మండలాంతర్గత మహాచైతన్యమే కదా!

అందుకే పరబ్రహ్మను ఏ అభీష్ట దేవతారూపంగా ఆరాధించినా సూర్య మండలంలో ఆరాధించమన్నారు. నిరాకారమైన ఈ మహాచైతన్యంలో ఏ సాకార దేవతా రూపాన్నైనా ఆరాధించవచ్చు. అగ్నిలో, ప్రతిమలలో దేవతలను భావిస్తాం. అలాగే సూర్యాగ్నిలో భావించాలి. ఈ భావన సత్యం. అన్ని సంప్రదాయాలలోనూ సూర్యుని ఆరాధన ఉంది.
సూర్య 'నారాయణుడు' అంటాం.
'ఆదిత్యం చ శివం విద్యాత్', 'సౌరమండల మధ్యస్థం సాంబం' –అని ఆరాధిస్తాం. అమ్మవారిని **'భానుమండల మధ్యస్థా' 'భానువిద్యా'** అని

ఉపాసిస్తాం. ఇలా సర్వదేవతోపాసనకు కేంద్రమతడే.

అందుకే ఆయన త్రిమూర్త్యాత్మకుడు. వేదమయుడు. సర్వశక్తిమయుడు. సర్వదేవతా స్వరూపుడు. ఈ అపార విశ్వంలో సూర్యశక్తియే వ్యాపించి

వివిధ విధాలుగా పనిచేస్తోంది. వివిధ విధాల సౌరశక్తి విశేషాలే వివిధ దేవతలు.

వైదిక శబ్దాలను పరిశీలిస్తే సౌరవిజ్ఞాన రహస్యాలు గోచరించి, దేవతలపై మనకున్న సంకుచితాభిప్రాయాలన్నీ పటాపంచలౌతాయి.
పృథివ్యాదులయందు, ప్రాణికోటులందు 'వ్యాపించినది' సౌరతేజమే కనుక –అది 'విష్ణువు'.

అనన్తస్తద్ధర్మోపదేశాత్ – అని బ్రహ్మసూత్రాలు. పరమేశ్వర లక్షణములన్నీ ఆ సూర్యమండలం ద్వారానే వ్యక్తమౌతున్నాయి.

'ఏషోన్తరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే'.

సూర్యమండల మధ్యమున హిరణ్మయ విరాట్ పురుషునిగా ఉన్న పురుషోత్తముడు నారాయణుడు.

'సయశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే' – సూర్యమండలంలో ఉన్న వాడీతడే.

'సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ' – అని శ్రుతి.

ఈ జగత్తుకి ఆత్మ సూర్యుడు. సర్వ జీవకోటికీ ఆత్మ ఈతడు. సూర్యుని అర్థం చేసుకుంటే ఆత్మతత్త్వం అవగతమౌతుంది. ఈ జగత్తులో ప్రతి అణువూ సూర్యతేజంతో, శక్తితో నడుస్తున్నదే. కానీ ఇన్నిటినీ నడిపే ఆయన – పంచభూతాలకు కూడా హేతువై కూడా సాక్షిగా ఉన్నాడు. ఆయన ఉనికి మాత్రం చేతనే, చైతన్య ప్రసరణం చేతనే అంతా నడుస్తున్నది. ఏ ఒక్కరి కర్మలకూ కర్త కాని సాక్షీభూతుడు.

అలాగే మన శరీరాన్ని 'విశ్వం' అనుకుంటే, ఇందులో చైతన్యానికి మూలమైన ఆత్మ అనే సూర్యుడు హృదయాకాశంలో ఉన్నాడు. సూర్యకాంతితో

బ్రతుకుతూనే ఆయనను గుర్తించని పశుపక్ష్యాది అజ్ఞానుల వలెనే మనమూ ఆత్మను గుర్తించడం లేదు.

2. 'ఆదిత్య' శబ్దమే ఆత్మను తెలియజేస్తోంది. దితి అంటే ఛేదింపబడేది. అదితి అంటే ఛేదించలేనిది. ఛేదించలేని అఖండ తేజస్సే 'ఆదిత్యుడు'.

"అచ్ఛేద్యోయ మదాహ్యోయ మక్లేద్యోయం" అని ఉపనిషత్తులు, గీత ఆత్మ లక్షణాన్ని వర్ణించాయి. దేహం నశించినా తాను నశించని చైతన్యమే 'ఆత్మ'. దానిని ఛేదించలేం. కాల్చలేం. తడపలేం. జగతికి సూర్యుడెలాగో దేహానికి ఆత్మ అటువంటిదే.

'అంతరాదిత్యోపాసన' అని వేదం చెప్పినది ఆత్మవిద్యనే. దానిని గ్రహించడానికి ఆదిత్యారాధనను బహుముఖాలుగా వేదం బోధించింది. యజ్ఞాగ్ని, ధ్యానం – జపం – యోగం వలన ప్రభవించే తపోగ్ని, వాగగ్ని, జ్ఞానాగ్ని... అన్నీ ఆదిత్య స్వరూపాలే. యజ్ఞంలో ఆరాధ్యమైన అగ్ని 'సౌరాగ్ని' గానే పేర్కొన్నది శ్రుతి. సమస్త దేవతలూ – తేజోరూపులే. ఆ తేజస్సే ఆదిత్య తేజస్సు. మిత్ర – వరుణ – పూషా – భగ ... అని వివిధ విధాలుగా స్తుతింపబడే నామాలన్నీ సూర్యుని ఒక్కొక్క విలక్షణ శక్తినీ చెబుతున్నాయి. (అతి విస్తరభీతితో కొంత మాత్రమే 'విష్ణువిద్య'గా ఇక్కడ అందించడం జరుగుతోంది.)

'ఏకం సత్ విప్రా బహుధా వద' అనే వేదమన్త్రం కూడా సూర్య శక్తి ఎన్ని విధాలుగా భాసిస్తోందో చెప్పిన సందర్భం లోనిది.
బాహ్య జగత్తులో ఆదిత్యుని అవగాహన చేసుకొంటే, అన్తరంలోని ఆత్మను అవగతం చేసుకోగలం. అందుకే ఈ నామానికి భాష్యం చెబుతూ ఆదిశంకరులు.
"యథా ఆదిత్య ఏక ఏవానేకేషు జలభాజనేషు అనేకవత్ ప్రతిభాసతే ఏవమనేకేషు శరీరేషు ఏక ఏవాత్మా అనేకవత్ ప్రతిభాసతే ఇతి ఆదిత్య సాధర్మ్యాద్వా ఆదిత్యః" అని ప్రస్తావన చేశారు.

ఒకే ఆదిత్యుడు అనేక జలపాత్రలలో అనేకంగా (వేరువేరుగా) ఉన్నట్లు కనబడినప్పటికీ స్వరూపతః మార్పులేనివాడే. అలాగే ఆత్మ అనేక శరీరాలలో అనేకాలుగా ప్రతిభాసిస్తున్నా ఉన్నది ఒకే ఆత్మ. ఆదిత్యునితో ఈ సధర్మత వల్ల (సమాన లక్షణం వల్ల) ఆత్మతత్త్వం ఇక్కడ ఆదిత్యునిగా చెప్పబడింది. పాత్రల నీటిలో ప్రతిఫలించి జల వికారాలకు అనుగుణంగా ప్రతిబింబం కదులుతూ, ఆ ఉష్ణత వలన జలములలో మార్పులొస్తున్నా బింబమైన సూర్యుడు ఏ మార్పు లేకుండా ఉన్నట్లుగానే సర్వజీవ వ్యాపకుడై శక్తి ప్రదాత అయిన పరమాత్మ ఏ మార్పు, పరిమితీ లేని అఖండతేజం.

ఇదే భావాన్ని పోతనగారు –

"ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచుపోలిక" అన్నారు.

గీతలో పరమాత్మ–

యథాప్రకాశ యత్యేకః కృత్స్నంలోక మిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథాకృత్స్నం ప్రకాశయతి భారత ॥ *(భగవద్గీత)*

"ఒక్క సూర్యుడే సమస్త ప్రపంచాన్నీ ప్రకాశింపజేసినట్లు, ఆత్మ ఒక్కటే క్షేత్రాన్ని (శరీరాన్నీ, జగత్తునీ) ప్రకాశింపజేస్తున్నది".

శ్రీరామచన్ద్రుని వర్ణిస్తూ శ్రీమద్రామాయణంలో సుమిత్ర **"సూర్యాణాం సూర్యః"** అన్నది. "సూర్యులకు సూర్యుడు" అనంత విశ్వానికి ఆత్మ అయిన ఆ విష్ణు పరమాత్మయే అఖండతేజః స్వరూపుడైన ఆదిత్యుడు. అతని వెలుగులే ఈ విశ్వమంతా.

3. ఆ తేజః స్వరూపాన్ని హిరణ్మయాకృతిగా ఆదిత్య మండలంలో ధ్యానించాలని శాస్త్రం చెబుతోంది. బంగారు బొమ్మనిండా బంగారమే ఉన్నట్లు, సచ్చిదానంద లక్షణమైన పరమాత్మ చైతన్యమే ఆయన సగుణసాకారంలో ఉంటుంది.

ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ
నారాయణస్సరసిజాసన సన్నివిష్టః

కేయూరవాన్ మకర కుండలవాన్ కిరీటిహారీ
హిరణ్మయ వపుః ధృతశంఖ చక్రః ॥

"సూర్యమండల మధ్యంలో నున్న నారాయణుడు, కమలాసనుడై విరాజిల్లుతూ, హిరణ్మయమైన తనువుతో కేయూర మకర కుండల కిరీట హారాది స్వర్ణాభరణాలు ధరించి శంఖచక్రములను దాల్చి ఉన్నాడు". ఆదిత్య నారాయణుని ధ్యానవిధానం పైవిధంగా వర్ణితం.

4. **"ఆదిత్యోహ్యాది భూతత్వాత్"**

ఆది భూతుడైనవాడు – ఆదిత్యుడు. పంచభూతాలకు కారణం ఆదిత్య తేజస్సే. అందుకే తొలిభూతం (మొదట ఉన్నది) అదే. నారాయణ తేజస్సును వర్ణిస్తూ –

"వేదాహ మేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్"

అన్నది పురుషసూక్తం. ఈ విషయాన్నే గజేంద్రుడు స్తుతిస్తూ –

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగిన తుదిన లోకంబగు పెం
జీకటికవ్వల ఎవ్వం
డేకాకృతి వెలుగునతని నే సేవింతున్.

నారాయణజ్యోతి అసలు వర్ణం ఆదిత్య వర్ణం, అఖండ తేజం.

5. **'ఇయం వా అదితిః' – 'మహీందేవీం విష్ణుపత్నీమ్'** – వంటి శ్రుతులు భూమిని 'అదితి' అని చెప్పాయి. ఛేదింపబడకుండా (విడిపోకుండా) పటిష్టంగా అనంతాకాశంలో ఉన్న కారణంగా పృథివి అదితి. దీనిని తన తేజస్సుతో పాలించే పతిస్థానీయుడు సూర్యనారాయణుడు. కనుక ఆదిత్యుడు. భూదేవికి పతి అనడంలో ఈ పాలనార్థాన్ని గ్రహించాలి.

6.. **'ఆద్యత్తే రసాన్ భువోరశ్మిభిః' – ఇత్యాదిత్యః.**
'ఆదత్తే భాసం జ్యోతిషామ్' – ఇత్యాదిత్యః.
'ఆదీప్తో భాసేతి'... ఇలా వేదనిరుక్తం చాలా వివరించింది.

రసములను (శక్తులను) లోకములకు ప్రసాదించువాడు. భూమి నుండి రసములను ఆహరించు (స్వీకరించు)వాడు. వెలుగులను ఇచ్చువాడు, వెలుగువాడు.

7. దేవజనని అదితి. ఆమె తనయులు ఆదిత్యులు- దేవతలు. సమస్త దేవతా శక్తుల సమన్వయ తేజం - ఆదిత్యుడు. ఈ వైదిక భావన చాలా వైజ్ఞానికమైనది. అఖండతేజః పుంజం (అదితి) నుండి వెలువడే వివిధ కాంతి శక్తులు (దేవత - అంటేనే తేజోమయం - అని అర్థం) ఆదిత్యులు - దేవతలు. ఆ కాంతులన్నిటి కలబోత సూర్యుడు - ఆదిత్యుడు.
ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః ।
మహేంద్రో ధనదః కాలో యమస్సోమోహ్యపాంపతిః ।
పితరోవసవస్సాధ్యాహ్యశ్వినౌ మరుతో మనుః (ఆదిత్య హృదయం)

8.. ఈ సూర్యుడు పన్నెండు మాసాలలో పన్నెండు రూపాలతో (విధాలుగా) ప్రకాశిస్తాడు. అందుకే ఋతుచక్రం ఏర్పడుతుంది. ఈ ద్వాదశమాస ప్రకాశ భేదాలను అనుసరించి 'ద్వాదశాదిత్యులు' అన్నారు. ఒకే ఆదిత్యుడు ద్వాదశ విధాలుగా ఉన్నాడని అర్థం.
"పితరం ద్వాదశాకృతిందివ ఆహుః" అని ఋగ్వేదం వర్ణించింది.
ధాతా, అర్యమా, మిత్రః, వరుణః, ఇంద్రః, వివస్వాన్, దక్షోవా ।
పూషా, పర్జన్యః, అంశః, భగః, త్వష్టా, విష్ణుః - ఇతి ద్వాదశ ॥
అని వేదం ద్వాదశాదిత్యుల రూపాన్ని చెప్పింది.

8. అదితీదేవికి వామనుడై ఉదయించిన నారాయణుడు కనుక 'ఆదిత్యుడు' అని భావించవచ్చు. అణువై ఉదయించిన తేజం విస్తరించి త్రిలోకవ్యాప్త ముపడం - త్రివిక్రమత్వం దాల్చడం. సృష్ట్యాదిలో ఆవిర్భవించిన తేజః పుంజం అనంత విశ్వంగా వ్యాపించే విధానాన్ని వర్ణించడమే ఇందులో వృత్తాంతం. **'ఇదం విష్ణుర్విచక్రమే త్రేధానిదధేపదమ్'** అని శ్రుతి వర్ణించింది.

ఈ తొలిమహిమనే మళ్లీ వామనావతారంలో బలి దర్పాన్ని భంజించి

ప్రత్యక్షం చేశాడు స్వామి.

'విష్ణు' రూపం (ద్వాదశాదిత్యులలో ఒకటి) నారాయణ విభూతిగా – **"ఆదిత్యానామహం విష్ణుః"** అని విభూతి యోగం వర్ణించింది.

"ఆదిత్య ఏషాం భూతానామధిపతిః" అని ఐతరేయ బ్రాహ్మణంగా వేదవచనం.

"అసౌయస్తామ్రో అరుణ ఉత బభ్రుస్సుమంగలః" అని ఆదిత్యుని శుభ (మంగళ) స్వరూపునిగా – కల్యాణ కారకునిగా యజుర్వేద రుద్రమంత్రాలు వర్ణించాయి. ఆ 'సుమంగలం' అన్న భావనే "శంభుః ఆదిత్యః" అని ఈ సహస్రనామాల కూర్పులో ఒదిగింది. ఈ విష్ణుసహస్రనామాలన్నీ ఆధ్యాత్మి కార్థంలో విష్ణుబ్రహ్మమును, ఆధిదైవికార్థంలో సూర్యుని తెలియజేస్తున్నాయని వేదవిజ్ఞానం నిరూపిస్తోంది.

అంతరిక్షమున భాసించే సూర్యుని దృష్టి నుండి ప్రసరిస్తున్న చైతన్యం లోకానికి పోషకమౌతోంది. అందుకే ఆతడు–

పుష్కరాక్షః.. 40

1. వైదిక శబ్దార్థాల ననుసరించి – **"పోషతి పుష్ణాతి వా పుష్కరం"**. అంతరిక్షం, కమలం, ఉదకం అని అర్థాలు.

   – పోషించుట, పుష్టి కలిగించుటను – పుష్కరం అంటారు. అటువంటి పోషణకర, సంతోషకర దృష్టికలవాడు పుష్కరాక్షుడు.

2. అంతరిక్షమే సూర్యచంద్రాగ్నిమయం. ఆ తేజస్సే దృక్ లక్షణం. నేత్రానికి కూడా సూర్యుడే అధిదేవతగా చెప్తాం. జగచ్చక్షువు, కర్మసాక్షి... అని సూర్యుని వర్ణించాయి శాస్త్రాలు. జగత్తుకే నేత్రం – కర్మలకు సాక్షి. ఆ చూపు నుండి ఎవరూ తప్పించుకోలేరు. సమృద్ధి కలిగిన చూపు అది. 'పుష్కలంగా' అని సమృద్ధిని సూచించే మాట ఉంది. 'రలయో రభేదః' – 'ర,ల' లకు భేదం లేదని వ్యాకరణ శాస్త్రం. కనుక సమృద్ధి కలిగిన అనంత దృష్టితో 'సహస్రాక్షం'

జగత్తును పోషించే నారాయణుడు 'పుష్కరాక్షుడు'.

అస్య సూర్యశ్చక్షుశ్చంద్రమాశ్చ పునర్నవః ।
అగ్నిం యశ్చక్ర ఆస్యం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణేనమః ॥

(అథర్వ వేదం)

2. కమలము వలె వికసించిన విశాల నేత్రాలతో ఈ అపార విశ్వాన్ని గమనించేవాడు, మనోహరమైన నేత్రాలు కలవాడు – పుష్కరాక్షుడు. వికసనము, విశాలత జ్ఞానలక్షణం. స్వామి దృష్టి సర్వజ్ఞతా స్వరూపం. సర్వ బహిరంతరాలను దర్శించే సమృద్ధికల జ్ఞానశక్తి సంపన్నుడు, ఆ దివ్యజ్ఞానాన్ని శబ్దస్వరూపంతోనూ అందిస్తున్నాడు. కనుక ఆ స్వామి –

మహాస్వనః .. 41

1. గొప్పదైన శబ్దం – నాదం ఆయన స్వరూపం.
శబ్దములకు మూలమైన నాదం నారాయణుడే.
ఆ నాదం ప్రథమంగా 'ఓం' కారంగా వ్యక్తమయ్యింది. ఆ ప్రణవం నుండి హరి యొక్క శబ్ద స్వరూపమైన వేదరాశి ఉత్పత్తి అయ్యింది. ఆ నాదం, ప్రణవం, వేదం కూడా ఉత్కృష్టములైనవి. ఇవన్నీ మహాస్వనములు. వీటి రూపాన ఉన్న నారాయణుడే మహాస్వనుడు.

2. 'పుష్కరాక్షః' నామం కాంతి (దర్శన)శక్తిని, మహాస్వనః నామం శబ్దశక్తిని తెలియజేస్తోంది. ఈ రెండు శక్తులు విశ్వవ్యాపకాలు. ఈ శక్తుల పూర్ణత్వరూపమే పరమాత్మ.

'నాదసుధారసంబిలను నరాకృతాయె మనసా'

నాదామృతరసమే రాముని ఆకారం – అని త్యాగరాజు కీర్తించాడు. 'సృష్టికి సారం వాక్కు, వాక్కులకు సారం ఋక్కులు. ఋక్కుల సారం సామం. సామాలకు సారం ఉద్గీథం. అదే 'ప్రణవం' అని శ్రుతి మహాశబ్దమైన ప్రణవాన్ని చెప్పింది.

3. 'మహా' అనే శబ్దమే 'ఉత్' (ఉత్-త్తమ, ఉత్-కృష్ట) అనే గొప్పతనాన్ని చెబుతుంది. ఈతనిని మించిన గొప్పతనం లేదు కనుక- 'గొప్ప' అని శ్రుతిచే సన్నుతుడు.

   తస్య ఉదితి నామ (వానికి 'ఉత్' అని పేరు) -ఛాందోగ్యోపనిషత్తు.

   'ఉత్' (మహా) అని పేరున్నవాడు. గొప్పతనమే తానైన వాడు.

4. సూర్యశక్తిలో దర్శనశక్తితో పాటు, నాదశక్తి ఉన్నదని శాస్త్రోక్తి. పరమాత్మ **'ఏకోహం బహుస్యాం'** (ఒక్క నేనే ఎన్నో ఔతాను) అనే స్పందనతో ఈ అనంతసృష్టిని రచించాడు. ఆ స్పందన వల్ల వికసనాత్మక సృష్టి ఏర్పడింది. కన్ను తెరచినట్లుగా తన స్పందనతో బ్రహ్మాండ రూపాన వికసించి సర్వమును దర్శించుతూ, సర్వము తానై విస్తరించడాన్ని 'పుష్కరాక్ష' అన్నారు. 'ఈక్షతే' అనే శబ్దమే సృష్టి అనే వికసనాన్ని సూచిస్తుంది. ఆ స్పందన వల్ల ఉద్భవించిన నాదం కూడా వికసించి విశ్వమంతా శబ్దశక్తి పరచుకుంది. ఆ శబ్దశక్తి తన స్వరూపమే కనుక నారాయణుడు 'మహాస్వనుడు'.

   'అస్య మహతో భూతస్యనిశ్శ్వసిత మేతత్ ఋగ్వేదో యజుర్వేదః' ఇతిశ్రుతిః.

   'సర్వోన్నతుడై ఉన్న ఈయన యొక్క ఊపిరులే ఈ ఋగ్వేద యజుర్వేదాది వేదవిద్యలు.

   ఊపిరి ద్వారా వ్యక్తి ఉనికిని గుర్తించినట్లు స్వామి స్వరూపమైన వేద శబ్దాల వల్లనే స్వామిని గమనించగలం. **'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః'** - అని గీతావచనం.

5. సూర్యకాంతిలో అన్ని వెలుగులూ లీనమైనట్లే, ఆయన నాదంలో అన్ని శబ్దాలూ కరిగిపోతాయి. మనం ఒక పెద్ద చప్పుడు చేసే యంత్రాగారంలోకి వెళితే మన మాటలే మనకు వినబడవు. మన శబ్దాలన్నీ ఆ మహాశబ్దంలో కలిసిపోయి, అదే వినబడుతుంది. అలాగే - పరమాత్మ యొక్క నాదస్వరూపంలో సర్వశబ్దాలు కరగిపోయి అదే మిగిలిపోతుంది. అందుక 'మహాస్వనుడు'

6. **'త్రయీ మయాయ త్రిగుణాత్మ ధారిణే**
విరించి నారాయణ శంకరాత్మనే' - అని వేదస్వరూపునిగా సూర్యుని కీర్తించాయి శాస్త్రాలు. ఆదిత్యుడు 'అక్షి' స్వరూపుడు- శబ్ద స్వరూపుడు కనుక ఆదిత్య నామం తరువాతి రెండు నామాలు (పుష్కరాక్షః, మహాస్వనః) ఈ రహస్యాన్ని చెబుతున్నాయి. వేదమాత గాయత్రి సవితృ (సూర్య) మంత్రంగా ప్రసిద్ధం.
ఉదయాస్తమయాది సూర్యగమనాలను ఆధారం చేసుకొని సంధ్యోపాసనను చేస్తాం. ఈ సూర్యోపాసన ఆ మండలంలో దాగిన పరబ్రహ్మ తేజస్సును ఉపాసించడమే. ఆ తేజస్సు వేదమూలం గనుక 'ఛందసాం మాతా' వేదమంత్ర రాశికి కారణమైన జనని గాయత్రిగా చెప్పబడింది. ఆ గాయత్రీ రూపాన ఉన్న నారాయణుడు 'మహాస్వనుడు'.
'సైషా త్రయ్యేవ విద్యాతపతి యఏషోన్త రాదిత్యే హిరణ్మయః పురుషః' అని 'తైత్తిరీయ నారాయణం'.
'సూర్యమండలంలో హిరణ్మయ పురుషుడై ప్రకాశించునది సాక్షాద్వేద స్వరూపుడు'.

7. భగవానుని కంఠధ్వని మధురం, గంభీరం, సత్యం, ప్రియం- మొదలైన సులక్షణాలతో భాసించుతుంది. రామకృష్ణాద్యవతారాలలో 'ఘనగంభీర నిస్వనః' అని వర్ణింపబడింది స్వామి స్వరం. ఆ లక్షణాలన్నీ 'గొప్ప' (మహా) లక్షణాలు. కనుక ఆ కంఠధ్వని మహాస్వనమే.

8. శబ్దాల సారమైన సామనాదమే యజ్ఞపురుషుడైన నారాయణుని కంఠధ్వని. ఆ మహత్తరమైన స్వరమును పలికిన యజ్ఞవరాహాన్ని భాగవతం వర్ణిస్తూ -
'సామవేద ధ్వని శ్రీమాన్ జగర్జ పరిఘుర్ఘురన్'
కాంతిగా, నాదంగా వర్తిల్లే నారాయణ తేజం తుది మొదలు లేనిది కనుక-

అనాది నిధనః.. 42

1. ఆది, నిధనము లేనివాడు. 'ఆది' అంటే మొదలు, పుట్టుక. 'నిధనం' అంటే అంతము, మరణము. ఆది నిధనాలు లేని పరిపూర్ణుడు అనాది నిధనుడు.

   'యదజః ప్రథమం సంబభూవ సహతత్ స్వరాజ్యమిమాయ యస్మాన్నాన్యత్ పరమస్తిభూతం' అని అథర్వ వేదవాక్యం.

   'బహ్మాకు కూడా మొదటనున్నవాడు, ఈయనకు మొదలులేదు మించినది లేదు'. జనన జరా మరణ వర్జితుడైన ఈ పరిపూర్ణుని **'దేవస్య పశ్యకావ్యం నమమార నజీర్యతి'** (అథర్వ వేదం) అని శ్రుతి వింగడించింది.

2. సూర్య మండలాలలో స్వామి తేజస్సు భాసిస్తున్నది. ఇలాంటి మండలాలు అనంత విశ్వంలో అనేకం. ఆ మండలాలు ప్రళయంలో లీనమైనా ఆ లీనమయ్యేది ఆ తేజస్సులోనే. ఆ తేజస్సు శాశ్వతం.

3. మహాస్వనమైన వేదం సత్యం. అది ఏనాటికీ నశించదు. తరువాతి సృష్టులలో కూడా ఈ వేదమే జగద్రచనకు హేతువు. విష్ణు స్వరూపమైన వేదము యొక్క శాశ్వతత్వాన్ని చెప్పే నామమిది.

4. నారాయణుని దివ్య రూపములన్నీ కూడా అనాది నిధనములే. తెరలో నుండి వెలికివచ్చి తిరిగి వెనుకకు వెళ్ళునట్లు తన పరమపదం నుండి వచ్చి తిరిగి అందులోకి చేరుతాయి. కనుక అవి శాశ్వతములు.

   'తస్య కాలాత్పరా తనుః'.

   పుట్టుక మరణాలు కాలాధీనాలు. స్వామి తనువు కాలాతీతం. స్వామి ప్రతిరూపము నిత్యము, సచ్చిదానంద మయము.

   సర్వేనిత్యాశ్శాశ్వతాశ్చ దేహాస్తస్య పరాత్మనః ।
   హానోపాదాన రహితాః నైవ ప్రకృతిజాః క్వచిత్ ।

-అని శివపురాణం. శివకేశవాది రూపాలు జ్యోతిర్మయ సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపాలు. నిత్యోపాస్యాలు.

ఆద్యంత రహితుడైన ఆ పరబ్రహ్మయే సృష్టిధారణకై సృష్టికర్తగా వ్యక్తమయ్యాడు.

ధాతా .. 43

1. ధరించువాడు ధాత. **'అనన్తాది రూపేణ విశ్వంబిభర్తి'** -అనన్తుడు (ఆదిశేషుడు) మొదలైన రూపాలతో విశ్వమును ధరించేవాడు ధాత.
2. సృష్టికర్తయైన బ్రహ్మ నారాయణ స్వరూపుడే.
   'ధాత'లోని ఆ 'ధాతృ' శక్తి నారాయణ చైతన్యమే.
   కర్త, భర్త, హర్త అయిన పరబ్రహ్మ కర్తగా సృష్టిరచన చేసేటప్పుడు 'ధాతృ' శబ్దవాచ్యుడు.
   ధాతావిధాతా పరమోత సందృక్ - ఋగ్వేదం
   సం భగేన సమర్యమ్ణా సం ధాతా సృజతు వర్చసా ॥ (అథర్వవేదం)
   సూర్యాచంద్ర మసౌ ధాతా యథాపూర్వమకల్పయత్
   దివంచ పృథివీం చాంతరిక్షమథో స్వః.. (ఋగ్వేదం)
   పరమాత్మ ధాతగా సూర్యచన్ద్రాదులను పృథ్విని అంతరిక్షాన్ని మునుపటివలె (గతకల్పాలలో వలె) సృజించాడు, అని వేదం చెబుతోంది.
   'ధాతా పురస్తాద్యముదాజహార' అని మంత్ర పుష్పం 'ధాతా' అనే శబ్దంతో మొదలై పరబ్రహ్మను కీర్తిస్తోంది.
3. **'గర్భందధాతీతి ధాతా'** - గర్భధారణ భూతుడైన తండ్రి.
   మమయోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహం
   'మహద్బ్రహ్మమనే కారణమందు తన సంకల్పశక్తి బీజములనుంచి సృష్టించువాడు' అని దీని భావం. సృష్టిని చేసి, ధరించడమే కాక - ఈ సృష్టి నిరంతరం సాగేలా విధానాలను ఏర్పాటు చేసినవాడు-

విధాతా.. 44

1. విధానమును ఏర్పరచినవాడు. విశ్వశాసనకర్త. సృష్టి కల్పనలో ఒక అద్భుతమైన క్రమం ఉంది. ఈ క్రమాన్ని పరిశీలించితే చాలు విష్ణుచైతన్యాన్ని అంగీకరిస్తాం. కాలగమనం, గ్రహనక్షత్రాదుల స్థితిగతులు, పంచభూతాల పరిస్థితులు అన్నీ విశ్వనియమాన్ని, క్రమాన్ని అనుసరించి వెళతాయి. ఎవరూ అతిక్రమించలేని విధానమది. దీనినే 'విధి' అంటాం. ఆ విధానమును ఏర్పరచిన నారాయణుడు 'విధాత'.
2. కర్మలను, వాటి ఫలాలను సర్వజీవ కోటికి అందించేవాడు. ఎవరి కర్మలకు ఏమివ్వాలో స్వామికే తెలుసు.
   కర్మగతులను గ్రహించడం అత్యంత కష్టసాధ్యం. సర్వజ్ఞుడైన శ్రీహరియే సర్వజీవులకు కర్మఫలాలను సంధించువాడు.
3. అంతేకాదు – వేదాది శాస్త్రరూపంగా ధర్మాలను, కర్మ నియమాలను విధించినవాడు విధాత.
   "శ్రుతిస్మృతిర్మమైవాజ్ఞా" శ్రుతులూ స్మృతులూ నారాయణుని ఆజ్ఞారూపాలు. వాటిని అనుసరించేవారు రాజశాసనాన్ని అనుసరించే పౌరులవలె క్షేమాన్ని పొందుతారు.
   సమేబంధుర్జనితా సా విధాతా ధామాని వేద భువనాని విశ్వా ।
   (యజుర్వేదం)
   సృష్టించి, విధానాన్ని ఏర్పరచే మూలమితడే కనుక–

ధాతురుత్తమః 45

1. ధాతువులకెల్లా ఉత్తమమైనవాడు.
   ధరించి పోషించే మూలకాలను ధాతువులంటారు.
   పంచభూతాలు ప్రపంచానికి మూల ధాతువులు. వాటికన్నా మూలం పరమేశ్వర చైతన్యం. కనుక ధాతువులైన భూతాదులన్నిటి కన్నా

ఉత్తముడు - అతీతుడు, ధాతువులకు ధాతువైనవాడు - 'ధాతురుత్తముడు'.

2. మన దేహంలో కూడా పంచభూతాలున్నాయి.

వాటి స్వరూపాలే ప్రధానంగాసప్తధాతువులుగాఉన్నాయి.

రక్త-మాంస-మేదో-అస్థి-మజ్జా-త్వక్-శుక్ర... అనేవి సప్తధాతువులు. మూలపదార్థాలు. ఇవి దేహాన్ని ధరించి పోషిస్తున్నాయి. అయితే ఇవన్నీ పనిచేసేది మనలో అసలైన ఆత్మ చైతన్యమున్నప్పుడే కనుక అత్యంత మూలధాతువును "చిత్ధాతువు" అన్నారు. ఆ 'చిద్ధాతువు' ఇన్ని ధాతువుల కన్న శ్రేష్ఠమైనది. శరీరంతో పాటు సప్తధాతువులు నశించినా, ఈ 'చిద్ధాతువు' నశించదు. ఈ 'చిద్ధాతు' రూపుడైన నారాయణుడు - 'ధాతురుత్తముడు'.

3. "ధాత'గా చెప్పబడే సృష్టికర్తను (బ్రహ్మను) కూడా సృజించినవాడు, అతడి కంటె ఉత్తముడు. త్రిమూర్త్యాత్మకమైన నారాయణ బ్రహ్మమే బ్రహ్మకు మూలం.

నారాయణ నాభీకమల సంజాతుడైన బ్రహ్మ తనలో ధాతృశక్తిగా దీపించే విష్ణుప్రజ్ఞను ధ్యానించి, ఆయన అనుగ్రహ శక్తితో సృష్టిరచనా సామర్థ్యాన్ని సాధించాడు.

'హిరణ్యగర్భం జనయామాస పూర్వం' -అనే వేదవచనం ఈ మాటనే ప్రస్తావిస్తోంది. నారాయణ తేజం హిరణ్యం. దానిని తనలో దాల్చి సృష్టించిన మహద్బ్రహ్మయే ధాత. అందుకే నారాయణుడు 'ధాతురుత్తముడు'.

'హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్యజాతః పతిరేక ఆసీత్' -అని యజుర్వేదం కీర్తించింది. సృష్టిని ధరించే వారిని కూడా ధరించేవాడు. అందుకే అతడు ఏ ప్రమాణములకు దొరకడు. కార్యకారణాత్మకమైన సృష్టికన్నా ముందున్న చైతన్యం కొలత కందనిది.

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమర ప్రభుః।
విశ్వకర్మా మను స్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః॥ 6

46. అప్రమేయః, **47.** హృషీకేశః, **48.** పద్మనాభః,
49. అమరప్రభుః, **50.** విశ్వకర్మా, **51.** మనుః,
52. త్వష్టా, **53.** స్థవిష్ఠః, **54.** స్థవిరోధ్రువః॥

అప్రమేయః.. **46**

1. ప్రమాణములకు 'కొలతలకు' అందనివాడు. ఏదైనా ఒక విషయాన్ని గ్రహించాలంటే కొన్ని ప్రమాణాలు కావాలి.
అవి : 1. ప్రత్యక్ష, 2. అనుమాన, 3. ఉపమాన, 4. శబ్ద (శాస్త్ర) మొదలైనవి అని శాస్త్రం చెబుతోంది. ప్రపంచం ఈ ప్రమాణాలకు అందుతుంది. పరమాత్మ అందడు.
ఇంద్రియాల ద్వారా తెలుసుకోబడితే ప్రత్యక్ష ప్రమాణం. కానీ ఇంద్రియాతీతుడైనవాడు ఇంద్రియాలకు తెలియబడడు. చూపు, మాట, రుచి మొదలైన శక్తులు ఆయన వలన కలుగుతున్నా, అవి ఆయనను తెలుసుకోలేవు. జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు ఆయనను పట్టలేవు.
గత అనుభవాల వల్ల ఊహించి, అనుమానించి చెప్పదగినది కాదు ఆ తత్త్వం. అనుభవాలు కూడా ఇంద్రియ బద్ధాలే కదా! కనుక అనుమానం ద్వారా దానిని మనస్సు గ్రహించలేదు.
పోనీ దేనితోనైనా పోల్చి చెప్పడానికి కూడా వీలులేదు. నాశన లక్షణం కలిగిన భౌతిక వస్తుజాతమే మనకు పరిచయం. అవేవీ 'అవినాశిని' చెప్పలేవు. కనుక ఉపమాన ప్రమాణం కూడా చాలదు. ఉదాహరణలు ఆ పరమసత్యాన్ని చెప్పలేవు.
ఇక శబ్దం అంటే వేదాది శాస్త్రాలు. ఇవి కూడా ఆయనను పూర్తిగా చెప్పలేవు.

'నేతి నేతి' (ఇది కాదిది కాదు) అని వర్ణించాయి.

యతో వాచోనివర్తంతే అప్రాప్య మనసాసహ. దేనిని మనసు చేరలేక, మనసుతో పాటు మాటలు కూడా తిరిగి వెనక్కి మళ్లుతాయో అదే పరతత్త్వం.

అశబ్దమస్పర్శ మరూపమవ్యయం తథారసం నిత్య మగంధ వచ్చసత్ ।
అనాద్యనన్తం మహతః పరంధ్రువంనిచాయ్య తన్మృత్యుముఖాత్
ప్రముచ్యతే ॥ (కఠోపనిషత్తు)

'శబ్ద స్పర్శాదులు లేని ఆ చైతన్యాన్ని (అప్రమేయ పరతత్వాన్ని) గ్రహించేవాడు అమృతత్వాన్ని పొందుతున్నాడు.

2. 'సాటిలేని వాడు' అని కూడా అర్థం.

న తస్యప్రతిమా అస్తి యస్య నామ మహద్యశః ।

అటు అప్రమేయ చైతన్యం – ప్రపంచంలో వివిధ కాంతి కిరణాల ద్వారా ఆనందాన్ని కలిగిస్తోంది. అంతేకాదు ఇటు మన ఇంద్రియాలను నడుపుతోంది. అందుకే ఆ నారాయణుడు –

హృషీకేశః.. 47

1. హృషీకములు – అంటే ఇంద్రియాలు. వాటికి ప్రభువు – శాసించువాడు హృషీకేశుడు.

హృషీకాణీంద్రియాణ్యాహుః తేషామీశోయతో భవాన్ ।
హృషీకేశస్తతో విష్ణుః ఖ్యాతో దేవేషు కేశవః॥ (హరివంశం)

కొలతకందనివాడైనా, ఆ చైతన్యస్వరూపుడే మన హృదయాలలో ఉండి ఇంద్రియాలను నడుపుతున్నాడు. ఆయన వల్ల నడిచే ఇంద్రియాలు కూడా ఆయనను తెలుసుకోలేవు. కానీ ఆయన కారణంగా తాము పనిచేస్తున్నామన్న ఎరుక కలగడమే జ్ఞానం. ఆ ఎరుకను ఆయనవైపు నడపడమే భక్తి. హృదయాంతర్వర్తి అయిన ఆ పరమేశుని అనుగ్రహ చైతన్యం లేకపోతే నేత్రాలు చూడలేవు. చెవులు వినలేవు. కాళ్లు కదలలేవు. కంఠం పలుకలేదు.

ఇంద్రియాల అణువణువునా ప్రసరించేది ఆయన చైతన్యమే. కనుక ఇంద్రియాలకు ఈశ్వరుడతడే.

2. హర్షమును (హృషీ) కలిగించే 'కేశములు' (కిరణములు) కలవాడు 'హృషీకేశుడు'.

సూర్యాచంద్రమసౌ శశ్వదం శుభిః కేశసంజ్ఞితైః ।
బోధయన్ స్వాపయం శ్చైవ జగదుత్తిష్ఠతే పృథక్ ॥
బోధనాత్స్వా పనాచ్చైవ జగతోహర్షణం భవేత్ ।
అగ్నీషోమ కృతైరేవం కర్మభిః పాండునన్దన ॥
హృషీకేశో మహేశానో వరదో లోక భావనః ॥ (మహాభారతం)

సూర్యుడు తేజస్స్వరూపుడు. చంద్రుడు లేత వెలుగులు కలిగినా, ప్రధానంగా రస స్వరూపుడు. వీరిరువురి నుండి కిరణరూపాలుగా ప్రసరించే శక్తులే జగత్తును ఆనందింపజేస్తున్నాయి. పోషణ, రక్షణలతో శుభసుఖాలను ఇవ్వడమేకదా ఆనందం. ఆ కిరణశక్తులే కేశములు. లోకాన్ని హర్షింపజేసే ఆ కిరణజాలాలన్నీ విష్ణుచైతన్యాలే.

ఈ కిరణాలతోనే జగత్తును మేల్కొలుపుతూ, జోకొడుతూ పగటిగా, రాత్రిగా బోధన, సాంత్వన కలిగిస్తూ ఆనందింపజేస్తున్నది ఆ నారాయణుని కృపా చైతన్యమే. వెలుగు కిరణాలలోని అగ్ని, రస కిరణాలలోని సోమం– ఈ రెండు స్వామి యొక్క కేశాలుగా వేదం అభివర్ణించింది. **'అగ్నీషోమాత్మకం జగత్'** అన్నారు. ఈ జగత్తంతా అగ్ని, రసమయాలు. ఆ రెండింటిని (వెదజల్లి) ప్రసరించే కేంద్రాలే కేశాలు. అవి జగమునకు (హర్ష) ఆనందకరాలు కనుక స్వామి హృషీకేశుడు. సూర్యకిరణాలలో వేడిమి చలువ కలబోసిన అగ్నీషోమాత్మక లక్షణాలున్నాయి.

ప్రధానంగా సూర్యకిరణ శక్తి ఏడువర్ణాలలో (VIBGYOR) విశ్లేషింపబడుతుంది. అందులో మొదటి మూడు నీలివర్ణపు చాయలు. ఇవి జలతత్త్వ సంకేతాలు. చివరి మూడు ఎరుపు వన్నెల రకాలు. ఇవి

అగ్నితత్త్వంతో కూడినవి. మధ్యలోనున్న ఆకుపచ్చ ఉభయతత్త్వాల ఐక్యతను చెబుతోంది. ఇలా అగ్ని, రసతత్త్వాలను కలబోసిన కారణంగా సూర్యకిరణాలను అగ్నీసోమాత్మకాలన్నారు. మన మహర్షుల అపూర్వ విజ్ఞానానికి ఇవే ఆనవాళ్ళు!

సూర్యరశ్మిర్హరికేశః పురస్తాత్ ॥ యజుర్వేదం

సూర్యరశ్మలే హరికేశాలు అని వేదవచనం.

నమో హరికేశాయోపవీతినే పుష్టానాం పతయే నమః

(రుద్ర నమకం- యజుర్వేదం)

పుష్టులకు పతియైన పరమాత్మ హరికేశములను వెదజల్లుతున్నాడు.

పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః ॥ (ఆదిత్య హృదయం)

తన కిరణాల ద్వారా పాలించువాడు, తపింపజేయువాడు, వర్షించువాడు. ఆదిత్యాంతర్గతమైన విష్ణుతేజమే హృషీకేశుడు.

3 ఆనందం కలిగించే వాటిని 'హృషీకములు' అంటారు. ఆనంద సాధనలలో ఇంద్రియాలు ప్రధానమైనవి కనుక వీటికి ఆ పేరు సార్థకమయ్యింది. నిజానికి సృష్టిలో మనం వేటిని ఆనందకారకాలనుకుంటున్నామో వాటిలోని ఆనంద ప్రకాశం స్వామి స్వరూపమే.

హృషీకములు హృషీకేశునకు వినియోగించబడాలన్నదే జ్ఞానుల బోధ, భాగవతుల గాధ.

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ....

ఈ విధంగా హర్షము కలిగించే శక్తులతో విశ్వానికి కేంద్రమైనవాడు కనుకనే-

పద్మనాభః .. 48

1. పద్మమునకు నాభివంటివాడు. 'నాభి' అంటే కేంద్రం. విశ్వమంతా పద్మము వంటిది. శక్తి వికసనమే సృష్టి. విచ్చుకున్న తామర

పువ్వు వలె ఈ విశ్వం ఉన్నది. అనంత శక్తులు, అనంత భూతాలు ఇవన్నీ లెక్కలేనన్ని రేకుల వంటివి. ఈ రేకులన్నీ నిజానికి కేంద్రంలోని కర్ణికతో సంబంధమున్నవి. ఆ సంబంధమే తెగితే రేకులు చెల్లాచెదురౌతాయి. ఇవన్నీ వేటికవి విడివికావు. విడిగా కనిపిస్తున్నా వాటికి కేంద్రంతో సంబంధం ఉంది. ఆ కేంద్ర శక్తియే ఈ రేకులుగా వికసించింది. వాటన్నిటినీ కలిపి ఉంచింది. ఆ కేంద్ర సంబంధం లేకపోతే పద్మానికి ఉనికియే లేదు.

అదే విధంగా విశ్వానికి ఉనికినిచ్చే కారణ కేంద్రశక్తి పద్మనాభుడు. సూర్యకిరణాలు కూడా వేలాదిరేకుల వలె ఉంటే వాటిని వెదజల్లే సూర్యతేజం నాభిగా ఉంది. ఇలా దర్శిస్తే అనంత సూర్యకాంతి మహాపద్మమై, దాని నడుమనున్న ఆ తేజం పద్మనాభుడై దీపిస్తున్నది. ఇలా విశ్వంలో వికసించే ప్రతిశక్తికీ కేంద్రమైన వాడు 'పద్మనాభుడు'.

2. ఇంద్రియాలలో శక్తి ప్రసరించడం అంటే, రేకులుగా శక్తి విచ్చుకొనడమే. ఈ ఇంద్రియ శక్తులన్నీ కలిపి ఒక పద్మంగా భావిస్తే – వీటన్నిటి ఉనికికీ హేతువై హృదయ మధ్యంలో (కేంద్రంలో), దీపించే మూలచైతన్యం 'పద్మనాభుడు'.

హృషీకేశుడు అంటే 'ఇంద్రియాలను నడిపేవాడు' అన్నాం. ఈ నడపడం ఎక్కడ ఉండి నడుపుతున్నాడు?

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా ॥

సర్వభూతముల హృదయాలలో ఉండి, జంత్రగానివలె, ఇంద్రియాలను నడుపువాడు– పరమేశ్వరుడు.

ఇంద్రియాలలో శక్తి ప్రసరించడానికి ముందు అది హృదయంలో విచ్చుకుంటుంది. శక్తి కేంద్రాలన్నీ అక్కడే ఉంటాయి. ఆ శక్తులన్నిటికీ మూలకేంద్రంగా హృదయ మధ్యంలో అత్యంత సూక్ష్మచైతన్యం ఉంది.

ఆ హృదయాన్ని 'పద్మం'గా అభివర్ణించింది వేదం.

'పద్మకోశప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖమ్'.(నారాయణసూక్తం)

నాభికిపైన, అధోముఖమైన తామర మొగ్గవలె ఉంటుంది హృదయం. ఇది మనమనుకొనే గుండెకాయ కాదు. స్థూలదృష్టికి గోచరించని శక్తి కేంద్రం హృదయం. విద్యుత్‌తీగ కంటికి కనబడుతుంది కానీ, విద్యుత్ కనబడదు కదా.

అలాగే మనలోని చైతన్య కేంద్రాలు స్థూల దృష్టికి గోచరించవు. అవి లేకపోతే స్థూలేంద్రియాలలో కదలికే లేదు.

సూక్ష్మమైన హృదయం నుండే శక్తి (చైతన్య) తరంగాలు శరీరమంతా ప్రసరిస్తాయి.

'తిర్యగూర్ధ్వ మధశ్శాయీ రశ్మయ స్తస్యసంతతాః
సన్తాపయతిస్వందేహమాపాద తలమస్తకః' (నారాయణసూక్తం)

ఆ ప్రసరించే చైతన్య కిరణాలు వివిధ నాడుల ద్వారా (తీగలలో విద్యుత్తువలె) శరీరమంతా - పాదముల నుండి తల వరకు వ్యాపించుతాయి. అవి అడ్డులేకుండా క్రిందుగా, మీదుగా, అడ్డంగా ప్రసరిస్తాయి. ఇంత చైతన్యానికి మూలం హృదయం. ఆ హృదయంలో నడుమనున్నది విష్ణుచైతన్యం.

'తస్యాశ్శిఖాయాః మధ్యే పరమాత్మా వ్యవస్థితః' - ఆ హృదయపు నడుమ కొనలో ఉన్నది పరమాత్మ.

ఇంద్రియాలు కొలత కందుతాయి కానీ లోపలి చైతన్యం 'అప్రమేయం'. అదే మన ఇంద్రియాలను (హృషీకాలను) స్పందింపజేసే చైతన్య కిరణాలను (హృషీకేశాలను) ప్రసరించే ఈశుడు - 'హృషీకేశుడు'. అతడు హృదయ పద్మంలో కేంద్రమై ఉన్నాడు కనుక 'పద్మనాభుడు'.

చూశారా! 47వ నామం నుండి గమనిస్తే - నామాల కూర్పులో ఎంతటి అనుబంధం, సార్థకత, విజ్ఞానం, దాగి ఉన్నాయో! ఎంత చక్కగా

నారాయణుని చిరునామాను చెప్పారో మహర్షులు.

3. మనలో హృదయ పద్మం ఉన్నట్లుగానే – విశ్వశరీరంలో కూడా శక్తి కేంద్రాల కూడలి ఉంది. అదే పద్మం. ఆ పద్మానికి కూడా కేంద్రమందున్నది నారాయణుడే.

సృష్టికి పూర్వం విష్ణునాభి నుండి పద్మం ఆవిర్భవించింది. ఆ పద్మం నడుమ నారాయణుని సృష్టికర్తృత్వ శక్తి బ్రహ్మగా ఉద్భవించింది. ఇంత అద్భుతమైన విజ్ఞానాన్ని మన వేదపురాణాలు వ్యక్తం చేస్తున్నాయి.

"శ్రీమన్నారాయణో మహార్ణ వేశయానో అప్పుమాం త్వం అజీజనత్"

"మహార్ణవంలో శయనించి ఉన్న నీవే నాకు మొదట పుట్టుకనిచ్చావు" అని బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణుని స్తుతించాడు. (శ్రీమద్రామాయణం)

తమిద్ గర్భం ప్రథమం దధ ఆపోయత్ర దేవాసమగచ్ఛన్త విశ్వే ।
అజస్య నాభావధ్యేక మర్పితం యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః ॥

(ఋగ్వేదం)

అని శ్రుతి పద్మనాభుని స్వరూపాన్ని భావించింది.

'ధాతుర్నాభ్యాం పుష్కరం ప్రాదుర్భవతి'

'భగవంతుని నాభి నుండి పద్మం ప్రాదుర్భవించింది' అని శాస్త్రవాక్యం.

'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణఃస్థితః' అంటే అర్థమిదే. లోపలా వెలుపలా వ్యాపించి ఉన్నవాడు. గదినిండా వెలుగు వ్యాపించితే, దానికి కేంద్రంగా ఉన్నది జ్యోతి. ఆ జ్యోతి చుట్టూ ఉన్నది కాంతి ఆవరణ. ఆ ఆవరణ నుండి గది అంతా పరచుకున్నవి వెలుగుకిరణాలు. ఆ వెలుగు కిరణాలు ఇంద్రియ చైతన్యాలైతే, కాంతి ఆవరణ హృదయం. దాని నడుమనున్న జ్యోతి – ఆత్మరూపుడైన నారాయణుడు. నిజానికి వెలుగును చూస్తూ దేవుళ్లాడుతున్నాం గానీ, మూలజ్యోతిని పట్టుకోవడం లేదు. అసలు అది ఉందని కూడా గుర్తించడం లేదు. ఆ జ్యోతియే లేకుంటే ఈ వెలుగులే ఉండవు కదా అనే స్పృహలేదు. ఆ స్పృహలోకి రమ్మని, ఆ పరంజ్యోతిని

చూడమని మహర్షి ఈ నామాలతో ప్రబోధిస్తున్నాడు.

మనలో పరంజ్యోతి - బాహ్యంలో ఉన్న అనంత విశ్వానికి మూలమైన పరంజ్యోతి **"నారాయణ పరోజ్యోతి రాత్మానారాయణఃపరః"** అని మన్త్రపుష్పం అద్భుతంగా ఆవిష్కరించింది. ఆ రహస్యాలన్నీ ఈ నామాల కూర్పులో నిబద్ధం చేశారు వ్యాసదేవులు.

4. వికసించిన జ్ఞానానికి సంకేతమే పద్మం. జ్ఞానానికి మూలమైన ఆత్మచైతన్యమే పద్మనాభుడు.
5. **'నభేవ నాభిః'** అని శాస్త్ర నిర్వచనం. విశ్వానికి ఆలయం 'నభం'. ఆ నభమందు విస్తరించిన విష్ణుచైతన్యమే విశ్వ పద్మానికి మూలం. **'నాభ్యా ఆసీదన్తరిక్షం'** అనే పురుషసూక్త వచనం కూడా విశ్వానికి మూలమైన అంతరిక్షాన్ని సూచిస్తుంది. 'అంతరిక్షం' అనే వికసనశక్తిని నాభియందు కలవాడు పద్మనాభుడు.

   జ్యోతిర్మండలాలు, శబ్దతరంగాలు ఆ నభము నుండి ఆవిర్భవించినవే. కాంతి తరంగాలు, శబ్ద తరంగాలు చక్రమువలె, పద్మమువలె 'ఆవృత లక్షణం' (చుట్టుకొనే లక్షణం) కలిగి ఉంటాయి. అలాంటి 'ఆవృత లక్షణం' గల పద్మము వంటి అంతరిక్ష నాభి కలవాడు అని కూడా భావించవచ్చు. ఆ పద్మనాభుడైన నారాయణుని ద్వారా ప్రసరించే చైతన్య కిరణాలే వివిధ దేవతాశక్తులు. ఆ కిరణాలన్నిటికీ మూలమైన వాడే దేవతల ప్రభువు-

అమరప్రభుః .. 49

1. మరణము లేనివారు అమరులు- దేవతలు. వారికి ప్రభువు - అమరప్రభువు. దేవతలందరూ ఆయన నుండి ప్రసరించిన శక్తి కిరణాల వంటివారు. వారిని నిర్వహించేవాడు, శాసించేవాడు ఈ పరంజ్యోతియే. విశ్వమంతా నడిచే వివిధ రకాల శక్తులను అధిష్ఠించిన విష్ణు చైతన్య విశేషాలే దేవతలు.

"నారాయణాత్ బ్రహ్మాజాయతే – నారాయణా ద్రుద్రోజాయతే నారాయణాత్ ప్రజాపతయః ప్రజాయంతే" –అని నారాయణోపనిషత్తు చెబుతున్నది. **"నారాయణాత్ ఋషిగణాః తథాసిద్ధ మహోరగాః"** –అని మహాభారతం. **"మూలం హి విష్ణుర్దేవానాం... విష్ణుః సర్వాః దేవతాః"** అని వేదవాక్యాలు.

విశ్వసృష్టి శక్తి కేంద్రాల కూడలి అయిన పద్మం నుండి విస్తరిల్లిన ఈ విశ్వంలో లెక్కలేనన్ని ప్రకృతిశక్తులు, వాటి కార్యాలు సాగుతున్నాయి. వాటిని నిర్వహించే చైతన్యాలే దేవతలు.

సృష్టి నశించినా సృష్టి కారకశక్తులు నశించవు. ప్రళయంలో ఆ శక్తులు ఆయనలోనే లీనమవుతాయి. అందుకే ఆ శక్తుల్ని 'అమరులు' అంటారు. వారి ప్రభువు – అమర ప్రభువు.

బయట ఉన్న విశ్వం బ్రహ్మాండం. ఇది అనంతం. మనలో ఉన్న విశ్వం – పిండాండం. ఆలోచిస్తే ఇదీ అనంతమే. ఈ అలోచనను సక్రమంగా కొనసాగిస్తే – బ్రహ్మాండవ్యాపక చైతన్యంతో మన పిండాండ వ్యాపక చైతన్యం మమైకమౌతుంది. ఆ తాదాత్మ్యం కోసమే ఈ నామాలను భావించాలి.

బ్రహ్మాండ పాలనలో వినియోగింపబడే విష్ణుశక్తి విశేషాలు దేవతలు. ఒక్కొక్క దేవతలో ఒక్కొక్క చైతన్య విశిష్టత ఉంటుంది. అదే విష్ణు విభూతి. దేవతలను నమస్కరించడమంటే విష్ణు విభూతులను నమస్కరించడమే.

అందుకే అన్నమాచార్య **"హరి యవతారములే అఖిల దేవతలు"** అని స్పష్టపరచారు.

2. బ్రహ్మాండంలో ఉండే అగ్ని, వరుణ, యమ, ఇంద్రాదులు ఈ బాహ్య విశ్వ నిర్వాహక శక్తులు. అలాగే పిండాండంలో మానవ దేహంలోని ఇంద్రియాలలో ఉన్నవారు వీరే.

వేదాలలో **'అగ్నిర్మే వాచిశ్రితః'** – వంటి మంత్రాలు మన దేహంలో ఉన్న

దేవతలను పేర్కొన్నాయి. వాక్కును అధిష్ఠించిన చైతన్యం – అగ్ని. నాలుకపై తడికి వరుణుడు, చెవులకు – దిగ్దేవతలు, నేత్రాలకు – సూర్యదేవుడు, హస్తానికి అధిపతి – ఇంద్రుడు. ఇంద్రియ శక్తులకు మూలమైన ఈ చైతన్య కేంద్రాలను 'ప్రజ్ఞ'లు అంటారు. అవి మన ప్రాణశక్తిలో దాగి ఉంటాయి. అవే మనలో దేవతలు. ఈ ప్రజ్ఞాకేంద్రాలు (అమరులు) పంపే ఆదేశాలే ఇంద్రియాలకు ప్రసరిస్తాయి. ఇంద్రియాలు నశించినా. ప్రజ్ఞారూపంలో ఉన్న చైతన్యం నశించదు. అవి ఇంద్రియాల నుండి ఉపసంహరింపబడి హృదయగతమైన నారాయణ దీప్తిలోనే తిరిగి లీనమౌతాయి. కనుక ఇంద్రియ ప్రజ్ఞాశక్తులు 'అమరులు'.

ఇంద్రియాలకు ఈశుడైన 'హృషీకేశుడు', హృదయ పద్మమధ్యంలో 'పద్మనాభుడై', సమస్త ఇంద్రియ చైతన్యాలను నిర్వహిస్తున్న 'అమరప్రభువు'.

(ఈ దర్శనం మనలోనే విష్ణువును చూపిస్తుంది. ఈ దర్శనం సాధన ద్వారా యోగమైతే 'సర్వమున్నతని దివ్యకళామయమ'నే సిద్ధి అనుభవానికి వస్తుంది. అదే ఈ నామాల పారాయణకి పరమప్రయోజనం.

అంతేకాదు మన పూర్వపుణ్య విశేషం బట్టి ఆయా దేవతల అనుగ్రహాలు ఆయా ఇంద్రియాలలో పనిచేస్తాయి. ఈ నామాలను ఈ క్రమంలోనే ఉచ్చరిస్తూ వెళితే బ్రహ్మాండంలోని దేవతాశక్తులతో, పిండాండంలోని ఇంద్రియ చైతన్య కేంద్రాలు (ప్రజ్ఞాకేంద్రాలు) అనుసంధానమై 'విశ్వచైతన్యం' (Cosmic energy) నుండి అద్భుత శక్తిని పొంది, ఇంద్రియాలన్నీ సమర్ధవంతంగా పని చేస్తాయి. అందువల్ల అనేక రుగ్మతలు, ఆటంకాలు తొలగి సమర్ధవంతులమై విజయాలను సాధించగలుగుతాం. అందుకే ఈ నామాలలో విశ్వసంచాలక దేవతా శక్తుల నామాలన్నీ స్మరింపబడ్డాయి. ఈ నామోచ్చారణ ఆ అమరుల్ని (బ్రైటా, లోపలా) కూడా స్పందింపజేసి మరింత ఉన్నతత్వాన్ని మనకి ప్రసాదిస్తుంది. అమరులతో పాటు 'అమరప్రభువు' స్మరింపబడ్డాడు. ఇది ఆత్మను పరమాత్మతో అనుసంధానం చేసి ఐక్యాన్ని ఘటింపజేస్తుంది. ఈ స్తోత్రంలోని

శబ్దశక్తి, అర్థశక్తి అటువంటిది.

మనం ఈ విధంగా గమనిస్తుంటే ఈ నామాలక్రమం ద్వారా ఒక గొప్ప విజ్ఞానం గోచరిస్తుంది. ఆ విజ్ఞానమే మన అజ్ఞానానికి మందు. విశ్వమంతా ఉన్న పరమాత్మ (విష్ణు) చైతన్య విజ్ఞానమే ఈ స్తోత్రం కనుక ఇది 'విష్ణువిద్య'.)

య ఆత్మదా బలదా యస్యవిశ్వ ఉపాసతే ప్రశిషం యస్య దేవాః ॥ అని 'ఋగ్వేదం' సర్వదేవతలకు ఆత్మయై బలాన్ని ప్రసాదించే అమర ప్రభుని కీర్తించింది.

ఒక్కొక్క అమరునియందున్న లక్షణమే వారి పేరు. ఆ పేరును బట్టి వారిలో నున్న విష్ణుచైతన్యం ద్యోతకమవుతుంది. ఆ అమరప్రభువే, ఇన్నివిధాల ఈ ప్రపంచరూప కర్మ నిర్వహిస్తున్నాడు కనుక, అతడు –

విశ్వకర్మా .. 50

1. విశ్వమనే కర్మను చేయువాడు. విశ్వనిర్మాణం, నిర్వహణ – అనేవి ఆయన కర్మలు. ఇది అత్యంత చిత్రమైన కర్మ.

   'విచిత్ర నిర్మాణ శక్తిమత్త్వాత్' – విచిత్ర నిర్మాణ శక్తి కలిగినందువల్లనే విశ్వకర్మ.జగత్తునే గమనిస్తే జగన్నాథుని కర్మ ఎంత చిత్ర విచిత్రమో అర్థమవుతుంది. అనంత సృష్టిలో అనేకములైన మార్పులు, స్థితిలయలు అన్నీ ఆయన అనంత కర్మలు. వైవిధ్యంగా, అద్భుతంగా కోట్లాది జీవకోటినీ, గ్రహ నక్షత్రాలను, పంచభూతాలను, కాలచక్రాలను నడపడం ఎంత అద్భుతకర్మ!

   సృష్టిని అనుసరించే వాళ్ళం మనం. సృష్టిని రచించినవాడు నారాయణుడు. జగద్వ్యాపార నిర్వాహకుడైన విశ్వకర్మ.

   "విశ్వకర్మణః సమవర్తతాధి" –అని శ్రుతి.

   పురుషం విశ్వకర్మాణం ఆదిదేవ మజం విభుం–అనిస్వామినిస్తుతిస్తారు.

   విశ్వకర్మా విమనా ఆద్విహోయా ధాతా విధాతా పరమోత సందృక్ (ఋగ్వేదం)

కర్మకన్నా ముందు అది 'సంకల్ప, భావనా, జ్ఞాన' స్వరూపంగా ఉంటుంది. దానినే మనశ్శక్తి అంటాం. ఆ శక్తితో ఊహించబడి, భావించబడే జ్ఞానమే కర్మగా వ్యక్తమవుతుంది. కర్మకు మూలమైన మనశ్శక్తి ఆ విష్ణుచైతన్యమే. అందుకే -

మనుః.. 51

1. జ్ఞానము. తెలుసుకొనుట (తెలివి). అదే మనశ్శక్తి. ఆ శక్తి ఉన్న దేవతే మనువు.

   'మనజ్ఞానే - మను అవబోధనే'- 'మనుతే బుధ్యతే' -అంటూ అర్థాలు చెప్పారు శబ్దశాస్త్ర వేత్తలు.

   'నాన్యతోస్తిమంతా' -వీనికంటే తెలుసుకొనేవాడు లేడు. తెలివియే విష్ణువు. కనుక అతడే మనువు.

2. **"సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి"** (వేదం)

   సృష్టి చేయాలనే సంకల్పం, దానికి సంబంధించిన తెలివి - ఈ శక్తులే 'మనుస్వరూపం'.

   నారాయణుని ఈ మనశ్శక్తిని పొందిన దేవతా విశేషాలు మనువులు. వీరి ద్వారా లోకంలో ప్రసరింపబడేది నారాయణ విజ్ఞానమే. అందుకే 'మనుః' కూడా నారాయణనామం. **"మహర్షయః సప్తపూర్వే చత్వారో మనవస్తథా । మద్భావా మానసాజాతాః'** -అని గీత. "సప్తర్షులు, మనువులు నా భావన వలన కలిగినవారు" అని కృష్ణ వచనం.

3. 'మనుః' అనే శబ్దానికి మంత్రం అని అర్థం. మననం చేయబడేది మన్త్రం. ఈ విశ్వకర్మయైన విష్ణువు, తన మనశ్శక్తితో ఈ సృష్టిలో అన్నిటినీ మలచుతున్నాడు-

త్వష్టా .. 52

1. రూపములను మలచువాడు. రూపాలకు అధిపతి.

తనూకరణత్వాత్ త్వష్టా. త్వష్టా రూపాణా మధిపతిః

వృత్తిపరంగా కళ్ళలను, లోహాలను తొలచి, మలచి రూపం ఇచ్చే వానిని 'త్వష్ట' (వడ్రంగి) అంటారు. అలాగే లోకాలలో అనేక రూపాలను మలచుతున్న మహాచైతన్య స్వరూపుడు నారాయణుడు 'త్వష్టా'.

వేదాలలో 'త్వష్టా' అనేది ఒక దేవతావిశేషం. సర్వదేవతాత్మకుడైన నారాయణుని నుండి ఈ తనూకరణ సామర్థ్యం పొందిన దైవీశక్తి విశేషమే 'త్వష్టా'.

ఈ అనుగ్రహం పొందినవాళ్ళు శిల్పులుగా, వస్తునిర్మాణకారులుగా ఉంటారు. విశ్వకర్మా, మనుస్త్వష్టా అనే ముగ్గురు దేవతలు కళాశక్తులు. జగత్కళను నడిపే నారాయణ విభూతులు.

నారాయణుని మించిన కళాకారు లెవరుంటారు?

విశ్వంలో అనేక రూపాలున్నాయి. ఒక రూపం ఇంకొక రూపంగా పరిణమిస్తుంది. విత్తనం ఒక రూపమైతే, అది వృక్షంగా మరో రూపాన్ని సంతరించుకుంటోంది. మట్టి, రాయి, గుట్ట, పురుగు, మనిషి ఇలా ప్రతిదానికీ ఒక రూపం ఉంది. సృష్టిలో దాగి ఉన్న ఈ (రూపాలను మలచే) శక్తియే త్వష్టా.

2. అంతేకాదు – మలచి మలచి అసలు రూపమే లేకుండా చేయగలిగే శక్తి కూడా 'త్వష్టా' శక్తియే. మలచడానికి తొలిచితే రూపం. అలా తొలుస్తూపోతే అసలు రూపమే మిగలదు కదా!

ఈ విశ్వంలో ఒకరున్నట్లు ఒకరుండరు. ఒకటి ఉన్నట్టు ఇంకొకటి ఉండదు. ఎన్నెన్ని అందాలు! ఎన్నెన్ని వైవిధ్యాలు! నీటికి ఎన్ని రూపాలు! నేలకి ఎన్ని సౌందర్యాలు! వ్యక్తులకెన్ని ఆకారాలు! వ్యక్తిలో ఎన్ని రూపాలు!

'త్వష్టా రూపాణి పింశతు' –అని అథర్వవేదం రూపకారణమైన

నారాయణుని త్వష్టాశక్తిని ప్రార్థించింది.

త్వష్టారూపాణి హి ప్రభుః – అని ఋగ్వేదం.

3 'త్వష్టా' నామం సూర్య సంబంధి కూడా. రూపాలను, ఖనిజాలను, వృక్షాలను మలచే శక్తి సూర్య కిరణాలలో ఉంది. రూపాలను పోల్చుకోగలిగేది ఆయన వెలుగు వల్లనే. సూర్యాస్తమయం తరువాత ప్రపంచంలో పనిచేసే సౌరశక్తిని 'త్వష్టా' అంటారు. వివిధావస్థల్లో సౌరశక్తి ప్రక్రియ ననుసరించి వివిధ సూర్య నామాలను వేదం వివరించింది.

✦ ✦ ✦

ఈ 'విశ్వకర్మ, మను, త్వష్టా' అనే మూడు నామాలను మునుపటి నామాలతో కొనసాగిస్తూ పరిశీలిస్తే – మన శరీరంలో (పిండాండంలో) పనిచేసే విష్ణుచైతన్య విశేషాలే ఇవి... అని స్పష్టమౌతుంది.

'విశ్వుడు' అంటే 'జీవుడు' అని కూడా అర్థం. ఈ జీవుని కర్మసామర్థ్య చైతన్యం నారాయణుడే. జీవితాంతం, దేహంతో జరిగే కర్మను నిర్వహించే 'చైతన్యం' విశ్వకర్మ. ఆ విశ్వకర్మ (చైతన్యం) ఆలోచనా, భావనా శక్తులుగా పని చేసినప్పుడు 'మనువు'. ఆ శక్తులతో అనేకములను అంతరంగంలో కల్పించు కుంటాడు. శరీరంలో కూడా ఆ చైతన్యం వివిధ అవయవాలను ఏర్పరుస్తుంది. ఒక్కొక్క ఇంద్రియానికి (లోపల ఉన్న అస్థి, హృదయకోశం, కాలేయం వంటివి కూడా) ఒక్కొక్క నిర్ధిష్ట రూపం ఉంది. 'ఈ దేహం నేను' అని అహంకరించే మనం ఆ రూపాలను ఏర్పరచుకోలేదు. అందుకే వాటికి సంబంధించిన ఎరుక మనకు లేదు. కానీ అవి లేకపోతే దేహమే లేదు. మన దేహ (జీవిత) విశ్వంలో పనిచేసే విశ్వకర్మ చైతన్యం ఈ రూపాలను మలచే శక్తిగా పనిచేసినప్పుడు 'త్వష్టా' అనిపించుకుంటున్నాడు.

మునుపు చెప్పిన వివరణలను, ఈ వివరాన్నీ పరిశీలిస్తే... మనలోని చైతన్యం ఎన్ని విధాలుగా పనిచేస్తుందో అర్థమౌతుంది. ఒకే చైతన్యం చేసే పనుల భేదాల బట్టి అనేక పేర్లతో వ్యవహరింపబడుతున్నదనీ, అనేక క్రియలు ఉన్నా అంతా

కలిపి నేనే అనే భావన విస్తరించడానికి ఆ ఏకత్వమే కారణమని గ్రహించడానికి, 'వివిధ క్రియాశక్తులే దేవతలు' -అని మరో మారు గమనించడానికి ఈ వివరణ.

భావనలో కూడా రూపాలను ఊహలతో మలచుకొనే సామర్థ్యం 'త్వష్టా'.

✦ ✦ ✦

ఇక్కడ కాస్త ఆలోచనను కొనసాగిద్దాం. నారాయణుని విభూతులు జగమంతా నిండి ఒక్కొక్కరిలో ఒక్కొక్క విభూతి ఉత్కృష్టంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

మనలో కూడా పూర్ణ నారాయణ చైతన్యం ఉన్నా, మనం భావనలో అనేక రూపాలను మలచుకోగలం. కానీ క్రియా రూపంగా అద్భుత రూపాలను శిల్పించగలిగే, కట్టడాలను నిర్మించగలిగే శక్తి కొందరిలోనే ఉంటుంది. అంటే ఆ విభూతి ఆ జీవుని పూర్వ పుణ్య విశేషం చేత అతడికి గొప్పగా లభించిందన్నమాట. అలాగే అందరూ మాట్లాడినా, వ్రాసినా కళాత్మకంగా మాట్లాడేవారు, వ్రాసేవారు మాత్రమే ఉన్నత వాగ్విభూతిని పొందినవారు అనిపించుకుంటారు.

ఇలా సృష్టిలో కనబడే వివిధ సామర్థ్యాలన్నీ ఆ నారాయణ విభూతులే. ఆ విభూతులను అధిష్ఠించిన ప్రజ్ఞాశక్తుల్ని (దేవతలను) ఉపాసించి ఆ ప్రతిభలను ఇనుమడింపజేసుకోవచ్చు. అందుకే అన్ని విద్యలకు అధిష్ఠాన దేవతలున్నారు.

ప్రతి వృత్తిలో ప్రతిభా సామర్థ్యాలు భగవంతుని విభూతులే కనుక ఏ నైపుణ్యమూ మనది కాదు. మన పురాకృత సుకృతం వల్ల నారాయణుడు అనుగ్రహించినది. ఇది తెలిస్తే మన నైపుణ్యాలకు మనం అహంకరించం. 'నారాయణ ప్రసాదం'గా స్వీకరిస్తాం.

'నమః కులాలేభ్యః కర్మారేభ్యః' -అని 'కమ్మరినీ, కుమ్మరినీ' కూడా రుద్ర స్వరూపంగా నమస్కరించాయి వేదమంత్రాలు. అంటే వారిలోని నైపుణ్యం పరమేశ్వర స్వరూపంగా గుర్తించాలని అర్థం. ఇది 'విష్ణు విద్య'లో భాగం. ఈ వివరణలను దృష్టిలో ఉంచుకుంటే ఇతర నామాలను కూడా మనలో సాగే చైతన్య నర్తనలుగా గమనిస్తాం.

✦✦✦

విశ్వాన్ని నడిపే అన్ని నైపుణ్యాలను గమనిస్తే - ఆ నారాయణుడు ఎంత విస్తారంగా బలం కలిగి నిండిపోయాడో అర్థమౌతుంది. ఆ అర్థమే తరువాతి నామం -

స్థవిష్ఠః.. 53

1. అంతులేని విస్తారం కలిగినవాడు - గొప్ప స్థూలత కలవాడు. ఇన్ని విభూతులను పరిశీలించితే - అపారమైన ఈ విశ్వమంతా నిండి ఉన్నవని స్పష్టమౌతుంది. అంతులేని విభూతులతో విస్తరించినవాడు - స్థవిష్ఠుడు. అతి పెద్ద ఆకృతి గలవాడు.

'నాస్త్యన్తో విస్తరస్యమే'.

- "అర్జునా! నా యొక్క విభూతుల విస్తారానికి హద్దు, అంతం లేదు" అని గీతలో విభూతి యోగంలో పరమాత్ముని పలుకు.

అత్యంత విస్తారమైన ఈ బృహత్ స్వరూపమే పార్థునికి విశ్వరూప సందర్శన యోగంలో గోచరించినది.

ఇంత విస్తరించినవాడు ఎప్పటి నుండి ఉంటున్నాడు? ఎలా ఉంటున్నాడు? అత్యంత పురాతనుడై, చెక్కు చెదరకుండా ఉంటున్నాడని తరువాతి నామం.

స్థవిరో ధ్రువః .. 54

1. స్థవిర, ధ్రువ - అనే రెండు శబ్దాలు కలిపి ఒకే నామంగా చెప్పారు.

'స్థవిర' అనే విశేషణంతో కూడిన 'ధ్రువ' నామం.

'స్థవిరుడు' అంటే పురాతనుడు. ఈనాటివాడా ఈయన! కాలాతీతుడు.

'పురాణః స్థవిరః' అని శాస్త్రాలు కీర్తించాయి. **'సర్వం కాలం తిష్ఠతీతి'** - సర్వకాలాలలోను ఉండేవాడు 'స్థవిరుడు'. **'పురుషాయ పురాణాయ'** **'కవిం పురాణం'** అని స్వామి ప్రాచీనతని వర్ణించాయి శాస్త్రాలు.

'ఉగ్రా త ఇంద్ర స్థవిరస్య బాహూ' అని అథర్వవేదం.
అన్ని కాలాలలో ఉన్న ప్రాచీనుడైనా, కాలదోషం అంటని కాలాతీతుడు. కాలంతోపాటు మారని నిశ్చలుడు – నిశ్చయ స్వరూపుడు. అందుకే 'ధ్రువుడు'. విశ్వకర్మాది శక్తులతో జగత్తును పరిణమింప జేస్తున్నా తాను మార్పు చెందడు.

అన్ని కాలాలలోనూ ఉన్న అత్యంత ప్రాచీనుడైనా చెక్కుచెదరనివాడు – స్థవిరోధ్రువుడు.

శ్రీపరాశర భట్టాచార్యులు వంటివారు దీనిని రెండు నామాలుగా పేర్కొన్నారు. అన్నిటికీ కారణమైనా, కారణాలకూ కాలాలకూ లొంగని ప్రాచీనుడు స్థవిరుడు. చలించనివాడు ధ్రువుడు.

ఎన్ని దేహాలు మారుతున్నా, లోపలి చైతన్యం మాత్రం కాలాతీతమైన నిశ్చలత్వంతో ఉన్న ఆత్మయే. అది నారాయణ స్వరూపం. దానినే **"కూటస్థం అచలం ధ్రువం"** అని వేదాంత విద్య వివరించింది. ఈ ధ్రువమే, ఈ నిశ్చయ నిశ్చల విశ్వచైతన్యమే దేవతలకు మూలం అని వేదమంత్రాలు స్తుతించాయి. 'స్థిరంగా పట్టుకున్నది – ధరించేది – ధ్రువము' అని అర్థం కూడా ఉంది.

సర్వకాలాలలోనూ ఈ సనాతన ధ్రువశక్తిని ఆధారం చేసుకొనే విశ్వమూ, దేవతలూ నిర్వహింపబడుతున్నారు.

ధ్రువం తే రాజావరుణో ధ్రువం దేవో బృహస్పతిః
ధ్రువంత ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువమ్ ॥ (శ్రుతి)

ఈ ధ్రువమైన సనాతన నారాయణ పరతత్వం 'అంతా తానే ఉంది కదా' అని తేలిగ్గా అందినట్టే అనిపిస్తూ, అందకుండా ఉంటోంది. ఇంద్రియ మనో బుద్ధులకందనిది అది...

అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః।
ప్రభూతస్త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరమ్ ॥... 7

55. అగ్రాహ్యః,	**56.** శాశ్వతః,	**57.** కృష్ణః,
58. లోహితాక్షః,	**59.** ప్రతర్దనః	**60.** ప్రభూతః,
61. త్రికకుబ్ధామ,	**62.** పవిత్రం,	**63.** మంగళం పరమ్

అగ్రాహ్యః .. 55

1. గ్రహించడానికి వీలులేని వాడు.

పరిమితులున్న మన కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలతో ఆ నారాయణ తత్వాన్ని గ్రహించలేం.

'యన్మనసా నమనుతే' 'యత్ చక్షుషా నపశ్యతి'

చూపుకీ, మాటకీ, మనసుకీ కూడా అందని పరతత్త్వ స్వరూపుడు.
ఆయనను పట్టుకుందామని ప్రయత్నించిన కాలయవనునకు చిక్కలేదు.
పట్టి కట్టివేద్దామనుకున్న దుర్యోధనాదులకు చిక్కలేదు.
ముగ్ధ భక్తురాలైన యశోద మాత్రం ఆయనను పట్టుకోగలిగింది, కట్టగలిగింది.
నిజానికి ఆమె పట్టుకోలేదు. ఆయన పట్టుబడ్డాడు. కట్టుబడ్డాడు. భక్తికి తప్ప దేనికీ లొంగనివాడు 'అగ్రాహ్యుడు'.

'యత్త దదృశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణ మచక్షుః' –

స్థూల నేత్రాలకు కనబడనివాడు, గ్రహింపవీలులేనివాడు, పుట్టుకలు, వర్ణములు లేనివాడు అని 'ముండకోపనిషత్తు' ఆత్మ స్వరూపాన్ని ప్రస్తావించింది.

సైన మూర్ధ్వన్నతిర్యఞ్చ నమధ్యే పరిజగ్రభత్ – శ్రుతి.

వీనిని పైన, క్రింద, మధ్య ఎచ్చటను గ్రహింపలేం. అనంతుడు కనుక ఎవరికీ అంతుపట్టని కాలస్వరూపుడు –

శాశ్వతః .. 56

1 ఎల్లప్పుడూ ఉండేవాడు. **'శాశ్వతగ్ం శివం అచ్యుతమ్'** – అని నారాయణోపనిషత్తు విష్ణుని శాశ్వతునిగా కీర్తించింది.

2. **'శశ్వత్ భవః శాశ్వతః'** – ఒక ప్రవాహం వలె నిత్య చైతన్యమై విశ్వ కార్యనిర్వహణ చేస్తున్నవాడు.

అవ్యుచ్ఛిన్నాస్తతస్వేతే సర్గస్థిత్యంత సంశయాః (విష్ణు పురాణం) – ఎడతెరిపి లేకుండా నిత్యం ఈ సృష్టి స్థితి లయలు చేయువాడు. నిత్యమైన ఈ పరబ్రహ్మమున ఆనందం కూడా నిత్యమే. ఆ ఆనందం జడమైనది కాదు. సత్యమైనది చైతన్యమయమైనది. సచ్చిదానంద స్వరూపుడు కనుక –

కృష్ణః.. 57

విష్ణు నామాలలో ఒక దివ్యమంత్రం 'కృష్ణ' నామం. అనాదిగా మహాత్ములు తదేక శరణ్యులై జపించి తరించిన దివ్యమంత్రమిది.

1. సచ్చిదానంద స్వరూపుడు – అని ఈ నామానికి అర్థం.

కృషిర్భూవాచక శ్శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః ।
విష్ణుస్తద్భావయోగాచ్చ కృష్ణో భవతి శాశ్వతః ॥

అని మహాభారతంలో వ్యాసుని మాట.

కృష్ – భూవాచకం – అంటే 'సత్తా' వాచకం. సత్యమే 'కృష్'. నిత్యమై, ఉనికి మాత్రమే అయిన సత్తాస్వరూపుడు. అన్నీ మారుతున్నా, తాను మారని ఆధారస్వరూపుడు.

'ణ' – చిదానంద వాచకం. ఇంద్రియ జన్యమైన ఆనందం జడానందం. ఇంద్రియాతీతమైన పరమాత్మ చైతన్యమయమైన ఆనందతత్వం. అదే చిదానందం.

'కృష్ణ' – 'సచ్చిదానంద' అనే భావం సాక్షాత్తు పరబ్రహ్మ మితడేనని

చెప్తున్నది. **'కృషిధాతు ణ కారాభ్యాం సత్తానందాత్మకం కిలాఖిలపతిం'** అని 'నారాయణీయం'లో నారాయణ భట్టాత్రి వచనం.

2. అంతుపట్టని (అగ్రాహ్యం) 'శాశ్వత' కాలమే 'కృష్ణ' అని చెప్పబడుతున్నది. అన్నిటినీ తనలోకి లాగికొనేది ఏదో అది 'కృష్ణ'. కర్షణము (లాగికొనుట) చేయునది 'కృష్ణ'.

   'కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో' అని స్వామియే గీతలో పలికాడు. ఏదీ తనను గ్రహింపలేకున్నా, అన్నింటినీ తనలోనికి గ్రహించే కాలస్వరూపుడితడు.

   కాలానికి సంకేతంగానే నల్లని నీలవర్ణంతో భాసిస్తున్నాడు. లీనం చేసుకొనేది నీలం. అన్ని రంగులనూ తనలో కలుపుకో గలిగే నీలవర్ణం – సర్వాకర్షక వర్ణం.

   'కృష్ణవర్ణాత్మకత్వాద్వా కృష్ణః' – నల్లని వర్ణము గలవాడు అని అర్థం.

3. చక్కగా తనలోనికి లాగికొనే ఆకర్షకుడు – కృష్ణుడు. ఆయన నామం, రూపం, గుణం, మహిమ, లీల, తత్వం – ఏది తలచుకున్నా భక్తుల మనసులు వెంటనే ఆయన లోనికి ఆకర్షితమౌతాయి.

   సంసార బంధనాలను విడిపించి తనలోనికి లాగికొనే ముక్తి ప్రదాయకుడు – అనుగ్రహ స్వరూపుడు గనుక "కృష్ణ" అన్నారు. **"భక్తాన్ స్వాత్మని కర్షకః – కృష్ణః"** అని నిర్వచనం.

4. కర్షణ శబ్దం నుండే వ్యవసాయదారుని సూచించే 'కర్షక' శబ్దం వచ్చింది. పృథ్విని హలంతో దున్ని పంట పండించడం కర్షకుని పని. పనికిరాని రాళ్ళూ రప్పలతో, దృఢత్వంతో, కలుపు మొక్కలతో ఉన్న పృథ్విని వ్యవసాయానికి అనుగుణంగా మలచడమే కర్షణం. అలా చేసి పంటను (ఫలాన్ని) చేకూర్చేవాడు కర్షకుడు. అదే విధంగా ఆశ్రయించిన వారి మనోభూమికలో పాపాదులను తొలగించి, జ్ఞానసస్యాలను ఆనంద ఫలాలను ప్రసాదించగలిగే ఏకైక కర్షకుడు శ్రీకృష్ణ పరమాత్మయే.

కృషామి పృథివీం పార్థ! భూత్వా కార్ష్ణాయసోహలః ।
కృష్ణో వర్ణశ్చమే యస్మాత్తస్మా త్కృష్ణోహమర్జున ॥ (మహాభారతం)
భూమిలోకి జొచ్చి, పృథ్విలో జరిగే అనేక మార్పులకు కారకమైన శక్తిగల విష్ణువు కృష్ణుడు.

5. అనంత అంతరిక్ష నిర్వహణ చేసే సౌరశక్తి విశేషం కూడా ఈ పేరులో ఉంది. వేదాధారంగా వీటిని గ్రహించాలి.

'ఆకృష్ణేన రజసా వర్తమానో నివేశయన్' అని సూర్యనారాయణ శక్తిని వర్ణించింది వేదం. బాగా లాగి (ఆకర్షించి) జగములను పట్టి ఉంచేది సూర్యశక్తి. ఈ పృథివ్యాది గ్రహాలు తమతమ స్థితులలో ఉండి పద్ధతిగా ఉన్నాయంటే తగినంతగా లాగి, పట్టిఉంచిన (ఆకర్షణ) శక్తి కారణం. ఈ శక్తి సూర్యుని నుండే పృథివికి సంక్రమించింది. ఆ ఆకర్షణ శక్తియే మన ఉనికికి, కాలగతికి హేతువయ్యింది. సూర్యాదులకు కూడా అటువంటి శక్తి నిచ్చినది పరమాత్ముని యొక్క 'కర్షణశక్తి'. ఆ అనంత కర్షణశక్తి సంపన్నుడైన పరమాత్మ శ్రీకృష్ణుడు.

పృథ్విని అన్ని వైపుల నుంచి పట్టి ఉంచినది సౌరశక్తియేనని వేదం స్పష్టంగా పేర్కొంటూ –

'ఉధృతాసి వరాహేణ కృష్ణేన శతబాహునా'

'ఓ భూదేవీ! అనంత బాహువులున్న కృష్ణునిచే ఉద్ధరింపబడిన దానవు' అనే అద్భుత భావనను ఆవిష్కరించింది.

బ్రహ్మ కృష్ణశ్చ నోఽవతు నామేగ్నయే. (యజుర్వేదం)
కృష్ణోస్యాఖరేష్ఠః – (యజుర్వేదం)
'కృష్ణోయజ్ఞః' –అని శాస్త్రాలు వేదాధారంగా, విశ్వయజ్ఞ నిర్వాహకుడైన విష్ణువును 'కృష్ణః' అని కీర్తించాయి.

సూర్యాది రూపాలలో జగములను పట్టి నడిపే సర్వాకర్షకుడు కాంతిమండలాలనే నేత్రాలుగా సర్వ విశ్వాన్నీ గమనిస్తున్నాడు.

లోహితాక్షుఁ.. 58

1. ఎఱ్ఱనైన కన్నులు గలవాడు.

   "వృషభో లోహితాక్షుఃసూర్యో విపశ్చిన్మనసా పునాతు"

   "అసౌ వృషభో లోహితాక్షుఃఅని శ్రుతి పలుచోట్ల పలికింది. అగ్నిమయమైన కన్నులు. ఇక్కడ నేత్రాలనేవి కాంతులకు సంకేతాలు. కాంతి అగ్నిజన్యం. మహాగ్నియైన సూర్యుడు తన అగ్ని లక్షణమైన అరుణిమను ఉదయపు తొలివేళ మిక్కిలి ఎఱ్ఱగా, తరువాత లేత ఎఱుపుగా, అటు పిదప బంగారు వన్నెతో ప్రకాశింపజేస్తాడు.

   'అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రుఃఅని యజుర్వేద (రుద్రనమక) మంత్రం.

   తన ఎఱ్ఱని కాంతులతో అన్నిటినీ గమనించే సర్వదర్శనుడు.

2. హృదయం భగవదనురాగ రంజితమై వికసించితే – దానిని 'అరుణకమలం'గా వర్ణించాయి. ఆ అరుణ కమలంలో స్వయంజ్యోతిగా వ్యక్తమైన హరి నుండి ప్రసరించే కరుణకాంతులే లోహితాక్షాలు.

3. **'చక్షుఃసూర్యో అజాయత'** అని పురుషసూక్తం వర్ణించినట్లు సూర్యనేత్రుడైన హరి కనుల కాంతులు లోహితాలు. చంద్రుడు కూడా ఉదయవేళ లేత ఎఱ్ఱని కాంతులతో భాసిస్తాడు. సూర్యచంద్ర నేత్రుడైన హరి 'లోహితాక్షుడు'.

4. ఎఱ్ఱ తామరల వంటి విశాలత, లేత ఎరుపు జీరలు ప్రకాశించడం ఉత్తమ పురుషుని నేత్ర లక్షణం. స్వామి జగన్మంగళ మోహనాకృతిలో ఆ నేత్రాలు లోహితాక్షాలుగా ప్రకాశిస్తున్నాయి.

5. 'ఎరుపు' రంగును 'రాగం' అంటారు. అంటే ప్రేమ. జగత్తును ప్రేమతో దర్శించే కరుణామయుడైన కృష్ణుడు లోహితాక్షుడు. ఆగ్రహంతో కూడా కన్నులు ఎరుపెక్కుతాయి. దుష్టులపై ఆగ్రహించి శిక్షించే ధర్మరక్షకుడు – అని కూడా భావం.

   'మన్యురసి మన్యుం మయిధేహి' అని యజుర్వేదం. 'అధర్మాన్ని శిక్షించే

ఆగ్రహ శక్తివి నీవే. అది మాకు ప్రసాదించు' అన్నది వేదం. ధర్మరక్షణకై ఎరుపెక్కిన కనులవాడు దుష్టులను హింసించువాడు-

ప్రతర్దనః .. 59

1. **'తర్ద హింసాయాం'** - 'తర్ద' అనే ధాతువునకు 'హింస' అని అర్థం. 'ప్రతర్దనుడు' అంటే 'బాగా హింసించేవాడు'.
   దుష్టులను హింసించేందుకు - **వినాశాయ చ దుష్కృతాం**
   -అవతరించినవాడు నారాయణుడు.
2. ప్రళయకాలంలో కాలాగ్నిరుద్రుడై **(కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్ సమా హర్తుమిహ ప్రవృత్తః** - అని గీతలో కృష్ణ వచనం) సర్వమును సంహరించువాడు. సౌరపరంగా 'తన తీవ్రతాపంతో బాధించువాడు!'
   ఆశ్రయించిన జీవుల కర్మబంధాలను కూడా సమూలంగా నశింపజేయగలిగే కైవల్య ప్రదాయకుడు విష్ణువు. ఈ విధంగా సర్వ సమర్థుడూ, సర్వశక్తి సంపన్నుడు కనుక -

ప్రభూతః .. 60

1. బాగా కలిగినవాడు. జ్ఞాన బల క్రియ ఐశ్వర్యాది అనంత కల్యాణ గుణాలను ప్రకృష్టంగా కలిగినవాడు. ఈయనను మించి మేధ, ధీరత, అంతర్దృష్టి (జ్ఞానం) కలిగినవాడు లేడని వేదం కీర్తించింది.
   న త్వదన్యః కవితరో న మేధయా ధీరతరో వరుణ స్వధావన్ ।
   త్వం తా విశ్వా భువనాని వేత్థ... ॥ అథర్వవేదం ॥
   త్వమింద్ర బలాదధి సహసోజాతా ఓజసః ॥ ఋగ్వేదం ॥
   సర్వ బలగుణ ప్రపూర్ణుడు కనుక -
   పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణం పూర్ణేన సిచ్యతే ॥ అని 'అథర్వవేదం'.
   సర్వగుణ సంపూర్ణుడై, ముల్లోకాలలోను నిండినవాడు-

1. పైన, మధ్య, క్రింద – (ఊర్ధ్వ – అధో – మధ్య) అనే త్రివిధ దశలకు, ముల్లోకాలకు స్థానమైనవాడు.
   మూడు లోకాలు ఆయననే ఆశ్రయించుకొని ఉన్నాయి.
2. 'దిక్కులకు పతి' అని కూడా ఈ నామానికి అర్థం.
   'ककुప్' అంటే దిక్కు. మూడు దిక్కులకు ఆశ్రయమైనవాడు – 'త్రికకుప్ ధామ' సాధారణంగా పైకి, క్రిందికి, మధ్యకు మన దృష్టి సాగుతుంది. 'మధ్య' భాగం యొక్క విస్తృతిని మనం నాలుగు దిక్కులుగా, మరో నాలుగు మూలలుగా చెబుతాం. కనుక 'త్రికకుప్' మూడు దిక్కులు అంటే, మధ్య 8 దిక్కులు; పైన, క్రింద కలిపి దశదిశలనూ ప్రస్తావించినట్లే.
   మరోరకంగా – మనకు అభిముఖంగా ఉన్న దిక్కు అప్రయత్నంగా సిద్ధించినట్లే గనుక, దానితోపాటు మిగిలిన మూడు దిక్కులు చెప్పినట్లుగా భావించవచ్చని కొందరు వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.
   మొత్తంగా ఈ నామానికి 'సర్వదిక్కులకు దిక్కైనవాడు' అని అర్థాన్ని చెప్పవచ్చు.
3. సూర్యపరంగా చూస్తే తాను ఆవిర్భవించినది – తూర్పున. దానితో మిగిలిన మూడు దిక్కులు ఏర్పడ్డాయి. అసలు సూర్యుని వల్లనే దిక్కులను లెక్కించగలం. తాను తూర్పున ఉదయించడం చేతనే మిగిలిన మూడు దిక్కులను పోల్చుకోగలుగుతున్నాం. కనుక దిక్కులకు పతి – దిక్కులను ఏర్పరచినవాడు – అని సూర్యనారాయణుని స్తుతించారు.

   "నమోహిరణ్యబాహవే సేన్యాన్యే <u>దిశాంచ పతయే నమః</u>"

   అని రుద్ర నమకం కూడా సూర్యుని రుద్ర స్వరూపునిగా స్తుతించింది.

   దిశో యశ్చక్రే ప్రజ్ఞానీతస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః. ॥ అథర్వం ॥

   "దిశలను ఏర్పరచిన ప్రజ్ఞానవంతుడైన బ్రహ్మమునకు నమస్కారం"

   సూర్యరూపంగా దిక్కుల నేర్పరచిన నారాయణుని వల్లనే దిగ్దేవతల ఉనికి.

4. **'విష్టభ్యాహమహం కృత్స్నం ఏకాంశేన స్థితోజగత్'** –అని గీత. 'ఒక్క భాగంతో ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నాను' అని భగవానుని వచనం.

నాలుగు భాగాలుగా చూస్తే – ఈ గోచరాత్మకమైన (కనిపించే) జగమంతా ఒక్క భాగమే, కనిపించనివి మూడు భాగాలు. ఈ పావుభాగం జగము సృష్టిస్థితిలయలతో మారుతున్నా, దీనికి ఊర్ధ్వంగా ఉన్న మూడు భాగాలు అమృతము. స్వామి యొక్క పరంధామము. అందుకే **"పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి". "త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః పాదోస్యేహా భవాత్పునః".** అనే వేద వాక్యాలలో ఆ 'త్రిపాదాలు' (మూడు భాగాలు) మనకు ఊర్ధ్వాన ఉన్నాయి. "భూఃపాదౌ" అనడంలో కూడా ఇదే ఆంతర్యం. ఒక పాదమే ఈ జగత్తు.

ఇలా మనకు ఊర్ధ్వాన మూడు పాదాలతో నున్న నిత్య అమృత ధామము పరంధామము. అటువంటి "త్రిపాద్విభూతిని తన స్థానముగా (ధామముగా) కలవాడు" – త్రికకుబ్ధామ.

5. దీనికి "త్రికకుద్ధామ" అనే పాఠాంతరం కూడా ఉంది.

తథైవాసం త్రికకుదః వారాహం రూపమాస్థితః ।
త్రికకుత్తేన విఖ్యాతః శరీరస్య ప్రమాపణాత్ ॥

– అని 'మహాభారతం'.

'ककुत्' అంటే 'స్థానము' 'మూపురము' అని అర్థం. వరాహావతారంలో మూడు మూపురములు కలిగి ఉన్నాడు కనుక నారాయణుడు 'త్రికకుద్ధామ'.

6. మూడు విధములైన దశలు – స్థానములు – అంటే జాగ్రత్ స్వప్న సుషుప్తులు అనే అవస్థలు. జీవునిలో అవస్థలు మారుతున్నా, ఆ మూడు అవస్థలలో చైతన్యం మాత్రం మారలేదు. ఆ అవస్థలకు ఆశ్రయం ఆత్మచైతన్యమే. అదే మనలో నారాయణ స్వరూపం. అంతర్యామి అయిన ఆ నారాయణుని ఆశ్రయించుకుని ఈ మూడు అవస్థలు జరుగుతున్నాయి. కనుక, ఆ విష్ణువే 'త్రికకుబ్ధామ'.

7. మూడు విధముల స్థానములందు ఉన్నవాడు-
దీని గురించి 'నారదపురాణం' ఇలా వివరించింది-
విష్ణోస్తుత్రీణి రూపాణి పురుషాఖ్యాన్యతో విదుః ।
ఏకం తు మహతః స్రష్టు ద్వితీయం త్వండ సంస్థితమ్ ॥
తృతీయం సర్వభూతస్థం తాని జ్ఞాత్వా విముచ్యతే ॥

1. మహత్స్రష్ట, 2. అండస్థితుడు, 3. సర్వభూతస్థితుడు.
సమస్త విశ్వానికి మూలమైన మహత్తత్వాన్ని సృష్టించి అందున్నవాడు.
'మమయోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।
సంభవః సర్వభూతానాం తతోభవతి భారత ॥ - భగవద్గీత.

మూలకారణమైన మహత్తత్వమున బీజరూపమై ప్రవేశించగా, దాని వలన సర్వప్రాణికోటి ఉత్పన్నమైనది- అని పరమాత్మ వచనం.
రెండవది అటు తరువాత తయారైన బ్రహ్మాండములందున్న వాడు. మూడవది - సర్వజీవుల హృదంతరంలో ఉండే చైతన్యరూపం.

మూడైన లోకాలకు అధిష్ఠానమైన వాడు, లోకాలలోని గుణాలకు అంటకుండా, ఆశ్రయించిన వారిని పునీతులను చేసే తత్త్వం కనుక -

పవిత్రమ్..62

1. శుద్ధతయే విష్ణుతత్వం. తాను శుద్ధుడే కాక, తలచిన వారిని శుద్ధం చేసి సిద్ధిని చేకూర్చువాడు - పవిత్రుడు.
2. మంత్రములకు 'పవిత్రం' అని వ్యవహారముంది. అలాగే ఋషులకు కూడా. **'కర్తరి చర్షి దేవతయోః'** అనే పాణిని ప్రకారంగా ఆదిశంకరులు నిర్వచిస్తూ **"యేనపునాతి యోవాపునాతి ఋషిర్దేవతా వా తత్ పవిత్రమ్"** దేనితో పవిత్రులమౌతామో - ఎవరు పవిత్రులను చేస్తారో వారు పవిత్ర శబ్ద వాచ్యులు. మంత్రాలు, మంత్రద్రష్టలు - వారి వలన శుద్ధి కలుగుతుంది. కనుక మంత్ర స్వరూపుడు, ఋషిరూపుడు - అని కూడా ఈ నామానికి

అర్థం. 'పవిత్రం తే వితతం బ్రహ్మణ స్పతే' అని ఋగ్వేదవచనం.

2. 'న త్వహం తేషు తేమయి' "జగత్సంబంధమైన సకల గుణములు, విశ్వాత్మకుడనైన నాయందున్నా, నేను వాటి యందు లేను". సృష్టి గుణాలకు అంటనివాడు.
3. పాపనాశనమే పవిత్రత. ఆ విధమైన పాపనాశక శక్తి కలవాడు. అంతటి పవిత్రుడు గనుకనే ఆయన వలన కలిగే సిద్ధి అత్యంత ఉత్కృష్టమైన మంగళం. శుద్ధి స్వరూపుడు – పవిత్రం. సిద్ధి స్వరూపుడు–

మంగళంపరమ్ (పరం మంగళం) .. 63

1. అత్యంత శుభుడు.
   ఉత్కృష్టమైన శుభమే నారాయణ స్వరూపం. ఆయనను మించిన శుద్ధమైన తత్త్వమూ లేదు. శుభమైన అంశమూ లేదు. కనుక అతడు పరమ మంగళుడు.
2. స్మరించినంత మాత్రాన అశుభాలు తొలగించి, అత్యంత శుభాలను ప్రసాదించేవాడు.
   అశుభాని నిరాచష్టే తనోతి శుభసన్తతిం ।
   స్మృతి మాత్రేణ యత్పుంసాం బ్రహ్మతన్మంగలం పరమ్ ॥
   (విష్ణు పురాణం)
   స్వామి రూపం, నామం, మహిమ అన్నీ శుద్ధములు – మంగళములు. జగద్వికారాలకు అంటకుండా జగత్తును నడిపే పరమ మంగళుడు ...

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః।
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః ॥... 8

64. ఈశానః, **65.** ప్రాణదః, **66.** ప్రాణః,
67. జ్యేష్ఠః, **68.** శ్రేష్ఠః, **69.** ప్రజాపతిః,
70. హిరణ్యగర్భః, **71.** భూగర్భః, **72.** మాధవః, **73.** మధుసూదనః

ఈశానః .. 64

1. **సర్వభూత నియంతృత్వాత్** – సర్వజీవులను నియమించువాడు.
తమీశానం జగతస్తస్థుషస్పతిం – యజుర్వేదం.
2. సర్వమును తన వశమందుంచుకొని, అన్ని అవస్థలలోనూ అన్నిటిని పాలించేవాడు.
'సర్వస్యవశీ సర్వస్యేశానః సర్వస్యాధిపతిః.
ఏషసేతు ర్విధరణః ఏషాం లోకానామసంభేదాయ' –అని
'బృహదారణ్యక ఉపనిషత్'
ఈతడే లోకములన్నీ కలగాపులగం కాకుండా, తగిన విధంగా విభజించిపెట్టు ఆధారుడు.
తన పాలనా ధర్మంలో ప్రధానంగా సమస్త జీవులకు ప్రాణములిచ్చువాడు కనుక –

ప్రాణదః .. 65

1. ప్రాణశక్తిని ఇచ్చువాడు.
కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ ॥
ఈ ఈశ్వరుడు లేనిదే ఎవరు కదలగలరు? అని తైత్తిరీయ ఉపనిషత్తు.
"య ఆత్మదా బలదా" **"స దైవః ప్రాణ ఆవిశతి"** అని శ్రుతులు పలికాయి.

శరీరంలో ఈ ప్రాణం అయిదు విధాలైన కర్మలు చేస్తూ చలిస్తున్నది. ఈ ప్రాణము ఆత్మ చైతన్యం ద్వారానే లభించినది కనుక – సర్వచైతన్య స్వరూపుడైన 'ఈశానుడు' తన పాలనను ప్రాణశక్తి నిర్వహణ ద్వారా చేస్తున్నాడు. చేస్తున్న కర్మవిధాలను బట్టి 'ప్రాణ అపాన వ్యానోదాన సమాన' అనే అయిదు ఉపవాయువులుగా ప్రాణశక్తి ప్రసరిస్తున్నది. చైతన్యం ప్రధానంగా ప్రాణశక్తిగా శరీరాన్ని నిర్వహిస్తున్నది కనుక – దానినే ముఖ్య వస్తువు అని భావించాలి. ఆ ముఖ్య వస్తువు నిచ్చినవాడు ఈశ్వరుడే.

ప్రాణదా అపానదా వ్యానదా వర్చోదా వరి వోదాః ।
అన్యాంస్త అస్మత్తపన్తు హేతయః అస్మభ్యం శివోభవ ॥ యజుర్వేదం ॥
యఃప్రాణతో నిమిషతో మహిత్వైక ఇద్రాజా జగతోబభూవ ।
య ఈశే అస్య ద్విపదశ్చతుష్పదః కస్మై దేవాయ హవిషా విధేమ ॥

(ఋగ్వేదం)

'ప్రాణరూపుడై, శరీర నిర్వహణ చేస్తున్న పాలకుడు (ఈశానుడు) మనలోనే ఉన్నాడు'– అని 64, 65 నామాలు చెబుతున్నాయి.

"ప్రాణోహ సర్వస్యేశ్వరః" అని అథర్వవేదం. ఈ పాలన ప్రాణముల నివ్వడమే కాక ప్రాణశక్తిని బహువిధాలుగా నిర్వహిస్తున్నది.

2. **ప్రాణో మృత్యుః ప్రాణస్తక్మా ॥** అథర్వ వేదం॥

తక్మా – జ్వరం, రోగం మొదలైనవి.

నెమ్మది నెమ్మదిగా క్షీణించే లక్షణం కలది ప్రాణం. మృత్యువు, రోగములు మొదలైనవి అని కూడా అర్థం. ఈశానుడైన విష్ణువు ఈ మృత్యువునూ, రోగాలను దహించువాడు కనుక 'ప్రాణదః' (ప్రాణములను దహించువాడు).

3. **'ప్రాణాన్ ధ్యతి – ఖండయతి'** ప్రాణములను ఖండించువాడు – ప్రాణదుడు. కాలమే ప్రాణములను హరించునది కనుక – కాల స్వరూపుడు 'ప్రాణదుడు' అని కూడా అర్థం. **'కాలః సర్వస్యేశ్వరః'** కాలమే సర్వమునకు ఈశ్వరుఁడు అని అథర్వవేదం.

4. యోగాభ్యాసాల ద్వారా ప్రాణాలను శుద్ధి చేసుకుంటారు. ఆ విధంగా **'ప్రాణాన్ దాపయతి'** – ప్రాణములను శుద్ధి చేసే యోగ స్వరూపుడు 'ప్రాణదుడు'.
5. దుష్టుల ప్రాణములను దహించి, ఖండించి, ధర్మరక్షణ చేయువాడు– 'ప్రాణదుడు'.

ఈ నాలుగు అర్థాలు విశ్వమునకు ఈశానుడు (పాలకుడు) ప్రాణశక్తిని బహువిధాల నియమిస్తూ ఏ విధంగా విశ్వనిర్వహణ చేస్తున్నాడో తెలియజేస్తున్నాయి. ఈశానుడైన విష్ణుని పలుకార్యాలు ఒకే నామం ద్వారా వ్యక్తం చేశారు ఋషులు.

సర్వ శక్తిమంతుడైన విష్ణువు ప్రాణప్రదాయకుడు, సంహారకుడు మాత్రమే కాక – ప్రాణమే ఆయన. తన నుండే ప్రసరించే చైతన్యం తనకు భిన్నం కాదు. అవసరమైనప్పుడు తన శక్తియైన ప్రాణాన్ని ప్రసరించి, తగిన వేళలో తిరిగి గ్రహించేవాడే ప్రాణదుడు. జగత్తుకి ప్రాణమే ఆయన –

ప్రాణః .. 66

1 ప్రాణశక్తిగా ఉన్నవాడు.

ఉచ్ఛ్వాస నిశ్వాసలను కలిగించే ఈశానుడైన విష్ణువు ప్రాణులకు ప్రాణమై ఉన్నవాడు.

ప్రాణస్య ప్రాణః – అని బృహదారణ్యక ఉపనిషద్వచనం.

2. జీవించువాడు – అని కూడా అర్థం. దేహాభిమానియైన ఈశ్వర చైతన్యమే 'క్షేత్రజ్ఞు'డైన జీవుడు. కనుక క్షేత్రజ్ఞుడు అని కూడా ఈ నామానికిఅర్థం.
3. జీవించే వానిని జీవింపజేసే వాడు పరమాత్మ కనుక; తత్త్వతః ఈశ్వర చైతన్యమే జీవుడు కనుక – ఇది పరమాత్మను తెలియజేసే నామం.
4 ముఖ్య ప్రాణ స్వరూపుడై సుషుమ్నా నాడిలో సంచరించే వాడు నారాయణుడే. యోగం ఈ శ్వాస నిర్వహణ పద్ధతిలో ముఖ్య ప్రాణాన్నే ఉపాసిస్తోంది.

ముఖ్య ప్రాణోపాసన విష్ణూపాసనే.

5. ప్రాణులను ఉజ్జీవింప జేసేవాడే, దేవతలకు సైతం ప్రాణభూతుడై వారిని ధరించుతున్నాడు. **"తత్ దేవానాం నివర్తతానురేకః"** అని శాస్త్రం.

6. **'సప్త ఇమేలోకా ఏషు చరంతి ప్రాణాః'** అని వేద వచనం.

"భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యం" అనే సప్తవ్యాహృతులే విశ్వంలోని ప్రధాన లోకాలు. దేహంలో మూలాధారం నుండి సహస్రారం వరకు ఉన్న యోగభూమికలు. వీటిలో సంచరించే ముఖ్య ప్రాణ స్వరూపమే – ఆత్మచైతన్యం. దానిని గ్రహించడమే యోగాభ్యాసం. ఈ ప్రాణశక్తిని శుద్ధిచేసుకొని, సిద్ధింపచేసుకొనే సాధనే 'గాయత్రి'. **'గయాన్ త్రాయతే ఇతి గాయత్రి'** ప్రాణములను రక్షించే పరమాత్మయే గాయత్రి. కనుక ప్రాణాలకు ప్రాణమైన విష్ణుని 'ప్రాణః' అని ఈ నామంతో నమస్కరిస్తున్నాం.

ప్రాణులు ఎన్నెన్ని కలుగుతున్నా, వారి ప్రాణాలన్నిటికీ ప్రాణమైన అతడే మొదటివాడు, అతీతుడు. అంతేకాదు ఇంద్రియాలన్నిటికీ మూలమైన చైతన్యం ప్రాణమేనని శాస్త్రవచనం.

"నా జీవాధారా... నా నోము ఫలమా

నా చూపు ప్రకాశమా – నా నాసికా పరిమళమా" అని ప్రాణస్వరూపుడైన నారాయణుని కీర్తించారు త్యాగరాజ స్వామి.

7. 'శరీరతత్త్వదర్శనం' అనే గ్రంథంలో ప్రాణానికి సంబంధించిన వివరణ చాలా అద్భుతంగా ఉన్నది.

ప్రాణః సంజ్ఞా వాహినీనాం మూలే మూర్ధన్యవస్థితః ।
సూక్ష్మరూపో బుద్ధి చిత్తేంద్రియాణాం సహి సాధకః ॥
హృదాదీనా మింద్రియాణా మభిప్రేతార్థసాధనే ।
ప్రముఖః ప్రేరకశ్చాయం తతః ప్రాణ ఇతిస్మృతః ॥

'ప్రముఖమూ, ప్రేరకమూ' అయిన దానిని 'ప్రాణము' అంటారు. చిత్తవృత్తులను గ్రహించి తీసుకువెళ్లే వాహకాలలో ప్రాణమే అగ్రమైనది. ఇంద్రియాలను

శాసించే బుద్ధి కన్నా సూక్ష్మము, బుద్ధికి కూడా ప్రేరకమూ, ప్రముఖమూ అయినది.

ఈ విధంగా ప్రముఖమైన ప్రాణమే తొలి చైతన్యం కనుక –

జ్యేష్ఠః .. 67

1. పెద్దవాడు.

అందరికన్నా పెద్దవాడు. దేశకాలాదులకు మునుపే ఉన్నవాడు కనుక వృద్ధతముడీయన.

"బ్రహ్మైవ భూతానాం జ్యేష్ఠః" అనే శ్రుతి వచనానుసారం బ్రహ్మమే సర్వభూతముల కన్నా పూర్వమున్నది.

అథర్వవేదం ఈ 'జ్యేష్ఠ' నామంతో పరమాత్మను బహుధా కీర్తించింది.

యో భూతం చ భవ్యం చ సర్వం యశ్చాధితిష్ఠతి ।
సర్వస్య చ కేవలం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః । (అథర్వవేదం)

యతః సూర్య ఉదేత్యస్తం యత్ర చగచ్ఛతి
తదేవ మన్యేహం జ్యేష్ఠం తదునాత్యేతి కంచన ॥ (యజుర్వేదం)

'కాలాదులన్నీ ఆయనను ఆధారం చేసుకొని నడుస్తున్నాయి. కేవలుడైన జ్యేష్ఠునకు, బ్రహ్మమునకు నమస్సులు'

ఏష ప్రకృతి రవ్యక్తః కర్తాచైవ సనాతనః ।
పరశ్చ సర్వభూతేభ్యః తస్మాద్వృద్ధతమోచ్యుతః ॥

– అని మహాభారతం అచ్యుతుని "వృద్ధతముడు" అని కీర్తించింది. "ఈతడే ప్రకృతి, అవ్యక్తుడు, శాశ్వతుడై కర్తయై యుండే చైతన్యరూపుడు. సమస్త భూతాలకన్నా పరుడు. కనుక అచ్యుతుడే అందరికీ అన్నిటికీ మిగుల పెద్దవాడు."

అత్యంతమైన పెద్దతనమే కాక, గొప్పతనం కూడా కలవాడు–

శ్రేష్ఠః .. 68

1. మిక్కిలి గొప్పవాడు.

   సర్వకారణుడు అనే భావాన్ని 'జ్యేష్ఠ' నామం తెలియజేస్తే, సర్వాతిశయుడు (అన్నిటికంటె గొప్పవాడు) అనే భావం 'శ్రేష్ఠ' నామంలో ఉంది.

   'అతిశయేన ప్రశస్యతమః శ్రేష్ఠం" కీర్తింపదగిన మిగుల గొప్పతనం కలవాడీతడు.

2. ప్రాణశక్తియే సమస్త వ్యవహారాలకు మూలం, మహిమాన్వితము కనుక అది జ్యేష్ఠమై, శ్రేష్ఠమై ఉంది.

   వేదవచనం - **'ప్రాణోవావ జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ'** అని ప్రాణశక్తిని జ్యేష్ఠమనీ, శ్రేష్ఠమనీ పేర్కొంది. ఈ రీత్యా 'ప్రాణ' సంబంధమైన నామాల వరుసలోని ఈ రెండు నామాలు చెప్పబడడం వేద విజ్ఞానాన్ని ప్రస్తావించడమే.

   ముఖ్య ప్రాణోపాసనకు చెందిన ఈ నామాలనే

   'నమో జ్యేష్ఠాయ చ శ్రేష్ఠాయచ' -అని రుద్ర నమక మంత్రాలు స్తుతించాయి.

   'శ్రేష్ఠతమాయ కర్మణే' -అని యజుర్వేదం శ్రేష్ఠతముడైన పరమాత్మను పేర్కొన్నది.

3. ప్రశంసనీయమైన ఈ స్వామినే జ్ఞానులు నిత్యం కీర్తిస్తున్నారు.

   'తద్విప్రాసో విపన్యవః జాగృవాగ్ంసః సమింధతే.

   విష్ణోర్యత్పరమం పదమ్', బ్రహ్మజ్ఞులు నిత్యము ఎరుకగలవారై ఈయనని స్తుతిస్తున్నారు కనుక, సర్వదా కీర్తనీయమైన గుణమహిమ తత్వాధిక్యాలు కల విష్ణువే శ్రేష్ఠుడు.

   ప్రాణములనిచ్చి, లోగొనే ప్రాణస్వరూపుడైన విష్ణువు అన్నిటికంటే అధికుడు, ప్రశంసనీయుడు. ప్రశంసాపాత్రమైన దివ్య స్వాభావిక మహిమాతిశయంతో దీపించే శ్రీహరి సమస్త ప్రాణికోటికి పాలకుడై, రక్షకుడైఉన్న-

ప్రజాపతిః .. 69

1. సమస్త ప్రాణులను పాలించే ప్రాణశక్తి స్వరూపుడే 'ప్రజాపతి'. భూతజాతాని కంతటికీ కారణుడు కనుక – ఈ భూతకోటి సంతాన స్థానీయం. 'ప్రజా' అంటే 'సంతానమ'ని అర్థం. ప్రాణికోటియే విష్ణువునకు సంతానం. ఈ పదం జీవులందరి జీవనాదులకు కారణుడు అని సూచిస్తుంది. కేవలం కారణమేకాక, పాలకత్వం కూడా స్వామి కార్యమే కనుక ఆతడు 'ప్రజాపతి'.

   ఇది సృష్టి కర్తృత్వ శక్తిని తెలియజేసే నామం.

   యస్మాజ్జాతం నపురా కించనైవయ ఆబభూవ భువనాని విశ్వా ।
ప్రజాపతిః ప్రజయా సగ్ం రరాణాస్త్రీణి జ్యోతీంషి స చతేస షోడశీ ॥

(యజుర్వేదం)

ప్రజాపతే నత్వదేతాన్యన్యో విశ్వాజాతాని పరితా బభూవ ॥ (అథర్వవేదం)

– అని వేద మంత్రాలు సర్వవ్యాపకుడైన విష్ణువును సర్వజీవన సంరక్షకుడైన 'ప్రజాపతి'గా కీర్తించాయి.

2. 'ప్రజ' అంటే సంతానమనే కాక – 'ప్రకృష్టమైన జనులు' అనే అర్థాన్ని గ్రహిస్తే జ్ఞానులు, యోగులు, భాగవతోత్తములు 'ప్రజలు'. వారిని పాలించే యోగిజనారాధ్యుడు, భక్తవత్సలుడు 'ప్రజాపతి'.

తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః ॥

విష్ణువు యొక్క పరమపదాన్ని 'నిత్య సూరులు' (ముక్త పురుషులు) సదా అనుభవిస్తున్నారని పురుష సూక్తం.

సృష్టికారకుడైన ప్రజాపతి, తనలో విశ్వసృష్టికి హేతువైన తేజస్సును దాచుకున్నవాడు కనుక –

హిరణ్యగర్భుఁ .. 70

1. హిరణ్యమును (తేజస్సును) తనలో ఁ ంవాడు.

   ✦ **హర్యతి ద్రవతాం ప్రాప్యగచ్ఛతీతి 'హిరణ్యం'.**
   ద్రవించి వెళ్లే లక్షణం కలది 'హిరణ్యం'.

   ✦ **హర్యతే కామ్యతే జనైరితి 'హిరణ్యం'.**
   అందరిచే కోరబడునది.

   ఈ రెండు లక్షణాలు గలది 'తేజస్సు', 'బంగారం' (సువర్ణం). వీటిని గర్భంలో గల సర్వతేజస్స్వరూపుడు – 'హిరణ్యగర్భుడు'.

   హిరణ్యగర్భుఁ సమర్తతాగ్రే భూతస్యజాతుఁ పతిరేక ఆసీత్।
   విశ్వమునకు ముందు, విశ్వమూలకమైన తేజస్సును తనలో గలవాడు ఉన్నాడు. ఆతడే భూత (ప్రజా) కోటికి ఏకైక పతియై ఉన్నవాడు. ప్రాణశక్తియే సర్వతేజోమయ చైతన్యాన్ని కలిగి ఉన్నది కనుక ' హిరణ్యగర్భుఁ'.

2. 'గర్భ' శబ్దం కారణత్వాన్ని సైతం తెలియజేస్తుంది. తేజోరూపులైన సూర్యులకు ఈతడే మూలం. కోరిన వారలకు సకల కామ్యములను తీర్చే అగ్ని స్వరూపుడు (**అగ్నినా రయిమశ్నవత్** –అగ్ని ద్వారా సంపదలను పొందగలం). హితమూ, రమ్యమూ అయినది హిరమ్యం. వైదిక నిరుక్త సూత్రాల ప్రకారం – 'హిరమ్య'మే 'హిరణ్యం'. జగమునకు హితాన్నీ రమ్యాన్నీ కలిగించే అద్భుత తేజశ్శక్తిని తనలో దాచుకున్న పరమాత్మ హిరణ్యగర్భుడు. ఈయన నుండి సర్వులకు తేజస్సు లభిస్తున్నది.

   యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఖిలం ।
   యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ, తత్తేజో విద్ధి మామకమ్ ॥
   గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా ।
   పుష్ణామి చౌషధీఃసర్వా సోమో భూత్వా రసాత్మకఃు ॥
   అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితఃు ।

ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ (భగవద్గీత)
"జగత్తుని వెలిగించే ఆదిత్యునిలో, చన్ద్రునిలో, అగ్నిలో ఉన్న తేజము నాది. భూమిలో ప్రవేశించిన నా తేజశ్శక్తియే ఓజస్సు. ఆ ఓజస్సుతో ప్రాణికోట్లను ధరించే నేను, రసస్వరూపుడనై ఓషధులను పండిస్తున్నాను. 'పిత్తరూప' అగ్నిగా ప్రాణివర్గముల దేహంలో ఉండి, ప్రాణాపాన వాయువులతో కలసి, వారు తిన్న ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాను" – అని సర్వతేజస్సులకు – (అగ్నులకు) సంబంధించి మూలకారణ తేజంగా భాసించే పరమాత్మయే 'హిరణ్యగర్భుడు'.
రూపములకు కారణమైన తేజస్సే ప్రాణులకు ఆకారాలను ప్రసాదిస్తుంది. ఆ తేజస్సుకి కారణం విష్ణువు.

3. ఈ జగం ముందుగా హిరణ్మయమైన (తేజోమయమైన) అండంగా ఉన్నదని, అది అనేకమై విశ్వంగా ఆవిర్భవించిందని వేద పురాణాలే కాక మనుస్మృతి కూడా అభివర్ణించింది.
ఆ హిరణ్యాండానికి కేంద్రం (గర్భం)గా ఉన్న మహాశక్తియే మూలకమైన పరమకారణం. అదే పరమాత్మ తేజం. కనుక ఆతడు 'హిరణ్య గర్భుడు'. అణువులతో నిర్మితమైన జగత్తులో ప్రతి అణువునకూ మూలకేంద్రంగా భాసించే చైతన్యమే 'హిరణ్యగర్భం'. ఇదే మొదటి వెలుగు.

4 'హిరణ్యగర్భః' అనేది సృష్టికర్తయైన బ్రహ్మ నామంగా కూడా వ్యవహరింపబడుతోంది. ప్రజాపతి – ప్రజోత్పత్తికి తగిన తేజస్సును తనలోనుంచుకున్నవాడు కనుక – సృష్టికర్తగా ఆతడు హిరణ్యగర్భుడు. బ్రహ్మకు ఆత్మగా ఉన్న పరమకారణుడితడు. బ్రహ్మస్వరూపుడు.

5. హితమై రమ్యమైన పరమపదాన్ని 'హిరణ్య' లోకంగా వేదవాఙ్మయం వర్ణించింది. అన్ని తేజాలకు మూలమైన ఆ తేజోలోకాన్ని, సూర్యాదులెవరూ ప్రకాశింపజేయలేరు. అది స్వయం ప్రకాశకం. దానియందు భాసించే పరంజ్యోతి 'హిరణ్యగర్భుడు'

నతద్భాసయతే సూర్యః నశశాంకో నపావకః ॥ (భగవద్గీత)

తమస్సుకీ, రజస్సుకీ ఆవలనున్న దివ్యధామం. "తమసః పరస్తాత్–" "విరజం" అని పలుచోట్ల శ్రుతి వర్ణించింది.

ఆ ఆత్మజ్యోతి ధామాన్ని వర్ణిస్తూ 'ముండకోపనిషత్తు' ఇలా పలికింది

"హిరణ్మయే పరే లోకే విరజం బ్రహ్మ నిష్కలమ్
తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతి ః తద్యదాత్మవిదో విదు ః ।
నతత్ర సూర్యోభాతి నచంద్రతారకం .....
తస్యభాసా సర్వమిదం విభాతి ॥ "

హిరణ్యలోక (బ్రహ్మధామ) ము నందున్న పరంజ్యోతి స్వరూపుడైన నారాయణుడు (నారాయణ పరో జ్యోతిః) హిరణ్య గర్భుడు.

ఈ అఖండ తేజస్స్వరూపుడే పృథివ్యాదులను తనలో గలిగిన వాడు–

భూగర్భుఁ.. 71

1. భూమిని తనలో కలవాడు.

   'భూరిత్యసౌ లోకః' – ఈ కనిపించే లోకమే భూమి. మనం దేనిలో జీవిస్తున్నామో దానిని 'భూమి'గా వ్యవహరిస్తున్నాం. ఈ లోకాలన్నీ తనలో ధరించి పాలించేవాడు.

   కన్నతల్లి కడుపులో శిశువును పోషించునట్లుగా ఈ భూమినంతా ఆవరించి తనలో దాచుకొని పాలించి పోషించేవాడు – భూగర్భుడు.

2. భూమికి కేంద్రమై – మూలమై ఉన్నవాడు.

   మనకు ఆధారమైనవాటన్నిటికీ తాను ఆధారమైనవాడు.

   "కేంద్రమందు ఉన్న కారణస్వరూపుడైన ఆ ప్రజాపతి, జన్మరహితుడైనా బహువిధముల కలుగుతున్నాడనీ, ఆ కారణ తేజాన్ని ఆత్మజ్ఞులు గ్రహిస్తున్నారు. అతడే భువనములను తనలో కలవాడు" – అని యజుర్వేదం ఈ క్రింది మంత్రంలో వివరించింది –

'ప్రజాపతి శ్చరతి గర్భే అంతః అజాయమానో బహుధావిజాయతే।
తస్య యోనిం పరిపశ్యన్తి ధీరాస్తస్మిన్ హతస్థుర్భువనాని విశ్వా ॥

ఈ మంత్రపు మొదటి భాగాన్ని పరిశీలిస్తే, ఈ విష్ణునామాల వరుసలోనున్న వేదవిజ్ఞానం అర్థమవుతుంది **"ప్రజాపతిః హిరణ్యగర్భో భూగర్భో"** అనడంలో వైదిక క్రమం ఎంత చక్కగా ఉన్నదో గమనించగలం.

3. 'గర్భ' శబ్దానికి 'లోపల' అని అర్థం సిద్ధం.

ప్రాణశక్తియే మనలో తిరిగేదీ, లోకాలలో సంచరించేది. ప్రధానంగా సృష్టికారణమైన ఆ దివ్యతేజస్సు (హిరణ్యగర్భః), ఈ భూమ్యాదులలో సంచరిస్తున్నది. అందుకే 'ప్రాణ' సంబంధమైన నామాల క్రమం ఇంత ఔచితీమంతంగా కూర్చబడింది.

అపానితి ప్రాణతి పురుషో గర్భే అన్తరా ।
యదా త్వం ప్రాణం జిన్వస్యథ సజాయతే పునః ॥ (అథర్వవేదం)

ప్రాణస్వరూపుడైన పురుషుడే గర్భమున (లోపల) ఉన్నవాడు కనుక 'హిరణ్యగర్భ, భూగర్భ' శబ్దాలు చెప్పబడ్డాయి.

ఆధారశక్తులకు ఆధారమైన ఆస్వామి అనంతసంపదలతో భూమ్యాదులను పోషిస్తున్నాడు. పోషణ కరమైన ఆ సంపదలకు ప్రభువు కనుక –

మాధవః .. 72

1. 'మా' అంటే లక్ష్మీదేవి.

"ఇందిరా, లోకమాతా, మా, రమా, మంగళదేవతా" – ఇవి లక్ష్మీనామాలని 'అమరకోశం'. లక్ష్మీదేవి ధవుడు (భర్త) – మాధవుడు. సర్వైశ్వర్యాలకు అధిష్ఠానశక్తియే మహాలక్ష్మి. ఈమె నిరంతరం విష్ణునకు అనపాయిని. ఐశ్వర్యాలన్నీ స్వామికి అధీనం గనుక, ఐశ్వర్యాధిదేవతయైన లక్ష్మి హరికి పుట్టపురాణియై కొలుచుకుంటోంది.

అహం భువం వసునః పూర్వ్యస్పతిరహం

ధనాని సంజయామి శాశ్వత ః । ॥ఋగ్వేదం ॥

అని శ్రుతి సర్వైశ్వర్యపతిగా పరబ్రహ్మను ప్రస్తుతించింది.

2. **మౌనాద్ధ్యానాచ్చ యోగాచ్చ విద్ధిభారత మాధవమ్॥**

"మౌనముచే, ధ్యానముచే, యోగముచే మాధవుని తెలిసికొమ్మని వ్యాసవచనం (భారతం).

3. **మన్యంతే విశేషేణ జ్ఞాయన్తేయస్మిన్ సమధుః.**

మన్యంతే మనుతే వా మధుః – పవిత్రం సర్వవిధమనన్తకర్తా ప్రాజ్ఞః (సత్యభాష్యం).

అన్ని విధములైన అనంత జ్ఞానశక్తి మధువు. దానిని కలవాడు మాధవుడు.

4. ఆస్వాదనీయమైన అమృతత్వమే సచ్చిదానందమయమైన బ్రహ్మము. విశ్వవ్యాపకమైన బ్రహ్మతత్వమే మధువు. ఆ బ్రహ్మస్వరూపుడైన నారాయణుడే మాధవుడు.

మధువిద్యావబోధ్యత్వాత్ మాధవః. ఛాందోగ్యోపనిషత్తులో చెప్పిన 'మధువిద్య' ద్వారా తెలియబడేవాడు – మాధవుడు.

"మధువిద్య" కు శాస్త్రపరమైన అర్థాదులను గమనించి, అటుపై తత్త్వపరమైన భావనతో గ్రహిస్తే "బ్రహ్మవిద్య" అని అర్థం తేలుతుంది.

"పుష్పసారం మధుః" – పువ్వుల సారం మధువు.

జగత్తు వికసనాత్మక పుష్పమువంటిది – జగత్తున సారభూతమై వ్యాపించిన పరబ్రహ్మతత్త్వమే మధువు. ఇతరులకు ఆగోచరమైన మకరన్దాన్ని తుమ్మెద గ్రహించినట్లుగా, బ్రహ్మజ్ఞుడు విశ్వవ్యాప్తంగా ఉన్న పరతత్త్వాన్ని గ్రహించి బ్రహ్మానందభరితుడౌతాడు. జగద్వ్యాపక పరతత్త్వ గ్రహణమే మధువిద్య (బ్రహ్మవిద్య). ఆ విద్య ద్వారా గ్రహింపబడే పరబ్రహ్మ మాధవుడు.

ఈ మధువు లభిస్తే భ్రమయుతమైన ప్రాపంచిక సుఖమాధుర్యాల లాలస (అవిద్య) తొలగుతుంది. అటువంటి జ్ఞానాన్నిచ్చేది కూడా ఆ స్వామియే కనుక–

మధుసూదనః .. 73

1. 'మధు' అనే అసురుని సంహరించినవాడు – మధు సూదనః.

కర్ణమిశ్రోద్భవం చాపి మధునామ మహాసురమ్ ।
బ్రహ్మణోపచితం కుర్వన్ జఘాన పురుషోత్తమః ॥
తస్యతాత వధాదేవ దేవ దానవ మానవాః ।
'మధుసూదన' ఇత్యాహుః ఋషయశ్చ జనార్దనమ్ ॥

(మహాభారతం)

(ప్రతి) సర్గానికి ప్రారంభంలో యోగనిద్రలోనున్న మాధవుని కర్ణమలం నుండి ఉద్భవించిన మధుకైటభులను స్వామియే సంహరించాడు. ఆ కారణంగా – మధురాక్షస సంహారకుడైన విష్ణువు మధుసూదనుడు.

2. 'మధు విద్య' ద్వారా లభించే పరమాత్మ మాధవుడని ముందే వ్యాఖ్యానమయ్యింది. బ్రహ్మవిద్యయే మధువిద్య. బ్రహ్మానందమే మధువు. అది లభించే వరకు భౌతిక, ఇంద్రియసుఖాలనే మాధుర్యాలనుకొని భ్రమ చెందుతాడు జీవుడు. బ్రహ్మవిద్య ద్వారా అసలైన పరబ్రహ్మానందమనే మాధుర్యము లభించాక, ఈ ఇంద్రిసుఖాలనే మధువులు అసలు మధువులు కావని తెలుస్తుంది. అదే మధురాక్షస నాశనం.

మౌన ధ్యానాదుల ద్వారా లభించే బ్రహ్మానుభవమే విష్ణుజ్ఞానం. అలా తనను అనుభవానికి అందించి, భౌతిక సుఖ మధులాలసను నశింపజేసే పరబ్రహ్మ మధుసూదనుడు.

ఈ భావాన్నే ప్రహ్లాదుడు – "మందార మకరన్ద మాధుర్యమునదేలు మధుపంబు వోవునే మదనములకు" అని వ్యక్తపరచాడు.
సూర్యకాంతి వచ్చాక రాత్రి వెలిగిన దీపాలను ఆర్పివేసినట్లుగా అఖండ మాధవానుభవం లభించాక, ఇంద్రియసుఖాల అల్పమాధుర్యాలు అణగిపోతాయి. **"మధురింద్రియ నామా స తతో మధునిషూదన ः"** అని అని పురాణవచనం.

3. వేద కర్మకాండల వల్ల లభించే ఇహలోక పరలోక సుఖాలు మధువులు. వేదాంత జ్ఞానం వల్ల లభించే కైవల్యసుఖమే విష్ణుప్రాప్తి. అది లభించాక కర్మబంధనాలు తొలగుతాయి. జన్మ పరంపరల నిచ్చే ఇహ పరలోక భోగాలు తొలగి, మోక్షం లభిస్తుంది.

"ఆ బ్రహ్మభువనాల్లోకాः పునరావృత్తినోర్జున !"

లోకాలన్నీతిరిగి జన్మలనిచ్చేవే. అందుకే జ్ఞానదృష్టికి స్వర్గాదిలోక సుఖాలు సైతం తుచ్ఛములే. వాటిని జయించి బ్రహ్మానుభవమనే మధువును పొందాక ఈ బంధకారక లోకానుభవాలనే మధువులు తొలగుతాయి. అందుకే ఆ బ్రహ్మము "మధుసూదనుడు".

'శ్రుతి' అంటే చెవి, వేదం... అని రెండర్థాలు. చెవిలోని మలినం నుండి ఉద్భవించిన అసురుడు - అనడంలో గొప్పసంకేతం ఉంది.

ఎ) శ్రుతి (వేద) ధర్మాన్ని పాలించక ఇచ్ఛానుసారం, ఇంద్రియవ్యామోహంతో బ్రతికే (అసు రమతీతి -అసురः. ప్రాణములందు క్రీడించువాడు) అసురుడే - కర్ణ (శ్రుతి) మలినోద్భవుడైన మధురాక్షసుడు. వేద (ధర్మ) బాహ్యమైన ఆ అసుర స్వభావాన్ని నిర్మూలించేవాడు మధుసూదనుడు.

బి) వేదకర్మల లంపటత్వంతో వేద పరమార్థాన్ని మరచి లౌకిక ఇంద్రియ సుఖాపేక్షను వాంఛించే ప్రవృత్తినే - కర్ణ (శ్రుతి) మలినం నుండి పుట్టిన దనుజునిగా భావించవచ్చు. ఆ లంపటత్వాన్ని తొలగించి పరమార్థ జ్ఞానాన్ని ప్రసాదించే స్వామి మధుసూదనుడు.

"ప్రత్యుష్టగ్ రక్షः ప్రత్యుష్టా అరాతయో.... " అనే యజుర్వేదమంత్రం రక్షः స్వభావాన్ని నిర్మూలించే స్వామిని కీర్తించింది.

వేద ధర్మంతో లోకాన్ని శాసించే నారాయణుడు, ఆ శాసన ధర్మంలో భాగంగా ధర్మ బాహ్యులైనవారిని శిక్షిస్తాడు. అటువంటి శాసక స్వభావం కలిగిన సర్వశక్తిమంతుడు కనుకనే -

ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః।
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతిరాత్మవాన్॥... 9

74. ఈశ్వర ः, 75. విక్రమీ, 76. ధన్వీ, 77. మేధావీ,
78. విక్రమః 79. క్రమః। 80. అనుత్తమః, 81. దురాధర్షః,
82. కృతజ్ఞః, 83, కృతిః, 84, ఆత్మవాన్ ॥

ఈశ్వరః.. 74

1. సర్వశాసకుడూ, సర్వశక్తిమంతుడు.
   ఇంద్రియములను 'వశ' మందుంచుకొనే శక్తి మధుసూదనునిదే. ఈ శక్తి చేత ఇంద్రియ సుఖమధులాలస జయింపబడుతోంది. పూర్వనామంతో ఈ నామానికి ఉన్న సంబంధమిది.
2. వ్యష్టిగా హృదయమందుండి ఇంద్రియాలను నియమించువాడు, సమష్టిగా విశ్వాన్ని వశమందుంచుకొని శాసించువాడు ఈశ్వరుడు.
   య ఈశే అస్య ద్విపదశ్చతుష్పద ः ॥ ఋగ్వేదం ॥
   ప్రాణాయ నమో యస్య సర్వమిదం వశే।
   యోభూతః సర్వస్యేశ్వరో యస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్ ॥ ॥ అథర్వవేదం॥
   ఈశ్వరః సర్వభూతేషు హృద్దేశేర్జున తిష్ఠతి ॥ భగవద్గీత॥
   ఈ ఈశ్వరత్వంతోనే విష్ణువు విశేషంగా జగమంతా 'క్రమిం'చి ఉన్నాడు కనుక -

విక్రమీ.. 75

1. విశేషంగా, విశిష్టంగా క్రమించువాడు - గమనము చేయువాడు, వ్యాపించువాడు విక్రముడు.
   ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్।
   సమూఢమస్య పాంసురే ॥ ఋగ్వేదం ॥

2. 'విక్రమం' అంటే శౌర్యం. సర్వజగత్తును శాసిస్తూ, తన సంకల్పానికి వ్యతిరేకమైన వాటిని జయించే శౌర్యవంతుడు 'విక్రముడు'. అధికారము (ఈశ్వరత్వం), శౌర్యము ఇంద్రియ (మధు) జయానికి అవసరం.

అతో దేవా అవన్తు నో యతో విష్ణుర్విచక్రమే ।
పృథివ్యాः సప్తధామభిः (ఋగ్వేదం) ॥

సప్తధామములను – భూः, భువः, సువः,మహः,జనः,తపः, సత్యం – అనే (లోకాలను); మూలాధారాది సహస్రార పర్యంతమైన ఏడు యోగ భూమికలను; గాయత్రీ, త్రిష్టుప్, అనుష్టుప్, బృహతీ, ఉష్ణిక్, పంక్తి, జగతీ –అనే ఏడు ఛందస్సులను; స,రి,గ,మ,ప,ద,ని – అనే ఏడు స్వరములను నిండిన (క్రమించిన) శక్తినే 'విక్రమం' (శౌర్యం) అంటారు. ఆ శౌర్యం కలవాడు విక్రముడు.

ఆ విక్రమానికి తగిన శాస్త్రనియామకత్వం కలవాడు, రూపం కలవాడు –

ధన్వీ .. 76

1. ధనువు కలవాడు ధన్వీ.

ధన, ధాన్యాదులు ఏ శాసనం వల్ల లభిస్తాయో అది 'ధనువు'. ధన్యతను, ధనాదులను ప్రాప్తింపజేసే శాస్త్రం ధనువు – ఆ శాస్త్రమును (వేదాదులను) కలవాడు, పాలించువాడు ధన్వీ.

నమస్తే అస్తు ఆయుధాయా నాతతాయ ధృష్ణవే ।
ఉభాభ్యాముత తే నమో బాహుభ్యాం తవ ధన్వనే ॥ యజుర్వేదం ॥
నమస్తే అస్తు ॥యజు. రుద్రనమకం ॥

2. **శార్ఙ్గ ధన్వా హృషీకేశः పురుషः పురుషోత్తమः ।**
అజితः ఖడ్గధృగ్విష్ణుः (శ్రీరామాయణం, యుద్ధకాండ).

'శార్ఙ్గ'మనే ధనువును ధరించిన నారాయణుడు. శరములు ఇంద్రియవిషయాలు. వాటిని నియమించే శక్తి 'శార్ఙ్గధనువు'. దానిని

ధరించువాడు ధన్వీ.

'రామశ్శస్త్రభృతామహమ్' అని భగవద్గీత (విభూతియోగం).

రామావతారంలో కోదండాన్ని ధరించి అధర్మపరులను శిక్షించిన విష్ణువు ధన్వీ.శాస్త్రరూపధనువును, శాసక రూప ఆయుధాన్ని ధరించి నిర్వహించుటకు తగిన సర్వజ్ఞుడే -

మేధావీ .. 77

1. అద్భుతమైన జ్ఞానశక్తి కలవాడు. సర్వమును గ్రహించగల ఈశ్వరుడు. ఏ బుద్ధితో, మునుపు చెప్పిన వేదాది శాస్త్రములు ఏర్పడినవో ఆ బుద్ధిశక్తి నారాయణునిదే. అందుకే ఆయన మేధావి.
2. మతిని ధరించు శక్తి 'మేధా'. దానిని కలవాడు. సకల చరాచర జగమును, సర్వకాలములను ధరించే సర్వజ్ఞత్వశక్తి ఆయనకు సహజం. ఎంతో తెలివైన వారమనుకొని దేశ, కాలాలను జయించామనుకొన్న హిరణ్యకశిప, రావణాది రాక్షసుల బుద్ధులను సైతం ఓడించి, ఏ మేధావి మేధకూ అందని మహామేధావి విష్ణువు. అద్భుతమైన సకలలోకరచన ఆయన తెలివితేటల పనితనమే.

   న త్వదన్యః కవితరో న మేధయా ధీరతే వరుణ స్వధావనే ॥

   అథర్వవేదం ॥

   ఆ అసమాన మేధశక్తితో జగమున వ్యాపించినవాడే కాక, జగమును దాటి ప్రకాశించువాడు -

విక్రమః .. 78

1. విశ్వమును ఆక్రమించి, అధిగమించిన వాడు.

   త్రిపాదూర్ధ్వ ఉదైత్ పురుషః ।

   పాదోఽస్యేహాభవాత్ పునః ।

తతో విష్వఙ్వ్యక్రామత్ సాశనానశనే అభి ॥ (యజుర్వేదం).
త్రేధానిదధే పదమ్ ॥ఋగ్వేదం॥

భూః, భువః, సువః - అనే మూడు లోకాలను ఆక్రమించి, వాటిపైన అధిగమించి తురీయస్థితిలో భాసించువాడు - విక్రముడు.

ఈ తత్త్వాన్నే వామనరూపంతో స్వామి తివిక్రమునిగా ప్రదర్శించాడు.

2. **వినా గరుడేన పక్షిణాక్రమాద్వా ....**

'వి' అంటే పక్షి. గరుత్మంతుడు. దానిపై నుండి గమనము (క్రమణము) చేయువాడు విక్రముడు. గరుడవాహనుడు.

ఆక్రమించి, అధిగమించడంలోనూ ఒక నియమమూ, పద్ధతి కలవాడు కనుక-

క్రమః.. 79

1. <u>క్రమ</u> - శబ్దానికి గమనము, కదలిక, మార్పు (పరిణామము), నియమము అనే అర్థాలున్నాయి.

'క్రము పాదవిక్షేపే' - అని అర్థం. పాదముంచుట.

ముజ్జగాలలో అనునిత్యం కదలిక ఉంది. ఆ కదలిక విష్ణుచైతన్యం. కదిలితేనే స్థితి. ఈ కదలిక నియమంగా సాగుతోంది.

దీని ననుసరించి విశ్వ'గమనం'లో పరిణామాలు సంభవిస్తున్నాయి.

ఎవని వలన ఈ కదలిక సాగుతున్నదో, ఎవనియందు ఈ విశ్వగమనం సంభవిస్తున్నదో (**క్రమ్యతే అనేన - క్రమన్త్యస్మిన్.... క్రమః**) అతడు 'క్రముడు'. అయనను ఆధారం చేసుకొనే విశ్వం క్రమిస్తున్నది.

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వన్తికే ।
తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యత ः ॥ యజు ॥

"అది (బ్రహ్మము) కదులుతున్నది - కదలిక లేనిది. దూరాన ఉన్నది - అతి దగ్గరున్నది. అన్నిటి లోపలా, బయట నిండినది".

సాధనలు సిద్ధించాలన్నా వాటికి క్రమత్వం ఉండాలి. అదే విష్ణుశక్తి. ఈ 'క్రమం' వల్లనే పంచభూతాలు, గ్రహతారకలు, కాలము సాగుతున్నవి. అందుకే 'క్రమమే' విష్ణువు.

2. **"క్రాన్తే విష్ణుమ్"** - అని మనుస్మృతి.
గమనవేళ విష్ణువును స్మరించాలని శాస్త్రవచనం. అడుగువేస్తేనే చైతన్యం. అది లేనిదే సిద్ధిలేదు.
ఆ అడుగు చక్కని దిశవైపు, చక్కగా సాగాలంటే విష్ణుస్మరణ అవసరం. పాదశక్తి యందు విష్ణువున్నాడని శాస్త్రం. ఈ శక్తే లేకపోతే వ్యక్తి కుంటివాడౌతాడు. ఈ విష్ణుని దయవల్ల వికలాంగుడు సైతం పర్వతాలెక్కగలడు. **' పంగుం లంఘయతే గిరిం యత్కృపాత్'.**

3. అందమైన అడుగులు, అందరికీ అభయమిచ్చే పావన చరణాలు కల విష్ణువు క్రముడు. భక్తుల వైపు కదలివచ్చి ఆదుకునే అడుగులవి. ఈ 'క్రమ'త్వంతోనే ముల్లోకాలు కొలిచి, దాటిన విక్రముడయ్యాడు.
అంతానిండి, అన్నిటినీ దాటిన ఈతని కంటే అధికుడు లేడు కనుక -

అనుత్తమః .. 80

ఉత్ - తమః. ఉత్కృష్టములలోకెల్లా ఉత్కృష్టమైనది.
అన్నిటి కంటే గొప్పదానిని 'ఉత్తమం' అంటారు. ఇప్పటికి 'ఉత్తమం'గా అనిపించేది, కొన్నాళ్ళకి మరొకదానిచే తగ్గబడుతుంది. అప్పుడా రెండవది 'ఉత్తమం' అవుతుంది. అలాకాక - ఎవరిని మించి మరి ఏదీ ఉండదో, అతడు అనుత్తముడు. తనను మించిన పరమైన (గొప్ప) విషయం మరొకటిలేని వాడు. జ్ఞానబలక్రియాది శక్తులచే ఆతనిని మించినవారు లేరు.

యస్మాన్నజాతః పరో అన్యో అస్తి
య ఆవివేశ భువనాని విశ్వా ॥ యజుర్వేదం ॥

"ఈతని కంటే అధికమైనది పుట్టలేదు. అతడే విశ్వమంతా వ్యాపించినవాడు".

"యస్మాత్పరం నాఽపరమస్తికించిత్-"

"తస్మాద్ధాన్యన్నపర ः కిఞ్చనాస"

– అని శ్రుతివాక్యాలు, ఈతని కంటే ఉత్తమమైనది లేదని, పరమాత్మయే సర్వోత్కృష్టమని తేల్చి చెప్పాయి.

ఈ భావాన్నే శ్రీ కృష్ణపరమాత్మ –

మత్తः పరతరం నా న్యత్కిఞ్చిదస్తి ధనంజయ ॥

"ఓ అర్జునా ! ఈ జగమున నాకంటే గొప్పది లేదు" అని ప్రకటించాడు.

"నత్వత్సమోస్త్యభ్యధికः కుతోఽన్యः"

"నీతో సమానమైనదే లేదు. ఇంక అధికమైనది ఎలా ఉంటుంది?" అని 'గీత'లో పరమాత్మను స్తుతించారు.

అనుత్తముడు కనుకనే ఇతరులు ఎదుర్కొనలేని జ్ఞానబలాదులచే శోభిస్తున్న –

దురాధర్షः .. 81

1. ఏ ఒక్కరూ ఎదుర్కొనలేని వాడు.

   రాక్షసాదులు ఈతనిని ఎదుర్కొనలేరు. నారాయణ పరాక్రమం అమోఘం. ఎవరూ ఆయనతో తలబడలేరు. అటువంటి సర్వేశ్వరత్వము కల విక్రముడు కనుక –ఈ నామాల వరుస. ఈశ్వరునిగా లోకమంతా వ్యాపించి ఎవరూ సాధించడానికి వీలులేని మహా మహిమలతో ప్రకాశిస్తూ 'దురాధర్షుడు' అని పేరు పొందాడు. **"తేనారుహ బ్రహ్మణా స్పర్ధితుమ్ కः"**

   "ఆ బ్రహ్మముతో స్పర్ధనెవడు వహించగలడు?" అని 'అష్టక' వచనం.

2. దుష్టులను (సమగ్రంగా) పూర్తిగా శిక్షించువాడు.

   త్వమస్య పారే రజసే వ్యోమనः

స్వభూత్యోజా అవసే ధృషన్మనః ।
చకృషే భూమి ప్రతిమానమోజసోపః.
స్వ: పరిభూరేష్యా దివమ్ ॥ ఋగ్వేదం ॥

"ఆకాశానికి ఆవల సైతము ప్రకాశించే ఆతడు తన తేజస్సుతో దుష్టుల మనస్సులను ఎదుర్కొని, లోకాలను రక్షించి సర్వత్ర వ్యాపించిఉన్నాడు"

3. నైనం ఛిందన్తి శస్త్రాణి

నైనం దహతి పావకః .... అని గీతలో చెప్పినట్లు ఆత్మయే విష్ణువు. ఏ శస్త్రముల చేతగానీ, అగ్న్యాదుల చేతగానీ నాశనముకాని ఆత్మతత్త్వమే 'దురాధర్షః'. ఇంద్రియాదులకు అతీతమై బుద్ధికి కూడా పరమై (అనుత్తమం), క్రమముగా మనో బుద్ధీంద్రియాలలో విక్రమించి, మేధస్సుగా దేహరూప ధనువును నిర్వహించే తేజస్సుతో (విక్రమా) హృదయంలో భాసించేఈశ్వరుడు ఆత్మయేనని ఈ నామాల వరుస సూచిస్తుంది.

ప్రతి వారిలోనూ దురాధర్షమైన ఆత్మగా దీపించే నారాయణుడు సృష్టిలో జరిగే, ప్రతి చేష్టనీ తెలుసుకొనేవాడు -

కృతజ్ఞః.. 82

1. కృతం జానాతీతి కృతజ్ఞః.

చేసిన దానిని తెలుసుకొనువాడు.

సృష్టిలో ప్రతిజీవి చేసే పాప, పుణ్యాదులను తెలుసుకొనువాడు. విశ్వంలో ప్రతి కృతమును (జరిగే ప్రతి దానినీ) తెలుసుకొనేవాడు.

యోనః పితా జనితా యోవిధాతా
ధామాని వేద భువనాని విశ్వా

"మనకు మూలకారణమైన విధాతగా లోకములను కలిగించిన పరమాత్ముడు ఈ భువనములను తెలుసుకొంటున్నాడు" అని యుజుర్వేదం కీర్తించింది.

2. **పరైరుపకృతం జానాతి ఇతి కృతజ్ఞః.**
భక్తులు చేసే అల్పమైన పూజాదికాలను కూడా మరువకుండా గ్రహించి, అనుగ్రహించువాడు.
పత్రం పుష్పం ఫలం తోయం
యోమే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతం
అశ్నామి ప్రయతాత్మనః ॥ – అని గీత.
భక్తితో ఇచ్చే పత్ర పుష్పాదులను కూడా స్వీకరించి, ఆ అర్చనాదులకు ఫలంగా మోక్షమిచ్చువాడు.
3. 'కృతజ్ఞత' అనేది దివ్యగుణం. అది నారాయణస్వరూపం. కనుకనే హరి అవతారమైన శ్రీరాముని కృతజ్ఞునిగా బహుధా కీర్తించాడు వాల్మీకి. **"ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ"** అని వర్ణిస్తూ –
న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా ।
కదా చిదుపకారేణ కృతేనైకేన తుష్యతి ॥
ఇతరులు చేసిన లెక్కలేని అపకారాలను స్మరించడు. ఏ చిన్ని ఉపకారం చేసినా దానిని గుర్తుంచుకొని ఆనందిస్తాడు. చేసిన కాసింత మేలును కూడా మరువని గొప్ప దైవీలక్షణమే, అనంతకల్యాణ గుణాభిరాముడైన శ్రీహరి వైభవం.
చేసినది తెలుసుకొనడమే కాదు, 'చేత' కూడా ఈయనే –

కృతిః.. 83

1. 'చేత' (చేయుట). పురుషప్రయత్నాదులుగా ఉన్న విష్ణు చైతన్యమే కృతి. క్రియలన్నీ నారాయణ స్వరూపాలే. **'వ్యవసాయోస్మి'** తానే "ప్రయత్నా"న్నని గీతలో స్వామి వచనం.
2. జగత్తు క్రియాత్మకమైనది. జగద్రచనయే భగవంతుని 'కృతి'. ఈ కృతి

(విశ్వ) రూపంగా ఉన్నవాడు.

3. గర్భంలో ఉన్న దశ నుండీ ప్రతి చేత కూడా ఈశ్వర శక్తి చేతనే సాగుతున్నది. భువనాలలో ప్రతి దానిని కలిగించి పోషించే కర్మ భగవత్ స్వరూపం. అదే కృతి.

ప్రజాపతిశ్చరతి గర్భే అంతః అజాయమానో బహుధా విజాయతే

॥(యజుర్వేదం)

4. **స్వార్థసాధక కర్తవ్యవిశేషరహితః.**

స్వామి 'చేత' లేనిదే జగములేదు. అయితే ఈ జగద్రచన కానీ, అవతారాదులతో చేసే ధర్మపాలనాది సత్కర్మలు కానీ – తన కోసం చేయడమో, ఫలాకాంక్షతో ఆచరించడమో లేదు. కేవలం లోకరక్షణార్థమే తప్ప, చేస్తున్నాననే 'అహం' లేదు – ఏదో కావాలనే ఫలాకాంక్షలేదు. అహమూ, ఫలాకాంక్ష లేని కేవలం కర్మ – దేనికీ అంటనిది 'కృతి' మాత్రమే.

నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన।
నానవాప్తమవాప్తవ్యం వర్తఏవ చ కర్మణి ॥

"ముల్లోకాలలో చేయవలసినది నాకులేదు. పొందవలసినదిగానీ, పొందలేనిదిగానీ లేదు. అటువంటి కర్మ నాది" అని భగవానుని గీతావచనం.

5. తనను ఆశ్రయించిన వారిచే సత్కార్యాలను చేయించే 'కృతి' స్వరూపుడు.

కృతః స్మరః, కృతోస్మరః – అని శుత్రి వాక్యం.

ఏష ఏవ సాధు కర్మకారయతి
తం యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతి ॥ (కౌషీతకీబ్రాహ్మణం)

ఈతడు ఎవరికి సద్గతిని కలిగించాలనుకున్నాడో, వారిచే సత్కార్యాలను చేయించుతాడు – అని వేదవాక్యం.

చేతలన్నీ తానేయైన కృతి స్వరూపుడు, ఎవరి సాయంతోనో, దేనివల్లనో ఈ క్రియలు చేయడంలేదు. అతడు –

ఆత్మవాన్ .. 84

1. తనయందు తానున్నవాడు.

మహాస్తే సతో మహిమా పనస్యతే ॥
అసి సత్య ! ఈశానకృత్ ॥
సర్వా దిశః పురుష ఆబభూవ ॥ (అథర్వవేదం)

స్వసత్తయా వర్తమానః సతో – తన ఉనికితో తాను వర్తించి, తన శక్తియందు తను ప్రతిష్ఠితుడై సర్వదిక్కుల నిండి, జగత్తును నిర్వహించువాడు.

వృక్షం నిలబడాలంటే ఏ తాళ్ళ సాయంతోనో నిలబడడం లేదు. పక్షి ఎవరో ఎగరవేస్తే ఎగరడం లేదు. వాటి స్వశక్తితో నిలబడడం, ఎగరడం జరుగు తోంది. ఈ జగత్తును నిర్వహించే పరమాత్మ శక్తి, మహిమ దేనిని ఆధారం చేసుకొని ఉన్నాయి? తన మహిమ యందు తానే ప్రతిష్ఠితుడైయున్నవాడు అతడు.... అని వేదం (ఛాందోగ్యోపనిషత్తు) చెబుతోంది.

"స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి స్వేమహిమ్ని".

అటువంటి ఆత్మవంతుడు కనుకనే, తనశక్తితో దేవతలకు శాసకుడైనాడు

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః।
అహాః సంవత్సరో వ్యాలః ప్రత్యయః సర్వదర్శనః ॥ 10

---

85 సురేశః, **86** శరణం, **87** శర్మ,
88. విశ్వరేతాః, **89** ప్రజాభవః **90.** అహాః,
91. సంవత్సరః, **92** వ్యాలః, **93.** ప్రత్యయః, **94** సర్వదర్శనః॥

సురేశః .. 85

1. సురలకు (దేవతలకు) శాసకుడైన ప్రభువు.

విశ్వనిర్వహణకు పరమేశ్వరుని ద్వారా శక్తులను పొంది నడచువారు సురలు. "లోకములకు మంచిని కలిగించువారు" (**సుం రాతి** – మంచిని కలిగించువారు)

అని 'సుర' శబ్దానికి అర్థం. మేలును కలిగించువారందరికీ ప్రభువు నారాయణుడు. **"శోభన దాతృణా మీశః సురేశః".**

2. నారాయణునిచే పాలింపబడాలంటే మేలును కోరే, మంచిని చేసే లక్షణం ఉండాలి. అవే దైవీగుణాలు. దైవీగుణాలున్న వారే నారాయణునకు ప్రీతిపాత్రులు – అని దీని భావం.

దేవో దేవానామసి మిత్రో అద్భుతో
వసుర్వసూనామసి చారురధ్వరే ॥ అని ఋగ్వేదం దేవతలకు దేవుడైన పరబ్రహ్మను కీర్తించింది.

"దేవతల గాచుటకు దిక్కైన విష్ణుడు" అని అన్నమయ్య కీర్తించాడు.

"దైవీ సంపద్విమోక్షాయ" అని గీతలో పలికినట్లుగా, మంచిగుణాల దైవీసంపత్తి కలవారిని పాలించి ముక్తినిచ్చే ప్రభువు.

మేలిమి గుణాలున్న వారి ఆర్తులను హరించి పాలించే ఈశుడు కనుకనే–

శరణః .. 86

1. **శీర్యతే హింస్యతేనేన – శరణః.** ఆశ్రయించినవారి జన్మజన్మాంతర బంధనాలను, దుర్గుణాలను నశింపజేయువాడు.

య ఆత్మదా బలదా యస్య విశ్వ
ఉపాసతే ప్రశిషం యస్య దేవాః ।
యస్య ఛాయామృతం యస్యమృత్యుః
కస్మై దేవాయ హవిషావిధేమ ॥ ఋగ్వేద ॥

ఎవరికి సుముఖులమవడం వలన (ఎవరి నీడన చేరడం చేత) అమృతము, విముఖత వలన మృతము లభిస్తాయో అతడు విష్ణువు.

"నివాసః శరణం సుహృత్ గతిః"... నారాయణుడే అందరికీ ఆశ్రయము, శరణము (ఆర్తినాశనము), మిత్రుడు, గతి.

ఇలా దుఃఖ, పాప నాశకుడైనవాడు కనుకనే –

శర్మ .. 87

1. సుఖ స్వరూపుడు.

పరబ్రహ్మను వేదము పరమానన్ద స్వరూపమని వర్ణించింది.

"ఆనన్దో బ్రహ్మేతి వ్యజానాత్"

శృణాతి దుఃఖమితి శర్మ – దుఃఖ నాశనము వలన లభించే సుఖమును 'శర్మ' అంటారు. శరణాగతులైన (ఆశ్రయించిన) వారి జన్మమృత్యుజరా వ్యాధులు మొదలైన అవిద్యాజనిత దుఃఖాలను నశింపజేసే ఆనందస్వరూపుడే నారాయణుడు.

సర్వగన్ధః సర్వరసః – అని ఛాందోగ్యం వర్ణించిన రసానంద స్వరూపుడు

"శర్మన్త్స్యామ తవ సప్రథస్తమేగ్నే సఖ్యే మా రిషామా వయం తవ॥

(ఋగ్వేదం) అని శ్రుతివచనం.

ఆనంద స్వరూపమైన ఆ బ్రహ్మము నుండే జగదుత్పత్తి జరిగిందనే **(ఆనందాదేవ ఖల్విమాని భూతాని జాయంతే)** వేదవాక్యం ప్రకారం – ఆయనయే జగత్కారణుడు కనుక...

విశ్వరేతాః .. 88

1. సమస్తమునకు మూలబీజము (ప్రధానకారణము).

తాసాం బ్రహ్మమహద్యోనిః అహం బీజప్రదః పితా ॥

బీజం మాం సర్వభూతానాం ॥

మమయోని ర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ॥

– అని గీతావాక్యాలు.

కారణాలకు కారణమైన బీజ స్వరూపుడు. మహత్తత్వంలో పరమేశ్వరుడైన నారాయణుని శక్తి బీజమై ప్రవేశించి విశ్వవృక్షంగా పరిణమించింది.

"భువనస్య రేతో విష్ణుః" అని శ్రుతి వాణి.

ఏతస్మాజ్జాయతే ప్రాణః మనస్సర్వేంద్రియాణి చ ।

ఖం వాయుః జ్యోతిరాపః పృథివీ విశ్వస్వ ధారణ ॥ అని ముండకోపనిషత్తు "వీని నుండి ప్రాణము, మనస్సు, సమస్తేంద్రియాలు, ఆకాశం, వాయువు, తేజస్సు, సమస్తాధారమైన భూమి – కలిగాయి " అని వక్కాణించింది. **"సప్తప్రాణాః ప్రభవన్తి తస్మాత్"** – అని అదే ఉపనిషత్తు ప్రాణములకు కారణ మీతడేనని కీర్తించింది.

పరము, కారణమైన ఈతని నుండి సంతానస్థానములుగా ప్రాణికోట్లు కలిగాయి కనుక –

ప్రజాభవః .. 89

1. ఎవని నుండి ఈ ప్రాణి కోట్లు ఉత్పన్నమయ్యాయో ఆతడు.
   "య తో వా ఇమాని భూతాని జాయన్తే" అని శుత్రివాక్యం.
   నతం విదాథ య ఇమా జజానాన్యద్ యుష్మాకమంతరం బభూవ ॥
   (యజుర్వేదం)

సర్వప్రాణులు ఏ 'సత్' పదార్థము నుండి ఉద్భవించాయో అతడు ప్రజాభవుడు. ఇదే విషయాన్ని **"ఇయం విసృష్టిర్యత ఆ బభూవ"** అని ఋగ్వేదం వర్ణించింది. విధములై, విచిత్రములైన సృష్టి విసృష్టి. అది ఎవని నుండి ఉద్భవించిందో ఆతడీతడే.

ప్రకృష్టంగా ప్రకటంగా జనించిన వారు ప్రజలు. వారికి కారణమైన ప్రజాభవుడు. అలా ప్రజలను కలిగించిన ఆతడే వారిని ప్రకాశింపజేసే వెలుగు–

అహః.. 90

1. విశ్వమంతా నిండిన చైతన్య ప్రకాశస్వరూపుడు.
   ఈతని చేతనే జగమంతా ప్రకాశిస్తోంది.
2. ఈ నామానికి 'పగలు' అని అర్థం. పగటిపూట అన్ని వస్తువులు

ప్రకాశించి, మేల్కొని, చైతన్యవంతమవుతాయి. అలా జగతిలోని ప్రాణులకు జాగృతినీ, కదిలికను అందించే చైతన్యస్వరూపుడు.

3. పగటి వలె అత్యంత స్పష్టంగా గోచరించే జ్ఞానస్వరూపుడు. " పట్టపగటి వెలుగు పరమాత్ముడు" - అని అన్నమయ్య కీర్తించాడు.
4. అవిద్య అనే నిదుర నుండి మేల్కొలిపి జ్ఞాన ప్రకాశాన్నిచ్చేవాడు, జ్ఞాన స్వరూపుడు.
5. **న జహాతీతి అహః** - విడువకుండా ఉండి శాశ్వతంగా దీపించేవాడు.
6. సూర్యరూపునిగా నున్న నారాయణుడు పగలుగా ప్రకాశించి వస్తువులను తేటపరుస్తున్నాడు.

   స వా అహ్నోజాయత తస్మాదహరజాయత ॥ -అని అథర్వవేదం.

   సూర్యకాంతికిరణాలలోనే దేవతాశక్తులున్నాయి. కనుక అతడే 'సురేశు'డు. చీకటి, మంచు మొదలైన ఆర్తులను పోగొట్టే 'శరణుడు'. తన వెలుగు ద్వారా శుభమును, సుఖమును కలిగించే 'శర్మ'. తన కిరణాల ప్రాణశక్తితో సృష్టికి మూలమైన 'విశ్వరేతసుడు'. ఆ శక్తితోనే ప్రాణుల సృష్టిచేసే 'ప్రజాభవుడు'. అందరినీ, అన్నిటినీ తేటపరచే పగటి వెలుగు(అహః) ఈతడే. ఈ పగళ్ళ ద్వారా క్రమంగా ఋతువులను ఏర్పరచే కాలస్వరూపుడు-

సంవత్సరః.. 91

1. **సం వసతీతి.** అన్నీ దేనియందు వసించి ఉంటాయో అది సంవత్సరం. కాలగణనలో సంవత్సరం ప్రధానం.

   వివిధ మార్పులతో కూడిన పన్నెండు మాసాలు ఆరు ఋతువులుగా ఉంటాయి. ఇందులోనే సర్వ గ్రహ నక్షత్రాదుల గణన, రాశిచక్ర భ్రమణం ఉంటుంది. ఇలా కాలపు పరిణామమంతా దేనియందుంటుందో అది 'సంవత్సరం'. దీని పునః పునరావృతులే కాలమంతా. సంవత్సరము తిరిగి తిరిగి రావడమే యుగాలుగా కల్పాలుగా గణింపబడుతుంది. కనుక

సంవత్సరం ప్రధాన కాలం. ఎవరైనా, ఏదైనా ఈ కాలమునందున్నవే. ఇన్ని మార్పులకీ మూలమైన కాలస్వరూపుడు నారాయణుడు.

2. ఈ మార్పులతో కాలకర్తగా ప్రకాశించే సూర్యనారాయణుడు. పన్నెండు రాశులయందు పరిభ్రమణతో సూర్యుడు సంవత్సర స్వరూపుడై దీపిస్తున్నాడు.
3. యజ్ఞాలన్నీ ఈ సంవత్సరాన్ని ఆధారం చేసుకొని సాగుతాయి. సంవత్సరాత్మకమైన కాలచక్రంలో వివిధ మాసాలలో, ఋతువులలో యజ్ఞాలు చెప్పబడ్డాయి. ఒక సంవత్సరం పాటు జరిగే యజ్ఞాలే తరువాతి సంవత్సరంలో ఆవృతమవుతాయి. కాలగమనము యజ్ఞము వలె సాగుతున్నది. కనుక యజ్ఞమునే సంవత్సరమన్నారు. యజ్ఞమునందే అన్నీ వసించి ఉన్నాయి కనుక -

   "యజ్ఞః సంవత్సరః"

   "యజ్ఞే సర్వం ప్రతిష్ఠితమ్"

   "యజ్ఞో వై విష్ణుః" -అని పలు విధాల వేదములు వచించాయి. యజ్ఞరూపుడైన విష్ణువే సంవత్సరపురుషుడు.
4. సర్వ జీవులయందు, సర్వమునందు "సమ్యక్ తయా సమానరూపేణ" -సమగ్రంగా సమాన రూపంగా వసించువాడు - సంవత్సరుడు.
5. తానే ఉన్నవాడై, అన్నిటినీ వసింపజేస్తున్నవాడు. సంపూర్ణ సత్తా స్వరూపుడు. ఉనికియైనవాడు.

   క్షణ క్షణం స్మరింపదగిన కాలస్వరూపుడితడే.

   అందరి జీవికకీ ఆధారమైన ఈతడు విశేషముగా కలగడంచేత కాలం సాగుతోంది.

వ్యాలః .. **92**

1. **విశేషణ అల్యతే ఇతి వ్యాలః.**

   'అల' ధాతువునకు భూషణ, పర్యాప్తి, వారణ – అని అర్థాలున్నాయి.

   విశేషేణ పర్యాప్యతే.

   విశేషముగా అన్ని విధముల జగమంతా నిండి (వ్యాపించి) అన్నిటినీ పొందిన (పర్యాప్తి) వాడు. కాలం సర్వవ్యాపకమై నడిపించే విష్ణుచైతన్యం.

2. **విశేషేణ భూష్యతే.**

   జగత్తునంతటినీ వివిధ ఋతువుల మార్పులతో అలంకరింప చేసేవాడు. 'భూషణములకు భూషణం' వ్యాలః. సత్తా (ఉనికి) ఉన్నప్పుడే ఏదైనా ఉంటుంది. ఏ అలంకారమైనా అసలు వస్తువున్నప్పుడే. ఆ అసలు వస్తువే అలంకారాలకు అలంకారం, ఆధారం. అదే పరమాత్మ.

3. **విశేషణ వారయితా.**

   కాలగమనాన్ని ఏ ఒక్కరూ అడ్డుకొనలేరు. అలా అడ్డుకొనే వారిని వారించి వ్యాపించేదే కాలం. అలాగే దుష్టులందరినీ, విఘ్నములన్నిటినీ వారించి జగమును రక్షించే హరి 'వ్యాలుడు'.

4. వ్యాలము అంటే సర్పం – అని అర్థం ప్రసిద్ధి.

   వ్యాలవత్ గ్రహీతు మశక్యత్వాత్ వ్యాలః. సర్పము వలె గ్రహించుటకు దొరకనివాడు. అంతుచిక్కని అనంతత్వమే కాలం. అది పట్టుకు చిక్కదు. అందుకే అది వ్యాలము వంటిది. 'కాలసర్పం' అనే ప్రసిద్ధికి ఇదే కారణం. పట్టుకు దొరకనివాడు, సర్పము వలె తన కిరణజాలాలతో అంతా ప్రాకేవాడు సూర్యనారాయణుడే వ్యాలః.

5. **వ్యాలాతీ ఆదత్తే ఇతి వ్యాలః** – అభయమిచ్చి భీతులను రక్షించేవాడు. ఇన్ని అర్థాలతో దీపించే ఈ కాలమే జ్ఞాన స్వరూపం. ఇది అర్థమైతే అన్నీ అర్థమైనట్లే. అన్నిటినీ తెలియజేసే (వెలుగు) జ్ఞానస్వరూపమే–

ప్రత్యయః : 93

1. జ్ఞాన స్వరూపుడు.

   ప్రతీయతేఅనేనఇతి – ప్రత్యయః.

   దేని ద్వారాఅన్నీతెలియబడుతున్నాయో ఆ ప్రజ్ఞయే ప్రత్యయము. **"ప్రజ్ఞానం బ్రహ్మ"** – అని శ్రుతి. ప్రకృష్టమైన జ్ఞాన స్వరూపుడే ప్రత్యయుడైన నారాయణుడు.

2. ప్రత్యయ శబ్దానికి 'విశ్వాసము' అని అర్థం కూడా ఉంది. నిస్సందేహంగా విశ్వసింపచేసేవాడు 'ప్రత్యయుడు'. సంశయరహితమే జ్ఞానం. అదే ప్రత్యయం. నిశ్చయంగా తెలియబడేది.

   "భూయోభూయోపి తే బ్రహ్మన్ విశ్వాస్యఃపురుషోత్తమ" – మాటిమాటికీ విశ్వసింప దగినవాడు నారాయణుడేనని విష్ణుతత్వ వచనం.

3. సూర్యకాంతిలో వస్తుసందేహం రాదు. స్పష్టంగా తేటపరచే వెలుగే ఆతడు. అందుకే సూర్యనారాయణుడే–"ప్రత్యయః".

4. నిస్సందేహంగా విశ్వసించదగిన విష్ణువు "ప్రత్యక్ దృష్టి"కి (అంతర్ముఖ దృష్టికి) స్పష్టంగా గోచరించే పరబ్రహ్మ.

5. **ప్రత్యాయ్యతే వా అనేనాంతర్బహిశ్చ।**

   బహిరంతరములందు స్పష్టంగా వెలిగేవాడు.

   రూపం రూపం ప్రతిరూపో బభూవ ॥ అని ఋగ్వేదం ఈతనిని వర్ణించింది.

   ఇలా అంతటినీ సమగ్రంగా దర్శించే జ్ఞానరూపుడు కనుకనే –

సర్వదర్శనః .. 94

1. అన్నిటినీ చూచువాడు.

   ప్రత్యణువునూ దర్శించగల సమగ్రదర్శనశక్తి నారాయణునిదే. జ్ఞానము అంటేనే సమగ్ర దర్శనశక్తి. అటువంటి జ్ఞానము ఆ పరమాత్మయే. సర్వకాలములను, సర్వప్రాణుల గతులను దర్శించే సాక్షీస్వరూపుడు విష్ణువు.

విశ్వతశ్చక్షురుత విశ్వతోముఖో... జనయన్ దేవ ఏకః ॥

-అని ఋగ్వేదం అన్నివైపుల దర్శనశక్తి కల పరమాత్మను వర్ణించింది. దేశకాలవస్తు పరిమితులను, పరిధులను దాటిన పూర్ణదృష్టి.

2. సర్వమును దర్శింపజేయువాడు - అని కూడా (సర్వం దర్శయతీతి) కొందరు వ్యాఖ్యానించారు. విశ్వసించి ఆశ్రయించిన వారికి తననే అంతటా తేటపరచువాడు. "సర్వమున్నతని దివ్యకళామయమంచు" - "ఎందెందు వెదకి జూచిన అందందే" తనను గోచరింపజేసేవాడు సర్వదర్శనుడైన విష్ణువు.
3. అంతటినీ చూసేవాడు, చూపించేవాడు కూడా - వెలుగుల నిధియైన సూర్యుడే. సవితృరూపంతో భాసించే (సూర్య) నారాయణుడే సర్వదర్శనుడు.

హిరణ్యయేన సవితా రథేనా దేవోయాతి <u>భువనాని పశ్యన్</u> ॥ అని 'యజుర్వేదం', సకలలోక దర్శనుడైన సూర్యరూప విష్ణుని స్తుతించింది. సూర్యాది తేజస్సులు ఎవని వలన కలిగి, గమనిస్తున్నాయో ఆతడే సర్వాతీతుడైన నారాయణబ్రహ్మము -

యతః సూర్య ఉదేత్యస్తం యత్ర చ గచ్ఛతి ।
తదేవ మన్యేహం జ్యేష్ఠం తదు నాత్యేతి కించన ॥ అని 'అథర్వవేదం' చెప్పిన ప్రకారం, సూర్యాది దర్శన శక్తులకు మూలమైన నారాయణుడే సర్వదర్శనుడు.

అంతటినీ దర్శించి, దర్శింపజేసే సర్వకారణుడైన ఆతనికి కారణమనేది లేదు. కాలస్వరూపుడైన ఆతడు కాలానికి లొంగేవాడు కాడు కనుకనే -

అజఃసర్వేశ్వరఃసిద్ధఃసిద్ధిఃసర్వాదిరచ్యుతః।
వృషాకపిరమేయాత్మా సర్వయోగవినిఃసృతఃII... 11

95. అజఃసర్వేశ్వరః, **96ః** సిద్ధః, **97** సిద్ధిః,
98. సర్వాదిః, **99.** అచ్యుతః, **100.** వృషాకపిః,
101. అమేయాత్మా, **102** సర్వయోగవినిఃసృతః II

అజఃసర్వేశ్వరఃసిద్ధఃసిద్ధిఃసర్వాదిరచ్యుతఃవృషాకపిరమేయాత్మాసర్వయోగవినిఃసృతఃII... 95

1. పుట్టుక లేనివాడు.

   శం నో అజ ఏకపాద్దేవః II (ఋగ్వేదం)

   "భిన్నములుగా కనబడే కాలముగా వ్యక్తమైనా, అతడు ఏకరూపియైన దైవం. అతడే మనకు శుభము కలిగించుగాక!"

   కాలంలో ఉన్న వస్తుజాతాని కంతటికీ ఒక ఆరంభం ఉంది. ఆరంభమున్న వాటికి అంతము ఉంటుంది. అనంతమైన కాలస్వరూపుడైన నారాయణుడు ఆరంభరహితుడు. లోకాన్ని నియమించే కాలమే తానైనా, కాలానికి అతీతుడూ తానే.

   కాల స్వరూపునిగా వెనుక నామాలలో వ్యక్తమైన స్వామి 'కాలాతీతుడు' అని ఈ నామం ధృవపరుస్తోంది.

2. **నహిజాతో న జాయేహం న జనిష్యే కదాచన।**
   క్షేత్రజ్ఞఃసర్వభూతానాం, తస్మాదహ మజఃస్మృతఃII

   (మహాభారతం,శాంతిపర్వం)

   "నేను పుట్టినవాడను కాను - పుడుతున్నవాడను కాను - పుట్టబోయేవాడను కాను.(భూత - వర్తమాన - భవిష్యత్తులు అనే విభజన లేనివాడను). సర్వభూతములకు క్షేత్రజ్ఞుడను. కనుక నేను "అజుడను" - అని శ్రీకృష్ణ వచనం.

'అజః' శబ్దం విష్ణుసహస్రనామాలలో అనేక మార్లు ఆవృతమయ్యింది. ఆయా సందర్భాలను అనుసరించి అర్థాన్ని గ్రహించాలి. ఇది కాలస్వరూపం. మూడు కాలాలుగా వ్యవహరించబడినా, ఏ కాలానికీ పరిమితం కాని అనాదితత్త్వమే పరబ్రహ్మ. అదే 'అజః'.

న జాయతే మ్రియతే వా కదాచిత్॥ "ఏనాడూ పుట్టనిదీ, పోనిదీ ఆత్మతత్త్వ"మని శ్రుతివాక్కు.

పుట్టి నశించే తనువులలోనున్న ఆత్మ ఈ తనువుల పరిధుల నతిక్రమించినదీ, జననాదులు లేనిది. అదే క్షేత్రజ్ఞుడై భాసిస్తున్నది.

3. **'అజతి గచ్ఛతి క్షిపతి'** అనే అర్థంలో – సాగునది, విసరునది. ఇది సర్వత్ర ఏ అడ్డూ లేకుండా సాగే, వ్యాపించే (గచ్ఛతి) లక్షణాన్ని తెలియజేస్తుంది. అన్ని వైపుల తన చైతన్యాన్ని విసరునది (క్షిపతి) – అంటే 'వెదజల్లునది'. సూర్యుడు తన వెలుగులను అన్నిటా సాగేలా, వ్యాపించేలా వెదజల్లుతున్నట్లే, నారాయణుడు తన చైతన్యాన్ని సర్వత్ర ఏ అవరోధము లేకుండా వ్యాపింపజేస్తున్న అజుడు.

జననాదులు లేనివాడై, తన సర్వశక్తులతో లోకములను, లోకపాలకులను నిర్వహిస్తున్నందుకు ఆతడు –

సర్వేశ్వరః .. 96

1. ఈశ్వరులకు ఈశ్వరుడు, సమస్తమునకు ఈశ్వరుడు – సర్వేశ్వరుడు. శాసకత్వ పాలకత్వ ధర్మాలతో కూడిన అధికారం 'ఈశ్వరత్వం'. లోకంలో కొందరిని శాసించే లోకపాలకులు (ఇంద్రాదులు) కొందరుంటే వారిని శాసించేవారు ఇంకొందరుంటారు. కానీ వారినీ వీరినీ శాసించే ఈశులకు ఈశ్వరుడు 'సర్వేశ్వరుడు'.

"ఏష సర్వేశ్వరః" అని శ్రుతి ప్రస్తుతించింది.

యః ప్రాణతో నిమిషతో మహిత్వైక ఇద్రాజా జగతో బభూవ ।

య ఈశే అస్య ద్విపదశ్చతుష్పదః కస్మై దేవాయ హవిషా విధేమ ॥

అని యజుర్వేదం ఏకమై ఉన్న సర్వేశ్వరుని ప్రతిపాదించింది.

2. **"సర్వాన్ అశుఅశ్నుతే వ్యాప్నోతీతి సర్వేశ్వరః"**

అంతటను వెంటనే వ్యాపించువాడు – అని ఒక అర్థం.

'అజతి– గచ్ఛతి' అనే వెనుకటి నామాన్ని అనుసరిస్తే, ఆ వ్యాపకత్వం అంతటా, అత్యంత శీఘ్రంగా ఉన్నదని 'సర్వేశ్వరః' అనే ఈ నామం స్పష్టం చేస్తోంది.

మరియొక భావంలో – తనను ఆశ్రయించిన వారిని వెంటనే వచ్చిచేరువాడు (రక్షించువాడు) – అని విష్ణుని భక్తవాత్సల్యాన్ని చాటే అర్థాన్ని చెప్పారు కొందరు.

ఈ సర్వేశ్వరుడు ఎవరి చేతనో నియమితుడు కాడు, పదవిని పొందినవాడు కాడు. ఈ ఈశ్వరత్వం స్వతస్సిద్ధమైనందువల్లనే ఆతడు –

సిద్ధః.. 97

1. స్వయం పరిపూర్ణుడు.

నిత్యమూ ఉన్నవాడు. పొందవలసినది కానీ, పొందలేనిది (పొందనిది) కానీ లేనివాడు. **"నా న వాప్తమ వాప్తవ్యమ్"** అని గీతలో పలికిన పరమాత్ముడు. అన్నీ ఆయనకు సాధింపబడియే ఉన్నాయి.

2. సిద్ధమై ఉన్నవాడు.

తయారు చేస్తే లభించేది కాదు పరమాత్మ. ఏవో సాధనలతో పుట్టుకొచ్చి, నిర్మాణమయ్యే వస్తువు కాదతడు. అది సాధ్యము కాదు. సిద్ధము. ఏ ప్రమాణముల చేతనూ, ఋజువుల కందని స్వయంసత్తాకమైన సత్యస్వరూపుడే సిద్ధుడు.

3. భక్త రక్షణకు సర్వదా సిద్ధమైనవాడు. తన మహిమలతో నిత్య ప్రసిద్ధుడు. స్వతః సిద్ధుడైన విష్ణువే అన్ని కార్యములకు ఫలమునిచ్చువాడు. కనుక–

సిద్ధిః.. 98

1. ఫల స్వరూపుడు. సాధింపదగినవాడు.

   ఏ కార్యమైనా, ఏ సాధనమైనా ఒక ప్రయోజనం కోసం సాగుతుంది. ఆ ప్రయోజనమే ఫలము. ఆ ఫలము నందుండే ప్రయోజన కారక శక్తి విష్ణుస్వరూపం. అదే సంవిద్రూపం.

2. లోకంలో అనేక సిద్ధులు ఉన్నాయి. ఒక్కొక్క సిద్ధిలో ఒక్కొక్క శ్రేష్ఠత్వం ఉంది. అది నారాయణ విభూతి. అణిమాది అష్ట సిద్ధి స్వరూపుడతడే కనుక – 'సిద్ధి' అని నామంతో ప్రస్తుతుడు.

   తానే సిద్ధియైనవాడు కనుక భక్తుల విఘ్నాలను తొలగించి ఫలమై లభించుతాడనే భావం కూడా ఈ నామంలో ఉంది.

3. కైవల్యస్వరూపుడు విష్ణువు – అని మరో అర్థం. నిజానికి అసలు అర్థం, అన్ని సిద్ధులకు గమ్యము నారాయణుడే. దేనిని చేరితే, దేనిని పొందితే మరి ఏదీ అక్కరలేదో ఆ పరమగమ్యం, చరమసిద్ధి విష్ణు ప్రాప్తి. **"యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరన్తి"** – దేనిని కోరి యోగులు బ్రహ్మవిద్యను అనుష్ఠిస్తారో అదియే 'బ్రహ్మము' – అని కఠోపనిషత్తు. యోగములకు, సాధనలకు పరమగమ్యం మోక్షం. బ్రహ్మప్రాప్తియే మోక్షం. ఆ మోక్షమే నారాయణ స్వరూపం.

   మోక్షము పొందినవాడు – ఆ సచ్చిదానందతత్త్వమే తానవుతున్నాడు. సిద్ధుడైన నారాయణుడే సిద్ధియై లభించుతున్నాడు. తనని తానిచ్చుకుంటున్నాడు. పరమ సిద్ధిని పొందిన సాధకుడు బ్రహ్మముతో అభిన్నుడౌతున్నాడనే అద్వైత భావన 'సిద్ధః-సిద్ధిః' అనే నామాలతో తెలుస్తున్నది. ఈతడే సిద్ధిస్వరూపుడు కనుక జ్ఞానులు, భక్తులు అన్నిటినీ విడచి అనన్యాశ్రయంతో ఈతనినే కోరుకొంటున్నారు.
   కార్యములకు, సాధనలకు ఫలమైన ఈతడే అన్నిటికీ కారణముగా ఉన్నవాడు కనుక –

సర్వాదిః .. 99

1. సకల సృష్టికీ పూర్వమునందే ఉన్నవాడు. మూల కారణ స్వరూపుడు.
   హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్యజాతః పతిరేక ఆసీత్। –
   (యజుర్వేదం) సర్వప్రాణి కోటికి పతియైన ఈతడే, అన్నిటికీ మొదలై ఉన్నవాడు – అని చెబుతున్నది
2. **ఆదత్తే – గృహ్ణాతి – స్తభ్నాతీతి ఆదిః.**
   అన్నిటినీ (ముందుగా) గ్రహించువాడు.
   'భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరం' – యజ్ఞములకు, తపస్సులకు భోక్త అయిన సర్వేశ్వరుడే 'సిద్ధి'నిస్తున్నాడు. ఆ భోక్తృత్వాన్నే 'సర్వాది' అన్నారు.
3. అన్నిటినీ స్తంభింపజేయువాడు, అని మరో అర్థం.
   స్తంభనం అంటే దృఢత్వం. సర్వమునకు దృఢత్వాన్నిచ్చేవాడు.
   విశ్వమంతటినీ దృఢంగా ధరించినవాడు విష్ణువు.
   అంతరిక్షంలో పృథివి మొదలైన వాటికి దృఢత్వమే లేకపోతే జీవులకు ఆధారమే లేదు. అన్నిటికీ ఆధారశక్తి కనుక సర్వాది.
   యేన ద్యౌరుగ్రా పృథివీ చ దృఢే
   యేన సు వస్తభితం యేన నాకః।
   యో అంతరిక్షే రజసే విమానః
   కస్మై దేవాయ హవిషా విధేమ। యజుర్వేదం।
   పృథివీ, స్వర్గమూ, ఇంకా అంతరిక్షంలో వివిధ జ్యోతిర్మండలాల ఆధార శక్తి ఈతడే.
4. **సర్వేషాం పురుషార్థానాం ఆదిః మూలం ఇతి సర్వాదిః.**
   ఫల స్వరూపుడైన ఈతడే అన్ని పురుషార్థములకు మూలకారణము.
   యేత్వాం దేవం ధ్రువం భక్తాః పురాణం పురుషోత్తమం।
   ప్రాప్నువన్తి సదా కామాన్ ఇహలోకే పరత్ర చ।।

"పురాణ పురుషోత్తముడైన శ్రీరాముని భక్తులు ఇహపరలోకాలలో సర్వాభీష్టములను పొందుతున్నారు." అని శ్రీమద్రామాయణ (యుద్ధకాండ) వచనం.

సిద్ధులకు మూలకారణం కనుక 'సిద్ధి' తరువాతి నామం 'సర్వాది'. అన్నిటికి ఆదీ, ఆధారమూ అయిన నారాయణుడు ఈ విశ్వమును దృఢంగా ధరించినాడు కనుక –

అచ్యుతః.. 100

1. చ్యుతి (జారుట) లేనివాడు.

స్వరూపముచే గానీ, సామర్థ్యముచే గానీ ఏ కాలములోనూ చ్యుతి లేనివాడు. జారనివాడు, జారనీయనివాడు – అచ్యుతుడు.

విశ్వమునకు ఆధారమైన నారాయణుడు అచ్యుతుడు కనుక, విశ్వంలో అన్నీ వాటి స్థానాలలో ప్రతిష్ఠితమై ఉన్నాయి.

అచ్యుత లక్షణమున్న విష్ణునితో ధరింపబడిన లోకాలోకాలన్నీ, ఈనాటికీ తమ తమ కక్ష్యల నుండి జారక వ్యవస్థితమై ఉన్నాయి. ఈ చ్యుతిలేని శక్తియే విష్ణువు. ఈ అచ్యుత ధర్మంతో విశ్వాన్ని నడుపుతున్న తాను శాశ్వతుడు.

"శాశ్వతం శివం అచ్యుతం" అని వేదము శాశ్వతమై, మంగళ స్వభావమై యున్న పరమాత్మను అచ్యుతుడని కీర్తించింది.

యస్మాన్నచ్యుత పూర్వోహా మచ్యుతస్తేన కర్మణా॥

అని మహాభారత శాంతిపర్వంలో, ఎన్నడూ చ్యుతము కాని తన తత్త్వాన్ని శ్రీకృష్ణరూపుడై విష్ణువు ప్రకటించాడు.

2. అచ్యుతుడైన విష్ణుని ఆశ్రయించిన వారిని కూడా జారనీయడు. భ్రష్టులను కానీయడు.

'యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ' అని గీతాచార్యునిగా ఈ

విషయాన్నే ప్రకటించాడు స్వామి. "దేనిని చేరితే తిరిగి వెనక్కి రారో అదే నా పరంధామము" అదే అచ్యుతత్వం.

ఒకసారి పట్టుకుంటే చాలు తిరిగి వదలడు స్వామి. ఆయన పట్టు సడలదు. పట్టుదలతో పట్టుకున్న వారిని పట్టి విడువడు.

"నమే భక్తః ప్రణశ్యతి" (నా భక్తుడు నశింపడు) –

"తస్యాహం నప్రణశ్యామి" (అతడి నుండి నేను వైదొలగను).

"న త్యజేయమ్ కథఞ్చన' – అని రామాయణం. 'శరణని వచ్చిన వారిని విడువను' అని అభయమిచ్చిన స్వామి కరుణ, లోక నిర్వహణలోని పట్టు ఈ నామంలో ధ్వనిస్తున్నాయి.

ఈ పట్టు తెలిసిన త్యాగయ్య "పట్టి విడువరాదు – నా చేయి పట్టి విడువరాదు" అని రామయ్య పాదాలను పట్టుదలతో పట్టుకున్నాడు. మన పట్టు భక్తి. స్వామి పట్టు కరుణ.

నారాయణుని కరుణాతిశయాన్ని ప్రకటించే ఈ మధుర నామంతో శతనామాలు సంపూర్ణమయ్యాయి.

శ్రీవిష్ణుసహస్ర నామస్తోత్రస్య ప్రథమం నామశతకం సంపూర్ణమ్.

జారనీయని పట్టు కలవాడు కనుకనే భూమిని ఉద్ధరించిన –

వృషాకపిః.. 101

1. "వృషః" అంటే ధర్మం. "కపిః" అంటే వరాహము. "వృషాకపిః" అంటే ధర్మ స్వరూపుడై, ధర్మ రక్షణకై అవతరించిన వరాహస్వరూపుడు. వర్షించుచున్నది "వృషః". అన్ని కోరికలను వర్షించే ధర్మమును "వృష" అన్నారు. **"వృషోహి భగవాన్ ధర్మః"** – అని వేదవచనం. అదే విధంగా – అభీష్టసిద్ధులను వర్షించే ధర్మమయమైన యజ్ఞమును కూడా "వృషః" శబ్దం ద్వారా భావించవచ్చు. "యజ్ఞాద్భవతి పర్జన్యః" – వర్షించే స్వభావం కల "యజ్ఞము" – కపిః (వరాహం) – కలిపి "యజ్ఞ వరాహ స్వరూపం"గా నారాయణుని దర్శించిన నామమిది.

   "కం" అంటే 'జలం' అని అర్థం. **"కాత్ తోయాత్ భూమిమపాత్ ఇతి కపిః"** – జలము నుండి భూమిని రక్షించినవాడు కపిః. జల గర్భంలో దాగిన భూమిని ఉద్ధరించిన యజ్ఞ వరాహ స్వరూపుడు.

   కపిర్వరాహః శ్రేష్ఠశ్చ ధర్మశ్చ వృష ఉచ్యతే ।
   తస్మాద్వృషా కపిం ప్రాహ కాశ్యపో మాం ప్రజాపతిః ॥

   – అని మహా భారతంలో శ్రీకృష్ణుడు పై విషయాన్నే వివరించాడు.

2. భూమిని ఎప్పుడూ ఉద్ధరించి కాపాడేది ధర్మము, యజ్ఞము. ఈ రెండూ లేకుంటే భూమికి రక్షణ లేదు– అనే పరమసత్యం ఈ నామంలో దాగి ఉంది. యజ్ఞ, ధర్మాల స్వరూపంతో భూమిని కాపాడే నారాయణుడు.

3. **'కం పిబతి' ఇతి కపిః.** 'నీటిని త్రాగువాడు' అని కూడా అర్థం చెప్తే, సూర్యకిరణాలు కాంతులను వర్షించి, ఆ ఉష్ణతతో భూమి యందున్న రసాలను పానం (పీల్చి) చేస్తాయి. అలా స్వీకరించి తిరిగి వర్ష రూపంలో నీటిని భూమికి అనుగ్రహిస్తాడు.

   కాంతులను, జలములను వర్షించేదీ (వృషః)– తిరిగి ఆ జలములను పానం చేసేదీ (కపిః) సౌరశక్తి. అలా సూర్య రూపతేజస్సుగా భాసించే

నారాయణుడు 'వృషాకపిః'.

4. **వృషా + అకపిః = వృషాకపిః.** వైదిక శాస్త్రానుసారం ఈ విధంగా కూడా ఈ నామాన్ని దర్శించవచ్చు.

'కపి చలనే' అను ధాతువును గమనిస్తే – 'కంపతే చలతీతి కపిః'– చలన స్వభావము కలది 'కపి'. "అకపిః" – చలించనివాడు.
తన సర్వశక్తులను, అభీష్ట సిద్ధులను వర్షించుచూ, తాను మాత్రము అచ్యుతుడై తన స్వస్థితి నుండి చలించకుండా ఉండేవాడు కనుక 'వృషాకపిః'.

5. అంతేకాక 'ధర్మమును చలింపకుండా చూచువాడు' (చలింపని ధర్మము కలవాడు) అని కూడా అర్థం. విశ్వ నియమాలు శాశ్వతాలు. సూర్య చంద్రాదులు, పంచభూతాలు ఏ కల్పాలైనా ఆ నియమాలను తప్పవు. అందుకే శాశ్వతమైన ధర్మములు మారనివి. వాటిని మార్చదలచుకుంటే ప్రకృతి నియమానుసారం శిక్షార్హుడు. శాశ్వతమైన భూమి గతిని మార్చాలనుకున్న హిరణ్యాక్షుడు వరాహస్వామిచే శిక్షంపబడ్డాడు. అలాగే మానవ ధర్మాలు, ప్రకృతి ధర్మాలు శాశ్వతాలు. చలించని ఆ ధర్మాలు నారాయణ స్వరూపాలు. సూర్యచంద్రాదులను ప్రతి కల్పంలో యథాపూర్వంగా బ్రహ్మదేవుడు ఏర్పరుస్తున్నాడు. అలా ఏర్పరచే శాశ్వతనియమం 'వృషాకపి' అయిన విష్ణువు శాసనం.

సూర్యా చన్ద్రమసౌధాతా యధాపూర్వమకల్పయత్।
దివం చ పృథివీం చాంతరిక్షమథో స్వఃII

భువనాలను కాపాడే ధర్మ స్వరూపుడైన ఆ అపరిమిత శక్తిమంతుని (ఆదివరాహస్వామి) స్వరూపంగానీ, స్వభావం కానీ 'ఇట్టిది' 'ఇంత' అని కొలత పెట్టలేం. అందుకనే –

అమేయాత్మా .. 102

1. కొలతకందని స్వరూపము కలవాడు.

అనంతమైన విశ్వంలో పృథివ్యాదులను ధరించినడుపుతున్న ధర్మ స్వరూపుడు అన్నిటిలో 'అనుస్యూతమై' ఉన్నాడు. కానీ వేటి పరిధిలోనూ ఇమడడం లేదు. పృథివిని తన కోరపై నిలిపిన యజ్ఞవరాహుని (వృషాకపి) స్వరూపం ఏ కొలతకి అందుతుంది?

'యద్రోమరంధ్ర పరిపూర్తి విధాన దక్షౌ
వారాహజన్మని బభూవురమీ సముద్రాః' – అని లీలాశుకుడు 'శ్రీకృష్ణకర్ణామృతం'లో సంభావించాడు.

సమస్త సముద్ర జలాలు ఆ వరాహస్వామి తనువులో ఒక్క రోమ కూపాన్నికూడా తడుపలేకపోయాయి.

2. **'న మేయ ఆత్మా'** – అని శ్రుతి.

ఆత్మ కొలతకు అందనిది.

ఘటాదులలో ఆకాశము వలె దేహాదులలో ఇమిడినట్లు కనిపిస్తున్నా, నిజానికి ఆత్మ దేశ కాల వస్తు పరిధుల నతిక్రమించినది – అని ఉపనిషత్తులు వర్ణించాయి. ఆత్మయే విష్ణువు. అందుకే 'అమేయాత్మా' అని కీర్తింపబడ్డాడు. లోకమునంతటినీ కొలిచే ఆయన ఏ కొలతకీ అందనివాడు.

అందుకే ఏ సంగమూ లేక అన్నిటినీ అధిగమించి ప్రవర్తిస్తున్నందున–

సర్వయోగ వినిస్సృతః .. 103

1. అన్ని సంగముల నుండి విడివడినవాడు. అనగా దేనికీ అంటని నిర్మలుడు – నిర్లేపుడు. 'యోగము' అంటే 'కలయిక' 'బంధము' అని కూడా అర్థం. దేనితోనూ బంధము లేని నిత్య ముక్తుడు.

'అసంగోహ్యయం పురుషః' – ఈ పరమ పురుషుడు అసంగుడు. దేనితో సంగము లేక తనంత తానుండు సత్తామాత్ర స్వరూపుడు.

2. అమేయమై ఉన్న ఆత్మ దేహేంద్రియ మనోబుద్ధులకి అంటని సాక్షి స్వరూపం.ఏ యోగమూ (బంధము) లేని ఆయనతో బంధం (యోగం) పెట్టుకొనే 'యోగి' అన్ని కర్మ బంధాల నుండి విడివడుతున్నాడు.
3. భూమ్యాది అంతరిక్షములకు ఆధారమై నడిపే అతడు నిరాధారుడు – నిస్సంగుడు.
4. 'యోగం' అంటే ఉపాయం. మన ఆలోచనలకు, ఉపాయాలకు, సాధనలకు దొరకడు – అని కూడా ఈ నామానికి అర్థం.
   ఏ కర్మలకూ అందడు. కర్మలు భగవదర్పణ బుద్ధితో ఆచరిస్తే చిత్తశుద్ధి కారకాలవుతాయి. అంతేగానీ నేరుగా పరమాత్మను అందించవు. చిత్తశుద్ధి నుండి జ్ఞానభక్తులు ఉదయమై తత్త్వాన్ని కలిగిస్తాయి. 'ఆయనను సాధిస్తాను' అని ఏ యోగాన్ని ఆశ్రయించినా, ఆయన లభించడు.
   "చిక్కడు వ్రతముల క్రతువుల చిక్కడు యుక్తిని" – అని భాగవతం చెబుతోంది.
5. అయితే – **'వినిస్సృతః'** అంటే **'ప్రాప్యః'** (పొందదగినవాడు) అని అర్థం కూడా చెప్పుకోవచ్చు.
   అహంకార రహితుడై భక్తుడు భక్తితో ఏ సాధనను చేసినా తన అనుగ్రహాన్ని అందజేస్తాడు. కనుక అన్ని యోగములకు పొందదగిన గమ్యమీతడు – అనే అర్థం కూడా ఈ నామానికి ఉంది.
   "యే యథామాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్"
   "భక్త్యాత్వనన్యయా శక్య అహమేవం విధోర్జున" – అని గీతావాక్యాలు ఈ అర్థాన్ని సమర్థిస్తున్నాయి.
6. 'వినిస్సృతః' – 'వెలువడినది' అంటే సారమై వచ్చినది.
   "సర్వ యోగముల (శాస్త్రోక్త మార్గముల) సారభూతమై ఉన్నవాడు" అనే అర్థం కూడా చెప్పవచ్చు. నానా విధ ధర్మవిధానాలకు సారమితడు.
   ఈ సారస్వరూపంగా, అన్నిటియందు అంటకుండానే వసించుచున్నవాడు –

వసుర్వసుమనాఃసత్యఃసమాత్మాసమ్మితస్సమఃి
అమోఘఃపుణ్డరీకాక్షోవృషకర్మావృషాకృతిఃి... 12

104. వసుఃి **105,** వసుమనాఃి, **106,** సత్యఃి,
107 సమాత్మా **108.** సమ్మితఃి, **109.** సమఃి,
110. అమోఘఃి **111** పుణ్డరీకాక్షఃి, **112.** వృషకర్మా, **113.** వృషాకృతిఃిి

వసుఃి .. 104

1. వసించువాడు. వాసించువాడు.
   అందరిలో వసించే చైతన్య స్వరూపుడు కనుక 'వసువు' (వస నివాసే). అదేవిధంగా అంతటా వాసించువాడు. **'వస ఆచ్ఛాదనే'** అనే అర్థంలో అంతటినీ కప్పువాడు – అనగా వ్యాపించువాడు.
2. 'వసు' అంటే 'ధనం' అని కూడా అర్థం ఉంది.
   వస్త ఆచ్ఛాదయతి దుఃఖం యేన తద్ వసు ధనం. (సత్యభాష్యం)
   దుఃఖాన్ని కానరానీయకుండా కప్పివేస్తుంది కనుక ధనాన్ని 'వసు' అంటారు.
   ద్రవ్యం విత్తం స్వాపతేయం రిక్థం ఋక్థం ధనం వసుిి అని అమరం.
   ధనస్వరూపుడు వసువు.
3. **'వసూనాం పావకశ్చాస్మి'** (గీత) అన్నట్లుగా సంపత్కారకుడైన అగ్ని స్వరూపుడు వసువు.
   వసుర్వసుపతిర్హి కమస్వగ్నే విభావసుఃి
   స్యామ తే సుమతావపి ిియజుర్వేదంిి
   "ఓ అగ్నీ! (ప్రకాశమానమైన పరమాత్మా!) నీవే వసువై ఉన్నావు."
   అగ్ని, భూమి, వాయు, అంతరిక్షం, సూర్యుడు, ద్యులోకం, చంద్రుడు, నక్షత్రాలు... ఇవి వసువులు. విశ్వసంపదలు. ఈ రూపాలలో ఉన్నది విష్ణు

విభూతులే. ఇవే ఈ నామంలో స్మరింపబడుతున్నాయి. ఇందులో అత్యంత శ్రేష్ఠతమం 'అగ్ని'గా గొప్ప నారాయణ విభూతిగా 'గీత' పేర్కొన్నది. ఈ సంపదలకు అధిపతులైన అష్ట వసువులు కూడా విష్ణు విభూతులతో దీపించేవారే. వారు: ధరుడు, అహుడు, ప్రత్యూషుడు, ధ్రువుడు, అనిలుడు, ప్రభాసుడు, సోముడు, అనలుడు. ప్రకృతి శక్తి నిర్వాహకములైన విష్ణు చైతన్య విశేషాలే ఈ వసువులు.

ఈ రూపాలతో దర్శనీయుడు కనుక నారాయణుడు 'వసుః'. అందరిలో వసించి, వాసించి, సంపదలుగా ప్రకృతిని నడిపే స్వామిది ఎంత గొప్ప మనస్సో (మహోన్నత స్వభావం)! అందుకే–

వసుమనాః .. 105

1. ప్రశస్తమైన మనస్సు కలవాడు.
   'వసు' ధనవాచి. అంటే ప్రశస్తిని సూచిస్తుంది.
   గొప్ప మనస్సుగల నారాయణుడు. ఈ ప్రశస్తి దేని చేతవచ్చింది?
   రాగ ద్వేషాది వికారాలు లేని ప్రశస్తమైన మనస్సు కనుక వసుమనాః.
   లోకాలన్నిటికీ ఉదారంగా ఇంత సంపదను అందించిన మంచి మనసు – గొప్ప స్వభావం కల లోకేశ్వరుడు.
2. 'మన జ్ఞానే' 'మను అవబోధనే' అనే అర్థాలను అనుసరించి, వసించు జీవులు ఏఏ దేహాదులతో, ఏఏ వ్యవస్థలతో ఉండాలో అలా వసించే విధానము తెలిసి, కలిగించువాడు 'వసుమనాః'.
   జీవులకు సైతము తమ స్థితులు తెలియవు. దేహధారణ, లోపలి నిర్వహణ – అంతా ఏ పరమాత్మ జ్ఞానము వలన జీవులకు కలుగుచున్నదో అతడే వసింపజేయు జ్ఞాన స్వరూపుడు.
   'మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనంచ' (నా వలననే జ్ఞాపకము, జ్ఞానం, మరపు కలుగుచున్నవి).

'అహం వైశ్వానరో భూత్వా – పచామ్యన్నం చతుర్విధం'. (నేను జఠరాగ్నిని) –అని గీతాచార్యునిగా చెప్పిన నారాయణుడే, సర్వులలో వసించి జ్ఞానముగా భాసించే చైతన్య స్వరూపుడు.

అన్నిటిలో వసించే అతడు అన్నిటికంటే శాశ్వతమైన ఉనికి కలవాడు కనుక –

సత్యః.. 106

1. త్రికాలాలలోనూ నశించని, మార్పు చెందని ఉనికిగా ఉన్నవాడు.
   "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" (తైత్తిరీయోపనిషత్)
   సత్యమూ జ్ఞానమూ అనన్తమూ అయినది బ్రహ్మము.
   ఈ ఉనికిపైననే అంతా ప్రతిష్ఠింపబడి ఉంది.
   "సత్యే సర్వం ప్రతిష్ఠితం" అని శ్రుతి.
   "సత్యే నాత్తఫితా భూమిః" (అథర్వవేదం) భూమికి ఆధారం సత్యమే.
2. వసుస్వరూపునిగానే కాక, "ప్రాణ అన్న ఆదిత్య రూపములుగా ఉన్నవాడు" – 'సత్యః'.
   సదితి ప్రాణః అస్తీత్యన్నం యదిత్యసావాదిత్యః – (ఐతరేయ ఆరణ్యకం)
   సత్ + తి + యః = సత్యః.
   సత్ – అంటే ప్రాణములు, తి – అన్నం, య – ఆదిత్యుడు.
   ప్రాణ అన్న ఆదిత్య స్వరూపునిగా జగములను నిర్వహించే నారాయణుడు సత్యస్వరూపుడు కనుక "సత్యనారాయణు"డతడు.
3. **'సచ్చత్యచ్చా భవత్'**
   సత్–మూర్తము, త్యత్ – అమూర్తము.
   మూర్తామూర్తములుగా (సాకార నిరాకారములుగా) ఉన్నవాడు.
4. 'సత్' అనే లక్షణం సాధుత్వాన్ని తెలియజేస్తుంది. సత్పురుషులలోని సాధుత్వ లక్షణం విష్ణు స్వరూపం. సల్లక్షణాలను అభివృద్ధి చేసుకుంటున్నవాడు

విష్ణువును పొందుతున్నట్లే. అతడే నారాయణుని వాడు.

"శుద్ధ సాధులందు సురలందు శ్రుతులందు" అని భాగవతం చెప్పినట్లుగా, సత్పురుషులలో సాధుత్వంగా దీపించే నారాయణుడు. **"సద్భావే సాధుభావే చ"** అని గీతావాక్యం. మంచి అంతా మాధవుడే.

ప్రపంచంలో మార్పులు ఎన్ని జరుగుతున్నా, వాటికి ఆధారమైన పరమేశ్వర చైతన్యం మార్పులేని సత్యం కనుక, అన్నింటిలో సమంగా వ్యాపించినది అదే -

సమాత్మా .. 107

1. సమానరూపంగా సర్వ ప్రాణుల హృదయాల్లో ఉండే ఆత్మ స్వరూపుడు (హృదయుడు).

   'ఆత్మ'కు 'హృదయం' అని పేరు ఉంది. **'హృద్ - అయతే'. (అయతే ప్రాప్నోతి)**. హృదిస్థానాన్ని పొందినవాడు - హృదయం.

   "ఈశ్వరః సర్వభూతేషు హృద్దేశేర్జున తిష్ఠతి" - ప్రాణులన్నిటి హృద్దేశాన్ని పొందినవాడు. హృదయ స్వరూపుడు.

2. హృదయాభిమాన్యాత్మగా, పరమాత్మగా సమానంగా ఉన్నవాడు.

   దేహాభిమానం కల మనస్సు పరమాత్మను జీవాత్మకు భిన్నంగా భావిస్తుంది. మనోలయమైన పిదప తెలిసే సత్యం రెండూ సమానమేనని. ఆ స్థితి సత్యస్థితి. అందుకే 'సత్యః' తరువాతి నామం 'సమాత్మా'.

3. సర్వలోకాధీశుడై సర్వప్రాణి హృదయాలలో సమాన రూపంలో ఉన్నవాడు - 'సమాత్మా'.

   సమః సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరం॥ అని గీతావాక్యం.

   "సమ ఆత్మేతి విద్యాత్" అని శ్రుతి వాక్యం.

   "యద్వైవ సమః ష్లష్ణినా సమోమశకేన సమోనాగేన సమ ఏభి స్త్రిభిర్లోకైః సమోఽనేన సర్వేణ ..."

ఈ ప్రాణము (పరమాత్మ) తేనెటీగ యందు, చెదపురుగునందు, దోమయందు, ఏనుగునందు, ముల్లోకములు శరీరముగా గల విరాట్పురుషునందు తుల్యముగా ఉన్నది– అని ఉపనిషద్వాక్యం. సమంగా వ్యాపించిన (**అతనోతి–వ్యాప్నోతి**) 'సమాత్మా' కనుక 'ఏకీభావం'గా వ్యక్తమైన –

సమ్మితః .. 108

1. ఏకీభావంగా ఉన్నవాడు.

   విశ్వమంతా ఆయన తప్ప మరియొకటి లేదు. సత్యస్ఫురణతో 'సమాత్మా' అర్థమయ్యాక ఇంక ద్వైతభ్రాంతి లేదు. ఉన్నదంతా నారాయణుడే.

   ఏకీభావ ఏవ మానం యస్య స సమ్మితో విష్ణురితి ॥ (సత్యభాష్యం)

   సమ్మితుడైన ఆ విష్ణువొక్కడే. రెండవది, మూడవది లేదు... అని 'ఏకోనారాయణు'ని వేదం బహుధా కీర్తించింది.

   స ఏ ష ఏక ఏక వృదేక ఏవ।
   న ద్వితీయో న తృతీయ శ్చతుర్థో నాప్యుచ్యతే।
   న పంచమే న షష్ఠిః సప్తమో నాప్యుచ్యతే।
   నాష్టమో న నవమో దశమో నాప్యుచ్యతే।
   సర్వే అస్మిన్ దేవా ఏకవృతో భవన్తి।
   ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః॥ – అని అథర్వ వేదవాక్యాలు.

   ఏకాత్మతతో నిండిన (కొలిచిన – మానిత) వాడు.

2. **'సమ్యక్ మితః సమ్మితః'** – భక్తుల భావానుగుణంగా లొంగివచ్చినవాడు. భక్త వత్సలుడైన నారాయణుడు భక్తులను అనుగ్రహించడానికి పలు నామ రూప భావాదులతో, తన మాయతో తనని తాను మితి చేసుకొన్నట్లుగా గోచరిస్తాడు. సత్పురుషుల చేత 'మితి' చేయబడువాడు – గ్రహింపబడువాడు.

   "అజోపి సన్నవ్యయాత్మా... సంభవామ్యాత్మమాయయా"

   "భక్తానుగ్రహ విగ్రహః' – అనే స్మృతి వాక్యాలు ఇందుకు ప్రమాణాలు.

"మిత జగత్రిత మాయజితారమే" ముల్లోకములను చక్కగా కొలిచినవాడు.

కౌసల్యా దశరథులకు పుత్రుడనీ, ఋషులకు పరతత్త్వమనీ, రావణునికి సామాన్య మనుజుడనీ – వారి వారి భావాలకు అనుగుణంగా గోచరించిన ఒకే రామబ్రహ్మము, అదే విధంగా వారి వారి భావాల కనుగుణంగా స్ఫురించిన శ్రీకృష్ణ పరమాత్మ సమ్మితుడైన విష్ణువు.

3. **"సమాత్మాసమ్మితః"** – అనే వరుసలో **'సమాత్మా – అసమ్మితః'** అని కూడా విభజించవచ్చు. **'అసమ్మితః'** అంటే –ఏ మాత్రమూ 'మితి' (హద్దు పెట్టుట) లేనివాడు. అపరిమితమైన అనంతత్వమే ఆతడు. ఏకాత్మగా అంతటా ఉన్నా, విశ్వంలోని ఏ పదార్థపు మితులకూ లొంగనివాడు.

మితికి లొంగే జగద్వికారాలేవీ లేని నిర్వికారుడు కనుక –

సమః.. 109

1. ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉన్న నిర్వికారుడు.
'సమత్వం యోగ ఉచ్యతే' అన్నారు. సుఖదుఃఖాది ద్వంద్వాలకు చలించని చిత్తమే యోగము. నిరంతరము తన స్థితి నుండి తాను చెదరని స్వామి, యోగస్వరూపుడు.
2 సూర్య చంద్రాదులు అన్నిటా తమ వెలుగును సమానంగా ప్రసరించునట్లు, సర్వ జీవుల ఎడ సమదృష్టి కలవాడు.
3. **మాయా లక్ష్మ్యా సహ వర్తతే ఇతి వా సమః.**
దేనితో జగత్తు కొలువబడుతోందో ఆ శక్తి 'మా' (యా మా).
అదే మాన శక్తి. ఆ శక్తి చేతనే జగత్తు రక్షింపబడుతోంది. ఆ కారణంచేత జగత్తుకి 'మా' సంకేతం. ఆ శక్తినే జగదేకమాత లక్ష్మిగా ఆరాధిస్తున్నాం. ఆ 'మా' శక్తితో దీపించే లక్ష్మీపతి 'సమః'.

ఈ 'సమః' అనే మాట ఇంకా అనేకార్థాలతో కూడిన దివ్యమైన నామం. అందుకే వివిధార్థాలతో, వివిధ సందర్భాలలో ఔచిత్యంతో ఈ నామం సహస్ర నామాలలో అనేక మార్లు ఆవృతమైనది.

సర్వసముడు కనుక ఏ మోహము లేనివాడతడే –

అమోఘుఃఃః

3. తాను అమోఘుడే కాకుండా - తనను ఉద్దేశించి చేసే పూజాదులను, స్తోత్రాదులను వ్యర్థము కానీయకుండా సర్వఫలములను ప్రసాదించేవాడు.

సత్యుడై అమోఘుంగా వ్యాపించినవాడు అందరి హృదయాలలో ఉన్నాడని సుస్పష్టం చేస్తూ -

పుణ్డరీకాక్షః .. 111

1. **పుణ్డరీకం హృదయం - తమశ్నుతే వ్యాప్నోతీతి చ పుణ్డరీకాక్షః.**

పుణ్డరీకం - అంటే హృదయం, ఆ హృదయాన వ్యాపించిన ఆత్మ స్వరూపుడు.

పుణ్డరీకం నవద్వారం త్రిభిర్గుణేభిరావృతమ్।
తస్మిన్ యద్ యక్షమాత్మన్వత్ తద్వై బ్రహ్మవిదో విదుః।। (అథర్వవేదం)

- ఈ శ్రుతివాక్యం శరీరంలో హృదయ పద్మంలో భాసించే పరబ్రహ్మమును - పుణ్డరీకాక్షునిగా స్పష్టం చేసింది.

దేహేంద్రియ మనో బుద్ధులకు అతీతంగా భాసించే హృదయమే, 'పరంధామం'. అందు వసించు నారాయణుడు పుణ్డరీకాక్షుడు.

'తదిదం పరం పుణ్డరీకం వి(ప్ర)జ్ఞాన ఘనం" (నారాయణ సూక్తం)

జగత్తును నిర్వహించే పరంధామం వైకుంఠం. అదే వ్యష్టిలో హృదయం.

"పుండరీకం పరంధామ నిత్యమక్షరమవ్యయం తద్భవాన్ పుణ్డరీకాక్షః" -
(మహాభారతం. ఉద్యోగ పర్వం)

"నిత్యమై, నాశనరహితమైన పరంధామమున ఉన్న కారణంగా విష్ణూ! నీవు పుణ్డరీకాక్షుడవు".

2. పరమాకాశమున విస్తారమైన (పద్మము వలె వికసించిన) నేత్రము వంటివాడు. (నేత్రము - సర్వదర్శనుడైన పరంజ్యోతి)

"దివీవ చక్షురాతతం" - అని శ్రుతి వాక్యం.

పరంధామము నందుండి తన విభూతులను విశ్వమంతటా వర్షించి వ్యాపింపజేయడమే ఆయన పని. అందుకే –

వృషకర్మా .. 112

1. వర్షణశీలమైన ధర్మ లక్షణ కర్మ కలవాడు.

   విశ్వమునకు వలసినవి వర్షించేది ధర్మం. విశ్వనియమాలే ధర్మాలు. ఆ నియమాలు ప్రకృతిని, దేవతలను శాసిస్తాయి. ఆ శాసన ధర్మాలతోనే ప్రకృతి, దేవతలు ప్రజలకు కావలసినవి కురిపిస్తారు. అలా ధర్మ కర్మను నిర్వర్తింప జేసే జగత్ప్రభువు.

2. జ్యోతి వెలుగులను ప్రసరించునట్లుగా, హృత్పుండరీకమనే పరంధామమందుండి తన చైతన్యాన్ని ఆపాదతలమస్తకం వర్షింపజేసే (ప్రసరింపజేసే) పరమాత్ముడు –

   పరమమైన వైకుంఠ ధామము నుండి సర్వ విశ్వమునందు తన విభూతులను వర్షింపజేస్తున్నాడు. వ్యష్టిలో, విశ్వంలో విష్ణుని 'వృషకర్మ'గా గుర్తించే విధానమిది.

3. లోక ధారణ లక్షణమే ధర్మం. అదే వృషము.

   ఆ ధారణ కర్మ నిర్వహించువాడు.

   వ్యక్తి ఉనికి అతడి ఆకృతి ద్వారా తెలుస్తుంది. అలా పరమాత్ముని ఉనికి జగత్తున వ్యాపించిన ధర్మము ద్వారా తెలుస్తుంది. కనుక ధర్మమే ఆయన ఆకృతి –

వృషాకృతిః .. 113

1. ధర్మమే ఆకారముగా కలవాడు.

   విశ్వమంతా ధర్మమయం. శాశ్వత నియమాల ననుసరించి సాగే విశ్వం నారాయణాకృతి కనుక, ఈ ధర్మాల ద్వారా నారాయణుని గుర్తించగలం.

సూర్యచంద్రుల ఉదయాస్తమయాలు, ప్రకృతి ధర్మాలు – వీటిని పరిశీలిస్తే, ఈ ధర్మకర్మల ద్వారా నియామకుడైన జగత్ప్రభువు గోచరిస్తాడు. పాలన ద్వారా పాలకుని తెలుసుకున్నట్లు విశ్వధర్మము ద్వారా విష్ణుని తెలుసుకోవాలి. అలా తెలియజేసే విశ్వధర్మములే స్వామి ఆకృతి.

2. ధర్మమునకై ఆకారము ధరించువాడు – వృషాకృతి.
నిరాకార నారాయణ బ్రహ్మము ధర్మ రక్షణ కోసం తన మాయతో ఆకృతులను ధరించినది.
'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' – అన్న గీతావాక్యార్థమిదే.
'రామో విగ్రహవాన్ ధర్మః' – అనే రామాయణవచనం, ధర్మానికి ఆకారం శ్రీరాముడు – అని ప్రస్తావించింది. అలాగే శ్రీకృష్ణాది భగవదవతారాలు ధర్మాకృతులు.

3. వర్షణశీలమైన ఆకారము దాల్చువాడు.
అనంత కల్యాణ గుణాలను, కారుణ్యామృతాన్ని తన నుండి వర్షింప జేసే విధంగా మధురమైన దివ్య మంగళ విగ్రహాన్ని ధరించే స్వామి.

స్వామి ఆకృతులన్నీ అమృత విగ్రహాలే.

"శ్రవణ మనో నయనామృతావతార"– అని శ్రీకృష్ణుని కీర్తించాడు లీలాశుకుడు. వినుటకు, తలంచుటకు, దర్శించుటకు అమృతము వలె ఆస్వాదనీయమైన మధురాకృతి.

ఆ రూపము ద్వారా తన కరుణను, లీలలను, దివ్యత్వాన్ని పృథ్విపై వర్షించాడు. ఆ ఆకృతిని ధ్యానించే హృదయంలో ఆనందామృత వృష్టిని వర్షిస్తున్నాడు. శ్రీకృష్ణుడు ఏడు అహోరాత్రులు గోవర్ధనగిరిని ధరించినపుడు, ఆ కొండగొడుగు నీడన చేరిన గో గోప గోపీ జనులకు ఆకలి దప్పికలు తెలియలేదు. పుణ్డరీకాక్షుడు తన పద్మనయనాల నుండి వర్షించిన అమృత దృక్కులే వారికి పోషకాలయ్యాయి. ఇలా ధ్యానధారణ యోగ్యమైన వృషాకృతి విష్ణ్వాకృతి.

"విశ్వమాప్యాయయన్ కాన్త్యా పూర్ణేన్వ్వయుత తుల్యయా".

అని 'పౌండరీక సంహిత' వర్ణించింది.

అనంతమైన పూర్ణచంద్రుల కాంతితో సమానమైన వెలుగులను, చలువ దనాన్నీ, కారుణ్యార్ద్రతనీ వర్షిస్తూ విశ్వాన్ని ఆనందపరుస్తున్నది హరియాకృతి. స్వామి సగుణ రూపాలన్నీ తన అనంత సచ్చిదానంద తత్త్వాన్ని వర్షింపజేసే (అందించే) ఆకృతులే.

ధర్మమే కర్మగా, ఆకృతిగా కల నారాయణుడు ధర్మమును తప్పిన వారిని శిక్షించి దుఃఖింపజేసి, ధర్మమును పాలించువారిని కాపాడి దుఃఖమును పోగొట్టి కరుణించే ప్రభువు. ఆ కారణంగానే ఆతడు – రుద్రః.

రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోనిః శుచిశ్రవాః।
అమృతః శాశ్వతస్థాణుర్వరారోహో మహాతపాః॥...13

114. రుద్రః,	115. బహుశిరాః,	116. బభ్రుః,
117 విశ్వయోనిః,	118. శుచిశ్రవాః,	119. అమృతః,
120. శాశ్వతస్థాణుః,	121. వరారోహః,	122. మహాతపాః॥

రుద్రః .. 114

1. రోదయతీతి రుద్రః.

   'ఏడిపించువాడు'. అంటే శిక్షించువాడు.

   శ్రుతిస్మృత్యాదులు ఈశ్వరాజ్ఞలు. శాసకుడైన ప్రభువు శాసనోల్లంఘనం చేసిన వారిని శిక్షించునట్లు – విశ్వనియమాలైన ధర్మాలను అతిక్రమించిన వారిని శిక్షించే పరమేశ్వరుడే రుద్రుడు.

   ప్రళయకాలంలో, సర్వమును నశింపజేసేవాడు కూడా ఆతడే. (రోదయతి సర్వమన్తకాలే).

2. అదే రుద్రుడు– తనను ఆశ్రయించిన వారి దుఃఖాన్ని నశింపజేసే

ఆనందమయుడు; ధర్మపరులకు గత పాపఫలితాలను నశింపజేసి, అనుగ్రహించే కరుణాళువు.

రుద్దుఃఖం దుఃఖహేతుర్వా తత్ ద్రావయతి యః ప్రభుః।
రుద్ర, ఇత్యుచ్యతే తస్మాత్ శివః పరమకారణమ్ ॥

–అని శివపురాణాది సంహితలు చెబుతున్నాయి.

'రుత్' – అంటే దుఃఖము, దుఃఖకారణము (అజ్ఞానం, పాపం).

వాటిని 'ద్రావయతి'– నశింపజేయువాడు రుద్రుడు.

3. 'రుతం' (నాదం) ద్వారా లభించే (ప్రాప్యః) పరతత్త్వమే రుద్రుడు. వేదవేద్యుడు – అని కూడా భావం.

4. **రుజం ద్రావయతి** – సర్వ వ్యాధులను, చివరకు అవిద్యారూప వ్యాధిని కూడా పోగొట్టే సచ్చిదానంద పరబ్రహ్మమే రుద్రుడు.

5. **ఋషీణాం ద్రుతమస్య రూపముపలభ్యతే** – దర్శన శీలురైన మనన శీలురైన ఋషులకు వెంటనే తన అనుగ్రహస్వరూపాన్ని లభింపజేయువాడు – అని రుద్రోపనిషత్తులు వ్యాఖ్యానించాయి.

6. రుద్ర, విష్ణ్వాది నామాల ద్వారా వ్యక్తమయ్యేది ఒకే బ్రహ్మము.

'నమో భగవతే రుద్రాయ విష్ణవే...' అని శ్రుతి ఈ ఏకత్వాన్ని భజించింది. **'ఏకో రుద్రః నద్వితీయాయ తస్థుః'** (ఉన్నది ఒకే రుద్రుడు. మరి రెండవది లేదు) అని శ్వేతాశ్వతరోపనిషన్మంత్రం ద్వారా శ్రుతి తేల్చి చెప్పింది.

"...యో రుద్రో విశ్వా భువనావివేశ తస్మై రుద్రాయ నమో అస్తు" అన్నది వేదం. "సర్వ విశ్వమున ప్రవేశించి వ్యాపించిన రుద్రునకు నమస్కారం" – అని భావం.

7. తన రూప గుణ తత్త్వాదులను భక్తులకు గ్రహింపజేయుట ద్వారా ఆనంద పరవశంతో ద్రవించిన హృదయులను చేసి, బాష్ప రోమాంచాది సాత్త్వికోద్రేకాలను కలిగించువాడు.

ధర్మ శాసకుడై, రక్షకుడై అంతటా వ్యాపించిన కారణంగా బహు వదనాలతో అన్నిటినీ దర్శించే జ్ఞానస్వరూపుడు కనుక –

బహుశిరాः .. 115

1. బహు (అనంత) శిరస్సులు కలవాడు.

'సహస్ర శీర్షా పురుషः' అని యజుర్వేదం వర్ణించినది.

శిరస్సు జ్ఞానస్థానం. దర్శన, శ్రవణ, ఘ్రాణ, స్వీకరణాది ధర్మాలు కల ఇంద్రియ శక్తులకు, మేధస్సుకు (బుద్ధికి) చోటు శిరస్సు. అనంత దర్శన శక్తి, శ్రవణాది శక్తులు, బహు విధాలైన ఆలోచనలు (ధారణ, ప్రజ్ఞ వంటి బుద్ధి శక్తులు) కలవాడు – 'బహుశిరాः'.

ఆ అనంత శక్తులతో విశ్వమును గమనించి నియంత్రించు పరమేశ్వరుడు. పై 'శిరశ్శక్తులు' సృష్టిలో ఒక్కొక్క ప్రాణి ద్వారా ఒక్కొక్క విధంగా వ్యక్తమవుతుంటాయి. గద్ది మానవులకు నిషేధాహారం. అదే పశువులకు సిద్ధాహారం. కొన్ని ప్రాణులు కొన్ని రంగులను, కొన్ని కోణాలను మాత్రమే దర్శించగలవు. కొన్ని శబ్దాలనే వినగలవు. ఇలా ఒక్కొక్క ప్రాణి శిరస్సు వివిధ గ్రహణ శక్తులతో, వివిధ ఆలోచనా స్థాయిలతో పనిచేస్తుంటుంది. ఇలా లెక్కకందని జీవులకు బుద్ధి శక్తులను, ఇంద్రియ శక్తులను ప్రసాదించి నియంత్రించే బహు శిరస్కుడు నారాయణుడు.

2. "అనన్తశ్చాస్మి నాగానాం" అనునట్లుగా సర్పములలో అనంత ఫణాలతో (వేయి పడగలతో) దీపించే అనంతుడు (ఆదిశేషుడు) నారాయణ స్వరూపుడు. ఆ విధంగా బహుశిరస్కుడు.

ఈ శిరస్సులతో భూమ్యాదులను భరించువాడు. బుద్ధి శక్తులే ప్రాణులకు పోషకాలు – భరించునవి. అనంత బుద్ధి శక్తులతో విశ్వమును భరించి పోషించువాడు కనుకనే –

బభ్రుః .. 116

1. భరించువాడు. పోషించువాడు. (ధారణ, పోషణయోః) విశ్వమంతా ఎవని శక్తిచే భరించబడుతూ, పోషించబడుతున్నదో అతడు బభ్రుః. వెనుకటి నామంలో చెప్పిన దర్శన శ్రవణ బుద్ధ్యాది శక్తులే ప్రాణులను భరించి పోషిస్తున్నాయి. ఆ విధంగా ఇంద్రియాలకు శక్తులనిచ్చి, వాటి పోషణకు తగిన ఆహారాది విషయాలను (ఇంద్రియార్థాలను) ఏర్పరచి విశ్వ నిర్వహణ చేసే చైతన్యమే విష్ణువు.

   'అసౌయస్తామ్రో అరుణ ఉత బభ్రుః సుమంగలః'।(యజుర్వేదం)

2. శేషాది రూపాలతో పృథివ్యాదులను భరించువాడు.

   "నమో బభ్రు(భ్లు)శాయ చ" (యజుర్వేదం)

   వృక్షాన్ని భరించేది దాని మూలశక్తియే. అదే విధంగా విశ్వభారాన్ని వహించే మూలశక్తి విష్ణువే కనుక -

విశ్వయోనిః .. 117

1. సమస్తమునకు కారణమైనవాడు.

   విశ్వం కార్యం. దానికి కారణమైన పరమాత్మ 'విశ్వయోనిః'. కర్తగానూ, శక్తిగానూ నిమిత్త, ఉపాదాన కారణాలు తానే అయినవాడతడు.

2. 'యోనిః' అనే శబ్దానికి -

   'యు మిశ్రణామిశ్రణయోః' అనే ధాతువు ననుసరించి,

   "యౌతి సంయోజయతి మిశ్రణం కరోతి పృథక్ అమిశ్రణం కరోతీతివా యోని"

   సృష్టి అనేక విధాలుగా ఉన్నది. స్త్రీ, పురుష, పశు పక్ష్య మానవాదులు, జలాగ్ని వాయ్వాదులు, నక్షత, గ్రహాదులు, పాషాణాలు, వృక్ష పర్వతాదులు, నదీ పల్వలాదులు.. మళ్లీ ఒక్కొక్క దానిలో పలు రకాలు - మిశ్రమై కలిసిన వాటిలో కూడా, మళ్ళీ అమిశ్రంగా ఉన్నవీ ఉన్నాయి. ఇలా కలిపీ, విడివిడిగా

చేసి (మిశ్రణామిశ్రణము) విశ్వమును నిర్వర్తించువాడు 'విశ్వయోనిః'.

–"తస్యధీరాః పరిజానంతి యోనిమ్" అని శ్రుతివాక్యం

"విశ్వకారణమైన ఆ బ్రహ్మమును బ్రహ్మజ్ఞులు తెలుసుకుంటున్నార"ని పెర్కొన్నది.

"ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం
సమస్త సాక్షిం తమసః పరస్తాత్"

లోకాలోకాలకు ఆవల వెలిగే సమస్త సాక్షియైన పరమాత్మను సర్వకారణునిగా "భూతయోని" అని కీర్తించి, తత్త్వజ్ఞులు ఆ తత్త్వాన్ని పొందుతున్నారని కైవల్యోపనిషత్తు వచనం.

సమస్త కారణుడైన పరమాత్మనే వేదాదులు బహు నామాలతో కీర్తించాయి. అలా కీర్తించదగిన మంగళకర నామ, గుణ, తత్త్వాదులు గలవాడు–

శుచిశ్రవాః .. 118

1. పవిత్రములైన వినదగిన నామములు కలవాడు.

'పవిత్రాణాం పవిత్రంయో' అనునట్లుగా వినినంత మాత్రముననే పావనత్వాన్ని (శుచిని) కలిగించే నామము, కథ, లీలలు, వైభవము, తత్త్వము శ్రీవిష్ణు మహిమలు. పావనములు, శ్రవణీయములైన ఇన్ని లక్షణములు కలవాడు.

"నీ కథామృతము నిరత సేవన మాకు" అని అన్నమయ్య వచనం. మహాసాధనలకు తొలియైనది శ్రవణం. నవవిధ భక్తులకు మొదలు శ్రవణమే. అటువంటి శ్రవణమునకు తగిన మంగళ చరిత్రలు విష్ణు కథాదులు.

"వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ" అని అన్నమయ్య పలుకు.

శబ్దము ద్వారా జ్ఞాన సంపదాదులు కలుగుతాయి. విద్యలు శబ్దాశ్రితాలు. ఆ శబ్దం శ్రవణ గోచరం. అందుకే శ్రవణీయమైన శబ్దాలు పవిత్రతా లక్షణం

కలవి కావాలి. అటువంటి పావనత్వమే విష్ణుత్వం. "విష్ణునాకర్ణించు వీనులు వీనులు" అని ప్రహ్లాదుని భాగవతోక్తి, చెవులకు సార్థకత విష్ణు నామ మహిమాది వైభవాలేనని స్పష్టం చేసింది.

2. 'శుచి' పవిత్రతతోపాటు శక్తిమత్త్వాన్ని సూచిస్తుంది. సర్వశబ్దములను గ్రహించినా, తాను నిత్యనిర్మలుడైన నాదస్వరూపుడు. పవిత్రములై శక్తిమంతములైన శ్రవణములతో (శ్రవణ శక్తితో) అన్ని శబ్దములను గ్రహించువాడు. సర్వదర్శనుడేకాక, సర్వశ్రోత కూడా ఆయనే. **"సర్వతః శ్రుతిమల్లోకే"** - విశ్వమంతయు వ్యాపించిన శ్రవణములు కలవాడని భగవద్గీత వర్ణించింది. ఆయనకు వినబడకుండా మనసు కూడా గుసగుసలాడలేదు.

3 **"శుచీని శృణోతీతి"** - శుద్ధియైన పలుకులను వినువాడు.
భగవానుడు నిత్య పవిత్రుడు. అందుకే పవిత్రమైన పలుకులను గ్రహించి ఆనందిస్తాడు. భక్తుడు భక్తితో పిలిచే పిలుపులను, ప్రేమతో చేసే విన్నపాలను సమగ్రంగా విని అనుగ్రహిస్తాడు.

శుచీని శ్రవణీయాని శృణోమీహ ధనంజయ!।
న చ పాపాని గృహ్ణామి తతోహం వై శుచిశ్రవాః।।

(భారతం. శాంతిపర్వం)

శుద్ధమై, మధురమైన విషయాలను స్వీకరించువాడు. పాప విషయాలను చేకొనడు. కనుక శుచిశ్రవుడు.

విదురుడిచ్చిన భక్తి పూర్వక ఆతిథ్యానికి శ్రీకృష్ణుడు సంతోషించినట్లుగా, అహంకార రహితమై, శ్రద్ధా భక్తియుతమైన పలుకులను స్వామి పరమానందంతో విని పరవశిస్తాడు.

విదురాన్నాని బుభుజే శుచీని గుణవన్తి చ।।

విదురుడిచ్చిన ఆరగింపును, నివేదనలను స్వీకరించిన శ్రీకృష్ణుడు - తాను పవిత్రమైన వాటినే ప్రీతితో స్వీకరిస్తాననీ, తదితరాలను గ్రహించనని

ప్రకటించాడు. కనుక ప్రతి పలుకు భగవంతుడు వింటాడనుకున్నవాడు – మనసులో కూడా దిగులునూ, పాపాన్నీ రానీయడు. శుచినే పలుకుతాడు – శుచినే వింటాడు.

భగవంతుని నామ, గుణాదుల సంకీర్తనను అప్రయత్నంగా విన్నా ధన్యులమౌతాం, శుద్ధులమవుతాం.

పరీక్షిత్తు భాగవతం ద్వారా శుకమహర్షిచేత విష్ణువైభవాలను శ్రవణం చేసి తరించాడు.

4. శుచియైన దిక్కులు కలవాడు.

దిక్కులన్నిటా భగవానుని స్తుతులే నిండి పునీతమయ్యాయి. దిక్కులే పరమ పురుషుని చెవులు.

"దిశః శ్రోత్రాత్" అని పురుష సూక్తం.

అనాది కాలం నుండి వేదాది నాదాలు, దేవ ఋషుల స్తుతులు విష్ణు నామ సంకీర్తనం చేసి దిక్కుల్ని పవిత్రం చేశాయి. ఆ విధంగా పవిత్రమైన దిక్కులే స్వామి చెవులు కనుక, ఆయన శుచిశ్రవుడు.

శ్రవణీయములైన స్వామి నామ మహిమాదులు శుచియైనవేకాక మాధుర్య, నిత్యత్వ లక్షణాలు కలవి. కనుక ఆయన తత్వమే అమృతత్వం. అవి విన్నవారికి లభించేది కూడా అమృతత్వమే.

"తతోఽమృతత్వ మశ్నుతే" అని నారాయణ సూక్తం. కనుక ఆయన–

అమృతః .. 119

1. నాశనము లేనివాడు.

అకామో ధీరో అమృతః స్వయంభూః
రసేన తృప్తోన కుతశ్చనోనః।
తమేవ విద్వాన్ న బిభాయ మృత్యో –
రాత్మానం ధీరమజరం యువానమ్"

అమృతతత్వాన్ని వ్యాఖ్యానించిన అథర్వవేద వాక్యమిది.
శోకమోహాది మనో వికారాలు, జన్మ బాల్య వృద్ధి క్షయాది శరీర వికారాలు లేని నిత్యముక్తుడు. వీనిని ఎరిగిన వాడు సైతం మృత్యువును దాటుతాడు.

"అజరోఽమరః" – శ్రుతి.

2. ఆస్వాదనీయమైన దానిని అమృతం అంటారు.
నిత్యము ఆస్వాదించదగిన నామ, రూప, గుణ, లీలా, తత్త్వములు గల వాడు శ్రీహరి. "శ్రీరామ నీ నామ మేమిరుచిరా" – అని రామదాసు అన్నా, "దాశరథీ ధ్యాన భజన సుధారసము రుచి" అని త్యాగరాజు నుడివినా, "చాలదా హరినామ సౌఖ్యామృతము" అని అన్నమయ్య పలికినా ఈ భావాన్నే ప్రకటించారు.

"అమృతస్యేవ నాతృప్యన్ ప్రేక్షమాణాः జనార్దనమ్".

"జనార్దనుని చూస్తున్న కొలదీ చూడాలనిపిస్తుంది. అమృతము వలె తనివి తీరనివాడు" అని పురాణ వచనం.
ఆస్వాదనీయుడు, శాశ్వత కైవల్య దాయకుడు, ఆనందమయుడు కనుక 'అమృత' శబ్దము హరికే తగును.
వేదాదులు పవిత్రమని కీర్తించిన (శుచిశ్రవాः) బ్రహ్మపదము అమృతము కనుక, అదే శాశ్వతమూ సుస్థిరము. ఈ కారణంగా ఆతడు –

శాశ్వత స్థాణుః .. 120

శాశ్వతశ్చాసౌ స్థాణుశ్చ.

సదా స్థిరమై ఉన్నవాడు. బ్రహ్మపదము శాశ్వతము – సుస్థిరము.
'సత్' అని చెప్పబడే పరబ్రహ్మ లక్షణాన్ని స్పష్టంగా తెలియజేసే నామమిది.

"అథ నిత్యో నారాయణः" – అని నారాయణ సూక్తం.

ఆ నిత్యత్వము సుస్థిరము. అచలము. మార్పులు లేనిది.
ఆనందమయమై, సుస్థిరమై, శాశ్వతమైనది కనుక విష్ణు పదమే పదిలం.
అందుకే -

వరారోహః .. 121

1. వరమైన 'ఆరోహము' కలవాడు.
విష్ణుపదమే 'ఆరోహం'. ఈ శబ్దానికి 'ఎక్కదగినది' అని అర్థం. ఎక్కుట ఉన్నతత్వానికి సూచకం. 'వర' శ్రేష్ఠత్వ వాచకం. శ్రేష్ఠమై, మహోన్నతమైనవాడు అందరికీ ఆశ్రయమైనవాడు.
ఇంతకు మించిన ఉన్నత పదము లేదు కనుక వరారోహము.
పరబ్రహ్మప్రాప్తియే సకల జీవుల గమ్యం. అది సచ్చిదానందమయమని వెనుకటి నామాలు (అమృతః, శాశ్వత స్థాణుః) చెప్పి, ఈ నామం అది మహోన్నతమనీ, శ్రేష్ఠమనీ స్పష్టం చేస్తోంది.
బ్రహ్మ పదమును పొందిన జ్ఞానులను "ఆరూఢులు" అని అంటారు. అంటే ఉన్నత స్థితిని ఆరోహించినవారు (ఎక్కినవారు) అని అర్థం. ఆ ఆరూఢస్థితినే (ప్రజ్ఞాభూమిక) 'వరారోహః' అని ఈ నామం బోధిస్తోంది.
దీనిని చేరినవారు మరి వెనుకకు మరలరు (జన్మ పరంపరలో చిక్కుపడరు.)
- **'న చ పునరావర్తతే'** అని శ్రుతి. (ఛాందోగ్యోపనిషత్)
"యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ" అని గీతావాక్యం. (దేనిని చేరితే తిరిగి వెనుకకు రారో అదే నా పరంధామము). ఆ పరమ గమ్య బ్రహ్మపదమే వరారోహము.
2. ఉత్తమమైన అంకము (ఆరోహము-ఒడి) కలవాడు.
'వర'లక్ష్మి కూర్చున్న వామాంకము కలవాడు.
"వామాంకస్థిత జానకీ" అని రామయ్యను కీర్తిస్తాం. శ్రేష్ఠత్వానికి సంకేతమైన శ్రీదేవి కూర్చున్న వామాంకము కలవాడు శ్రీహరి.

తల్లిదండ్రుల ఒడిని చేరిన శిశువు భద్రతను పొందినట్లే, విష్ణు ప్రాప్తి కలిగిన భక్తుడు శాశ్వత క్షేమాన్ని పొందుతాడు.

3. శ్రేష్ఠమైన ఉత్పత్తి బీజములను కలిగించువాడు 'వరారోహుడు' అని కూడా అర్థం చెప్పవచ్చు. విభిన్నములైన సృష్టులను విశ్వమందు చేయగలిగే నేర్పరి.

"వరః శ్రేష్ఠ ఆరోహ ఉత్పత్తిర్బీజానాం .. ఫలేస్మాదితి - వరారోహాः"

(సత్యభాష్యం)

"ఇయం విసృష్టిర్యత అబభూవ" అని శ్రుతివాక్యం.

4. 'ఆరోహాः' అంటే 'ఉదయము' అని కూడా అర్థం. శ్రేష్ఠమైన ఉదయము గల సూర్య నారాయణుడు. **"వివస్వాన్ ఆరోహన్నుత్తరాం దివి"** - అని వేదమంత్రం.

ఉత్కృష్టమైన అవతారాదులుగా ఉదయించిన హరి- అని కూడా భావించవచ్చు.ఆ శ్రేష్ఠ స్థితి జ్ఞానమయము కనుక -

మహాతపాः .. 122

1. గొప్ప తపస్సు (జ్ఞానము) కలవాడు.

ఏకీభావమైన గొప్ప జ్ఞానమే తపస్సు.

'తపః' శబ్దానికి జ్ఞాన, ఐశ్వర్య, ప్రతాపాలని అర్థం. ఈ మూడు నిరవధికంగా, సంపూర్ణంగా గలవాడు.

'యస్య జ్ఞానమయం తపః' అని ముండకోపనిషద్వచనం.

'తప ఆలోచనే' అను ధాతువు ననుసరించి - ఈశ్వరజ్ఞానమే విశ్వోత్పత్త్యాదులకు హేతువైన 'మహత్' లక్షణముతో కూడినది.

ఆ తపో లక్షణంతోనే సనాతనుడైన విష్ణువు సర్వలోకములను, కాలములను సృజించి, ధరించి, కర్మఫలాలను విభజించి, ఆత్మ తత్త్వమును ఎరుకపరచుచున్నాడు.

ఈ అఖండ జ్ఞాన శక్తిమయుడై సర్వత్ర వ్యాపించి, గ్రహించగలుగుతున్న కారణంగా –

సర్వగః సర్వవిద్భాను ర్విష్వక్సేనో జనార్దనః।
వేదో వేదవిదవ్యంగో వేదాంగో వేదవిత్కవిః ॥... 14

123. సర్వగః, **124.** సర్వ విద్భానుః, **125.** విష్వక్సేనః,
126. జనార్దనః, **127.** వేదః, **128.** వేదవిత్,
129. అవ్యంగః, **130.**వేదాంగః, **131.** వేదవిత్, **132** కవిః

సర్వగః .. 123

1. అంతటను గమించువాడు (నడచువాడు).
స్వామి చొరరాని, చొరలేని చోటు లేదు. సర్వ స్థలములకు చేరగలుగు వాయువు, కాంతి, మనస్సులగన్నా వేగం గలది పరమాత్మ చైతన్యం. విశ్వమంతా వ్యాపించి, చలించే చైతన్యమది. సర్వగతము.
2. సర్వం గమయతీతి – అన్నిటినీ (అంతటినీ) నడుపువాడు.
"చొచ్చి చూడనిది ఒక చోటు లేదు" "చనుదట చొరరాని చోట్లు"అని భాగవతంలో పోతన పలుకులు. ఆయన చేరి చూడని చోటు లేదు. ఒకే చోటుకి పరిమితమైయుండని అపరిమితుడు, అంతటా నిండి యుండి, అన్నిటినీ ప్రకాశింపజేసే అసలు వెలుగు –

సర్వ విద్భానుః .. 124

1. అన్నిటినీ తెలిసి, తెలియజేస్తూ ప్రకాశించువాడు.
అన్నిటినీ తెలిసినవాడు, తెలియజేయువాడు, తెలియబడువాడు, అన్నిటా (విద్యతే) ఉన్నవాడు – అనే నాలుగర్థాలు 'సర్వవిత్' శబ్దానికి ఉన్నాయి. ఆ పరమ పురుషునికి సృష్టిలో తెలియనిది లేదు. ప్రతి వస్తువునీ తెలియజేసే

తెలివి కూడా ఆయనే. విశ్వాన్ని గమనిస్తే ప్రత్యణువూ ఆ పరమేశ్వరుని సమర్థతను, మహిమను చాటుతోందని స్పష్టమౌతుంది. ఇలా విశ్వముచే ఆయన ఉనికి తెలియబడుతోంది. ఈ విధంగా అంతటా ఉన్నవాడు.

'విద-సత్తాయామ్' అనే అర్థాన్ని అనుసరించి సర్వము నందుండి ప్రకాశించువాడు - **'సర్వ విద్భానుః'.**

తెలియాలన్నా, తెలియబడాలన్నా వెలుగు కావాలి. ఏ 'లోవెలుగు' వల్ల ఈ జగమున 'తెలియుట' అనే లక్షణం స్పష్టంగా ఉన్నదో అదే 'భానుః'.

'భాం ప్రకాశం నుందతి' - ప్రకాశకరుడు భానుడు.

భాయయతి దీపయతీతి భానుః.

సర్వమును తెలుసుకొనే వెలుగు-ఆత్మజ్యోతియే. ఆత్మ ఉనికి చేతనే అన్నీ తెలియబడుతున్నాయి. **(తస్య భాసా సర్వమిదం విభాతి** - శ్రుతివాక్యం). అందరి హృదయాలలో ప్రకాశించే ఆత్మ చైతన్య స్వరూపుడు పరబ్రహ్మ.

సర్వత్ర గమించి, గమనించే అనంత శక్తి సంభరితుడు కనుక -

విష్వక్సేనః .. 125

1. అన్ని వైపుల సేనలు కలవాడు.

'సేనలు' అంటే 'బలములు'. విశ్వవ్యాపకమై ప్రకాశించు 'సర్వగుడూ', 'సర్వ విద్భానుడూ' కనుక అన్ని వైపుల సంచరించగలుగు బలములు (సేనలు) ఆయనవే.

విష్వక్ - అంటే 'అన్ని వైపుల' అని అర్థం.

స+ ఇనః - సేనః. (ఇనః =రాజా) రాజుతోనున్నవి. బలగములన్నిటికీ రాజుతో బంధముంటుంది. రాజాజ్ఞ ననుసరించి వర్తించేవి కనుక రాజసంబంధము కలవి సేనలు.

ఏకో విశ్వస్య భువనస్య రాజా (ఋగ్వేదం)

ఇన్ద్రో రాజా జగతశ్చర్షణీనామ్ (ఋగ్వేదం)

– వంటి వేద వాక్యాలు జగన్నాథుడైన విష్ణువును 'రాజా' అని పేర్కొన్నాయి. విశ్వములో నున్న బలములన్నీ ఆయన బలగాలేనని – 'విష్వక్సేన' శబ్దము చెబుతున్నది. ఆసురీ శక్తులను నాశనము చేసే అనంత వ్యాపక శక్తులను కలిగిన శ్రీహరి – విష్వక్సేనుడు.

దుష్ట శిక్షణ, శిష్టరక్షణ, విశ్వ నిర్వహణ చేసే తిరుగులేని, ఎదురులేని బలాలు అవి.

'నమో హిరణ్య బాహవే సేనాన్యే దిశాం చ పతయే నమః'

'సహస్రాణి సహస్రశోయేరుద్రా అధిభూమ్యాం'

– వంటి మంత్రాలతో రుద్రనమకం విశ్వవ్యాపకమైన ఈశ్వర శక్తి విశేషాలను వర్ణించింది. పృథివ్యంతరిక్ష దివి స్థానాలలో వ్యాపించిన అనంత శక్తులన్నీ ఏకమైన పరమాత్మ నుండి వచ్చినవే – ఒకే జ్యోతి నుండి కాంతి రేఖల వలె, ఒకే సూర్యుని నుండి కిరణాల వలె.

మనలో పరిశీలిస్తే హృదయాన ఉన్న ఆ 'లో వెలుగు' పరమాత్మ నుండి దేహమంతా వ్యాపించిన సర్వేంద్రియ శక్తులు బల(గ)ములు. వీటికి ఆ లోని రాజుతో (ఆత్మరూప ఈశ్వరునితోనే) సంబంధముంది.

'తిర్యగూర్ధ్వ మధశ్శాయీ రశ్మయస్తస్య సంతతా

సన్తాపయతి స్వన్దేహ మాపాద తలమస్తకః' *దేహమంతా ప్రసరించే చైతన్య విశేషాలే ఆత్మ చైతన్యపు సేనలు. ఆ సేనల ద్వారా 'ఇను'ని (అసలు రాజుని – ఆత్మని) గుర్తించాలి.*

జగదీశ్వరుడైన నారాయణుని ఆజ్ఞాబద్ధులై అన్ని దిక్కులను విస్తరించిన బలగముల వల్లనే సర్వప్రాణులు వారి కర్మానుగుణంగా రక్షింపబడుతున్నారు. శిక్షింపబడుతున్నారు. ఆ వ్యవస్థ నాచరించువాడు –

జనార్దనః .. 126

1. జనాన్ (దుర్జనాన్) అర్దయతి. జనైః అర్థ్యతే యాచ్యతే – జనార్దనః.

జనులను హింసించువాడు, జనులచే అభీష్టసిద్ధులను అర్థించబడువాడు –జనార్దనుడు.

'జనులు' – అంటే జని (జన్మించుట) ధర్మం గల ప్రాణులు, వారి పాప ఫలముగా శిక్షలననుభవిస్తారు. శిక్షించే శక్తులు, రక్షించే శక్తులు కూడా నారాయణునివే. అదేవిధంగా – జనులు పుణ్య ఫలాలను పురుషార్థాలను ఆ పురుషోత్తముని అర్థించి పొందవలసిందే.

పెట్టేవాడు, కొట్టేవాడు పాలకుడే కదా. జగన్నాథుడే జనార్దనుడు. విశ్వవ్యాపకములైన తన సేనలతో (శక్తులతో) కర్మ ఫలాలను ప్రదానం చేసే స్వామి. దుష్టులైన అసురులను శిక్షించి, సుకృతుల అభీష్టాలను నెరవేర్చేవాడతడే. శీతోష్ణాలూ, దివారాత్రులు, సుఖదుఃఖాలు, సుభిక్ష దుర్భిక్షాలు, సుదశా దుర్దశలు, వృద్ధిక్షయాలు, జన్మమృత్యువులు, సంపద్విపత్తులు... ఈ ద్వంద్వాలతో జనులను అర్దించే (కల్లోల పరచి అనుగ్రహించే) జగదీశ్వర శాసకత్వం ఈ నామం ద్వారా వ్యక్తమౌతోంది. ఈ తత్వం తెలుసుకొనడమే జ్ఞానం.

ఈ జ్ఞానం లభించే వారికి ద్వంద్వాతీత స్థితి లభిస్తుంది. రెండూ ఈశ్వరుని వ్యవస్థలేనని తెలిశాక, స్వామి శాసనాన్ని గౌరవిస్తాడు. సహిస్తాడు. ఈ వ్యవస్థను అనుశాసించే శాసనాలే వేదాలు. లోక ధర్మాలను, తన తత్వాన్ని ప్రకటించే ఈ శాసనాలు తనకు భిన్నములు కావు కనుక, ఆతడే –

వేదః .. 127

1. వేద స్వరూపుడు.

'విదజ్ఞానే', 'విద విచారణే', 'విద చేతనాఖ్యాన,నివాస, పరి వాదేషు'.

'విద' అనే ధాతువు నుండి 'వేదం' ఉద్భవించింది. జ్ఞానము, విచారణ,

చైతన్యము, ఆఖ్యానం, సమగ్రమైన శాస్త్రము... ఇలా అనేకార్థాలు దీనికి ఉన్నాయి. పరిపూర్ణ జ్ఞాన స్వరూపుడైన నారాయణుడే వేదము.

వేదం సృష్టికి పూర్వమే బ్రహ్మకు పరమాత్మ స్ఫురింపజేసిన అనంత విజ్ఞాన రాశి. సృష్టి ఎలా ఏర్పాటు చేయాలి? – అనే విశ్వ రచనా జ్ఞానమది. దానిని గ్రహించి, పరమాత్మ ప్రసాదించిన శక్తితో విశ్వ రచన చేశాడు బ్రహ్మ. అంటే – వేదం విశ్వరహస్యాలను తెలియజేసే జ్ఞానమన్నమాట.

విశ్వరూపుడైన విష్ణువే ఆ విశ్వజ్ఞాన స్వరూపుడు. కనుక వేదం విష్ణుస్వరూపం.

'వేదోసి–' అని యజుర్వేదం కీర్తించింది.

2. **యస్సర్వం వేత్తి, యః సర్వత్ర విద్యతే** – అనే అర్థాలతో చూస్తే అన్నీ తెలిసినవాడు, అన్నిచోట్ల (విద్యతే) ప్రకాశించువాడు – వేదః– అని కూడా చెప్పవచ్చు.

తమస్సు కావల వెలిగే పరంజ్యోతి అన్నీ తెలిసినవాడు, అంతటా వెలిగేవాడు. విశ్వ రచనా సూత్రాలైన వేదాలు విశ్వమూలమైన స్వామి రూపాలు.

స సర్వోభిహితో వేదే సర్వజ్ఞానమయో హి సః॥ (మనుస్మృతి) – అని మనువు "వేదమునందు ప్రకాశించే సర్వజ్ఞానమయుడతడే" అని పరబ్రహ్మను ప్రస్తావించాడు.

అగ్ని వాయు రవిభ్యస్తు త్రయం బ్రహ్మ సనాతనమ్।
దుదోహ యజ్ఞ సిద్ధ్యర్థం ఋగ్ యజుస్సామ లక్షణమ్॥ (మనుస్మృతి)

అగ్ని వాయు సూర్యులు ఋగ్యజుస్సామాత్మకమైన సనాతన బ్రహ్మమును (వేదాన్ని) యజ్ఞ సిద్ధ్యర్థం ఆవిష్కరించారు.

తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే।
ఛన్దాంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాదజాయత॥

యజ్ఞ స్వరూపుడైన పరమపురుషుని నుండి ఋగ్ యజుస్సామాది

ఛన్దములు (వేదములు) ఆవిష్కృతమయ్యాయి.

2. **"వేదయతీతి వా వేదః"** జ్ఞానము నిచ్చువాడు – అని కూడా అర్థం.

ఆశ్రితులైన భక్తులకు, తపస్వులకు ఆ జనార్దనుడే అజ్ఞానమును నశింపజేసి, జ్ఞానమును కలిగించువాడు– అని భావం.

తేషామే వాను కంపార్థ మహమజ్ఞానజం తమః।
నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతే।।

"వారియందు అనుగ్రహము చేత, నేను వారియందుండి అజ్ఞానమును పోగొడుతున్నా"నని భగవద్గీత.

యస్మాదృచో అపాతక్షన్ యజుర్యస్మాదపాకషన్।
సామాని యస్యలోమాన్యథర్వాంగిరసో ముఖమ్.
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవ సః।। (అథర్వవేదం) – అని

'చతుర్వేద స్వరూపుని'గా పరమపురుషుడైన హరిని వర్ణించారు.

యం బృహంతం బృహత్యుక్తం యమినోయం మహోధ్వరే।
యం విప్రసంఘా గాయంతి తస్మై వేదాత్మనే నమః।।

అని మహాభారత అనుశాసనిక పర్వంలో భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించాడు. (భీష్మస్తవరాజం) విష్ణుని శబ్ద స్వరూపమే వేదం.

తస్మై నూనమభిద్యవే వాచా విరూపనిత్యతా।
వృష్ణే చోదస్వ సుష్టుతిమ్।। ఋగ్వేదం.

వేదవాణి నిత్యమైనది.

వేద స్వరూపుడే కాక, తన స్వరూపము గురించి తెలియువాడు తానే–

వేదవిత్ .. 128

1. వేదమును తెలిసినవాడు.

వేదం అనంతం. అది అనంతునికే తెలుసు. ఎంత వేదవేత్త అయినా వేదమును పూర్తిగా ఎరుగలేడు. భరద్వాజుడు కొన్ని వేల ఏళ్ల ఆయువును

పరమేశ్వరుని నుండి వరంగా పొంది, కాలాన్ని మొత్తాన్ని వేదాధ్యయనానికే వెచ్చించి, తానెంత నేర్చుకున్నదీ తెలుసుకోవాలని పరమేశ్వరునే అడిగాడట. అప్పుడతడు మూడు పర్వతాల్ని చూపించి, ఒక్కొక్క దాని నుండి గుప్పెడు మన్ను తీసి, 'ఇంత' అని ప్రదర్శించాడట. పర్వత రాశిలా ఉన్న వేదాలలో కొన్ని వేల ఏళ్ళు తదేక దీక్షతో అధ్యయనం చేస్తే, మూడు గుప్పెళ్ళ పరిమాణాన్నే గ్రహించగలిగాడు అంటే అనంత వేదజ్ఞానాన్ని ఏం చెప్పగలరు? **'అనంతా వై వేదాః'**. అందుకు విష్ణువు ఎలా అంతుపట్టనివాడో, వేదమూ అంత అనంతమే. ఆ అనంత తత్త్వం ఆయనకే తెలుసు.

కన్ను కన్నుని తెలుసుకోలేనట్టే కొందరి జ్ఞానం తనని తాను తెలుసుకోనీయదు. తన స్వరూపమైన వేదంలో ప్రత్యక్షరమూ, దాని నిజార్థము ఎరిగినవాడు తానే.

2. జగత్తు వేదమునకు వ్యాఖ్యానమనీ, వేదం విశ్వప్రకాశమనీ – ఆర్షవచనం. జగత్తులో ప్రత్యణువుపై పట్టు కలిగి, విశ్వ నిర్వహణమంతా ఎరిగి ఉన్న స్వామి 'వేదవిత్'.

ఒక కార్యమును గురించి కర్తకి తెలిసినంతగా ఇంకొకరికి తెలియడం కష్టం. ఆ జగద్రూప కర్మను నడిపే విశ్వకర్తకే అనంత విశ్వము గురించి తెలుసు.

వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో
వేదాంత కృత్ వేదవిదేవచాహమ్॥

"వేదము లన్నిటి చేత తెలియబడే పరతత్త్వమును నేను. వేదాంతమును (బ్రహ్మజ్ఞానమును) ఏర్పరచినవాడను. వేదమును తెలిసిన వాడను (వేదవిత్) నేను –" అని గీతాచార్యుడైన శ్రీకృష్ణుని వచనం.

3. సంశయాది దోషము లేని సర్వజ్ఞ స్వరూపుడు – 'వేదవిత్'. ఈ స్వామి అనుగ్రహం చేతనే వేదములు తెలియబడతాయి.

సర్వే వేదాః సర్వ వేద్యాః సశాస్త్రాః
సర్వే యజ్ఞాః సర్వ ఇజ్యాశ్చ కృష్ణః ।

విదుః కృష్ణం బ్రాహ్మణాస్తత్త్వతో యే
తేషాం రాజన్ సర్వయజ్ఞాస్సమాప్తాః ॥ (మహాభారతం)

"అన్ని వేదములు, అన్ని వేద్యములు, అన్ని శాస్త్రములు, అన్ని యజ్ఞములు, పూజనీయులైన దేవతలందరూ కృష్ణుడే అని తత్త్వతః తెలుసుకొనిన వేత్తలకు సర్వయజ్ఞముల ఫలము లభించును"ని మహాభారత వచనం.

అనంత జ్ఞాన స్వరూపుడైన ఆ వేదపురుషుని మించిన జ్ఞానము లేదు. అది లోపరహితమైనందున.

అవ్యంగః.. 129

1. ఏ లోపమూ లేని పరిపూర్ణుడు.

   అంగ (అవయవ) రహితుడు వ్యంగః. ఇది అపరిపూర్ణత. అటువంటి అపరిపూర్ణ స్థితి (వ్యంగ) లేనివాడు 'అవ్యంగుడు'.

   వేదము పరిపూర్ణ విద్య. ఇతర విద్యలు కేవల లౌకికాలు. వేదము లోకజ్ఞానమునే కాక, లోకాతీత పరమ సత్యాన్ని ప్రతిపాదించే విద్య.

   ప్రత్యక్షేనానుమిత్యా వా యస్తూపాయో న బుధ్యతే।
   ఏనం విన్దన్తి వేదేన తస్మాత్ వేదస్య వేదతా॥

   ప్రత్యక్ష, అనుమానాదుల ద్వారా, ఇంద్రియముల ద్వారా లభించని ఉపాయాలను తెలియచేసే వేదము పరిపూర్ణ విద్య. ఆ వేద స్వరూపుడైన శ్రీహరి పరిపూర్ణుడు.

2. ఇంకొక అర్థంలో 'వ్యంగః' అంటే వ్యక్తమయ్యేవాడు. 'అవ్యంగః' అంటే 'అవ్యక్తుడు'. ఇంద్రియాదులకు గోచరించని ఆత్మ స్వరూపుడు, ఇంద్రియాతీతమైన పరమ సత్యజ్ఞానమును బోధించే వేద స్వరూపుడు - అని అర్థాలు.

   అవ్యక్తోయ మచిన్త్యోయ మవికార్యోయముచ్యతే

"అవ్యక్తుడూ, చింతనకు అందని నిర్వికారుడు" అని గీతావచనం.
పరిపూర్ణుడైన ఆ అవ్యక్త బ్రహ్మమునకు వేదమే శరీరము గనుక -

వేదాంగః.. 130

1. చతుర్వేదములే అంగము(లు)గా గలవాడు. ఆకారరహితుడైన (అవ్యక్త) పరబ్రహ్మ వేదము ద్వారా వ్యక్తమౌతున్నాడు గనుక వేదమే ఆయనకు అంగము (తనువు).
2. వేదాంగస్వరూపుడు.

   వేదములకు అంగములు, ఉపాంగములు ఉన్నాయి. అవి లేనిదే వేదము పూర్ణం కాదు.

   వేదానికి ప్రధానం షడంగాలు : 1. శిక్ష, 2. వ్యాకరణము, 3. ఛందము, 4. నిరుక్తము, 5. జ్యోతిషము, 6. కల్పము. ఈ ఆరు శాస్త్రాల జ్ఞానముచే వేదార్థం అవగతమవుతుంది. ఈ అంగములు (అవయవాలు) గల వేద పురుషుడు. కనుక వేదాంగములు కూడా విష్ణుమయాలు.

   ఇక ఉపాంగాలు - పురాణ, న్యాయ, మీమాంసాదులు.

   ఈ అంగ, ఉపాంగాలలో నున్న వేదవిద్యను 'సాంగోపాంగ వేదవిద్య' అంటారు. ఈ శాస్త్రాలన్నీ పరమేశ్వర స్వరూపాలు.

   'ఈశానః సర్వ విద్యానాం....' అని శ్రుతి వాక్యం.

   యోగోజ్ఞానం తథాసాంఖ్యం విద్యాశిల్పాది కర్మచ।
   వేదాశ్శాస్త్రాణి విజ్ఞానం ఏతత్సర్వం జనార్దనాత్॥

   యోగ, జ్ఞాన, సాంఖ్య, విద్యా శిల్పాదులు, వేద శాస్త్రాలు... విజ్ఞానమంతా జనార్దనుని నుండి వచ్చినదే. సర్వ శాసకుడైన జనార్దనుని శాసనారూపాలే వేదవిద్యలన్నీ.

   పురాణేతిహాసాల జ్ఞానంతో వేదం సమగ్రంగా అర్థమవుతుంది. వేద ధర్మాన్ని వ్యాపింపజేసేవే పురాణాదులు.

"ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని ప్రసిద్ధ వచనం. వేదాంగములన్నీ నారాయణ రూపాలు కనుక 'వేదాంగుడు' అని నామం.

3. **వేదాః అగన్తి గచ్ఛన్తి ప్రాప్నువన్తి యమసౌ వేదాంగో విష్ణుః.**

వేదములు ఎవరిని పొందించుతున్నాయో ఆతడు. అనగా వేదాలకు గమ్యుడు. వేదముల లక్ష్యం పరతత్త్వ ప్రాప్తి. ఆ పరతత్త్వమే విష్ణువు. కనుక అతడు వేదగమ్యుడు – (వేదాంగః)

ఆపూర్వేణేషితా వాచస్తా వదన్తి యథాయథమ్।
వదన్తీర్యత్ర గచ్ఛన్తి తదాహుర్బ్రహ్మణం మహత్॥

"పరమేశ్వర ప్రేరితమైన (ఈషితా–ప్రేరితా) వాక్కులు (వేదములు) యథార్థమును ప్రకాశింపజేస్తూ, అయననే చేరుతున్నాయి.(గచ్ఛన్తి) ఆతడే మహత్ స్వరూపుడైన బ్రహ్మము" అని అథర్వ వేదవాక్యం.

వేద విచారణ ద్వారా పొందబడేవాడు కనుక –

వేదవిత్.. 131

1. వేదములను విచారణ చేయువాడు. (విన్తే విచారయతీతి – విత్)
వేద విచారణ చేసి తెలుసుకొనే తెలివి కూడా విష్ణు తేజమే. అదే లేనప్పుడు వేదము, వేదార్థము స్ఫురించదు. కనుక వేదముతోపాటు వేదవేత్త కూడా విష్ణురూపునిగానే భావింపబడతాడు.
యథాతథ్యతోర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః॥
అనే యజుర్వేద మంత్రం యథాతథార్థాలను కలిగించే పరమేశ్వరుని స్తుతించింది.
వేదవిచారణ జ్ఞానము హరిస్వరూపమని భావం.

2. 'వేదవిత్' శబ్దం ఇక్కడ పునరుక్తి అయినా విభిన్నార్థంలో వాడబడడమే కాక, తాత్త్వికార్థాన్ని స్ఫురింపజేస్తుంది.
'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' – బ్రహ్మమును తెలిసినవాడు

బ్రహ్మమే అవుతున్నాడని వేదాంత వాక్యం.

వేద మంత్రములు వేదమును తెలుసుకుంటున్నాయి – వేదము, బ్రహ్మము అనే మాటలు వేదవిద్యనే కాక పరబ్రహ్మబోధకాలు. పరబ్రహ్మను తెలుసుకొని, తెలియజేసే వేదములు ఆయన స్వరూపాలే కనుక వేదవిద్యారూపుడే వేదవిత్. 'బ్రహ్మవిత్' అనే మాటయే ఇక్కడ 'వేదవిత్'గా చెప్పబడింది.

వేద ప్రయోజనం పరబ్రహ్మతో తాదాత్మ్యం. ఆ స్థితిని సాధించిన నిర్వికల్ప సమాధిలో వేదము, వేదవేద్యుడు, వేదవేత్త కూడా బ్రహ్మమే అవుతున్నాడు. ఆ త్రిపుటీ ఏకత్వాన్ని సూచిస్తూ – "వేద వేదాంగ వేదవిత్" అని నామాలు కూర్చబడ్డాయి.

దేశకాలాది అవధులు లేక – ఇంద్రియాదులకతీతమైన సత్యాన్ని దర్శించి, దర్శింపజేసే వేదమే ద్రష్ట కనుక –

కవిః.. 132

1. **కౌతి పశ్యతీతి కవిః.** దర్శించువాడు.

కవి, కావ్యం అనేవి వైదిక శబ్దాలు. వేదానికే ఈ రెండు నామాలు ఉన్నాయి. పరమాత్మ తత్త్వాన్ని దర్శించే వేదమంత్రములే కవులు. అలాగే తపశ్శక్తితో ఆ వేదమంత్రాలను దర్శించిన ఋషులు కవులు. సర్వ ప్రపంచాన్ని దర్శించే ప్రజ్ఞారూపుడైన వేద వేద్యుడు పరమాత్మ కవి.

మంత్రము, ఋషి, పరమాత్మ – అని మూడు అర్థాలు 'కవి' శబ్దానికి ఉన్నాయి. ఈ మూడూ శ్రీవిష్ణువే కనుక 'కవి' నామ వాచ్యుడు.

ఇంద్రియాతీత దర్శనం, సర్వ వ్యాపక దృష్టి 'క్రాంత దర్శనం'. ఆ దర్శన శక్తి కలవాడు **'కవి'. "కవిః క్రాంతదర్శీ"** అని శాస్త్ర నిర్వచనం. సర్వద్రష్ట అయిన (సహస్రాక్షః) విష్ణువును మించిన ద్రష్ట లేరని వేదమే చెప్పింది. **"నాన్యతోస్తి ద్రష్టా", "అజరః కవిః"** (శ్రుతివాక్యాలు).

2. అదేవిధంగా **"కవిర్మనీషీ పరిభూః స్వయంభూః"** అని యజుర్వేదం

స్పష్టం చేసింది. 'విద్వాంసుడు (అఖండ జ్ఞాన స్వరూపుడు) సర్వవ్యాపకుడు, తనకు తానే కారణమైనవాడు పరబ్రహ్మ.'

3. 'కవి' అయిన విష్ణువు కర్తగా తనను తాను ప్రకటించుకున్న కావ్యం'వేదం'.

దేవస్య పశ్య కావ్యం నమమార నజీర్యతి. (అథర్వవేదం)

జగత్తు కూడా విష్ణుకవి రచించిన కావ్యం. జగత్తు వేదమయం. శబ్దరూప కావ్యం వేదం. దృశ్య రూప కావ్యం జగత్తు. జగద్విజ్ఞానమే వేద విజ్ఞానం. అందుకే వేదానికీ, విశ్వానికీ అభిన్నత.

జగద్రూప, వేదరూప కావ్య నిర్మాత విష్ణువే కవి. **"కవిం పురాణమనుశాసితారం"** -అని గీతలో శ్రీకృష్ణుని స్తుతించాడు అర్జునుడు.

4. **'కుఙ్అవ్యక్తే శబ్దే'** అనే అర్థాన్ని అనుసరించి

'కవతేఽవ్యక్తం శబ్దం కరోతి -కవిః'.

ఇతరులకు వ్యక్తము కాని శబ్దమును కలిగించువాడు 'కవి'.

వేదము ఇంద్రియాదులచే లభ్యంకాని అవ్యక్త శబ్దం.

అపౌరుషేయం. అది పరమేశ్వరరూపం. కనుక అది కవి – అతడు కవి.

ఇంకొక భావనలో – వీచే గాలీ, సాగే నది, పశుపక్ష్యాదులు ధ్వని చేస్తూనే ఉన్నాయి. అనాది కాలంగా ఉన్న అవ్యక్త ధ్వని. వాటికి కంఠాది సాధనలు, భాషాది స్వరూపములు లేవు కనుక అవి అవ్యక్తములు.

ఆ అవ్యక్త శబ్దరూపుడై విశ్వమంతా నినదించే శబ్దబ్రహ్మ విష్ణువు కవి.

5. వ్యక్తమునకు మూలం అవ్యక్తం. ఆ అవ్యక్త ధ్వని నుండే వ్యక్త ధ్వనులు వస్తాయి. అందుకే వ్యక్తమయ్యే వైఖరీ వాక్కుకి వెనుక మధ్యమా, పశ్యంతీ, పరా... అనే మూడు దశలున్నాయి.

'పరా' అవ్యక్తం. దాని తరువాత పశ్యంతీ, మధ్యమా... ఒకదాని కంటే ఒకటి కొంత కొంతగా వ్యక్తమవుతూ, వైఖరీ పూర్ణ వ్యక్త స్వరూపమవుతుంది. ఇలా వ్యక్త శబ్దానికి మూలమై పరావాక్ స్వరూపునిగా భాసిస్తున్న పరమేశ్వరుడు కవి.

చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుర్బ్రహ్మణా యే మనిషిణా ।
గుహాత్రీణి నిహితా నేఙ్గయన్తి తురీయం వాచో మనుష్యా వదన్తి ॥
(ఋక్ – అథర్వ)

పరా, పశ్యన్తి, మధ్యమా, వైఖరీలలో మొదటి మూడు లోపలి వాక్కులు. (అవ్యక్తాలు). నాలుగవది వెలుపల వాక్కు.

'పరా' నద్యాది ప్రవాహాలలో, శిలలలో; పశ్యన్తి పక్షులలో; మధ్యమా పశువులలో; వైఖరీ మనుష్యులలో ఉంటాయి. ఇలా విశ్వమంతా వ్యాపించిన శబ్దస్వరూపుడు.

ఆత్మా బుద్ధ్యా సమేత్యార్థాన్ మనో యుంక్తే వివక్షయా ।
మనః కాయాగ్ని మాహన్తి సప్రేరయతి మారుతం ॥
మారుతస్తూరసి చరన్ మంద్రం జనయతి స్వరమ్ ॥ (పాణినీయ శిక్ష)

"ఆత్మచైతన్యము బుద్ధితో కలసి అర్థములను ప్రయోగింపమని మనసును యోజన చేస్తుంది. మనసు శరీరగత అగ్నిని రగుల్చుతుంది. ఆ అగ్ని వాయువును ప్రేరేపిస్తుంది. ఆ వాయువు వక్షస్థలంలో చరించుతూ మంద్రముగా స్వరాన్ని పుట్టిస్తుంది". ఇలా వాక్కులకి మూలమైన ఆత్మచైతన్యమే విష్ణువు కవి.

దీనిని భావిస్తే –

వాక్కులకి మూలమై ఉన్న అవ్యక్తుడు (అవ్యంగుడు) ఆత్మ రూపమైన పరబ్రహ్మయే. కనుక ఆత్మయే కవి.

ఇలా వేద రూపంగా భాసించే సర్వ వేత్త, సర్వద్రష్ట – లోక, దేవ ధర్మాలను అధిష్ఠించి దర్శించి శాసిస్తున్నవాడు కనుక–

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః।
చతురాత్మా చతుర్వ్యూహ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః॥... 15

133. లోకాధ్యక్షః, **134.** సురాధ్యక్షః, **135.** ధర్మాధ్యక్షః,
136. కృతాకృతః **136.** చతురాత్మా, **138.** చతుర్వ్యూహః
139. చతుర్దంష్ట్రః, **140.** చతుర్భుజః ॥

లోకాధ్యక్షః ..133

1. లోకములను పాలించువాడు.

   'అధి–' శబ్దానికి అధిష్ఠించువాడు, అక్షశబ్దానికి (అక్ష్ణూ వ్యాప్తౌ) వ్యాపించువాడు, దర్శించువాడు అని అర్థాలున్నాయి.
   గోచరాగోచరాత్మకమైన సమస్తలోకములందు అధివసించి వ్యాపించి 'సాక్షి'గా సర్వమును పరికిస్తూ పాలించే ప్రభుత్వం పరమేశ్వరునిది.
   ఈ పాలనలో సర్వము ప్రభువునకు గోచరిస్తూనే ఉంటుంది. పాలింపబడేది వేరుగా, పాలించేవాడు వేరుగా ఉండడం కాకుండా పాలించబడే లోకములందు, ప్రత్యణువూ తానే అధివసించి వ్యాపించి ఏలుకొనే సమర్థుడు విష్ణువు.
   "వదన్తి జగతోఽధ్యక్షం అక్షరం పరమం ప్రభుం" అని శ్రుతి.
   'యత్ర... చ సర్వేలోకాః ప్రతిష్ఠితాః' (అథర్వ)

2. 'లోకములు' అంటే లోకన (జ్ఞానమును దర్శింపజేయు) ధర్మముగల వేదాది విద్యలు అనే అర్థాన్ని గ్రహిస్తే, వెనుక చెప్పిన వేదాది శాస్త్రములకు పాలకుడు –అని వ్యాఖ్యానించవచ్చు.
   లోకస్వామి అయిన అతడే లోకనిర్వహణకు నియమితులైన దేవతలను కూడా శాసిస్తున్న కారణంగా–

సురాధ్యక్షః.. 134

1. లోకపాలురైన దేవతలకు అధ్యక్షుడు.

లోకముల నేలే స్వామి భూతాదులను నియమించేందుకు తన శక్తులతో దేవతల నేర్పరచి, వారిని అధివసించి గమనించే పాలకుడు.

2. 'సుర'లు అంటే 'దానశీలురు' అని అర్థం ఉంది.

సుష్ఠురాతి దదాతి – శ్రద్ధయా సూక్ష్యారాతి – సురః.

సమృద్ధిగా (లోభం లేకుండా), శ్రద్ధగా ప్రేమపూర్వకంగా ఇచ్చువారు – దేవతలు. జల, కాంతి, వాయ్వాదులను ప్రసాదించే వరుణ సూర్య పవనాదులందరూ దానశీలురే. అందుకే వారు సురలు.

అంతేకాక – సృష్టిలో దానశీలముగలవారు మహోన్నతులు. విష్ణు విభూతి గలవారిలో దానశీల స్వభావముంటుంది. విశ్వమంతా దానాదానాలతో (ఇచ్చి పుచ్చుకొనడాలతో) సాగుతోంది. ఈ దానవ్యవస్థను సాగించే ప్రభువు శ్రీవిష్ణువు సురాధ్యక్షుడు.

దాతలలోకెల్లా గొప్పవాడతడే. ఇహపర సౌఖ్యాలను, కైవల్యాన్ని ప్రదానం చేసే మహాదాత – దాతలకే దాత – దాతృత్వానికి అధ్యక్షుడు.

శతహస్త సమాహార సహస్రహస్త సంకిర॥ (అథర్వ)

అనంత హస్తాలతో అనంతంగా ప్రపంచమంతా బహుసంపదలను అందించే దైవము.

ఆ ఇచ్చుట కూడా వారి వారి కర్మల కనుగుణంగా, ధర్మాధర్మముల పరికించి ఇచ్చువాడు–

ధర్మాధ్యక్షః .. 135

1. ధర్మములకు అధ్యక్షుడు. ధార్మికులకు ప్రభువు.

ప్రతి వారి ధర్మాధర్మములను పరిశీలించి, తగిన ఫలమిచ్చు వాడతడు. దేవతలకు, ప్రకృతిలోని వివిధ భూతాదులకు విహిత ధర్మాలు నిర్దేశింపబడి

ఉన్నాయి. లోక, దేవ ధర్మాలన్నిటినీ గమనించేవాడు- ధర్మాధ్యక్షుడు. చేసిన కర్మలు పూర్తవుతాయి. వాటికి ఫలములు మనకు తెలియని ఈశ్వర శక్తి నుండి లభిస్తాయి. అలా సర్వ ధర్మములకు ఫల ప్రదాత ఆ పరమేశ్వరుడే.

2. పృథివ్యాదులను ధారణ చేసి వ్యాపించి గమనించేవాడు అనే అర్థాన్ని కూడా ఈ నామానికి గ్రహించవచ్చు.

లోకములు- దేవతలు - ధర్మములు - ఈ మూడు విశ్వంలో పరస్పరాధారితాలు. ఈ మూడింటికీ ఏకైక పాలకుడు ఆ పరమాత్మయే. **"స దాధార పృథివీం ద్యాముతేమాం"** అని యజుర్వేదం.

దేహంలో ఏ ఇంద్రియాలకు ఏ ధర్మముండాలో ఆ ధర్మం ఉంటూనే- సర్వేంద్రియాలు ఒకే ఉనికితో ఏకమై ధరింపబడుతున్నాయి. విశ్వంలో విభిన్న ధర్మములు పాటించే భిన్న భిన్న పదార్థములు, ప్రాణికోటి ఒకే ఉనికిని ఆధారం చేసికొని ఉన్నాయి. ఆ శాశ్వత సత్తా (ఉనికి) యొక్క ధారణ చేతనే జగత్తు సాగుతున్నది. ఆ తత్త్వమే విష్ణువు. కనుక ధర్మాధ్యక్షుడు. ఇన్ని చేస్తున్నా, ఏమీ చేయనట్లుగా భాసించే నిస్సంగుడైన కారణంగా-

కృతాకృతః..136

1. చేసినవాడూ, చేయనివాడూ ఆయనే.

కార్యము కృతం (చేయబడినది). కారణం అకృతం (చేయబడనిది). కార్యకారణాలు రెండూ ఆయనే కనుక కృతుడూ, అకృతుడూ కూడా అతడే.

2. 'కృతం'- చేయబడినది. అకృతం- చేయబడనిది.

అంటే కృతం భూతకాలాన్ని, అకృతం భవిష్యత్ కాలాన్ని చెబుతుంది. ఇది భూతము, ఇది భవితవ్యమూ అనే విభజన 'వర్తమానం' ఉన్నప్పుడే పొసగుతుంది. ఈ కారణంగా - 'కృతాకృతః' అనేది కాలస్వరూపుడైన విష్ణువునకు నామం.

ఈ నామాలను పరిశీలిస్తే "లోక-దేవత-ధర్మం-కాలం" వీటితో కూడిన

విశ్వాన్ని పాలించే విష్ణువీతడు అనే చక్కని క్రమం కనిపిస్తుంది.

3. 'సూర్యోదయం జరిగింది' అంటే అది కృతం. అయితే నిజానికి జరిగిందా? అది భూగోళ భ్రమణం వల్లనే జరిగినట్లు కనిపిస్తున్నది కానీ సూర్యునికి ఉదయాస్తమయాలు లేవు. అలాగే విశ్వంలో కృతముగా భాసించేదంతా, అకృతముగానూ కనిపిస్తుంటుంది. లోతైన ఆలోచనాశక్తితో గమనిస్తే ప్రపంచమంతా కృతాకృతాల జాలం.

"మాయా కల్పిత దేశ కాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం" – అని శంకరులు చెప్పినది ఈ కృతాకృతమైన పరమేశ్వర లీలనే. ఈ నామం "సర్వమూ ఆయన లీల" అని స్పష్టీకరిస్తుంది.

"కృష్ణస్తు లీలామయః"

యశోదాదులకు శిశువుగా, గోపికలకు మహానాయకునిగా, దుర్యోధనాదులకు పాండవుల పక్షపాతిగా, పాండవులకు తమ హితునిగా గోచరించిన శ్రీకృష్ణుడు నిజానికి దేనికీ అంటని యోగీశ్వరుడు.

ఈ లీలామయత్వమే కృతాకృత తత్త్వం.

వారి వారి భావనలకు, ధర్మాలకు ఫలాన్ని అనుసంధానించే ప్రభువు రాగ ద్వేషాదులకతీతుడు.

తస్య కర్తారమపి మాంవిద్ధి అకర్తారమవ్యయమ్॥ (భగవద్గీత)
యత్రాదిత్యాశ్చ రుద్రాశ్చ వసవశ్చ సమాహితాః।
భూతం చ యత్రభవ్యం చ సర్వేలోకాః ప్రతిష్ఠతి॥
యతః సూర్య ఉదేత్యస్తం యత్ర చ గచ్ఛతి।
తదేవ మన్యేహం జ్యేష్ఠం తదు నాత్యేతి కించన॥

అనే అథర్వ వాక్యాలు దేవ-కాల-లోక-ధర్మాదులకు అధ్యక్షుడై కూడా సర్వాతీతుడైనవానిని తెలియజేస్తున్నాయి.

4. 'కృతః' అనేది కర్మనిష్ఠ కలిగిన ప్రవృత్తి ధర్మం.

'అకృతః' అనేది నివృత్తి ధర్మం. ఈ రెండు రూపాల ధర్మాలకు నియామ

కుడు.'అకృతుడై' ఉంటూనే లోక- వేద- ధర్మాది కృత్యాలను నిర్వహిస్తున్న విష్ణువు - ఆ నిర్వహణకై నలువైపుల, నాలుగు విధాల వ్యాపించిన కారణంగా-

చతురాత్మా .. 137

1. నాలుగు విధాలుగా వ్యాపించువాడు.
   అతతీతి - అతనోతీతి-ఆత్మా. 'వ్యాపించునది' అని అర్థం.
   విశ్వాన ప్రాణకోటిని 'ఉద్భిజ్జ, స్వేదజ, అండజ-జరాయుజ'- అని నాలుగు రకాలుగా విభజించారు. ఈ నాలుగు విధాలైన ప్రాణి కోటి యందు వ్యాపించిన వాడు చతురాత్మ.
2. 'నాలుగు వేదాలుగా వ్యాపించిన జ్ఞానస్వరూపుడు' అని కూడా భావించవచ్చు.
3. జీవ చైతన్యంగా జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయ (మెలకువ, కల, గాఢనిద్ర, యోగ సమాధి) అనే నాలుగు అవస్థలందు మారనివాడు -వ్యాపించువాడు.
4. **"పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతందివి"**
   "త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః పాదోస్యేహా భవాత్పునఃా"
   పరమ పురుషునికి ఈ విశ్వమంతా నాలుగవ అంశమే. మిగిలిన మూడు భాగములు అమృత స్థితిలో కైవల్యముగా ఊర్ధ్వమునందున్నవి.
   ఈ విశ్వభాగము, అటుపైనున్న మూడు భాగములు కలిపి పూర్ణ నారాయణతత్త్వం. అది అనంతం.
5. నాలుగు దిక్కుల వ్యాపించువాడు.
6. ప్రాణం నాదమై శబ్దమై వ్యాపించినది - అనే శాస్త్రానుసారం, మనలో శబ్ద బ్రహ్మ (వాక్కు) పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అని నాలుగు విధముల ఉన్నది. శబ్ద స్వరూపుడైన నారాయణుని ఈ చతుర్విధ

వాక్స్వరూపునిగా దర్శించే నామమిది. ఇందులో నాలుగవది వైఖరి. అదే అందరికీ శ్రవణ గోచరమయ్యే మాట. మిగిలిన మూడు రహస్యంగా ఉన్నవే. ఇది కూడా "త్రిపాదూర్ధ్వ ఉదైత్..." వంటి మంత్రాలకు మరోవిధమైన వాఖ్య.

ఈ భావాలన్నిటినీ వ్యక్తం చేసే వేద మంత్రం–

పరీత్య భూతాని పరీత్య లోకాని
పరీత్య సర్వాః ప్రదిశోదిశశ్చ ।
ఉపస్థాయ ప్రజాపతిః ప్రథమజా ఋతస్యఆనాత్మానమభి సం వివేశ।

(యజుర్వేదం)

7. విశ్వం సృష్టి స్థితి లయాత్మకం. ఈ మూడు పనులు చేయడానికి ముగ్గురు మూర్తుల మూల చైతన్యమైన పరబ్రహ్మ (ఆ పరబ్రహ్మయే ఈ విష్ణుసహస్రనామాలలో ప్రస్తావితమైనది) నాలుగు విధముల విభూతులుగా వ్యక్తమైనాడని 'విష్ణు పురాణం' వర్ణించింది.

బ్రహ్మోదక్షాదయః కాలస్తథైవాఖిల జన్తవః।
విభూతయో హరే రేతా జగతస్సృష్టి హేతవః।।
విష్ణుర్మన్వాదయః కాలస్సర్వభూతాని చ ద్విజ।
స్థితేర్నిమిత్త భూతస్య విష్ణో రేతా విభూతయః।।
రుద్రః కాలోన్తకాద్యాశ్చ సమస్తాశ్చైవ జన్తవః।
చతుర్థా ప్రలయాయైతా జనార్దన విభూతయః।।

అ) సృష్టి హేతువులైన విభూతులు: బ్రహ్మ, దక్షాది ప్రజాపతులు,కాలం, సకల భూతములు.

ఆ) స్థితి హేతువులైన విభూతులు: విష్ణువు, మన్వాదులు, కాలము, సర్వభూతములు.

ఇ) ప్రళయ హేతువులైన విభూతులు: రుద్రుడు, అన్తకాదులు, కాలము, సమస్త భూతములు.

8. సృష్టిలో గ్రహాదులు, స్థావర జంగమాదులు, మానవులు – నాలుగు వర్ణాలుగా (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా) విభక్తమై ఉన్నాయి. సాత్త్విక, రాజస, రాజస+తామస, తామస అనే చతుర్విధ గుణాలతో అన్ని సమాజాలలోనూ, విశ్వమంతా, ప్రతి భూత వర్గంలోనూ ఈ వర్ణ విభజన ఉంటుంది. ఇది స్వాభావికం.

విడిగా కనబడుతున్నా, విశ్వరచనా ప్రయోజనం కోసం ఒకే పరమేశ్వరుడు ఈ నాలుగు విధాలుగా ఆయా జీవులయందు ప్రకాశిస్తున్నాడనీ, ఇలా నాలుగింటిగా ఆయనే వ్యాపించి ఉన్నాడనీ ఏకత్వ సమన్వయాలను ఈ 'నామం' చెబుతోంది.

యత్ పురుషం వ్యదధుః కతిధా వ్యకల్పయన్।
ముఖం కి మస్యకౌబాహూకా ఊరూ పాదా ఉచ్యేతే।।
బ్రాహ్మణోస్య ముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః।
ఊరూ తదస్య యద్ వైశ్యః పద్భ్యాగ్ం శూద్రోఽజాయత।।

(యజుర్వేదం)

ఈ నాలుగు వర్ణాలను ఒకే విరాట్పురుషుని దేహంగా వర్ణించడంలోనే, ఇవన్నీ సమన్వయింపబడి, దైవస్వరూపాలనే దివ్యభావన స్పష్టమౌతోంది.

9. కృత త్రేతా ద్వాపర కలి యుగాలనే నాలుగు భాగాలతో కూడిన కాలస్వరూపుడు.

10. బ్రహ్మ విష్ణు రుద్రాత్మకుడై మూడుగా వచ్చిన మూల తేజం పరమాత్మ. ఆ పరమాత్మను నారాయణునిగా దర్శిస్తూ 'చతురాత్మా' అని కీర్తించారు. ఈ విధముగా నాలుగు విధాల విభూతులతో సృష్టి స్థితి లయలను నిర్వహిస్తున్న పరమాత్మ 'చతురాత్మా'.

నాల్గు విధాల వ్యాపించే నాలుగు రకాల వ్యూహాలు స్వామి రూపాలు–

చతుర్వ్యూహః .. 138

1. నాలుగు విధములైన వ్యూహాస్వరూపుడు.

   వి-ఊహా = వ్యూహ. 'ఊహ వితర్కే' -అనే అర్థాన్ని అనుసరించి "విశిష్టమైన విచారణ (జ్ఞానం)" అని అర్థం. ఇదే జ్ఞానం. ఈ జ్ఞానం విశ్వనిర్వహణ జ్ఞానం. ఒక పని నిర్వహించాలంటే చేసే పథక రచన 'వ్యూహం'.చతురాత్మగా నలు దిశలా, నాలుగు రకాలుగా, వ్యాపించి, తన పథక రచనతో విశ్వ నిర్వహణ చేస్తున్నాడు.

   ఈ నాలుగు విధములైనవన్నీ ఎలా ఉండాలి, ఎలా పనిచేయాలి అనే ప్రణాళికలను ఏర్పరచే విశ్వరచనా పథకమది.

2. సృష్టి నిర్వహణకు సంబంధించిన నాలుగు వ్యూహములు కృష్ణుని నాలుగు పేర్లుగా వ్యాసదేవుడు పేర్కొన్నాడు.

   వ్యూహాత్మానం చతుర్ధావై, వాసుదేవాది మూర్తిభిః।
   సృష్ట్యాదీన్ ప్రకరోత్యేష విశ్రుతాత్మా జనార్దనః॥

   వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, సంకర్షణ- అని చతుర్వ్యూహ మూర్తులు. బ్రహ్మాండ రూపంలో, సృష్టిలో, బ్రహ్మాండాతీత పరతత్త్వంగా, ***ప్రళయకాలంలోనూ నశించని*** నిర్గుణ బ్రహ్మగా భాసించే నాలుగు వ్యూహాలివి. వాసుదేవుడు పరమమై ఉండగా, ప్రద్యుమ్నుడు వేద స్వరూపుడై, అనిరుద్ధుడు శక్తిగా, సంకర్షణుడు జ్ఞాన రూపునిగా భాసిస్తున్నారని కొందరి దర్శనం. అధిష్ఠాన చైతన్యం వాసుదేవునిగా, ఇచ్ఛాశక్తి ప్రద్యుమ్ననిగా, క్రియాశక్తి అనిరుద్ధునిగా, జ్ఞానశక్తి సంకర్షణునిగా భాసిస్తున్నారని ఇంకొందరి దర్శనం. ఎలా విభజించినా నాలుగు విధములైన విభజనలతోనున్న ఏక చైతన్యమది- అనేది అసలు సారాంశం. ఆ సారస్వరూపమే చతుర్వ్యూహాత్మకుడైన నారాయణుడు.

3. చర, స్థిర, ద్విస్వభావ...అనే విభాగం ప్రకారం- రాశిచక్రం నాలుగు వ్యూహాలతో ఉన్నది.

	1	2	3	4
చరరాశి-	మేష	మకర	తులా	కర్కటక
స్థిరరాశి-	వృషభ	కుంభ	వృశ్చిక	సింహ
ద్విస్వభావరాశి-	మిథున	మీన	ధను	కన్య

ఇలా చతుర్వ్యూహాలతో కూడిన రాశిచక్రాలలో సూర్యసంచారం ద్వాదశమాసాత్మక సంవత్సర కాలాన్ని ఏర్పరుస్తుంది.

ఈ సంవత్సర కాలస్వరూపుడు- చతుర్వ్యూహాత్మకుడు.

నాలుగు వ్యూహాలతోనున్న స్వామి తన ధర్మశాసనం తప్పినవారిని నలు దిక్కుల గ్రహించి శిక్షించగల ధురంధరుడు-

చతుర్దంష్ట్రః.. 139

1. నాలుగు దంష్ట్రలు (కోరలు) కలవాడు.

'దంష్ట్ర' అనేది హింసించే శక్తిని తెలియజేస్తుంది. కొరికి నమిలే హింసా లక్షణం వల్ల వాడియైన దంతాలకు 'దంష్ట్ర' అని పేరు. పదునెక్కి ఉంటాయి కనుక 'కోరలు' అని వ్యవహరింపబడతాయి.

క్రింది పలు వరసలో రెండు, పై పలు వరసలో రెండు (మొత్తం నాలుగు) మిగిలిన దంతాల కన్నా వాడిగా ఉంటాయి. సింహాల లాంటి జంతువులలో అవి పెద్దవిగా ఉంటాయి.

విష్ణువు నరసింహాకృతిగా అవతరించాడు. నాలుగు కోరల ఆ నరసింహస్వరూపమే ఈ నామంలో భావించబడుతోంది.

2. అగ్నితత్త్వాన్ని సూచించే జ్వాలా నారసింహ ముఖమది. యజ్ఞాగ్ని కూడా కుండములో నలు దిక్కుల జ్వలించి ఆహుతులను స్వీకరిస్తోంది. సమస్త లోకాన్ని గ్రసించే కాలాగ్ని ముఖం కూడా ఇదే గుణాన్ని సంకేతిస్తోంది. విశ్వరూపుడై సందర్శనమిచ్చిన పరమాత్మ వదనం కాలానలముగా ప్రకాశిస్తూ, దంష్ట్రలతో ఉన్నదని అర్జునుడు వర్ణించి కీర్తించాడు.

దంష్ట్రా కరాళాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానల సన్నిభాని,
దిశోనజానే నలభేచ శర్మ
ప్రసీద దేవేశ! జగన్నివాస!

ఆ కాలాగ్ని వదనం నుండి ఏ ఒక్కరూ తప్పించుకోలేరు. నాలుగు దిక్కులలో ఎటువైపు నుండి పారిపోనీయకుండా చుట్టు ముట్టగలిగే నాల్గు కోరల కాలముఖమది. దుష్ట శిక్షణలో నిపుణుడైన ఆయన నెవరూ తప్పించుకోలేరు.

3. కొనదేలిన దంష్ట్రలనే శృంగాలుగా భావిస్తే **"చత్వారి శృంగాః"** అనే వైదికమైన ప్రణవ రూప వృషభ వర్ణన స్ఫురిస్తుంది. 'ఓంకార స్వరూపుడు' అని దీని అర్థం.
(అ, ఉ, మ, తురీయనాదం – ఇవే చతుశ్శృంగాలు)

4. ఉత్తమ సాముద్రిక లక్షణాలు గల పురుషుని 'చతుర్దంష్ట్రః' అని వర్ణించింది సాముద్రిక శాస్త్రం. ఆ ప్రకారంగా నారాయణుని సగుణమైన సుందరాకృతులు సర్వసులక్షణ సంపన్నాలు కనుక 'చతుర్దంష్ట్రః' సముచితం.
విష్ణ్వవతారమైన శ్రీరామచన్ద్రుని వర్ణిస్తూ "శ్రీమద్రామాయణం"లోని సుందరకాండలో హనుమంతుని వచనం–
చతుర్దశ సమద్వన్ద్వః చతుర్దంష్ట్రః చతుర్గతిః।
"సమానమైన 14 జంట అవయవాలు కలవాడు (కనుబొమ్మలు, కన్నులు, నాసాపుటాలు, కర్ణాలు, పెదవులు...మొదలైన 14 జంట అవయవాలు ఎగుడు దిగుడు లేకుండా సమంగా కలవాడు)– ***రెండు పలు వరసలలో పైన, దిగువున (చివరి పలు పరుసకీ, నడుమ దంతాలకీ మధ్య) రెండేసి చొప్పున పదును తేలిన నాలుగు దంతాలు కలవాడు*** – సింహ శార్దూల గజ వృషభాల నడకను బోలిన గంభీర గతి కలవాడు (చతుర్గతిః).
పరిపూర్ణ సౌందర్యమయమైన దివ్యమంగళ విగ్రహుడైన నారాయణాకృతిని వర్ణించే నామంగా దీనిని దర్శించవచ్చు.
ఆ సౌందర్యస్వరూపం నాల్గు చేతులతో అలరారుతోంది.

చతుర్భుజః .. 140

1. నాలుగు భుజములు కలవాడు.

   నారాయణుని దివ్యమంగళ విగ్రహం చతుర్భుజాలతో శోభిస్తోంది. శంఖ చక్ర గదా పద్మాలు ధరించిన దివ్య స్వరూపమది. దేవకీ వసుదేవులకు ఈ రూపంలోనే సాక్షాత్కరించి శ్రీకృష్ణునిగా అవతరించాడు స్వామి.

   తమద్భుతం బాలక మంబుజేక్షణం
   చతుర్భుజం శంఖ గదాద్యుదాయుధమ్. - అని 'భాగవత' వర్ణన.
   చతుర్భుజ ముదారాఙ్గమ్ చక్రాద్యాయుధ భూషణమ్।।

   అని విష్ణుపురాణం వర్ణించింది.

2. **'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః।**
   ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్।।

   అని గీతా వాక్యం. "అగ్ని స్వరూపుడనై ప్రాణుల దేహంలో ఉండి ప్రాణాపాన వాయువుల ద్వారా ప్రజ్వరిల్లి వారి చతుర్విధాహారములను (భక్ష్య భోజ్య లేహ్య చోష్యాదులను) భుజిస్తున్నాను."

   "సోగ్రభుగ్విభజన్ తిష్ఠన్ ఆహారమజరః కవిః"

   మనం గ్రహించిన ఆహారాన్ని తొలుత స్వీకరించేదతడే.

   భునక్తీతి భుజః. నాలుగు విధములైన వాటిని భుజించువాడు అనే అర్థంలో ఈ వ్యాఖ్యానం యుక్తం.

3. చతుర్విధాలుగా ఉన్న జగత్తును భుజించినవాడు.

   'కాలోస్మి లోకక్షయకృత్-' కాల స్వరూపుడై చతుర్విధ సృష్టిని లయమొందించే పరమపురుషుడు 'చతుర్భుజుడు'.

4. 'సహస్ర' సంఖ్యకు 'అనంతం'అనే అర్థమున్నది.

   "సహస్రబాహో భవవిశ్వమూర్తే" అని కీర్తించబడిన స్వామి 'చతుర్భుజునిగా భాసించడమేమిటి?' అనే సందేహం కలగవచ్చు. సహస్రం అనంతత్వ సంకేతం. ఇది 'వృత్తం' వంటిది. వృత్తం అనంత

భుజి. చతురస్రం చతుర్భుజి.

జ్యామితి గణితం ప్రకారం వృత్తము వ్యాపిస్తే చతుర్భుజమౌతుంది. వ్యాపకమే విష్ణుత్వం.

అనంతమైన స్వామి నాలుగు దిక్కులా వ్యాపించి (క్రిందుగా, మీదుగా, ఇరు ప్రక్కలా) చతుర్భుజుడయ్యాడు.

నలు దిక్కులా ఉన్నది తానేనని ప్రకటించడమే చతుర్భుజత్వం.

దిక్కుల అవధులను దాటిన పరమ చైతన్యమే (వృత్తం), దిక్కుల అవధులలో ఒదిగినట్లుగా భాసిస్తోంది. ఈ తత్త్వానికే చతుర్భుజాలు సంకేతం.

"తిర్యగూర్ధ్వ మధశ్శాయీ" అని మంత్రపుష్పం ఈ తత్త్వాన్ని వర్ణించింది.

ఈ నాలుగు చేతులతోనే జీవులకు చతుర్విధ పురుషార్థాలను ప్రదానం చేస్తున్నాడు.

6. నాలుగు దిక్కులకు సంకేతాలుగా అమర్చిన చతురస్ర హోమకుండంలో సర్వదేవతాత్మకునిగా భాసించే యజ్ఞాగ్ని చతుర్భుజుడు. ఈ నాలుగు నామాలలో ('చతురాత్మ' నుండి 'చతుర్భుజః' వరకు) ఈ యజ్ఞాగ్ని తత్త్వాన్నే గ్రహించవచ్చు. ఒక వైపు నుండి విష్ణుసహస్రమంతా వైదిక యజ్ఞ సంకేతాల శాస్త్రమని తొలుతనే చెప్పుకున్నాం.

చతుర్భుజ సీమలలో నిండి జ్వలించే పరమేశ్వర చైతన్యమిది. యజ్ఞేశ్వరుడైన **(యజ్ఞోవై విష్ణుః)** ఆ జ్వలత్తేజోమూర్తిని ఈ నామంతో భావించవచ్చు.

ఈ నాలుగు నామాలలో నాలుగు విధాలుగా సర్వవ్యాపక సర్వశాసక తత్త్వమైన విష్ణువును గ్రహిస్తే, అంతా ఆయన వెలుగేనని తెలుస్తుంది.

కనుక –

భ్రాజిష్ణుర్భోజనం భోక్తా సహిష్ణుర్జగదాదిజః।
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః॥... 16

41. భ్రాజిష్ణుః, **142.** భోజనమ్, **143.** భోక్తా,
144. సహిష్ణుః, **145.** జగదాదిజః, **146.** అనఘుః
147. విజయః, **148.** జేతా, **149.** విశ్వయోనిః, **150.** పునర్వసుః

భ్రాజిష్ణుః..141

1. ప్రకాశించు స్వభావము కలవాడు.

   "ప్రకాశైక రసత్వాత్". కేవల జ్ఞానస్వరూపుడు కనుక ప్రకాశాత్మకుడు.

   "నక్షత్రాణిరూపమ్" (శ్రుతి)

   నక్షత్రాది జ్యోతిర్మండలాలలో జ్యోతిస్సుగా, ప్రతివారిలో చైతన్యంగా ప్రకాశించునదాతడే.

   సూర్యరూపంలో కేవల కాంతిగా భాసించువాడు.

2. స్వామి దివ్యరూపము, అనంత కల్యాణ గుణములు దాగకుండా, ప్రస్ఫుటంగా పరిపూర్ణంగా ప్రకాశించే లక్షణం కలవి.

   విశ్వరూపాన్ని వర్ణిస్తూ...

   దివిసూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా॥

   "వేలకొలది సూర్యులు ఒక్కసారిగా వెలిగినంత తేజస్సు"తో సాక్షాత్కరించాడని భగవద్గీత వర్ణన.

   "జాజ్వల్యమాన వపుషా దివ్యాభరణ భూషితం" అని భీష్ముడు కృష్ణస్వరూపాన్ని స్తుతించాడు.

   బ్రహ్మ సూర్యసమం జ్యోతిః॥
   సూర్యోజ్యోతిః జ్యోతిస్సూర్యః॥

   -అని యజుర్వేదం సూర్యసమతేజస్సుగా బ్రహ్మమును వర్ణించింది.

అంతటా ప్రకాశించుటచే ప్రకృతిరూపంగా అనుభవింప బడుతున్నాడు. పోషణకారకుడౌతున్నాడు కనుక-

భోజనమ్ .. 142

1. భుజింపదగిన (అనుభవింపదగిన) ప్రకృతిగా - మాయగా ఉన్నవాడు.

తినే ఆహారమే కాక, అనుభవించబడేది కూడా భోజనమే.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులను శ్రోత్ర, త్వక్, నేత్ర, జిహ్వ, నాసికలు స్వీకరిస్తున్నాయి. వీటితో ఇంద్రియాలు పోషింపబడుతున్నాయి. ఉనికిని కలిగి ఉన్నాయి. ఇలా దేహాదుల ఉనికికి ఆధారమైన ప్రకృతియంతా శబ్ద రూపాది లక్షణ చైతన్యంగా భాసించే పరమాత్ముని చైతన్యమే.

ఉపాసకులకు ఆనందంగా అనుభవానికి లభించే జ్ఞానస్వరూపుడు సచ్చిదానంద విగ్రహుడు.

దేనిని ఆశ్రయించి, ఆధారంగా స్వీకరించి బ్రతుకున్నామో అది మనకు భోజనం. సర్వాధారుడు విష్ణువే కనుక అతడు అందరి భోజనం.

'అహం దాశుషే విభజామి భోజనమ్' (ఋగ్వేదం)

భోజనంలో ఉన్న పోషక, రక్షక, ఆధార శక్తులు శ్రీవిష్ణుని స్వరూపాలే. సృష్టిలో ఒకదాని కొకటి భోజనం.

భోజనాన్ని స్వీకరించి అనుభవించే చైతన్యం కూడా హరిస్వరూపమే. ఆయన అనుగ్రహం లేకుండా అనుభవించే శక్తియే లేదు. అందుకే ఆయన-

భోక్తా .. 143

1. అనుభవించు పురుషుడు.

ప్రకృతిలోని శబ్ద స్పర్శాదులను (భోజనాన్ని) ఇంద్రియాల ద్వారా అనుభవించే జీవచైతన్యమాతడే.

పురుషః ప్రకృతిస్థోహి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ - అని గీతావాక్యం.

పురుషుడు ప్రకృతి యందున్నవాడై ప్రకృతి వలన పుట్టిన గుణాలను అనుభవిస్తున్నాడు.

'అన్నం బ్రహ్మ– భోక్తా చ బ్రహ్మ' అనే మంత్రాలు ప్రకృతి–జీవ– రూపాలలో భాసించే పరమాత్మను వర్ణిస్తున్నాయి.

'భ్రాజిష్ణుః' అనే నామం పరమాత్మను, *'భోజనం'* ప్రకృతినీ, *'భోక్తా'* జీవుని తెలియజేస్తున్నాయి. ఈ మూడూ నారాయణుడేననే ఏకత్వం ఈ నామాల వరుసలో ఉంది.

2. వండేవాడే తింటున్నాడు. 'వంట దాని కర్తయందు ప్రవేశిస్తోంది'– అని వేదం.

'పక్తారం పక్వః పునరావిశతి' (అథర్వ)

సర్వజగత్తును లయింపజేసుకుంటున్నాడు కనుక జగద్భోక్త అతడే. సముద్రము నుండి ఉత్పన్నమయ్యే జలాలు గల నదులు తిరిగి సముద్రంలోనే కలియునట్లుగా, ఆయన నుండి ఆవిర్భవించిన జగము ఆయనలోనే లీనమౌతోంది. **"ప్రకృతిం పురుషంచైవ"** అనే మాటను గమనిస్తే– అనిత్యమైన ప్రకృతిని (భోజనాన్ని) స్వీకరిస్తున్న నిత్యుడు 'భోక్తా' అని స్పష్టమౌతోంది. రెండింటిగా ఉన్నది ఆతడే.

3. సర్వయజ్ఞ తపస్సులను స్వీకరించే సర్వలోకాధిపతి ఆతడే. యజ్ఞాదులన్నీ ఆయననుద్దేశించి చేసేవే.

"భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరం" యజ్ఞతపస్సులకు భోక్త భగవానుడేనని గీతాప్రమాణం.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యాప్రయచ్ఛతి।
తదహమ్ భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః॥

"భక్తులు సమర్పించే పత్ర, పుష్ప, ఫల, జలాదులను అవి భక్తితో ఇచ్చినవి కనుక, నేను స్వీకరిస్తున్నాను" అని గీతాచార్యుని మాట.

అలా భక్తులు ప్రీతితో ఇచ్చిన నైవేద్యాలను స్వీకరించువాడు. విదురార్పితమైన

విందు, కుచేలుడిచ్చిన తండులాలు, శబరిచ్చిన నివేదన, అనేక భక్తుల జ్ఞానుల సర్వ సమర్పణలను స్వీకరించువాడు – 'భోక్తా'.
సర్వమునకు ఆధారమై, సర్వమును స్వీకరించువాడాతడే కనుక– ఆధారంగా, స్వీకర్తగా అన్నిటినీ సహిస్తున్నవాడని స్పష్టమౌతోంది. అందుకే ఆయన–

సహిష్ణుః : 144

1. సహనశీలుడు.
సహించే స్వభావము కలవాడు.
అనంత స్వరూపునిగా సర్వవిశ్వమును సహిస్తున్నవాడు.
అన్నిటినీ భరించాలన్నా (భోజనం), లోనికి స్వీకరించాలన్నా (భోక్తా) వాటిని సహించే శక్తి ఉన్న వానికే సాధ్యం.
అదే విధంగా – సర్వమును ధరించి పాలించువాడు.
భూమిని సహనానికి పేరుగా చెబుతుంటాం. ఇటువంటి భూమ్యాదులను సహించువాడు.
నాక్షస్తప్యతే భూరి భారః –అని 'ఋగ్వేదం' ఆయనకు మించిన సహనశీలుడు లేడని చెబుతోంది.
2. భక్తుల అపరాధాదులను సహించువాడు– క్షమించి కరుణించువాడు కనుక "సహిష్ణుః". స్వభావరీత్యా సహన లక్షణం కలవాడు స్వామి. అందుకే "క్షమస్వ" అని ఆయనను వేడుకుంటున్నాం.
సృష్టిలో ప్రతి వస్తువులోనున్న సహన లక్షణం విష్ణ్వంశ సంభూతం. ధర్మాచరణలో, సాధనలలో, చివరకు లౌకిక ఫలసిద్ధి కోసం చేసే ప్రయత్నాలలో కూడా 'సహనం' అవసరం. మాతృమూర్తికి శిశువును భరించి, పోషించడంలో సహనం ఉంది. ఒక మహాతపస్వి సాధనలో అకుంఠితమైన సహనం ఉంది. ధర్మానికి సహనం ప్రధాన లక్షణం. దైవీ గుణాలతో దీపించే మహాత్ములలో సహనం అనేది ప్రధానం.

విష్ణ్వనుగ్రహంతో లభించే విష్ణుతేజమది.

"తేజః క్షమా ధృతిః శౌచం" వంటివి దైవీగుణాలని గీతావచనం.

"క్షమయా పృథివీ సమః" అని శ్రీరాముని వర్ణించారు.

సహించే శక్తినిమ్మని వేదమంత్రం ఆ సహిష్ణుని ప్రార్థించింది.

"సహోసి సహోమయిధేహి" – యజుర్వేదం.

"ఓజోసి సహోసి" వంటి వేదవాక్కులు పరమాత్మను 'సహన' స్వరూపునిగా పేర్కొన్నాయి.

3. ఎదుర్కొనే శక్తి లేనివాడు, సహించక ఏం చేస్తాడు? అని ఒక లౌకిక భావన. కానీ నారాయణుని సహనం అలాంటిది కాదు.

ఉత్తమునికి ధర్మాచరణలో సహనం ఎంత ఉంటుందో, అధర్మ విషయంలో అసహనమూ, ఎదుర్కొని తిరస్కరించి అణచే లక్షణమూ అంతే ఉంటుంది. **"క్షమయా పృథివీ సమః"** అనే వాక్యానికి ముందే **"కాలాగ్ని సదృశః క్రోధే"** అనే మాట ఉంది (శ్రీమద్రామాయణం). క్రోధంలో కాలాగ్నివంటివాడు అని అర్థం. ఈ రెండూ పరస్పర విరుద్ధంలా కనబడినా, రెండింటినీ సమన్వయించడమే 'సహిష్ణుత'.

'సహిష్ణువు' అనే శబ్దానికి తిరస్కరించువాడు–ఎదుర్కొనువాడు అనే అర్థముంది. హిరణ్యాక్ష రావణాదుల ప్రతాపాన్ని ఎదుర్కొని సంహరించిన ప్రతాపశాలి. సహనం పరాక్రమ లక్షణం కూడా.

అచలమైన ఈ సహన స్వరూపుని వల్లనే చలనాత్మక జగత్తు ఆవిర్భవించి సాగుతోంది కనుక అతడు–

జగదాదిజః... 145

1. జగత్తునకు ఆదియందున్నవాడు (కలిగినవాడు).

జగత్తునకు పూర్వమే ఉన్న ఆతడు– హిరణ్యగర్భునిగా తొలుత ఆవిర్భవించాడు– కనుక 'జగదాదిజుడు'.

గమనశీలమైనది జగము. దానికి ఆదియందున్న శాశ్వత సత్యం విష్ణువు. త్రిమూర్తులకు మూలమైన పరబ్రహ్మ –అని కూడా భావం. జగత్కారణ కారణుడు.

బ్రహ్మ జజ్ఞానం ప్రథమం పురస్తాత్ –అని 'యజుర్వేదం'.

ఆ పరబ్రహ్మ యొక్క జ్ఞానమే జగమునకు ప్రథమము.

వస్తునిర్మాణానికి ముందే నిర్మాత ఉన్నట్లుగా, జగమునకు పూర్వమే ఉన్న సర్వకారణుడు.

"అది రాదికరోహ్యంతః" ఆది, ఆదికారకుడు, నాశనకారకుడు 'మొదట ఉండి, మొదలు పెట్టి, తుది చేయువాడు' అని. ఇందులో మొదలు పెట్టే తత్త్వాన్ని ఈ నామం భావిస్తోంది.

లోకాదుల నిర్వహణ కోసం ఇంతపని పెట్టుకున్నా, వీటి వికారేలేవీ అంటని నిర్దోషస్వభావుడు కనుక–

అనఘుః .. 146

1. పాపము–దోషము–లేనివాడు.

విశ్వాది సమస్త కృత్యములను నిర్వహిస్తున్నా, పూర్ణజ్ఞాన స్వరూపుడైన శుద్ధుడు కనుక నిత్యనిర్మలుడు.

శుద్ధం అపాపవిద్ధమ్– "యజుర్వేదం"

నైన మంహోఽశ్నోత్యంతితో న దూరాత్– ॥ (యజుర్వేదం)

సూర్య కిరణాలు బురదపై, మలిన పదార్థాలపై పడినా కిరణాలకు ఆ వికారాలంటవు. మలినం సోకదు. సూర్యునిలోని విష్ణుత్వానికి ఇది ఒక తార్కాణం.

అంతటా విష్ణు చైతన్యం వ్యాపించినా అది నిత్య శుద్ధము. ఆకాశం నుండి కురిసే వర్షం ఆకాశాన్ని తడుపలేదు.

"సూక్ష్మత్వాత్ ఆకాశం నోపలిప్యతే"

సూక్ష్మమైన దానిని ఏదీ అంటదు. పంచభూతాలలో అత్యంత సూక్ష్మమైనది ఆకాశం కనుక- దాని యందే అన్నీ ఉన్నా దేని వికారమూ దానికంటలేదు. ఆకాశం కన్నా సూక్ష్మమైన తత్త్వం నారాయణబ్రహ్మము. కనుక అది అత్యంత శుద్ధం. **"అపహతపాప్మా"** అని శ్రుతి వర్ణించింది.

2. **'భుఞ్జతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్"** స్వార్థం కోసం వండుకొనే వారు పాపాన్నే భుజిస్తున్నారని గీతాచార్య వచనం. స్వార్థపరత్వం వల్ల పాపం వస్తుంది. స్వార్థ త్యాగమే యజ్ఞం. ఆ యజ్ఞమే విష్ణువు. విశ్వ నిర్వహణ తన స్వార్థం కోసం చేస్తున్న పని కాదు. అపారకారుణ్య విశేషమే. విశ్వాన్ని యజ్ఞంగా నిర్వహిస్తున్న నిత్యయాజ్ఞికుడు- ఆ యజ్ఞమే తానైనవాడు. కనుక నిత్యశుచి-నిత్య శుద్ధుడు. ఆ నిర్మలుని గోచరింపజేసుకొనడానికి మనమూ దోషరహితులం కావాలి. శుద్ధతత్త్వాన్ని నిర్దోషస్థితికి చేరుకున్నవాడే అందుకోగలడు. అందుకే శుద్ధి కోసం సాధన చేయాలి. దోష (పాప) నాశన క్రియలే సాధనలు. వాటికి విజయాన్నిచ్చే మహాశక్తి కూడా ఆ పరిపూర్ణుడే కనుక-

విజయః .. 147

1. విశేషముగా గెలుచువాడు. విజయస్వరూపుడు.
జ్ఞాన వైరాగ్య ఐశ్వర్యాదులచే ప్రపంచాన్ని (ప్రకృతిని) జయించినవాడు. తన నుండి ఉద్భవించిన మాయకు తాను లోబడడు. మాయకి అంటనివాడు 'అనఘుడు' -మాయను తనకు వశం చేసుకున్నవాడు 'విజయుడు'. స్వామి చేపట్టిన కార్యములు సఫలమై జయాన్ని సాధించి తీరతాయి. విజయం ఆయన స్వభావము. కార్యావరోధాలే శత్రువులు. ఆధ్యాత్మిక రంగంలో సాధనలకు అవరోధాలైన అరిషడ్వర్గాదులను జయించడం ముఖ్యం. విజయ స్వభావుడైన హరిని ఆశ్రయించినవారికి ఈ విజయం తథ్యం.
అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహణమే జయ, విజయులు. ఈ రెండూ

సాధించినవారికే విష్ణు సన్నిధి.

విజయం తరువాత జయాన్ని తెలిపే నామం-

జేతా.. 148

1. అన్నింటిపై జయాన్ని సాధించేవాడే అన్నింటినీ పాలించగలడు. దేనికీ లొంగక అన్నింటినీ వశమందుంచుకున్న జేతయే నేత కాగలడు. దేవాదులను కూడా మించి ప్రకాశించి, వారిని తన ఇచ్ఛానుసారం నియంత్రించే పాలకుడు శ్రీమన్నారాయణుడు.

'జితం జితంతే జిత యజ్ఞభావన

త్రయీమయీం త్వాం పరిధున్వతే॥

- అని భాగవతం 'జితాజితములన్నిటినీ వశం చేసుకొనగలిగే యజ్ఞ భావనుడూ, వేదమయుడూ అయిన శ్రీహరిని కీర్తించింది. *(బ్రహ్మకృత యజ్ఞ వరాహస్తుతి)*

సంపూర్ణ జయాన్ని సూచించే 'జేతా' శబ్దం అధర్మ శిక్షకుడై ధర్మ రక్షకుడైన హరిని తెలియజేస్తూనే, సచ్చిదానందమయత్వముచే అన్నిటినీ (మించి) అతిశయించినవాడు అనే భావాన్ని వ్యక్తం చేస్తోంది. "విజయం చేశారు" అనే వాడుక ఉంది. ఇది అందరినీ ఏలుకొనే ఈశ్వరునికే వర్తిస్తుంది. ఆయనను జయించగలిగే వారు లేరు. అధర్మ శిక్షణకు అవతరించి విజయం సాధించే అవతారాలన్నీ, విశ్వంలోని ప్రకృతిని అధిష్ఠించి తద్వారా స్వీకరించినవే. ఇలా ఒక విధంగా విశ్వమే తనకు కారణంగా గలవాడు కనుక-

విశ్వయోనిః .. 149

1. విశ్వమే తనకు కారణముగా కలవాడు.

నిజానికి విశ్వానికి తాను కారణమనే అర్థం 'విశ్వయోని' శబ్దానికి ఉంది.

ఆ అర్థాన్ని 117వ నామం ద్వారా చెప్పుకున్నాం. ఆ శబ్దానికి ఇప్పుడీ అర్థం గ్రహించాలి. రెండూ సరిపోయినవే.

విశ్వము తన నుండి వ్యక్తం చేసిన పరమాత్మ, మనకు విశ్వముద్వారా వ్యక్తమౌతున్నాడు. విశ్వమునకు తాను కారణమై, మరల విశ్వమును తనకు కారణంగా చేసుకొని వివిధావతారములుగా వ్యక్తమైన వాడు.

'ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా'

"నా ప్రకృతిని అధీనం చేసుకొని, నా మాయ ద్వారా నేను సంభవిస్తున్నాను" అని గీతలో చెప్పిన వాక్యానికి భావమిదే.

2. విశ్వము దేనిలో లీనమౌతుందో అదే 'విశ్వయోనిః'. ఆది -అంతములలో ఉన్నది కారణావస్థ. ఒక కడలి కెరటం ఉత్పన్నమై (సృష్టి) కొంత సేపు నిలచి (స్థితి) తిరిగి అంతరిస్తుంది (లయం). ఎక్కడి నుండిప్రారంభ మయిందో, అక్కడే అంతమౌతుంది. ఆ కారణావస్థయే ఆద్యంతాలలో శాశ్వతం. అదే 'విశ్వయోని' స్థానం. ఆ లయ స్థానాన్ని సూచించే నామమిది. అద్యంతాలలో ఉన్న మారని తత్త్వం నారాయణ బ్రహ్మము.

సర్వకారణుడైన శ్రీహరి తాను మారనివాడై, మారుతున్న వాటిని వీడకుండా వ్యాపించుటచే-

పునర్వసుః .. 150

1. మాటి మాటికి వసించువాడు.

   క్షేత్రజ్ఞ రూపంతో పునః పునఃమాటి మాటికి) క్షేత్రాలయందు వసించువాడు (ఉండువాడు).

2. యుగయుగాలకీ, వివిధ కల్పాలకీ జరిగే పునః సృష్టులలో వ్యాపించేవాడు.

   సూర్యాచన్ద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్।
   దివం చ పృథివీం చాన్తరిక్షమథో స్వః॥ (యజుర్వేదం)

   మునుపటి వలె (వెనుకటి కల్పాలలో వలె) బ్రహ్మ సూర్యచన్ద్ర పృథివీ

అంతరిక్షాలను ఏర్పరచాడని వేదం. అలా ఏర్పడిన వాటి యందు మళ్ళీ వ్యాపించి నడిపించేవాడు.

3. 'వసుః' అంటే సంపద. ఈ చరాచర విశ్వంలో కొరత లేకుండా పునఃపునః సంపదల రూపంలో ప్రకటితమౌతున్నాడు. ఎంత దయామయుడు స్వామి! మన కోసం పృథివి నుండి స్థల, జల, సస్య, వృక్షాదులను మాటి మాటికి కలిగిస్తున్నాడు. సూర్యచంద్ర పర్జన్యాదులను దినదినానికి, ఋతుచక్రాన్ని ప్రతి ఏడాదికీ కలిగిస్తూ లోటు లేని విధంగా పునఃపునః సంపదలను ఉత్పత్తి చేస్తున్నాడు. ఈ పునర్వసు లక్షణం చేతనే జగమంతా నడుస్తోంది.

ఇన్ని విధాల ప్రాణులకు సైతం యుగయుగాలుగా తరుగుదల లేని సంపత్తిని పదే పదే కలిగించే ప్రాకృతిక వ్యవస్థను ఏర్పరచిన కరుణాళువు ఈతడు.

4. నక్షత్రాదులన్నీ నారాయణ తేజో విశేషాలు కనుక, 'పునర్వసు' నక్షత్రాన్ని ఇక్కడ పేర్కొన్నారు. **'సంభవామి యుగే యుగే'** ధర్మరక్షణ కోసం మాటి మాటికి అవతరించే స్వామి పునర్వసు నక్షత్ర తేజస్సులో తన ప్రత్యేక విభూతిని ప్రకాశింపజేస్తున్నాడు.

జ్యోతిర్మండలంలో అదితి దేవతా స్వరూపమైనది పునర్వసు. అదితి దేవమాత. దేవతా తేజస్సుకు మూలమైన విష్ణు తేజం అదితి (ఛేదించుటకు వీలు లేని అఖండ తేజం). దీని నుండి ఇన్ద్రాది దేవతలు ఆవిర్భవిస్తున్నారు. ఈ దేవతా తత్త్వమునకు ఆదియైనవాడు గనుక పునర్వసు స్వరూపుడు.

అదితీ కశ్యపులే కౌసల్యా దశరథులు. అదితీ తేజస్వరూపుడై దేవతలను కాచుటకు శ్రీహరి పునర్వసు నక్షత్రాన శ్రీరామచన్ద్రుడై ఆవిర్భవించాడు. ఈ సంబంధం కూడా దేవ రక్షణకు ఉద్భవించిన స్వామిని సూచిస్తుంది. ఈ అదితీ దేవికే అంతకు ముందే వామనుడై అవతరించాడు. కోల్పోయిన స్వర్గాదులను తిరిగి ఇన్ద్రునకు ఇచ్చి, 'పునఃi'(మళ్ళీ) దేవతలను వారి వారి స్థానాలలో వసించేలా చేసినవాడు. ఈ విషయాన్నే తరువాతి నామాలు స్మరిస్తున్నాయి–

ఉపేన్ద్రో వామనః ప్రాంశురమోఘుః శుచిరూర్జితః।
అతీన్ద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః॥... 17

151. ఉపేన్ద్రః, **152.** వామనః, **153.** ప్రాంశుః, **154.** అమోఘుః,
155. శుచిః, **156.** ఊర్జితః, **157.** అతీన్ద్రః, **158.** సంగ్రహః
159. సర్గః, **160.** ధృతాత్మా, **161.** నియమః, **162.** యమః॥

ఉపేన్ద్రః .. 151

1. ఉప+ఇన్ద్రః. ఇన్ద్రుని (సోదరునిగా) చేరినవాడు.
   'ఉప' సమీపే. ఉపగతః (దగ్గరకు చేరుట) అని అర్థం.
   బలి చక్రవర్తిచే కబళించబడిన ఇన్ద్ర లోకాన్ని, తిరిగి ఇన్ద్రునకు అప్పగించడానికి విష్ణ్వనుగ్రహం కోసం అదితీ దేవి తపస్సు చేసింది. కశ్యపుని ద్వారా దీక్షను పొంది వ్రతానుష్ఠానం చేసిన అదితి (దేవమాత)ని అనుగ్రహించి విష్ణువు వామనునిగా అవతరించాడు. అలా ఇంద్రుని సోదరునిగా ఉద్భవించి ఇన్ద్రునికి తిరిగి స్వర్గైశ్వర్యాన్ని ప్రసాదించిన హరి ఉపేన్ద్రుడు.
2. అదితి కుమారులు ఆదిత్యులు. వీరే దేవతలు. వీరిలో ఇంద్రాది దేవతలు 12 గురు ప్రధానులు. వీరిలో చివరివాడు విష్ణువు. 'చివరివాడు' అనగానే 'చిన్నవాడు' అని అర్థం కాదు. 'చివర' అంటే లక్ష్యం, గమ్యం. ఒకటి పూర్ణమవడంతో చివరిదవుతుంది. అఖండ భగవచ్ఛక్తి పూర్ణత్వమైన విష్ణువు. 'ఇక ఆతనిని మించి ఎవరూ లేరు. అదే తుది' అని దీని భావం.

   ఈ భావం 'హరివంశం' చెబుతూ–

   మమోపరియథేన్ద్రస్త్వం స్థాపితో గోభిరీశ్వరః ।
   ఉపేంద్ర ఇతి కృష్ణ త్వాం గాస్యంతి భువి దేవతాః ॥

   "ఇంద్రుడనైన నాపై ఇన్ద్రుడవు నీవు. నాకు 'ఉపరి' (పైన ఉన్న) ఇన్ద్రుడవు. కనుక ఉపేన్ద్రుడవు. వేదములు నిన్ను నాపై ఈశ్వరునిగా కీర్తించాయి.

అందుకే దేవతలు నిన్ను ఉపేన్ద్రుడని కీర్తిస్తున్నారు".

3. ఎవరి సన్నిధి (ఉప) చేత, ఇంద్రియ చైతన్యములు పని చేస్తున్నాయో ఆ ఆత్మయే ఉపేన్ద్రుడైన విష్ణువు.
4. బహువిధములుగా భాసించే సూర్యచైతన్య (సౌరశక్తి) విశేషాలను దేవతలుగా సంభావించి, వేద హృదయాన్ని పరిశీలిస్తే ఈ నామాల వరుస కూడా 'సౌరశక్తి'నే ప్రకటిస్తుంది. ఈ వివరం 'ఇన్ద్రాది' నామాల వ్యాఖ్యానం వద్ద గ్రహించవచ్చు.

వామనః .. 152

1. పొట్టివాడు.
   ఉపేన్ద్రునిగా అవతరించిన నారాయణుడు వామనరూపంలో (పొట్టివడుగై) బలిని యాచించడానికి వెళ్లాడు. **'బలిం వామన రూపేణ యాచితవాన్'.**
2. అత్యంత సూక్ష్మమైనవాడు.
   ఇన్ద్రియాది చైతన్యములన్నిటికీ మూలమైన ఆత్మ అత్యంత సూక్ష్మమైనది. **"పీతాభాస్వత్కణాపమా. తస్యాः శిఖాయా మధ్యే పరమాత్మావ్యవస్థితః"** -హృదయగతమైన సూక్ష్మ తేజः స్వరూపమే పరమాత్మ. అదే వ్యాపకమై బహుధా భాసిస్తోంది.
   "అణోరణీయాన్ మహతో మహీయాన్" -అణువు కంటె అణువై, మహత్తు కంటె మహత్తైనది. ఈ వేద వాక్యాన్ని ప్రత్యక్షం చేసిన అవతారం వామనావతారం.

   హృదయమధ్యంలో భాసించే ఆ పరమ చైతన్యం ద్వారా ఇన్ద్రియ చైతన్యాలు పనిచేస్తున్నాయి. ఈ ఇంద్రియాలన్నిటినీ కలిపి ఒక చైతన్యంగా భావిస్తే ఇన్ద్రుడు. దీని నుండి విడివిడిగా ఒక్కొక్క ఇంద్రియాన్ని చెప్తే దేవతలు. వీరందరికీ మూలమైన ఆత్మ విష్ణువు.

"మధ్యేవామన మాసీనం విశ్వేదేవా ఉపాసతే"-

అని మన్త్రవర్ణం. "హృదయమధ్యంలో ఉన్న వామనుని (అత్యంత సూక్ష్మరూపుని) విశ్వేదేవతలు ఉపాసిస్తున్నారు" -అనే ఈ దివ్య వాక్యానుసారం, దేవతలందరిచే ఉపాసింపబడేవాడు.

ఇంద్రియాల నుండి లెక్కవేస్తే ఒక్కొక్క దానిని దాటి ఆత్మ వద్ద ఆగుతాం. మరి దానిపైన ఏదీ లేదు. ఆత్మ సన్నిధి (ఉప) చేత ఇన్ద్రియాలు చైతన్య వంతమవుతాయి.

3. **'టువమ్ ఉద్గిరణే'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి **వమ్యతే అనేన ఇతి వమనమ్. వమన్త్యస్మిన్నితి వా వమనమ్.**

వమన ధర్మముగలవాడు వామనుడు.

వమనము అంటే వెలికి పంపుట. యజ్ఞాత్మకుడైన పరమాత్మ విష్ణువు. ఆయన నుండి సర్వకర్మలు, సర్వజ్ఞానములు వెలికి వచ్చినవి. కనుక ఆయన 'వామనుడు'. నదులు మొదలైనవి జలములను వెలిగ్రక్కునట్లుగా, సర్వవ్యాపకుడైన విష్ణువు నుండి సనాతనముగా వివిధ జ్ఞానమయమైన జగత్కర్మలు ప్రకటింపబడుతున్నాయి.

"తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే" మొదలైన శ్రుతి వాక్యాలు చెప్పే విశేషమిదే.

4. **'వా' వికల్పార్థే. మన జ్ఞానే -మను అవబోధనే.**

'వా' -అనే శబ్దము వికల్పార్థకము. 'వివిధములుగా కల్పించుట' అని భావం. 'మనః' శబ్దానికి 'జ్ఞానము'-అని అర్థం. "వివిధములైన సృష్టి విశేషాలను కలిగించే జ్ఞాన స్వరూపుడు - వామనుడు.

ఏకంగా ఉన్న పరమాత్మయైనా అనేకంగా (వివిధములుగా) భాసించేది ఈతడే.

ఒకే అగ్ని బహువిధములుగా, ఒకే జలం అనేక రకములుగా, ఒకే వాయువు పంచప్రాణాదులుగా శరీరములలోనూ, సృష్టిలోనూ కూడా పనిచేస్తున్నాయి.

ఒకే వృక్షము అనేక కొమ్మలుగా, ఫలాలుగా గోచరిస్తోంది. ఈ వికల్ప జ్ఞానం సృష్టియందంతా వ్యాపింపజేసిన చైతన్యస్వరూపుడు 'వామనుడు'.

ఒకడై వచ్చినవాడు మూడడుగులతో విశ్వాన్ని ఆక్రమించే బహుజ్ఞాన సంపన్నుడు. ఒకడు మూడై ప్రకాశించే తత్త్వమే విశ్వమంతా ఉన్నది. ఒకే అగ్ని మూడు విధములుగా ప్రకాశించినట్లుగా. ఈ విశేషమే వామనావతారంలో ప్రత్యక్షమయ్యింది.

'ఏకస్త్రేధా విహితో జాతవేదః సమ్యగేనం ధేహి సుకృతాము లోకే'

(అథర్వవేదం)

'ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్' (ఋగ్వేదం)
త్రిభిః పద్భిర్ద్యామరోహత్ పాదస్యేహా భవత్ పునః (అథర్వ)
నమో హ్రస్వాయ చ వామనాయ చ (యజుర్వేదం).

అతి సూక్ష్మంగా గోచరిస్తూనే, అనేకంగా వ్యాపించువాడు కనుక- అతి విస్తృతి కలిగిన మహోన్నతుడు-

ప్రాంశుః .. 153

1. అత్యంత ఉన్నతుడు. పొడగరి.

వామనునిగా బలి వద్దకు వెళ్ళిన హరి, మూడడుగుల నేలను దానమడిగి దానధారను హస్తంతో గ్రహించగానే ఒక్కసారిగా త్రివిక్రముడై గోచరించాడు. ఈ త్రివిక్రమత్వం అప్పటికప్పుడు స్వామి ప్రదర్శించినది కాదు. ముల్లోకాలను ఎల్లప్పుడూ ఆక్రమించిన పరమేశ్వరుడతడే.

.**'ఈశావాస్యమిదం సర్వం' 'త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః"** - అని శ్రీహరి సర్వవ్యాపకత్వం, విరాట్పురుషత్వం సహజం. దానినే ఇప్పుడు బలికి గోచరింపజేశాడు.

'బలి' అనేది తన బలమే సమస్తమనుకునే అహంకారానికి సంకేతం. ఇది ఆసురీప్రవృత్తి. మమకార సమర్పణా భావమే 'దానం'. దీనితో

విశ్వమంతా ఆయనేనని తెలుస్తుంది. అలా అంతర్బహిర్జగత్తులనీ, వ్యష్టి-సమష్టి ప్రపంచాలనీ ఆక్రమించి ఉన్నది ఆయనేనని తెలిశాక... తన బుద్ధిగతమైన జీవాహంకారం స్వామికి అర్పణమై, సర్వం నారాయణుడే నని తెలుస్తుంది. అదే "సర్వం బ్రహ్మమయం జగత్" అనే సత్యస్ఫురణ. దానిని కలిగించిన అనుగ్రహస్వరూపమే వామనావతారం.

బలి హస్తోదకాన్ని విడిచినంతనే స్వామి 'ప్రాంశు'వయ్యాడు.

ఆ ప్రాంశు రూపవర్ణన :

"తోయే తు పతితే హస్తే వామనోభూదవామనః
సర్వదేవ మయం రూపం దర్శయామాస వై ప్రభుః॥
"భూః పాదౌ ద్యౌశ్శిరశ్చాస్య చన్ద్రాదిత్యా చచక్షుషీ"

"వామనుడు అసామాన్యుడయ్యాడు. సర్వదేవమయమైన తన రూపాన్ని ప్రదర్శించాడు". "భూమి పాదమై, దివి శిరస్సై, చన్ద్రాదిత్యులు నేత్రములై గోచరించాడు".

వామనుడు దివికి ఎదుగుతుండగా-

ఇంతితై వటుడింతయై మరియు తానింతై నభోవీధిపై
నంతై తోయద మండలాగ్రమునకల్లంతై ప్రభారాశిపై నంతై...

-అని పోతనగారు వర్ణించారు.

తస్య విక్రమతో భూమిం చన్ద్రాదిత్యౌస్తనాన్తరే
నభః ప్రక్రమమాణస్య నాభ్యాంతౌ సమవస్థితౌ।
దివ మాక్రమమాణస్య జానుమూలే వ్యవస్థితౌ॥

-అని 'హరివంశ' వర్ణన.

"వామనుడు భూమిని విక్రమిస్తుండగా- చన్ద్రసూర్యులు వక్ష స్థలంలో గోచరించారు. ఆకాశంలో ఆక్రమించినప్పుడు నాభిస్థానంలో కనిపించారు. ద్యులోకంలో వ్యాపించినప్పుడు జానుమూలంలో ఉన్నారు. ఈ వర్ణనను ఆధారంగా గ్రహించి, సూర్యమండలం ఆదిగా కిరీటమై అటుపై క్రమంగా

శ్రవణాభరణమై, కంఠాభరణమై, కంకణమై, వడ్డాణమై, పాదనూపురమై, చివరకి పాదపీఠంగా భాసించిందని పోతనగారు ప్రాంశువిష్ణుని వర్ణించారు.

2. ప్ర- అశ్నుతే వ్యాప్నోతి -బాగా అంతటను వ్యాపించువాడు.
అణువు కంటె అణువైన పరమాత్ముడు విశ్వమంతా వ్యాపించి ప్రాంశువయ్యాడు.
"అణోరణీయాన్, మహతో మహీయాన్"
"అణువుకన్నా అణువు-మహత్తుకన్న మహత్తు" అని వేదం వర్ణించిన పరమ పురుషుడాతడు. ఈ రెండు విషయాలే "వామనః-ప్రాంశుః" అని కీర్తించబడ్డాయి.
సూక్ష్మంగా మొదలై స్థూలంగా విస్తరించే జగచ్చైతన్యం విష్ణుమయమని దీని భావన.

3. 'అంశుః' అనే శబ్దానికి కాంతి కిరణమని అర్థం.
'ప్ర-అంశు'- విస్తృతి కలిగిన కాంతి కిరణజాలములు గల తేజఃస్వరూపుడని కూడా దీనికి అర్థం.

4. అవ్యక్తమై,అత్యంత సూక్ష్మమైన నాదం - 'అ, ఉ, మ' అనే మూడు పదములుగా (స్థానములుగా) వికసించి ప్రణవ స్వరూపమై భాసించింది. ఆ సూక్ష్మనాదం - వామనం. త్రివిధములైన ప్రణవం-ప్రాంశువు. వామనుడై అవతరించి త్రివిక్రముడై సాక్షాత్కరించిన హరి ఏ కృత్యము చేసినా వృధాపోదు. అదే ఆ అవతారంలో సైతమూ నిరూపించాడు.

అమోఘుః .. 154

1. వ్యర్థముకాని వాడు.
నారాయణుని జ్ఞానముకానీ, కర్మకానీ వృధాపోవు. సర్వ దేశములందు సర్వ కాలములందు వ్యాపించిన వాడు కనుక అన్నీ తెలిసి వ్యర్థము కాని కర్మను ఆచరిస్తాడు. ఏ సంకల్పంతో వామనునిగా అవతరించి 'ఛలన'

లీలతో బలిదర్పాన్ని భంజించి, విక్రమించాడో– ఆ సంకల్పమూ, విక్రమమూ కూడా సార్థకమై అవతార పరమార్థాన్ని సాధించాయి. ఇలా తన అవతార కార్యాలను 'అమోఘుంగా' (వృథా కాకుండా) నిర్వహించినవాడు కనుక శ్రీహరి 'అమోఘుడు'.

2. **"అ–మోహః – అమోఘుః".** మోహరహితుడు.

బలిని అణచి, దేవతలను కాచుటలో మోహ సంబంధమైన రాగద్వేషాదులు లేనివాడు. విశ్వ నిర్వహణ వైఖరిలో ధర్మరక్షణ చేయడమే కానీ, ఒకరి పట్ల అనురాగమూ, ఇంకొకరి పట్ల ద్వేషము లేని సర్వసముడు నారాయణుడు. అందుకే బలిని అణచిన కృత్యంలో పక్షపాతాది మోహత్వము లేదు.

తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః॥ (యజుర్వేదం)

3. **'ముహ వైచిత్త్యే'** అని ధాత్వర్థాన్ని అనుసరించి, 'మోహ' శబ్దానికి జ్ఞానరాహిత్యమని అర్థం. సమగ్ర జ్ఞానస్వరూపుడు 'అమోఘుడు'. ఈ వామన లీలలో ఇన్ద్రుని అనుగ్రహించడంతోపాటు బలిని కూడా కరుణించి ఉత్తమోన్నత స్థితిని ప్రసాదించాడు. ఈ అపార కరుణయే స్వామి అమోఘులక్షణం.

ఏది చేసినా సమగ్ర జ్ఞానంతో ఆచరించువాడు. విశ్వంలో ప్రతి అణువూ విష్ణు విజ్ఞానాన్ని స్ఫురింపజేస్తుంది. ఏ ఒక్కరూ మార్చలేని ప్రశ్నించలేని భగవంతుని జ్ఞాన సంపత్తి ప్రకృతి యంతా పరచుకొని ఉంది. సర్వ జ్ఞానమయుడు గనుక అమోఘుడు.

మోహవికారము లేని వాడు కనుకనే అత్యంత నిర్మలుడని స్పష్టం–

శుచిః.. 155

1. పవిత్రుడు.

ఏ కర్మ చేసినా మోహాదులు లేక, రాగ ద్వేషాదుల కతీతుడైన వాడు కనుక నిత్యనిర్మలుడు.

ఇంద్రాదులకు వారి వారి ఆధిపత్యము లిచ్చి ఉపకారం చేసినా ప్రత్యుప కారమాశించని పరిపూర్ణుడు. ఏ వికారమూ లేని శుద్ధుడు.

బలిని వంచించుట దోషము కాదా? అనే అల్పజ్ఞానుల ప్రశ్నకి సమాధానమీ నామం. స్వామి కార్యం బాహ్యానికి వంచన వలె గోచరించినా, అది బలినీ, ఇన్నుదినీ, లోకాన్నీ ఏక కాలంలో అనుగ్రహించడమే. అందుకే అది దోషరహితం. కనుక శుచి.

2. **శుచిష్ట్వమసి ప్రియో న మిత్రో దక్షాయ్యో అర్యమేవాసి సోమ॥ ఋగ్వేదం॥ ... శుద్ధమపాపవిద్ధమ్॥ (యజుర్వేదం)**

– అని వేదమంత్రాలు పరమాత్మ శుచిత్వాన్ని కీర్తించాయి.

భగవత్కర్మలందంతటా శుచి, శుద్ధి గోచరిస్తుంది.

'అస్య స్పర్శశ్చ మహాన్ శుచిః' – అని శ్రుతి వాక్యం.

స్మరించువారినీ, పూజించువారినీ, స్తుతించువారినీ పవిత్రము చేయువాడు ఈతడే. స్వభావతః శుచియైన వాని స్పర్శ మనలను శుద్ధులనుగా మార్చుతుంది.

'అగ్నిః పవిత్రం సమాపునాతు' అని శ్రుతి తెల్పినట్లుగా పవిత్రమైనవాడు, పవిత్రులను చేయువాడు.

విశ్వమంతా ప్రాంశువై సర్వజ్ఞానములో వ్యాపించిన పవిత్రుని బలము అనూహ్యము కనుక –

ఊర్జితః.. **156**

1. బలస్వరూపుడు– ప్రాణ స్వరూపుడు.

వామనుడై కనిపించినవాడు త్రివిక్రముడై తన బల స్వభావాన్ని నిరూపించాడు. ఈ పరాక్రమత్వం పరిమితబలుడైన బలి అహంభావాన్ని భంజించింది. అపరిమిత బల పరాక్రమ సంపన్నుడైన త్రివిక్రముడు ఊర్జితుడు.

2. అపార బలస్వరూపుడై సర్వప్రాణులకు బలమునూ, ప్రాణమునూ ప్రదానము చేయువాడీతడే.

ఊర్జా దేవాం అవస్యోజసా త్వాం - ॥ఋగ్వేదం॥

ఊర్జాపిన్వస్య సమిషోదిదీహి న - ॥ఋగ్వేదం॥

ఊర్గస్యాంగిర స్యూర్ణం మ్రదా ఊర్జం మయిధేహి ॥యజుర్వేదం॥

బలమసి బలం మయి ధేహి ॥యజుర్వేదం॥

ఊర్జోబలం స ఓజో మ ఆగన్ ॥అథర్వ వేదం॥

సృష్టిలోనున్న పరాక్రమత్వాది విభూతులన్నీ విష్ణుని తేజోంశ సంభవములేనని గీతావచనం.

యద్య ద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జిత మేవవా।
తత్త దేవావ గచ్ఛత్వం మమ తేజోంశ సమ్భవమ్॥

ఈ అమోఘమైన నిర్మలమైన బలము గలవాడగుట చేతనే ఇన్ద్రాది దేవతలకు సైతము అసాధ్యమైన కర్మనాచరించువాడు- ఇన్ద్రునకు సోదరుడై అవతరించినా ఇన్ద్రుని సైతము అతిక్రమించి రాజిల్లినాడు-

అతీన్ద్రుఃఃః

అందరినీ అతిక్రమించిన (మించిన) సర్వశక్తిమంతుడైన ఇన్ద్ర స్వరూపుడైన నారాయణుడు అతీన్ద్రుడు. (వివరములు– ఇన్ద్ర నామం వద్ద వ్యాఖ్యానించ బడ్డాయి).

ఇన్ద్రాదులకు మించిన సర్వేశ్వరుడు కనుకనే అన్నిటినీ చక్కగా సమకూర్చువాడీతడే–

సంగ్రహః .. 158

1. **సమేకీభావేన గృహ్యతే–ధార్యతే ఇతి 'సంగ్రహః'.**
   అనేకమును ఏకీభావముగా గ్రహించువాడు.
   విశ్వమంతా అనేకములన్నిటినీ ఏకీభావముగా ధరించి, పోషించి,
   వ్యవస్థాపన చేయువాడు – సంగ్రహుడు.
   ఉదాహరణగా– అనేకములుగా ఉన్న అంగాలన్నీ 'శరీరం'లో ఏక భావంగా ధరింపబడుతున్నాయి. ఆహార రసం అన్ని అంగాలచే సమంగా గ్రహించబడుతోంది. అదే విధంగా అనాది కాలము నుండీ విశ్వమునందన్నిటినీ ఏకభావంతో పోషించే విశ్వవ్యాపకుడు శ్రీహరి.
   సూర్యాది గ్రహాలు విశ్వమును ఏక దృష్టితోనే గ్రహిస్తాయి.
   విశ్వం చేత గ్రహింపబడతాయి. ఆ విధమైన గ్రహణ శక్తి విష్ణుశక్తియే.
   యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః
   తిస్రో ద్యావస్త్రేధా ససురాపః॥ (ఋగ్వేదం)
   యత్ర విశ్వం భవత్యేకనీడమ్॥ (యజుర్వేదం)
   "ఎవనియందు విశ్వభువనాలు ఉన్నాయో", "అన్నీ ఎవనియందు ఒక్కటిగా గ్రహింపబడినాయో" ఆతడే పరమాత్మ.
2. బలిదానమును చక్కగా గ్రహించినవాడు
   – నిశ్శేషముగా సంగ్రహించిన వాడు.
3. భక్తులచే ఆనందముగా (సమగ్రంగా) గ్రహింపబడువాడు.

సేవింపబడువాడు. సంహారకాలంలో సమస్త విశ్వమును తనలోనికి చక్కగా గ్రహించువాడే బీజరూపముగా తనయందు నిక్షిప్తము చేయువాడు.

విశ్వాన్ని నిర్వహించే ఈ సంగ్రహశక్తి సృష్టియందు గోచరింపబడుతోంది. ఏకీభావంతో ధరించే విష్ణుశక్తియే సృష్టి స్వరూపం-

సర్గః .. 159

1. సృష్టి స్వరూపుడు, సృష్టికారణుడు.

   సర్వవ్యాపకుడు కనుక ఆ సంగ్రహస్వరూపుని యందు భాసించే సృష్టి విష్ణుమయమే.

   సర్వసృష్టికి మూలకారణ చైతన్యమాతడే.

2. బలికి చూపించిన త్రివిక్రమ స్వరూపంలో సమస్త భువనములను సంగ్రహశక్తిగా నిర్వహించి, సృష్టి చేసే విష్ణుతత్వమే భాసించింది.

3. భక్తానుగ్రహార్థం వామనాది రూపములుగా తనను తానే సృష్టించుకొనేవాడు - 'సర్గః'.

4. సృష్టి రూపంగా అంతటా వ్యాపించిన విష్ణువు- అని వేదం అనేక చోట్ల వర్ణించింది.

   అజాయమానో బహుధా విజాయతే (యజుర్వేదం)

   'జన్మరహితుడైనప్పటికీ అనేక విధములుగా కలుగువాడు'.

   ఇయం విసృష్టిర్యత ఆబభూవ

   యది వాదధే యది వా న॥ (ఋగ్వేదం)

   'దేని నుండి ఈ విధమైన సృష్టి ఆవిర్భవించిందో ఆతడే దీనిని ధరించువాడు- దేనికీ అంటనివాడు'.

   ఈ విధంగా సృష్టిని ధరించి వ్యాపించువాడు కనుక-

ధృతాత్మా .. 160

1. **ధృతం సర్వమాత్మనా యేన స ధృతాత్మా.**
   తన ధారణాత్మక శక్తితో సర్వత్ర ధరించువాడు.
   'స దాధార పృథివీం ద్యాముతేమాం' – అని యజుర్వేద మంత్రం.
   ఈ భావాన్నే వ్యక్తీకరించింది. సర్వజీవులను ధరించు ఆత్మ స్వరూపుడు.
2. విశ్వము నంతటినీ తాను నియమించినా, తనను నియమించు వాడెవడూ లేడు. తనకు తానే నియామకుడు (ధారకుడు). తనను తాను ధరించువాడు – ధృతాత్మా.
3. **శరీరం బ్రహ్మ ప్రావిశచ్ఛరీరేధి ప్రజాపతిః** (అథర్వ వేదం).
   శరీరంలో ప్రవేశించిన బ్రహ్మ సృష్టి పాలకుడై శరీరమును అధివసించి ధరించువాడు.
4. ఇన్ద్రుని, బలిని తత్తదుచిత స్థానములందు ప్రవర్తింపజేసిన విష్ణువు తనని తానే ధరించి, తనయందే సర్వమూ ధరించబడిన త్రివిక్రమ స్వరూపాన్ని దర్శింపజేశాడని ఈ నామం స్ఫురింపజేస్తోంది.
   ఈ విధంగా వామనాది అవతారాలను గైకొని వచ్చినప్పటికీ తనని తాను మరుగుపరచుకున్నట్లు కనబడినా, తన స్వస్థితి యందు తానున్న ధృతాత్ముడు.
   ఈ లీలాదులన్నీ విశ్వనియమాన్ని పాలింపజేయడానికే, విశ్వ నిర్వహణకు మూలమైన నియమములు ఆ స్వామి స్వరూపాలే కనుక–

నియమః .. 161

1. నియమించువాడు– నియమస్వరూపుడు.
   పంచభూతాలను, దిక్పాలకులను, గ్రహనక్షత్రాదులను, దేవతలను వారి వారి సముచిత స్థానములందు నియమించువాడు. ఎవరిని ఎక్కడుంచాలో అక్కడుంచే నియమ శక్తియే విశ్వవ్యాపక, విశ్వనిర్వాహక విష్ణుశక్తి.
   ఈ నియన్తృత్వ (శాసక) శక్తి కనుకనే ఇన్ద్రుని, బలిని ఆయా స్థానములందు

నియమించి, విశ్వ నియమాన్ని కాపాడేందుకు అవతరించాడు. ఈ నియమన శక్తిచే, నియమము తప్పినవారిని నిగ్రహించువాడు కనుక-

యమః .. 162

1. నిగ్రహించువాడు - అణచువాడు.
   విశ్వనియమాన్ని అతిక్రమించిన బలిని అణచినవాడు.
2. 'యముడు' అనేది కూడా విష్ణుశక్తి విశేషమే. ఈ విష్ణు విభూతిని గ్రహించి పుణ్యపాపాలను పర్యవేక్షించి, నిగ్రహించే దేవతా విశేషమే యముడు.
3. వేదం 'యమ' శబ్దాన్ని విశ్వనిర్వాహక ఈశ్వర చైతన్యంగా వర్ణించింది. ఇది పరబ్రహ్మ వాచకం.

   యమః పరివారో వివస్వాన్
   తతః పరం నాతి పశ్యామి కించన।
   యమో అధ్వరో అధిమేనివిష్టో
   భువో వివస్వానన్వాతతాన ॥ (అథర్వ)

   సౌరశక్తి విశేషమే యముడు. అందుకే సూర్యపుత్రునిగా అభివర్ణింపబడ్డాడు. 'ఆయనను మించిన శక్తి లేద'ని వేదం కీర్తించింది.

   యమం రాజానం హవిషా సపర్యత।। అని అథర్వమంత్రం.

   "యమ ఏతి రాజా" రాజ ధర్మంలో 'యమ' శక్తి ముఖ్యం. జగత్తును పాలించే నారాయణుడే యమశక్తి సంపన్నుడు.
4. యోగంలో యమనియమాది శక్తులను పేర్కొన్నారు.
   ఆ శక్తి విశేషాలు విష్ణు స్వరూపాలు.
5. **'యచ్ఛతీతి యమః"** సమస్తమును విరోధం లేకుండా అనుకూలంగా ఉండేటట్లు చేసి ఇచ్చేవాడు.
6. **యః పృథివీ మన్తరో యమయతి** (బృహదారణ్యకోపనిషత్తు)

"ఎవరు భూమియందుండి ప్రవర్తింపజేయునో" ఆతడే పరమేశ్వరుడు.
యమో వైవస్వతో రాజా యస్తవైష హృదిస్థితః॥ – అని మనుస్మృతి.
నియామకుడై సర్వకాలాలలోను సర్వమునందు ప్రకాశించు వాడు, సర్వజీవుల హృదయాలయందున్నవాడు.
ఈ శ్రుతిస్మృతులన్నీ పరమేశ్వరుని యమునిగా పేర్కొన్నవి.
ముముక్షువులు ఈ సర్వశాసక స్వరూపునే తెలుసుకోవాలని ప్రయత్నిస్తారు.
ఆ విధంగా యోగులచే, జ్ఞానులచే, వేదములచే తెలియబడువాడు–

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః।
అతీన్ద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః॥... 18

163. వేద్యః, **164.** వైద్యః, **165.** సదాయోగీ,
166. వీరహా, **167.** మాధవః, **168.** మధుః।
169. అతీన్ద్రియః, **170.** మహామాయః **171.** మహోత్సాహః, **172** మహాబలః

వేద్యః .. 163

1. తెలియ దగినవాడు, తెలియబడువాడు.
యమనియమాదుల ద్వారా ఈ జగమును వ్యవస్థీకరించు కర్మచే అందరూ పరమాత్ముని తెలుసుకోగలరు. ఈతనిని తెలుసుకొనుటచే మాత్రమే అజ్ఞానమను మృత్యువును దాటగలమని వేదవాక్కు.
తమేవ విదిత్వా అతిమృత్యుమేతి నాన్యః పన్థావిద్యతేఽయనాయ।
(యజుర్వేదం)

2. **శ్రుత్కర్ణాయ కవయే వేద్యాయ**
వచోభిర్వాక్తైరుపయామి రాతిమ్॥ (అథర్వవేదం)
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః॥ (భగవద్గీత)
వేదములన్నిటిచే ప్రతిపాదింపబడేవాడు, సర్వవిజ్ఞానములకు గమ్యమైనవాడు 'వేద్యుడు'.

3. **వేదితుమ్ శక్యః వేద్యః.**

తెలియబడని అతీంద్రియుడైనా, తన విశ్వనిర్వహణ కర్మ ద్వారా తెలియబడుతున్నాడు. విశ్వంలో నిత్యం జరిగే 'సంగ్రహ,నియమ, యమా'ది క్రియల ద్వారా పరమేశ్వరు డొకడున్నాడని గ్రహించగలము. మరియొక భావనలో – ఇంద్రియాదులకందని వాడైనా, భక్తుల ననుగ్రహించుటకు అవతారాదుల ద్వారా, దివ్యనామముల ద్వారా అందుబాటులోకి వచ్చి తెలియబడేవాడు. ఇది స్వామి కరుణను ప్రకటించుతుంది.

జ్ఞానములన్నిటికీ గమ్యమైన 'వేద్యుడై' సర్వమును తెలుసుకొనువాడు కనుక–

వైద్యః .. 164

1. అన్నిటినీ తెలుసుకొనువాడు. సర్వ విద్యలను తెలిసినవాడు. విద్యలన్నీ విష్ణుమయాలు. సర్వజ్ఞాన స్వరూపుడు కనుక వైద్యుడు. ఏ పద్ధతి ద్వారా జ్ఞేయ (తెలియదగిన) విషయం జ్ఞాతం (తెలియడం) అవుతుందో అది విద్య. ఈ విద్యలు రెండు విధాలు– పరా, అపరా. లౌకిక విద్యలన్నీ అపరావిద్యలు. బ్రహ్మవిద్య పరావిద్య. ఈ విద్యలన్నిటినీ ఎరిగిన సర్వజ్ఞుడు శ్రీహరి.
2. సకల జగన్నిర్మాణ పద్ధతి నెరిగినవాడు విష్ణువు తప్ప వేరొకడు లేడు. **విశ్వాని దేవ వయునాని విద్వాన్। (యజుర్వేదం)**
3. ఆశ్రయించిన భక్తులకు భవవ్యాధిని పోగొట్టువాడు. రోగాదులను, వాటి ఉపశమన పద్ధతులను ఎరిగినవానిని కూడా 'వైద్యుడు' అంటారు. ఆత్మజ్ఞానముచే అజ్ఞాన వ్యాధి నశిస్తుంది. రోగాలను, అజ్ఞానవ్యాధిని ఎరిగి నశింపజేసే ఆత్మజ్ఞాన స్వరూపుడు వైద్యుడు. **'వైద్యో నారాయణో హరిః'** అనే ఆర్షవచనం సుప్రసిద్ధం. సర్వము నెరిగిన జ్ఞానస్వరూపుడు కనుక నిత్యము యోగ స్థితిలోనున్నవాడు–

సదాయోగీ .. 165

1. ఎల్లప్పుడు ఆనందస్వరూపుడై తన స్వస్థితి యందు చెదరక యుండువాడు.
2. సదా జాగరూకుడై యుండేవాడు యోగి (జ్ఞాని).
   'య ఏషు సుప్తేషు జాగర్తి' (నిద్రించువారిలో మేల్కొని యుండే ఆత్మ).
   వైద్యుడైయున్న శ్రీహరి భక్తులను రక్షించుటలో సదా జాగరూకుడైనవాడు.
3. **'యుజ్ సంయమనే'** అను ధాత్వర్థాన్ని అనుసరించి, **'సదైవ యోజయతి సంయమయతి సదాయోగీ'** అని భావం.
   తన సంయమన (సర్వమును సమగ్రముగ నిగ్రహించు) శక్తిచే సర్వవ్యాపకుడై యుండువాడు సదాయోగి.
4. విశ్వమును కర్మలయందు ఎల్లప్పుడూ నియమింపజేయువాడు (యునక్తి), కలుపువాడు సదాయోగి.
   'విశ్వా అగ్నే అభియుజో విహత్య' (ఋగ్వేదం).
5. తన జ్ఞాన శక్తిని విశ్వరచనయందు చక్కగా ఉంచువాడు.
   (యుఞ్జతే సమా దధాతి) సదా యోగి.
   'యుఞ్జతే మన ఉతయుఞ్జతే ధియో' - అని యజుర్వేదం.
6. **'యుగివర్జనే'** అనే ధాతువు ననుసరించి,
   'సదా యుంగతి వర్జన-స్వభావమాతిష్ఠతీతి సదాయోగి'-
   విపరీతాచరణ నుంచి ఎల్లవేళలా వైదొలగువాడు (తొలగించువాడు) సదాయోగి. దుఃఖకారణమైన విపరీతాచరణలను తొలగించి కాపాడువాడు.

   అక్షైర్మా దీవ్యః (ఋగ్వేదం)
   మా భ్రాతా భ్రాతరం ద్విక్షన్ మా స్వసారముతస్వసా। (అథర్వ)
   మాగృధః కస్యస్విద్ధనమ్ (యజుర్వేదం)

   ద్యూతాదులను కూడదనీ, అన్నదమ్ములు అక్క చెల్లెళ్లు ద్వేషించుకోరాదనీ,

పరధనాలను స్వీకరించవద్దని వేదం శాసిస్తోంది.

ఇటువంటి వర్జనీయ (నిషేధ) విషయకమైన బోధనల ద్వారా విశ్వమును నడుపు విద్యాస్వరూపుడు (జ్ఞానరూపుడు) సదాయోగి.

7. అజ్ఞానము నుండి వైదొలగువాడు, వైదొలగించువాడు– అని కూడా గ్రహించవచ్చు.

కనుక యోగస్థితికి భంగకరములైన విపరీత శక్తులను నశింపజేయు వాడతడే–

వీరహా.. 166

1. విరుద్ధగతులలో (అధర్మ మార్గంలో) నుండువారు వీరులు –అని ఒక అర్థం. ఆ వీరులను (అధర్మపరులను) నాశనము (హననము) చేయువాడు – వీరహా.

ధర్మవిరుద్ధ కార్యములు చేయు దనుజాది పరాక్రమవంతులను సంహరించినవాడు శ్రీహరి.

తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్।
క్షిపామ్యజస్రమశుభాన్ ఆసురీష్వేవ యోనిషు।। (గీత)

"దైవద్వేషులైన నరాధములను నీచజన్మలలో పడవేస్తా"నని శ్రీకృష్ణుని హెచ్చరిక.

2. ఆశ్రయించిన భక్తులలో ధర్మ, యోగ విరుద్ధ భావములను తొలగించు 'సదాయోగి'యే వీరహా.

బుద్ధౌ కలుషీభూతాయాం వినాశే ప్రత్యుపస్థితే।
అనయో నయసంకాశో హృదయాన్నాపసర్పతి।।
న దేవా దండమాదాయ రక్షన్తి పశుపాలవత్।
యంతు రక్షితు మిచ్ఛన్తి బుద్ధ్యా సంవిభజన్తితమ్।। (విదురనీతి)

బుద్ధి కలుషితమైన వారికి వినాశకాలం వచ్చినప్పుడు నీతి వలె కనిపించే

అవినీతి హృదయం నుండి వీడదు. అదే అతడిని పతనం చేయిస్తుంది. భగవంతుడు పశుపాలకుని వలె కర్ర పట్టుకుని రక్షించడు. ఎవరిని రక్షించదలచుకున్నాడో వారికి తేటయైన బుద్ధిని (తెలివిని) ఇస్తాడు. దుర్బుద్ధుల నుండి మరల్చుతాడు.

ఈ విధంగా బుద్ధులను నియమించడం ద్వారా శిక్షణ, రక్షణాదులను నిర్వహించువాడు. విరుద్ధ శక్తులను హరించి జ్ఞానమునిచ్చువాడు కనుక-

మాధవః.. 167

1. విద్యకు, జ్ఞానమునకు ప్రభువు.

మా విద్య చ హరేః ప్రోక్తాతస్య ఈశోయతో భవాన్।
తస్మాన్ మాధవ నామాసి ధవః స్వామీతి శబ్దితః॥ (హరివంశం)

'మా' అంటే బ్రహ్మవిద్య. దానికి ప్రభువు (ధవః) అయిన బ్రహ్మము మాధవుడు.

2. **మాతీతి మాః. 'ధూఞ్ ప్రేరణే'**

'ధూ విధూనన్ కంపనే' అనే ధాతువుల ఆధారంగా-

విశ్వమునకు దేశ కాల వస్తు పరిమాణములను (మానము) ఏర్పరచువాడు, ప్రేరేపించువాడు, చలింపజేయువాడు -అని 'మాధవ' శబ్దానికి అర్థం.

'తదేజతి తన్నైజతి' అని ఈశావాస్యోపనిషత్తు.

"కదలువాడు, కదలనివాడు అతడే".

విద్యకు ప్రభువైన ఆతడే ఆస్వాదనీయుడైన జ్ఞాన స్వరూపుడు కనుక-

మధుః .. 168

1. జ్ఞానమయుడు.

మన్యతే బుధ్యతే మనుతేవా- మధుః. తెలుసుకొనుట- తెలియబడుట జ్ఞానము.

2. మధువువలె పరమప్రీతిని కలిగించువాడు.

జ్ఞానులకు అత్యంత ప్రియుడు– మిక్కిలి ప్రీతిని కూర్చువాడు.

పరబ్రహ్మానుభవమే ప్రీతి సంధాయకం.

విష్ణోः పదే పరమే మధ్వ ఉత్సः ॥ (ఋగ్వేదం)

విష్ణుపదమే పరమమైన అమృత ప్రవాహము. అఖండానంద స్వరూపము.

ఆ సచ్చిదానంద లక్షణముగల బ్రహ్మమే 'మధువు'.

ఈ బ్రహ్మానుభవం ఇంద్రియాలకు అతీతమైనది కనుక–

అతీన్ద్రియः 169

1. ఇంద్రియాలకు మించినవాడు.

బహిరింద్రియ, అంతరింద్రియాలకు అతీతమైన ఆత్మయే విష్ణువు.

అతి వాగింద్రియ కర్మాణం

అతి సూర్యాగ్ని తేజసం।

అతి బుద్ధీంద్రియాత్మానం

తం ప్రపద్యే ప్రజాపతిమ్॥

"వాక్కులు మొదలైన ఇంద్రియ కర్మలకు, సూర్యాగ్ని తేజస్సులకు అంతరింద్రియమైన బుద్ధికి మించిన పరమేశ్వరుని శరణువేడుతున్నాను" అని భగవత్ స్తుతి.

'ఇంద్ర' శబ్దానికి 'జీవుడ'ని కూడా అర్థముంది.

ఇంద్రస్య జీవస్య లింగం జ్ఞాపనం, సాధనం – ఇంద్రియం (సత్యభాష్యం)

జీవునకు సాధనములైనవి, జీవులను తెలియజేయునవి ఇంద్రియాలు.

ఇంద్రియ శక్తులు భిన్న భిన్న ప్రాణులకు భిన్నభిన్నంగా ఉంటాయి. కొన్ని ఇంద్రియ శక్తులు కొన్ని ప్రాణులలో ఎక్కువగా పనిచేస్తే మరికొందరిలో అంతకంటే తక్కువగా పనిచేస్తాయి. ఒకే వస్తువు వివిధ ప్రాణుల ఇంద్రియాలకు వివిధ విధాలుగా స్ఫురిస్తుంది. ఇంద్రియాలకున్న శక్తులు పరిమితాలు.

వీటితో అపరిమితుడు, ఏక స్వరూపుడు అయిన పరమాత్మ గోచరం కాడు. శబ్ద స్పర్శ రూప రస గంధాలను గ్రహించేవి ఇంద్రియాలు. నారాయణుడు ఈ శబ్దాదులకు అతీతుడు.

అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం
తథారసం నిత్యమగంధవచ్చయత్।
అనాద్యనన్తం మహతః పరం ధ్రువం
నిచాయ్య తన్మృత్యుముఖాత్ ప్రముచ్యతే।। (కఠోపనిషత్తు).

పంచ జ్ఞానేంద్రియాలకు, పంచ కర్మేంద్రియాలకు, పదకొండవదైన అంతఃకరణానికీ మించినవాడై, ఆ ఇంద్రియాదుల చైతన్యాన్ని తానే కలిగిస్తున్నా, వాటికి దొరకనివానిగా ఉన్నవాడు కనుక –

మహామాయః .. 170

1. **గొప్ప మాయ కలవాడు.**

ఈ నామం నుండి ఏడు నామాలు 'మహా' శబ్దంతో చెప్పబడుతున్నాయి. 'మహా' శబ్దం గొప్పతనాన్నీ, పరబ్రహ్మను తెలియజేస్తుంది. సృష్టి రచనా నైపుణ్యమే మహామాయ. ఈ మాయ అరు విధాలైన శక్తులతో (షడ్విధ ఐశ్వర్యాలు) జగన్నిర్వహణ సాగిస్తున్నది. ఆ ఆరు విశేషాలు దీని తరువాతి నామాలైన 'మహోత్సాహః' నుండి 'మహాద్యుతిః' వరకు చెప్పబడుతున్నాయి. ప్రకృతి, మాయ – ఆ నారాయణుని శక్తి. ఇది త్రిగుణాత్మకం. దీని నెవ్వరూ దాటలేరు. అందుకే అది 'మహా' శబ్దంతో వాచ్యమౌతోంది.

దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా।
మామేవ యే ప్రపద్యంతే మాయాం ఏతాం తరంతితే।।

విష్ణుని మాయాశక్తి 'విద్యా'రూపంగా బంధనాల నుండి విముక్తం చేస్తుంది. 'అవిద్యా' రూపంగా సంసార బంధనాలను నిర్వహిస్తుంది.

జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా।

బలాదాకృష్య మోహాయ 'మహామాయా' ప్రయచ్ఛతి॥

(మార్కండేయ పురాణం- దేవీ మాహాత్మ్యం)

దేవీ పురాణాలలో వర్ణితమైన 'మహామాయ' - నారాయణుని శక్తి.

'పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బల క్రియా చ',

- అనే ఉపనిషద్వచనం ప్రకారం, పరమేశ్వరుని ఈ శక్తియే, తరువాత ఆరు నామాల ద్వారా కూడా వ్యక్తమౌతోంది. **'షణ్ణాం భగఇతీరిణా'** -షడ్గుణములే భగములు. అది కల పరాశక్తి భగవతి. నారాయణుని శక్తియే నారాయణి. యోగమాయగా, జగదంబగా భావించబడే ఆదిశక్తి ఇదే. నారాయణుని ఆశ్రయించినవారు తప్ప ఇతరులెవరూ దాటలేనిది మాయ.

2. జగమంతా తానే అయిఉన్నా, జగత్తులో ఉన్న ఎవరూ 'ఇది నారాయణమయమ'ని తెలుసుకోలేకపోతున్నారు. అలా తెలుసుకోనివ్వని శక్తి మాయ.

'మరుగేలరా ఓ రాఘవా!

మరుగేల చరాచర రూప - పరాత్పర -

సూర్యసుధాకర లోచనా!' -అనే (త్యాగయ్య) కృతి ఈ నామానికి చక్కగా అర్థాన్ని చెప్తుంది. చరాచరములు తన రూపంగా, సూర్యచంద్రులే తన నేత్రాలుగా అంతా వ్యాపించి ఉన్నా, అది తానేనని తెలియనీయని 'మరుగు'ను ఏర్పరచిన మహామాయావి శ్రీహరి.

'అన్ని నీవనుచు అంతరంగమున తిన్నగాను వెదకి తెలుసుకొనే'వారు 'నిన్నెగాని మదినేనెన్నజాల నొరుల' అనే శరణాగతులు.

3. **'మాతీతి మాయా', 'మిమీతే ఇతిమాయ'** మితిచేయునది (కొలుచునది) మాయ.దేశ కాల వస్తు పరిమితులకు అందనిది, ఆ పరిమితులలో ఇమిడినట్లు భ్రమింపజేసేది మాయ. ఏక చైతన్యం అనేకంగా కనబడేలా చేసే ఆ మహామాయా స్వరూపుడు శ్రీహరి.

ఇంద్రోమాయాభిః పురురూప ఈయతే - అని ఋగ్వేదం.

4. హరి అవతారాలను ధరించినది కూడా ఈ మాయాశక్తితోనే.

(సంభవామ్యాత్మమాయయా - గీత).

శ్రీరామకృష్ణాది అవతారాలలో తాను హరిననే విషయాన్ని తన లీలలో తెలియపరుస్తూనే మరుగుపరచినవాడు, అపరిమితుడైనప్పటికీ కౌసల్యా దశరథులకు, యశోదా నందులకు పుత్రునిగా, రావణ కంసాదులకు శత్రువుగా వారి వారి భావాల మితులకు గోచరించిన మాయావి. యశోదాదులకు విశ్వరూపాన్ని చూపిస్తూనే తిరిగి మరుగు పరచినవాడు. తనను మాయతో మోహింపచేయదలచుకున్న బ్రహ్మాదుల్ని సైతం, మోహింపచేసిన మహామాయా స్వరూపునిగా శ్రీకృష్ణాది అవతారాలలో గోచరించినవాడు.

'అనరాదు వినరాదు అతని మాయలు నేడు
దిన దిన క్రొత్తలాయె దిష్టమిదెమాకు',

- అని అన్నమయ్య ఈ మహామాయుని వినుతించాడు.

ఈ మాయాశక్తితోనే సృష్టి రచనకు ఉద్యుక్తుడైనవాడు -

మహోత్సాహः .. 171

1. జగత్సృష్టి స్థితులకు ఉద్యుక్తుడైనవాడు.

'మహామాయ' అనేది మొత్తంగా సృష్టి రచనకు మూలశక్తి. అది మొదట 'ఉద్యుక్తం' (ప్రేరణ)గా మొదలౌతుంది కనుక ఈ నామం.

అటు తరువాత - ఆ ఉత్సాహంలో తరువాతి నామాలైన బల, బుద్ధి, వీర్య, శక్తి, ద్యుతులుగా వ్యక్తమౌతుంది. సర్వజగత్కర్తృత్వ శక్తి మహోత్సాహం.

2. ఉత్ - సాహः. ఉత్కృష్టంగా సహించువాడు. అన్నిటికీ ఉన్నతుడై అన్నిటినీ ధరించువాడు.

సాక్షస్తపృతే భూరిభారः - (ఋగ్వేదం).

'సర్వవ్యాపకుడై, అక్షయుడై అన్నిటిని భరించే అక్షరుడు.

ఋచో అక్షరే పరమే వ్యోమన్.

యస్మిన్ దేవా అధివిశ్వేనిషేదుః । (ఋగ్వేదం).

ఈ మహోత్సాహుని చేతనే ఆకాశాది భూతాలు ధరింప (సహింప) బడుతున్నాయి.

3. గొప్ప ప్రేరణ శక్తి కలవాడు.

జగత్తునంతటినీ ప్రేరేపించేవాడితడే. **ధియో యో నః ప్రచోదయాత్.**

ఈ శక్తికి సంకేతంగానే పార్థుని రథాన్ని నడిపినవాడు.

భీష్ముడు పార్థుని రథాన్ని నడిపే శ్రీకృష్ణుని **'అట్టి పరమోత్సాహున్ ప్రశంసించెదన్'** అని ధ్యానించాడు.

కర్తవ్య విముఖుడై హృదయదౌర్బల్యంతో విషాదయోగాన్ని అవలంబించిన పార్థుని బ్రహ్మ విద్యాబోధనతో ప్రేరేపించిన మహోత్సాహుడు గీతాచార్యుడు జగద్గురువు శ్రీకృష్ణుడు.

ఏ క్రియకైనా తొలుత కావలసింది ఉత్సాహం.

'ఉత్సాహ ప్రభుమంత్ర శక్తియుతమే ఉద్యోగమే' (పోతన భాగవతం) – మానవుని ప్రయత్నం 'ఉత్సాహం, అధికారం (పట్టు), ఆలోచన' – అనే శక్తులతో ఉంటుంది. ఆ తొలి మూలశక్తి స్వరూపుడే శ్రీహరి. ఉత్సాహవంతులలో అధిష్ఠించిన వరేణ్యుడతడు. అలా ప్రేరణగా సహించేవాడు కనుకనే –

మహాబలః .. 172

1. బలవంతులందరికీ బలమైనవాడు.

మహాభూతముల యందు బలమైఉన్నవాడు.

'బలం బలవతాం చాహం' అని గీతాచార్య వచనం. బలవంతులలో బలవంతుడు.

ఈతని బలంతోనే సర్వజగము నడుస్తోంది.

బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును
బలమెవ్వండట్టి విభుడు బలమసురేంద్రా! – అని ప్రహ్లాద వచనం
(పోతన భాగవతం).

2. 'బల' శబ్దానికి 'జీవింపచేయునది' అని అర్థం.
'బలతి ప్రాణితి', 'బల్యతే ప్రాణ్యతే జీవ్యతే అనేన ఇతి బలం.'
దేని ద్వారా మనం జీవిస్తున్నామో అది బలం. ఇలాంటి బలాలు బహువిధాలు. విద్యాబలం, ధన బలం, ఇంద్రియబలం వంటి అనంతబలాలు. వాటన్నిటికీ మూలమైన మహాబలం నారాయణుడే.

సకల బలంబులు నీవే సర్వేశ్వరా!
అకలంకంబగు సుఖమే అన్నిట నిదే మాకు
పొందుగc జక్రాంకితమే బుజబలమిదె నాకు
అందిన హరి నీ చింతే ఆత్మబలము నాకు
సందడిc బేరుబలము కేశవనామము నాకు
ఇందును నందును భవభయమిcక లేదిదె నాకు....
అంగపుc దిరుమణు లివి పంచాంగబలము నాకు
సంగతి నీపై పాటలె స్వరబలమిదే నాకు
రంగుగ నీగుణరాశులె రాశిబలము నాకు
ఇంగితముగ నిహపరముల కెదురే దిదే నాకు....
కనుcగొను నీ విగ్రహమే గ్రహబలమిదె నాకు
విను నీ దాసుల సేవే వెనుబలమిదె నాకు
తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు
ఘనమే చెప్పగ నింతట గలిగెబో యిదె నాకు. (అన్నమయ్య)

3. 'బలం' అంటే సేన అని కూడా అర్థం. గొప్ప సేనలు కలవాడు

మహాబలుడు. ప్రకృతి శక్తులు, దేవతలు అందరూ విష్ణుని సేనలే.

ధృష్ణుషేనః సంగృభ్యాన ఆ భరా భూరి పశ్వః॥ (ఋగ్వేదం)

శుభములు కలిగిన సేనలున్నవాడు ధృష్ణుసేనుడు - అని వేదమాత ఈ మహాబలుని కీర్తించింది.

సేనలు శత్రునాశనం, స్వపక్ష రక్షణం చేసే లక్షణం కలవి. దుష్టత్వాన్ని శిక్షించి, శిష్టత్వాన్ని రక్షించే మహాబలుడు నారాయణుడు.

జగన్నిర్వహణ చేసే ప్రేరణ (ఉత్సాహం), బలమేకాక సర్వజ్ఞానస్వరూపుడు ఆతడే-

మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్తి ర్మహాద్యుతిః।
అనిర్దేశ్యవపుః శ్రీమానమేయాత్మా మహాద్రిధృక్ ॥... 19

173. మహాబుద్ధిః, **174.** మహావీర్యః, **175.** మహాశక్తిః,
176. మహాద్యుతిః, **177.** అనిర్దేశ్యవపుః, **178.** శ్రీమాన్,
179. అమేయాత్మా, **180.** మహాద్రిధృక్.

మహాబుద్ధిః .. 173

1. గొప్ప జ్ఞాన స్వరూపుడు.

   బుధజ్ఞానే. 'బుధ' ధాతువునకు జ్ఞానమని అర్థం.

   జ్ఞానవంతులందరిలో జ్ఞానంగా భాసించే చైతన్యం శ్రీహరియే. జీవులలో ఇంద్రియాదుల కంటే గొప్పది బుద్ధి. ఆ బుద్ధిశక్తితోనే విద్యను పొందగలం. శుద్ధమైన జ్ఞానం బ్రహ్మస్వరూపం. అదే ప్రజ్ఞానం. ఆ ప్రజ్ఞానమే మహాబుద్ధి.

   "ప్రజ్ఞానం బ్రహ్మ" అనే మహావాక్య స్వరూపమే నారాయణుడు.

2. అనంత విశ్వాన్ని తన 'మహాబలం'తో ఏర్పరచడమే కాక ప్రత్యణుగతమైన సర్వజ్ఞానమూ కలిగినవాడు మహాబుద్ధి.

   వేదాది జ్ఞానములన్నీ ఆయన నుండి వచ్చినవే.

ధామాని వేద భువనాని విశ్వా।
విశ్వాని దేవ వయునాని విద్వాన్। (యజుర్వేదం)
భువనములన్నిటి గురించి సమగ్రంగా తెలిసిన విద్వాంసుడాతడే.
యజ్ఞ స్వరూపుడైన హరి నుండే ఋగాది వేదములు, ఛందములు ఆవిర్భవించాయని – పురుష సూక్తం స్పష్టం చేసింది.
తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామానిజజ్ఞిరే।
ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాదజాయత। (యజుర్వేదం)

3. భ్రమ, సంశయం వంటి దోషాలు లేని అనంత జ్ఞానస్వరూపుడు.
నక్షత్రాదులను యథాస్థానంలో నుంచి సూర్యాదులను నియమిస్తూ విశ్వాన్ని ఎంత గొప్ప ప్రణాళికతో నడుపుతున్నాడో మన ఊహకే అందదు. అందుకే ఆయనదే మహాబుద్ధి.
ఆలోచనాశక్తి, ప్రతిభ, ధారణ, స్ఫురణ – మొదలైన శక్తులన్నీ కలసి బుద్ధి. ఈ శక్తుల సంపూర్ణత శ్రీహరియే.
ఆ బుద్ధి శక్తితో తన తేజస్సుని ప్రకృతి యందు ప్రవేశింపచేసి బహుధా భాసిస్తున్నందున –

మహావీర్యః .. 174

1. గొప్ప ఉత్పత్తి సామర్థ్యము గలవాడు.
సృష్టి బీజశక్తులన్నిటినీ ప్రళయావస్థలో తన యందుంచి, పునఃసృష్ట్యారంభంలో ప్రకృతియందు నిక్షిప్తం చేసి బ్రహ్మాండాలను సృజింపచేసే శక్తిమంతుడు. ఆ బీజశక్తుల సమూహాన్నే 'అవిద్యా' రూప వీర్యశక్తిగా పేర్కొంటారు.
'తాసాం బ్రహ్మమహద్యోనిః అహం బీజ ప్రదఃపితా' అంటూ గీతాచార్యునిగా భగవానుడు ఈ మాటనే స్పష్టం చేశాడు.
సప్తర్థ గర్భా భువనస్య రేతో

విష్ణోస్తిష్ఠన్తి ప్రదిశా విధర్మణి। అని 'ఋగ్వేదం'.

2. **'వీర విక్రాంతే'** అనే ధాత్వర్థం ప్రకారం విక్రమించువాడు వీరుడు. నిర్విశేషంగా విశ్వాన్ని ఆక్రమించిన కారణంగా మహావీరుడు విష్ణువు. సృష్టి నిర్వహణ యందు నియమించబడిన బ్రహ్మేంద్రాదుల వీరత్వమంతా విష్ణుని విభూతియే. సూర్యాదులలో మనం గ్రహించే వీరత్వం విష్ణు చైతన్యం. ఈ విషయాన్నే –

యస్మిన్ భూమిరన్తరిక్షం ద్యౌర్యస్మిన్నధ్యాహితా।
యత్రాగ్నిశ్చంద్రమాः సూర్యో వాతస్తిష్ఠంత్యార్పితాः
స్కంభం బ్రూహి కతమः స్విదేవ సः। – అనే అథర్వవేదమంత్రం స్పష్టంచేసింది.

వీర్యమసి వీర్యం మయి ధేహి ॥ (యజుర్వేదం)
"నీవే వీర్యమై ఉన్నావు. నాయందు వీరత్వశక్తిని అందించు."

3. వికారాలకు లొంగని నిర్వికారుడే మహావీరుడు.
బల, బుద్ధి, విద్యాదులతో శాసించే మహా చైతన్యం కనుక–

మహాశక్తిः .. 175

1. గొప్ప సామర్థ్యము కలవాడు.
బల, వీర్య, జ్ఞానాదులన్నిటి సమగ్రతయే శక్తి. ఈ శక్తియే విశ్వవ్యాపక మైన విష్ణు చైతన్యం. సర్వజగన్నిర్వహణ సామర్థ్యమే మహాశక్తి. సృష్టిలో ప్రతి దానికి దాని సామర్థ్యాన్ని ప్రదానం చేసే సమర్థతా సమృద్ధి గలవాడు విష్ణువు.

2. **'శక మర్షణే'** అనే ధాతువు ననుసరించి సర్వమును నిర్వహించుట, ధరించుట, నిగ్రహించుట, నియమించుట – అని అర్థాలు 'శక్తి' శబ్దానికి ఉన్నాయి. ఇన్ని అర్థాలు కలిగి ఉన్న మహాశక్తి సంపన్నుడు. ప్రకృతిని పరిణమింపజేసేది ఈ మహాశక్తి.

శక్తిమంతులలో శక్తిగా ఉన్న చైతన్య స్వరూపుడు, లోకంలోని శక్తిమంతులందరినీ మించినవాడు తానే కనుక మహాశక్తిః. ఈ శక్తితో అన్నిటినీ ప్రకాశింపచేసే స్వయంప్రకాశకుడు -

మహాద్యుతిః .. 176

1. గొప్ప ప్రకాశ స్వరూపుడు.

   द्योतते इति द्युतिः. ప్రకాశించే గుణం ద్యుతి.

   మహామాయా రూపుడై ఉత్సాహ, బల, బుద్ధి, వీర్య, శక్తులతో అంతటా దీపించే వాడీతడే. అన్నిటికీ వెలుగైన ఈయన స్వయం ప్రకాశ స్వరూపుడు. **'ज्योतिषामपि यज्ज्योतिः', 'स्वयं ज्योतिः'** - అని శ్రుతి వచనాలు.

   జ్యోతులకు జ్యోతి ఆతడు.

2. **तेजोबलैश्वर्य महावबोध**

   सुवीर्य शक्त्यादि गुणैक राशिः।। (విష్ణుపురాణం)

   తేజం, బలం, ఐశ్వర్యం, మహాజ్ఞానం, వీర్యం, శక్తి మొదలైన మహాగుణాలన్నీ ఒక రాశిగా ఉన్నవాడు. ఈ రాశిలోని లవలేశాలను గ్రహించి సృష్టి అంతా నడుస్తున్నది.

   ఇన్ని విధాలుగా తన చైతన్యాన్ని ప్రకాశింపజేయువాడు కనుక మహాద్యుతి స్వరూపుడు.

   'महतस्तमसः पारे पुरुषंह्यति तेजसं'

   - అనే శ్రుతి వచనం ప్రకారం 'లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెంజేకటి కవ్వల ఎవ్వండేకాకృతి వెలుగు నతని నే సేవింతున్' అని గజేంద్రుడు కీర్తించినది ఈ మహాద్యుతినే.

   సృష్టిలో ప్రతి దానిలోనున్న లక్షణం, దాని ప్రకటన, వర్చస్సు ఈ మహాద్యుతి నుండి లభించినవే.

3. **दिविसूर्य सहस्रस्य भवेद्युगपदुत्थिता।।**

-భగవానుడు తన విశ్వరూపాన్ని చూపించిన వెంటనే అర్జునునికి కలిగిన అనుభూతి ఇది. ఆకాశంలో వేలకొలది సూర్యులు ఒక్కసారి దీపించినట్లుగా ఉన్న మహాద్భుతద్యుతి విష్ణుద్యుతి.

4. మనలో ఉత్సాహ, బల, బుద్ధి, వీర, శక్తి లక్షణాలను ప్రకటింపచేసే ఆత్మజ్యోతి ప్రకాశమే ఆదినారాయణుడు.

ఇలా బాహ్యాభ్యంతరాలలో భాసించే విశ్వవ్యాపక చైతన్యమయుడు, అపరిమితుడు కనుక -

అనిర్దేశ్యవపుః .. 177

1. నిర్దేశించుటకు (ఇదియని స్పష్టపరచి చూపుటకు) వీలులేని శరీరము కలవాడు.

పై చెప్పిన మహాలక్షణాలను గమనిస్తే, విశ్వమయుడైన ఆ మహాపురుషుడు 'ఫలానా శరీరంతో' ఉంటాడని చెప్పలేనివాడు. శరీరాదులలో తాను చైతన్యరూపుడైనా, వాటికే పరిమితం కానివాడు. అత్యంత సూక్ష్మమైన ఆ సర్వవ్యాపక చైతన్యానికి 'ఇది రూప'మని ఎలా నిర్ధారించగలం? పరిమిత శక్తులు కలిగిన ఊహలకు, అంచనాలకు అతీతమైన విరాట్ స్వరూపుడు అనిర్దేశ్యశరీరుడు.

స్వామి ఆకార క్రియాదులు 'ఇదం ఇత్థం' (ఇదీ, ఇలాగ) అని ఏ ఒక్కరూ నిర్ధారణ చేయలేరు. అంతటా ఉన్నది విష్ణువేనన్న సత్యానుభవంతో చెప్పే ప్రహ్లాదుని మాటలు, హిరణ్యకశిపునకు విష్ణువు పట్ల అవగాహన కల్పించలేకపోయాయి. అప్పటికప్పుడు ఆవిర్భవించిన నృసింహరూపం - హిరణ్యకశిపుని అంచనాలకు మించినది. ప్రహ్లాదుడు సైతం కనీ వినని‌ది. 'అఖిల రూపులు తన రూపమైనవాడు' ఒకే రూపంలో, ఒకే విధంగా ఉంటాడని ఎలా చెప్పగలం!

'అతీంద్రియః' 'అనిర్దేశ్యవపుః' - ఈ రెండు నామాల మధ్య ఏడు 'మహా'

విశేషనామాలు అమర్చడంలో ఔచిత్యాన్ని గమనించాలి. ఇన్ని మహాలక్షణాలున్నవాడు ఎప్పుడైనా, ఎలాగైనా, ఎందుకోసమైనా వ్యక్తం కాగలడు. అంతేకాదు 'ఆ వ్యక్తమైనది మాత్రమే అతడు' – అని తేల్చడానికి వీలులేని అవ్యక్తతత్త్వమతడు.

స్వసంవేద్యుడు – తనకు తానే తెలిసే ఆత్మ స్వరూపుడు.

నామ రూపవ్యవహారాల కందేది 'వపువు'. ఇదే నామమనీ, ఇదే రూపమనీ చూపలేని అనంతుడితడు.

2. **'రూపవర్ణాది నిర్దేశ విశేషణ వివర్జితః' (విష్ణుపురాణం)** – రూపవర్ణాదులను నిర్దేశించలేనివాడితడే.

సాటిలేని నిరుపమాన దివ్య శరీరంతో సాక్షాత్కరించువాడు.

3. **వపతి బీజాదికమనేనేతి 'వపుః' (సత్యభాష్యం)** – బీజములను జల్లువాడు వపువు.

పూషం భవతమామేరయస్వ
యస్యాం బీజం మనుష్యావపన్తి। (అథర్వవేదం)

'నిర్దేశించడానికి వీలులేని అనంత సృష్టిబీజాలను వ్యాప్తి చేసినవాడు' అని ఈ నామానికి మరో అర్థం.

ఇలా గణనకందని అనంత విభూతులతో విశ్వాన్ని పెంపుచేసేవాడు –

శ్రీమాన్ .. 178

1. విభూతులు కలవాడు.

యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవవ – (గీత)

సర్వశోభలూ, విభూతులు ఆయన అంశలేనని శాస్త్రవచనాలు. అన్ని విభూతులలో విశ్వమంతా నిండిన కొదవలేని శ్రీమంతుడు.

ఋతం సత్యం తపోరాష్ట్రం శ్రమో ధర్మశ్చ కర్మ చ ।
భూతం భవిష్యదుచ్ఛిష్టే వీర్యం లక్ష్మీబలం బలే ॥

– ఉత్కృష్టమై మిగిలే ఈ పరతత్త్వమందే ఋతం, సత్యం, తపస్సు, రాజ్యం, శ్రమ, ధర్మం, కర్మ, కాలం, వీరత్వం వంటి 'శ్రీ'లున్నాయని 'అథర్వవేదం' చెబుతోంది.

2. హరి యొక్క అనుగ్రహ స్వరూపమే శ్రీ – లక్ష్మి. ఆ లక్ష్మితో కూడిన దయామయుడు.

సర్వవిభూతులతో(శ్రీలతో) విశ్వము నిండినవాడు కనుకనే –

అమేయాత్మా .. 179

1 కొలతకందని స్వరూపము కలవాడు.

సముద్రంలో ఉన్న అల్పజీవులు సముద్రాన్ని కొలవలేవు. సర్వ బ్రహ్మాండవాసులు విష్ణునిలోనివారే. వారిలో, వారి వెలుపలా వ్యాపించిన ఆ పరతత్వాన్ని ఏ ఒక్కరూ కొలిచి 'ఇంత' అని చెప్పలేరు. సర్వులూ ఆయనలోనివారే గానీ, ఆయనను సంపూర్ణంగా గ్రహించలేరని చెప్పడమే ఈ నామోద్దేశం.

ఊహాతీత స్వరూపుడు కనుకనే ఊహకందని చేతులతో మహాభారాలను భరిస్తున్న–

మహాద్రిధృక్ .. 180

1. గొప్ప పర్వతాలను ధరించినవాడు.

'ద్రాతీతి ద్రిః. ద్రా గతౌ.' – ఈ అర్థాల ననుసరించి, గమనం చేసేదానిని 'ద్రిః' అంటారు. కదలనిది –'న – ద్రి' = అద్రి. నిశ్చలమైన వాటిని నిశ్చలంగా ధరించే అచలుడు హరి.

పృథ్విలో పర్వతాలు ప్రధాన శక్తులు. ఇవి భూమికి రక్షకాలుగా, భూ 'ధరా'లు (భూమిని ధరించునవి)గా భావించారు. వాటిని సైతం ధరించేవాడు సర్వ భువన రక్షకుడు.

భువనాలలో చలన లక్షణంతో పాటు నిశ్చల ధర్మం కూడా ఉంటుంది. ఈ నిశ్చల ధర్మంలోనే శిలలు వంటివి ఏర్పడతాయి. ఆ నిశ్చల ధర్మాన్ని నిర్వహించే విష్ణు చైతన్యమే మహాద్రిధృక్.

కదలని వాటిలో గొప్పవైన వాటిని అవలీలగా ధరించినవాడు. కూర్మమై మందరగిరిని మోసి, శ్రీకృష్ణుడై గోవర్ధనాన్ని అవలీలగా ఎత్తినవాడు. చూడడానికి ఏడేళ్ళప్రాయంతో కనిపించినా, అనాయాసంగా గిరిని ఎత్తి నిలచిన కృష్ణుడు, అచలాన్ని ఎత్తిన మహాచలునిగా గోచరించి, ఇతడు 'ఇంతేనని కొలిచి చెప్పలేని'వాడని (అమేయాత్మా) ఋజువు చేశాడు. కదలని కొండ కవ్వమై తనపై కదులుతున్నా తాను కదలని పరమ నిశ్చలుడు. మార్పు చెందని ఆత్మస్వరూపుడు.

2. పర్వతాలు విష్ణు విభూతితో కూడినవి. హిమాచలాదులు విష్ణ్వంశ కలిగినవిగానూ, వాటి వంశక్రమాన్ని విష్ణు వంశంగానూ పురాణాలు వర్ణించాయి. శ్రీగిరి, అరుణగిరి, గోవర్ధనగిరి – వంటివి దేవతాస్వరూపాలుగా అర్చనలందుకుంటున్నాయి. వాటియందు వ్యాపించి ధరించిన పరమేశ్వరుడు 'మహాద్రిధృక్'.

'విష్ణుః పర్వతానా మధిపతిః' అనే వేద వాక్యంతోపాటు,

బృహద్గ్రావా వానస్పత్యః (యజుర్వేదం) వంటి ప్రమాణాలున్నాయి.

3. **'ధృష ప్రసహనే', 'ధర్షయతి'** వంటి అర్థాలతో చూస్తే, మహా పర్వతాలను నిగ్రహించినవాడు. మందరగిరి వంటి వాటిని నియమించడమే కాక, తానే ఇంద్రశక్తిగా, పర్వతాల రెక్కలను ఖండించి వాటి స్థావరత్వాన్ని స్థిరపరచినవాడు.

ఈ నియామక శక్తి కలిగిన రాజత్వమూ, పరాక్రమమూ కలిగినందున –

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః।
అనిరుద్ధః సురానన్దో గోవిన్దో గోవిదాంపతిః॥... 20

181. మహేష్వాసః, 182. మహీభర్తా, 183. శ్రీనివాసః,
184.సతాంగతిః । 185.అనిరుద్ధః, 186. సురానన్దః,
187. గోవిన్దః, 188. గోవిదాంపతిః ॥

మహేష్వాసః .. 181

1. గొప్ప ధనుస్సు కలిగినవాడు.

లోక శాసకుని శాసన శక్తులే బాణాలు. వాటిని దాల్చిన ధర్మమే ధనువు. ఆ ధర్మ ధనుర్ధారి శ్రీహరి. విశ్వమంతా తన శాసన శక్తులను ప్రసరించి జీవుల కర్మానుగుణ ఫలితాలను ప్రయోగించేవాడు.

... హస్తే బభూవ తే ధనుః।
... పరితే ధన్వనో హేతి రస్మాన్‌వృణక్తు విశ్వతః।
... నమో ధృష్ణవే చ ప్రమృశాయచ
నమో నిషంగిణే చేషుధిమతే చ।। (యజుర్వేదం)

వంటి వేదమంత్రాలు, విశ్వమంతటా తన ప్రకృతి శక్తి నుండి వివిధ కర్మఫలాలను ప్రదానం చేసే పరమేశ్వరుని దర్శించాయి.

యే పృథివ్యాం యేఽన్తరిక్షే యేదివి
యేషామన్నం వాతో వర్ష ఇషవః (రుద్ర నమకమ్. యజుర్వేదం)

భూమి (ధనువు) నుండి అన్న బాణాలను, అంతరిక్షం (ధనువు) నుండి వాయు బాణాలను, దివి (ధనుస్సు) నుండి వర్షబాణాలను ప్రయోగించుతూ ప్రకృతి శక్తుల ధనువులను దాల్చి నిర్వహిస్తున్న రుద్రరూపుడు.

2. కదలని కొండలని మాత్రమే కాక, కదిలే ప్రకృతి శక్తుల్ని సైతం కదిలించేవాడు. కదలని ధనువు నుండి కదిలి వెళ్ళే బాణాలను ప్రయోగించే నిపుణుడు.

నిశ్చల ఆత్మ చైతన్యం నుండి, బహుశక్తులను వెలికి పంపే అంతర్గత పరమాత్మ తత్వం ఈ నామంలో ధ్వనిస్తోంది.

3. **ఈషతి గచ్ఛతి హినస్తి వా శత్రూనితి – ఇషుః.**
కదలునది, శత్రువులను హింసించునది ఇషువు (బాణము).
ఆ ఇషువులను దేని ఆధారంగా ప్రయోగిస్తారో అది ఇష్వాసం (ధనువు). అటువంటి గొప్ప ధనువు కలవాడు.

శార్ఙ్గమనే గొప్ప ధనుస్సును ధరించిన మహేష్వాసుడు హరి. శ్రీరామావతారంలో ధనుర్ధారిగానే గోచరించాడు. పృథు చక్రవర్తిగా భూమిని ధనుస్సుతోనే నిగ్రహించాడు. ఇలా నిగ్రహించగలిగేది పాలకుడే కనుక –

మహీభర్తా .. 182

1. భూమిని భరించువాడు – ప్రభువు.
విశాలమైన, గొప్పదైన భూమిని 'మహీ' అన్నారు. ధర్మాది శాసన శక్తులతో భూమిని భరించేవాడు నారాయణుడు.
స సలిలాన్మహీముద్బభార। (ఋగ్వేదం) జలముల నుండి భూమిని ఉద్ధరించి భరించిన వాడితడు. వరాహరూపుడై మహీదేవిని ధాల్చినవాడే కాక, వివిధ అవతారములతో, యజ్ఞముల రూపములతో వేద ధర్మములతో వేదనలను రూపుమాపి, ధర్మమును కాపాడి భూమిని భరించే (పాలించే)వాడు.

2. తన ఆకర్షణ శక్తితో భూమిని తగిన విధంగా నిలిపి భరించి, తన నుండి ప్రసరించే వివిధ ప్రాణ శక్తులతో పాలించే సూర్యరూపుడైన విష్ణువు.
మహీదేవ్యుషసో విభాతీ సైకేనైకేన మిషతా వి చష్టే (అథర్వవేదం) భువనములను పోషించే ఈ ప్రభువు, పోషణ కారకాలైన ఐశ్వర్యాలకు మూలమైన–

శ్రీనివాసః .. 183

1. లక్ష్మీదేవికి నివాసమైనవాడు.

'శ్రీ' శబ్దానికి అర్థాలైన శోభ, లక్ష్మి, విభూతి, ధనం మొదలైన ఐశ్వర్యాలన్నీ ఈయనయందే నివసిస్తున్నాయి.

క్షీరసాగరాన జనించిన లక్ష్మి విష్ణువును వీడక ఆయన వక్షస్థలాన నిలచి ఉంది.

నీలవర్ణనురముపై నిండిన నిధానమవై
ఏలేవు లోకముల మమ్మేలు మమ్మ' (అన్నమయ్య).

ఈ నామం శేషాద్రిపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామిని స్ఫురింపచేస్తోంది.

2. పృథ్విని పాలించిన హరి భూదేవికి భర్త, సకల ఐశ్వర్యదేవత అయిన శ్రీదేవికి పతి. ఈ రెండింటినీ తెలియచేసే రెండు నామాలు –

మహీ భర్తా, శ్రీనివాసః.

జగజ్జనని లక్ష్మీదేవి ఆశ్రయించిన విష్ణువునే సత్పురుషులందరూ ఆశ్రయించడం చేత –

సతాంగతిః .. 184

1. సత్పురుషులకు గతియైనవాడు.

సత్యస్వరూపుడైన విష్ణువు సాధుజనులచే పొందబడేవాడు. సద్గుణాలు కలిగిన వారికి సత్యమార్గమైన వైదిక ధర్మాల ననుసరించేవారికి పురుషార్థాల నిచ్చేవాడు.

స నోబంధుర్జనితా స విధాతా – ధామానివేద భువనాని విశ్వా।
యత్ర దేవా అమృతమానశానాస్తృతీయే ధామన్నధ్యైరయన్త।।

(యజుర్వేదం)

అతడే మా బంధువు, కారకుడు, పోషకుడు, సర్వలోకము లెరిగినవాడు, దేవతలకు సైతం ఆశ్రయమైన అమృతస్థానం.. అని వేద హృదయం.

2. జ్ఞానులు, భక్తులు సత్యజ్ఞానం కలిగినవారు కనుక, విష్ణుతత్త్వమందే నిష్ఠితులై ఉంటారు. లోకబాహ్యులై హరిభావనారూఢ చిత్తులై ఉన్నవారు సత్పురుషులు.
3. సత్పురుషులు భగవన్మయులు. వారి గమనమే విష్ణుతత్త్వాన్ని తెలియచేస్తుంది. అలా సత్పురుషుల చరిత్రగా భాసించేవాడు.
ఆ సత్యగతినీ (ధర్మమార్గాన్ని), సత్పురుషుల కిచ్చే రక్షణనీ ఏ ఒక్కరూ అడ్డగించలేరు కనుక -

అనిరుద్ధః .. 185

1. ఏ అడ్డంకి లేనివాడు. పరిమితి లేని లీలలు కలవాడు.
భగవత్సంకల్పం కానీ, చేష్టకానీ ఏ ఒక్కరిచేత అడ్డగించడానికీ మార్చడానికీ వీలులేనిది. అవతారాలలో సైతం తన లీలలనీ, ప్రతాపాన్నీ నిరాటంకంగా కొనసాగించి, ఆశ్రిత రక్షణలో ఆగనివాడు.
ఎదురులేని, విఫలం కాని చేష్టలతో వర్తించేవాడు.
2. ఏ ఆవరణలు లేని శుద్ధ స్వరూపుడు.
వేనస్తత్పశ్యన్నిహితం గుహా సద్యత్ర విశ్వం భవత్యేకనీడమ్,
యస్మిన్నిదగ్ సంచవిచైతి సర్వం
స ఓతః ప్రోతశ్చ విభుః ప్రజాసు॥ (యజుర్వేదం)
హృదయగుహలో ఉన్న ఆత్మగా సర్వజీవులందు నిరంతరం సంచరించే చైతన్య స్వరూపుడు.
నిరోధించలేని పరాక్రమంతో దేవతలను రక్షించిన -

సురానందః .. 186

1. దేవతలను ఆనందింపచేయువాడు.
లోకపీడాకరులైన దానవులను సంహరించి, శోభనదాతలైన సురలకు ఆనందం కలిగించువాడు.

2. 'సు' మేలును 'రాతి' కలిగించువారు సురలు. జగమునకు మేలుకోరే సత్పురుషులను అనుగ్రహించి ఆనందింపచేయువాడు. లోకంలో ఒక్క మేలు చేసేవానికి అనేక రకాలుగా అనుగ్రహించే ధర్మాన్ని నింపినది శ్రీహరి. ఒక రైతు బీజాలను వేయగానే భూమి బహు విధాలుగా భాసించి ఫలాలనిస్తోంది. ఇలా ఇచ్చినవారికి ఎన్నో ఇచ్చి ఆనందింపచేసే సమర్ధన వ్యవస్థను విశ్వమంతా ఏర్పరచినవాడు. (సత్యభాష్యం)
3. ఇంద్రియాతీతమైన దివ్యానందమే తన స్వరూపమైనవాడు. (సురలు) దేవతలు వేదమంత్ర స్వరూపులు. ఆ మంత్రాల ద్వారా వినుతించబడే శ్రీహరి -

గోవిన్దః .. 187

1. గోవుల ద్వారా తెలియబడువాడు.
   'గో' శబ్దం అనేకార్థాలు గలది. వేదనిరుక్తి ప్రకారం 'గో' శబ్దానికి కిరణాలు (రశ్మలు), వాక్కులు, ధేనువు, భూమి, ఇంద్రియాలు, ప్రాణములు... అని అర్థాలున్నాయి. వీటన్నిటి ద్వారా తెలియబడేవాడు, వీటన్నిటినీ పాలించువాడు - గోవిన్దుడు.
   వెలుగుల ద్వారానే జ్యోతి తెలియబడినట్లుగా, కిరణముల ద్వారా వాటి మూలమైన బింబం తెలుస్తుంది. తన కిరణ ప్రసారంతో తన ఉనికిని తెలియచేసే సూర్యరూపుడైన నారాయణుడు గోవిన్దుడు.
2. 'వేదైశ్చ సర్వై రహమేవవేద్యః' (గీత)
   వేద వాక్యములన్నింటిచే ప్రతిపాదింపబడే పరతత్వం గోవిన్దుడు.
   బ్రహ్మణే ప్రథమోగా అవిన్దత్ (ఋగ్వేదం)
   అభివీరో అభిషత్వా సహోజిజ్ఞైత్రమింద్ర
   రథమాతిష్ఠ గోవిదన్ (అథర్వవేదం)
   - ఇలా శ్రుతి గోవిన్ద నామాన్ని కీర్తించింది.

3. భూమిని తెలుసుకొని పాలించినవాడు.

నష్టాం వై ధరణీం పూర్వమవిన్దద్యద్ గుహాగతామ్।
గోవిన్ద ఇతి తేనాహం దేవైర్వాగ్భిరభిష్టుతః॥

"ప్రళయజలంలో నిమగ్నమైన భూమిని తిరిగి సృష్ట్యారంభంలో, తెలుసుకొని ఉద్ధరించిన కారణంగా నన్ను దేవతలు, వాక్కులు (వేదముల) 'గోవిన్దుడ'ని కీర్తించాయి" అని 'మహాభారతం' (శాంతి పర్వం)లో శ్రీకృష్ణవచనం.
ధర్మరక్షణ ద్వారా నిరంతరం భూమిని పాలించేది గోవిన్దుడే.
భూమి ద్వారా తెలియబడేవాడు అనే అర్థాన్ని గమనిస్తే....

ఒక రాజ వ్యవస్థను చూసినవానికి ఒక రాజున్నాడని తెలుస్తుంది. అలా భువన వ్యవస్థను పరిశీలిస్తే, ఒక ప్రణాళికాబద్ధంగా ఇలా అద్భుతంగా నిర్వహిస్తున్న పరమేశ్వరుడొకడున్నాడని తెలుస్తుంది. పాలింపబడే వాటిచే పాలకుని గుర్తించగలిగినట్లుగా భూ, వేద, కిరణ, ప్రాణాదులచే వాటికి మూలమైన పరమాత్మను గుర్తించగలం.

4. గోలోకమునందు గోచరించువాడు.

నారాయణుడు శ్రీకృష్ణునిగా శాశ్వత బ్రహ్మపదమైన గోలోకంలో భాసించే పరబ్రహ్మ అని అనేక పురాణ, సంహిత గ్రంథాలు చెబుతున్నాయి. గోపాల కృష్ణోపాసనలో ఈ మంత్ర విశేషాలు బహువిధాలు.

5. ఆవుల మందలను పాలించిన శ్రీకృష్ణుడే గోవిన్దుడు.

విష్ణుని శ్రీకృష్ణావతారం తన పరమాత్మ భావాన్ని ప్రకటించిన పూర్ణావతారం.
గోకులంలో గోవుల మందలతో, గోపకులతో, గోపికలతో సంచరించుతూ వారి నడుమ గోచరించినవాడు. భాగవతంలో గోవిన్ద పట్టాభిషేకం ఒక దివ్యఘట్టం.

గోవర్ధన గిరిని ఉద్ధరించి గో గోప గోపీ సంఘాన్ని కాపాడి, ఇంద్రుని అహంకారాన్ని అణచిన హరిని ఎరిగి – ఇంద్రుడు తన లోకంలోని కామ

ధేనువులను సైతం శ్రీకృష్ణునకు సమర్పించి - 'సర్వ గోవులకు పతి'గా స్వామిని పట్టాభిషేకం చేశాడు.

✧ ✧ ✧

ఇక్కడ గోవిన్దనామాన్ని భావిస్తే స్వామి పూర్ణత్వం స్ఫురిస్తుంది. ఆత్మయే హరియని తెలుస్తుంది.

గోగోపగోపీ జన మధ్య సంస్థం
గోపం భజే గోకుల పూర్ణచన్ద్రమ్.

శరీరమే గోకులం. ఇంద్రియాలు గోవులు. వాటిని నడిపే బుద్ధి శక్తులు(Intellect) గోపకులు. మనశ్శక్తులు(Emotins) గోపికలు. ప్రాణములే క్షీరములు. అవే యజ్ఞద్రవ్యములు. వీటన్నిటికీ ఆధారమైన ఆత్మయే గోవిన్దుడు. ఇంద్రియాదుల ద్వారా ఆ ఆత్మ ఉనికిని గుర్తించడమే జ్ఞానం. ఇవన్నీ ఆత్మాభిముఖం కావడమే కృష్ణభక్తి. భాగవత ధర్మం.

6. గోవులు దేవతామయులు. వేద, యజ్ఞాదులు గోవును ఆధారం చేసుకున్నాయి. గోవుల ద్వారా పోషింపబడే యజ్ఞ ధర్మమే నారాయణ స్వరూపం. గోరక్షణ, గోసేవ భారతీయ వైదిక ధర్మంలో అత్యంత ప్రధానం. మన ప్రాచీన గ్రంథాలన్నీ గోమహిమని చాటి చెప్పాయి. పంచ గవ్యాలు యజ్ఞ ద్రవ్యాలు. నిజానికి గోవుని సేవించడమే మహా యజ్ఞం. ప్రత్యక్షంగా మనకు గోచరించని గోవిన్దుడు, గోవులను కొలుచుకోవడం వల్ల లభ్యమౌతాడు. గోసేవయే వేదసేవ, విష్ణు విభూతితో భాసించే ధేనువుల చేతనే విష్ణువును పొందగలం.

కృష్ణావతారంలో అనుక్షణం వివిధ దనుజశక్తుల నుండి, మాయల నుండి, వైపరీత్యాల నుండి గో సంఘాన్ని కాపాడినవాడు.

ఈ గోవిజ్ఞానము కలిగినవారిని పాలించుటచే -

గోవిదాంపతిః.. 188

1. వేదవేత్తలకు ప్రభువు.

వేదవిజ్ఞానమెరిగిన సత్పురుషులు గోవిదులు (కోవిదులు). వారిని రక్షించు పతి విష్ణువు. వేద ధర్మాన్ని కాపాడేవానిని విష్ణువే కాపాడతాడు.

2. ప్రాణోపాసన చేసే యోగులు, తమలోనున్న 'గో' రూప ఈశ్వరచైతన్యాన్ని గుర్తెరిగిన భక్తులు, జ్ఞానులు గోవిదులు. వారిని అనుగ్రహించే పరమాత్మ విష్ణువు.

'గవామయనం' అనే పేరుతో వేదం అర్చిర్మార్గాన్ని సూచించింది. కాంతిమయమైన 'దేవయాన'మది. ఆ మార్గంలో ప్రయాణించే దివ్యజీవులకు గతియై పాలించే ప్రభువు శ్రీహరి.

✧ ✧ ✧

'సురానందః, గోవిన్దః, గోవిదాంపతిః' – ఈ మూడు యజ్ఞస్వరూపుడైన నారాయణ తత్త్వాన్ని తెలియజేస్తాయి. దేవతలు సురలు. వేద మంత్రములు గోవులు. మంత్ర వేత్తలు గోవిదులు. ముగ్గురికీ రక్షకుడు విష్ణువు. మంత్ర వేత్తలు మంత్రముల ద్వారా యజ్ఞాన్ని ఆచరించి దేవతలను తృప్తి పరుస్తారు. ఆ తృప్తి విష్ణు స్వరూపం. దాని నుండే భూమి అన్నిటినీ పొందుతుంది. 'మహీభర్త'గా 'శ్రీనివాసుని'గా స్వామి చేసే రక్షణ ఇది.

3. కేవలం వేద వాక్కులే కావు. ఏ వాక్కయినా భగవత్స్వరూపమే.

గోవులమందల్లా మన నుండి వచ్చే వాక్కులకు మూలమైన 'పరా'నాద స్వరూపుడే, ఈ వాగ్రూప గోవుల్ని తోలేవాడు.

ప్రాణులలో శబ్ద స్వరూప వ్యవస్థను నిర్వహించే విష్ణువే గోవిన్దుడు– గోవిదాంపతిః.

కిరణములను (గోవులను) నిర్వహించేవాడు, ఆ కాంతి మార్గాన పయనించు దివ్యులను (యోగులను) పాలించే మహాజ్యోతి కనుక–

మరీచిర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః।
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః॥... 21

189. మరీచిః,	*190.* దమనః,	*191.* హంసః,
192. సుపర్ణః,	*193.* భుజగోత్తమః,	*194.* హిరణ్యనాభః,
195. సుతపాః,	*196* పద్మనాభః,	*197* ప్రజాపతిః.

మరీచిః.. 189

1. మహా తేజోవంతుడు.

   నక్షత్రాది తేజస్సులలో తేజస్సుగా ఉన్నది ఈతడే.

   "తేజస్తేజస్వినామహమ్" అని విభూతి యోగంలో విశ్వగురుని మాట.

2. ఈ నామం సూర్యుని పరంగా వేదం పేరొన్నది. సూర్యరూపంగా గోచరించేది విష్ణు తేజస్సే.

   ఆదిత్య చక్షురాదత్స్వ మరీచయోఽనుధావతి॥ (అథర్వవేదం)

3. **'మరీచీనాం పదమిచ్ఛంతి వేధసః'**

   అనే శ్రుతి ననుసరించి, పరబ్రహ్మ ప్రకాశమార్గాన్ని (జ్ఞానాన్ని) యోగులు ఆశ్రయిస్తున్నారు. దివ్య ధామాన్ని చేర్చే భగవంతుని చేతులే కిరణాలు. సూర్యుని సహస్రకరాలలో ఊర్ధ్వలోకాలను చేర్చే దేవతాశక్తులుంటాయి. గోవులలో (కిరణాలలో) నున్న ఆ గోవిన్ద తేజస్సే మరీచి.

4. సృష్ట్యాదిలో బ్రహ్మ నుండి ఆవిర్భవించిన సప్తర్షుల తేజం 'మరీచి'తో మొదలు. అలాగే సప్త మరుత్తులలో 'మరీచి' విష్ణు విభూతితో కూడినవాడు. ఈ రెండింటికీ గీతయే ప్రమాణం.

   మహర్షయః సప్త పూర్వే చత్వారోమనవస్తథా।
   మద్భావా మానసాజాతా...॥
   మరీచిర్మరుతామస్మి॥

5. మ్రియత ఇతి మరీచిః, మృత్యురూపుడు.
కాలస్వరూపుడైన విష్ణువే సమయమెరిగి జీవులను సమయింపచేసే మృత్యు స్వరూపునిగా సైతం విశ్వవ్యాపకుడై ఉన్నాడు.
మృత్యుః ప్రజానామధిపతిః।। (అథర్వవేదం)
ఇలా జీవులను నిగ్రహించేవాడు కనుకనే–

దమనః.. 190

1. నిగ్రహించు (దండించు) వాడు.
స్వధర్మాన్ని వీడిన పాపులను శిక్షించే కాలశక్తి వైవస్వత (యమధర్మరాజు) రూపంగా ఉన్నది. అది నారాయణుని దమన స్వరూపమే.
2. తన తేజస్సుతో ఇతరులను నిగ్రహించి, ఆసురీశక్తులను అణచేవాడు.
దండోదమయితా మస్మి।। (గీత)
'దమింపచేసే (శిక్షించే) వారిలో ఆ దండనాధర్మం నేనే' – అని కృష్ణవచనం. పాలకునకు ఉండవలసిన స్వభావమిది. ఈ స్వభావంతోనే అధర్మపరులను కాలరూపంగా కనిపెట్టి శిక్షించుతాడు.
3. భగవత్తేజం(మరీచి)తో భాసిల్లే యోగులలో 'దమః' (ఇంద్రియ నిగ్రహం) అనే శక్తిగా భాసించేది విష్ణు విభూతియే. శాంతి రూపంగా జ్ఞానులలోని సమస్త తాపాలను అణచివేసే నిగ్రహత్వమే విష్ణుస్వరూపం.
తమీశానం వస్వో అగ్నిం
గృణీషేనానతం దమయంతం పృతన్యూన్।। అని ఋగ్వేద వచనం ఆ సర్వ నిగ్రహ సంపన్నుని పేర్కొన్నది.
4. ఈ నామాల వరసలో సూర్య పరమైన వైదిక శబ్దాలే గోచరిస్తాయి.
తన మహాతేజంతో ప్రపంచాన్ని నిగ్రహించే సూర్యుడు దమనుడు.
సూర్యకాంతిలోని దమన శక్తి ఆయా జీవుల కర్మ ననుసరించి వర్తిస్తుంటుంది.
ఆ తేజః స్వరూపుడే తన వెలుగు రెక్కలతో విస్తరించిన వాడై –

హంసః.. 191

1. చక్కని గమనము కలవాడు.

'హాన్తి మనోహరం గచ్ఛతీతి హంసః - మనోహరముగా గమనము చేయువాడు. తన చక్కని కిరణజాలముల గమనముతో కాంతిని ప్రసరింపజేయు సూర్యరూప విష్ణువు 'హంస.'

వేదం సూర్యపరంగా ఈ నామాన్ని వాడింది.

'హంసః శుచిషత్ వసురంతరిక్ష...' (ఋగ్వేదం)

'ఆదిత్య మేవ తే పరివదన్తి సర్వే
అగ్నిం ద్వితీయం త్రివృతం చ హంసమ్' ॥ (యజుర్వేదం)

సహస్రాఖ్యాం వియతావస్య పక్షౌ
హరేర్హంసస్య పతతః స్వర్గమ్॥ (అథర్వవేదం)

ఎత్తున ఎగిరిసాగే హంస (పక్షివలె ఆకాశమున ప్రకాశించే సూర్యుడే హంస.

2. **'అహం సః'** అనే శబ్దం 'పృషోదరాది శబ్దరూపంతో' (శబ్దశాస్త్ర ప్రమాణంగా) 'అ'కార లోపంతో 'హంస' అని ఉచ్చరింపబడుతోంది. "నేను అతడే" - మనలో 'నేను' అని స్ఫురించే చైతన్యం 'సః' - ఆ విష్ణు స్వరూపమేనని తెలియడమే జ్ఞానం. ఆ జ్ఞానపూర్ణ విష్ణు తత్వమే హంస. 'దమన' (ఇంద్రియాలను నిగ్రహించిన) ధర్మం కలిగిన యోగి ఈ 'అహం సః' స్థితికి చేరుకుంటాడు. వేదం ప్రస్తావించిన 'అహం బ్రహ్మాస్మి' అనే మహా వాక్యం ఇక్కడ స్మరణీయం.

ఈ స్థితినందిన యోగులను పరమ'హంస' లనడంలో భావమిదే.

యదగ్నేస్యామహం త్వం త్వం వాస్యామహమ్॥
స్యష్టే సత్యా ఇహాశిషః॥ (ఋగ్వేదం)
యోఽసావాదిత్యే పురుషః సోఽసావహమ్॥ (యజుర్వేదం)

తాదాత్మ్యభావనతో ఉపాసించేవాడు క్రమంగా 'అహ'న్ని 'సః' (రసోవై సః - పరమాత్మయే రసము)లో లీనం చేస్తాడు. ఇక మిగిలేది 'సః' మాత్రమే.

3. మనలో 'శ్వాస'కు హంస అని పేరు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలే 'సో-హం' అనే ధ్వనితో యోగక్రియలో ముఖ్య ప్రాణశక్తి ఉపాసనగా వ్యవహరింపబడుతున్నాయి.

   'హంస హంస స్సోహం హంసః' - అని మంత్ర శాస్త్రం.

   ఉచ్ఛ్వాస నిశ్వాసాలనే రెండు రెక్కలతో చక్కగా సాగే పక్షి (హంస) వంటిది మన ప్రాణ శక్తి. ఆ ప్రాణశక్తిగా మనలో కదిలేది నారాయణ చైతన్యమే. **'హంసశ్శుచిషద్'** వంటి వేద వాక్యాల ప్రమాణంతో సర్వజీవులలో ఊపిరిగా వ్యాపించిన విష్ణువు హంస.

4. ఈ నామాల నుండి మూడు నామాలు పక్షులు, పాములు వంటి విభూతులను చెబుతున్నాయి. (హంసః సుపర్ణః భుజగః) ఒక్కొక్క ప్రాణిలో ఒక్కొక్క శక్తి వ్యక్తమౌతుంటుంది. కొన్నిటిది సాగే శక్తి అయితే, మరి కొన్నిటిది ఎగిరే శక్తి. ఇంకొన్నిటిది ప్రాకే శక్తి. అన్ని శక్తులుగా వ్యాపించిన విష్ణుడే అసలు శక్తి - అని గ్రహించాలని ఈ నామోద్దేశం. సర్వములో సర్వేశ్వరుని దర్శించే యోగమార్గమిది.

   అన్నమయ్య శ్రీనారాయణుని హంసతో పోల్చుతూ చక్కగా కీర్తించాడు.

   దిబ్బలు బెట్టుచు తేలిన దిదివో
   ఉబ్బు నీటిపై ఒక హంస.

5. **'హన్తా సజ్జ్ఞానామ్'** అనే శ్రుతి ప్రమాణంతో తనను ఆశ్రయించినవారికి ప్రాపంచిక సంగములను హరించి, తన తత్త్వాన్ని అనుగ్రహించి 'పరమహంస' స్థితిని ప్రసాదించువాడు.
6. ఆశ్రయించిన వారి అజ్ఞానాన్ని హరింపజేసే తేజోమయ స్వరూపుడు.
7. భారతంలో భాగవతంలో 'హంసావతారం'గా శ్రీహరిని స్మరించారు. హంసరూపంగా అవతరించి వేదాంత విద్యను ఋషులకు బోధించిన గురు, యోగమూర్తి హంసుడు.

   "శుచిం శుచిషదం హంసం" అంటూ ('భీష్మస్తవరాజం' - మహాభారతం -శాంతిపర్వం) భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించాడు.

"హంస మూర్తి మథాత్మానం జ్ఞాన యజ్ఞ భుజం స్మరేత్" జ్ఞానయజ్ఞ భోక్త అయిన హంసమూర్తిగా ఆత్మను స్మరించాలి – అని స్మృతి.

తన కారుణ్య, జ్ఞాన కాంతులను చక్కగా ప్రసరింపజేసే – జ్ఞాన స్వరూపమే హంస.

మేలు కలిగించే విద్యా కాంతి పక్షాలను విస్తరింపజేసే వాడీతడే కనుక –

సుపర్ణః .. 192

1. మంచి రెక్కలు కలవాడు.

   'సు' – అనే శబ్దానికి మంచి, మేలు, అందం, సుష్ఠు (సమృద్ధి), మంగళం – వంటి అర్థాలున్నాయి. 'పర్ణం' అంటే రెక్కలు.

   పక్షి వలె ఆకాశంలో సంచరిస్తున్నట్లు గోచరించే సూర్యుడు, తన కాంతి రేఖలనే రెక్కలతో లోకాలకు 'సు'శబ్దార్థాలను (మేలు, సంపద మొదలైనవి) ప్రసాదిస్తున్నాడు. కనుక ఆ హంస రూప సూర్యుడు సుపర్ణుడు.

2. సుపర్ణ శబ్దం గరుత్మంతుని పరంగా వేదప్రసిద్ధి. వేదాలలో 'సుపర్ణ సూక్తాలు' గరుడుని ప్రస్తుతించాయి. గరుత్మంతుడు విష్ణు విభూతితో భాసించేవాడు.

   "వైనతేయశ్చ పక్షిణాం" "సుపర్ణాః పతతామస్మి॥" అని విభూతి యోగంలో గీతాచార్య వచనం. పక్షులలో శ్రేష్ఠుడు గరుత్మంతుడు. 'గరుత్' శబ్దానికి కూడా రెక్కలనే అర్థం. మహా పక్షాలతో నున్న దివ్య తేజస్స్వరూపుడు గరుడుడు.

   వేదాలలోనే కాక ఆగమాలలో కూడా గరుడమంత్రాలు ప్రసిద్ధంగా ఉన్నాయి. 'గారుడోపనిషత్తు' కూడా వేద ప్రస్తావన.

3. ఛందములే పక్షములుగా కలిగిన వేదవిద్యయే గరుత్మంతుడు. వేదవిద్య ద్వారా వేద్యుడు విష్ణువని తెలియజేసేదే గరుడ వాహనుని రూపం. వేదానికీ, వేద్యునికీ భేదం లేదు. వేదములే నారాయణుని సుపర్ణములు.

అమృతాన్ని సాధించిన సుపర్ణ గాథ పారాయణం చేస్తే విషాలు (Toxins) హరిస్తాయని ప్రతీతి. అజ్ఞానమే విషమని, జ్ఞానమే అమృతమని గారుడోపనిషత్తు చెబుతోంది. అజ్ఞాన విషాన్ని హరించి, జ్ఞానామృతాన్ని అందించే వేదవిద్యే సుపర్ణుడు. ఇంద్రాదుల చేత ఆరాధింపబడిన దైవం.

ఇంద్రం మిత్రం వరుణ మగ్నిమాహురథో
దివ్యః స సుపర్ణో గరుత్మాన్ । (ఋగ్వేదం)
చన్ద్రమా అప్స్వంతరా సుపర్ణో ధావతే దివి ॥ఋక్॥

కాంతి చంద్రునిగా ఆర్ద్రతని ప్రసరించి రసస్వరూపంగా ఉంటే, సుపర్ణునిగా (సూర్యునిగా) ఆకాశమందు సంచరిస్తోంది.

4. 'సుపర్ణ' శబ్దం జీవాత్మ, పరమాత్మల పరంగా వేదం చక్కగా భావించింది.

ద్వాసుపర్ణా సయుజాసఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వ –
త్యనశ్నన్నన్యోభి చాకశీతి ॥ (ఋగ్వేదం)

రెండు పక్షులు కలసి ఒకే చెట్టు మీదున్నాయి. ఒకటి ఫలాలను తింటుంటే, ఇంకొకటి భుజించక సాక్షిగా చూస్తోంది. మొదటిది జీవాత్మకు, రెండవది పరమాత్మకు సంకేతాలు.

ఇంద్రియాభిమానం గల చైతన్యం జీవుడైతే, ఆ చైతన్యానికి మూలమైనవాడు, ఇంద్రియాతీతుడు పరమాత్మ. నిజానికి ఇది ఒకే ఆత్మ. దేహాభిమానం కలిగినప్పుడు జీవుడు. ఆ అభిమానాన్ని వీడిన శుద్ధ చైతన్యం పరముడు.

5. **యాం ద్విపదః పక్షిణః సంపతన్తి, హంసాः సుపర్ణాः శకునా వయాంసి॥**
(అథర్వవేదం)

పక్షములు కలిగి ఎగిరే చైతన్య విశేషం విష్ణుశక్తియే. పక్షులయందు ఎగిరే చైతన్యంగా వ్యాపించినది అతడే.

వేదవాక్యాలలో ఉండే నామాల వరుసక్రమం, ఈ సహస్రనామాల కూర్పులో చాలాచోట్ల స్పష్టంగా కనిపిస్తుంది. ఇది వైదిక విష్ణువిజ్ఞాననిధి అనడానికి తార్కాణాలివి.

(ఈ నామాలలో సూర్యభావన – సూర్యసంఘమైన గ్రహశక్తులనీ తెలియజేస్తుంది. వివిధ గతులలో జీవులపై ప్రసరించే గ్రహశక్తి విశేషాలు కూడా ఈ నామాలలోనే నిక్షిప్తమై ఉన్నాయని గ్రహించాలి.)

విశ్వగమనమే విష్ణుశక్తి.

ఎగిరే పక్షులలో, నడిచే జీవులలోనే కాక ప్రాకే సర్పాలలో కూడా విష్ణు చైతన్యాన్ని దర్శించాలి కనుక –

భుజగోత్తమః.. 193

1. సర్పములలో గొప్పవాడు.

   పక్షులలో గొప్పవానిగా గోచరించినట్లుగానే, పాములలో తన విభూతి కలిగిన వాసుకి, అనన్తాది దివ్య స్వరూపుడు విష్ణువు.

   "సర్పాణామస్మి వాసుకిః" "అనన్త శ్చాస్మి నాగానాం" అని గీతావచనం.

   వాసుకి, ఆదిశేషుడు వంటి దివ్యసర్పాలు నారాయణ తేజాలు. ఎనిమిది దివ్య సర్పకులాలను శాస్త్రం చెబుతోంది. *1. అనంత, 2. వాసుకి, 3. తక్షక, 4. కర్కోటక, 5. శంఖ, 6. కులిక, 7. పద్మ, 8. మహాపద్మ* – ఈ దివ్య నామములతోనున్నది విష్ణు చైతన్యమే.

2. **'భుజ కౌటిల్యే'** భుజ ధాతువుకి 'కౌటిల్యం' (వంకర) అని అర్థం. వంకరగా గమనం చేసే దానిని 'భుజగం' అని అంటారు. సర్పం అంటువంటి కుటిల గమనం కలది కనుక భుజగం.

   సూర్యకిరణాలు బహు భంగిమలతో గ్రహాలను నడుపుతాయి. అంత గమన శక్తి కలిగినవి వేరొకటి లేవు. ఆ కిరణ సమూహాలే సర్వోత్తమ గమనశీలము కలవి. అటువంటి కిరణాలతో గమనం చేయించే సూర్య నారాయణునే

'భుజగోత్తము'నిగా భావించవచ్చు.

సృష్టిలో నున్న గమనశక్తికి (గతికి) అధిష్ఠానమైనవాడు విష్ణువు.

3. భుజగముపైనున్నవాడు – భుజగోత్తముడని కూడా అర్థాన్ని చెప్పవచ్చు. **'భుజగస్య ఉత్తమః శేషీ భుజగోత్తమః'.** ఆదిశేషుని పర్యంకంగా చేసుకొని శయనించుటచే, ఆదిశేషునకు ప్రభువు.

సుష్వాప భగవాన్ విష్ణు రప్సయ్యా మేక ఏవహి।
నాగస్యభోగే మహతి శేషస్యామిత తేజసః॥ (భారతం)

'విష్ణువు ఒక్కడే సృష్టికి పూర్వం జలం అనే శయనాన, శేషపాన్పుపై శయనించిన మహా తేజస్వి.'

భోగశయ్యా గతః శేతే త్రైలోక్యగ్రాసబృంహితః. (విష్ణు పురాణం)

ప్రళయాన ముల్లోకాలను ఆరగించి శేషశయనాన నిదురించినవాడు.

అన్ని గతులకు మూలమైన, కేంద్రంగా ఉన్న విష్ణువే –

హిరణ్యనాభః .. 194

1. తేజోమయమైన నాభి కలవాడు.

'నహ్యతి బధ్నాతి ఇతి నాభిః' – బంధించి (ఒకచోట) ఉంచునది నాభి. అన్నీ దేనియందు కేంద్రీకృతమై ఉంటాయో అది 'నాభి'. విశ్వానికి మూలమైన తేజస్సు 'హిరణ్యం'. ఆ తేజస్సును కేంద్రంగా చేసి విశ్వ చక్రాన్ని విస్తరింపజేసినవాడు విష్ణువు.

లోకంలో చక్రానికి నడిమి కేంద్రాన్ని 'నాభి' అంటారు. శరీర కేంద్రం కూడా 'నాభి'యే.

యావత్యస్తు సిరాః కాయే సంభవంతి శరీరిణామ్।
నాభ్యాం సర్వా నిబద్ధాస్తాః ప్రతన్వన్తి సమంతతః॥
నాభిస్థా ప్రాణినాం ప్రాణాః ప్రాణాన్నాభిర్వ్యపాశ్రితా।
సిరాభిరావృతా నాభిశ్చక్రనాభిరివారకైః॥

"మన శరీరంలోని సర్వ 'సిర'లకు నిబంధన స్థానం (కేంద్రం) నాభి (బొడ్డు). చక్రంలో అరలన్నీ (ఆకులు) కేంద్రాన్ని ఆధారం చేసుకున్నట్లుగా, సిరలకు మూలమైన ప్రాణాలన్నీ నాభిని ఆశ్రయించి ఉంటాయ"ని సుశ్రుతుడు శరీర శాస్త్రంలో వివరించాడు.

గ్రహనక్షత్రాదులన్నిటికీ మూలమైన తేజోకేంద్రశక్తి విష్ణువే కనుక అతడు 'హిరణ్యనాభుడు', విశ్వాన్ని నడిపే సర్వశక్తులకూ అతడే ఆధారం.

2. సృష్ట్యారంభంలో సృష్టి బీజాలన్నీ తేజోమయంగా స్వామి నాభియందు కేంద్రీకృతమై, ఆ తేజస్సు నుండి ఉద్భవించిన కమలములో సర్వజీవుల సమష్టి స్వరూపమైన బ్రహ్మ ఆవిర్భవించాడని, సృష్టి క్రమం వివరిస్తోంది. ఆ పద్మానికి కూడా మూలమైన తేజోమయ నాభి కలవాడు విష్ణువు. విశ్వ చక్రానికీ, కాలచక్రానికీ కేంద్రమైనవాడే కాక, విశ్వ విజ్ఞానమంతా అతడే కనుక –

సుతపాః .. 195

1. చక్కని జ్ఞాన స్వరూపుడు.

తపశ్శబ్దానికి జ్ఞానమని అర్థం. లోకరక్షాకరమైన (సు)జ్ఞానమే తన శరీరంగా (స్వరూపంగా) కలవాడు.

'దివ్యబోధ తనుర్విభుః' (దివ్యజ్ఞాన శరీరుడు). చిన్మయ విగ్రహుడు కనుక సుతపుడు.

తన అనంత జ్ఞానంతోనే ఎవరికీ అంతుపట్టని విశ్వాన్ని ఏర్పరచాడు. నారాయణుని తపోజనితమే ఈ లోకం. **'తద్ధితపః తద్ధి తపః'** అని శ్రుతి. తపోరూపుడైన హరి విశ్వమంతటా తపోనియమాన్ని ఏర్పరచాడు. ఆ కారణం చేతనే సృష్టియందంతటా ఎవరు ఏది సాధించాలన్నా తపస్సే సాధనమయ్యింది.

ఇన్ద్ర ఇత్సోమపా ఏక ఇన్ద్రః సుతపా విశ్వాయుః। (ఋగ్వేదం)

ఋతంచ సత్యం చాభీ ద్ధాత్తపసోధ్యజాయత।
తతో రాత్ర్యజాయతే తతః సముద్రోర్ణవః।। (ఋగ్వేదం)

విశ్వాయువైన తపస్సు నుండే విశ్వకారక శాశ్వత సత్యాలు, దివారాత్రాలు, సముద్రం, ఆకాశం వంటివి కలిగాయని వేద హృదయం.

2. 'మనసశ్చేంద్రియాణాం చ హ్యైకాగ్ర్యం పరమం తపః।

మనస్సు, ఇంద్రియాల ఏకాగ్రతనే గొప్ప తపస్సంటారు.

నిత్యమూ ఏకాగ్రచిత్తంతోనున్న జ్ఞాన (తపః) స్వరూపుడు నారాయణుడు. తపోమార్గాన్ని బోధించడానికై బదరికాశ్రమంలో గొప్ప తపఃస్వరూపులుగా నరనారాయణులుగా అవతరించినవాడు.

హిరణ్యనాభుడు తన జ్ఞానంతో, తపస్సుతో ఆ నాభి నుండి సృష్టిని వికసింపజేసినవాడు. కనుక –

పద్మనాభః .. 196

1. పద్మము నాభియందు కలవాడు.

'హిరణ్యనాభ' అనే నామంలో విశ్వ బీజ శక్తులకు కేంద్రంగా చెప్పబడిన శ్రీహరి, తన గొప్పదైన తపస్సుతో (సుతపాః) దానిని వికసింపజేశాడని ఈ నామం చెబుతున్నది.

సృష్టి వికాసానికి సంకేతమే పద్మం. బీజస్థితి హిరణ్య నాభం. దానిలో దాగిన సృష్టిగతజ్ఞానమే సుతపస్సు.

అది విశ్వపద్మంగా విరబూసినప్పుడు ఆ అనంత విశ్వానికి సైతం తానే కేంద్రమైనవాడు.

కదా చిత్తస్య సుప్తస్య నాభ్యాం కామాదజాయత।
దివ్యమష్టదలం భూరి పంకజం పార్థివమ్ మహత్।।
యస్య హేమమయీ దివ్యా కర్ణికా మేరు రుచ్యతే.

యోగ ముద్రలోనున్న నారాయణుని సంకల్పించే ఆతని నాభి నుండి

భువనసృష్టికి సంబంధించిన అష్టదళాలతో కూడిన పెద్ద తామర ఒకటి ఉద్భవించింది. దానికి హిరణ్మయమైన (బంగారపు) మేరువు (నడిమి మూలస్థానం) దుద్దుగా (కర్ణికగా) ఉన్నది.

2. **పద్యతే జ్ఞాయతేనేన ఇతి 'పద్మం'** – జ్ఞానం.

దేనితో తెలియబడుతుందో అది పద్మం. అనగా జ్ఞానం. ఆ జ్ఞానమంతా దేనియందు నిబద్ధమై ఉంటుందో అదే పద్మనాభం.

సృష్టిలో ప్రతి పదార్థానికి దానిదైన జ్ఞానం ఉంటుంది. ఇది బుద్ధిగతమైన జ్ఞానమని చెప్పనక్కర్లేదు. పదార్థగతమైన జ్ఞానమే. ఒక వృక్షంలో దాని వ్యవస్థాగతమైన జ్ఞానమంతా నిబద్ధమై ఉంటుంది. మొలకెత్తడం, మొక్కగా ఎదగడం, వృక్షంగా విస్తరించటం, కొమ్మా రెమ్మా వర్ధిల్లడం, పుష్పం ఫలం కలగడం – అంతా దాని బీజంలోనే నిబద్ధమై విలసిల్లుతుంది. అదే విధంగా సృష్టిలోనూ, అందులోని ప్రతి వస్తువులోనూ ఉన్న విశ్వ విజ్ఞానమంతా కేంద్రశక్తియైన విష్ణు బ్రహ్మమునందే నిబద్ధమై ఉంది. అందుకే ఆతడు పద్మనాభుడు.

ఈ విధంగా సర్వజీవకోటికి మూలమై పాలించేవాడు –

పుట్టిన వాటన్నిటికీ (ప్రాణకోటికి) ప్రభువు. ఆ పద్మనాభుని నుండి ఏర్పడిన జగత్తులో జీవులకు కావలసిన అన్నిటినీ సమకూర్చి పెంపుదల చేసే పతి అతడు.

'హిరణ్యనాభ' నామం నుండి ఈ నామం వరకు సృష్టి క్రమాన్ని చెబుతూ, బీజ, జ్ఞాన, విస్తారములుగా ఉన్న జగమున ప్రతి ప్రాణినీ పోషించి రక్షించే వ్యవస్థ కూడా విష్ణు చైతన్యమేననే అవగాహన కలిగిస్తున్నారు ఋషులు.

స ఓతః ప్రోతశ్చ విభుః ప్రజాసు. (యజుర్వేదం)

సర్వ ప్రాణులయందు ఎడతెగక వసించే విభుడు.

హరిః పవమానః ప్రజాపతిః । (ఋగ్వేదం)
ప్రజాపతే న త్వదేతాన్యన్యో విశ్వాజాతాని
పరితా బభూవ।। (యజుర్వేదం)
ప్రజాపతిః ప్రజయా సంరరాణస్త్రీణి జ్యోతీంషి
సచతే స షోడశీ ।। (యజుర్వేదం)

– ఇలా వేదం పలుచోట్ల 'ప్రజాపతి'గా పరమేశ్వరుని ప్రస్తుతించింది. ప్రాణికోటిని పాలిస్తున్నా సృష్టి వ్యవస్థలో భాగంగా దమన, యమాది శక్తులతో మృత్యువును కలిగిస్తున్నా, తాను నశించనివాడు కనుక –

అమృత్యు స్సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః।
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా ।।... 22

198. అమృత్యుః, 199. సర్వదృక్, 200. సింహః, 201, సంధాతా, 202, సంధిమాన్, 203. స్థిరః । 204. అజః, 205. దుర్మర్షణః, 206. శాస్తా, 207. విశ్రుతాత్మా, 208. సురారిహా।।

అమృత్యుః.. 198

1. నాశనముగానీ, నాశనకారణంగానీ లేనివాడు.

శరీరానికి ఆత్మ చైతన్య సంయోగమే ఆయువు. వియోగమే మృత్యువు. ఈ సంయోగ వియోగాలు లేనివాడు అమృత్యుడు. మనలోనున్న ఆత్మచైతన్యం శరీరంతో సంయోగ వియోగాలు పొందుతున్నా తాను నశించదు. ఈ జ్ఞాన మెరిగిన యోగి తానే ఆత్మనని తెలిసి అమృతత్వాన్ని పొందుతాడు. ఈ అమృతత్వమే హరి. ఈ అమృతాన్ని అందించేవాడు హరి.

శరీర చైతన్యాల వియోగాలను కల్పించే మృత్యువు ఆయనే, నశించే తనువు తాను కాననే జ్ఞానాన్నిచ్చే అమృత్యువూ ఆయనే.

'అకామో ధీరో అమృతేన స్వయంభూ' – అని 'ఋగ్వేదం' ప్రస్తుతించింది.

2. ఈ నామం నుండి 'సురారిహా' *(208)* నామం వరకు మళ్లీ నరసింహ స్వరూపం ప్రస్తావించబడుతోందని కొందరి భావన.
సర్వజగములందు చైతన్యముగానున్న విష్ణుని ఎరిగిన ప్రహ్లాదుని కాపాడి తన 'అమృత్యు' తత్త్వాన్ని చూపిస్తూ, తనువునే సత్యమనుకున్న హిరణ్యకశిపునకు మృత్యువైనవాడు నృసింహం. మృత్యులక్షణం కలిగిన దేహంలో, అమృత్యువై ఉన్న చైతన్య స్వరూపుడు.

వినశ్యంత్య వినశ్యంతం యః పశ్యతి సపశ్యతి (గీత)

ఆశ్రయించిన భక్తులకు అజ్ఞాన రూపమృత్యువును హరిస్తాడు.
నృసింహ మంత్రంలో ఈ భావమే ప్రస్తావితం.

నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహమ్॥

తాను శాశ్వతుడు కనుక సర్వకాలములను, సర్వ జీవులను సర్వ సమగ్రంగా దర్శించేవాడు -

సర్వదృక్.. 199

1. అన్నిటినీ చూచువాడు, అన్ని వైపుల చూచువాడు.
జ్ఞానమే తానైన విష్ణువు ప్రాణికోట్లలో 'అమృత్యు' చైతన్యమై సర్వమునకు సాక్షియై ఉన్నాడు. ఆయన చూపు అనంతం.
ప్రాణుల కర్మలన్నిటినీ దర్శించే సర్వద్రష్ట ఆయన.
2. చూసే చైతన్యమే లేనప్పుడు, చూడబడే వస్తువుల ప్రయోజనమే లేదు. ప్రతి ప్రాణిలోనూ చూసే చైతన్యంగా - అర్థం చేసుకొనే జ్ఞానంగా (బుద్ధి) ఉన్నవాడు.
3. నృసింహమంత్రంలో -
'జ్వలన్తం సర్వతోముఖమ్' అనే భాగాన్ని ఈ నామం సూచిస్తోంది. వెలుగే తానై అన్ని వైపులా చూసే జ్వాలా నరసింహుడతడు. సర్వతోముఖుడు. అన్నిటినీ చూసే అతడే సమయమెరిగి కర్మానుసారం హింసించగలడు కనుక -

సింహః.. 200

1. హింసించువాడు.

   సమయమెరిగి జీవులను సమయింపజేసేవాడు.

   దేనికైనా ముగింపు అవసరమే. కాల కర్మానుసారం ఆ ముగింపు నిచ్చే చైతన్యం విశ్వ వ్యవస్థలో సర్వవ్యాపకమై ఉంది. ఆ వ్యాపక చైతన్యమైన విష్ణువే హింసకుడై 'సింహ'మని స్తుతింపబడుతున్నాడు. మనల్ని బ్రతికిస్తున్న చైతన్యమే, తగిన తరుణంలో తరలిస్తుంది.

2. సృష్టిలో ప్రతి వస్తువులోనూ 'హింసా' లక్షణం ఉంది. ఆ లక్షణంగా వ్యాపించినవాడు విష్ణువేనని గుర్తించాలి.

   ప్రతి వస్తువు విపరీతమైతే (ప్రతికూలమైతే) వైరం, అనుకూలిస్తే ప్రీతి. రక్షించి పోషించే జల, వాయు, అగ్ని, భూ తత్త్వాలే ప్రకోపించితే హింసించి నశింపజేస్తాయి. ఇలా ప్రత్యణువులోనూ ఈ హింసా గుణం చైతన్య లక్షణమే కదా! విశ్వవ్యవస్థలో ఈ హింసాస్వరూపంగా వ్యాపించిన సింహమాతడు.

   స సంవతో నవజాతస్తు తుర్యాత్

   సింహం న కృద్ధమభితః పరిష్టుః॥ (ఋగ్వేదం)

   - అనే మంత్రంలో ఈ విషయాన్ని దర్శించవచ్చు.

3. నృసింహావతారాన్ని స్పష్టం చేసే నామమిది. మహామంత్రంలో - **'నృసింహం భీషణం'** అనే భాగాన్ని చెబుతున్నదీ నామం. సింహవదనంతో ఆవిర్భవించి అవతార ధర్మాన్ని నిర్వర్తించిన లీలామయుడు హరి.

4. సుపర్ణ, హంసాది పక్షి విభూతులవలె, మృగాలలో సింహం విష్ణువిభూతి. **'మృగాణాం చ మృగేంద్రోహం'** (మృగములలో 'సింహ'న్ని నేను) - అని 'విభూతియోగం' (గీత)లో భగవానుని మాట.

   ఈ హింసా స్వభావము స్వామి క్రోధఫలం కాదు, జీవుని కర్మ ఫలాన్నివ్వడమేనని సూచిస్తూ తరువాతి నామం -

- ద్వితీయ శతకం సంపూర్ణమ్ -

సన్ధాతా.. 201

1. సన్ధానము (కలుపుట) చేయువాడు.

   'సర్వ దృక్' అయిన విష్ణువు ప్రతి జీవుని కర్మల ననుసరించి ఆయా ఫలాలను ఆయా జీవులతో సంధానం చేస్తాడు. కర్మకీ, ఫలానికీ సన్ధాన కర్త ఆ ఈశ్వరుడే.

   విచారించు హరి నా విన్నపమవధరించు
   పచారమే నాదిగాని పనులెల్లా నీవే (అన్నమయ్య)

   కేవలం 'నేనే' అని అనుకొనడం మన అజ్ఞానపుటహంకారం. చైతన్యంతో దేహాన్ని 'సంధానం' చేసే ఆ నారాయణుని పనులే అన్నీ.

2. విశ్వవ్యాపకమైన విష్ణువు విశ్వమంతా ఈ 'సంధాతా' లక్షణాన్ని ప్రదర్శిస్తున్నాడు. విడివిడిగా ఉన్న ఇంద్రియాలన్నీ చైతన్యంతో ఒకే దేహమందు పరస్పర సంబంధంతో సంధానమై ఉన్నాయి. ప్రతి వస్తువు వివిధ అణువుల మధ్య సంబంధంతో వ్యవహరించబడుతోంది. గమనిస్తూ వెళితే విశ్వమంతా ఒక ***నిరంతర సంధాన లక్షణం***తో శోభిస్తోంది. ఈ అవగాహన కలిగితే ఈ సంధాన రూప చైతన్యంతోనే విశ్వరూపుడైన విష్ణువును తెలుసుకోగలం.

3. కలవని 'సింహ– నర' రూపాలను కలిపిన అద్భుతావతారంతో 'సంధాత'గా ప్రత్యక్షమయ్యాడు నారాయణుడు.

   ఈ 'సంధాతృ' రూప విష్ణువును గ్రహిస్తే విశ్వాన్ని అభిన్నంగా దర్శించే జ్ఞానం లభిస్తుంది. కలపడమే కాక, కలిసి ఉన్నదీ ఆతడే –

సంధిమాన్.. 202

1. ఏకభావంతో ధరించువాడు.

   'సమానధారణాత్ సంధిః' సర్వమును సమానంగా ధరించేవాడు.

   కర్మ ఫలాలను జీవులకు సంధానం చేస్తున్నా, సమదృష్టితో ఉన్నవాడు.

సంధాత అయిన విష్ణువు సమానంగా, సమగ్రంగా విశ్వాన్ని ధరించుతున్నవాడు.

మన దేహంలో అన్నరసం శరీరమంతా సమానంగా వ్యాపించి ఆయా ఇంద్రియాలకు శక్తినిస్తోంది. పాదాంగుళి నుండి శిరః పర్యంతం అన్ని సంధులు సమాన రూపంతో తమ కార్యాలను నిర్వహిస్తున్నాయి. ఇలా సమానంగా శరీరమంతా చైతన్యం పనిచేస్తున్నట్లుగానే, విశ్వమంతా నక్షత్ర గ్రహాదులన్నిటినీ సమాన రూపంలో ధరిస్తున్నాడు విష్ణువు.

2. 'సంధాతా, సంధిమాన్' నామాలను పరిశీలిస్తే, నృసింహతత్త్వం స్ఫురిస్తుంది. నృసింహావతారమే సంధ్య. నర, మృగాలనే రెండింటినీ, పగలు రాత్రులనీ, వెలుపలా లోపలనూ, ప్రాణ సహిత ప్రాణ రహితాలనీ – ఈ ద్వంద్వాలన్నిటినీ కలిపిన, కలిసిన అవతారమది. అలాగని ఆ ద్వంద్వాలకు దేనికీ చెందదు. (చూ. 21వ నామం)
3. 'సంధాతా' అనే శబ్దానికి 'చేరదీయువాడు', 'సంధిమాన్' అన్న నామానికి 'చేరియున్నవాడు' అని కూడా భావించవచ్చు.

ప్రహ్లాదుని చేరదీసినవాడు, ఆయనతో నిత్యమూ ఉన్నవాడు, **"తస్మిన్ తజ్జని భేదాఽభావత్"** (నారదభక్తి సూత్రాలు) భగవంతునికీ, భక్తునికీ భేదం లేదు. భక్తుడు తన్మయుడు కనుక ఈ మాటనే –

"యే భజంతి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహం"

– "భక్తితో సేవించే వారియందు నేను, నాయందు వారు ఉంటారు" అని పరమాత్మ గీతలో స్పష్టం చేశాడు.

ఒక విధంగా చూస్తే – హిరణ్య కశిపువధ కూడా ఆ జీవుని చేరదీయడానికి చూపిన అనుగ్రహమే కదా!

4. ఫలంతో కలయిక పెట్టుకున్న జీవుడు కర్మఫలభోక్తగా వ్యవహరింప బడుతున్నాడు. ఈ ఫలభోక్తృస్వరూపం కూడా నారాయణ చైతన్య విశేషమే. కలిపినా, కలిసినా తాను మాత్రం తన స్థితిలోనే కదలక ఉన్నాడు కనుక –

స్థిరః.. 203

1. (ఎల్లప్పుడు) ఉండువాడు. (తిష్ఠతీతి స్థిరః)

   స్థిరమైన ఆయన చేతనే అన్నీ కలుపబడుతున్నాయి. తాను కలిపినవి, తన కలయికతో కదిలేవీ జరుగుతున్నా తాను స్థిరంగా ఉన్నాడు. మణిమాలలో పూసలు చరిస్తున్నా, వాటిని కలిపి ఉంచిన సూత్రం ఆద్యంతం స్థిరంగా ఉంది.

2. సమానంగా ధరించే బ్రహ్మ చైతన్యం కనుక సదా ఏ పరిణామమూ లేక ఏక రూపంతో ఉన్నవాడు.

   "కర్మణి కర్మణి స్థిరః"

   "సవృక్ష ఇవస్తబ్ధో దివి తిష్ఠత్యేకః" (నిరుక్తం)

   -వంటి శ్రుతి వాక్యాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

3. అంతటా స్థిరమైన వాడను తానేనని ప్రకటించిన అవతారం నారసింహుడు. హిరణ్యకశిపుడు, అతడి అనుచరులు ఎదుర్కొన్నా 'స్థిరం'గా ఉండి ప్రతాపాన్ని చూపినవాడు. ప్రహ్లాదాది భక్తులను వీడక స్థిరంగా ఉండేవాడు.

   స్థిరమైన వాడు కనుకనే ఒకప్పుడు లేనివాడు కాదు - మరొకప్పుడు కలిగేవాడు కాడు -

అజః.. 204

1. పుట్టుట లేనివాడు.

   'నతే విష్ణో జాయమానో నజాతో' - విష్ణువు పుట్టబడినవాడు, పుట్టినవాడు కాడు. శాశ్వతుడు.

   ఈ శ్లోకం ప్రథమపాదంలోని ప్రథమ నామం 'అమృత్యుః' - రెండవ పాదంలో మొదటి నామం 'అజః'. ఈ రెండూ జన్మమృత్యువులు లేని శాశ్వతుడైన విష్ణుని తెలియజేస్తున్నాయి.

   శం నో అజ ఏకపాత్ దేవోఅస్తు (అథర్వవేదం)

2. 'అజతి గచ్ఛతి క్షిపతీతి వా అజః' –తాను కదలి శత్రువులను విసరివేసినవాడు.
రాక్షసులను దూరం చేసే దైవం కనుక 'అజః'.
నృసింహునిగా స్వామి దనుజులను దూరం చేసినవాడే కదా!
అవతారంగా ఆవిర్భవించినా, అది అతనికి పుట్టుక కాదు కనుక 'అజుడు'.
ఏ పుట్టుకాలేని వాడు అలా అవతారంగా వచ్చినప్పుడు –

దుర్మర్షణః.. 205

1. ఇతరులచే ఎదుర్కొనుటకు వీలు లేనివాడు.
దానవాదులు ఎదుర్కొనలేని పరాక్రమశాలి.
నృసింహునిగా వచ్చినప్పుడు దానవుడు ఎంత విజృంభించినా, ఆ పరమ ప్రతాపసింహం ముందు నిలువలేకపోయాడు. శ్రీరామ కృష్ణాది అవతారాలలోను ఆ విధంగానే భాసించాడు.
2. ఒకదానినొకటి ఎదుర్కొనలేని లక్షణం కూడా విశ్వవ్యాపక చైతన్యంగా విష్ణువే నిర్వహిస్తున్నాడు.
3. సూర్యునిలో ఇతరులు తేరిపారచూడలేని తేజస్సు విష్ణురూపమే. గాలి తన ప్రతాపాన్ని చూపిస్తే మహావృక్షాలే ఎదుర్కొనలేవు. నీరు విజృంభిస్తే నిప్పుని ఆర్పుతుంది. నిప్పు ప్రకోపిస్తే నీటిని ఎండగడుతుంది. ప్రకృతిలో ప్రతి దానిలోనూ ఈ 'దుర్మర్షణ' శక్తిని వ్యాపింపచేసిన విష్ణు చైతన్యానికి వందనం. ఆ విరాట్ చైతన్యుని ఈ అనుగ్రహం పొందిన వానిని కూడా ఇతరులు ఎదుర్కొనలేరు. ప్రహ్లాదుని హిరణ్యకశిపుడు ఏమీ చేయలేకపోయాడు. ప్రకృతిలోని శక్తులూ బాధించలేకపోయాయి. దుర్మర్షణుడు తన నాశ్రయించిన వానిని కూడా దుర్మర్షణునిగా మార్చగల అనుగ్రహ స్వరూపుడు.
3. విశ్వమంతా తానే ఉన్నా విశ్వంలోని ఏ ఒక్కరూ ఆయనను అతిక్రమించలేరు, గ్రహించలేరు. అంచనా వేయలేరు.

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః
న చైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుతః॥

శస్త్రములు ఛేదించలేని, అగ్ని కాల్చలేని, నీరు తడుపలేని, గాలి ఎండించలేని ఆత్మతత్త్వమే విష్ణువు.

ఎదిరింప సాధ్యంకాని జగత్ప్రభువు కనుక –

శాస్తా .. 206

1. శాసించువాడు.

   విశ్వమును, లోకపాలకులను శాసించేవాడు. నిత్యజ్ఞానరూపమైన వేద ధర్మంతో లోకాలను పాలించేవాడు.

   "శ్రుతి స్మృతి ర్మమై వాజ్ఞా" – అని స్వామి వచనం. వేదాలను, ధర్మ శాస్త్రాలను తన ఆజ్ఞలుగా శాసించువాడు.

2. గురుస్వరూపుడైన ఈ ప్రభువే, ఆ ధర్మాలను తప్పేవారిని 'శిక్షించువాడు కూడా'. ఆ శాసక స్వభావంతోనే దనుజులను శిక్షించడానికై అవతరించాడు. **కవిం పురాణం 'అనుశాసితారం'** – (భగవద్గీత) అని శ్రీకృష్ణుని అర్జునుడు నుతించాడు. ఎవరూ అతిక్రమించలేని ఆయన శాసకత్వశక్తి విశ్వంలో ప్రతిచోటా కనిపిస్తుంది –

విశ్రుతాత్మా.. 207

1. బాగుగా ప్రసిద్ధమైన స్వరూపముగలవాడు.

   అంతటా వ్యాపించిన వాడు కనుక సర్వమున ఆతడు ప్రసిద్ధుడు. విశ్వంలో ప్రతి అణువూ ఆయన వైభవాన్నే చాటుతోంది.

2. సర్వమున వ్యాపించిన తన తత్త్వాన్నే నృసింహ స్వరూపంగా ప్రదర్శించాడు. "చక్రి సర్వోపగతుడు" అనే ప్రహ్లాదుని మాటను నిజం చేస్తూ, అంతటా నిండిన తన స్వరూపాన్నే నారసింహంగా ప్రకటించిన కారణంగా 'విశ్రుతాత్ముడు'.

3. విశేషంగా తెలియబడేవాడు, వినబడేవాడు. వేదాది శాస్త్రములు, దేవతలు, యోగులు విష్ణువునే కీర్తిస్తున్నందున, వ్యాపకంగా ఆయన తత్వం వినబడుతోంది. తెలియబడుతోంది. నృసింహస్వామి అవతరించిన తరువాత దేవతాగణాలు, ఋషి గణాలు, భక్తులు పరవశంతో విశేషంగా విష్ణువును కీర్తించారు.

   విశ్వమయతను చాటే స్వరూపంలో రాక్షస శక్తులను
   మడియింపజేసినందున –

సురారిహా.. 208

1. **దేవశత్రువులైన దైత్యులను సంహరించినవాడు.**
   'సుర'లు – దేవతలు. వారి "అరులు" (శత్రువులు) రాక్షసులు. 'హా' హంతృవాచకం.
   హిరణ్యకశిపుని, తదితర రాక్షసులను సంహరించి అవతార ప్రయోజనాన్ని నెరవేర్చినవాడు. రామకృష్ణాదుల అవతరణ కూడా దైత్యభావనాశనార్థమే. విష్ణు స్తుతిచే అంతరంగ బహిరంగాలలో రాక్షస భావాలు నిర్మూలనమౌతాయి.
2. శోభన, శుభ, క్షేమాలను కలిగించే దివ్య గుణాలున్న వారే సురలు. (**సుం రాతి** – మంచిని కలిగించువారు) వారిని బాధించే వారిని నశింపచేసి మంచిని కాపాడే రక్షణ శక్తి విష్ణువు.
   శుభంకరమైన దైవీ సంపదగల వారి లోపలి అజ్ఞానాన్ని సమూలంగా నశింపజేసే బోధకుడు (జ్ఞానస్వరూపుడు) కూడా ఆయన గనుక –

గరుర్గురుతమో ధామ సత్యః సత్యపరాక్రమః।
నిమిషోనిమిషః స్రగ్వీ వాచస్పతి రుదారధీఃll... 23

209. గురుః, 210. గురుతమో, 211. ధామ, 212. సత్యః, 213. సత్యపరాక్రమః ।

214. నిమిషః, 215. అనిమిషః, 216. స్రగ్వీ, 217. వాచస్పతిరుదారధీఃll

గురుః.. 209

1. జ్ఞానమును బోధించువాడు.

   అందరి బుద్ధులను ప్రేరేపించే (ధియో యోనః ప్రచోదయాత్) ఆచార్యుడు హరి. సకల విద్యలకు తానే ఉపదేశకుడు. కారకుడు. వేదజ్ఞానమును తన నుండి ఆవిర్భవింపచేసిన ఆదిగురువు.

   "న ఏష పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్"– అని యోగశాస్త్రవాక్యం.

   "నారాయణ సమారంభాం" అంటూ గురువందనం చేయటం సంప్రదాయం. నరనారాయణ, కపిల, ఋషభ, దత్తాత్రేయ, శ్రీకృష్ణాది ఆచార్యాది రూపాలతో అవతరించి గురుస్వరూపంగా బ్రహ్మ విద్యను ప్రతిష్ఠ చేసినవాడు.

2. విశ్వవ్యాపకంగా విష్ణు చైతన్యం కాలంలోనూ, వస్తువులలోనూ వ్యాపించి గురుత్వం వహిస్తుంది. విశ్వరూపుడై ప్రతి జీవునకు గురుత్వం వహించేవాడు విష్ణువు. మనలో శిష్యత్వ లక్షణం ఉంటే విశ్వంలో ప్రతి అణువు నుండి విష్ణుని బోధ లభిస్తుంది. వినయం, జిజ్ఞాస, సాధన, పరిశీలన, భక్తి – ఉన్నప్పుడు తానే విశ్వం నుండి బోధచేస్తాడు.

   భాగవతం ఉద్ధవగీతలో ఒక అవధూత ప్రకృతి రూపాలన్నీ తనకు గురువులేనని చెప్పటం గోచరిస్తుంది. లోకమే నారాయణుని గురుస్వరూపం.

అంతేకాదు – శకునముల ద్వారా, మరికొన్ని సంకేతాల ద్వారా రానున్న శుభాశుభాలను సూచించే గురులక్షణం విశ్వమంతా వ్యాపింపజేశాడు. మన ప్రాచీనులు ఎంతో సూక్ష్మ పరిశీలనతో, పరిశోధనతో ఏర్పరచిన శకున శాస్త్రాలు, లక్షణ శాస్త్రాలు మనకి ఉన్నాయి. శరీర లక్షణం, మన ఆయువు మొదలైన వాటిని తెలియపరుస్తాయి. కాలంలో ప్రకృతిలో వివిధ సంకేతాల ద్వారా రానున్న పరిణామాలను తెలియపరచే గురుచైతన్యాన్ని వ్యాపింపచేసినవాడు కనుక విశ్వ 'గురువు.'

యోగం ప్రపద్యే క్షేమంచ, క్షేమం ప్రపద్యే యోగంచ,
నమోఽహోరాత్రాభ్యామస్తు (అధర్వవేదం)

అహోరాత్రాదులు కూడా మన క్షేమాదులను బోధించే విష్ణుని ఆచార్య రూపాలే.

3. మన బుద్ధిని తేజోమయం చేసే ఆచార్యుడు, మంత్రము, ఋషి గురుశక్తులు. అవి విష్ణు రూపాలు. గురు భక్తియే విష్ణు భక్తి.

మంత్రో గురుః పునరస్తు సో అస్మాన్... ॥ఋగ్వేదం॥
ఋచో అక్షరే పరమేవ్యోమన్

4. ఈ నామం నుండి 'సమీరణః' (223) నామం వరకు మత్స్యావతారం వర్ణించబడినట్లుగా శ్రీ పరాశరభట్టు భావించారు. ప్రళయకాలంలో వేదాది విద్యలను కాపాడి, తిరిగి సృష్ట్యారంభంలో సోమకాసుర సంహారం చేసి రక్షించిన వేదవిద్యను బ్రహ్మకు అనుగ్రహించిన మహామత్స్యావతారుడు వేదోద్ధారకుడైన గురువు. ఈ గురువుని మించిన వారు లేరు కనుకనే –

గురుతమః.. 210

1. తనను మించిన గురువు లేనివాడు.

దేవగురువు బృహస్పతి. దైత్యుల గురువు శుక్రుడు. వివిధ విద్యలకు, సంప్రదాయాలకు, వివిధాచార్యులు. శుక, వ్యాస, సనకసనందనాదులు,

వసిష్ఠాదులు, బ్రహ్మ విద్యా గురువులు. వారికి సైతం గురువైనవాడు పద్మోద్భవుడైన బ్రహ్మ. ఆ తొలిగురువుకి కూడా గురువు గురుబ్రహ్మ నారాయణుడు.

యోగోజ్ఞానం తథా సాంఖ్యం విద్యాశ్శిల్పాది కర్మచ।
వేదాశ్శాస్త్రాణి విజ్ఞానం ఏతత్ సర్వం జనార్దనాత్।।
ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః।
జంగమాజంగమం చేదం జగన్నారాయణోద్భవమ్।।

"యోగ, జ్ఞాన, సాంఖ్యాదులు, పరాపర విద్యలు, కళాకౌశల్యాది శిల్పకర్మలు, వేదాది శాస్త్రాలు – ఈ సర్వ విజ్ఞానము జనార్దనుని నుండియే ఆవిర్భవించాయి. ఋషులు, పితరులు, దేవతలు, మహాభూతములు, ధాతువులు, జంగమాజంగమాలన్నీ నారాయణుని నుండి వచ్చినవే".

2. 'గురు' శబ్దానికి 'పెద్దవాడు', 'తండ్రి' అని కూడా అర్థం ఉంది.

'అహం బీజః ప్రదః పితా' అని గీతలో స్వామి వచనం.

గత సృష్టి బీజములను, విద్యలను, ఉత్తమ చక్రవర్తులను, ఋషులను ప్రళయకాలంలో నావయందుంచి, తాను మత్స్యమై పునఃసృష్టి వరకు కాపాడిన మీనావతారుడు.

"పూజ్యశ్చ గురుర్గరీయాన్" – పూజ్యుడవు, పరమ గురువువు నీవేనని శ్రీకృష్ణుని స్తుతించిన అర్జునుడు, **"శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్"** అని శరణువేడాడు **"కృష్ణం వందే జగద్గురుమ్"** అని ఆ గీతాచార్యునే ఆశ్రయించారు బ్రహ్మవిద్యావేత్తలు.

3. గ్రహ మండలంలో అతి పెద్దది గురువు – అని బృహస్పతి గూర్చి మన జ్యోతిష శాస్త్రం ప్రాచీన కాలంలోనే చెప్పింది. బృహత్, గురు – శబ్దాలు ఆ పెద్దరికాన్ని చెబుతున్నాయి. తదధిదేవత యొక్క శుభదృష్టి ఉన్నవారికి విద్యాబుద్ధులు లభిస్తాయి ఆ గ్రహమందు లీనమై వ్యాపించిన బృహస్పతి శక్తి నారాయణ విభూతి.

గురుతముడే జ్ఞానకాంతి పుంజం కనుక –

1. జ్యోతిః స్వరూపుడు.
   వెలుగులకు వెలుగైనవాడు. **'నారాయణ పరో జ్యోతిః'** – అని శ్రుతి.
   జ్ఞానమే కాంతి. దానిని ప్రసరింపచేసే గురువే జ్యోతి. ఆతడే 'ధామ' శబ్ద వాచ్యుడు. పరంజ్యోతి అయిన నారాయణుడు లోకంలో సర్వ విషయాలను తేటపరచాడు. అగ్ని యందు, సూర్యుని యందు ఈ గురులక్షణమైన ప్రకాశాన్ని వ్యాపింపచేశాడు.
2. జగమును ప్రేరేపించే ఆత్మ స్వరూపుడు సూర్యుడు. ఆ రూపంగా గురువు.
   'సూర్య ఆత్మా జగతః' – అని శ్రుతి.
3. 'ధామ' అంటే స్థానమని అర్థం.
   గురువు, జ్ఞానము మాత్రమే పరమ లక్ష్యస్థానం. ఆ స్థానం విష్ణువు. "పరమం బ్రహ్మ పరంధామ" అని శ్రుతి వర్ణించిన పరంధాముడు.
   'యద్గత్వాననివర్తన్తే తద్ధామ పరమం మమ'
   'దేనిని చేరితే తిరిగి వెనక్కి రారో అది నా పరంధామము' అని గీతాచార్యుని పలుకు.
4. **దధాతీతి ధామ** – ధరించునది ధామం. సర్వమునకు ఆశ్రయమై, ధరించువాడు.

   తస్మిన్ హతస్థు ర్భువనాని విశ్వా।
   తృతీయే ధామన్ధ్యైరయన్త।
   ధామాని వేద భువనాని విశ్వా।

   –వంటి యజుర్వేద వాక్యాలు విష్ణువు సర్వమును ధరించి ప్రకాశింపచేసే పరమ చైతన్యమని తెలియజేస్తున్నాయి.
5. ప్రళయకాలంలో తరువాతి సృష్టికోసం తగిన వాటన్నిటినీ తన యందు ధరించి కాపాడిన మత్స్యావతారం ఈ 'ధామ' శబ్దాన్ని ఋజువు చేస్తోంది. పరంధాముడతడే కనుక ఆతడే శాశ్వతుడు –

సత్యః.. 212

1. శాశ్వతమైనవాడు.

   ఎల్లప్పుడూ ఉండే 'సత్' తత్త్వ మతడే కనుక, ప్రళయకాలంలోనూ సత్యమై ఉన్నవాడు.

2. ఆ ప్రళయకాలాన ఆశ్రయించిన మన్వాది సత్పురుషులకు తగినవానిగా (సాధువుగా) ఆశ్రయమిచ్చినవాడు.

3. గురు స్వరూపమైన జ్ఞానజ్యోతి నారాయణుడు 'సత్' శబ్ద వాచ్యుడు కనుక సత్యస్వరూపుడు.

4. సత్యభాషణ అనే ధర్మ స్వరూపుడతడే. **'తస్మాత్సత్యం పరమం వదన్తి'** అని శ్రుతి.

   ప్రశస్త కర్మలను కూడా 'సత్' శబ్దంలో వ్యవహరిస్తారు. గీతా శాస్త్రమే ఇందుకు ప్రమాణం –

   సద్భావే సాధు భావే చ సదిత్యేతత్ ప్రయుజ్యతే।
   ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ ఉచ్యతే।।
   యజ్ఞే తపసి దానే చ స్థితిః సదితి చోచ్యతే।
   కర్మ చైవ తదర్థీయం సదిత్యే వాభిధీయతే।।
   అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చయత్।
   అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ ప్రేత్యనో ఇహ।।

   (గీత. 17వ అధ్యాయం. శ్లో. 26, 27, 28)

1. సద్భావమందు, 2. సాధు (బాగున్నది) భావమందు,

2. ప్రశస్త కర్మల యందు 'సత్' శబ్దం చెప్పబడుతుంది.

   యజ్ఞము, తపస్సు, దానం – వీటియందు ఏ స్థితి ఉందో అది 'సత్'. వాటికై చేసే కర్మలు కూడా 'సత్' అని చెప్పబడతాయి. అందుకే యజ్ఞ దాన తపస్సులను ఎన్నడూ వీడరాదని శాసించాడు.

   శ్రద్ధారహితంగా హుతము చేయబడిన, ఇవ్వబడిన, తపించిన కర్మలు 'అసత్'

అని చెప్పాలి. అవి ఇహానికీ పరానికీ కూడా పనికిరావు. శ్రద్ధాయుతమైన యజ్ఞ దాన తపస్సులు 'సత్' స్వరూపుడైన నారాయణుడే. అందుకే ఆతడు 'సత్య' నారాయణుడు. సత్ పురుషులందు 'సాధు' లక్షణం హరివిభూతి.

5. ధర్మాలలో ప్రథమం, ప్రధానం సత్యమే. ధర్మ స్వరూపుడు, యజ్ఞ స్వరూపుడైన విష్ణువే 'సత్య' పదవాచ్యుడు.

'సత్య' ప్రశస్తిని శ్రుతి బహుధా ప్రస్తుతించింది.

.. స కితాసి సత్యః।

సత్యాః సత్వా పురుమాయః సహస్వాన్।

సత్యే నోత్తభితా భూమిః । (అథర్వవేదం)

అగ్నిర్హోతా కవిక్రతుః సత్యశ్చిత్రశ్రవస్తమః (ఋగ్వేదం)

సత్యమై విశ్వమంతా గొప్పగా ఆక్రమించిన (వ్యాపించిన)వాడు కనుక –

సత్యపరాక్రమః.. 213

1. సత్యమైన (అమోఘమైన) పరాక్రమము కలవాడు.

విశ్వమంతా విష్ణుని పరాక్రమమే గోచరిస్తుంది. అది స్థిరం, అమోఘం. దానిని ఏ ఒక్కరూ మార్చలేరు గనుక, ఈ అమోఘ పరాక్రమ శక్తితోనే ప్రళయంలో కూడా అన్నిటినీ ధరించి ఉంచాడు.

2. సత్యవ్యవస్థలో విశ్వాన గొప్పగా ఆక్రమించిన (వ్యాపించిన) విష్ణువును, సత్యానుష్ఠానంతోనే తృప్తి పరచగలం.

రామాయణం (అయోధ్య కాండ)

3. కపటము లేని చేష్ట కలవాడు.

తన సత్య పరాక్రమాన్ని కాలానుగుణంగా ప్రదర్శించే కాలస్వరూపుడు –

నిమిషః.. 214

1. కనురెప్పలు మూసుకున్నవాడు.

   సృష్ట్యాదిలో యోగనిద్రచే నేత్రాలు నిమీలినం (మూయుట) చేసిన కారణంగా నిమిషః. తన స్వస్థితి యందు, అంతర్దృష్టి కలిగి ఉండేవాడు.

2. 'ని' నిగ్రహించుట, నియమించుట. 'మిష స్పర్ధాయామ్' అనే అర్థాన్ననుసరించి, గుణోత్కర్షను ప్రకటించుటే స్పర్ధ. జగములను నియమించి, ప్రతిపదార్థములోను కొన్ని కొన్ని గుణములను ఉత్కర్షగా ప్రకటించుటచే ఈ బహువిధములైన సృష్టి ఏర్పడింది.

   త్రిగుణాలను ఒకటిగా నియమించేది అతడే త్రిగుణ సామ్యావస్థ సృష్టికి పూర్వపు స్థితి. దానిలో గుణములను కదిలించటం చేత, ఒక్కొక్క జీవిలో ఒక్కొక్క గుణాన్ని ఎక్కువ (ఉత్కర్ష) చేసి, మిగిలిన వాటితో సమన్వయపరచి వివిధములైన ప్రాణి జాతాన్ని సృజిస్తున్నాడు. ఇలా – నియమించి ఉత్కర్షను చూపించటం చేత 'నిమిషః'.

   యః ప్రాణతో నిమిషతో మహత్వైక ఇద్రాజా జగతో బభూవ ॥ అథర్వ ॥

3. రెప్పపాటు కాలాన్ని 'నిమిషం' / నిమేషం అని అంటారు. కాలాన్ని రెప్పపాట్లతో కొలవటం కాలశాస్త్ర పద్ధతి. మానవుని ఒక రెప్ప పాటుకాలంలో అత్యంత సూక్ష్మజీవులెన్నో మరణిస్తాయి. దేవతల రెప్పపాటు కాలంలో అనేక మానవుల కాలాలు పూర్తవుతాయి. వాళ్ళు రెప్పపాటు వేయకముందే మనం చూడగలం కనుక వారిని 'అనిమిషులు' (రెప్పపాటు లేనివారు) అంటాం. ఇలాంటి దేవతలందరి జీవితాలు నారాయణుని ఒక రెప్పపాటు కాలంలో పూర్తవుతాయి.

   ఆయన రెప్పమూస్తే జగముల పని పూర్తయినట్లే.

   కాల స్వరూపుడైన విష్ణువే ఇన్ని కాలములుగా వ్యక్తమవుతున్నాడు.

   సంఖ్యాతా అస్య నిమిషో జనానామ్ ॥ అథర్వ॥

   సర్వే నిమేషా జజ్ఞిరే విద్యుతః పురషాదధి॥

అని (యజుర్వేదం) – సర్వనిమేషాలు ఆ కాంతిమయ పురుషుని నుండి వచ్చినట్లుగా వర్ణించింది.

'అష్టాదశ నిమేషాస్తు కాష్ఠా' 18 నిమేషాల కాలాన్ని ఒక 'కాష్ఠ' అంటారు. ఇలా రెప్పపాటును ఆధారం చేసుకొని కాల గణన కొనసాగుతుంది. సూక్ష్మమైన రెప్పపాటు కాలంలోను, రెప్పపాటు లేని (మన రెప్పపాటుల కందని) దేవమానంలోనూ ఉన్న కాల స్వరూపుడతడే కనుక –

అనిమిషః.. 215

1. రెప్పపాటులేనివాడు.

   కనులు మూయనివాడు. మరి – యోగ నిద్ర మాటేమిటి?

   అది మరపుతో కూడిన నిద్ర కాదు. సృష్టిని చాలించి తనలో దాచిన లక్షణం. నిత్య ప్రబుద్ధ స్వరూపుడు విష్ణువు.

   కనులు తెరచుట 'అనిమిషత్వం'. అదే పరమేశ్వరుని 'ఈక్షణ శక్తి'. దీని నుండి అనంత సృష్టి ఆవిర్భవించింది.

   "కేళిలోల విలసత్ దృగ్జాల సంభూత నానా కంజాతభవాండ కుంభకు మహానందాంగనా డింభకున్" అని పోతన గారు భాగవతం ఆదిపద్యంలో నుతించారు. "లీలగా తన కనుచూపుల నుండే నానా బ్రహ్మాండాలను సృష్టించే బాలకృష్ణుడు."

   లోకంలో కూడా మనం కనులు తెరచామంటే పనులు ప్రారంభించామనే మాట. కనుల మూత మనలోపలి పని.

2. నిజానికి మనలో కనురెప్పపడటం, తెరవటం మనకు తెలియకుండానే మనలో జరిగే చైతన్యవిన్యాసం. ఈ వ్యవస్థ సర్వ ప్రాణి కోటిలోను నిర్వహిస్తున్నది సర్వ వ్యాపక విష్ణు చైతన్యమే. ఆ చైతన్యమే లేకుంటే మూసిన రెప్ప తెరవబడదు. తెరచిన రెప్ప మూయబడదు.

   అదేవిధంగా నిదుర రాగానే రెప్పల తలుపులు మూసి, మెలకువ కలగగానే

వాటిని తెరిచే అంతర్గత చైతన్యం ఆత్మరూపుడైన హరి విన్యాసమే. వీటిని పరిశీలిస్తే మనలోనూ, అనంత విశ్వంలోను స్వామి చైతన్య రూపునిగా ఎలా పరివ్యాప్తుడై ఉన్నాడో గ్రహించగలం.

3. ఏ ఒక్కరితోనూ స్పర్ధ లేనివాడు కనుక 'అనిమిషుడు'. తానొక్కడే సర్వవ్యాపియై ఉన్నందున, తనకు వేరైనది జగమందు లేదు కనుక మరొక దానిని నియమించటం, స్పర్ధ వహించడమన్న మాటే లేదు. విష్ణువుతో సమానమైనదిగానీ, మించినది గానీ లేదు.

4. మత్స్యం ఎల్లవేళలా కళ్లు తెరచి ఉంటుందంటారు. అలా మత్స్యావతారుడై తెరచిన కనులతో చూస్తున్న అనిమిషుడు హరి.

పురీ (పురుషోత్తమ) క్షేత్రంలో జగన్నాథ స్వామి అనిమిషుడు. రెప్పలు లేని చక్రనయనాలలో కారుణ్యాన్ని వర్షిస్తున్న మహాప్రభువు. భక్తులను కనిపెట్టుకొనడంలో రెప్పపాటు అడ్డు కూడా ఉండరాదని రెప్ప లేనే లేకుండా చూస్తున్న దయాళువు జగన్నాథుడు.

నారాయణుని అనిమిషునిగా – ఎల్ల వేళల మెలకువ కలిగిన చైతన్యంగా – వేదం వివిధ రీతుల వినుతించింది –

సంక్రన్దనోఽనిమిష ఏకవీరః – ॥అథర్వవేదం॥

మిత్రం కృష్టీరనిమిషాభి చేష్టే ॥ ఋగ్వేదం॥

నిత్య ప్రబుద్ధునిగా ఈ జగమును క్రమబద్ధీకరిస్తున్నవాడు కనుక –

ప్రగ్వీ .. 216

1. మాలను దాల్చువాడు.

'ప్రక్' అంటే మాల. దానిని ధరించువాడు ప్రగ్వీ.

విష్ణువు వనమాల, వైజయంతీమాల – వంటి శోభాయమానమైన మాలికలను దాల్చి ప్రకాశించే దివ్యమంగళ విగ్రహుడు.

మత్స్యావతారంలో కూడా వైజయంతీ మాలతో శోభిస్తున్నట్లు, తద్వారా తన

పరతత్త్వాన్ని స్ఫురింపజేస్తున్నట్లు శాస్త్రాలు వర్ణించాయి.

2. నిమిష, అనిమిషాలు ఒకదాని తరువాత ఒకటి ఏర్పడి, క్రమంగా కాలమనే మాల ఏర్పడుతుంది. కాలమాలికను దాల్చిన కాలరూపి విష్ణువు.
3. **'సృజ్యత ఇతి స్రక్. తదస్యాస్తీతి స్రగ్వీ'**, సృజింపబడేది 'స్రక్.' దానిని దాల్చువాడు 'స్రగ్వీ'. 'స్రక్' అంటే ఈ విశాల సృష్టి. ఇదే పెద్దమాల. ఈ మాలను సూత్రము వలె ధరించువాడు స్రగ్వీ. సూత్రాత్మ స్వరూపుడు. **"స్వమాయాం వనమాలాఖ్యాం నానాగుణమయీం దధత్"** తన మాయాశక్తినే వనమాలగా దాల్చినాడని విష్ణు పురాణం అభివర్ణించింది. జగమంతా ఒక క్రమబద్ధమై విశిష్ట నియమంతో కూడినది. ప్రతి దానికీ ఒకదానితో ఒకటి సంబంధమున్నది. ఆ సంబంధం ఏర్పరచినదే సూత్రం. ఆ సూత్రమే విష్ణువు.

   'మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ'

   – మణిమాలలో సూత్రమువలె, విశ్వమందంతటా లీనమై దాల్చువాడు – స్రగ్వీ

   సూత్రం సూత్రస్య యోవిద్యాత్ బ్రాహ్మణం మహత్। (అధర్వవేదం)

   స ఓతః ప్రోతశ్చ విభూః ప్రజాసు।। (యజుర్వేదం)

   తాను సూత్రమువలె, సర్వ విశ్వమునందు నిరంతరం ప్రసరించుచున్నాడని వేద ప్రతిపాదన.
4. వికసించి, వివిధ వాసనలతో, వర్ణాలతో శోభల్లే కుసుమాల వలె వివిధోపాధులతో జీవులు వివిధ గుణ కర్మ స్వభావాలతో సృష్టిలో వ్యవహరిస్తున్నా వారందరిలో, పూసలలో దారంలా ఉన్నది ఆ విష్ణు పరమాత్మయే.

   ఎవ్వడు రవణిల్లు ఎల్లజీవులయందు

   పూసలలోనున్న పొందువోలె... (శ్రీనాథుని కాశీఖండం)
5. వనమాల ధరించిన విష్ణుని రూపాన్ని సంభావిస్తూ

   కంఠంతు నిర్గుణం ప్రోక్తం మాల్యతే అద్యయా జయా।

మాల్యానిగద్యతే బ్రహ్మం స్తవ పుత్రైస్తు మానసైః॥

"స్వామి కంఠం నిర్గుణానికి సంకేతం. 'ఆద్యా', 'జయా' అని చెప్పబడే స్వామి మాయాశక్తికి సంకేతమే వనమాల" అని 'గోపాల తాపినీయోపనిషత్తు.' 'భూతతన్మాత్రరూప'మైన వైజయన్తీమాలను ధరించినవాడని శంకరులు వ్యాఖ్యానించారు. పంచభూతాలు, శబ్ద స్పర్శాది తన్మాత్రలు... ఇవి ఒక దాని నుండొకటి కలిగి, మాల వలె ఏర్పడినదనీ, ఆ తత్త్వమాలికయే వైజయన్తీమాలగా, దానిని ధరించిన ఈశ్వర చైతన్యం 'ప్రగ్వీ'గా గుర్తించబడుతోంది.

ప్రకృతిని క్రమబద్ధం చేసి నిర్వహించడమే కాక, తత్సంబంధమైన జ్ఞాన శక్తులను ప్రసరింపజేసే ప్రేరకుడు కనుక –

వాచస్పతి రుదారధీః.. 217

1. వాక్కులకు పతియై, సర్వ సంపూర్ణ బుద్ధి కలవాడు.
   ప్రతి జీవిలో వాక్కుంటుంది. ఆ శక్తి కొన్నిటియందు అవ్యక్తంగా, కొన్నిటి యందు వ్యక్తంగా ఉంటుంది. శబ్దం, భావన, వ్యక్తీకరణ వాక్కు. ఈ వాగ్రూపచైతన్యమే మనుష్యులందు వైఖరిగా ఉన్నది. వాక్కు ద్వారా హృదయంలోని భావం బహిర్గతమై వ్యక్తి తనని తాను వ్యక్త పరచుకుంటాడు – ప్రపంచాన్ని గ్రహించగలుగుతాడు. **'వాగ్ఫి సర్వస్యకారణమ్'** – అన్ని వ్యవహారాలకి వాక్కే కారణం. మనలో పలికే వాక్కులన్నిటి వెనక మూల చైతన్యంగా ఉన్న పరమాత్మయే వాచస్పతి.
2. వేదాది జ్ఞానమయ వాక్కులన్నిటికి పతియైన గురుస్వరూపుడు శ్రీమహావిష్ణువు. మంత్రాది వాక్కులు దేవతల్ని ప్రసన్నం చేసుకొని ప్రకృతిని పరిపుష్టం చేస్తున్నాయి. ఈ వాక్కులన్నీ హరి స్వరూపం.
   "విష్ణునివే వేదంబులు" అని అన్నమయ్య మాట.
3. వాక్కును ఎలా వ్యక్తం చేయాలో అందుకు తగిన జ్ఞానం, భావన బుద్ధి

యందుంటాయి. ఆ బుద్ధియందు వ్యాపించి, వాక్కును ప్రేరేపించే నాదస్వరూపుడు 'వాచస్పతిరుదారధీః'

ఉత్కృష్టము, సర్వ విషయములను తెలియునది (సర్వమును కలిగినది) – ఉదారం. అటువంటి ఉత్కృష్టతమమైన సర్వార్థ విషయము లెరిగిన బుద్ధి (ధీ) కల సర్వజ్ఞుడు 'ఉదారధీః'. ఆ ఉదారధీమంతుని కృప వల్లనే మన బుద్ధులు, వాక్కులు పనిచేస్తున్నాయి. బుద్ధికీ, వాక్కుకీ ఉన్న విడదీయరాని సంబంధాన్ని రెండు నామాలుగా చెప్పే వీలున్నా, ఒకే నామంగా గ్రహించటం ఔచిత్యం. 'బుద్ధికి బృహస్పతి' అనడం మన నానుడి. వాచస్పతి – బృహస్పతి.. ఇవన్నీ పరమేశ్వరుని జ్ఞాన శక్తులకున్న నామాలు. ఈ శక్తితోనే దేవతల్ని శాసిస్తున్నాడు. అలా శాసించే నారాయణ స్వరూపాన్నే దేవగురువు 'వాచస్పతి' అన్నారు.

బుద్ధి రూపమైన పరమేశ్వర చైతన్యాన్ని వాచస్పతి, బ్రహ్మణస్పతి, బృహస్పతి – అని వేదం పేర్కొన్నది. వేదమంత్ర స్వరూపుడు, ఆ మంత్రాలలో నున్న సర్వ విధ బోధ (జ్ఞాన) స్వరూపుడు కనుక 'వాచస్పతి రుదారధీః'.

బృహస్పత్యాది దేవగురువులకు సైతం వాగ్బుద్ధి శక్తులను ప్రసాదించే సమృద్ధి జ్ఞాన రూపం నారాయణుడు.

వాచస్పతిర్బలా తేషాం తన్వోద్య దధాతు మే।
ఉపహూతో వాచస్పతి రుపాస్మాన్ వాచస్పతిర్హ్వయతాత్ ॥ (అథర్వవేదం)
వాచస్పతి ర్వాచం నః స్వదత ॥ (యజుర్వేదం)

ఇలా పలు తావులలో వాచస్పతి నామాలు వేదమంత్రాలలో గోచరమవుతాయి.

వాక్కులకు పతియై, మహోత్కృష్టమైన సమగ్ర బుద్ధితో భాసించడం చేత శ్రీమహావిష్ణువే –

అగ్రణీర్గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః।
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ ॥...24

218. అగ్రణీః, 219.గ్రామణీః, 220.శ్రీమాన్, 221.న్యాయః, 222.నేతా, 223.సమీరణః,
224.సహస్రమూర్ధా, 225.విశ్వాత్మా, 226.సహస్రాక్షః, 227.సహస్రపాత్.

అగ్రణీః.. 218

1. ముందునకు (ఉత్తమస్థితికి) నడుపువాడు. నాయకుడు.
చరాచర విశ్వాన్ని కాలరూపుడై ముందుకు నడుపువాడు. ఆశ్రయించిన భక్తులకు వారి వారి అధికారాన్ని అనుసరించి క్రమక్రమంగా ఉత్తమ స్థితులను పొందించువాడు.

నాయకుని వలె విశ్వానికి ముందుండేవాడు, ముందుకు నడుపువాడు విష్ణువు. విశ్వమంతా ఆయనను అనుసరించేదే. మత్స్యావతారుడై తననాశ్రయించిన వారిని నావయందధిరోహింపచేసి, నడిపినవాడు.

2. సృష్టికి సైతం (అగ్రమందు) ముందున్నవాడు. లోకాతీతమైన ఆ పరంధామానికి ముక్తులను గొనిపోవువాడు.

3. విశ్వంలోని గ్రహాదుల గతులు ఎనిమిది విధాలుగా ఉంటాయని శాస్త్రవచనం.

వక్రానువక్రా కుటిలా మందా మందతరా సమా।
తథా శీఘ్రతరా శీఘ్రా గ్రహాణామష్టధా గతిః॥ (సూర్యసిద్ధాంతం)

1. వక్ర, 2. అనువక్ర, 3. కుటిల, 4. మంద, 5. మందతర, 6. సమ, 7. శీఘ్రతర, 8. శీఘ్ర – ఇవి ఎనిమిది గమనాలు. ప్రపంచంలో అన్నిటి గమనాలు ఇవే. ముందుకు సాగే గమనం (అగ్రగమనం) సర్వజ్యోతులకు మూలమైన పరంజ్యోతిది మాత్రమే. అందుకే ఆయన అగ్రణీః.

ఈ శబ్దం పరమాత్మ పరంగా శ్రుతి పలుచోట్ల ప్రస్తావించింది.

అగ్రేణీ రసి స్వావేశః (యజు) – ఇందులో 'అగ్రేణీ' అనే శబ్దానికి 'అగ్రణీ' అనే అర్థం.

తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ పురుషం జాతమగ్రతః। ఋగ్వేదం।
సత్వం నో దేవ మనసా వాయో మన్దానో అగ్రియః ।।ఋగ్వేదం।।

4. **'అగ్రే నియతః'** – అగ్నిః. అగ్రమునందున్నవాడు, అగ్రమునకు గొనిపోవువాడు– అని అగ్ని శబ్దానికి అర్థం. అగ్రణీ, అగ్ని సమానార్థకాలు. యజ్ఞము ద్వారా కర్తను అగ్రమునకు (ఉన్నతస్థితికి) గొనిపోవువాడు కనుక అగ్నియే అగ్రణీ. యజ్ఞమయుడైన విష్ణువే యజ్ఞాగ్నిరూపుడు. అందుకే ఋక్‌శ్రుతి ప్రథమ మంత్రంలో ప్రథమ శబ్దమే అగ్ని – **"అగ్ని మీడే పురోహితం యజ్ఞస్య".**

ముందుండి సర్వసమూహములను నడిపేవాడు కనుక –

గ్రామణీః.. 219

1. సమూహమునకు నాయకుడు.

'గ్రామము' అంటే సమూహం. ఇన్ద్రియగ్రామం, భూతగ్రామం, విశ్వగ్రామం (లోకాలోకాంతర గ్రామం) వంటి శబ్దాలు వేదాంత వాఙ్మయంలో గోచరిస్తాయి. ఇన్ద్రియాలకు అతీతమైన పరమాత్మ 'అగ్రణీః'. ఆయన చైతన్యంతోనే ఇన్ద్రియ సమూహాలన్నీ నడుస్తున్నాయి.
అదే విధంగా జీవసమూహం, ప్రపంచంలోని గృహనక్షత్రాది సమూహాలన్నీ నిర్వహింపబడుతున్నాయి.

2. నాదస్వరూపుడైన శ్రీహరి అవ్యక్తనాదమై, ప్రణవనాదమై ముందు ఆవిర్భవించినందున అగ్రణీ. ఓంకార జనితమైన సంగీత గ్రామమును నిర్వహించే నాదమాతడే కనుక 'గ్రామణీః'।

సప్తస్వరా స్త్రయోగ్రామా మూర్ఛానాస్త్వేక వింశతిః।
తానా ఏకోన పంచాశదిత్యేతత్ స్వరమండలమ్।।

మంద్ర, మధ్య, తార భేదాలతో సప్త స్వరములు గ్రామత్రయంగా ఉన్నాయని 'నారదీయశిక్ష'. షడ్జమ, మధ్యమ, గాంధార గ్రామములు సంగీతాన ప్రసిద్ధి.

3. సమూహములను నడిపే గ్రామణిని గ్రహించడమే ఆత్మజ్ఞానం. ఆయన లేకుంటే ఈ శరీరాదులన్నీ నిర్వహింపబడవు.

   గ్రామణీరసి గ్రామణీరుత్థాయాభిషిక్తోసి॥ (అథర్వవేదం)

   మత్స్యావతారుడై ఋషుల, చక్రవర్తుల, ఉత్తమ సృష్టి బీజముల సమూహాలను నడిపినవాడు.

   ఇన్ని సమూహాలను పోషించుటకు తగిన సంపత్తి కలవాడు కనుక-

శ్రీమాన్.. 220

1. సంపదలు కలవాడు.

   విశ్వనాయకుడు విష్ణువు అందరినీ నడిపి పోషించగలిగే సర్వ సంపదలను సమృద్ధిగా కలిగినవాడు. ఆ శ్రీమంతుడు ప్రసరించే శ్రీ (చైతన్యం, శోభ) చేతనే ఇంద్రియ గ్రామాదులన్నీ పనిచేస్తున్నాయి.

2. శోభాస్వరూపుడు.

   విశ్వంలో ఇసుకరేణువు మొదలుకొని మహా బ్రహ్మాండం వరకు కుసుమం, ఫలం, వృక్షం, పర్వతం, నది, నక్షత్ర గ్రహాదులు, జీవకోటి – అందరిలో వివిధ విధాలైన శోభలు ప్రసరిస్తున్నాయి. ఆ శోభలన్నిటికీ మూలమైన శోభాస్వరూపుడు శ్రీమంతుడు.

3. మత్స్యావతారుడై కూడా శోభలతో వెలిగిన శ్రీమంతుడు. 'శ్రీమాన్' శబ్దం పలుమార్లు ఈ నామాల వరుసలో ఉంది. విష్ణుని వివిధ రూపాలను కొన్ని కొన్ని నామాల క్రమంలో నిబద్ధం చేస్తూ, ప్రతి రూపము శ్రీమంతమే (కాంతి, శోభ వంటి కళలతో కూడినది) అని స్పష్టం చేయడం ఈ నామోద్దేశం.

4. అగ్రణీ వంటి నామాల ద్వారా వ్యక్తమైన అగ్ని స్వరూపుడు విష్ణువు తేజోమయుడు కనుక శ్రీమాన్. అగ్నిలోనున్న తేజస్సులోనే కాంతినీ, సంపదనీ

పొందగలం గనుక 'శ్రీసూక్తం' – **'జాతవేదో మమ ఆవహ'** అని స్తుతించింది. సంపదలతో సమూహములను నిర్వహించే యోగ్య వ్యవస్థ అతడే కనుక –

న్యాయః.. 221

1. నడిపే (పొందింపజేసే) వ్యవస్థా స్వరూపుడు, **నయతీతి న్యాయః** – నడిపే పద్ధతి న్యాయం... అదే తానైనవాడు.

   యంత్రమును నిర్మించి దానిని నడిపేవాడు యంత్రారూఢుడై తన అభిమతానుసారం నిర్వహిస్తాడు. అలా నడిపే వానిని 'న్యాయః' అంటారు. విశ్వయంత్రంలో సర్వమును అలా పద్ధతిగా నడిపే న్యాయస్వరూపుడు విష్ణువు. 'న్యాయ, నాయక, నేత, నీతి' – ఇవన్నీ దాదాపుగా సమాన భావ నిర్దేశక పదాలు.

   సమూహాలను ముందుండి నడిపేవాడు (అగ్రణీ, గ్రామణీ) వివిధ సంపదలతో (శ్రీమాన్), 'పద్ధతి'గా నడుపుతాడు. ఆ పద్ధతిని మనం 'న్యాయం' అని వ్యవహరించవచ్చు. అదీ విష్ణు చైతన్యమే.

   శరీరాభిమానియైన ఆత్మ చైతన్యం ఒక్కొక్క ఇంద్రియంలో ఒక్కొక్క 'శ్రీ'ని నిక్షిప్తం చేసి సర్వక్రియలను నిర్వహిస్తున్నది. ఆ క్రియల ద్వారానే ఆ చైతన్య రూపుని గుర్తించగలం. శరీరంలో 'జీవుడు' న్యాయరూపుడైతే, విశ్వశరీరంలో విష్ణువే న్యాయస్వరూపుడు.

   విశ్వమంతా విష్ణు న్యాయమే నడుస్తున్నది.

2. ప్రమాణాలతో కూడిన, అజ్ఞాన నివారక తర్క విద్య ద్వారా అభేదజ్ఞానం లభిస్తుంది. జ్ఞానాన్ని ప్రాప్తింప చేసే (నయతీతి) తర్కాది యుక్తి విద్యను 'న్యాయం' అంటారు. ఆ విధమైన విద్యా స్వరూపుడు విష్ణువు.

   తర్క విద్య శాస్త్ర ప్రమాణములతో బలోపేతమై, జ్ఞానం దిశగా సాగినప్పుడు చక్కని ఫలితాన్నిస్తుంది. **"శ్రుతిమతః తర్కోను సంధీయతాం"** అని శంకరుల బోధ. వేదసమ్మతమైన తర్కాన్ని అనుసరించాలి. అదే నారాయణుని న్యాయ

స్వరూపం. మత్స్యరూపుడై ఆ వేదరూప న్యాయాన్ని (విద్యను) కాపాడినవాడతడే.

నేతా.. 222

1. విశ్వానికంతటికీ నాయకుడు.

'అగ్రణీ' నామం నుండి 'ణీః' అనే శబ్దాన్ని అనుసరించి ఈ నామాలన్నీ ('నేతా' వరకు) కూర్చబడ్డాయి. **ణీఞ్ ప్రాపణే** – పొందించుట, నడిపించుట – అనే ధర్మాన్ని ఎలా, ఎవర్ని, ఏపద్ధతిలో నిర్వహించాలో అలా సాగించుతున్నవాడు అని ఈ నామాల వరుస తెలియజేస్తోంది. ముందుండి, అందరినీ, తన శక్తులతో, పద్ధతిగా నడిపే 'నేత' అతడు. ఇదీ 218వ నామం నుండి ఇప్పటి వరకు క్రమం. నాయకుని కుండవలసిన లక్షణాలన్నీ మొదటి నాలుగు నామాలతో చెప్పి, ఆ లక్షణాలున్న నాయకుడని ఈ నామంతో బోధిస్తున్నారు.

తాను మత్స్యమై సాగరాన ఆవిర్భవించి, అందర్నీ దరిచేర్చిన దివ్యావతారుడు.

మార్గదర్శకుడు, అభీష్టాన్ని పొందించువాడు – నేత.

జగమంతా తన నేతా లక్షణాన్ని వ్యాపింపచేసిన ఆ దేవాదిదేవుని నేతృగుణాన్ని ఎల్లవేళలా స్మరించి, విశ్వంలో దర్శించగలిగే దృష్టిగల సాధకుడు తానే స్వయంగా నేత కాగలిగి (ఇంద్రియాదులను నియమించి) అనేకులకు మార్గదర్శకుడు కాగలడు.

శ్రుతి ఈ జగన్నేత విష్ణుని వివిధ రీతుల వింగడించింది–

విశ్వోదేవస్య నేతుః మర్తో వురీత సఖ్యమ్। (యజుర్వేదం)

యః సూర్య య ఉషసం జజాన యో అపాం నేతా సజనాస ఇన్ద్రః।

(అథర్వవేదం)

ఇన్ద్ర ఏషాం నేతా। (అథర్వవేదం)
సనో నేతా వాజమా దర్షి భూరిమ్। (అథర్వవేదం)
అగ్నే నయ సుపథా రాయే అస్మాన్। (యజుర్వేదం)
నడిపేవాడు మాత్రమే కాక, నడిచే శక్తి కూడా ఆతడే -

సమీరణః.. 223

1. సమగ్రంగా కదలువాడు.

   సమ్-సమ్యక్. 'ఈర గతౌ కంపనే చ'.

   సమ్ + ఈరణః . చక్కని గతి, కంపనము కలిగినవాడు.

   జగద్ధితంగా అంతటా కదలువాడు. సర్వవ్యాపక చైతన్యమయుడు. ఆయన సమ్యక్ చేష్టా లక్షణం జగదాది నుండి జగదంతం వరకు గోచరిస్తూనే ఉంటుంది. సర్వమానవాళి అవయవ నిర్మాణం, తరులతాగుల్మాదుల తీరులు, పశు పక్ష్యాదుల దేహ నిర్మితి, భయరాగహర్షాది భావాలు... అన్నీ సర్వకాలాలలోనూ ఒకే తీరుగా చక్కగా కదిలిస్తున్నవాడు - సమీరణుడు- సమాన రూపంగా కదలువాడు.

2. ప్రాణవాయువుగా ప్రాణులకు చేష్టలు కలిగించువాడు.

   'సమీరణ' శబ్దం వాయుపరంగా చెప్పబడుతుంది. 'అగ్రణీ' నుండి గమనించితే కదలి, కదిలించే వాయురూప విష్ణు చైతన్యమే స్ఫురిస్తుంది. అది బహువిధాల విశ్వవ్యాపకమై సంచరిస్తున్నందున దీని తరువాతి నామాలైన (మిగిలిన శ్లోకపాదం లోనివి) - సహస్రమూర్ధా, విశ్వాత్మా, సహస్రాక్షః, సహస్రపాత్ - కూడా వాయురూప విష్ణువును ప్రస్తావిస్తున్నట్లుగా స్పష్టమౌతుంది. వాయువు ప్రాణరూపంగా దేహమంతా తగినరీతి కదులుతున్నాడు. ఇంద్రియ సమూహాలను నడిపిస్తున్నాడు. ఈ సమ్యక్ గతివలన అతడు సమీరణుడు. విశ్వమంతా కూడా తారతమ్యాలు లేకుండా బండరాయిపై, పూలతీగపై ఒకేలా వీచే 'సమానగతి' కూడా సమీరణ లక్షణమే.

3. మత్స్యరూపుడై ప్రళయ సముద్రతరంగాలపై అనేక విధముల చరించిన వాడీతడే. అనేకావతారాలు దాల్చి చక్కని చేష్టలతో చరించి తన సమీరణ లక్షణాన్ని ప్రదర్శించాడు.

'సమీర్తే ఇష్ట చేష్టో భవతీతి సమీరణః'

భక్తులకు ఇష్టమైన చేష్టలతో అనుగ్రహించువాడు. గురుతముడై వేదవిద్యను అందించిన మత్స్యమూర్తిని ధ్యానించే శ్లోకం -

కృత్వామీనమయీం సద్యః ప్రవివేశరసాతలమ్।
వేదమూర్తిస్తతో వేదాన్ ఆనిన్యే బ్రహ్మణోన్తికమ్॥
జ్ఞానాది గుణబృన్దేన పక్షభూతేన భూషితమ్।
స్యోత్థ బ్రహ్మదమదం శృఙ్గ నిస్పృతేన విరాజితమ్॥
కల్పావసాన సమయే వహన్తమ్ వైవ చిన్తయేత్।
నౌరూపాం వితతాం క్షోణీం ప్రజాపతిగుణాన్వితామ్॥
ముక్తాఫలనిభేనైన వపుషా నిర్మలేనచ।
అనిమీలిత నేత్రశ్చ మీనాత్మా యతవాక్ త థా॥

"మత్స్య రూపాన్ని ధరించి, పాతాళాన ప్రవేశించి వేదాలను తెచ్చి చతుర్ముఖుని కిచ్చిన వేదమూర్తి, జ్ఞానాదిగుణాలే పక్షములుగా, దివ్య శృంగంతో ప్రళయాంతాన సమస్తమును వహించినవాడు. నావ వలె క్షోణిని బంధించిన విశ్వపతి - ముత్యము వంటి తెల్లని కాంతితో, రెప్పలు మూయని (అనిమిషః) నేత్రాలతో, వాక్కులను నియమించిన మౌనగురుమూర్తిగా భాసించే మీనావతార నారాయణు"ని సమీరణ వైభవాన్ని నమస్కరిద్దాం. వివిధ రీతుల సంచరించుటచే అనంతుడతడు -

సహస్రమూర్ధా.. 224

1. వేలకొలది శిరస్సులు కలవాడు.

'సహస్రం' - అనన్త సంకేతం. అనంతమైన వచస్సులు, శ్రవణములు,

ఆలోచనలు కలిగిన జ్ఞాన స్వరూపుడు.

విశ్వంలో అన్ని మూర్ధములలోను వ్యాపించిన చైతన్యం విష్ణువే కనుక అన్ని శిరస్సులవాడు.

'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్'

సభూమిం విశ్వతో వృత్వా' –ఈ పురుష సూక్తమంత్రంలోని శబ్దాల క్రమమే ఈ శ్లోకపాదంలోని నామాల వరుస.

గగనచర, జలచర, భూచరాది ప్రాణులకు, జ్ఞానేంద్రియ స్థానాలైన అనంత శిరస్సులను ఏర్పరచి, ఒకేలా కనిపించే శిరస్సులలో తన అనంత జ్ఞాన సంపదల నుండి విభిన్న జ్ఞానములను నిక్షిప్తం చేసిన విశ్వరచనా ధురీణుడు – విరాట్పురుషుడు. అనంత మూర్ధములలో నుండి వ్యక్తమయే జ్ఞాన చైతన్యములన్నీ ఆ అనంత జ్ఞానమూర్తి యొక్క అంశాలే.

విశ్వాత్మా.. 225

1. అనంతంగా వ్యాపించినవాడు.

చరాచరమంతా వ్యాపించినవాడు, చరించేవాడు.

'అతతి గచ్ఛతి', 'ఆతనోతి వ్యాప్నోతి' – ఆత్మ. శరీరానికి ఆత్మవలె – విశ్వానికి ఆత్మ అయినవాడు విష్ణువు. ప్రత్యణువున వ్యాపించి, పలు విధముల చరించుటచేత విశ్వాత్ముడు.

విశ్వత శ్చక్షురుత విశ్వతోముఖో
విశ్వతో బాహురుత విశ్వతస్పాత్॥ (యజుర్వేదం)
సర్వగుః సర్వపూరుషః సర్వాత్మా సర్వతనూః
సహ యన్మేస్తి తేన॥ (అథర్వవేదం)

– వంటి వేదవాక్యాలు విశ్వాత్మకుని విశ్రుతంగా చెప్పాయి.

సహస్రాక్షః.. 226

1. అనంత నేత్రములు కలవాడు.
   విశ్వంలో సర్వప్రాణికోట్ల నేత్ర గోళకాలలో దర్శనశక్తిని ప్రసరింపచేసిన అనంత దర్శనుడు.
2. అన్నిటినీ, అన్ని కాలాలనీ, అన్ని వైపుల నుండి దర్శించగలిగే అపరిమిత ధర్శనశక్తియే సహస్రాక్షుడు.
   పరిధులన్నీ అతిక్రమించిన విష్ణుని సర్వవ్యాపక, అనంతతా ధర్మాలను తెలియచేస్తున్న నామాల వరుస ఇది.
3. సర్వ ద్రష్ట అయిన ఆత్మ స్వరూపుడు.
4. 'అక్ష' శబ్దానికి నేత్రాలనే అర్థమేకాక ఇంద్రియాలనే అర్థం కూడా ఉంది. **'అశ్నాతి భుంక్తే గృహ్ణాత్యనేనార్థానితి అక్షః'** – శబ్ద స్పర్శాది ప్రయోజనాలను స్వీకరించేవి కనుక అక్షములంటే ఇంద్రియాలు. సహస్రమూర్ధా, సహస్రపాత్ అనే నామాల నడుమ తదితర ఇంద్రియాలన్నింటినీ 'సహస్రాక్ష' నామంలో నిబద్ధం చేశారు. అనంత దర్శన శక్తియే కాక శ్రవణ, ఘ్రాణ, వచన, హస్తాది సర్వేంద్రియాల అనంత శక్తుల్ని ఈ నామం చెబుతోంది. ఈ అనంతేంద్రియ శక్తులనే ఆయా జీవుల కర్మానుగుణంగా వారి వారి ఉపాధులకు తగిన పరిమితులుగా అనుగ్రహించి నడుపుతున్నాడు సహస్రాక్షుడు.

   ఒక మహా సరస్సు నుండి రకరకాల పాత్రలతో జలం గ్రహింపబడినట్లుగా, అనంత శక్తి సంపన్నుని నుండి ఇంద్రియ పాత్రలు ఆయా శక్తుల్ని గ్రహిస్తున్నాయి. ఆ అనంతేంద్రియ శక్తిదాయకుని స్మరించినవారి పరిమిత శక్తులు శుద్ధమై, సమృద్ధి చెంది సార్థకతని సమకూర్చుతాయి.

సహస్రాక్ష శతేషుధే।
నమోస్తు నీలగ్రీవాయ సహస్రాక్షాయ మీఢుషే ॥ (యజుర్వేదం)
సహస్రాక్షో విచర్షణి రగ్నీ రక్షాంసి సేధతి । ఋగ్వేదం।

అనంత దర్శనాది శక్తులలో చరించువాడు కనుక –

సహస్రపాత్.. 227

1 అనంత గమన శక్తి కలవాడు.

'పదగతౌ' అనే అర్థాన్ననుసరించి గతిచేయునది పాదం. ఇక్కడ వేయిపాదాలనే అర్థంకాక, అనంతమైన గతి అనే అర్థమే గ్రాహ్యం. స్వామి గతి అన్ని కాలాలలోను, సమస్త భువనాలలోనూ విస్తరించింది. మానవుల గమనం పాదాలను ఆశ్రయించి ఉంటే, పక్షుల గమనశక్తి రెక్కలను, సర్పాదుల గతిశీలత కేవలం ఉదరాదులందు ఉంది. వాటితో అవి శీఘ్రంగా గమించగలుగుతున్నాయి కూడా. గ్రహాదుల గమనం, వాయుగమనం, కాల గమనం – ఇటువంటి అసంఖ్యాక, అనంత గమన శక్తులుగా విశ్వమంతా వ్యాపించిన విష్ణుని ఈ నామం స్తుతిస్తోంది.

లోకంలో 'వేయిమాటలేల' – 'వేలదండాలు' – అనే ప్రసిద్ధమైన పలుకుబళ్ళు కూడా సహస్ర సంఖ్య 'బహు', 'అనంత' వాచకాలన్నది స్పష్టం చేస్తున్నాయి.

శ్యేనో నృచక్షా దివ్యః సుపర్ణః సహస్రపాచ్ఛతయోనిర్వయోధాః (అథర్వవేదం)

– వంటి వేదవాక్యాలు సహస్రపాదుని సంకీర్తించాయి.

ఈ అనంత శక్తులతో జగద్యంత్రాన్ని నిర్వహిస్తున్న కారణంగా –

ఆవర్తనో నివృత్తాత్మా సంవృత స్సంప్రమర్దనః
అహః సంవర్తకో వహ్ని రనిలో ధరణీధరః॥... 25

228.ఆవర్తనః, 229. నివృత్తాత్మా, 230. సంవృతః, 231. సంప్రమర్దనః, 232. అహః సంవర్తకః, 233. వహ్నిః, 234. అనిలః, 235. ధరణీధరః

ఆవర్తనః.. 228

1. త్రిప్పువాడు.

తిరిగి తిరిగి కలిగే లక్షణం 'తిరుగుట'. అదే 'ఆవృతం'. ఆ తిరుగుటను నిర్వర్తించువాడు ఆవర్తనుడు.

ఈ జగచ్చక్రాన్ని, కాల చక్రాన్ని త్రిప్పేవాడతడే. ఆ విష్ణువే త్రిప్పకపోతే ఈ చక్రం తిరుగదు.

తేనేదం భ్రామ్యతే బ్రహ్మచక్రమ్. (భారతం)

'వానిచే ఈ విశ్వ చక్రం త్రిప్పబడుతున్నది.'

భ్రామయన్ సర్వభూతాని (భగవద్గీత) సమస్త జీవులను త్రిప్పువాడు - వారి జీవ చైతన్యాన్ని నడుపువాడు.

కాలచక్రం జగచ్చక్రం యుగచక్రం చ కేశవః।

ఆత్మయోగేన భగవాన్ పరివర్తయతేనిశమ్।। (మహాభారతం- ఉద్యోగపర్వం)

కాలచక్రాన్ని, జగచ్చక్రాన్ని, యుగ చక్రాన్ని తన యొక్క శక్తిచే ఎల్లప్పుడు భగవానుడు త్రిప్పుచున్నాడు.

జగత్తు, కాలం, జీవితం చక్ర లక్షణం కలవి.

ఉదయ మధ్యాహ్న సాయంత్రాలు ప్రతిరోజున కలుగుతున్నవే. సృష్టి స్థితి లయలు, యుగాలు ఒక దాని తరువాత ఒకటి ఏర్పడుతున్నవే. జీవుల కదలికలూ అంతే. వటబీజం నుండి వటం, తిరిగి దాని నుండి బీజం, మరల దాని నుండి వటవృక్షం. పశువుల నుండి పశువులు, మానవుల నుండి మానవులు. ఇలా ఒకదాని నుండి ఒకటి ఉద్భవించే వ్యవస్థను విశ్వమంతా వ్యాపింపచేసిన పరమేశ్వరుడు విష్ణువు. ఈ చక్ర ధర్మంతో నిండి ఉన్నవే ప్రతి అణువు, బ్రహ్మాండం.

ఆవర్తనం నివర్తనం యో గోపా అపి తం హువే। (ఋగ్వేదం).

ఈ వేదమంత్రంలోని మొదటి రెండు పదాలు ఈ శ్లోకంలో మొదటి రెండు నామాలుగా (ఆవర్తనో నివృత్తాత్మా) కూర్చబడ్డాయి.

సూర్యాచన్ద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్ । (యజుర్వేదం)

సూర్యచంద్రాదులను బ్రహ్మ మునుపటి వలె సృజించెను.

పునః ప్రాణః పునరాత్మా న ఏతు పునశ్చక్షుః పునరసుర్నఏతు।। - అనే (అథర్వవేద) మంత్రం, మరల మరల ఆవృతమయ్యే జగల్లక్షణాన్ని ద్యోతకం చేస్తోంది.

త్రిప్పేవాడు తానైనా, తిరిగేదానిలో చిక్కని వాడు కనుక -

నివృత్తాత్మా.. 229

1. సంసార బంధము నుండి మరలిన (ఆత్మ) ముక్త స్వరూపుడు.
   సర్వమును త్రిప్పుతున్నా తిరిగే పరిణామాలకు లోనుకానివాడు,
   సర్వవ్యాప్తియైనా నిర్లిప్తుడై ఉన్నవాడు.
2. దేహాదుల భ్రమణంలో (సంసారంలో) పలు పరిణామాలను చూస్తున్నా,
   ఆత్మ ఏ పరిణామానికీ లోను కాదు. అలా నివృత్తమై ఉన్న ఆత్మయే విష్ణువు.
3. విశ్వ చక్ర, కాల చక్రాలకు అతీతుడు. **'పరాత్ పరతరం యన్మహతో మహాన్తమ్'** అని, జగత్తుకి పరమునిగా వేదం చేత వినుతుడు.
4. త్రిప్పేవాడూ ఆయన, మరల్చేవాడు ఆయన.
   సంసార చక్రమనే రంగులరాట్నంలో తిరిగి, సత్యమెరిగి తననాశ్రయించిన యోగులను ఆ చక్రపు తిరుగుడు నుంచి మరల్చే మోక్షకారకుడు.
5. ఈ రెండు నామాలు 'ప్రవృత్తి, నివృత్తి మార్గాలను ఏర్పరచినవాడు' - అనే అర్థాన్ని కూడా స్ఫురింపచేస్తున్నాయి.
   సహజంగా తాను నివృత్తుడైనా, తిరిగే జగత్తులో తన మాయాశక్తిని నింపి, తనని తాను మరుగుపరచువాడు.

సంవృతః 230

1. దాగియుండువాడు.
   'ధూమేనా వ్రియతే వహ్నిః' (గీత) - పొగచే కప్పబడిన నిప్పువలె, మన అజ్ఞానం చేత ఆయన కానరాకున్నాడు. మబ్బు ఆవరించి సూర్యుడు గోచరించనట్లుగా నిజానికి సూర్యుడ్ని మబ్బు కప్పలేదు.
   'ఏకోదేవః సర్వభూతేషు గూఢః' -
   సర్వ ప్రాణులలో రహస్యంగా ఉన్న ఆత్మస్వరూపుడు.

అవతారాదులలో కూడా తన అసలు తత్త్వాన్ని మరుగుపరచినవాడు. తిరుగుతున్న మనకి, తిప్పేవాడు, కనబడకుండా ఉన్నాడు. తిరుగుట బట్టి తిప్పేవాడ్ని పోల్చుకోగలగాలి.

2. **సమ్యక్ వృతః** – వ్యాపక ధర్మంతో అంతటా నిండినవాడు. తాను తిరగకున్నా, తన శక్తి లేకుండా విశ్వచక్రం నడవదు. ఆ చక్రంలో తానే చైతన్యరూపంతో ప్రవేశించి లోన దాగి ఉన్నాడు కనుక 'సంవృతః'.

ఇంద్రియాలలో సంచరించే (ఆవృతమయ్యే) చైతన్యాన్ని చూడగలం. కానీ దీనికి మూలమై హృదయంలోనే 'నివృత్తుని'గా ఉండి, నిర్వహించే ఆత్మను చూడలేకపోతున్నాం. బాహ్య దృష్టి గలవారికి గోచరించకుండా అత్యంత రహస్యంగా దాగినవాడు సంవృతుడు.

గ్రహించి శరణు వేడినవారి సంసార బంధనాలను, తత్కారణమైన అజ్ఞానాన్ని సమూలంగా నాశనం చేసే వాడు కనుక –

సంప్రమర్దనః.. 231

1. సంపూర్ణంగా, గొప్పగా క్షోభింప (లయింప)చేయువాడు.

తిరుగుతున్న కాల చక్రాన్ని తిరిగే జీవులను సమయానుసారంగా ప్రళయాదులలో నశింపచేయు కాలస్వరూపుడు. రుద్రాది విభూతులతో ప్రళయాదులను కల్పించువాడు. **'కాలోస్మి లోకక్షయకృత్'** అని గీతావచనం.

2. **సం-ప్ర-మర్దనః**, ఈశబ్దంలో సం, ప్ర – ఉపసర్గలు.

మర్దనము క్రియ. ఈ క్రియకు 'క్షోభింపచేయుట' అని అర్థం. **మృద్నాతి క్షుభ్నాతి సంపినష్టి** – ప్రకృష్టంగా,సంపూర్ణంగా క్షోభింపజేస్తే – సంప్రమర్దనం.

క్షోభలేనిదే సృష్టిలేదు. ఆ క్షోభయే తపస్సు.

తన గొప్పతపస్సుతో విశ్వాన్ని సృజింపచేసినవాడు విష్ణువు.

తపస్తన్మహినా జాయతైకమ్ (ఋగ్వేదం)

కుండలు చేసేవాడు, ముందుగా మట్టిని బాగా మర్దించుతాడు.

రైతు విత్తనాలను వేసేముందు పృథ్విని దున్ని క్షోభింపచేస్తాడు. ఆ క్షోభ చక్కగా తగిన విధంగా సాగినప్పుడే సృష్టి సాగుతుంది. సృష్టిలో ఏది ఉద్భవించినా దాని పూర్వరంగం సంప్రమర్దనమే.

3. ఆశ్రయించిన వారి సంసార దుఃఖాలను నశింప(మర్దింప) చేయువాడు.

య ఏవం విదురమృతాస్తే భవన్తి।
అథేతరే దుఃఖమే వాపియన్తి ॥ (బృహదారణ్యకోపనిషత్తు)

"పరమాత్మను ఎరిగిన వారు అమృతులౌతారు. ఎరుగనివారు దుఃఖాన్ని పొందుతున్నారు."

పైరీతిగా కాలస్వరూపుడైనందున -

అహస్సంవర్తకః.. 232

1. పగటిని కలిగించువాడు.

నజహాతి ప్రకాశం ఇతి అహః. ప్రకాశమును వీడనిది 'అహః', వెలుగును వదలనిది పగలు. దానిని చక్కగా నడుపువాడు.

పగలు మొదలైన వాటిని చక్కగా తిరుగునట్లు చేయువాడు అని అర్థాన్ని గ్రహించాలి. అహోరాత్రాది సమస్త కాలాన్ని ప్రవర్తింపచేయువాడు.

2. **'సంవృతః'** - మాయచే కప్పబడినట్లున్న సత్యం. దానిని అజ్ఞాన 'సంప్రమర్దనం'తో (అజ్ఞాననాశనంతో) గోచరింపచేసి, ఆ జ్ఞాన ప్రకాశాన్ని (అహః) చక్కగా కలిగించువాడు - అనే క్రమం ఈ నామాల వరుసలో ఉంది. 'ఆవర్తనః' నుండి గమనించితే సంసారక్రమం, దాని నుండి విముక్తి సూచితం. జ్ఞానపరమైన అన్వయమిది.

3. సృష్టిలో పంచభూతాదులలోను, ప్రతి వస్తువులోను దానిదైన స్వాభావిక లక్షణం ఉంటుంది. అదే దాని వీడని ధర్మం. **(నజహాతి అహః)**. ఆ ధర్మమే ఆ వస్తువుకి ప్రకాశం. ఇలా ప్రతి పదార్థం తన స్వప్రకాశాన్ని (నైజగుణాన్ని) వీడకుండా అనంతకాలంలో నిర్వర్తింపచేసేవాడు 'అహస్సంవర్తకుడు.'

సృష్ట్యారంభం నుండి సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, భూమి తమ నైజ గుణాన్ని వీడలేదు. మానవుల ఉపాధి లక్షణాలు, అగ్నిలోని దాహకత్వం, వాయువులోని గమనం, వృక్షాల తీరులు – ప్రకృతి అంతా ఏ యుగంలోనైనా ఒకే విధంగా తమ లక్షణాలను వ్యక్తం చేస్తున్నాయి. అదే 'అహస్సు'. దానిని ఇంత చక్కగా సర్వయుగములందు (సమ్యక్ వర్తకః) వర్తింపచేస్తున్న విరాట్ చైతన్యమే విష్ణువు.

3. పగళ్ళను చక్కగా కలిగించువాడు – అనే అర్థంలో 'సూర్య రూపు'నిగా సంభావించాలి.

దినకరుడైన సూర్యుడేకాక, యజ్ఞానికి ఆధారమైన అగ్ని కూడా హరియే గనుక –

వహ్నిః.. 233

1. అగ్ని స్వరూపుడు.

యజ్ఞాలలో దేవతలకై ఇవ్వబడిన హవిస్సులను 'వహించుట' చేత అగ్నికి 'వహ్ని' అని పేరు. జఠరమందు మనం భుజించే ఆహారాన్ని వహించి పచనం చేసి, ఇంద్రియాలకు శక్తినందించే క్రియ కారణంగా కూడా జఠరాగ్ని 'వహ్ని.'

'అహం వైశ్వానరోభూత్వా' అని గీతలో స్వామి మాట.

సర్వ విశ్వమునందు ఈ 'వహించే' కార్యం చేసే తేజస్సుగా ఉన్న నారాయణుడు 'వహ్ని.'

దేవానామసి వహ్నితమం సస్నితమం పప్రితమం
జుష్టితమం దేవహూతమమ్॥ యజుర్వేదం॥

జ్వలించే అగ్నిగానే కాక, జ్వలింపచేసే వాయువుగా భాసించేవాడై –

1. వాయురూపుడు.

ప్రకృతిలో పరమాత్మ తన లక్షణాన్ని చక్కగా నిబద్ధం చేశాడు. వాటిని అనుభవిస్తున్న మనం జాగ్రత్తగా పరిశీలిస్తే అందులోనే పరమేశ్వరుని దర్శించగలం.

ప్రాణాద్వాయురజాయత (పురుష సూక్తం). విరాట్పురుషుని ప్రాణశక్తి వాయువు.

మనలో ప్రాణ వాయువుగా, విశ్వాన వివిధ వాయువులుగా ఉన్న ప్రాణ స్వరూపుడు విష్ణువు.

- **అనితి ప్రాణితి ఏలయతి ప్రేరయతి గతిం వా స్థాపయతి – అనిలః,** జీవింపచేయుట, ప్రేరేపించుట, గతిని కల్పించుట – చేసేవాడు 'అనిలుడు'. ఈ పనులన్నీ ఆ పరమేశ్వరుడైన విష్ణునివే కనుక విష్ణువు అనిలుడు. ఈ లక్షణాలు వాయువు ద్వారా అందిస్తున్నాడు.
- **అనిలయఃః** – ఒకచోట స్థిరంగా లేకుండా సంచరించువాడు – అనిలుడు.
- **అనాదిత్వా దనిలః** – అనాదియైనవాడు.
- **ఆనాదానాద్వా అనిలః** – అన్నిటిని తాకి వెళుతున్నా దేనిని తాను గ్రహించనివాడు.
- **అననాద్వా అనిలః** – ప్రాణ చేష్టగా ఉన్నవాడు. శ్వాసరూపుడైనవాడు. ఇన్ని అర్థాలు అనిల శబ్దంలో దాగి ఉన్నాయి.

2. **ఇల స్వప్న ప్రేరణయోఃः. న ఇలతీ త్యనిలః,**

'ఇల' అంటే నిద్ర, ప్రేరణ అని అర్థాలు. న ఇలతీత్యనిలః।

ఎన్నడూ నిద్ర పోనివాడు. నిత్యజాగరూకుడు. అనిలుడే నిద్రపోతే ప్రపంచమే లేదు. విష్ణువు ఎల్లవేళలా జాగరూకుడే.

అతంద్రో దూతో అభవో హవిర్వాట్ ॥ఋగ్వేదం॥

ఋషీ బోధప్రతీబోధావస్వప్నో యశ్చ జాగృవిః॥ అథర్వవేదం॥

జాగృవిం విభుమ్ ॥ ఋగ్వేదం॥

-అని శ్రుతి ఆ నిత్యప్రబుద్ధుని పేర్కొంది. ఈ అతంద్ర గుణాన్ని వ్యాపింపచేసి సూర్యాదులలో, ప్రాణాదులలో వ్యక్తం చేస్తున్నాడు.

అన్నిటినీ తాను ప్రేరేపించువాడు. కానీ తనను ప్రేరేపించేవారు లేరు. కదిలే వాయువుగానే కాక కదలక ధరించే శక్తిగా ఉన్నవాడు -

ధరణీధరః.. 235

1. భూమిని ధరించువాడు.

వివిధ ప్రకృతిని ధరించిన ధరణి. దానిని ధరించినవాడు విష్ణువు. ధరించుట - అనే శబ్దానికి దాల్చుట, పోషించుట అని అర్థం. అన్నిటినీ ధరించే దానిలోని ధారణ చైతన్యం విష్ణువు. భూమి ఇలా నిలబడిందంటే అహస్సంవర్తకుడైన సూర్య స్వరూపంగా ఆకర్షణ, ప్రాణ శక్తులతో విష్ణుతేజం పట్టి ఉంచడమే. ఆ తేజస్సే వహించుశక్తి (వహ్ని)తో, ఆధారమైన ధరణిని ధరించి దాని కక్ష్యయందు దానిని నిర్వహిస్తున్నది.

యేన ద్యౌరుగ్రా పృథివీ చ దృఢా। ॥యజుర్వేదం॥

ఉత్కృష్టముగా పట్టి ఉంచిన (ఉగ్ర) పరమేశ్వర శక్తి చేతనే పృథివి దృఢమై, తన స్థానాన తాను నిలిచి ఉంది.

సదాధార పృథివీం ద్యాముతేమాం

కస్మైదేవాయ హవిషా విధేమ ॥యజుర్వేదం॥

సత్పదవాచ్యుడైన పరమ పురుషుడే భూమినీ, ఆకాశాన్నీ ధరిస్తున్నాడు. భూమిని భరించి భూదేవికి పతిగా ఐనవాడతడే -

ధాతా ధాతృణాం భువనస్యయస్పతిః ।ఋగ్వేదం।

వరాహరూపుడై దాల్చడమే కాక దిగ్గజాలుగా, ఆదిశేషునిగా భూమిని దాల్చినవాడు శ్రీహరియే.

2. ధరణిని ధరించునవి పర్వతాలు - అని సాధారణార్థం.
పర్వతాలు కూడా విష్ణు స్వరూపాలు. 'విష్ణుః పర్వతానామధిపతిః' - అని శాస్త్రవచనం. మహౌషధులకీ, దివ్యనదులకీ, మేఘాలకీ, జంతుజాలాలకి ఆధారమైన పర్వతాలు విష్ణు విభూతిని కలిగినవి. గోవర్ధన పర్వత రూపంగా బృందావనంలో ఆవిర్భవించి గోసంపదను వర్ధింపచేసినవాడు.
'ఆవర్తనః' నామం నుండి జగచ్చక్ర, కాలచక్ర నిర్వాహకునిగా విష్ణువును ప్రస్తావిస్తూ - ఈ జగత్కాలాలలో దిన రాత్రాదులుగా, అగ్నిగా, వాయువుగా పలు రూపాలతో భూమ్యాదులను ధరించువానిగా కీర్తించారు.
ఇన్ని నిర్వహిస్తున్నదీ విశ్వంపట్ల కారుణ్యంతోనే. అందువలననే -

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్ విశ్వభుగ్ విభుః।
సత్కర్తా సత్కృతః సాధుర్జహ్నుర్నారాయణో నరః ॥... 26

236. సుప్రసాదః, 237. ప్రసన్నాత్మా, 238. విశ్వధృక్, 239. విశ్వభుక్, 240. విభుః।
241. సత్కర్తా, 242, సత్కృతః, 243. సాధుః, 244. జహ్నుః,
245. నారాయణః, 246. నరః ॥

సుప్రసాదః.. 236

1. శోభనమైన అనుగ్రహముకలవాడు.
ప్రసాదము, ప్రసన్నత - అనేవి ఒకే అర్థం కల శబ్దాలు. చెక్కుచెదరని సంపూర్ణ ప్రసన్నత కలవాడు కనుక 'సుప్రసాదః' జగమునకు 'సు' - మంగళకరమైన ప్రసన్నత అది.
రజోగుణ తమో దోషాలు లేని మనస్సు ప్రసన్నం. శుద్ధ సత్త్వ గుణ ప్రసన్నత, ప్రసాద లక్షణము. మనస్సులో రాగద్వేషాలు లేని నిర్మల శాంతావస్థ అది. నిరంతరం ఆ విధంగా ఉండి అనుగ్రహించేవాడు.
తాపాదులు లేని స్థితి అది. ఆ 'ప్రసాదం' కోసమే సుప్రసాదుని ఆశ్రయించాలి.

యదనన్తస్తద్బహిఃశ్చాపి యత్కృత్వా వర్ధతే తనుః ।
స్వీయ వర్గే చ యద్వస్త్వం ప్రసాదః సా ప్రసన్నతా॥ అని శాస్త్రం ప్రసాదలక్షణాన్ని చెప్పింది.

"ఏది లోపలా బయట కూడా ఉన్నదో, దేనిని అనుసరించడం చేత శరీరం వృద్ధి చెందుతుందో, దేనిని బట్టి తనవారు ఆదరంగా వందనం చేస్తారో అదే ప్రసాదం, ప్రసన్నత."

ఈ లక్షణం పుష్కలంగా గల శుద్ధ సత్త్వ విగ్రహుడు విష్ణువు. రావణ శిశుపాలాది శత్రువుల పట్ల కూడా ప్రసాద లక్షణాన్ని (అనుగ్రహాన్ని) ప్రకటించాడు. మరి - అది శిక్షించే ఆగ్రహం కాదు! - అంటే వారికి మోక్షమిచ్చే అనుగ్రహమే కానీ ఆగ్రహం కాదు. కనుక అది సుప్రసాదమే. **తమక్రతుమ్ పశ్యతి వీతశోకః ధాతుః ప్రసాదాత్** (శ్వేతాశ్వతర ఉపనిషత్తు) "ప్రయత్నంతో సాధించలేని వానిని ఆతని అనుగ్రహం చేతనే శోకరహితుడై గాంచగలడు."

రజస్తమోగుణాల కల్లోలం లేని ఈ స్థితియే నిజమైన ఆనందం. **ఆనందామోదాః ప్రమదో భీమోదముదశ్చయే ॥** అని 'అథర్వవేదం' ఆ ఆనందస్వరూపుని స్తుతించింది.

ఆ ఆనందమే తన స్వరూపం కనుక -

ప్రసన్నాత్మా.. 237

1. ప్రసన్నతా స్వరూపుడు, స్వభావుడు, ఆనన్ద స్వరూపి.
ప్రసాద లక్షణమే తన స్వరూపంగా, స్వభావంగా ఉన్నవాడు.
రజస్తమోగుణాల చేత శోక, మోహ, మాత్సర్యాది కల్లోలాలు,
కామక్రోధలోభాది వికారాలు ఏర్పడతాయి. మనస్సున ఇన్ని అలజడులు రేపే దోషాలు రజస్తమములు, వీటికి అతీతంగా
"తమసః పరస్తాత్" (శ్రుతి) ఉన్నవాడు ప్రసన్నుడు.

ఇది మహాపురుష లక్షణం. ఈ మహాపురుషులకే మహా పురుషుడు మాధవుడు.

"శాన్తి సమృద్ధమమృతమ్" (శ్రుతి) అలజడులన్నీ అణగిన శాన్తభావం సమృద్ధిగా కలిగిన అమృత స్వరూపమే పరబ్రహ్మము.

2. ప్రసన్నతతో వ్యాపించినవాడు.

జగమంతా ఆనందరూపమైన ప్రసన్నత వ్యాప్తి చేసినవాడు. ఉదయాలలో, విశాల పర్వతాలలో, పచ్చని వృక్షాలలో, చల్లని గాలులలో, పారే ఏరులలో, సంధ్యలలో, రాత్రులలో... కనిపించే ప్రసన్నతా లక్షణమంతా ఆ విశ్వవ్యాపకుడు వ్యాపింపచేసినదే.

3. **కరుణార్ద్ర స్వభావాత్, ప్రసన్న స్వభావః కారుణికః.**

దయామయుడు. పంచభూతాలలో సూర్య చంద్రాదులలో ఈ కరుణనే నింపి ఉంచాడు. మనలో ప్రత్యణువూ ఈ కరుణతోనే వ్యాపించిఉన్నాడు. భక్తులను ఈ కరుణార్ద్ర స్వభావంతోనే అనుగ్రహిస్తున్నాడు.

కరుణతోనే విశ్వాన్ని ధరిస్తున్నందున -

విశ్వధృక్.. 238

1. అంతటినీ ధరించువాడు.

'ధృష్ ప్రాగల్భ్యే'. గొప్పగా విశ్వమును స్థాపించువాడు.

ఆశ్చర్యం, అద్భుతం ప్రకటింపబడేలా ప్రగల్భముగా విశ్వమును నిర్వహించే జ్ఞాన చాతుర్యం కలవాడు.

జ్ఞానాన్ని, కారుణ్య విశేషాన్ని ప్రకటించుతూ విశ్వాన్ని ధరించిన స్వామి ఆ ధారణా మహిమతోనే సృష్టి, పాలన, లయాదులు నిర్వహిస్తున్నందున-

విశ్వభుక్.. 239

1. విశ్వమును పాలించువాడు. భుజించువాడు.

'భుంక్తే' అనే క్రియకి 'పాలయతి' 'భుజతి' అని అర్థాలు.

రెండు అర్థాలను ఇక్కడ గ్రహించాలి. ప్రసన్నాత్ముడై సృష్టి స్థితి లయలను నిర్వహించేవాడు.

విశ్వభృదగ్నిః పిపర్త్యయసా సజోషాః (అథర్వవేదం)

2. జీవునకు అనుభవమే భోజనం. ఆ అనుభవ రూప చైతన్యమే భుక్. శబ్ద స్పర్శాదుల ననుభవించే శక్తి ఇంద్రియముల ద్వారా జీవుడు కలిగి ఉన్నాడంటే అతడిలో ప్రసరించే ఈశ్వర చైతన్యమే కారణం. అందువల్ల ఆ చైతన్యం విశ్వభుక్. జీవజగత్తు ఆ భోజనం చేతనే పాలింపబడుతున్నది.

సమయమెరిగి సంహారకాలాన సమస్తమును తనలో గ్రహించువాడు కనుక విశ్వభుక్.

బహు విధములుగా ఈ సృష్టి స్థితి లయలు చేస్తున్నందున –

విభుః.. 240

1. వివిధములుగా ఆగువాడు.

బహువిధములుగా భాసించువాడు. హిరణ్యగర్భాది సకల రూపములను ఏర్పరచి, గోచరించువాడు. "అఖిల రూపులు తన రూపమైనవాడు" అని గజేన్ద్రుడు ఈ విభునే ప్రార్థించాడు.

'నిత్యం విభుం' అని మంత్ర వర్ణం చెబుతుండగా, ఇంకా శ్రుతి అనేక చోట్ల విభు శబ్దాన్ని ప్రయోగించింది –

సమేత విశ్వే వచసా పతిం దివ

ఏకో విభూరతిథి ర్జనానామ్ ॥ అథర్వవేదం॥

ఆదిత్య చంద్రాగ్నులు మొదలైన వివిధ రూపాలుగా తన అనంత చైతన్యాన్ని కనబరచిన విష్ణు విభుని – యజుర్వేదం ఇలా స్తుతించింది –

తదేవాగ్నిస్తదాదిత్య స్తద్వాయుస్తదు చన్ద్రమాः ।
తదేవ శుక్రం తద్ బ్రహ్మ తా ఆపः సప్రజాపతిः ॥

విభుడై విశ్వమనే సత్కర్మను చేసేవాడు కనుక –

సత్కర్తా.. 241

1. మంచిని చేయువాడు.
   భగవానుడు చేసే ప్రతి పనీ మేలుకొరకే. మన తత్కాల దృష్టితో గ్రహింపలేకున్నా, పరిణామాలలో మేలునే కలిగించేది ఈశ్వర చేష్ట.
2. శ్రద్ధతో చేసే యజ్ఞదానతపస్సులు 'సత్' అనిపించుకుంటాయి. ఈశ్వర ప్రేరణ, అనుగ్రహం లేనిదే ఆ కర్మలు చేయలేం. అతడే చేయిస్తున్నాడనే సమర్పణా భావంతో, అహంకార త్యాగంతో చేసినప్పుడు జ్ఞానాన్ని పొందగలం. 'సత్' అనబడే యజ్ఞాదులకు కర్త 'సత్కర్తా'.
3. సల్లక్షణాలను ఏర్పరచినవాడు, విశ్వనిర్వహణకు సత్పురుషులను, సద్గుణాలను ప్రేరేపించి జగద్రక్షణ చేయువాడు.
   వ్యాపకశీలుడైన విష్ణువు తన పరోపకారం, నిరపేక్ష, కరుణ, సర్వ సమదృష్టి, క్షమ, సత్యం వంటి దివ్య సద్గుణాలను సూర్యాదులలో నింపి – వాటిద్వారా జగత్తును కాపాడుతున్నందున సత్కర్తా.
4. 'సత్' శబ్దానికి శాశ్వతత్వం అని కూడా అర్థం. సదా భువనములకు కర్తగా ఉన్నవాడు.
5. **సతः కర్తా**, తనదైన ప్రకృతి (సత్త)ని సాధనగా చేసుకొని జగత్తును చేయువాడు.

   విష్ణోः కర్మాణి పశ్యత యతో వ్రతానిపస్పశే ॥(ఋగ్వేదం)

   శ్రేష్ఠమైన విష్ణుని కర్మలు బహుధా వర్ణితాలు. సత్కార్యమైన జగద్రచనగా విష్ణు కర్మలు గోచరించడమేకాక, 'సత్' (సాధుత్వ, సాత్త్విక, ధర్మ) రక్షణకై అవతరించి చేసినవన్నీ సత్కర్మలే. ఆ విధంగా సల్లక్షణయుక్త అవతార కృత్యాల నాచరించిన సత్కర్త.

6. గౌరవించువాడు, పూజించువాడు అనే అర్థాన్ని గ్రహిస్తే – ఈ జగత్తులో 'సల్లక్షణం' ఎక్కడ, ఎవరు వృద్ధి చేసుకున్నా వారిని తగిన పూజ్యస్థానంలో ఉంచువాడు.

అంతేకాక – అవతార సమయాలలో తాను స్వయంగా మాతాపితరులను, ఆచార్యులను, మహర్షులను, పెద్దలను వినయంగా సత్కరించిన ఆదర్శమూర్తి.

ఈ సద్గుణ, సత్కర్మల చేతనే అందరిచే పూజింపబడుతున్నాడు.

సత్కృతః.. 242

1. పూజితుల చేత కూడ పూజింపబడువాడు.

(పూజింపబడే వారిలో అత్యధికుడు).

వేదములు, దేవతలు, మహర్షులు అందరిచే పూజ్యులు. వారి పూజలందుకొనే మాననీయుడు మాధవుడు.

గాయన్తి త్వా గాయత్రిణో అర్చన్త్యర్క మర్కిణః। (ఋగ్వేదం)

అర్చన ప్రార్చత ప్రియమేధాసో అర్చస । (అథర్వవేదం)

ఆ దైవాన్ని అర్చించమని శ్రుతి మనలను ఉద్బోధిస్తోంది.

భగవంతుని అనుగ్రహానికి నోచుకొని, ఆయన దివ్య గుణాలలోని కొన్నిటిని లేశమాత్రంగా పొంది మహాపురుషులు సత్కృతులౌతున్నారు. అటువంటి అనంత మహిమా సంపన్నుని తెలివైనవారు ఎవరు పూజించకుండా ఉండగలరు?

సర్వేనమస్యంతి చ సిద్ధ సంఘాః
కస్మాచ్చతే ననమేరన్ మహాత్మన్!
గరీయసే బ్రహ్మణోప్యాదికర్త్రే! ॥ (భగవద్గీత)

విశ్వరూపాన్ని దర్శించి వివశుడైన విజయుడు – "ప్రభూ! శ్రీకృష్ణా! సిద్ధ సంఘములన్నీ నిన్ను నమస్కరిస్తున్నాయి. అసలు నిన్ను చూసి నమస్కరించ

కుండా ఎవరుండగలరు! సృష్టికర్త అయిన బ్రహ్మకు కూడా అది కర్తవు నీవు" అని ప్రస్తుతించాడు.

ఆ సర్వ పూజితుని వాక్కులతో, చేతలతో, చింతనతో పూజించేవారే ధన్యులు.

ప్రేమగా పూజించేవారి పూజ ఎలాంటిదైనా ప్రీతిగా స్వీకరించే స్వామి, మహర్షుల దేవతల పూజలనే కాక, గజేంద్ర, శబరి, జటాయు, కుబ్జ, మాలాకర (సుదామ), పాండవాదుల పూజలనరదుకున్నవాడు.

ఈ రెండు నామాలలో ఒక లోకోపదేశం ఉంది –

'సత్కర్తా' కాగలిగినవాడు 'సత్కృతు'డౌతాడు. ఒకరిని గౌరవించి, పూజించగలిగేవాడే ఇతరులచే పూజింపబడతాడు. మంచిని గుర్తించి మన్నించేవాని మంచితనమే మన్నించబడుతుంది.

'త్రికరణ శుద్ధిగ చేసిన పనులను

దేవుడు మెచ్చును లోకము మెచ్చును' అనే అన్నమయ్య బోధను ఈ రెండు నామాలలో (సత్కర్తా, సత్కృతః) గ్రహించవచ్చు.

సల్లక్షణాలతో సర్వమును సాధించువాడు –

సాధుః.. 243

1. సాధించువాడు.

'సాధ సంసిద్ధౌ' – చక్కగా సిద్ధించుకొనువాడు, సిద్ధింపచేయువాడు. విశ్వ సృజన మొదలైన కర్మలను చక్కగా సమర్థవంతంగా సాధించువాడు. చేయబడిన జగత్తును సహజస్వభావంతో, సరళంగా సాగించువాడు. మేలును చేయువాడే కాక, మేలే తానైనవాడు. మంచి, బాగు, మేలు, సమర్థత –ఇవన్నీ సాధు శబ్దార్థాలు.

తన విశ్వరచనలో ఈ లక్షణాలను వ్యాపింపచేసినవాడు. స్వభావమే 'సత్' అయినవాడు.

బృబదుక్థం హవామహే సుప్రకరస్న మూతయే।
సాధు కృణ్వన్త మవసే॥ ఋగ్వేదం॥
సనో విశ్వాని హవనాని జోషద్ విశ్వశంభూరవసే సాధుకర్మా
॥ ఋగ్వేదం॥

'సాధుకర్మా' అని శ్రుతి వర్ణించిన పరమాత్మ ఈతడే.

2. సదా ధర్మ న్యాయ ప్రవృత్తితో విశ్వనిర్వహణలోనూ, అవతారకార్యాలలోను వర్తించినవాడు సాధువు.

తాను సాధువుగా ఉండడమే కాక,అసాధుత్వాన్ని తొలగించేవాడు కనుక -

జహ్నుః.. 244

1. వీడినవాడు, తొలగించువాడు -

జహాతేతి జహ్నుః. దోషాలన్నిటినీ వీడినవాడు, బంధములను విడచినవాడు. వాటిని తొలగించువాడు.

మాలిన్య దోషాలను సంపూర్ణంగా నశింపచేసి, నిర్మలుడై భాసించే శుద్ధ స్వరూపుడు.

'సాధు' లక్షణమే శుద్ధత్వం కనుక రెండు నామాలు వెంట వెంటనే కూర్చబడ్డాయి. స్వామి చేష్టలన్నీ దోషవర్జితాలు.

పర్యగాచ్ఛుక్రమకాయ మవ్రణమస్నావిరం
శుద్ధ మపాపవిద్ధమ్॥ (యజుర్వేదం)

ఏ వేదనలు లేని శుద్ధుడు. దోషరహితుడు - అని వేదం చెబుతున్నది.

2. సృష్టిలో ఈ మాలిన్యాన్ని తొలగించే శక్తిని సైతం వ్యాపింపచేసిన వాడతడు. వృక్షాలు పండుటాకుల్ని రాల్చటం, శరీరంలోని వ్యవస్థ తనంత తానుగా మాలిన్యాలను తొలగించటం, జలాదులకు శుద్ధి చేసే శక్తి... ఈ రకమైన మలిన మోచన శక్తిని విశ్వాన నింపి ఉంచినవాడు కనుక జహ్నువు.

రాజర్షులలో కూడా- సంసార మాలిన్యాన్ని వదలిన 'జహ్ను' మహర్షి ప్రస్తావన

పురాణాల్లో ఉంది. గంగావతరణ సమయంలో గంగను పూర్తిగా ఆపోశన పట్టిన మహర్షి ఇతడు. తిరిగి లోకక్షేమం కోసం గంగను వదిలాడు. జహ్నువు నుండి తిరిగి వచ్చినది కనుక 'జాహ్నవి' అనే పేరు గంగకు ఉంది. ఇది పురాణ కథ. అంతేకాక – మాలిన్య పాపాది దోషాలు లేనిది, ఆశ్రయించిన వారి దోషాదుల్ని పోగొట్టే నిర్మల దివ్యనది గనుక 'జాహ్నవి' అని అర్థం చెప్పవచ్చు.

'జహ్ను' (శుద్ధ) స్వరూపుడైన శ్రీమన్నారాయణుని పాదకమలం నుండి ఉద్భవించుట చేత ఆ దివ్య లక్షణంతో శోభిస్తున్నది.

3. **జనాన్ సంహార సమయే అపహ్నుతే అపనయతీతి జహ్నుః.**
సంహార కాలంలో జనులను అంతరింపచేసేవాడు.

4. **జహాత్యవిదుషో భక్తాన్నయతి పరం పదమితి జహ్నుః,**
తత్త్వము తెలియనివారిని వదలి, ఆశ్రయించిన భక్తులకు తన పరమ పదాన్ని ప్రసాదించేవాడు. అజ్ఞానులు ఆ పరంధామును గ్రహింపలేరని భావం. **జహాతి నయతి**– వదలువాడు, చేర్చువాడు.

ఆశ్రయించిన వారిని శుద్ధులను చేసే ఆ నిత్యశుద్ధుడే అందరికీ ఆశ్రయస్థానం. స్మరించినంత మాత్రాన శుద్ధుల్ని చేసే ఆ పరిశుద్ధుని దివ్యనామమే –

నారాయణః.. 245

1. సర్వజీవులకు ఆశ్రయమైనవాడు.

నృణాతీతి నరః. నడచువాడు (సాగేవాడు) నరుడు.

జీవించడమే సాగడం. సర్వ జీవులు కాలంలో సాగేవారే. కాలం కూడా సాగే లక్షణం కలది. అలాగే జలములు గమనం చేసేవి. వీటికి 'నర' అని పేరు. వీటి సమూహవాచకం 'నారం'.

పుట్టి పెరిగి సాగే జీవ సమూహం 'నారం'. అంతేకాదు సృష్టియంతా 'నారం'. 'అయనం' అంటే 'ఆశ్రయస్థానం' సృష్టి దేని నుండి సంభవించిందో,

దేనిని ఆశ్రయించుకుని జీవిస్తోందో, చివరకు దేనియందు లీనమై ఉన్నదో ఆ పరమాశ్రయ స్థానమైనవాడే నారాయణుడు.

'నారాణాం అయనం యస్మాత్తస్మా న్నారాయణ స్మృతః' – అని బ్రహ్మవైవర్త పురాణం. 'ఆశ్రయుడు' అంటే 'రక్షించువాడు' అని అర్థం. నరులను (జీవులను) రక్షించువాడు. నిజమైన రక్షకుడాతడే.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు లీనమై ఎవ్వని యందు డిందు?" – అని ఆ సర్వాశ్రయుని ఆశ్రయించాడు గజేంద్రుడు.

2. **నరాజ్జాతాని తత్త్వాని నారాణీతి తతో విదుః।**
నాన్యేవ చాయనం తస్య యేన నారాయణః స్మృతః।। (మహాభారత్)

'నర' అంటే ఆత్మ. **'ఆత్మా ఏవ ఇదమగ్ర ఆసీత్'** అని ఉపనిషత్తు చెప్పినట్లుగా, మొదట ఉన్న ఆత్మ నుండే ఆకాశాది తత్త్వములు (పంచభూతాలు, పంచతన్మాత్రలు, పంచేంద్రియాలు మొదలైనవి) ఉద్భవించాయి. కారణమైన 'నర' నుండి ఉద్భవించిన ఆ కార్యములే నారములు. వాటియందు వ్యాపించి ఆశ్రయంగా ఉన్నవాడు కనుక 'నారాయణుడు'!

యచ్చకించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపి వా।
అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః।। (శ్రుతి)

కనబడే, వినబడే ఈ సమస్త జగమంతా లోపలా వెలుపలా వ్యాపించి ఉన్నవాడు నారాయణుడు.

3. **ఆపో నారా ఇతిప్రోక్తా ఆపోవై నరసూనవః।**
తా యదస్యాయనం పూర్వం తేన నారాయణ స్మృతః।। (మనుస్మృతి)

జలములను 'నారం' అంటారు. దానిని (జలాన్ని) తన చోటుగా, దానికి తాను ఆశ్రయంగా ఉన్నవాడు 'నారాయణుడు'. సృష్టికి పూర్వం సర్వం జలమై ఉన్నప్పుడు వటపత్రంపై బాలముకుందునిగా తేలాడినవాడు. ఈ రూపమే ప్రళయవేళ మార్కండేయునికి గోచరించింది. బాలకృష్ణుని దయతో ఆయన గర్భంలోకి వెళ్లగలిగిన ఆ మహర్షికి, సమస్త బ్రహ్మాండాలు

గోచరించాయి. 'ఒక పరి జగముల వెలినిడి, ఒకపరి లోపలికి గొనుచు' భాసించే నారాయణ తత్త్వం అవగతమయ్యింది. సర్వజగత్తును ప్రళయ వేళలో బీజప్రాయంగా చేసి తన యందుంచుకొని ఆశ్రయమిచ్చినవాడే 'నారాయణుడ'ని బోధపడింది.

తదుపరి – శేషశయనుడై జలమందే ఉన్న విష్ణుని మూర్తి, బ్రహ్మాదులను ఉత్పత్తి చేసింది. సృష్టికి పూర్వమే బీజ స్థితి నుండే సర్వ జగదాశ్రయునిగా ఉన్న నారాయణుని భారత భాగవతాదులు స్పష్టంగా వర్ణించాయి. జలము ప్రవాహరూపం. అది జీవుని వలె నిరంతరం సాగుతుంది. సంసార ప్రవాహానికీ, జల ప్రవాహానికీ నారాయణుడే ఆధారశక్తి. విశ్వంలో ఏది సృష్టింప బడినా దాని స్థూలాకృతికి పూర్వరూపము జలరూపమే. మానవ సృష్టి కూడా బీజ ప్రాయంగా తల్లిగర్భంలో జలమందే ఏర్పడి వృద్ధి చెందుతుంది. ఆ జలమందున్న నారాయణ శక్తే జీవునికి రూపాదులనిచ్చేది. లోహాదులతో వస్తు నిర్మాణం చేసేవాడు ముందు లోహాదులను కరగించుతాడు. అది ద్రవీభూతావస్థే. అలాగే విశ్వంలో వస్తుజాతానికి ప్రథమావస్థ జలం. దానియందు వ్యాపించిన విష్ణు చైతన్యమే ఈ బహువిధ సృష్టికి మూలమయ్యింది.

తమిద్గర్భం ప్రథమం దధు ఆపోయత్ర,
దేవా సమగచ్ఛన్త విశ్వే ॥ఋక్॥
సముద్ర యోనిర్వై (విష్ణుః) యజ్ఞః ।అథర్వవేదం।
సముద్రే తే హృదయ మప్స్వంతః సంత్వా విశన్త్వోషధీరుతాపః।
॥యజుర్వేదం॥

– వేద విజ్ఞానం పలు విధాలుగా జలాలను (జలాలు) ఆశ్రయించిన విష్ణువును కీర్తించింది.

4. సృష్టికి ఆది – మధ్య – అంతములలో ఏకైక ఆశ్రయమైన పరతత్వం నారాయణుడు. ఆశ్రయించినవి ఆశ్రయంలో లీనమైనా ఆ ఆశ్రయస్థానం

మార్పులేని శాశ్వత ధామం.

'అథ నిత్యోహవై నారాయణః' అని శ్రుతివచనం.

'నారాయణ' నామం చాలు.... "నరుడనైన నాకు నీవే ఆశ్రయం. నీవేరక్ష" అనే భావాన్ని, శరణాగతిని బోధిస్తుంది. ఉచ్చారణలోనే, జీవి ప్రయోజనాన్ని నెరవేర్చే లక్షణమున్న శక్తి భగవన్నామంలో ఉంటుంది.

ఆర్తావిషణ్ణా శిథిలాశ్చ భీతాః
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం
విముక్త దుఃఖాస్సుఖినోభవన్తి।

పీడితులు, అసహాయులు, దెబ్బతిన్నవారు, భీతులు, భయంకర వ్యాధులలో నున్నవారు 'నారాయణ' శబ్దాన్ని సంకీర్తన చేస్తేచాలు - సమస్త దుఃఖాల నుండి విడివడి సుఖులౌతారు.

నరులందరికీ దిక్కు, ఆశ్రయము, శరణ్యము (శరణు వేడదగినది) నారాయణ పదమే.

'నారాయణాయ నమ' ఇత్యయమేవ సత్యః
సంసార ఘోర విష సంహరణాయ మన్త్రః।
శ్రుణ్వన్తు భవ్యమతయో యతయోస్తరాగా
ఉచ్చైస్తరా ముపదిశామ్యహ మూర్ధ్వ బాహుః॥ (నృసింహపురాణం)

"నారాయణాయ నమః" ఇది సత్యమైనది. (శాశ్వతమైనది. అమోఘమైనది). సంసారఘోర విషాన్ని సంహరించే మన్త్రమిది. మంచి బుద్ధి గలిగిన యతులారా! చేతులుపైకెత్తి ఎలుగెత్తి ఉపదేశిస్తున్నాను. దీనిని జపించండి." ఇలా పలు విధాల 'నారాయణ' నామమహిమ శ్రుతి స్మృతి పురాణేతిహాసాలలో ముక్తకంఠంతో కీర్తించబడింది.

ఇంతటి మహిమాన్విత నామం కనుకనే ఇది అద్భుతమైన అష్టాక్షరీ దివ్య మంత్రానికి మూలంగా ఉంది.

5. శరీరంలోని ఇంద్రియాలు, అంతఃకరణం, ప్రాణములు... అన్నీ 'నారములు'. వీటికి మూలమైన ఆశ్రయమైన ఆత్మయే నారాయణుడు. ఈ జ్ఞానం కలిగిన వెంటనే జీవచైతన్యం కూడా విష్ణుమయమని తెలుస్తుంది. నరునియందు, నారములందు వ్యాపించిన పరమాత్మయే నారాయణుడు.

ఈ సత్యాన్ని స్ఫురింపచేసే నామం –

నరః.. 246

1. ఆత్మయైనవాడు.
సర్వ దేహముల యందు ఆత్మగా ఉన్నవాడు.
'నరాజ్జాతాని తత్త్వాని' (భారతం) – ఆత్మనుండే తత్త్వములు కలిగాయి.
దేహేంద్రియ మనో బుద్ధులకు పరిమితంగా భావించబడితే జీవుడు. అపరిమితం పరమాత్మ. జీవరూప చైతన్యంగా కూడా ఉన్నవాడతడే. దేహాత్మ భావంతో, కర్మల కారణంగా జీవిత (సంసార) ప్రవాహంలో సాగే చైతన్యం నారాయణుని శక్తియే.

2. ప్రవాహ రూపమే 'నర' శబ్దానికి అర్థం. కల్పకల్పాంతాలలో నడిచే (ప్రవహించే) విశ్వప్రవాహమంతా, అందు వ్యాపించిన విష్ణుని వల్లనే సాగుతోంది. ఈ ప్రవాహ లక్షణ రూపంలో నున్నందున 'నరః'.
తనలో నున్న నారాయణ చైతన్యాన్ని గుర్తించినవాడు క్రమంగా దేహాదులతో తన్మయమైన అహాన్ని (నరత్వాన్ని) నారాయణార్పణం చేసి, ఇక తన జీవ భావాన్ని త్యజిస్తాడు. ఆ జీవరూపంగా భాసిస్తున్న 'నర' రూప చైతన్యమంతా నారాయణుడేనన్న ఎఱుక ఈ నామాన్ని తెలియజేస్తుంది.
'ద్వాసుపర్ణా సయుజాసఖాయా...' అని వెనుకటి భాష్య భాగాలలో చెప్పిన, ఒకే సంసార వృక్షంపై పండుతినే పక్షి (జీవుడు–నరుడు), సాక్షిగా చూస్తున్న విహంగం (పరమాత్మ) – వీరే 'నర–నారాయణులు'. నరునియందు వ్యాపించిన పరమాత్మయే 'నారాయణం'. ఈ వ్యాపక చైతన్యమే లేకుంటే

'అహం' రూపస్ఫురణయే (నరుడే) లేదు. ఈ భావాన్నే – ఒకే నారాయణ తత్వం నరనారాయణ మహర్షులుగా, కృష్ణార్జునులుగా బోధించినది. నారాయణాశ్రయం చేతనే నరుడు తనలోనున్న నారాయణత్వాన్ని గ్రహించగలడు. ఆయన వల్లనే తన 'నరత్వం' ప్రకటింపబడుతోందని తెలుసుకుంటాడు.

నయతీతి 'నరః' ప్రోక్తా పరమాత్మా సనాతనః– (వ్యాసుడు)

సర్వులను నడిపించేవాడు, కనుక (ప్రవాహరూపంగా పయనింపచేయువాడు) సనాతనుడైన పరమాత్మను 'నరు'డని అన్నారు.

నకర్మ నలిప్యతే నరే। (యజుర్వేదం)

నరునకు (ఆత్మకు) ఏకర్మయూ అంటదు.

ఈ విధంగా – అందరికీ ఆశ్రయమైన నారాయణతత్వం అనేకములుగా వ్యక్తమవుతున్నందున...

అసంఖ్యేయోప్రమేయాత్మా విశిష్టః శిష్టకృచ్ఛుచిః।
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః॥... 27

247. అసంఖ్యేయః, 248. అప్రమేయాత్మా, 249. విశిష్టః, 250 శిష్టకృత్, 251. శుచిః।

252. సిద్ధార్థః, 253.సిద్ధ సంకల్పః, 254. సిద్ధిదః, 255. సిద్ధిసాధనః॥

అసంఖ్యేయః.. 247

1. లెక్కించుటకు శక్యం కానివాడు.
   అనంతసత్తగా అనంతజ్ఞానంగా, అనంతానంద అనంతగుణ విభూతులతో ఉన్న వానిని ఇన్ని రూపాలవాడనీ, ఇన్ని నామాలవాడనీ, ఇన్ని గుణాలవాడనీ లెక్కించలేం. అపరిమితుడని అర్థం.
2. విభజింపబడితే లెక్కించగలం. అంతా ఏకమై ఉన్న చైతన్యాన్ని విభజించలేము. అవిభాజ్యుడు.

న ద్వితీయో న తృతీయ శ్చతుర్థోనాప్యుచ్యతే।
న పంచమో నషష్ఠః సప్తమో నాప్యుచ్యతే।
నాష్టమో ననవమో దశమో నాప్యుచ్యతే।
స ఏష ఏకవృదేక ఏవ ॥ అధర్వవేదం॥

– అని వేదమే అతనిని 'అసంఖ్యేయుడ'ని స్పష్టం చేసింది.

అనేక బహూదర వక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోనన్తరూపమ్।
నాన్తం న మధ్యం నపునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప! ॥

"ఓ విశ్వరూపా! విశ్వేశ్వరా! లెక్కకందని ఉదరములతో, వదనములతో, నేత్రములతో, అన్నివైపుల అనన్తముగా, ఆది మధ్యాంత రహితంగా ఉన్నవాడవు."

3. మన భావనకు, మన సాధనకు అనుగుణంగా కొన్ని గుణమహిమా వైభవాలను చెప్పుకున్నా ఏ ఒక్కరూ సమగ్రంగా ఆయనను చెప్పలేరు. చివరకు వేదములు, దేవతలు సైతం సంపూర్ణంగా వర్ణించలేరు. విష్ణుని వ్యాప్తిని పొందిన జ్ఞానులు యోగులు కూడా ఆ అక్షయానందాన్ని అనుభవించడమేకానీ, పూర్ణంగా వివరించలేరు.
'ఈలాగున వివరింపలేను – చాలా స్వానుభవమైన వేద్యమే' అని త్యాగరాజకీర్తన.
సం–ఖ్య = చక్కగా చెప్పుట. సంఖ్యేయః = సమగ్రముగా చెప్పబడువాడు – న= కాడు.
4. సర్వవ్యాపకుడై విశ్వమంతా ఈ లెక్కకందని లక్షణాన్ని నింపి ఉంచాడు. ఏది, ఎంత, ఎప్పటినుండి, ఎప్పటివరకు – ఈ ప్రశ్నలకు సమాధానం దొరకనిది ఈ విశ్వం.
లెక్కకు మాత్రమే కాదు – ఏ ప్రమాణాలకూ అందనివాడు –

అప్రమేయాత్మా.. 248

1. ప్రమాణములకు అందని స్వరూపమువాడు.

అనంత విశ్వరూపుడై విశ్వానికంతటికీ ఆశ్రయమైనవాడు 'ఇలా, ఇంత, ఇక్కడ, ఇప్పటినుండి' ఉన్నవాడని కొలతలకందనివాడు.

ప్రత్యక్ష, అనుమాన, శబ్దాది ఏ ప్రమాణాలతోనూ ప్రతిపాదింపబడని పరతత్త్వం. సముద్రంలో ఉన్న చేప సముద్రాన్ని కొలిచి చెప్పలేదు. విశ్వరూపునిలో ఉన్న జీవులు తమ పరిమితబుద్ధులతో ఆ అపరిమితుని మితి చేయలేనివారు.

తదేవ మన్యేహం జ్యేష్ఠం తదు నాత్యేతి కశ్చన ॥ (అధర్వవేదం)

నైనమూర్ధ్వం నతిర్యఞ్చ నమధ్యే పరిజగ్రభన్ ॥ (యజుర్వేదం)

- అని శ్రుతి ఆ అప్రమేయ స్వరూపాన్ని సంభావించింది

అసంఖ్యేయ, అప్రమేయ స్వభావాలతో విశ్వాధికుడుగా ఉన్నవాడతడే -

విశిష్టః.. 249

1. అన్నిటికీ మించినవాడు.

అతిశయించిన తత్త్వము. ఇంద్రియ మనో బుద్ధ్యాదులను మించినవాడు.

2. అంతా తానవడం చేత తనకు విడిగా ఏదీ, 'శిష్టమై' (మిగిలి) లేదు. మనం చూస్తున్న, ఊహిస్తున్న వాటిని మించినవాడై విలక్షణుడై ఉన్నందున విశిష్టుడు.

3 వివిధ విశేషణాలతో శోభిల్లువాడు.

స్వామి గుణలీలా మహిమా వైభవాల ననుసరించి బహువిశేషణాలతో వేదాదులు కీర్తించాయి. బహువిధ రూప, ఉపకార, మహిమ, జ్ఞాన విజ్ఞానాల చేత బహువిధముల కీర్తింపబడేవాడు.

అసలు విశ్వమంతా ఆ విశ్వమయుడైన అనంతుని మహిమలకు వ్యాఖ్యానమే ఒక మహా సముద్రాన్ని చూసి 'లోతైనది, విశాలమైనది, గంభీర ప్రశాంతమైనది' అని విశేషణాలతో చెప్పినట్లే, మాటలకందని వాడైనా

మాటలతో పొగడదగిన బహువిధ మహిమాసంపన్నుడు కనుక విశేషణాలే నామాలుగా ఈ సహస్రనామ స్తోత్రం కీర్తించింది.

విశిష్టుడై విశ్వశాసనము చేసేవాడై -

శిష్టకృత్.. 250

1. శాసనము చేయువాడు, శాసించబడిన సృష్టిని చేయువాడు.

విశ్వమంతా ఒక శాసనం ఉంది. దాని ననుసరించి ఋతుచక్రం, విశ్వచక్రం పరిభ్రమిస్తున్నాయి. ప్రతి వస్తువులోనూ స్వాభావికమైన జ్ఞానమొకటి నిండి దాని ఉనికినీ, మనికినీ నిర్ణయిస్తుంది.

అదే దానిని శాసిస్తుంది. ఈ వ్యవస్థను - శాసనమును - ఏర్పరచిన విశ్వవ్యాపక (విష్ణు) శక్తి - శిష్టకృత్.

ప్రతి అణువూ విశ్వశాసనాన్ని అనుసరించేదే. గోవులు మొదలైన జంతువులు ఏమి తినాలో ఏమి తినకూడదో తెలుసుకుంటున్నాయి. తమని తాము పోషించుకోగలుగుతున్నాయి. వారిలో వ్యాపించిన విష్ణు చైతన్యమే వారి బుద్ధిని శాసిస్తోంది.

మృగాయా విదురోషధీష్తా అస్మా అవసే హువే ॥
యావతీ నామోషధీనాం గావః
ప్రాశ్నన్త్యధ్వా యావతీనామజావయః।
తావతీ స్తుభ్య మోషధీః శర్మయచ్ఛన్త్వా భృతాః॥ (అథర్వవేదం)

2. శాసనము ననుసరించువారు 'శిష్టులు'. వేద ధర్మాదులే విష్ణు శాసనాలు.

'తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే' - శాస్త్రమే ప్రమాణము.(గీతావాక్యం)

శాస్త్ర విధిని అతిక్రమించి ఇచ్చవచ్చినట్టు ప్రవర్తించే వారికి ఇహపరసిద్ధులుండవు.

యచ్ఛాస్త్ర విధిముత్సృజ్య వర్తతే కామకారతః।
న చ సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిమ్॥ (గీత)

'కృ' పాలనే - అనే అర్థాన్ననుసరించి - ధర్మాన్ని అనుసరించే శిష్టులను

పాలించువాడు. 'దుష్ట శిక్షకుడు – శిష్ట రక్షకుడు' అని ప్రసిద్ధి. ధర్మాన్ని తప్పినవారు దుష్టులు. వారిని శిక్షించి శిష్టులను కాపాడువాడు 'శిష్టకృత్'. ఒక కట్టెలమోపులో ఒక కట్టెకి నిప్పంటితే దానిని తొలగించి, మిగిలిన వాటిని (శిష్టమైన వాటిని) కాపాడినట్లు దుష్టులను సంహరించి, మిగిలిన జగత్తును కాపాడతాడనే భావాన్ని కూడా గ్రహించవచ్చు.

3. తాను కాక మిగిలినదేదీ లేని 'విశిష్టు'డైనా, తనకు భిన్నంగా మిగిలిన దానివలె కనిపించే ప్రపంచాన్ని (శిష్టమును) సృష్టించేవాడు 'శిష్టకృత్'.
4. మిగిలిన దానిని చేయువాడు.

   దేవతలు మహర్షులు విష్ణుదత్తమైన తమ శక్తులతో ఎంతగా లోకరక్షణాది బాధ్యతల్ని నిర్వహిస్తున్నా, ఒక్కొక్కసారి వారు కూడా చేయలేక మిగిల్చిన దానిని (శిష్టమును) తాను పూనుకొని పూర్తి చేయువాడు 'శిష్టకృత్'. ఎందరో దనుజులతో పోరి గెలిచిన దేవతలైనా, రావణాది దనుజుల్ని సంహరించలేక విష్ణుని శరణువేడితే, వారు చేయలేని అసాధ్యాన్ని తాను అవలీలగా చేసిన సర్వసమర్థుడు.
5. ఆశ్రయించిన వారిని ధార్మికులుగా, ఉత్తములుగా (శిష్టులుగా) మలచువాడు.

   అపిచేత్సు దురాచారో భజతే మామనన్యభాక్।
   సాధురేవ స మంతవ్యః సమ్యగ్ వ్యవసితోహి సః॥

   దురాచారుడైనా నారాయణుని ఆశ్రయించినవాడు సాధువే. **'దదామి బుద్ధియోగం'** – నిశ్చయాత్మక బుద్ధితో భజించిన కారణంగా ఆ బుద్ధికి యోగ్యమైన ప్రేరణనిస్తాడు.

   పరుస మొక్కటే కదా పైడిగా చేసేది
   అరయలోహ మెట్లున్నా అందుకేమి! (అన్నమయ్య)

   ఎలాంటి లోహాన్నైనా పరుసవేది బంగారంగా మార్చినట్లు, విష్ణుని వేడినవారిని ఆయన శిష్టులుగా మార్చి పరమపదాన్ని చేర్చుతాడు. మనను కొలిచిన వారిని పవిత్రులను చేసే పవిత్రుడు కనుక –'శుచిః'.

1. పరమపవిత్ర స్వరూపుడు. పవిత్రము చేయువాడు.
నిత్యశుద్ధమై, నిర్వికారమైన పరమాత్మ – సర్వ విశ్వకర్మలు చేస్తున్నా, రాగద్వేషాదులకు అంటని నిరంజనుడు, నిర్మలుడు. ఆయన నామం, చరిత్ర, రూపం, గుణ మహిమలు – అన్నీ శుచిమంతములే. వాటిని స్మరించిన, ధ్యానించిన, కీర్తించిన సాధకులు తత్క్షణం పవిత్రులౌతారు. పాపసంశోధనకు, ఆత్మబుద్ధికి, అజ్ఞాన నాశనానికి విష్ణు స్మరణయే దారి.

2. అగ్ని స్వరూపుడు.
శోధింపచేసే లక్షణం గల పవిత్రుడు అగ్ని. నారాయణుని విభూతి స్వరూపమే అగ్ని కనుక, యజ్ఞేశ్వరుని అగ్ని నామాలు అనేకం విష్ణు సహస్రనామాలతో బహు విధాల సమకూర్చి, గొప్ప యజ్ఞస్వరూపంగా ఈ స్తోత్రాన్ని మలచారు మహర్షులు.

శుచిష్ట్వమసి ప్రియో న మిత్రో... ॥ (ఋగ్వేదం)

శుచిః పావక ఈడ్యః – (అథర్వవేదం)

సూర్య, జలాదులు కూడా 'శుచి' శబ్ద వాచ్యులు.

'హిరణ్యవర్ణాః శుచయః యాః .... ఆపః శగ్గ్స్యోనా భవంతు'

'హంసః శుచిషద్' అనే శ్రుతి మన్త్రములు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

తన వ్యాపకశీలతతో ఈ శుచిలక్షణాలను జల, సూర్య, వాయ్వాదులలో నిక్షిప్తం చేశాడు. సూర్యుని కాంతి వలన చాలా మాలిన్యాలు తొలగుతాయి. జలంతో జరిగే అంతర్బహిశ్శుద్ధుల గురించి సర్వులకు సువిదితమే. వాటియందు శుచి స్వరూపుడై వ్యాపించిన విష్ణుడే శుచికారకుడౌతున్నాడు. శుద్ధీ ఆయనే – సిద్ధీ ఆయనే.

ఆ సర్వసమర్థుడైన శుచిస్వరూపుడు సాధించవలసినది ఏదీ లేదు. అన్నీ సిద్ధమై ఉన్నవి కనుకనే –

సిద్ధార్థః.. 252

1. ప్రయోజనములు సిద్ధించినవాడు.
   పొందగలిగినదంతా పొందినవాడు. తనకు బాహ్యంగా ఏదైనా ఉంటే దానిని పొందాలనే కోరిక, పొందడం అనే ఫలం ఉంటాయి. కానీ సర్వ వ్యాపకునకు బాహ్యమే లేదు.
   'విశ్వప్రకాశునకు వెలి ఏడ లోనేడ?' (అన్నమయ్య)
   అన్నీ తానైన వానికి పొందవలసినది లేదు.
   ఒక కోరిక, ప్రయోజనం ఉన్నాయంటే పొందవలసిన అర్థం తన దగ్గర 'లేదు' అని అర్థం. ఈ 'లేదు' అనే మాట లేని వాడు పరిపూర్ణుడు విష్ణువు. కొరత, కొదవలేని నిండైన తత్త్వం, 'ఆప్తకాముడు.'
2. తాను సాధించదలచుకున్న అర్థములన్నిటినీ సాధించి తీరువాడు.
   విశ్వ నిర్వహణాది కృత్యాలను, అవతార పరమార్థాలను అమోఘంగా సిద్ధింపచేసుకొనువాడు, **"సత్యకామః"** – అమోఘమైన కోరిక కలవాడు. కోరుకున్నప్పటికే సిద్ధించగలిగే శక్తి కలవాడు.
3. కోరికలు తీర్చుకున్నవాడు సిద్ధార్థుడు కాడు. అవి తీరవు కూడా. కోరికల్ని జయించినవాడు సిద్ధార్థుడు. వెలితిలేని పూర్ణ జ్ఞానం కలవాడు సిద్ధార్థుడు. ఆ స్థితిని కలిగించేదీ ఆయనే. "నాకు అన్నీ ఉన్నాయి" అనే తృప్తి ఉండడమే ముఖ్యం.
4. **అర్థే పదార్థే సిద్ధః – సత్యత్వేననిష్ఠః** (సత్యభాష్యమ్)
   పదార్థములయందు వాటి ఉనికిగా, లక్షణంగా ఉన్నవాడు. ప్రతి పదార్థంలోను దాని స్వాభావిక లక్షణంగా వ్యాపించి, దాని ఉత్పత్తి మొదలు పక్వం వరకు వ్యవస్థను దానిలోనే నిక్షిప్తం చేసినవాడు. విశ్వంలో అంతటా ఈ సిద్ధ లక్షణాన్ని వ్యాపింపచేశాడు. ఏది ఆయన ఉంచాడో అదే సిద్ధిస్తుంది. మామిడి విత్తనం మామిడి వృక్షాన్నే ఇస్తుంది. ఈ సిద్ధమైన స్థితి సర్వకాలాలలోనూ, ప్రాంతాలలోనూ, సర్వ వస్తువుల లోనూ నిబద్ధమై ఉంది.

సిద్ధించిన ప్రయోజనాలు కలవాడు కనుక, సంకల్పం మాత్రం చేతనే సర్వమును సాధించువాడై -

సిద్ధ సంకల్పః .. 253

1. సిద్ధించిన సంకల్పములు కలవాడు.
   జగత్సృజన, పాలనాదులు, అవతార లక్ష్యాలు - అన్నీ సంకల్పమాత్రం చేతనే సాధించువాడు. బాహ్యోపకరణాలు, ప్రయత్నాదులు లేకుండానే - సంకల్ప మాత్రంతో సిద్ధని సాధించగలడు.
   జీవకోట్లకు అన్నీ సాధ్యములు మాత్రమే. వాటిని సంకల్ప, ప్రయత్నాది సాధనలతోనే సిద్ధింపచేసుకోగలరు. అనంత శక్తిమంతుడైన విష్ణువు, తనకు భిన్నమైనది లేనివాడై సంకల్పంతోనే సిద్ధిని పొందినవాడు. సంకల్ప దశలోనే సిద్ధి కలిగినవాడు.
2. తాను క్రొత్తగా పొందవలసినదీ, పొందాలనుకొనేదీ ఏదీ లేని ఆప్తకాముడు, పూర్ణకాముడు, పరిపూర్ణ జ్ఞాన స్వరూపుడు, కామ సంకల్పాదుల కతీతుడై నిత్యసిద్ధస్థితిలో నున్న సచ్చిదానంద ఘన పరబ్రహ్మయే నారాయణుడు.
   ఆయననే ఛాందోగ్యోపనిషత్తు - **"సత్యకామః సత్యసంకల్పః"** అని వినుతించింది.
3. అనాయాసంగా నిత్యమైన పాప్తి 'సిద్ధస్థితి'. సంకల్పానికి - శక్తి అని కూడా అర్థం. ఇది సర్వదా సర్వధా (అన్నివేళల అన్ని విధముల) సమర్థుడు అనే భావాన్ని తెలియజేస్తుంది.
   అన్నీ సిద్ధించిన ఆ అమోఘమూర్తి సర్వజీవులకు ఫలప్రదాత కనుక -

సిద్ధిదుఃఖ .. 254

1. సిద్ధులను ఇచ్చువాడు.

   జీవుల కర్మలకు అనుగుణంగా తగిన ఫలాల నిచ్చువాడు. విత్తనం చెట్టవడం, కొమ్మ చిగురించటం, పువ్వు కాయవడం, కాయ పండవటం.. ఇలా ప్రతి ఉపాధిలో దానిదైన ఒక సిద్ధ లక్షణం ఉంది. తన కర్మానుగుణ ఉపాధిని పొంది, దాని ద్వారా అనేకములను సిద్ధింపచేసే వ్యవస్థను విశ్వమంతా వ్యాపింపచేసిన, ఆ సర్వవ్యాపక చైతన్య రూపుడే 'సిద్ధిదుడు.'

2. భక్తుల ఆరాధనలకు, సాధనలకు తగిన దివ్య ఫలాలను అందించువాడు. ఆయన లేకుండా యజ్ఞాలు, కర్మలు ఏవీ సిద్ధించవు. విష్ణు స్మరణలేని కార్యం విఫలమే.

   'హరి విరహితములు అవి కొన్నాళ్ళకు
   విరసంబులు మరి విఫలములు' (అన్నమయ్య)

   ఏ కర్మకైనా పూర్తినిచ్చి, సంపూర్ణము చేసే శక్తి విష్ణునిలోనే ఉంది.

   యస్మాదృతే న సిద్ధ్యతి యజ్ఞో విపశ్చితశ్చన।
   స ధీనాం యోగమిన్వతి। ।ఋగ్వేదం।
   య ఆత్మదా బలదా యస్య విశ్వ ఉపాసతే । (యజుర్వేదం)

3. యోగులకు అత్యంతిక సిద్ధియైన కైవల్యమునిచ్చువాడు. ఆ పూర్ణ జ్ఞానస్థితియే సిద్ధి.

   సిద్ధిని సాధించే శక్తి కూడా ఆ అనంత శక్తిమంతుని అనుగ్రహమే కనుక –

సిద్ధి సాధనః .. 255

1. సిద్ధికి సాధనమైనవాడు.

సిద్ధిని ప్రసాదించేవాడే కాక దానికి తగిన సాధనలు కూడా సమకూర్చువాడు. ఆ సాధనలలో సిద్ధిని పొందించే శక్తిగా వ్యాపించేవాడు.

కార్యసిద్ధికి తగిన శరీరపటుత్వం, ఇంద్రియశక్తులు, వాటిని పోషించే ఆహారాంతర్గత శక్తి, ఉపకరించే బహుసామగ్రి... అన్నీ విష్ణుశక్తి సంభరితాలే. జీవుల కర్మానుగుణ ఫలాలను ఈ బహువిధ సాధనల ద్వారా అందించువాడు, ఈ సాధనాలన్నీ సమకూర్చినవాడు.

జ్ఞానాదులను సిద్ధింపచేసే శాస్త్రములు, వాటిని గ్రహింపచేసే గురువు, గ్రహించగలిగే మేధస్సు, సాధన చేసే శరీరాదులు... ఇవన్నీ విష్ణు రూపములే. **'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం'** –

ధర్మసాధనకు లభించిన తొలి ఉపకరణం ఈ శరీరం. దీనిలో అంతర్యామిగా ఉన్నది విష్ణు చైతన్యమే.

కణ్వా ఇన్ధం య దక్రత స్తోమైర్యజ్ఞస్య సాధనమ్। (అథర్వవేదం)

2. మన ప్రాచీన శాస్త్రాలలో పరకాయ ప్రవేశసిద్ధి, ఖేచరత్వ సిద్ధి, దూరశ్రవణ, దూరగమన అనిమిషత్వ మొదలైన సిద్ధులు చెప్పబడ్డాయి. అణిమ, మహిమ, గరిమ మొదలైన అష్టసిద్ధులు ప్రసిద్ధం. ఇవి సిద్ధింపచేసే సిద్ధ స్వరూపుడు నారాయణుడే.

అయితే నారాయణ దర్శనానుభవానికి మించిన సిద్ధిలేదు. ఆ సిద్ధిలోనే అన్ని సిద్ధులూ దాగి ఉన్నాయని నిజమైన యోగి గ్రహిస్తాడు.

శ్రీపతి నీవు సిద్ధించుటయే సిద్ధులన్నియు
పై-పై నీ శరణమే పరమ పదమ్ము
పరమాత్మునిపై ఆత్మ ప్రవేశింపజేయుటే
పరికింప 'పరకాయ ప్రవేశము'

గరిమ నా హృదయాకాశమున దలచుటే
గిరివై అభినయట్టి 'ఖేచరత్వము'
మంచి పరమహంస నామము ప్రాణులచే వింట
చంచుల వినేటి 'దూరశ్రవణము'
కాంచి నీ రూపము ఆరు కమలాల ధ్యానించుట
ఎంచగ 'దూరగమనము' ఇంటిలో నౌట.
సావధానమే లోచూపు సర్వధా నిన్ను జూచుట
తావులనే 'అనిమిషత్వ'ము చేరుట.
శ్రీవేంకటేశ్వర! నీ సేవకుడై నిలుచుటే
వేవేలు 'తత్త్వ జ్ఞాన' విధుల నిలుచుట.

కొన్ని యోగ, మంత్ర సాధనలలో పరకాయ ప్రవేశం లాంటి సిద్ధుల్ని పొందవచ్చు. కానీ అవి పరమార్థానికి పనికిరానివి. పరమార్థమైన పరమపురుషుని పొందడమే సర్వ సిద్ధులకు సిద్ధి అని చాలా అందంగా 'అన్నమయ్య' పైకీర్తనలో బోధించాడు.

ఈ 'సిద్ధి' సంబంధ నామాలు నాలుగింటిలో చక్కని క్రమం ఉంది. ఏ సిద్ధికైనా కావలసినవి - 1. ప్రయోజనం (అర్థం), 2. సాధించాలనే సంకల్పం, 3. సిద్ధిని సమకూర్చే శక్తి, 4. దానిని సాధించగలిగే ఉపకరణం. ఈ నాలుగు స్వయం సిద్ధ స్వరూపుడైన విష్ణుని చైతన్యాలే. ఈ నామాల జపం, స్మరణ సర్వసిద్ధి ప్రదాలు.

సిద్ధిసాధకుడైన శ్రీహరియే ధర్మయజ్ఞాది రూపాలతో భాసిస్తున్నాడు -

ప్రథమ సంపుటము సమాప్తము

నామానుక్రమణిక

1.	విశ్వం	50	25.	సర్వః	87
2.	విష్ణుః	54	26.	శర్వః	88
3.	వషట్కారః	55	27.	శివః	88
4.	భూతభవ్యభవత్ప్రభుః	60	28.	స్థాణుః	94
5.	భూతకృత్	61	29.	భూతాదిః	95
6.	భూతభృత్	62	30.	నిధిరవ్యయః	96
7.	భావః	63	31.	సంభవః	98
8.	భూతాత్మా	64	32.	భావనః	100
9.	భూతభావనః	64	33.	భర్తా	101
10.	పూతాత్మా	65	34.	ప్రభవః	102
11.	పరమాత్మా, చ	66	35.	ప్రభుః,	103
12.	ముక్తానాం పరమాగతిః	67	36.	ఈశ్వరః	103
13.	అవ్యయః	69	37.	స్వయంభూః	104
14.	పురుషః	70	38.	శంభుః	105
15.	సాక్షీ	71	39.	ఆదిత్యః	106
16.	క్షేత్రజ్ఞః	72	40.	పుష్కరాక్షః	113
17.	అక్షర, ఏవ, చ	74	41.	మహాస్వనః	114
18.	యోగః,	75	42.	అనాదినిధనః	117
19.	యోగవిదాంనేతా	76	43.	ధాతా	118
20.	ప్రధాన పురుషేశ్వరః	78	44.	విధాతా	119
21.	నారసింహవపుః	79	45.	ధాతురుత్తమః	119
22.	శ్రీమాన్	83	46.	అప్రమేయః	121
23.	కేశవః	84	47.	హృషీకేశః	122
24.	పురుషోత్తమః	86	48.	పద్మనాభః,	124

49.	అమరప్రభుః	128	75.	విక్రమీ	162
50.	విశ్వకర్మా	131	76.	ధన్వీ	163
51.	మనుః	132	77.	మేధావీ	164
52.	త్వష్టా	133	78.	విక్రమః	164
53.	స్థవిష్ఠః	136	79.	క్రమః	165
54.	స్థవిరోధ్రువః	136	80.	అనుత్తమః	166
55.	అగ్రాహ్యః	138	81.	దురాధర్షః	167
56.	శాశ్వతః	139	82	కృతజ్ఞః	168
57.	కృష్ణః	139	83.	కృతిః	169
58.	లోహితాక్షః	142	84.	ఆత్మవాన్	171
59.	ప్రతర్దనః	143	85.	సురేశః,	171
60.	ప్రభూతః	143	86.	శరణం,	172
61.	త్రికకుబ్ధామ,	144	87.	శర్మ	173
62.	పవిత్రం,	146	88.	విశ్వరేతాః	173
63.	మంగళం పరమ్	147	89	ప్రజాభవః	174
64.	ఈశానః	148	90.	అహః	174
65.	ప్రాణదః	148	91.	సంవత్సరః	175
66.	ప్రాణః	150	92	వ్యాలః	177
67.	జ్యేష్ఠః	152	93.	ప్రత్యయః	178
68.	శ్రేష్ఠః	153	94	సర్వదర్శనః	178
69.	ప్రజాపతిః	154	95.	అజః	180
70.	హిరణ్యగర్భః	155	96ః	సర్వేశ్వరః	181
71.	భూగర్భః	157	97	సిద్ధః	182
72.	మాధవః	158	98.	సిద్ధిః	183
73.	మధుసూదనః	160	99.	సర్వాదిః	184
74.	ఈశ్వర ः	162	100	అచ్యుతః	185

101. వృషాకపిః	187	127. వేదః	214
102. అమేయాత్మా,	189	128. వేదవిత్	216
103. సర్వయోగవినిఃసృతః	189	129. అవ్యంగః	218
104. వసుః	191	130. వేదాంగః	219
105. వసుమనాః	192	131. వేదవిత్	220
106. సత్యః	193	132 కవిః	221
107. సమాత్మా	194	133. లోకాధ్యక్షః	224
108. సమ్మితః	195	134. సురాధ్యక్షః	225
109. సమః	196	135. ధర్మాధ్యక్షః	225
110. అమోఘుః	197	136. కృతాకృతః	226
111. పుణ్డరీకాక్షః	198	136. చతురాత్మా	228
112. వృషకర్మా	199	138. చతుర్వ్యూహః	231
113. వృషాకృతిః	199	139. చతుర్దంష్ట్రః	232
114. రుద్రః	201	140. చతుర్భుజ	234
115. బహుశిరాః	203	41. బ్రాజిష్ణుః	236
116. బభ్రుః	204	142. భోజనమ్	237
117 విశ్వయోనిః	204	143. భోక్తా	237
118. శుచిశ్రవాః	205	144. సహిష్ణుః	239
119. అమృతః	207	145. జగదాదిజః	240
120. శాశ్వతస్థాణుః	208	146. అనఘుః	241
121. వరారోహః	209	147. విజయుః	242
122. మహాతపాః	210	148. జేతా	243
123. సర్వగః	211	149. విశ్వయోనిః	243
124. సర్వ విద్భానుః	211	150. పునర్వసుః	244
125. విష్వక్సేనః	212	151. ఉపేంద్రః	246
126. జనార్దనః	214	152. వామనః	247

153. ప్రాంశుః	249	179. అమేయాత్మా	276
154. అమోఘుః	251	180. మహాద్రిధృక్	276
155. శుచిః	252	181. మహేష్వాసః	278
156. ఊర్జితః	253	182. మహీభర్తా	279
157. అతీన్ద్రుః	254	183. శ్రీనివాసః	280
158. సంగ్రహః	255	184. సతాంగతిః	280
159. సర్గో	256	185. అనిరుద్ధుః	281
160. ధృతాత్మా	257	186. సురానన్దుః	281
161. నియమో	257	187. గోవిన్దుః	282
162. యముః	258	188. గోవిదాంపతిః	285
163. వేద్యుః	259	189. మరీచిః	286
164. వైద్యుః	260	190. దమనుః	287
165. సదాయోగీ	261	191. హంసుః	288
166. వీరహా	262	192. సుపర్ణుః	290
167. మాధవుః	263	193. భుజగోత్తముః	292
168. మధుుః	263	194. హిరణ్యనాభుః	293
169. అతీన్ద్రియుః	264	195. సుతపాుః	294
170. మహామాయుః	265	196 పద్మనాభుః	295
171. మహోత్సాహుః	267	197 ప్రజాపతిుః	296
172 మహాబలుః	268	198. అమృత్యుుః	297
173. మహాబుద్ధిుః	270	199. సర్వదృక్	298
174. మహావీర్యుః	271	200. సింహుః	299
175. మహాశక్తిుః	272	201. సంధాతా	300
176. మహాద్యుతిుః	273	202. సంధిమాన్	300
177. అనిర్దేశ్యవపుుః	274	203. స్థిరుః	302
178. శ్రీమాన్	275	204. అజుుః	302

205. దుర్మర్షణః 303
206. శాస్తా 304
207. విశ్రుతాత్మా 304
208. సురారిహా 305
209. గురుః 306
210. గురుతమో 307
211. ధామ 309
212. సత్యః 310
213. సత్యపరాక్రమః 311
214. నిమిషః 312
215. అనిమిషః 313
216. స్రగ్వీ 314
217. వాచస్పతిరుదారధీః 316
218. అగ్రణీః 318
219. గ్రామణీః 319
220. శ్రీమాన్ 320
221. న్యాయః 321
222. నేతా 322
223. సమీరణః 323
224. సహస్రమూర్ధా 324
225. విశ్వాత్మా 325
226. సహస్రాక్షః 326
227. సహస్రపాత్ 327
228. ఆవర్తనః 327
229. నివృత్తాత్మా 329
230. సంవృతః 329
231. సంప్రమర్దనః 330
232. అహః సంవర్తకః 331
233. వహ్నిః 332
234. అనిలః 333
235. ధరణీధరః 334
236. సుప్రసాదః 335
237. ప్రసన్నాత్మా 336
238. విశ్వధృక్ 337
239. విశ్వభుక్ 338
240. విభుః 338
241. సత్కర్తా 339
242, సత్కృతః 340
243. సాధుః 341
244. జహ్నుః 342
245. నారాయణః 343
246. నరః 347
247. అసంఖ్యేయః 348
248. అప్రమేయాత్మా 350
249. విశిష్టః 350
250. శిష్టకృత్ 351
251. శుచిః 353
252. సిద్ధార్థః 354
253. సిద్ధ సంకల్పః 355
254. సిద్ధిదః 356
255. సిద్ధి సాధనః 357

హరిః ఓమ్ శివాయ గురవేనమః

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాన్తయే ॥
వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥
వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥
యస్య స్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్ ।
విముచ్యతే నమ స్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ॥
ఓమ్ నమో విష్ణవే ప్రభవిష్ణవ ఇతి.

✧ ✧ ✧

ఓమ్

శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమ్

వైశంపాయన ఉవాచ :

1. శ్రుత్వా ధర్మా నశేషేణ పావనాని చ సర్వశః ।
యుధిష్ఠిరః శాంతనవం పునరేవాఽభ్యభాషత ॥

యుధిష్ఠిర ఉవాచ :

2. కి మేకం దైవతం లోకే కిం వాఽప్యేకం పరాయణం ।
స్తువన్తః కం క మర్చన్తః ప్రాప్నుయుర్మానవా శ్శుభమ్ ॥
3. కోధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమో మతః ।
కిం జపన్ముచ్యతే జన్తుః జన్మ సంసారబంధనాత్ ॥

శ్రీభీష్మ ఉవాచ :

4. జగత్ప్రభుం దేవదేవమనన్తం పురుషోత్తమమ్ ।
స్తువ న్నామ సహస్రేణ పురుష స్సతతోత్థితః ॥

5. తమేవ చాఽర్చయ న్నిత్యం భక్త్యా పురుష మవ్యయమ్ ।
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ ॥

6. అనాదినిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం ।
లోకాధ్యక్షం స్తువ న్నిత్యం సర్వదుఃఖాఽతిగో భవేత్ ॥

7. బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనమ్ ।
లోకనాథం మహద్భూతం సర్వభూతభవోద్భవమ్ ॥

8. ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః ।
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవై రర్చే న్నర స్సదా ॥

9. పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః ।
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్ ॥

10. పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం ।
దైవతాం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా ॥

11. యతః సర్వాణి భూతాని భవం త్యాది యుగాగమే।
యస్మింశ్చ ప్రలయం యాన్తి పున రేవ యుగక్షయే ॥

12. తస్య లోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే ।
విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాఽపహమ్ ॥

13. యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః ।
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే ॥

14. ఋషి ర్నామ్నాం సహస్రస్య వేదవ్యాసో మహా మునిః।
ఛందోఽనుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీ సుతః॥

15. అమృతాంశూద్భవో బీజం శక్తి ర్దేవకినందనః।
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే.

16. విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరం।
అనేకరూపదైత్యాంతం నమామి పురుషోత్తమమ్.

అస్య శ్రీ విష్ణో ర్దివ్య సహస్ర నామ స్తోత్ర మహామంత్రస్య – శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః– అనుష్టుప్ ఛందః– శ్రీ మహా విష్ణుః శ్రీమన్నారాయణో దేవతా – అమృతాంశూద్భవో భానుః ఇతి బీజం – దేవకీనందనః స్రష్టా – ఇతి శక్తిః – ఉద్భవః క్షోభణో దేవః – ఇతి పరమో మంత్రః – శంఖభృన్నందకీ చక్రీ ఇతి కీలకం – శార్ఙ్గధన్వా గదాధరః ఇత్యస్త్రం – రథాంగపాణి రక్షోభ్యః ఇతి నేత్రం – త్రిసామా సామగః సామ – ఇతి కవచం – ఆనందః పరబ్రహ్మ – ఇతి యోనిః – ఋతుః సుదర్శనః కాలః ఇతి దిగ్బంధః – శ్రీ విశ్వరూపం ఇతి ధ్యానమ్, శ్రీ మహావిష్ణు ప్రీత్యర్థే సహస్ర నామజపే వినియోగః.

ధ్యానమ్

క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణివిలస – త్సైకతే మౌక్తికానాం।
మాలాక్లప్తాసనస్థః స్ఫటికమణినిభై – ర్మౌక్తికై ర్మండితాంగః
శుభ్రై రభ్రై రదభ్రై రుపరివిరచితై – ర్ముక్తపీయూష వర్షైః।
ఆనందీ నః పునీయా దరినలినగదా – శంఖపాణి ర్ముకుందః.

భూః పాదౌ యస్య నాభి ర్వియ దసు రనిల – శ్చంద్రసూర్యౌ చ నేత్రే।
కర్ణా వాశాః శిరోద్యౌ ర్ముఖ మపి దహనో – యస్య వాస్తేయ మబ్ధిః
అంతఃస్థం యస్య విశ్వం సురనరఖగగో – భోగిగంధర్వదైత్యైః।
చిత్రం రంరమ్యతే తం త్రిభువనవపుషం – విష్ణు మీశం నమామి.

ఓం నమో భగవతే వాసుదేవాయ.

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం।
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్.

మేఘశ్యామం పీత కౌశేయ వాసం।
శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం
విష్ణుం వందే సర్వలోకైకనాథమ్.

సశంఖచక్రం సకిరీటకుండలం।
సపీత వస్త్రం సరసీరుహేక్షణం
సహారవక్షఃస్థలశోభి కౌస్తుభం।
నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్

హరిః ఓమ్

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః ।
భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః ॥ 1

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః ।
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ ॥ 2

యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః॥ 3

సర్వః శర్వః శివః స్థాణుః భూతాదిర్నిధి రవ్యయః ।
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః ॥ 4

స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః ।
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః ॥ 5

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమర ప్రభుః ।
విశ్వకర్మా మను స్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ॥ 6

అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః ।
ప్రభూత స్త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరమ్ ॥ 7

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః ।
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః ॥ 8

ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః ।
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతి రాత్మవాన్ ॥ 9

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః ।
అహః సంవత్సరో వ్యాలః ప్రత్యయః సర్వదర్శనః ॥ 10

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాది రచ్యుతః ।
వృషాకపి రమేయాత్మా సర్వయోగవినిఃసృతః ॥ 11

వసు ర్వసుమనాః సత్యః సమాత్మా సమ్మిత స్సమః।
అమోఘుః పుణ్డరీకాక్షో వృషకర్మా వృషాకృతిః॥ 12

రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోనిః శుచిశ్రవాః।
అమృతః శాశ్వతస్థాణు ర్వరారోహో మహాతపాః॥ 13

సర్వగః సర్వవిద్భాను ర్విష్వక్సేనో జనార్దనః ।
వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవి త్కవిః ॥ 14

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాఽకృతః।
చతురాత్మా చతుర్వ్యూహ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః॥ 15

భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా సహిష్ణు ర్జగదాదిజః।
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః॥ 16

ఉపేన్ద్రో వామనః ప్రాంశు రమోఘుః శుచి రూర్జితః।
అతీన్ద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః॥ 17

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః।
అతీన్ద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః॥ 18

మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్తి ర్మహాద్యుతిః।
అనిర్దేశ్యవపుః శ్రీమా నమేయాత్మా మహాద్రిధృక్ ॥ 19

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః।
అనిరుద్ధః సురానన్దో గోవిన్దో గోవిదాంపతిః।। 20

మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః।
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః।। 21

అమృత్యు స్సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః।
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా ।। 22

గరు డ్గురుతమో ధామ సత్యః సత్యపరాక్రమః।
నిమిషోఽనిమిషః స్రగ్వీ వాచస్పతి రుదారధీః।। 23

అగ్రణీర్గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః ।
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ ।। 24

ఆవర్తనో నివృత్తాత్మా సంవృత స్సంప్రమర్దనః।
అహః సంవర్తకో వహ్ని రనిలో ధరణీధరః।। 25

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్ విశ్వభుక్ విభుః।
సత్కర్తా సత్కృతః సాధు ర్జహ్ను ర్నారాయణో నరః ।। 26

అసంఖ్యేయోఽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృ చ్ఛుచిః।
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః।। 27

వృషాహీ వృషభో విష్ణు ర్వృషపర్వా వృషోదరః।
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః।। 28

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేన్ద్రో వసుదో వసుః।
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః।। 29

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః।
బుద్ధః స్పష్టాఽక్షరో మన్త్ర శ్చన్ద్రాంశు ర్భాస్కరద్యుతిః।। 30

అమృతాంశూద్భవో భానుః శశబిన్దుః సురేశ్వరః।
ఔషధం జగతః సేతుః సత్యధర్మపరాక్రమః।। 31

భూతభవ్యభవన్నాథః పవనః పావనోఽనలః।
కామహా కామకృ త్కాన్తః కామః కామప్రదః ప్రభుః।। 32
యుగాదికృ ద్యుగావర్తో నైకమాయో మహోఽశనః।
అదృశ్యో వ్యక్తరూపశ్చ సహస్రజి దనంతజిత్।। 33
ఇష్టోఽవిశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః।
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహు ర్మహీధరః।। 34
అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవాఽనుజః ।
అపాంనిధి రధిష్థాన మప్రమత్తః ప్రతిష్ఠితః।। 35
స్కన్దః స్కన్దధరో ధుర్యో వరదో వాయువాహనః।
వాసుదేవో బృహద్భాను రాదిదేవః పురన్దరః।। 36
అశోక స్తారణ స్తారః శూరః శౌరి ర్జనేశ్వరః।
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః।। 37
పద్మనాభోఽరవిన్దాక్షః పద్మగర్భః శరీరభృత్।
మహర్ధి ర్ధృద్ధో వృద్ధాఽఽత్మా మహోక్షో గరుడధ్వజః।। 38
అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః।
సర్వలక్షణలక్షణ్యో లక్ష్మీవాన్ సమితిఞ్జయః।। 39
విక్షరో రోహితో మార్గో హేతు ర్దామోదర స్సహః।
మహీధరో మహాభాగో వేగవా నమితాఽశనః।। 40
ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః।
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః।। 41
వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః।
పరర్ధిః పరమస్పష్ట స్తుష్టః పుష్టః శుభేక్షణః।। 42
రామో విరామో విరతో(జో) మార్గో నేయో నయోఽనయః।
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః।। 43

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః।
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయు రధోక్షజః।। 44

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః।
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః।। 45

విస్తారః స్థావరః స్థాణుః ప్రమాణం బీజమవ్యయమ్।
అర్థోఽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః।। 46

అనిర్విణ్ణః స్థవిష్ఠోఽభూ ర్ధర్మయూపో మహామఖః।
నక్షత్రనేమి ర్నక్షత్రీ క్షమః క్షామః సమీహనః।। 47

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః।
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్।। 48

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్।
మనోహరో జితక్రోధో వీరబాహు ర్విదారణః।। 49

స్వాపనః స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్ ।
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః ।। 50

ధర్మగు బ్ధర్మకృ ద్ధర్మీ స దసత్ క్షర మక్షరమ్ ।
అవిజ్ఞాతా సహస్రాంశు ర్విధాతా కృతలక్షణః।। 51

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః ।
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః।। 52

ఉత్తరో గోపతి ర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ।
శరీరభూతభృ ద్భోక్తా కపీన్ద్రో భూరిదక్షిణః।। 53

సోమపోఽమృతపః సోమః పురుజి త్పురుసత్తమః।
వినయో జయః సత్యసంధో దాశార్హః సాత్వతాం పతిః।। 54

జీవో వినయితాసాక్షీ ముకుందోఽమితవిక్రమః।
అంభోనిధి రనంతాత్మా మహోదధిశయోఽంతకః।। 55

అజో మహార్హ: స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః ।
ఆనందో నందనో నందః సత్యధర్మా త్రివిక్రమః॥ 56

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః ।
త్రిపద స్త్రిదశాఽధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్ ॥ 57

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ ।
గుహ్యో గభీరో గహనో గుప్త శ్చక్రగదాధరః॥ 58

వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః।
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాఃః॥ 59

భగవాన్ భగహాఽఽనందీ వనమాలీ హలాయుధః।
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణు ర్గతిసత్తమః ॥ 60

సుధన్వా ఖండపరశు ర్దారుణో ద్రవిణప్రదః ।
దివఃస్పృక్ సర్వదృగ్వ్యాసో వాచస్పతి రయోనిజః॥ 61

త్రిసామా సామగ స్సామ నిర్వాణం భేషజం భిషక్।
సంన్యాసకృ చ్ఛమః శాంతో నిష్ఠా శాంతిః పరాయణమ్॥ 62

శుభాంగః శాంతిదః స్రష్ఠా కుముదః కువలేశయః ।
గోహితో గోపతి ర్గోప్తా వృషభాక్షో వృషప్రియః ॥ 63

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృ చ్ఛివః ।
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాంవరః ॥ 64

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః ।
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః॥ 65

స్వక్షః స్వంగః శతానందో నంది ర్జ్యోతిర్గణేశ్వరః ।
విజితాత్మా విధేయాత్మా సతీర్తి శ్ఛిన్నసంశయః ॥ 66

ఉదీర్ణః సర్వతశ్చక్షు రనీశః శాశ్వతస్థిరః।
భూశయో భూషణో భూతి ర్విశోకః శోకనాశనః॥ 67

అర్చిష్మా నర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః ।
అనిరుద్ధో ఽప్రతిరథః ప్రద్యుమ్నో ఽమితవిక్రమః॥ 68

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః ।
త్రిలోకా ఽ ఽత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః॥ 69

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః ।
అనిర్దేశ్యవపు ర్విష్ణు ర్వీరో ఽనంతో ధనంజయః॥ 70

బ్రహ్మణ్యో బ్రహ్మకృ ద్బ్రహ్మా బ్రహ్మ బ్రహ్మవివర్ధనః।
బ్రహ్మవి ద్బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః॥ 71

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః।
మహాక్రతు ర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః॥ 72

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః ।
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తి రనామయః॥ 73

మనోజవ స్తీర్థకరో వసురేతా వసుప్రదః ।
వసుప్రదో వాసుదేవో వసు ర్వసుమనా హవిః॥ 74

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః ।
శూరసేనో యదుశ్రేష్ఠః సన్నివాసః సుయామునః॥ 75

భూతా ఽ ఽవాసో వాసుదేవః సర్వా ఽ సునిలయో ఽనలః।
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరో ఽథాపరాజితః ॥ 76

విశ్వమూర్తి ర్మహామూర్తి ర్దీప్తమూర్తి రమూర్తిమాన్।
అనేకమూర్తి రవ్యక్తః శతమూర్తిః శతాననః ॥ 77

ఏకో నైకః సవః కః కిం యత్త త్పద మనుత్తమమ్।
లోకబంధు ర్లోకనాథో మాధవో భక్తవత్సలః ॥ 78

సువర్ణవర్ణో హేమాంగో వరాంగ శ్చందనాంగదీ ।
వీరహా విషమః శూన్యో ఘృతాశీ రచల శ్చలః ॥ 79

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృక్।
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః ।। 80

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాం వరః ।
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాఽగ్రజః।। 81

చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః ।
చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేదవి దేకపాత్।। 82

సమావర్తోఽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః ।
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా।। 83

శుభాంగో లోకసారంగః సుతంతు స్తంతువర్ధనః ।
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాఽఽగమః।। 84

ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః।
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ।। 85

సువర్ణబిందు రక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః ।
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః।। 86

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః।
అమృతాశోఽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః।। 87

సులభః సువ్రతః సిద్ధః శత్రుజి చ్ఛత్రుతాపనః।
న్యగ్రోధోదుంబరోఽశ్వత్థ శ్చాణూరాంధ్రనిషూదనః।। 88

సహస్రార్చిః సప్తజిహ్వాః సప్తైధాః సప్తవాహనః।
అమూర్తి రనఘోఽచింత్యో భయకృద్ భయనాశనః।। 89

అణు ర్బృహత్ కృశః స్థూలో గుణభృ న్నిర్గుణో మహాన్।
అధృతః స్వధృతః స్వాఽఽస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః।। 90

భారభృత్ కథితో యోగీ యోగీశః సర్వకామదః।
ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః।। 91

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః।
అపరాజితః సర్వసహో నియంతాఽనియమో యమః।। 92

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః ।
అభిప్రాయః ప్రియాఽర్హోఽర్హః ప్రియకృత్ ప్రీతివర్ధనః।। 93

విహాయసగతి ర్జ్యోతిః సురుచి ర్హుతభు గ్విభుః।
రవి ర్విరోచనః సూర్య స్సవితా రవిలోచనః।। 94

అనంతో హుతభుగ్ భోక్తా సుఖదో నైకజోఽగ్రజః।
అనిర్విణ్ణః సదాఽమర్షీ లోకాధిష్ఠాన మద్భుతః।। 95

సనాత్ సనాతనతమః కపిలః కపి రవ్యయః।
స్వస్తిదః స్వస్తికృ త్స్వస్తీ స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః।। 96

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః।
శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః।। 97

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః।
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః।। 98

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుఃస్వప్ననాశనః।
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః।। 99

అనంతరూపోఽనంత శ్రీ ర్జితమన్యు ర్భయాపహః।
చతురశ్రో గభీరాఽఽత్మా విదిశో వ్యాదిశో దిశః।। 100

అనాది ర్భూర్భువోలక్ష్మీః సువీరో రుచిరాంగదః।
జననో జనజన్మాది ర్భీమో భీమపరాక్రమః।। 101

ఆధారనిలయో ధాతా పుష్పహాసః ప్రజాగరః।
ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః।। 102

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృ త్ప్రాణజీవనః।
తత్త్వం తత్త్వవి దేకాత్మా జన్మమృత్యుజరాతిగః।। 103

భూర్భువః స్వస్తరు స్తారః సవితా ప్రపితామహః।
యజ్ఞో యజ్ఞపతి ర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః।। 104

యజ్ఞభృ ద్యజ్ఞకృ ద్యజ్ఞీ యజ్ఞభు గ్యజ్ఞసాధనః।
యజ్ఞాన్తకృ ద్యజ్ఞగుహ్యా మన్న మన్నాద ఏవ చ।। 105

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః।। 106

శంఖభృ న్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః।
రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః।। 107

సర్వప్రహరణాయుధ - ఓం నమ ఇతి

ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః।
నామ్నాం సహస్రం దివ్యానా మశేషేణ ప్రకీర్తితమ్।। 108

య ఇదం శృణుయా న్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్।
నాఽశుభం ప్రాప్నుయా త్కించి త్సోఽముత్రేహ చ మానవః।। 109

వేదాన్తగో బ్రాహ్మణః స్యాత్ క్షత్తియో విజయీ భవేత్।
వైశ్యో ధనసమృద్ధః స్యా చ్ఛూద్రః సుఖ మవాప్నుయాత్।। 110

ధర్మార్థీ ప్రాప్నుయా ద్ధర్మ మర్థార్థీ చార్థ మాప్నుయాత్।
కామా నవాప్నుయా త్కామీ ప్రజార్థీ చాప్నుయా త్ప్రజామ్।। 111

భక్తిమా న్యః సదోత్థాయ శుచి స్తద్గతమానసః।
సహస్రం వాసుదేవస్య నామ్నా మేత త్ప్రకీర్తయేత్।। 112

యశః ప్రాప్నోతి విపులం జ్ఞాతిప్రాధాన్య మేవ చ।
అచలాం శ్రియ మాప్నోతి శ్రేయః ప్రాప్నో త్యనుత్తమమ్।। 113

న భయం క్వచి దాప్నోతి వీర్యం తేజశ్చ విందతి।
భవ త్యరోగో ద్యుతిమాన్ బలరూపగుణాఽన్వితః।। 114

రోగార్తో ముచ్యతే రోగాద్ బద్ధో ముచ్యేత బంధనాత్।
భయా న్ముచ్యేత భీతస్తు ముచ్యేతా ఽఽపన్న ఆపదః॥ 115

దుర్గా ణ్యతితర త్యాశు పురుషః పురుషోత్తమమ్।
స్తువ న్నామసహస్రేణ నిత్యం భక్తి సమన్వితః॥ 116

వాసుదేవాఽఽశ్రయో మర్త్యో వాసుదేవపరాయణః।
సర్వపాపవిశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనమ్॥ 117

న వాసుదేవ భక్తానా మశుభం విద్యతే క్వచిత్।
జన్మమృత్యుజరావ్యాధిభయం నైవోపజాయతే॥ 118

ఇమం స్తవ మధీయానః శ్రద్ధాభక్తిసమన్వితః।
యుజ్యేతాఽఽత్మసుఖక్షాంతి శ్రీధృతిస్మృతికీర్తిభిః॥ 119

న క్రోధో న చ మాత్సర్యం న లోభో నాఽశుభా మతిః।
భవంతి కృతపుణ్యానాం భక్తానాం పురుషోత్తమే॥ 120

ద్యౌః సచంద్రార్కనక్షత్రా ఖం దిశో భూ ర్మహోదధిః।
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః॥ 121

ససురాఽసురగంధర్వం సయక్షోరగరాక్షసం।
జగ ద్వశే వర్తతేదం కృష్ణస్య సచరాచరమ్॥ 122

ఇంద్రియాణి మనో బుద్ధిః సత్త్వం తేజో బలం ధృతిః।
వాసుదేవాత్మకా న్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ॥ 123

సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పతే।
ఆచారప్రభవో ధర్మో ధర్మస్య ప్రభు రచ్యుత॥ 124

ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః।
జంగమాజంగమం చేదం జగ న్నారాయణోద్భవమ్॥ 125

యోగో జ్ఞానం తథా సాంఖ్యం విద్యాః శిల్పాదికర్మ చ।
వేదాః శాస్త్రాణి విజ్ఞానం మేత త్సర్వం జనార్దనాత్॥ 126

ఏకో విష్ణు ర్మహద్ భూతం పృథగ్భూతా న్యనేకశః।
త్రీన్ లోకా న్వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభు గవ్యయః॥ 127

ఇమం స్తవం భగవతో విష్ణో ర్వ్యాసేన కీర్తితమ్।
పఠే ద్య ఇచ్ఛే త్పురుషః శ్రేయః ప్రాప్తుం సుఖాని చ॥ 128

విశ్వేశ్వర మజం దేవం జగతః ప్రభు మవ్యయం।
భజన్తి యే పుష్కరాక్షం న తే యాంతి పరాభవమ్॥ 129

న తే యాంతి పరాభవం ఓం నమ ఇతి.

ఇతి శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం సంపూర్ణమ్.

అర్జున ఉవాచ:

పద్మపత్రవిశాలాక్ష! పద్మనాభ! సురోత్తమ!
భక్తానా మనురక్తానాం త్రాతా భవ జనార్దన!

భగవానువాచ:

యో మాం నామసహస్రేణ స్తోతు మిచ్ఛతి పాండవ!
సోఽహ మేకేన శ్లోకేన స్తుత ఏవ న సంశయః -

వ్యాస ఉవాచ:

వాసనా ద్వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం।
సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే -
శ్రీ వాసుదేవనమోస్తు త ఓం నమ ఇతి.

పార్వత్యువాచ:

కేనోపాయేన లఘునా విష్ణో ర్నామసహస్రకం।
పఠ్యతే పండితై ర్నిత్యం శ్రోతు మిచ్ఛా మ్యహం ప్రభో।

ఈశ్వర ఉవాచ:

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామత స్తుల్యం రామనామ వరాననే!
శ్రీ రామనామ వరానన ఓం నమ ఇతి.

బ్రహ్మో ఉవాచ:

నమోఽస్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్రపాదాక్షిశిరోరుబాహవే।
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే
సహస్రకోటి యుగధారిణే నమః-
సహస్రకోటియుగధారిణే నమ ఓం నమ ఇతి

సంజయ ఉవాచ:

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ.

శ్రీ భగవా నువాచ:

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే
ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణశబ్దమాత్రం
విముక్తదుఃఖాః సుఖినో భవంతి.

కాయేన వాచా మనసేంద్రియై ర్వా
బుద్ధ్యాఽఽత్మనా వా ప్రకృతేః స్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి.

ఓం తత్ సత్.



శ్రీవిష్ణువిద్య

(శ్రీ విష్ణు సహస్రనామ భాష్యము)

సామవేదం షణ్ముఖ శర్మ

"ఇది నామవిద్య.
ఈ నామాలు అక్షరాల గుంపులు కావు.
నారాయణుని శబ్దాకృతులు. మొత్తంగా ఈ సహస్రనామ స్తోత్రమే విష్ణుని శబ్దమయీమూర్తి. ఇవి వేదమందు ప్రతిపాదింపబడిన పరమాత్ముని శబ్దాలు. వీటి వ్యాఖ్యానం మన వైదిక విజ్ఞానాన్నీ, పరమేశ్వర జ్ఞానాన్నీ స్పష్టపరుస్తాయి. అందుకే ఇది 'విష్ణువిద్య'.
ప్రాచీన, అర్వాచీన భాష్యాల ననుసరించి, వైదిక శాస్త్రాల సంప్రదాయాధారంగా ఒక్కొక్క నామానికి ఉన్న ఔచితీమంతమైన క్రమబద్ధతనీ, నిర్దిష్టమైన వ్యాఖ్యానాన్నీ అందించే సమన్వయ భాష్యమిది.
ప్రతినామ వ్యాఖ్యానము పారాయణయోగ్యంగా,
భావనాయోగంగా సమకూర్చిన విష్ణుతేజో విలసిత గ్రంథమిది".

-సామవేదం

సమర్పణ : డా॥ వ్యాకరణం ఆంజనేయ శాస్త్రి

ఋషిపీఠం ప్రచురణలు